# TELUGU-I

# (DTEL1)

# (BA, BCOM, BSC, BBA)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

# ప్రవేశిక

'విద్య యొసగును వినయమ్ము, వినయమునను
బడయుపాత్రత, పాత్రతవలన ధనము,
ధనము వలనను దానమ్ము, దానివలన
ఐహికాముష్మిక సుఖంబు లందునరుడు.'

అనేది విద్యాప్రాముఖ్యం. 'విద్య లేనివాడు వింత పశువు' అన్నది ఆర్యోక్తి. కనుక విద్య మానవులకు అత్యంతావశ్యకమని స్పష్టమవుతుంది.

ఒకనాడు విద్యకొందరికే పరిమితం. అందరికీ అందని ఆకాశంలోని చందమామ. ఆధునిక యుగంలో 'అందరికీ విద్య' అనేది నినాదం. సంప్రదాయ విద్యావిధానంలో బాల్యంనుంచి విద్య నభ్యసించాలన్నది ఆచారం . మొక్కైవంగనది మానై వంగదన్నది ఆనాటి సామెత. కానీ ఈనాడు అందరికీ విద్య అనేమాట ప్రబలింది. ప్రజల ముంగిటికి విద్యవచ్చింది. అదే దూరవిద్యావిధానం. విద్యా విధానంలోనే విప్లవాత్మకమైన పరిణామం. దూరవిద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. అటు ప్రభుత్వం విద్యావిధానంలో తెచ్చిన మార్పు, ఇటు విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం విరాళాల ద్వారా చేయూత, ప్రోత్సాహం ప్రశంసనీయాలు. అందువల్లనే నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యాకేంద్రం స్థాపించింది. చిన్న వయసులో విద్యనభ్యసించే అవకాశంలేని యువతీ యువకులకు, ఉద్యోగం చేస్తున్న వారికి, ఇంటిపనుల్లో నిమగ్నమైన మహిళామణులకు - ఆసక్తి ఉన్న అందరికీ ఈ దూరవిద్య నేర్చుకోడానికి అమూల్యావకాశం లభించింది. దీన్ని సద్వినియోగం చేసుకోవలసిన అవసరముంది.

సంప్రదాయ రీతిలో విద్యార్థులకుద్దిష్టమైన బి.ఏ; బి.కాం. డిగ్రీ మొదటి సంవత్సరం పాఠ్యాంశాలే స్వీకరించడం జరిగింది. తెలుగు సాహిత్యం ప్రాచీనకాలం నుంచి ఈనాటి వరకు ఎంతో వైభవోపేతమై ఒప్పుతూంది; తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబంగా ఉంది. ప్రాచీన పద్యభాగంలో ఆదికవినన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధపరమేశ్వర ఎర్రన, దేశికవితావిధాత పాల్కురికి సోమన, కవిసార్వభౌమ శ్రీనాథుడు, అనే ప్రసిద్ధ కవులు ఆంధ్ర కవిత్వ మకరంధమందించారు. ఆధునిక పద్యభాగంలో గురజాడ, రాయప్రోలు, దువ్వూరి, విశ్వనాథ, జాషువా, విద్వాన్ విశ్వం - అనే ప్రముఖ కవిశ్రేష్ఠులు వివిధ కవితారీతులందించారు. మానవమనః ప్రవృత్తులను అద్దం పట్టే ఉపవాచకం డా॥ పి. శ్రీదేవి కాలాతీతవ్యక్తులు నవల విద్యార్థులకుపకరిస్తుంది. పాఠ్యభాగాల్లోని వ్యాకరణాంశాలు - ప్రత్యేకించి-సంధులు, సమాసాలు విద్యార్థుల భాషా జ్ఞానాన్ని పెంచుతాయి.

పై పాఠ్యాంశాల్ని 21 పాఠాలుగా విభజించి రచించడం జరిగింది. పదకొండు పాఠాలు ప్రాచీన పద్యభాగంకాగ, ఐదు పాఠాలు ఆధునికపద్య భాగంలో, నాలుగు ఉపవాచకంలో, ఒక పాఠం వ్యాకరణాంశాల్ని గూర్చి ఇవ్వబడ్డాయి. ఇవి దూరవిద్య ద్వార విద్య నేర్చే విద్యార్థులకెంతగానో ఉపకరిస్తాయి.

ఈ పాఠ్యాంశాలవల్ల తెలుగుసాహిత్య వైభవంతో పాటు నిత్యజీవన సూత్రాలు స్పష్టమవుతాయి. భార్యాభర్తల, తండ్రీకొడుకుల అనుబంధం శకుంతలోపాఖ్యానంలో, మాతృ హృదయమార్దవం బెజ్జమహాదేవి కథలో, అవమానిత మహిళ హృదయావేదన, ప్రతీకారేచ్ఛ - ద్రౌపదీ పరిదేవనంలో, భక్తితోపాటు, ఇతరులను తనతో సమానంగా చూసే మానవతాదృక్పథం చిఱుతొండనంబి కథలో గమనిస్తాము. అవి ప్రస్తుత మానవాళికి మార్గదర్శకాలు.

గురజాడ దేశభక్తి, రాయప్రోలు ప్రబోధంలో, దువ్వూరి కృషీవలుడులో, జాషువా గబ్బిలంలో అంత స్స్వాతంగా కనిపిస్తుంది. విద్వాన్ విశ్వం పెన్నేటిపాటలో, విశ్వనాథ కిన్నెరసడకల్లో ప్రజాజీవనంలో నదీప్రయోజనం స్పష్టమవుతుంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా కష్టించే రైతన్నకు, చెప్పులు గుట్టి జీవనం సాగించే అరుంధతీసుతునకు, పెన్నేటి నదీ ప్రాంతంలోని సీమరైతన్న దుస్థితీ విదితమవుతున్నాయి.

కాలాతీతవ్యక్తుల్లో ఆనాటి జనజీవనరీతి, వ్యక్తుల మనస్తత్వాలు, సామాజికార్థికాది పరిస్థితులు తెలుస్తాయి. వ్యాకరణం భాషాభివృద్ధికుపకరిస్తుంది.

ఈ పాఠ్యాంశాలు విద్యార్థులకుపకరించి విద్యతోపాటు, మానవత్వపు విలువల్ని - ఈ సంక్షుభిత సమాజంలో ప్రజలలో - పెంపొందింపజేస్తాయని ఆశిస్తున్నాను.

ఈ సందర్భంలో నన్ను సంపాదకునిగా నియమించిన నాగార్జున విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్. వేణుగోపాలరెడ్డి గారికి దూరవిద్యాకేంద్రం సంచాలక, అదనపు సంచాలకులకు నా కృతజ్ఞతలు. సహకరించిన రచయిత మిత్రులకు నా అభినందనలు !

**ఆచార్య ఎస్. గంగప్ప**
సంపాదకుడు

# విషయసూచిక

**ఖండం - 1**

**ప్రాచీన పద్యభాగము**

1. శకుంతలోపాఖ్యానము - నన్నయ (ఆంధ్రమహా భారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం : 65 - 109 పద్యాలు)
2. బెజ్జమహాదేవికథ - పాల్కురికి సోమన (బసవ పురాణం - తృతీయాశ్వాసం)
3. ద్రౌపదీ పరిదేవనము - తిక్కన (ఆంధ్ర మహాభారతం - ఉద్యోగపర్వం - తృతీయాశ్వాసం : 100 - 124 పద్యాలు)
4. శ్రీకృష్ణుని బాల్యక్రీడలు - ఎఱ్ఱన (హరివంశం - పూర్వభాగం - పంచమాశ్వాసం : 193 - 235 పద్యాలు)
5. చిఱుతొండనంబి కథ - శ్రీనాథుడు ( హరవిలాసం - ద్వితీయాశ్వాసం - 94 - 142 పద్యాలు)

**ఖండం - 2**

**ఆధునిక పద్యభాగం**

6. దేశభక్తి - గురజాడ అప్పారావు
7. ప్రబోధము - రాయప్రోలు సుబ్బారావు
8. కృషీవలుడు - దువ్వూరి రామిరెడ్డి (అన్నాహాలిక - అనే పద్యం నుంచి 20 పద్యాలు)
9. కిన్నెరనడకలు - విశ్వనాథ సత్యనారాయణ (కిన్నెరసాని పాటలు నుంచి)
10. గబ్బిలము - గుఱ్ఱం జాషువా (మొదటి భాగం - 1 - 20 పద్యాలు)
11. పెన్నేటి పాట - విద్వాన్ విశ్వం (మొదటి సర్గ)

**ఖండం - 3**

**ఉపవాచకం : నవల**

కాలాతీతవ్యక్తులు డా॥ పి. శ్రీదేవి

**ఖండం - 4**

వ్యాకరణం : సంధులు, సమాసాలు

ఖండం - 1

ప్రాచీన పద్యభాగము

# శకుంతలోపాఖ్యానము - నన్నయ

## పాఠం -1

1. 1. 0 పరిచయం
1. 1. 1 ఉద్దేశం
1. 1. 2 పాఠ్యభాగ సందర్భం
1. 1. 3 కఠినపదాలకు అర్థాలు
1. 1. 4 పాఠ్యభాగ వివరణ

### 1.1.0 పరిచయం :

శకుంతలోపాఖ్యానం అనే పాఠ్యభాగం ఆదికవి నన్నయభట్టు రచించిన ఆంధ్రమహాభారతంలోని ఆదిపర్వంలోని చతుర్థాశ్వాసం నుంచి గ్రహించబడింది.

నన్నయ భట్టారకుడు మన తెలుగు భాషలో ఆదికవి. ఆయన, క్రీ.శ. 1022 నుండి 1062 వరకు రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకొని, వేంగీ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాజరాజనరేంద్రుడి ఆస్థానంలో ఉండేవాడు. రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహంతో భారతాంధ్రీకరణం ప్రారంభించాడు. ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలో నాలుగవ ఆశ్వాసంలోని 142వ పద్యం "శారదరాత్రులు" వరకు ఆంధ్రీకరించాడు. అంతటితో ఆ మహాకవి గంటం ఆగిపోయింది.

నన్నయ రాజరాజ నరేంద్రుడి కుల బ్రాహ్మణుడు. అనురక్తుడు. అవిరళజపహోమ తత్పరుడు. విపుల శబ్దశాసనుడు. సంహితాభ్యాసుడు. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడు. పాత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. ముద్గల గోత్రజాతుడు. సజ్జనులు ప్రశంసించదగిన స్వచ్ఛమైన ప్రవర్తన కలవాడు. లోకజ్ఞుడు. ఉభయభాషాకావ్య రచనాభి శోభితుడు. ప్రతిభాశాలి, నిత్యసత్యవచనుడు,. బుద్ధిని బృహస్పతి, సుజనుడు. ఈ విషయాలన్నీ నన్నయ తన కావ్యావతారికలో చెప్పినవి. ప్రత్యక్షర సత్యాలు.

నన్నయ కవిత్వంలో మూడు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. (1) ప్రసన్న కథాకలి(వి)తార్థయుక్తి (2) అక్షరరమ్యత (3) నానారుచిరార్థ సూక్తి నిధిత్వం. నన్నయ మూల భారతంలోని అనావశ్యక విషయాలను, పునరుక్తులను పరిహరించి తద్వారా కలిగిన క్లిష్టతను తొలగించి తాను చెబుతున్న కథను ప్రసన్నం చేశాడు. తేటతెల్లం చేశాడు. రసమయం చేశాడు. ఆ కథల పరమార్థాన్ని భాసింపజేసాడు. ఈ విషయం కవిశ్రేష్ఠులు తమ బుద్ధిబలంతో లోతుగా ఆలోచిస్తే అర్థమయ్యే విషయం. ఇక సాధారణులు సైతం మెచ్చుకొనే విషయం అక్షరరమ్యత, అందంగా అక్షరాలను కూర్చడం. నన్నయ ప్రధానంగా వృత్త్యను ప్రాసాన్ని ఇందుకోసం స్వీకరించాడు. నన్నయ అనేక మనోహరార్థాలతో కూడిన సూక్తులకు నిధి. ఆయన కవిత్వమూ అంతే. ఎన్నో ధర్మాలను ధర్మసూక్ష్మాలను ఆయన మనోహరంగా చెప్పాడు. పురుషార్థాలను ఆవిష్కరించాడు. వ్యక్తీకరణ కౌశలాన్ని ప్రదర్శించాడు.

సంస్కృతంలో మహాభారతాన్ని మహేతిహాసంగా వ్యాసమహర్షి తీర్చిదిద్దాడు. నన్నయ దానికి కావ్య కమనీయతను సమకూర్చాడు. ఇతిహాసంలో ప్రధానకథతో పాటు ఉపాఖ్యానాలు ఉంటాయి; అధికంగా ఉంటాయి. శబ్దం కన్నా అర్థం అందునా ఉపదేశం ప్రధానంగా ఉంటుంది. అలంకార ప్రమేయం అంతగా ఉండదు. శృంగార హాస్యరసాలకు చెప్పుకోదగ్గ ప్రాముఖ్యం ఉండదు. శాంత వీర బీభత్స అద్భుత సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయి. మానవులతో పాటు దేవతలు, రాక్షసులు, పశుపక్ష్యాదులు పాత్రలుగా ఉండడం కన్పిస్తుంది. వర్ణనలకన్నా కథకే ప్రాధాన్యముంటుంది. నన్నయ వర్ణనలకు అలంకారాలకూ కొంత ప్రాధాన్యాన్ని ఇచ్చి, ఉపదేశాన్ని ఉక్తి వైభవంతో మేళవించి తన రచనలో కావ్యత్వాన్ని స్ఫురింపజేశాడు.

### 1.1.1 ఉద్దేశం :

నన్నయ రచనలోని అనేకమైన అందమైన ఘట్టాలలో మన పాఠ్యభాగమైన శకుంతలోపాఖ్యానం పేర్కొనదగింది. ఇందులో దాంపత్య ధర్మాలు ప్రధానంగా భార్య ఔన్నత్యం, పుత్ర ప్రాధాన్యం, సత్య ప్రశస్తి మొదలైన అంశాలు గమనార్హాలు.

### 1.1.2 పాఠ్యభాగ సందర్భం :

భారతంలోని మొదటి పర్వమైన ఆది పర్వంలో పాండవుల జననం, విద్యాభ్యాసం, వివాహం మొదలైన ప్రధానకథాంశాలు ఉన్నాయి. ఇంకా ఆ వంశానికి సంబంధించిన పూర్వరాజుల కథలు - యయాతి, దుష్యంతుడు మొదలైన వారి కథలు - ఉన్నాయి. ఇక ధృతరాష్ట్ర పాండురాజుల విషయాలు సరే సరి !

దుష్యంతోపాఖ్యానం పరమరమణీయ కథ. వ్యాసభారతంలోని ఈ కథను గ్రహించి కాళిదాస మహాకవి అభిజ్ఞాన శాకుంతల నాటకాన్ని రచించాడు. అది అనేక ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసుల ప్రశంసలకు పాత్రమైంది.

నన్నయ వ్యాసభారతాన్ని ఆంధ్రీకరిస్తూ అభిజ్ఞాన శాకుంతల నాటకాన్ని కూడా దృష్టిలో ఉంచుకున్నాడు.

అనంతరం 15వ శతాబ్దిలో ఉన్న పిల్లలమర్రి పినవీరభద్రుడు ఈ కథనే శృంగార శాకుంతలమనే కావ్యంగా రచించాడు.

ప్రస్తుతం నన్నయ భారతంలోని కథాక్రమాన్ని గమనిద్దాం. రథంతరి, నీలినుడు దుష్యంతుడి తల్లిదండ్రులు. ఆ దుష్యంతుడు అనంతసత్త్వుడు. ఒకసారి వేటకు వెళ్లి వేటాడి, అరణ్యంలో వెళ్లి వెళ్లి కణ్వాశ్రమాన్ని చూశాడు. కణ్వమహర్షిని దర్శిద్దామని ఒంటరిగా వెళ్లి శకుంతలను చూశాడు. ఆమె దుష్యంతుణ్ణి ఆసనార్ఘ్య పాదాది విధులతో పూజించింది. దుష్యంతుడు ఆమె సౌందర్యాన్ని చూచి సంచలిత హృదయుడయ్యాడు. ఆమె మేనకా విశ్వామిత్రుల సంతానమని తెలుసుకున్నాడు. గాంధర్వ వివాహ స్వరూపాన్ని వివరించి శకుంతలను అంగీకరింపజేశాడు. శకుంతల అతనివల్ల తనకు పుట్టే పుత్రుణ్ణి యువరాజుగా చేయమని వరం కోరింది. దుష్యంతుడు వరదానం చేశాడు. అభిమత సుఖాన్ని అనుభవించి ఆమెను వీడ్కొని వెళుతూ, "నిన్ను తోడ్కొని రావడానికి కణ్వుడి దగ్గరకు మంత్రుల్ని పంపిస్తా" నని చెప్పి వెళ్లిపోతాడు.

కణ్వుడు వచ్చి దివ్య జ్ఞానంతో వృత్తాంతమంతా తెలుసుకొని, సంతోషించి తగిన భర్తను పొందినందుకు శకుంతలను మెచ్చుకొన్నాడు. ఆమె గర్భంలో ఉన్నవాడు చక్రవర్తి ఔతాడని అన్నాడు. మూడు సంవత్సరాల తరువాత శకుంతలకు భరతుడు జన్మించాడు. అతడు అరణ్యంలోని సర్వ సత్త్వాలను (అన్ని జంతువుల్ని) తన మహాసత్త్వంతో (దేహబలంతో) దమిస్తూ (అణచివేస్తూ) ఉన్నాడు. అతన్ని చూచి అక్కడి మునులు ఆశ్చర్యపడి అతనికి 'సర్వదమను' డని పేరు పెట్టారు.

కణ్వ మహాముని ఆ బాలుడి తేజోరూపవిక్రమాలను చూచి సంతోషించి ఇతడు యౌవరాజ్యాభిషేకానికి అర్హుడయ్యే సమయం ఆసన్నమైందని ఆలోచించాడు. ఒకనాడు శకుంతలతో కుమారుణ్ణి తీసుకొని భర్త దగ్గరకు వెళ్లమని కొంతమంది శిష్యుల్ని తోడిచ్చి పంపించాడు. ఆమె కొలువుదీరి ఉన్న దుష్యంతుణ్ణి సందర్శించింది.

### 1.1. 3 కఠిన పదాలకు అర్థాలు :

**(70, 80, 91, 94, 103, 104 పద్యాల కఠినపదాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**వ. 65**

| | | |
|---|---|---|
| ఇట్లు | = | ఈ విధంగా, |
| వనంబులోని | = | అరణ్యంలోని |
| సర్వసత్త్వంబులన్ | = | అన్ని జంతువుల్ని |
| మహాసత్త్వంబునన్ + చేసి | = | మహాబలం చేత, |
| దమియించుచున్న | = | అణచి వేస్తున్న |
| నామంబున్ + చేసిరి | = | పేరు పెట్టారు |
| అఖిల భువన | = | సమస్త ప్రపంచానికి |

**ప. 66**

| | | |
|---|---|---|
| ఎట్టి సాధ్వులకును | = | ఎటువంటి పతివ్రతలకైనా |
| తద్ద | = | ఎక్కువ |
| ఉనికి | = | ఉండడం, |

| | | |
|---|---|---|
| ఏడు + కడ | = | గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత - ఈ ఏడు విధాల రక్షణ |
| పతులు + అ | = | భర్తలే |
| చూవె | = | చూడు, సుమీ ! |

ప. **67**

| | | |
|---|---|---|
| దౌష్యంతున్ + తోడ్కొని | = | దుష్యంతుని కుమారుడైన భరతుణ్ణి వెంట తీసుకువచ్చి |
| పరివృతుండు + ఐ + ఉన్న | = | చుట్టబడిన వాడై ఉన్న |

ప. **68**

| | | |
|---|---|---|
| గురు + ఆశ్రమంబునను | = | తన తండ్రి ఆశ్రమంలో |
| మున్ను | = | పూర్వం |
| అరుదుగ | = | అధికంగా |
| సంభ్రమము | = | తొందర |

ప. **69**

| | | |
|---|---|---|
| ఎడ | = | ప్రదేశం, స్థానం |
| దవ్వు | = | దూరం |
| ముగ్ధులు | = | మోహం కలవారు |

ప. **71**

| | | |
|---|---|---|
| చింతా + ఆక్రాంత + ఐ | = | దుఃఖంచేత ఆక్రమించబడినదై |
| వెండియున్ | = | తరువాత |
| ఆత్మగతంబునన్ | = | మనస్సులో |

ప. **72**

| | | |
|---|---|---|
| కఱటి | = | వంచకుడు |
| కమలగర్భుడు | = | కమలమునందు జన్మించినవాడు బ్రహ్మ |

ప. **74**

| | | |
|---|---|---|
| జననాథ | = | ఓ రాజా! |
| కొనకొని | = | ప్రయత్న పూర్వకంగా |
| ముదంబునన్ | = | సంతోషంతో |
| చిత్తములోనన్ | = | మనస్సులో |

ప. **75**

| | | |
|---|---|---|
| బాల + అర్కతేజుడు + అగు | = | బాలసూర్యుడితో సమానమైన వెలుగు కలవాడైన |
| పౌరవకుల రత్న + అలంకారున్ | = | పురుచక్రవర్తి వంశానికి రత్నాభరణమైన వానిని |
| ఉదారగుణ + ఆలయున్ | = | ఉత్తమ గుణాలకు స్థానమైనవాడు. |

ప. **77**

| | | |
|---|---|---|
| అంబురుహ + ఆనన | = | ఓ పద్మంలాంటి ముఖం గలదానా ? |
| మిన్నకయ | = | ఊరకనే |

**ప. 78**

| | | |
|---|---|---|
| వెలువెల్లన + ఐ | = | తెల్లబోయినదై |
| వెచ్చన్ + ఊర్చి | = | వేడినిట్టూర్పులు విడచి |
| కెంపు + తమ్మి రేకుల వలనన్ | = | ఎర్రతామర రేకుల నుంచి |
| తొరంగు | = | కారుతున్న |
| జలకణంబుల పోలెన్ | = | నీటి బిందువుల వలె |
| కోప + అరుణిత నయనంబుల | = | కోపంవల్ల ఎర్రబడ్డ కళ్లనుంచి |
| బాష్పకణంబులు | = | కన్నీటి బొట్లు |
| కటాక్షించుచున్ | = | కడకంట చూస్తూ |
| ఉపశమించుకొని | = | అణచుకొని |

**ప. 79**

| | | |
|---|---|---|
| ఎఱుక | = | జ్ఞానం |
| ఒరులు | = | ఇతరులు |
| ధార్మికులకున్ | = | ధర్మాత్ములకు |

**ప. 81**

| | | |
|---|---|---|
| ధారుణీవర | = | భూమికి భర్త అయిన ఓ రాజా! |
| అవజ్ఞ | = | తిరస్కారం, అనాదరం. |

**ప. 82**

| | | |
|---|---|---|
| ప్రజావతి | = | సంతానం కలది |
| వనితను | = | స్త్రీని, అందులోనూ అనురాగంగల స్త్రీని |
| అవజ్ఞ +అన్వితదృష్టన్ | = | అనాదరంతో కూడిన చూపుతో |

**ప. 83**

| | | |
|---|---|---|
| సంతత | = | శాశ్వతమైన |
| గృహమేధి ఫలంబు | = | గృహస్థుని ఫలితం |

( గృహస్థుడంటే - భార్యను పరిగ్రహించి ధర్మార్థకామాల్ని నడుపుతూ వేదపాఠం, వైశ్వదేవాది హోమం, అతిథిపూజ, పితృతర్పణం, భూతబలి అనే పంచయజ్ఞాలు చేస్తూ ఉండేవాడు )

| | | |
|---|---|---|
| దాంతుడు | = | ఇంద్రియ నిగ్రహం కలవాడు |

**ప. 85**

| | | |
|---|---|---|
| ఉపకరణంబు | = | సాధనం |
| ఆచార్యకము | = | గురుస్థానం |
| సంజనకము | = | పుట్టుక స్థానం |
| ఒండ్లు | = | ఇతరమైనవి |

| | | |
|---|---|---|
| తీఱములను | = | అక్కరలలోను, అవసరాలలోను, |
| వంతలు + ఎల్లన్ | = | బాధలన్నింటిని |
| ఇంతులన్ | = | స్త్రీలను (భార్యల్ని) |
| ఒనరన్ | = | చక్కగా |

వ. 86

| | | |
|---|---|---|
| అర్థంబు | = | సగం |
| పరేత + ఐనన్ | = | మరణించినదైతే |
| తత్ + ఆగమనంబు | = | అతని రాక |
| ప్రతీక్షించుచు + ఉండున్ | = | ఎదురుచూస్తూ ఉంటుంది. |
| పదంపడి | = | వెనుక |
| అరుగును | = | వెళుతుంది |
| ఉద్భవిల్లును | = | జన్మిస్తాడు |
| అంగాత్ + అంగాత్ సంభవసి | = | ప్రతి శరీరంనుంచి పుడుతున్నావు |

ప. 87

| | | |
|---|---|---|
| గార్హపత్యము + అను | = | గార్హ్య పత్యమనే పేరుగల |
| ఆ + అనలము =అయ్యనలము | = | ఆ అగ్ని |
| జనకుడు | = | తండ్రి |
| తత్ + ఆహవనీయంబు + అనన్ | = | ప్రసిద్ధమైన ఆహనీయమనే అగ్నిగా |
| నిజద్యుతితోడన్ | = | తన తేజస్సుతో |

ప. 88

| | | |
|---|---|---|
| లోకస్తుత | = | ప్రజలచే ప్రశంసింపబడే వాడా ! |
| తత్ + సూనున్ | = | అతని పుత్రుణ్ణి |
| జనకుండు | = | తండ్రి |

వ. 89

| | | |
|---|---|---|
| పుత్ + నామ్నః | = | పుత్ అనే పేరుగల |
| నరకాత్ | = | నరకం నుంచి |
| త్రాయత | = | రక్షిస్తాడు |
| ఇతి | = | అని |
| పుత్రః | = | పుత్రుడు |
| ఉభయ పక్షంబుల వారిని | = | తల్లివైపు, తండ్రివైపు ఇరుపక్షాల వారిని |

**ప. 90**

| | | |
|---|---|---|
| ఉద్భవిల్లి | = | పుట్టి |
| ఒండు + ఒక దీపము | = | ఇంకొక దీపం |
| ప్రభవించినట్లు | = | పుట్టినట్లు |
| తేజంబు + ఎసగన్ | = | కాంతి అతిశయించగా |

**ప. 92**

| | | |
|---|---|---|
| అనఘుడు | = | పాపంలేని వాడైన (పుణ్యాత్ముడైన) |
| వంశకరుడు | = | వంశాబివృద్ధి చేయువాడు |
| పెనుపునన్ | = | ఆధిక్యంతో |
| నీ సుతుడు | = | నీ కుమారుడు |
| వాజపేయంబులు | = | యజ్ఞములు |
| వినువీధిదెసన్ + వినిచె | = | ఆకాశమునుంచి వినిపించింది. |

**ప. 93**

| | | |
|---|---|---|
| భూరి | = | అధికం |
| కులవిస్తారకున్ | = | వంశాభివృద్ధి కారణమైనవానిని |
| దారకుని | = | బాలకుణ్ణి, నీ పుత్రుని |
| సారమతీ | = | న్యాయమైన బుద్ధికలవాడా ! శాస్త్రచింతనాదుల వల్ల కలిగే అర్థ నిర్ణయ జ్ఞానం కలవాడా! |

**ప. 95**

| | | |
|---|---|---|
| వెలయంగన్ | = | ప్రకాశింపగా, ప్రసిద్ధి కెక్కేటట్లు ప్రసన్నతను పొందేటట్లుగా |
| ఇరు + కడలన్ | = | రెండు వైపుల |
| తులన్ + ఇడి | = | త్రాసులో పెట్టి |

**ప. 96**

| | | |
|---|---|---|
| సర్వ తీర్థ + అభిగమనంబు | = | అన్ని తీర్థాల్ని పొందడం |
| సర్వవేద సమధిగమము | = | అన్ని వేదాల్ని పొందడం (చదవడం) |
| ధర్మజ్ఞులు + ఐన | = | ధర్మం తెలిసిన |

**ప. 97**

| | | |
|---|---|---|
| విమల ప్రతిభన్ | = | నిర్మలమైన బుద్ధితో |
| కణ్వ + ఆశ్రమ | = | కణ్వమహర్షి ఆశ్రమంలో |

| | | |
|---|---|---|
| సంభావిత | = | చక్కగా తలపబడిన (అనుకున్న) |
| సమయస్థితిన్ | = | శపథం ఉన్నట్లుగా / ప్రతిజ్ఞ ఉన్నట్లుగా |

ప. 98

| | | |
|---|---|---|
| ధాత్రీతలనాథ | = | భూ మండలానికి భర్త అయిన ఓ రాజా ! |
| అంత ధర్మ + ఇతరను + ఏ | = | అంత అధర్మపరురాలినా ? (కాను) |

వ. 99

| | | |
|---|---|---|
| శకుంతల పలుకులు | = | శకుంతల మాటలు |
| చేకొనన్ | = | గ్రహించడానికి, ఆదరించడానికి |
| ఒల్లక | = | కోరుకోక, ఇష్టపడక |

ప. 100

| | | |
|---|---|---|
| తొల్లి | = | పూర్వం |
| మానినులు | = | స్త్రీలు |
| అసత్యభాషణంబు | = | అబద్ధమాడడం |

ప. 101

| | | |
|---|---|---|
| పొడువు | = | ఉన్నతి |
| కడిది బలంబునన్ | = | అధికమైన శక్తియందును |
| అసదృశున్ | = | అసమానుడైన |
| ఎడమడుగుగన్ | = | వ్యత్యాసంగా, విరుద్ధంగా |
| నగగాన్ | = | నవ్వేటట్లుగా |

వ. 102

| | | |
|---|---|---|
| ఓడుదుము | = | భయపడతాం / సంకోచిస్తాం |
| అయుక్తంబులు | = | యోగ్యంకానివి |

వ. 104

| | | |
|---|---|---|
| తద్దయు | = | మిక్కిలి |
| క్రమ్మఱి | = | మరలి |
| అవసరమున | = | సమయంలో |
| విగత + ఆశమై | = | పోయిన ఆశగలదై (ఆశ వదలు కొన్నదై) |

వ. 106

| | | |
|---|---|---|
| ఎల్ల వారలకున్ | = | అందరికి |
| అతి హర్షంబుగాన్ | = | చాలా సంతోషం కలిగేటట్లు |
| భరత + ఉత్తియున్ | = | భరతుని పుట్టుకను |
| వేలుపుల పలుకులు | = | దేవతల మాటలు |
| అతివ్యక్తంబులు + అయి | = | మిక్కిలి స్పష్టమై |

| | | |
|---|---|---|
| వీచు + తెంచినన్ = వీతెంచినన్ | = | వినపడగా |

**ప. 107**

| | | |
|---|---|---|
| ఆర్థిన్ | = | కోరికతో |
| గాంధర్వ విధి వివాహము | = | కన్యావరులు ఒకరిమీద ఒకరికుండే కోరికతో చేసుకునే వివాహం |
| కరము | = | అత్యంతమైన |
| నెమ్మిన్ | = | ప్రేమతో |
| పాణిగ్రహణము | = | వివాహం |

**ప. 108**

| | | |
|---|---|---|
| లోక + అపవాద భీతిన్ | = | లోకనింద వలన భయం చేత |
| ఈ + తన్విన్ = ఇత్తన్విన్ | = | ఈ స్త్రీ శకుంతలను |
| అచ్చెరువు కాగన్ | = | ఆశ్చర్యం కలుగునట్లుగా |

**ప. 109**

| | | |
|---|---|---|
| ఈ + తన్విన్ | = | ఈ స్త్రీని - కృశించిన శరీరం కలది |
| అచ్చెరువు గాగ | = | ఆశ్చర్యం కలిగేటట్లుగా |
| పులకలు | = | గగుర్పాటు |
| ఎసగన్ | = | ఎక్కువకాగా |
| ఆలింగనంబు + చేసి | = | కౌగిలించుకొని |
| భరతున్ + పూన్చి | = | భరతుణ్ణి పూనజేసి (మోయునట్లు చేసి) |

### 1.1. 4 పాఠ్యభాగ వివరణ :

అరణ్యంలో ఉన్న అన్ని జంతువుల్ని తన మహాబలంతో అణచివేస్తున్న భరతుణ్ణి చూచి అక్కడి ఋషులు అతనికి సర్వదమనుడని పేరు పెట్టారు. కణ్వమహాముని కూడా భరతుడి మహావర్చస్సుకు, రూపరేఖలకు, పరాక్రమానికి సంతోషించాడు. యౌవరాజ్యాభిషేకానికి అర్హుడయ్యే సమయం సమీపించిందని భావించాడు.

కణ్వమహర్షి ఒకనాడు తన కూతురు శకుంతలతో ఇలా అన్నాడు : "ఎంత పతివ్రతలకైనా పుట్టినిళ్లల్లో ఎక్కువకాలం ఉండడం అంత మంచిది కాదు. భర్తల దగ్గర ఉండడమే స్త్రీలకు ధర్మం. భార్యలకు సంరక్షకులు భర్తలేసుమా! కనుక నీవు ఈ కుమారుణ్ణి తీసుకొని నీ భర్త దగ్గరకు వెళ్లు" అని చెప్పి మహా తపోధనులైన కొంతమంది శిష్యుల్ని తోడు పంపాడు. శకుంతల భరతుణ్ణి తీసుకొని దుష్యంతుడి దగ్గరకు వచ్చింది. అప్పుడు దుష్యంతుడు సామంతమంత్రి పురోహిత ప్రధాన పౌరజన పరివృతుడై ఉన్నాడు.

శకుంతల దుష్యంతుణ్ణి చూచింది. ఇంతకు ముందు తన తండ్రి ఆశ్రమంలో భర్తవల్ల తాను పొందిన అనురాగం, ఆదరం, సంభ్రమం, ఇప్పుడు కనిపించలేదు. ఇలా ఆలోచించింది. "ఇతడు నన్ను ఎరుగడా ? తెలిసికూడా తెలియనట్లు ఉన్నాడా ? చాలాకాలం, చాలాదూరం కావడం వల్ల మరచిపోయాడా? రాజులు మోహపరవశులు కనుక మరిచిపోకుండా ఉంటారా? అదికాక ప్రభువులు ఎన్నో పనుల్లో మునిగిపోయి ఉంటారు కదా? పూర్వం ఇచ్చిన మాటను మనస్సునుంచి తొలిగించుకొన్నాడేమో ! చూపులు సరసంగా లేవు సరే! విరసంగా, క్రూరంగా తయారయ్యాయి. కారణం ఏమిటో ! కలుపుగోలుతనంతో పలకరించారని, ఉపకారం చేశారని బుద్ధిమంతులైన వారు రాజుల్ని నమ్మి ఉండకూడదు. రాజులు కొత్తవారి పట్ల మోజుతో ఇంతకుముందు ఉన్న ప్రేమపాత్రుల్ని వదలివేస్తారు".

ఇలా ఆలోచించి చింతాక్రాంత అయింది శకుంతల. మళ్లీ మనస్సులో ఇలా అనుకొన్నది. "ఎవరైనా నిజంగా మరచిపోతే గుర్తు చేయవచ్చు. అసలు తెలియకపోతే అన్ని విధాలా తెలిసేటట్లు చేయవచ్చు. కాని తెలిసి ఉండి, ఇతరుల చెప్పేది వినడానికి ఇష్టపడని వంచకుడికి తెలియజెప్పడం ఆ బ్రహ్మకు కూడా తరం కాదు. అయినా ఇక్కడి దాకా వచ్చి ఊరక తిరిగి పోగూడదు. కాబట్టి నా పూర్వ వృత్తాంతం మొత్తాన్ని చెప్పి ఈ కుమారుణ్ణి చూపుతాను'' అని శకుంతల తన మనస్సులో అట్లా నిశ్చయించుకొని దుష్యంతుడితో ఇలా అన్నది. "ఓ రాజా ! నీవు వేట నెపంతో ఉద్దేశపూర్వకంగా కణ్వాశ్రమానికి వచ్చి సంతోషంతో నాకు ఇచ్చిన వరాన్ని గుర్తుతెచ్చుకో ! బాలసూర్యుడితో సమానమైన తేజస్సు కలిగిన ఈ బాలుడు నీ కుమారుడు. పౌరవవంశరత్నా భరణుడూ, సద్గుణ నిలయుడూ అయిన వీడికి పట్టాభిషేకం జరిపించి యువరాజుగా చెయ్యి''.

దుష్యంతుడు అంతా తెలిసికూడా తెలియని వాడిలాగా ఇట్లా అన్నాడు: "నేను నిన్ను ఎరుగను! నీవు ఎక్కడి దానివి? ఊరకే అనగూడని మాటలు అంటావెందుకు ? ఎక్కడి నుంచి వచ్చావో అక్కడికి వేగంగా వెళ్లు !''

శకుంతల దుష్యంతుడి మాటల్ని విని తెల్లబోయింది. వేడినిట్టూర్పులు వదలింది. నిశ్చేష్టురాలైంది. ఎర్రతామర రేకుల నుంచి జారుతున్న నీటిబొట్లులాగా కోపంతో ఎరుపెక్కిన ఆమె కళ్లనుంచి బాష్పబిందువులు స్రవిస్తూ ఉన్నాయి. ఆమె తలవంచి ఆ రాజును కడకంట చూస్తూ, హృదయ సంతాపాన్ని తనకు తానే అణచుకొన్నది. చాలాసేపు విచారించింది.

శకుంతల రాజుతో ఇలా అన్నది : "జ్ఞానంలేని ఇతరుల్లాగా నీవు ఎరుగనంటున్నావు. అన్నీ తెలిసి కూడా ఇలా ఎందుకు మాటాడుతున్నావు? నేను తప్ప ఇక్కడ ఉన్నవారు ఎవ్వరూ దీని నెరుగరని ధార్మికులైనవారు అబద్ధమాడవచ్చా? వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, సంధ్యలు, అంతరాత్మ, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి అనే మహాపదార్థాలు ఉండగా మానవుడు తన్నుతాను మోసగించుకోవడానికి పూనుకుంటాడా ? పూనుకోడు. ఓ రాజా! నీవు ఇచ్చిన వరం నాకు తెలిసినట్లే వీటి అన్నిటికీ తెలుసు. కనుక నా మీద పూర్వంలాగే దయచూపించు. తిరస్కరించడం తగినపని కాదు. పతివ్రత, గుణశాలిని, సంతానవతి, అనువ్రత అయిన అనురాగవతి అయిన భార్యను తిరస్కార దృష్టితో చూచే దుర్బుద్ధికి భూలోక సుఖంలేదు, స్వర్గలోక సుఖంలేదు. అనుగుణమైన భార్య కలవాడు శాశ్వతమైన గృహస్థ ఫలితాన్ని పొందుతాడు. యజ్ఞయాగాది కర్మలు చేసేవాడు, తపఃక్లేశాన్ని సహించేవాడు, పుత్రవంతుడూ అవుతాడు.

ఇంకా ధర్మార్థ కామసాధనకు సాధనం, గృహనీతి విద్యకు గృహం, స్వచ్ఛమైన నడవడిని బోధించడానికి గురుస్థానం, వంశవృద్ధికి మూలం, మంచి మార్గంలో నడవడానికి ఊత, గౌరవానికి ప్రధానకారణం, సద్గుణమణులకు గని, హృదయ సంతోషాన్ని కలిగించేది భార్యయే సుమా! కనుక భర్తకు తక్కినవి ప్రియం కావు. అరణ్య వాసాది క్లిష్టఘట్టాలలోను, ఆపదలలోను, అవసరాల్లోను చుట్టుముట్టిన శోకాలన్నీ గూడా, భార్యల్ని సంతానాన్ని చక్కగా చూచుకునే ప్రజలకు సులభంగా తొలగిపోతాయి.

భార్య పురుషుడిలో అర్ధభాగం. భర్తకన్నా ముందే మరణించిన పతివ్రత పరలోకంలో తన భర్తకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఒకవేళ తనభర్త ముందే మరణిస్తే వెంటనే తానుకూడా మరణించి తన భర్తను కలిసి పరలోకానికి పోతుంది. అటువంటి భార్యను అవమానించడం అధర్మం. ఇంకా భర్త భార్యలో ప్రవేశించి గర్భంలో పుత్రుడై తానే జన్మిస్తాడు. కనుక "అంగా దంగాత్ సంభవసి'' (ప్రతి శరీరంలోనుంచి జన్మిస్తున్నావు) మొదలైన వేదవాక్కుల్లోనూ తండ్రీ కొడుకూ అనే తేడాలేదు. గార్హపత్యం అనే అగ్ని వేరే ప్రదేశంలో అహవనీయమనే పేరుతో ప్రకాశించేటట్లు తండ్రి తానే కుమారుడిగా తన తేజస్సుతో వెలుగుతుంటాడు. తానే తన ప్రతిబింబాన్ని నీళ్లలో స్పష్టంగా చూచేటట్లు తండ్రి తన కొడుకును తాను చూచి అధిక ప్రీతితో మహానందాన్ని పొందుతాడు. 'పున్నామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్ర' (పుత్ అనే పేరుగల నరకంనుంచి రక్షిస్తాడు కనుక పుత్రుడు) అనే వేదవాక్యం ఉంది. కాబట్టి పుణ్యాచారుడైన పుత్రుడు తల్లివంక వారిని తండ్రివంక వారిని ఉద్ధరిస్తాడు. వారికి ఉత్తమ గతులు కలిగిస్తాడు.

కాబట్టి దీపం నుంచి మరో దీపం పుట్టినట్లు నీ పుణ్యశరీరం నుంచి ఈ కుమారుడు పుట్టి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఓ మహారాజా! విరుద్ధమైన ప్రత్యుత్తరాలు ఎందుకు? ఈ కుమారుడి శరీరాన్ని కౌగిలించుకోవడం వల్ల కలిగే సుఖాన్ని పొందు. ముత్యాలహారాలు, కర్పూర ధూళి, మంచి గంధం, వెన్నెల కుమార శరీరాలింగనం లాగా జీవులకు హాయిని కలిగిస్తాయా? అధికమైన చల్లదనాన్ని కలిగిస్తాయా?

కలిగించవు. నీ కుమారుడు పుణ్యాత్ముడూ వంశోద్ధారకుడై ఆధిక్యంతో వంద వాజపేయయాగాలు చేస్తాడని మునులందరూ వింటూ ఉండగా ఆకాశవాణి నన్నుద్దేశించి అన్నది. కనుక ధర్మాన్ని ప్రేమించే మహారాజా ! న్యాయమైన బుద్ధికలవాడా ? శాస్త్రచింతనాదుల వల్ల కలిగే అర్ధ నిర్ణయ జ్ఞానం కలిగినవాడా! ఆనాటి సత్యం ఎటూ ఉన్నది. నీవు నిష్కారణంగా ఇటువంటి సమస్త సద్గుణ సంపన్నుణ్ణి, వంశోద్ధారకుణ్ణి కాదనడం న్యాయమా?

ప్రశస్తమైన నీటితో నిండిన నూరు నూతులకన్నా ఒక బావి శ్రేష్ఠమైనది. నూరుబావుల కన్నా ఒక మంచి యజ్ఞం శ్రేష్ఠమైనది. నూరు యజ్ఞాలకన్నా ఒక కుమారుడు శ్రేష్ఠం. నూరుగురు కొడుకులకన్నా బాగా ఆలోచిస్తే ఒక సత్యవాక్యం శ్రేష్ఠం. వెయ్యి అశ్వమేధాల్ని, ఒక సత్యాన్ని త్రాసులో రెండు ప్రక్కలా పెట్టి తూకం వేస్తే అధికమైన భారం కారణంగా సత్యం వైపే ముల్లు మొగ్గుతుంది. అన్ని తీర్థాలను పొందడం (యాత్ర చేసి చూడడం), అన్ని వేదాలను పొందడం (చదవడం), సత్యంతో సమానం కావు. ధర్మవేత్తలైన మునులు అన్ని ధర్మాలలో సత్యమే గొప్పదని అంటారు. గమనించు !

కాబట్టి నీవ్వు స్వచ్ఛమైన ప్రతిభతో సత్యమే గొప్పదని భావించి, కణ్వాశ్రమంలో అనుకున్న మాటప్రకారం దయ ఉంచి కొడుకును దయార్ద్రదృష్టితో చూడు. క్షత్రియ శ్రేష్ఠమైన విశ్వామిత్రుడికి, పవిత్రురాలైన మేనకకు కూతురునై అబద్ధం ఆడడానికి నేను అంత అధర్మపరురాలినా?''

ఇలా అన్న శకుంతల మాటల్ని ఆదరించడానికి అంగీకరించలేదు దుష్యంతుడు. ఇలా అన్నాడు. "నేనెక్కడ? నువ్వెక్కడ? కొడుకెక్కడ! నేను ఇంతకు పూర్వం ఎప్పుడూ నిన్ను చూచి ఎరుగను. 'ఆడవాళ్లు అబద్ధాలాడే వాళ్లు' అనేటట్లు అసత్యమాడడం తగిన పనేనా? ఇంకా ఇలా అన్నాడు. "ఎత్తులో వయస్సులో చాలా అధికమైన బలంతో సాటిలేని వీణ్ణి నీ కొడుకని చూపించడానికి తీసుకు వచ్చావా? అందరూ నవ్వుతున్నారు ! ఇటువంటి లోకవిరుద్ధాలకు మేము సంకోచిస్తున్నాం. అయుక్తమైన మాటలుమాని నీ ఆశ్రమానికిపో!''

అట్లా దుష్యంతుడనగానే శకుంతల మనస్సు మలమల మాడిపోయింది. "పుట్టిన వెంటనే తల్లిదండ్రులు విడిచిపెట్టారు. ఇప్పుడు భర్త కూడా విడిచి వేస్తాడేమో ! వేయి మాటలెందుకు ? పూర్వజన్మలో ఎంతో తక్కువ నోములు నోచి ఉంటాను. లేకపోతే ఇదేమిటి ? అంటూ బాధ పడింది ఆశలు వదలుకున్నది''. కన్నీరు ఒత్తుకొంటూ ఇక "దేవుడే దిక్కు'' "అన్యధా శరణం నాస్తి'' అని ఆ మహాపతివ్రత తన కుమారుణ్ణి తీసుకొని పోబోయే సమయంలో ఒక అద్భుతం జరిగింది.

ఆకాశవాణి ప్రయత్న పూర్వకంగా, ఆ సభలోని వారంతా ఆశ్చర్యచకితులౌతూ ఉండగా రాజుతో ఇలా అన్నది. "వీడు శకుంతలకూ నీకూ ప్రియపుత్రుడు. నీ బిడ్డను నీవు దగ్గరకు తీసుకొని పోషించు! శకుంతల పతివ్రతలందరూ బాగా ప్రశంసించే మహాపతివ్రత'' అని వివేకంతో సత్యాన్ని పలికింది. అప్పుడు ఆకాశం నుంచి దేవతల మాటలు అతిస్పష్టంగా వినిపించాయి. అవి శకుంతల పతివ్రతాత్వ ప్రశంసలు. సత్యప్రశంసలు. భరతోత్పత్తి ప్రశంసలు. ఆ మాటలు అందరికీ సంతోషాన్ని కలిగించాయి.

అప్పుడు దుష్యంతుడు సభలోని వారందరూ వినేటట్లు ఇలా అన్నాడు "నేను కణ్వమహాముని ఆశ్రమంలో గాంధర్వ వివాహ పద్ధతిలో శకుంతలను పెండ్లాడిన విషయం మా ఇద్దరికే తప్ప ఇతరులకు తెలియదు. ఇతరులకు తెలియదుగదా ! అని లోకాపవాద భీతితో నేను ప్రీతిని విడిచి ఈమెను ఎరిగికూడా ఎరుగనన్నాను. ఆకాశవాణి ఆశ్చర్యకరంగా ఇప్పుడు ఇక్కడ ఉన్న వారందరికీ తెలిసేటట్లు చెప్పింది.''

దుష్యంతుడు ఎంతో అనురాగంతో కొడుకును ఎత్తుకొని సంతోషం వలన గగుర్పాటు ఎక్కువ కాగా కొడుకును కౌగలించుకున్నాడు. శకుంతలా మహాదేవిని ఎంతో ప్రేమతో గౌరవించాడు. భరతుణ్ణి యౌవరాజ్యానికి అభిషిక్తుణ్ణి చేశాడు. దుష్యంతుడు చాలాకాలం రాజ్యసుఖాలు అనుభవించాడు. ఆ తరువాత తన రాజ్యభారాన్ని భరతుడి మీద మోపి తపోవనానికి వెళ్లాడు.

**డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి** ఎం. ఏ., పి హెచ్.డి.
ప్రిన్సిపాల్ & రీడర్
ఎస్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల

ఖండం - 1 ప్రాచీన పద్యభాగము

# శకుంతలోపాఖ్యానము - నన్నయ

## పాఠం - 2

1. 2. 0 పరిచయం
1. 2. 1 ఉద్దేశం
1. 2. 2 ప్రతిపదార్థ తాత్పర్యాలు
1. 2. 3 సందర్భసహిత వ్యాఖ్యలు
1. 2. 4 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

**1. 2. 0 పరిచయం :** శకుంతలోపాఖ్యానము ఆంధ్ర మహాభారతంలో నన్నయ తీర్చిదిద్దిన భాగం. అందులోని విశిష్టాంశాలను నన్నయ బహుధాప్రశంసనీయంగా చిత్రించాడు.

**1. 2. 1. ఉద్దేశం :** ఇంతకు ముందు శకుంతలోపాఖ్యానము పాఠ్యభాగసందర్భం, కఠినపదాలకు అర్థాలు, పాఠ్యభాగ వివరణ తెలుసుకున్నారు. ఇప్పుడు ప్రతి పదార్థ తాత్పర్యాలు, సందర్భసహిత వ్యాఖ్యలు. పరీక్షకురాదగిన ప్రశ్నలు సమాధానాలు తెలుసుకుంటారు.

## 1. 2. 2 ప్రతిపదార్థ తాత్పర్యాలు

**ప. 70**

తలఁపఁగ నాఁడు పల్కిన విధం బెడఁదప్పఁగ వీడెనొక్కొ చూ
డ్కులు విరసంబులై కరము క్రూరములైన నిమిత్త మేమియో
కలయఁగఁ బల్కరించి రుపకారులు నైరని నమ్మియుండఁగా
వలవదు బుద్ధిమంతులు నవప్రియ లైన ధరాధినాధులన్.

**పరిచయం :** ఈ పద్యం ఆదికవి నన్నయ భట్టు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని శకుంతలోపాఖ్యానం నుంచి గ్రహించబడింది.

(ఈ కవి పరిచయం ప్రతిపద్యం తరువాత రాయండి)

**సందర్భం :** శకుంతల కుమార సమేతంగా దుష్యంతుడు దగ్గరకు వచ్చినప్పుడు రాజు ప్రవర్తన గురించి ఆలోచిస్తున్న సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తలఁపఁగన్ | = | ఆలోచిస్తే |
| నాఁడు | = | ఆనాడు (పూర్వం) |
| పల్కిన తీరు | = | అన్నమాట ప్రకారము |
| ఎడన్ | = | హృదయంలో |
| తప్పఁగన్ | = | తప్పడానికి |
| వీడెను + ఒక్కొ | = | విడిచి పెట్టాడేమో ! |
| చూడ్కులు | = | చూపులు |
| విరసంబులై | = | ప్రేమలేనివై |
| కరము | = | చాలా |
| క్రూరములు + ఐన | = | భయంకరాలైన |
| నిమిత్తము | = | కారణం |
| ఏమి + ఓ | = | ఏమిటో ? |

| | | |
|---|---|---|
| కలయఁగన్ | = | బాగా కలుపుగోలుతనంలో |
| పల్కరించిరి | = | పలకరించారనీ |
| ఉపకారులున్ + ఐరి + అని | = | మేలుచేసిన వారయ్యారనీ |
| నవప్రియులు + ఐరి | = | కొత్తవారిపట్ల మోజుగలవారైన |
| ధరా + అధినాధులన్ | = | రా జు ల ను |
| బుద్ధిమంతులు | = | బుద్ధి ఉన్నవారు |
| నమ్మి + ఉండఁగా వలవదు | = | నమ్ముకొని ఉండకూడదు. |

**తాత్పర్యం :**

శకుంతల దుష్యంతుడి వాలకాన్ని చూచి ఇలా అనుకొంటున్నది. కొంచెం ఆలోచించి చూస్తే కణ్వాశ్రమంలో పూర్వం తానన్న మాటల్ని మనస్సునుంచి తొలగించుకున్నాడేమో ననిపిస్తున్నది. ఈ రాజు చూపులు ప్రేమ శూన్యాలై మరీ భయంకరంగా మారడానికి కారణం ఏమిటో ! బాగా కలుపుగోలు తనంతో తియ్యగా పలకరించారని, ఏదో కాస్త ఉపకారం చేశారని బుద్ధి ఉన్నవాళ్లు రాజుల్ని నమ్మగూడదు. రాజులు అందరూ నవప్రియులు. కొత్తవారు తారసపడగానే ఇంతకుముందు ఎంత ఆత్మీయంగా ఉన్నవాళ్ళనైనా వదలివేస్తారు.

**ప. 80**

విమల యశోనిధీ పురుషవృత్త మెఱుంగుచునుండుఁ జావె వే
దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కొన నేర్చునె తన్ను ముచ్చిలన్.

**పరిచయం :** ఈ పద్యం ఆదికవి నన్నయ భట్టు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని శకుంతలోపాఖ్యానం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడినప్పుడు ఆమె తన మనోవ్యవథను తానే అణచుకొని పలికిన సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విమలయశః + నిధీ | = | స్వచ్ఛమైన కీర్తికి పాతర అయినవాడా ! |
| వేదములును | = | నాలుగువేదాలు (ఋగ్యజుస్సామాధర్వణ వేదాలు) |
| పంచభూతములు | = | భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం |
| ధర్మువు | = | ధ ర్మ దే వ త |
| సంధ్యలున్ | = | ఉదయసాయం సంధ్యలు |
| అంతః + ఆత్మయున్ | = | అంతరాత్మ |
| యముఁడును | = | యమధర్మరాజు |
| చంద్రసూర్యులు | = | చంద్రుడూ, సూర్యుడూ |
| అహంబును | = | పగలు |
| రాత్రియున్ | = | రాత్రి |
| అన్ | = | అనే |

| | | |
|---|---|---|
| మహాపద + అర్థములు | = | గొప్ప పదార్థాలు |
| పురుషవృత్తము | = | మానవుడి నడతను |
| ఎఱుంగుచున్ + ఉండున్ + చూవె | = | తెలుసుకుంటూ ఉంటాయి సుమా ! |
| ఇవి + ఉండన్ + కాన్ | = | ఈ మహా పదార్థాలు సాక్షులుగా ఉండగా |
| నరుఁడు | = | మానవుడు |
| తన్ను ఁబ్రుచ్చిలన్ | = | తనను తాను మోసగించుకోవడానికి |
| తక్కొన నేర్చునె | = | పూనుకుంటాడా ? |
| | | (పూనుకోడు అని భావం) |

**తాత్పర్యం:-**

నిర్మలమైన కీర్తికి పాతర లాంటివాడా ! ఓ దుష్యంత మహారాజా ! వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, ఉభయసంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యుడు, చంద్రుడు, పగలు, రాత్రి అనే మహాపదార్థాలు మానవుడి నడవడిని గమనిస్తుంటాయి. ఈ గొప్ప పదార్థాలు సాక్షులుగా ఉండగా మానవుడు ఆత్మవంచనకు పూనుకుంటాడా ? పూనుకోడు. పూనుకోగూడదు.

**ప. 91**

విపరీత ప్రతిభాష లేమిటికి నుర్వీనాథ ! యీ పుత్ర గా
త్ర పరిష్వంగ సుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్ర పరాగ ప్రసరంబు ( జందనము ( జంద్రజ్యోత్స్నయుం బుత్త్ర గా
త్ర పరిష్వంగము నట్లు జీవులకు హృద్యంబే ? కడున్ శీతమే ?

**పరిచయం :** ఈ పద్యం ఆదికవి నన్నయ భట్టు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని శకుంతలోపాఖ్యానం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను తిరస్కరించిన దుష్యంతునితో శకుంతల పుత్రుడి ఆత్మీయతను, అతని స్పర్శవల్ల కలిగే ఆనందాన్ని గురించి చెబుతున్న సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఉర్వీనాథ | = | ఓరాజా |
| విపరీత ప్రతిభాషలు | = | విరుద్ధమైన ప్రత్యుత్తరాలు |
| ఏమిటికి | = | ఎందుకు ? |
| ఈ పుత్రగాత్ర | = | ఈ కుమారుడి శరీరంయొక్క |
| పరిష్వంగ | = | కౌగిలి వల్ల కలిగిన |
| సుఖంబు + చేకొనుము | = | సుఖాన్ని గ్రహించు |
| ముక్తాహార | = | ముత్యాలదండయొక్క |
| కర్పూర | = | కర్పూరం యొక్క |
| సాంద్రపరాగ | = | దట్టమైన ధూళియొక్క |
| ప్రసరంబున్ | = | వ్యాప్తి |
| చందనమున్ | = | గంధమూ |

| | | |
|---|---|---|
| చంద్రజ్యోత్స్నయున్ | = | చందమామ వెన్నెలా |
| పుత్రగాత్ర | = | కుమారుడి శరీరంయొక్క |
| పరిష్వంగము + అట్లు | = | కౌగిలిలాగా |
| జీవులకు | = | ప్రాణులకు |
| హృద్యంబు + ఏ | = | మనోహరమైనదా ? (కాదు) |
| శీతము + ఏ | = | చల్లనిదా ? (కాదు) |

**తాత్పర్యం :** ఓ దుష్యంత మహారాజా ! 'మాటకు మాట తెగులు' అన్నట్లు ఈ విరుద్ధమైన సమాధానాలు దేనికి ? ఒక్కసారి ఈ కుమారుడి దేహాన్ని కౌగిలించుకో ! ఆ సుఖాన్ని అనుభవించు ! ముత్యాలదండ కాని, కర్పూరధూళి కాని, గంధంకాని, వెన్నెలకాని పుత్రుడి శరీరాన్ని కౌగిలించుకోవడం లాగా ప్రాణులకు మనోహరంగా ఉండదు. చల్లగా ఉండదు.

**ప. 94**

నుతజల పూరితంబు లగు నూతులు నూఱిటి కంటె సూనృత
వ్రత ! యొక బావిమేలు, మఱిబావులు నూఱిటికంటె నొక్క స
త్క్రతు వదిమేలు, తత్క్రతు శతంబున కంటె సుతుండుమేలు, త
త్సుత శతకంబు కంటె నొక సూనృతవాక్యము మేలు చూడఁగన్.

**పరిచయం :** ఈ పద్యం ఆదికవి నన్నయ భట్టు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని శకుంతలోపాఖ్యానం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను తిరస్కరించిన దుష్యంతునికి శకుంతల సత్యప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోని పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| సూనృతవ్రత | = | సత్యవ్రతం కలిగినవాడా ! ఓ దుష్యంతమహారాజా ! |
| నుతజల | = | ప్రశస్తమైన నీటితో |
| పూరితంబులు + అగు | = | నిండినవైన |
| నూతులు | = | చేదబావులు |
| నూఱిటి కంటె | = | వంద కన్నా |
| ఒక బావి | = | ఒక దిగుడు బావి |
| మేలు | = | శ్రేష్ఠమైనది |
| మఱి | = | ఇంకా |
| బావులు | = | దిగుడుబావులు |
| నూఱిటి కంటె | = | వందకన్నా |
| ఒక్క | = | ఒక |
| సత్ + క్రతువు | = | మంచి యజ్ఞం ఉందే |
| అది | = | అది |
| మేలు | = | శ్రేష్ఠమైనది |
| తత్ + క్రతు శతంబున కంటె | = | ఆ వంద యజ్ఞాల కన్నా |
| సుతుండు | = | ఒక కుమారుడు |
| మేలు | = | శ్రేష్ఠం |
| తత్ + సుత శతకంబు కంటె | = | అటువంటి కుమారులు వందమంది కన్నా కూడా |
| చూడగన్ | = | బాగా పరిశీలిస్తే |

| | | |
|---|---|---|
| ఒక సూనృత వాక్యము | = | ఒక సత్యవచనం |
| మేలు | = | శ్రేష్ఠమైనది. |

**తాత్పర్యం :-** ఓ సత్యవాక్య పాలనమే వ్రతంగా కలిగిన దుష్యంత మహారాజా ! నూరు మంచినీటి నూతుల కన్నా - చేదబావులకన్నా - ఒక దిగుడు బావి మేలు. నూరు దిగుడు బావుల కన్నా ఒక మంచి యజ్ఞం శ్రేష్ఠమైనది. అటువంటి నూరు సత్రతువుల కన్నా ఒక కుమారుడు మేలు. బాగా ఆలోచించి చూస్తే ఇన్నిటికన్నా మిన్న అయిన కుమారుడి కన్నా కూడా ఒక సత్యవాక్యం శ్రేష్ఠమైనది.

అందువల్ల నువ్వు మనకుమారుణ్ణి ఆదరించు ! పూర్వం కణ్వాశ్రమంలో అన్న మాటను పాటించు ! ఇంతకన్నా పుణ్యంలేదు. వీటిని తిరస్కరించడం కన్నా పాపంలేదు అన్న ధ్వని ఇందులో ఉంది.

**ప. 103**

**మధ్యాక్కర :**

తడయక పుట్టిననాఁడ తల్లి చేఁ దండ్రిచే విడువఁ
బడితి నిప్పుడు పతిచేతను విడువఁ బడియెద నొక్కొ
నుడువులు వేయు నింకేల యిప్పాటి నోములు దొల్లి
కడఁగి నోచితిని గాకేమి యనుచును గందె డెందమున.

**పరిచయం :** ఈ పద్యం ఆదికవి నన్నయ భట్టు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని శకుంతలోపాఖ్యానం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల ఎన్నో ధర్మవచనాలను పలికింది. కాని అతడు స్వీకరించలేదు. 'నేనెక్కడ? నీవెక్కడ ? కుమారుడెక్కడ ? ముందు నిన్నెక్కడచూడలేదు. అనుచిత వచనాలు మాని ఆశ్రమానికి పో' అని దుష్యంతుడు అన్నప్పుడు శకుంతల మనస్సులో ఎంతో పరితాపాన్ని పొందింది. అప్పటి ఆమె ఆలోచన పరంపరలోనది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పుట్టిననాఁడు + అ | = | జన్మ మెత్తినప్పుడే |
| తడయక | = | ఆలస్యం లేకుండా (తత్క్షణమే) |
| తల్లి చేన్ | = | తల్లి అయిన మేనకచేత |
| తండ్రిచేన్ | = | తండ్రియైన విశ్వామిత్రుడిచేత |
| విడువన్ + పడితి | = | వదలిపెట్ట బడ్డాను |
| ఇప్పుడు | = | ఈ వేళ |
| పతిచేతను | = | భర్త అయిన ఈ దుష్యంతుడి చేతకూడా |
| విడువన్ + పడియెదను + ఒక్కొ | = | వదలిపెట్ట బడబోతున్నాను కాబోలు ! |
| నుడువులు వేయును | = | వేయి మాటలు |
| ఇంకన్ + ఏల | = | ఇంక ఎందుకు ? |
| తొల్లి | = | గతజన్మలో |
| కడఁగు + ఇ | = | ప్రయత్నించి (చేసీచేసీ నోచీనోచీ) |
| ఈ + పాటి | = | ఇంత తక్కువ |
| నోములు | = | నోములు (వ్రతాలు) |
| నోఁచితిని | = | నోచాను (చేశాను) |
| కాక | = | కాకపోతే |
| ఏమి | = | దుస్థితి ఎందుకు వచ్చింది ? |
| అనుచును | = | అనుకుంటూ - శకుంతల - |

| | | |
|---|---|---|
| డెందమున | = | హృదయంలో |
| కందెన్ | = | బాధపడింది |

**తాత్పర్యం:-** "నేను పుట్టినప్పుడే ఆలస్యం లేకుండా ఆ క్షణంలోనే తల్లిదండ్రుల చేత విడిచిపెట్ట బడ్డాను. ఇప్పుడు భర్తచేత కూడా విడిచి పెట్టబడతాను కాబోలు ! ఇంక వెయ్యిమాటలు దేనికి ? క్రిందటి జన్మలో నోచీ నోచీ ఇంత తక్కువ నోములు నోచి ఉంటాను ! లేకపోతే ఈ విషాద స్థితి ఏమిటి" అని శకుంతల మనస్సులో బాధపడింది.

**ప. 105**

గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు సే
కొని భరియింపు మీతని శకుంతల సత్యము వల్కె సాధ్వి స
ద్వినుత మహాపతివ్రత వివేకముతో నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ మందఁగఁ దత్సభాసదుల్.

**పరిచయం :** ఈ పద్యం ఆదికవి నన్నయ భట్టు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని శకుంతలోపాఖ్యానం నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలను తిరస్కరించాడు. 'ఆయుక్త వచనాలు మాని నీ ఆశ్రమానికి వెళ్ళు' అన్నాడు. శకుంతల మహా దుఃఖాన్ని పొందింది. నిరాశకు లోనైంది. కన్నీరును ఒత్తుకుంటూ ఇక దైవమే కాని వేరే శరణు లేదనుకొని, కొడుకుని తీసుకొని తిరిగిపోబోతున్న సమయంలో ఆకాశవాణి పలికిన సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| దివ్యవాణి | = | శ్రేష్ఠమైన, దేవతా సంబంధమైన వాక్కు అయిన ఆకాశవాణి |
| తాన్ | = | తాను |
| గొనకొని | = | ప్రయత్నించి (జోక్యంచేసుకొని) |
| వీఁడు | = | ఈ బాలుడు |
| నీకును | = | నీకూ |
| శకుంతలకున్ | = | శకుంతలకూ |
| ప్రియనందనుండు | = | ఎంతో ఇష్టమైన కుమారుడు |
| ఈతనిన్ | = | ఈ బాలుణ్ణి (భరతుణ్ణి) |
| చేకొని | = | గ్రహించి |
| భరియింపుము | = | పోషించు |
| సాధ్వి | = | పతివ్రతలందరి చేత |
| సత్ + వినుత | = | బాగా ప్రశంసింపబడే |
| మహాపతివ్రత | = | గొప్ప పతివ్రత |
| శకుంతల | = | శకుంతల |
| వివేకముతోన్ | = | విజ్ఞానంతో |
| సత్యము + పల్కె | = | నిజం చెప్పింది |
| అని | = | అని |
| తత్ + సభాసదుల్ | = | ఆ కొలువులో ఉన్నవాళ్లు |
| విస్మయము + అందఁగన్ | = | ఆశ్చర్యపడేటట్లు |

ధరా + అధినాథునకు = రాజైన దుష్యంతుడికి
వినిచెన్ = వినిపించింది.

**తాత్పర్యం:** - ఆకాశవాణి జోక్యం చేసుకొని "ఈ బాలుడు నీకూ, శకుంతలకూ ప్రియమైన కుమారుడు. ఇతణ్ణి దగ్గరకు తీసుకొని పోషించు. పతివ్రతలందరూ ప్రశంసించే మహా పతివ్రత శకుంతల ఎంతో విజ్ఞానంతో నిజం చెప్పింది." అని ఆ కొలువులోని వారంతా ఆశ్చర్యపడేటట్లుగా ఆ దుష్యంత మహారాజుకు వినిపించింది.

## 1. 2. 3 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. సతుల కేడు గడయు ఁబతుల చూవె ?**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టు రచించి నటువంటి ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : కణ్వ మహాముని తన పెంపుడు కూతురైన శకుంతలను ఆమె పుత్రుడైన భరతుడితో సహా భర్తగృహానికి, - దుష్యంతుడి దగ్గరకు - పంపాలనుకున్నాడు. ఒకనాడు తన కూతురితో అన్న మాటలివి.

వివరణ : ఎంతటి పతివ్రతలకైనా పుట్టినిళ్లల్లో ఎక్కువ కాలం ఉండడం అంతమంచిది కాదు. స్త్రీలకు భర్తల దగ్గర ఉండడమే ధర్మం. స్త్రీలకు భర్తలే సంరక్షకులు సుమా !

ఏడు + కడ = గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత - ఈ ఏడు విధాల రక్షణ.

ఈ పద్యపాదంలో నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వం గోచరిస్తున్నది.

**2. కరుణయు సంభ్రమము నపుడు గానక యెడలోన్.**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయ భట్టు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : శకుంతల కుమారుడితో సహా దుష్యంతుడి దగ్గరకు వచ్చి నిండు కొలువులో ఉన్న రాజును చూచింది. అప్పటిస్థితిని చూచి అన్నమాట.

వివరణ : తన తండ్రి ఆశ్రమంలో పూర్వం విశేషంగా లభించిన అనురాగాదరాలు ఇప్పుడు లేవు. దయ, ప్రేమతో, సంతోషంతో కూడిన తొందర కూడా కనిపించలేదు.

ఇక్కడ శకుంతలకున్న పరిశీలన శక్తిని నన్నయ చక్కగా వ్యక్తీకరించాడు. నన్నయ లోకజ్ఞతకు ఇది చక్కని నిదర్శనం. శకుంతల పరిశీలనంలో నాటి - నేటి దుష్యంతుడికున్న తేడా కనిపిస్తున్నది. సంఘటనల, భావాల ప్రతియోగఘటనం ఇక్కడ కనిపిస్తున్నది.

**3. ముగ్ధ లధిపులు, మఱవరె బహు కార్య భార మగ్నులుకారే !**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయ భట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్ధాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : శకుంతల కుమార సమేతంగా దుష్యంతుడి దగ్గరకు వచ్చినప్పుడు ఆయనలో పూర్వం ఉన్నట్లుగా అనురాగం, ఆదరణం, దయ, ప్రేమతో కూడిన తొందర కనిపించలేదు. అప్పుడు శకుంతల దుష్యంతుణ్ణి గురించి, అలాంటి రాజుల్ని గురించి అనుకొనే సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : నన్ను ఈ దుష్యంతుడు ఎరుగడా ! ఎరిగికూడా తెలియనట్లు ఉన్నాడు. చాలా కాలం గడిచింది కాబట్టి మరచిపోయాడా? రాజులు మోహపరవశులు. అదీగాక అనేక కార్యక్రమాల్లో మునిగిపోయి ఉంటారు. కనుక మరచిపోతుంటారు.

ఇక్కడ శకుంతల పాత్ర పరంగా మనస్తత్త్వ విశ్లేషణలో నన్నయ నైపుణ్యం స్పష్టమౌతున్నది.

**4. నమ్మియుండగా వలవదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధినాథులన్.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** శకుంతల కుమారసమేతంగా దుష్యంతుడి దగ్గరకు వచ్చినప్పుడు రాజు ప్రవర్తనను గురించి ఆలోచిస్తున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

**వివరణ :** ఈ దుష్యంతుడు పూర్వం ఇచ్చినమాటను మనస్సునుంచి తొలగిపోయేటట్లు చేసుకున్నాడేమో ! చూపులు ప్రేమరహితంగా అయినాయి. కారణం ఏమిటో ! అందువల్ల బాగా పలకరించారు, ఉపకారం చేశారని బుద్ధి ఉన్నవాళ్ల రాజుల్ని నమ్మకూడదు. వాళ్ల నవప్రియులు. కొత్తవారిని ఇష్టపడేవారు. వారి ప్రేమ తాత్కాలికం.

ఇక్కడ శకుంతల పాత్రపరంగా నన్నయ లోకజ్ఞత తెలుస్తున్నది.

**5. కుటిలం దెలుపంగఁ గమలగర్భుని వశమే ?**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆది పర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడి చూపులు చాలా విరసంగా ఉండడాన్ని గమనించిన శకుంతల చింతాక్రాంత అయి తనలో అనుకొన్న మాట.

**వివరణ :** ఎవరైనా ఒక విషయాన్ని మరచిపోతే జ్ఞప్తి చేయవచ్చు. అసలు తెలియకపోతే అన్నివిధాలా తెలిసేటట్లు చెప్పవచ్చు. కాని తెలిసి, తెలుసుకోవడానికి ఇష్టపడని వంచకుడికి తెలియజెప్పడం బ్రహ్మకైనా తరం అవుతుందా ? కాదు.

ఇక్కడ శకుంతల లోకజ్ఞతను, మనస్తత్త్వ పరిశీలనను లోకజ్ఞుడైన నన్నయ చక్కగా చిత్రించాడు.

**6. వచ్చి మిన్నక పోవంగాదు.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయ భట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆది పర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను ఎరుగనట్లుగా దుష్యంతుడు నటిస్తున్నాడని శకుంతల గ్రహించింది. అతన్ని వంచకుడుగా భావించింది. ఆ తరువాత ఆమె తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేసేది ఈ వాక్యం.

**వివరణ :** వచ్చి ఊరకే తిరిగి వెళ్లరాదు. పూర్వ వృత్తాంతాన్ని తెలియజేసి, కుమారుణ్ణి చూపడం మంచిదని శకుంతల భావించింది.

ప్రతిమానవుడు తనకు వ్యతిరేకపరిస్థితులు ఎదురైనప్పుడు కర్మపరుడు కావాలి కాని కర్మను - కర్తవ్యాన్ని - వదలకూడదు. ముందుకు సాగిపోవాలి. వెనుకంజ వేయకూడదు. రామాయణంలో హనుమంతుడు అలాగే ప్రవర్తించాడు. భారతంలో శకుంతల అలాగేచేసింది. మన తెలుగువారు ఈ తత్త్వాన్ని బాగా ఇష్టపడతారు. క్రియా శూన్యులను 'సింగ డద్దంకి పోనూ పోయాడు రానూ వచ్చాడు' అని పరిహసిస్తారు. శకుంతల చైతన్యాన్ని అందరికీ ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దాడు నన్నయ.

**7. నీయిచ్చిన వరము దలంపవలయు (జిత్తములోనన్.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను ఎరుగనట్లు నటిస్తున్న దుష్యంతుడికి, శకుంతల తన పూర్వవృత్తాంతాన్ని వివరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : ఓ రాజా వేటనెపంతో నీవు కావాలని కణ్వాశ్రమానికి వచ్చి అక్కడ నాకు ఇచ్చిన వరాన్ని జ్ఞప్తికి తెచ్చుకో !

ఆ వరం ఏమిటంటే - దుష్యంతుడి ప్రసాదంవల్ల శకుంతలకు ఉదయించిన కుమారుడికి యువరాజ్యాభిషేకం చేయడం.

**8. యువరాజు ( జేయు మభిషేకమునన్.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను ఎరుగనట్లు నటిస్తున్న దుష్యంతుడికి కుమారుణ్ణి చూపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణ :** తన కుమారుడైన భరతుణ్ణి పట్టాభిషేక మహోత్సవం జరిపి యువరాజుగా చేయవలసిందిగా శకుంతల అభ్యర్థిస్తున్నది. ఈ సందర్భంగా భరతుడి యోగ్యతను ప్రస్తావిస్తున్నది శకుంతల. బాల సూర్యుడివంటి తేజస్సుకలవాడు, సద్గుణ నిలయుడు, పురువంశరత్నాభరణం తదుపరి నీ కుమారుడు సుమా అని చెప్పింది. శకుంతల సంభాషణ సంవిధానాన్ని నన్నయ చక్కగా అందించాడు.

**9. అరుగు మంబురుహానన యెందుండి వచ్చి తండులకు వడిన్.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** శకుంతల దుష్యంతుడికి పూర్వం కణ్వాశ్రమంలో జరిగిన విషయమంతా వివరించింది. కుమారుణ్ణి చూపింది. అయినా దుష్యంతుడు అంతా తెలిసికూడా ఏమి తెలియనట్లు నటించాడు. అలా నటిస్తూ అమాయకంగా మాటాడుతున్న సందర్భంలోది ఈ వాక్యం

**వివరణ :** ' నేను నిన్ను ఎరుగను. నీవు ఎక్కడిదానివి ? ఊరికే అనరాని మాటలు అంటావెందుకు ? ఎక్కడనుంచి వచ్చావో అక్కడకు వేగంగా వెళ్ళు' అన్నాడు. ఇందులో దుష్యంతుడి అసత్యరక్తి, మాట తీవ్రత కనిపిస్తున్నది. పాత్రోచితంగా సమయోచితంగా నన్నయ ఈ సంభాషణను తీర్చిదిద్దాడు.

**10. కెందమ్మి రేకుల వలనం దొరంగు జలకణంబుల పోలె.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను వచ్చినదారినే తిరిగి వెళ్లమన్నాడు. వేగంగా వెళ్లమన్నాడు. అంటే కణ్వాశ్రమానికే తిరిగి వెళ్లమన్నాడు. ఆ మాటలకు శకుంతల నిశ్చేష్టిత అయింది. కోపంతో ఎర్రబడ్డ కళ్లనుంచి కన్నీరు కారుతూఉండగా తలవంచకుంది. ఈ సందర్భంలో నన్నయ ప్రయోగించిన ఉపమానం ఈ వాక్యం.

**వివరణ :** ఎర్రతామర రేకులనుంచి స్రవిస్తున్న నీటిబొట్లులాగా ఆమె కోపారుణిత నయనాలనుంచి బాష్పకణాలు ప్రవహిస్తున్నాయి. ఈ వాక్యం నన్నయ అలంకార శిల్పానికి చక్కని దృష్టాంతం.

**11. తప్పు ( బలుక నగునె ధార్మికులకు ?**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడాడు. కన్నీరు కారుతూఉండగా, తలవంచి, దుష్యంతుణ్ణి కడకంటితో చూస్తూ, తన మనోవ్యథను తానే అణచుకొని శకుంతల దుష్యంతుడితో మాటాడిన సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : అన్నీ తెలిసికూడా ఏమీ తెలియనట్లు అజ్ఞానుల లాగా మాటాడుతున్నావని, నేను తప్పక ఎవరూ ఎరుగరని అసత్యాలు పలకరాదని శకుంతల దుష్యంతుణ్ణి మందలించింది. అబద్ధమాడడం ధార్మికుల లక్షణం కాదని హెచ్చరించింది.

నన్నయ సంవాద శిల్ప నైశిత్యం ఇక్కడ మనకు ప్రస్ఫుటమౌతున్నది.

**12. నరుడు తక్కొన నేర్చునె తన్ను బ్రముచ్చిలన్ ?**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడినప్పుడు ఆమె తన మనోవ్యథను తానే అణచుకొని మాటాడిన సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : వేదాలూ, పంచభూతాలూ, ధర్మదేవత, సంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యచంద్రులు, రాత్రి, పగలు మానవవర్తనాన్ని గమనిస్తూ ఉంటాయి. అందువల్ల నరుడు ఆత్మవంచనకు పూనుకోగలడా ? పూనుకోలేడు. నీవు పూనుకున్నావు. కనుక మానవత్వం లేనివాడివని భంగ్యంతరంగా ఉపాలంభించింది శకుంతల.

శకుంతల ధర్మజ్ఞత ఈ వాక్యంలో నిబిడంగా ఉంది. ఇటువంటి వాక్కుల వల్లనే భారతాన్ని 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని' కొనియాడుతుంటారు.

**13. అవజ్ఞ సేయందగునే ?**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడినప్పుడు శకుంతల తన మనోవ్యథను తానే ఉపశమింపజేసుకొని మాటాడిన సందర్భంలోది.

వివరణ : ఓ దుష్యంతమహారాజా ! నీవు ఇచ్చిన వరాన్ని నేనెరిగినంత స్పష్టంగా వేదాలు, పంచభూతాలు, సంధ్యలు, యముడు, సూర్యచంద్రులు, అహో రాత్రాలు కూడా ఎరుగు. కాబట్టి నన్ను పూర్వంలాగా దయతోచూడు. తిరస్కరించకూడదు. ఇక్కడ శకుంతల ప్రసంగం తార్కికానుక్రమంలో కొనసాగింది.

**14. ఇహముం బరము ( గలదె మతిఁబరికింపన్.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడినప్పుడు శకుంతల తన మనోవ్యథను తానే ఉపశమింపజేసుకొని మాటాడిన సందర్భంలోది.

వివరణ : పతివ్రత, గుణవతి, సంతానవతి అయిన భార్యను తిరస్కారదృష్టితో చూచే దుర్బుద్ధికి ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాలు ఉండవు. ఈ ధర్మవచనం సాధారణంగా కనిపించినా దుష్యంతుణ్ణి వేలెత్తి చూపినట్లుంది.

**15. వంతలెల్ల (బాయు నింతుల ( బ్రజలను**

**నొనర ( జూడ ( గనిన జనుల కెందు !**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల భార్యాపుత్రుల విశిష్టతను వివరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : భార్య ధర్మార్థకామ సాధనకు సాధనం, వంశానికి మూలం, గౌరవానికి కారణం, మనస్సంతోష జనకం. అందువల్ల భర్తకు భార్య తప్ప ఏవీ ఇష్టమైనవికావు.

అరణ్యవాసాదిక్లేశాలు సంభవించినప్పుడు, ఆపదలు, అవసరాలు చుట్టు ముట్టినప్పుడు తమభార్యలను, బిడ్డలను చక్కగా చూడగలిగిన ప్రజలకు బాధలన్నీ తొలగిపోతాయి. ఈ వాక్యంలో భార్య ప్రశస్తి, ఆలు బిడ్డల్ని చూచినప్పుడు కలిగే ఆనందం చక్కగా వివృతాలు.

**16. వెలుగును జనకుడు దాఁ బుత్త్రుఁడై నిజద్యుతితోడన్.**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల పుత్ర ప్రశస్తిని, తండ్రి కొడుకుల అభేదాన్ని వివరిస్తున్నది. ఈ సందర్భంగా 'అంగాదంగాత్ సంభవసి' ఆదిగా గల వేదవచనాలను ఉదాహరించింది.

"గార్హపత్యం అనే అగ్ని అదేమళ్లీ ఆహవనీయంగా వెలిగే తీరుగా తండ్రి కొడుకై తన తేజస్సుతో ప్రకాశిస్తాడు" అని చెప్పింది.

ఈ వైదికోపమ నన్నయ అవిరళ జపహోమ తత్పరతకు అద్దం పడుతున్నది.

**17. దీపంబువలన నొండొక**

**దీపము ప్రభవించినట్లు తేజంబెసగన్.**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల పుత్ర విశిష్టతను వివరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : దీపంనుంచి ఇంకొకదీపం వెలిగినట్లు నీ పుణ్యశరీరంనుంచి ఈ పుత్రుడు ఉద్భవించి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు.

ఈ ఉపమానం ప్రజాసామాన్యం లోది. నన్నయ లోకజ్ఞతకు నిదర్శనం.

**18. జీవులకు హృద్యంబే కడున్ శీతమే ?**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల పుత్రుడి ఆత్మీయతను, అతని స్పర్శవల్ల కలిగే ఆనందాన్ని గురించి చెబుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణం : 'విరుద్ధమైన సమాధానాలతో పనిలేదు. ఈ పుత్రుణ్ణి కౌగిలించుకో. ఆ సుఖాన్ని అనుభవించు' అన్నది. ముత్యాలహారం, కర్పూర ధూళి - వీటివ్యాప్తి, గంధం, చందమామ వెన్నెల పుత్రశరీరాలింగనం లాగా ప్రాణులకు మనోహరంగా ఉంటాయా ? చల్లగా ఉంటాయా ? ఉండవు అని శకుంతల చెప్పింది.

ఇందులో భవభూతి మహాకవి స్పర్శ సిద్ధాంతం కనిపిస్తున్నది.

**19. ఒక సూనృత వాక్యము మేలు సూడఁగన్ !**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను తిరస్కరించిన దుష్యంతుడికి శకుంతల సత్య ప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణం :** ప్రశస్తమైన నీటితో కూడిన నూరు చేదబావుల కన్నా ఒక దిగుడు బావి మేలు. నూరు దిగుడుబావుల కన్నా ఒక మంచియజ్ఞం శ్రేష్ఠమైనది. అటువంటి నూరు క్రతువుల కన్నా ఒక కుమారుడు శ్రేష్ఠం. అటువంటి కుమారులు నూరుగురి కన్నా ఒక సత్యవాక్యం శ్రేష్ఠం.

ఈ పద్యంలో ఒకదాని కన్నా ఆ తరువాతిది, దానికన్నా ఆ తరువాత శ్రేష్ఠమని చెప్పడంలో ఒక సొగసువచ్చింది. ఈ ఉత్తరోత్తరోత్కర్షనే సారాలంకారం అంటారు. ఇందులో శకుంతల ధర్మజ్ఞత వ్యక్తమౌతున్నది.

**20. సత్యము వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్ !**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను తిరస్కరించిన దుష్యంతుడికి శకుంతల సత్యప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణ :** వేయి అశ్వమేధ యాగాల్నీ ఒక సత్యాన్నీ త్రాసులో రెండు వైపులా పెట్టి తూస్తే సత్యం వైపే ముల్లువాలుతుంది. సత్యానికి ఉన్న గౌరవాతిశయం అంతటిది.

ఇందులో శకుంతల ధర్మజ్ఞత వ్యక్తమౌతున్నది.

**21. ఎల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను తిరస్కరించిన దుష్యంతుడికి శకుంతల సత్యవాక్య ప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణ :** అన్ని తీర్థ ప్రదేశాలకు యాత్రలు చేయడం, అన్ని వేదాలు చదవడం లాంటి గొప్ప పుణ్యకార్యాలు కూడా సత్యంతో సమానంకావు. ధర్మవేత్తలైన మునులు అన్ని ధర్మాల్లోనూ సత్యమే గొప్పది అని చెప్పారు.

ఇక్కడ శకుంతల ధర్మజ్ఞత వ్యక్తమౌతున్నది.

**22. ఇప్పాటినోములు దొల్లి కడఁగి నోచితిని గాకేమి ?**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల ఎన్నో ధర్మవచనాలను పలికింది. కాని అతడు స్వీకరించలేదు. "నేనెక్కడ ! నీ వెక్కడ ! కుమారుడెక్కడ ! నేను ఇంతకుముందు నిన్ను చూచి ఎరుగను. ఇటువంటి లోకవిరుద్ధాలకు నేను భయపడుతుంటాను. అయుక్త వచనాలు మాని నీ ఆశ్రమానికి పో !" అని దుష్యంతుడు అన్నప్పుడు శకుంతల మనస్సులో ఎంతో పరితాపాన్ని పొందింది. అప్పటి ఆమె ఆలోచన పరంపరలోది ఈ వాక్యం.

వివరణ : ' నేను పుట్టిన వెంటనే నన్ను తల్లిదండ్రులు విడిచిపెట్టారు. ఇప్పుడు భర్తకూడా విడిచిపెడతాడు కాబోలు ! వేయి మాట లెందుకు ! నేను క్రిందటి జన్మలో కొరత నోములు నోచి ఉంటాను' అని శకుంతల బాధపడింది.

ఇందులో భారతీయ సంప్రదాయానికి మూలస్తంభాల్లో ఒకటైన పునర్జన్మ సిద్ధాంతం ప్రస్తావించబడింది. 'పతి' తప్ప అన్నీ తెలుగుపదాలే. నన్నయ శోకసన్నివేశాల్లో సంఘర్షణను చిత్రించడానికి గాను తెనుగు శైలిని వాడడం ఇందులో కనిపిస్తుంది.

**23. ఇంక దైవంబ కాని యొండు శరణంబులేదు.**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను తిరస్కరించాడు. తగని మాటలు మాని, నీ ఆశ్రయానికి వెళ్లు అన్నాడు. శకుంతల మహాదుఃఖాన్ని పొందింది. ఇక దుష్యంతుడు స్వీకరిస్తాడనే ఆశలేదు. కన్నీరును ఒత్తుకుంటూ అనుకున్న మాట.

**వివరణ :** ఇంక దైవం తప్ప వేరే శరణం లేదు అని శకుంతల అనుకొన్నది. భగవంతుణ్ణి శరణుజొచ్చింది. మానవ ప్రయత్నం ఫలించక పోవడంతో ఆ నిర్ణయానికి వచ్చింది. వెంటనే భగవదాదరం ఆకాశవాణి రూపంలో లభించింది.

ఇతిహాస ప్రధాన లక్షణమైన భగవత్ప్రాధాన్యం ఈ వాక్యంలో కనిపిస్తున్నది. దైవం, పురుషకారం రెండూ ముఖ్యమైనవైనా దైవమే మిన్న.

**24. ఎఱిఁగియు నిత్తన్వి ప్రీతి దప్పి యెఱుగనంటిని !**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** ఆకాశవాణి సభాసదులు అందరూ ఆశ్చర్యపడేటట్లుగా "శకుంతల సత్యం పలికింది, ఈ భరతుడు నీ కుమారుడు, ఇతన్ని స్వీకరించి పోషించు" అని చెప్పింది. శకుంతలా పతివ్రతాత్వాన్ని, భరతోత్పత్తిని ప్రశంసిస్తున్న దేవతల మాటలు కూడా ఆకాశం నుంచి వినిపించాయి. దుష్యంతుడు అందరి ముందు వాస్తవాన్ని అంగీకరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణ :** కణ్వమహాముని ఆశ్రమంలో జరిగిన మా గాంధర్వ వివాహం ఇతరులకు తెలియదన్న ఉద్దేశంతో లోకాపవాద భీతికిలోనై, ఈమె ప్రీతిని వదలివేసి ఎరుగనన్నాను. ఇప్పుడు ఆశ్చర్యకరంగా ఆకాశవాణి అందరికీ తెలియజేసింది.

దుష్యంతుడు లోకాపవాదభీతి వల్ల శకుంతలను తిరస్కరించినట్లు భారతంలో ఉండగా, కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం నాటకంలో మార్పుచేశాడు. శకుంతల పొందిన దుర్వాసశ్శాపం వల్ల దుష్యంతుడు మరచిపోయినట్లు కల్పించాడు. నన్నయ కాళిదాస కల్పనను స్వీకరించకుండా వ్యాసభారతబద్ధ నిరూపితార్థాన్నే ఆంధ్రీకరించాడు.

## 1. 2. 4 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు :

ప్రశ్న.

**1. 'శకుంతలోపాఖ్యానము' ఆధారంగా శకుంతలా పాత్రచిత్రణను వివరించండి. లేదా శకుంతల గుణశీలాలను చిత్రించండి.**

ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో ఉన్న శకుంతలోపాఖ్యానంలోని ప్రధాన పాత్రలు శకుంతలాదుష్యంతులు.

శకుంతల మేనకావిశ్వామిత్రుల ముద్దుబిడ్డ. ఆమె పుట్టగానే తల్లిదండ్రులు విడిచిపెట్టారు. పక్షులామెను రెక్కలతో కప్పి రక్షించాయి. కణ్వుడు సమిత్కుసుమ ఫలాహారణార్థం అక్కడకు వెళ్లి మాలినీనది ఇసుక తిన్నెమీద ఉన్న ఆమెను తీసుకువచ్చి - శకుంతరక్షిత పక్షులచేత రక్షించబడింది - కనుక శకుంతల అనే పేరుపెట్టి ప్రేమతో పెంచాడు. అందువల్ల కణ్వుడు శకుంతలకు పెంపుడు తండ్రి.

దుష్యంతమహారాజు వేటకు వచ్చి కణ్వమహర్షిని సందర్శించ దలిచాడు. వారులేరు. ఆశ్రమంలోని శకుంతలను చూచి గాంధర్వ వివాహం చేసుకుంటానని శకుంతలను అంగీకరింపజేశాడు. అప్పుడు ఆమె దుష్యంతుడితో "నీదయ వల్ల కలిగే కుమారుడికి యౌవరాజ్యాభిషేకం చేయడానికి వరం ఇవ్వు. అలాగైతేనే నీకూ నాకు సంగమం అవుతుం" దని అన్నది. దుష్యంతుడు శకుంతలకు కోరిన వరం ఇచ్చి గాంధర్వ వివాహం చేసుకొని అభిమత సుఖాలు అనుభవించాడు. వెళ్లేటప్పుడు దుష్యంతుడు తనమంత్రులను కణ్వమహాముని వద్దకు పంపుతానన్నాడు. శకుంతల ఊరడిల్లింది. శకుంతల గాంధర్వ వివాహం క్షత్రియులకు విధి చోదితమని కణ్వుడు ఆమోదముద్ర వేశాడు.

శకుంతల దుష్యంతుణ్ణి కోరిన వరం విషయం కణ్వుడి నోటివెంట వచ్చింది. ఆమె ధర్మ చరిత్ర తన మనస్సు ఎప్పుడూ ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉండాలని, తన పుత్రుడు వంశకర్త కావాలని తండ్రిని వరం కోరుకోవడంలో ఆమె ధర్మశీలం తెలుస్తున్నది.

శకుంతల భరతుణ్ణి కన్నది. ఆ కుమారుడు చక్రవర్తి లక్షనలక్షితుడు. అనంతజవసత్త్వ సంపన్నుడు. అరణ్యంలోని సర్వజంతువుల్ని తన మహాబలంతో అరికట్టాడు. మునులు సర్వదమనుడన్నారు అతనిని. ఇలా యౌవరాజ్యాభిషేకానికి అర్హతకల వయస్సు వాడయ్యాడు.

ఇలా శకుంతల తగినపతిని, సుతుణ్ణి పొందింది. ఆమె ఉత్తమ పత్ని, ఉత్తమ జనని.

శకుంతల తండ్రి చెప్పిన ప్రకారం ఆయన పంపిన శిష్యులతో కుమారసమేతంగా భర్త దగ్గరకు వచ్చింది. నిండు కొలువులో ఆ రాజును చక్కగా పరిశీలించింది. అనురాగం, ఆదరం, ప్రేమతోడి తొందర లేకపోగా చూపుల్లో క్రూరత చోటుచేసుకున్నదని గమనించింది. శకుంతల గొప్ప పరేంగితజ్ఞ. దుష్యంతుడు తెలియనట్లు నటిస్తున్నాడు. యథార్థాన్ని మనస్సులోకి ప్రవేశించ నివ్వడంలేదని ఆమె గ్రహించింది.

శకుంతల క్రియాశీలం ప్రశంసార్హం. ఇంతదూరం వచ్చినాక ఊరకే తిరిగిపోవడం మంచిదికాదని తన ప్రయత్నాన్ని ప్రారంభించింది. పూర్వ వృత్తాంతం చెప్పి కొడుకును చూపాలనుకుంది. దుష్యంతుడు 'నిన్ను ఎరుగను, వచ్చినచోటికే తిరిగి వెళ్లు' అనగానే ఆమెకు కళ్లవెంట బాష్పకణాలు స్రవించాయి.

ఆపదలందు ధైర్యగుణం శకుంతల నైజం. తన హృదయసంతాపాన్ని తనే ఉపశమింపజేసుకున్నది.

శకుంతల ధర్మజ్ఞ. ఆమె దుష్యంతుడితో ఇలా అన్నది. ధార్మికులైనవారు మాటతప్పకూడదని, మనంచేసిన పనిని మానవులు చూడకపోయినా పంచభూతాలు, సూర్యచంద్రులు, అహోరాత్రాలు మొదలైన మహాపదార్థాలు గమనిస్తూ ఉంటాయని అందువల్ల అబద్ధమాడి ఆత్మవంచన చేసుకోవద్దని హెచ్చరించింది. భార్యను తిరస్కరించే దుర్మతికి ఇహపరాలు లేవని, ఎటువంటి ఆపదల్లోనైనా భార్యాపుత్రులను చూచుకుంటే చాలు బాధలు తొలగిపోతాయని చెప్పింది. ఆ తరువాత పుత్రప్రాశస్త్యాన్ని వివరించింది. పుత్రగాత్ర పరిష్వంగ సౌఖ్యం కన్నా చల్లనిదీ, మనోహరమైనదీ లేదని అతి మధురానుభూతికి అక్షరాకృతి ఇచ్చింది. ఆ తరువాత సత్యగౌరవాన్ని వక్కాణించింది.

"ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందఁ బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు"
అని చెప్పింది.

శకుంతల దైవ విశ్వాసం వర్ణనాతీతం. ఆమె ఎన్ని చెప్పినా దుష్యంతుడు వినలేదు. నీ ఆశ్రమానికి వెళ్లు అన్నాడు. ఆమె వెంటనే "దైవంబకాని యొండు శరణంబు" లేదనుకున్నది.

ఆకాశవాణి జోక్యం చేసుకున్నది. దుష్యంతుడితో శకుంతల మహాసాధ్వి, ఆమె వివేకంతో సత్యం పలికిందని, ఈ బాలుడు మీ కుమారుడని సభలోని వారందరూ వినేటట్లు చెప్పింది.

శకుంతల మహాసాధ్వి. ఆమెను ఆకాశవాణితో పాటు గగనస్థితులైన దేవతలూ ప్రశంసించారు.

దుష్యంతుడి చేత అతి ప్రణయగౌరవంతో సంభావింపబడింది. శకుంతల ఉత్తమ గుణగణాలు స్త్రీ జాతికే ఆదర్శం.

ప్రశ్న.

**2. శకుంతలోపాఖ్యానంలోని సందేశాన్ని వివరించండి. లేదా - శకుంతల వివరించిన భార్యాభర్తల, తండ్రికుమారుల పవిత్రాను బంధాన్ని చిత్రించండి. లేదా గృహస్థాశ్రమ ధర్మాన్ని నిరూపించండి.**

మహాభారతాన్ని ఇతిహాసంగా, శాస్త్రేతిహాసంగా వేదవ్యాస మహర్షి రూపొందించాడు. నన్నయ వ్యాసవిహిత మార్గంలో పురుషార్థ నిరూపణం చేశాడు. ప్రధానంగా ధర్మప్రబోధం చేశాడు. ఇందులో భార్యాభర్తల, పితాపుత్రుల అనుబంధాన్ని మనం తెలుసుకొంటాము.

శకుంతల ధర్మచరిత. కణ్వ మహాముని సైతం 'నీ ధర్మ చరితంబునకు మెచ్చితి' అన్నాడు ఆమెతో. తన మనస్సు 'ధర్మవునంద తగిలి' ఉండాలని వరం కోరుకొన్నది.

కణ్వమహర్షి శకుంతలకు బోధించిన దర్మాన్ని ముందుగా మననం చేసుకుందాం.

"ఎంతటి పతివ్రతలైనా పుట్టింట్లో ఎక్కువకాలం ఉండరాదు. భర్త దగ్గర ఉండడమే ధర్మం" అన్నాడు కణ్వుడు. ఇది శాశ్వత సత్యం.

దుష్యంతుడి పరిస్థితిని గమనించి శకుంతల రాజుల తత్త్వాన్ని ప్రకటించింది. రాజులు ప్రయోజనాపేక్ష కలవారు. తమ ప్రయోజనం కోసం ఆశ్రితుల మీద అభిమానాన్ని మార్చుకుంటారు. కొత్తవారి మీద మోజు ఎక్కువ. అందువల్ల బుద్ధిమంతులు రాజుల్ని నమ్మకూడదు. ఇదీ శకుంతల అభిప్రాయ సారాంశం. వ్యాసుడు, నన్నయ ప్రకటించిన ఈ అభిప్రాయాలే పోతన, ధూర్జటి, త్యాగరాజు మొదలైన తెలుగుకవులను ప్రభావితం చేశాయి.

మాటదప్పిన భర్తను సైతం క్షమించలేదు శకుంతల. అజ్ఞాని లాగా తెలిసిన విషయాన్ని తెలియదనవద్దు అని మందలించింది. ఇది రహస్యం ఎవరికీ తెలియదులే అని అబద్ధమాడడం ధార్మికుల లక్షణం కాదన్నది. వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, ఉభయసంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యచంద్రులు, రేయీపగలూ ఉండగా అవి మానవ ప్రవర్తనను గమనిస్తూ ఉండగా అబద్ధమాడి ఆత్మవంచనకు పూనుకోరాదని చెప్పింది.

గృహస్థాశ్రమంలో భార్యకు ఉన్న ఉన్నతస్థానాన్ని శకుంతల చక్కగా వ్యక్తం చేసింది. పతివ్రత, గుణవతి, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కరించే దుర్మార్గుడికి ఇహపరాలు లేవు. అనుగుణ భార్యావంతుడు శాశ్వతమైన గృహస్థ ఫలాన్ని మొత్తం పొందుతాడు. భార్య పురుషార్థాలైన ధర్మార్థ కామాలను సాధించడానికి సాధనం. స్వచ్ఛమైన నడవడికి గురుస్థానం. వంశస్థితికి మూలం. మోక్షానికి చేదోడు. గౌరవానికి కారణం. సంతోష జనకం.

కష్టాలు వచ్చినప్పుడు భార్యను, బిడ్డల్ని చూస్తే బాధలన్నీ తొలగిపోతాయి. భార్య భర్తలో అర్ధభాగం. ఆమె ముందు మరణిస్తే స్వర్గంలో భర్తకోసం ఎదురుచూస్తుంటుంది. భర్త భార్యలో ప్రవేశించి కుమారుడిగా జన్మిస్తాడు. 'అంగాదంగాత్ సంభవసి' అనే వేదవాక్యాన్ని బట్టి తండ్రీ కొడుకులకు తేడాలేదు.

శకుంతల పుత్ర విశిష్టతను కూడా పేర్కొన్నది. గార్హపత్యాగ్ని మరోరూపంలో ఆహవనీయాగ్నిగా ప్రకాశించే విధంగా జనకుడే తనయుడిగా ప్రకాశిస్తాడు. తననీడను తాను నీళ్లలో చూచుకొని ఆనందించే విధంగా తండ్రి కుమారుణ్ణి చూచి ఆనందిస్తాడు. 'పున్నామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్ర' అనే వేదవచనం ప్రకారం పుత్ అనే పేరుగల నరకంనుంచి రక్షిస్తాడు అని పుత్ర శబ్దార్థం. పున్నామనరకంనుంచి తల్లివైపు వారిని, తండ్రివైపు వారిని రక్షిస్తాడు. దీపం నుండి పుట్టిన దీపంలాగా తండ్రివల్ల జన్మించిన కుమారుడు ఆ కాంతిని - పితృలక్షణాల్ని - కొనసాగిస్తాడు. కొడుకు ఒంటిని కౌగిలించుకుంటే కలిగే హాయి అనుభవిస్తే తెలియాల్సిందే కాని మాటలకు అందదు. ముత్యాల దండలు, కర్పూరరజం, మంచిగంధం, ఆహ్లాదానికి మారుపేరైన వెన్నెల - ఏవీ కలిగించలేవు. అందువల్ల పుణ్యాచారుడైన పుత్రుణ్ణి ఎవరూ దూరం చేసుకోగూడదు.

అనంతరం శకుంతల సత్యం ఔన్నత్యాన్ని చాటింది. అందరూ బాగా మెచ్చుకునే నీటితో నిండిన నూరు నూతుల కన్నా ఒక దిగుడుబావి శ్రేష్ఠం. అటువంటి బావులు నూరిటికన్నా ఒక సత్క్రతువు శ్రేష్ఠం. అటువంటి క్రతువులు నూరిటికన్నా ఒక కుమారుడు మేలు. అటువంటి కుమారులు వందమంది కన్నా సత్యవాక్యం మంచిది. వెయ్యి అశ్వమేధయాగాల ఫలితాన్ని త్రాసులో ఒక ప్రక్కన పెట్టి, సత్యఫలాన్ని మరో ప్రక్కన తూకం వేస్తే సత్యం వైపే ముల్లు మొగ్గుతుంది. సత్యానికి ఉన్న గురుత్వాతిశయం, గొప్పతనం, బరువు - అలాంటిది. ఎన్ని తీర్థయాత్రలు చేసినా, ఎన్ని వేదాలు చదివినా సత్యంతో సమానంకావని ధర్మశాస్త్ర వేత్తలైన ఋషుల అభిప్రాయం.

మానవులకు జన్మ పరంపర ఉంటుంది. ఒక జన్మలో చేసుకున్న పుణ్యపాపాలు ఆ తరువాత జన్మలోకి వెన్నంటి వస్తాయి.

మానవుడు ఎప్పుడూ తనపని తాను చేయవలసిందే. వ్యతిరేక పరిస్థితులు వచ్చినప్పుడే అధైర్యపడకుండా ముందుకు సాగిపోవాలి. అయితే దైవాన్ని విస్మరించకూడదు. మానుషశక్తి కన్నా దైవశక్తిమిన్న అన్న భావంతో ప్రవర్తించాలి. ఫలితాన్ని ఆశించకుండా పని చేయాలి. ఈ నిష్కామ కర్మకు, భగవత్ శరణాగతి తోడుకావాలి. అప్పుడు భగవంతుడు జోక్యం చేసుకొని తన స్వరూపమైన సత్యాన్ని ప్రతిష్ఠిస్తాడు. 'సత్యమేవ జయతే' అనే పరమార్థాన్ని సాక్షాత్కరింపజేస్తాడు. శకుంతల కథలో ఇలాగే జరిగింది. "ఇంక దైవంబకాని యొండు శ˘ణంబు లేదు" అనుకోగానే ఆకాశవాణి యథార్థం పలికింది. కథ సుఖాంతమైంది.

మొత్తం మీద మానవుడు భౌతిక సంపదలకోసం మరోమానవుణ్ణి అర్థించడం మంచిదికాదని, భార్యను సంతానాన్ని గౌరవించడం ఉత్తమ మానవ లక్షణమని, ధర్మం, సత్యం శాశ్వతమైనవని, ధర్మచరిత్రులు తాత్కాలికంగా క్లేశాలు అనుభవించినా విజయం సాధిస్తారని శకుంతలోపాఖ్యానం సందేశం. అది ధర్మ సందేశం.

**ప్రశ్న.**

**3. నన్నయ కవితా నైపుణ్యాన్ని వివరించండి లేదా నన్నయ కవితారీతులను వివరించండి.**

నన్నయ మన తెలుగుసాహిత్యంలో ఆదికవి. విపుల శబ్దశాసనుడు. లోకజ్ఞుడు. ఉభయభాషాకావ్య రచనాభిశోభితుడు. ప్రతిభాభియోగ్యుడు. నిత్య సత్యవచనుడు. నన్నయ తమ ప్రభువైన రాజరాజనరేంద్రుడి ప్రేరణవల్ల భారతాంధ్రీకరణాన్ని ప్రారంభించాడు. ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలో దాదాపు సగం భాగం రచించాడు. ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో మన పాఠ్యభాగం శకుంతలోపాఖ్యానం ఉంది. అందులో నన్నయ తన కవితా కౌశలాన్ని చక్కగా ప్రదర్శించాడు.

నన్నయ తన కవిత్వంలోని ప్రధానాంశాలను గురించి 'సారమతిం గవీంద్రులు' అనే పద్యంలో వివరించాడు. అవి మూడు. 1. ప్రసన్న కథా కలితార్థయుక్తి 2. అక్షరరమ్యత , 3. నానారుచిరార్థ సూక్తినిధిత్వం.

ప్రసన్న కథాకలితార్థయుక్తికి కవితార్థయుక్తి అనే పాఠాంతరం కూడా ఉంది. కానీ ప్రసన్న కథా కలితార్థయుక్తి అనే పాఠమే అర్థవంతంగా పండిత లోకంలో ప్రచలితమైంది. ప్రసన్నమైన కథలతో కూడిన అర్థాల కూర్పు అనిదీనికి అర్థం. కొన్ని ప్రదేశాలలో పదాలలో నన్నయ ఆ కథాపరమార్థాన్ని నిక్షేపించాడు. ఆ పదాలను గమనిస్తే ఆ అర్థం అవగతమౌతుంది. సత్యం, వరం అనే పదాల్లో కణ్వాశ్రమంలో శకుంతలతోడి గాంధర్వ వివాహం, భరతుడి యౌవరాజ్యాభిషేకం మొదలైన కథాంశాలు ఇమిడి ఉన్నాయి. ప్రసన్నం అంటే తేటతెల్లం చేయడం. అంటే అనవసరమైన విషయాలను, చిక్కులను తొలగించడం. దుష్యంతుడు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకొని రాజ్యానికి వచ్చిన తరువాత కొన్నాళ్లకు కణ్వుడు శకుంతలను దుష్యంతుడి దగ్గరకు పంపేముందు ఉన్న శకుంతలా భారత కణ్వ సంభాషణను నన్నయ పరిహరించాడు. దానివల్ల కథకు ప్రసన్నత కలిగింది. ప్రసాదం రససమర్పక గుణం. కథను రసమయంగా చేస్తే ప్రసన్న కథ అవుతుంది. నన్నయ శకుంతలోపాఖ్యానాన్ని పాత్ర సంభాషణాదుల ద్వారా రసమయంగా తీర్చిదిద్ది అందులో కావ్యార్థాలను వాటితో పాటు చతుర్విధ పురుషార్థాలను ముఖ్యంగా ధర్మాన్ని నిక్షేపించాడు. ఈ ప్రసన్న కథా కవితార్థయుక్తిని కవిశ్రేష్ఠులు సారమతితో లోకశాస్త్రానుశీలన జనిత జ్ఞాన సంపన్నమైన బుద్ధితో లోనారసి చూడాలి.

ఇక అక్షర రమ్యత. ఇది అక్షరాల కూర్పులోని అందం; చెవికి ఇంపుగా ఉండే లక్షణం. నన్నయ సంహితాభ్యాసుడు కాబట్టి ఆయన కవిత్వం వేదనాదం లీనమై మోదదాయకంగా ఉంటుంది. 'విపరీత ప్రతిభాష లేమిటికి' అనే పద్యంలోని

"ముక్తాహార కర్పూర సాంద్ర పరాగ ప్రసరంబు ఁజందనముఁ

జంద్రజ్యోత్స్నయుం బుత్రగాత్ర పరిష్వంగము నట్లు

జీవులకు హృద్యంబే కడున్ శీతమే ?" అన్న చోటగల వృత్త్యను ప్రాసం అక్షరరమ్యతకు మూలంగా ఉంది. నన్నయ కవిత్వంలో ఈ వృత్త్యను ప్రాసం అధికంగా ఉంది.

నన్నయ తనకు 'నానారుచిరార్థసూక్తి నిధి' అనే విశేషణాన్ని ప్రయోగించుకున్నాడు. దాన్నే అతని కవిత్వానికీ అనుసంధించవచ్చు. అనేకమైన మనోహరమైన అర్థాలు కలిగిన సూక్తులకు నిధి అని దీనికి అర్థం. ఇవి - సూక్తులు - లోకంలో ప్రసిద్ధి చెంది ఉంటే కవులు స్వీకరిస్తారు. అలాగే కవులువాడడం వల్ల ప్రజలు స్వీకరిస్తారు. ఇందులో ధర్మం, లోకనీతి, రాజనీతి మొదలైనవి సారాంశప్రాయంగా ఉంటాయి.

శకుంతలోపాఖ్యానం సూక్తి రత్న రత్నాకరం :

1. ఎట్టి సాధ్వులకును ఁ బుట్టిన యిండ్లను
   బెద్ద కాలమునికి తద్ద దగదు.

2. తానతన నీడ నీళ్లల
   లోనేర్పడ జూచునట్లు లోకస్తుత త
   త్సూను జనకుండు సూచి, మ
   హానందము ఁ బొందు నతిశయ ప్రీతి మెయిన్.

3. సర్వ తీర్థాభిగమనంబు సర్వవేద
   సమధిగమము సత్యంబుతో సరియు ఁగావ - మొదలైనవి ఎన్నో ధర్మాలు ఇందులో ఉన్నాయి.

నన్నయ పాత్ర చిత్రణలోను, సంభాషణలను తీర్చిదిద్దడంలోను, హావభావాలను, మనస్సంఘర్షణను రూపు కట్టించడంలోను దిట్ట. శకుంతలా దుష్యంతుల సంభాషణలు అటువంటివి. దుష్యంతుడి చూపులు ప్రేమశూన్యాలు కావడాన్ని చక్కని ఆంగికాభినయంగా సంభావించవచ్చు. ఐతిహాసిక విషయాలను భావనచేసి వర్ణించడంలో నన్నయకు సాటి నన్నయయే. ఇతిహాసశైలిలో ఉపమాలంకారం అధికంగా కనిపిస్తుంది. శకుంతలోపాఖ్యానంలోను ఎన్నో ఉపమాలంకారాలు కనిపిస్తున్నాయి. మచ్చుకు రెండు.

(i) గార్హపత్యం అనే అగ్ని ఆహనీయంగా వెలిగేవిధంగా తండ్రి పుత్రుడై వెలుగుతాడు.

(ii) దీపంవల్ల మరొకదీపం ప్రభవించేవిధంగా నీ పుణ్యదేహంవల్ల ఈ కుమారుడు ప్రభవించి ప్రకాశిస్తున్నాడు.
ఈ విధంగా నన్నయ తన కవితానైపుణ్యంతో శకుంతలోపాఖ్యానాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాడు.

**ప్రశ్న.**

**4. నన్నయ ఆంధ్రీకరణ విధానాన్ని - శకుంతలోపాఖ్యానము ఆధారంగా నిరూపించండి.**

నన్నయ ఆదికవి. ఆయన ఆంధ్రీకరణానికి రాచబాటలు వేశాడు. సంస్కృతంలో వ్యాసమహర్షి రచించిన మహాభారతాన్ని వ్యాసహృదయానుకూలంగా నన్నయ ఆంధ్రీకరించాడు. కన్నడ కవులు వ్యాసహృదయానికి భిన్నంగా అర్జునుణ్ణి నాయకుడుగా చేసి రచించారు. కన్నడ కవుల ఆ మార్గాన్ని నన్నయ స్వీకరించలేదు.

అలాగని నన్నయ వ్యాసభారతాన్ని మక్కికిమక్కిగా ఆంధ్రీకరించలేదు. కొన్ని విషయాల్ని పరిహరిస్తూ, కొన్నింటిని పరిగ్రహిస్తూ, మార్పులు, చేర్పులు చేస్తూ నన్నయ రచించాడు. మూలంలో గహనంగా ఉన్న వేదాంత విషయాలను, పునరుక్తాలను, అనావశ్యకాలను నన్నయ పరిహరించాడు. మూలంలో తనకు సముచితమనిపించిన విషయాలను యథాతథంగా ఆంధ్రీకరిస్తూ ముందుకు సాగాడు.

నన్నయది అనువాదం కాదు. ఆంధ్రీకరణం. అనువాదం అంటే అనుసరించి పలకడం - చిలుకపల్లాగా. నన్నయ అలా చేయలేదు. ఎంతో స్వతంత్రించాడు. ఎన్నో మార్పులు చేర్పులు చేశాడు కదా ! అందువల్ల నన్నయది ఆంధ్రీకరణం. "తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" (ఆది. 1 - 16) అన్న తనప్రభువు రాజరాజనరేంద్రుడి అభ్యర్థనను పాటించాడు నన్నయ. ఆయన ఎంతో బుద్ధి బలంతో - సాహితీబలంతో - భారతాంధ్రీకరణం చేసి తిక్కనాది అనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

నన్నయ ఆంధ్రీకరణంలో ప్రధానంగా ఈ ఆరు పద్ధతులు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1. యథామూలకత | : | మూలంలో ఉన్నట్లే అనువదించడం. |
| 2. మూలకుంచనం | : | మూలంలో మరీ విస్తారంగా ఉన్న విషయాన్ని కుదించడం. |
| 3. మూల ప్రపంచనం | : | మూలంలో సంక్షిప్తంగా ఉన్న విషయాన్ని పెంచడం |
| 4. అన్యథా ప్రకల్పనం | : | మూలంలో ఒకవిధంగా ఉంటే వేరే విధంగా చెప్పడం |
| 5. మూలత్యాగం | : | మూలంలో ఉన్నదాన్ని ఆంధ్రీకరణంలో వదలిపెట్టడం |
| 6. అమూలకత | : | మూలంలో లేని విషయాల్ని కొత్తగా కల్పించడం |

ఇందులోని కొన్ని అంశాలను పరిశీలిద్దాం !

**1. యథామూలకత :**

శకుంతల దుష్యంతుడితో సత్యవాక్య మహత్త్వాన్ని గురించి చెప్పిన సందర్భంలో మూలంలో ఇలా ఉంది.

వరం కూపశతా ద్వాపీ
వరం వాపీ శతా త్క్రతుః
వరం క్రతుశతా త్పుత్రః
సత్యం పుత్రశతాద్వరమ్ - అనే శ్లోకాన్ని

'సుతజల పూరితంబులగు' పద్యంగా నన్నయ ఆంధ్రీకరించాడు. 'సుతజల పూరితంబులగు' అనే విశేషణాన్ని నన్నయ చేర్చాడు. అట్లాగే దుష్యంతుడికి 'సూనృతవ్రత' అనే సంబోధనను ప్రయోగించాడు.

**మూలకుంచనం :**

మూలంలో శకుంతల తన తల్లి దండ్రులైన మేనకా విశ్వామిత్రుల గొప్పతనాన్ని వర్ణించి, తన జన్మవృత్తాంతాన్ని, దుష్యంతుడు తనను గాంధర్వ వివాహం చేసుకోవడాన్ని పునరుక్తం చేసింది. నన్నయ తన రచనలో ఆ పునరుక్తిని పరిహరించి దాని సారాంశాన్ని "క్షత్రవరుడైన విశ్వామిత్రునకు" అనే కందపద్యంలో పొందుపరిచాడు.

**మూల ప్రపంచనం :**

మూలంలో శకుంతల దుష్యంతుడితో ఇలా అన్నది.

"ఆదిత్య చంద్రావనిలో 2 నలశ్చ
ద్యౌర్భూమి రాపో హృదయం యమశ్చ
అహశ్చ రాత్రిశ్చ ఉభే చ సంధ్యే
ధర్మ శ్చ జానాతి నరస్య వృత్తమ్" అనే శ్లోకాన్ని

నన్నయ "విమలయశోనిధీ" అనే పద్యంగా ఆంధ్రీకరించాడు.

మూలంలో 'వేద' వ్యాసుడు చెప్పని వేదాల్ని నన్నయ చేర్చాడు. ఇది నన్నయ వైదిక పునరుద్ధరణ దీక్షకు తార్కాణం. నన్నయ 'సంహితాభ్యాసుడు' కావడం కూడా దీనికి కారణం.

'విమలయశోనిధీ' అన్న సంబోధన కూడా సాభిప్రాయం "ఇది యుండగా నరుడు తక్కొన నేర్చునె తన్ను మ్రుచ్చిలన్" అన్నది భావ ప్రపంచనం.

పుత్ర స్పర్శను గురించిన ప్రస్తావనలో మూలంలో చందన ప్రసక్తి మాత్రమే ఉంది. నన్నయ ముత్యాలదండ, కర్పూరధూళి, చంద్ర జ్యోత్స్నలను కూడా కలిపి ఆ భావాన్ని ప్రపంచించాడు.

**అన్యథా ప్రకల్పనం :** మూలంలో దుష్యంతుడే శకుంతలను నీ రాకకు కారణమేమిటని అడిగినట్లు ఉంది. ఆ సందర్భంలో "తస్యోపభోగసక్తస్య స్త్రీ షుచాన్యాసు భారత" అని ఉంది. దుష్యంతుడి ఈ పరస్త్రీ భోగాసక్తతను నన్నయ పరిత్యజించాడు.

**మూలత్యాగం :**

మూలంలో శకుంతల దుష్యంతుడితో పలికిన మాటల్లో ఈ శ్లోకం ఉంది :

"పితా రక్షతి కౌమారే
భర్తా రక్షతి యౌవనే
పుత్రస్తు స్థావిరే భావే
నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి."

ఈ శ్లోకాన్ని నన్నయ తన ఆంధ్రీకరణంలో పరిహరించాడు.

"నేను కోరినట్లు చేయకపోతే నీ తల వందవక్కలౌతుం"దని శకుంతల దుష్యంతుణ్ణి అన్న పరుషోక్తుల్ని నన్నయ పరిహరించాడు. అలాగే దుష్యంతుడు శకుంతలను నిందించిన అవాచ్యాలను సైతం నన్నయ త్యజించాడు. "ఇట్టి లోకవిరుద్ధంబుల కేమోడుదుము" అని నన్నయ రచించాడు.

వ్యాసభారతంలో - దుష్యంతుడు శకుంతలను అంతఃపురానికి తీసుకొనిపోయి ఆమెను నూతన వస్త్రాలతోను, అన్నపానాలతోను గౌరవించినట్లు ఉంది. శకుంతలను భరతుణ్ణి దుష్యంతుడు తన తల్లికి పరిచయం చేసినట్లు, ఆమె పుత్రుణ్ణి కౌగలించుకొని కోడల్ని ఆశీర్వదించినట్లు ఉంది.

ఈ విషయాలు ప్రధానం కావని నన్నయ వదలివేశాడు. 'అతిప్రణయగౌరవంబున సంభావించి' అని మాత్రం సూచించాడు.

**అమూలకత :**

దుష్యంతుడు శకుంతలతో 'నేను నిన్నెరుగను' అన్నాడు. అప్పుడు ఆమె కన్నీటిని నన్నయ వర్ణించాడు. "కెందమ్మి రేకుల వలనం దొరంగు జలకణంబుల పోలె" అన్న ఉపమానం అమూలకం.

శకుంతల పుత్రుణ్ణి చూపిస్తూ దుష్యంతుడితో అన్న ఈ మాటలు అమూలకాలు.

"నీ పుణ్య తనువు వలనన
యీ పుత్రకు డుద్భవిల్లి యెంతయునొప్పున్
దీపంబు వలన నొండొక
దీపము ప్రభవించినట్లు తేజం బెసగన్"

ఈ విధంగా నన్నయ ఆంధ్రీకరణ విధానం మన పాఠ్యమైన శకుంతలోపాఖ్యానంలో అత్యుజ్జ్వలంగా కనిపిస్తున్నది. చాలా విశిష్టంగా ఉంటుంది. ఇది సోదాహరణ పూర్వక వివరణ.

**డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, ఎం.ఏ., పిహెచ్. డి.**
**ప్రిన్సిపాల్ & రీడర్**
**ఎస్.కె.ఆర్.బిఆర్. కళాశాల**

ఖండం -1 ప్రాచీన పద్యభాగము

# బెజ్జ మహా దేవి కథ - పాల్కురికి సోమన

## పాఠం - 3

1. 3. 0 - పరిచయం
1. 3. 1 - ఉద్దేశం
1. 3. 2 - పాఠ్యభాగ సందర్భం
1. 3. 3 - కఠిన పదాలకు అర్థాలు
1. 3. 4 - పాఠ్య భాగ వివరణ
1. 3. 5 - సందర్భ సహిత వ్యాఖ్యలు
1. 3. 6 - పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు.

**1.3. 0 పరిచయం :**

బెజ్జ మహాదేవి కథ అనే పాఠ్యభాగం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం తృతీయ శ్వాసం నుంచి గ్రహించబడింది.

వీరి శైవ కవుల్లో పాల్కురికి సోమన కాలాన్ని బట్టి కాకపోయినా కవితా పాటవాన్ని బట్టి ప్రథమ గణ్యుడు. ఆయన వీరి శైవవిజ్ఞాన సర్వస్వం. సోమన వరంగల్లు ప్రాంతంలోని పాల్కురికి గ్రామంలో క్రీ. శ 1160 ప్రాంతంలో జన్మించాడు. క్రీ.శ 1240 ప్రాంతంలో శివైక్యం పొందాడు. సోమన దాదాపు 25 గ్రంథాలు రచించాడు. 1192 ప్రాంతలో బసవపురాణాన్ని, 1230 ప్రాంతంలో పండితారాధ్య చరిత్రాన్ని రచించాడు. ఈ రెండు ఆయన ప్రసిద్ధ కావ్యాలు. సోమన ద్విపద కావ్య పథాన్ని తీర్చిదిద్దిన మహాకవి. ద్విపద కావ్యానికే కాక శతక ప్రక్రియకు కూడా మార్గదర్శి. ఆయన వృషాధిపశతకం తొలి తెలుగు శతకం. బసవోదారణాన్ని రచించి ఆ ఉదాహరణ ప్రక్రియకు కూడా ఒరవడి పెట్టాడు. రగడ ప్రక్రియకు కూడా ఆద్యుడు.

సోమన అచ్చమైన దేశికవి. ఆయన వస్తువు, భాష, ఛందస్సు - ఈ మూడింటిలో దేశీయతా ముద్ర వేశాడు. మార్గ కవిత్వంలో- సంస్కృతం పురాణేతిహాసాల్లో -ఉన్న వస్తువును స్వీకరించకుండా తన కన్నా ముందు జీవించిన బసవేశ్వరుడు, పండితారాధ్యుడు తదితర భక్తుల గాథల్ని గానం చేశాడు. తన పూర్వ కవులైన నన్నయాదుల లాగా వృత్తాదులకు ప్రాధాన్యం ఇవ్వకుండా ద్విపదచ్ఛందస్సును స్వీకరించాడు. రచనలో సకృత్తుగా సంస్కృత సమాసాలను ప్రయోగించినా తెలుగు పదాలను ప్రయోగించాలన్న ప్రధాన లక్ష్యాన్ని పెట్టుకొని దాన్ని సాధించాడు. ఆవకాశం లభిస్తే చాలు తెలుగు సంప్రదాయాల్ని, ఆచారాల్ని అతివేలంగా రాశిపోశాడు. ఆయన సంస్కృతాది బహుభాషా కోవిదుడైనా తెలుగుదనానికే తన కవిత్వాన్ని ముడుపు కట్టాడు.

పాల్కురికి సోమనాథ మహాకవి తన బసవపురాణంలో తన కవితా దృక్పథాన్ని ఇలా వివరించాడు.

“ ఉరుతర గద్య పద్యోక్తుల కంటె
సరసమైన పరఁగిన జానుఁదెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కి దైవాఱఁ
దెలుఁగు మాట లనంగ వలదు ; వేదముల
కొలదియ కాఁ జూడుడు......
అల్పాక్షరముల ననల్పార్థరచన
కల్పించుటయె కాదె కవి వివేకంబు ”
అంటూ కవిత్వంలో ‘పొదుపు’ ను కూడా (Economy of words) ప్రబోధించాడు.

సోమనాథ మహా కవిని అత్యంత ప్రభావితుణ్ణి చేసిన మహనీయుడు బసవేశ్వరుడు. తనకు సమకాలికుడైనా, చారిత్రక వ్యక్తి అయినా గాని బసవేశ్వరుణ్ణి పురాణపురుషుడుగా భావించాడు సోమన. బసవన్నకథను ప్రధానకథగా తదితర శివ భక్తులను కథలను ఉపాఖ్యానాలుగా

సోమన బసవ పురాణాన్ని వ్రాశాడు. ఇది జైన సంప్రదాయం. ఒక తీర్థంకరుడి కథ ఆధికారికం కావడం, ఇతర నిష్ఠాపరుల కథలు ఉపాఖ్యానాలుగావడం విశేషం. ఈ దృష్ట్యా బసవపురాణం పురాణమౌతుంది.

అద్వైతమతోద్ధారకుడైనా ఆదిశంకరుడి లాగానే బసవేశ్వరుడు చిరకాలం జీవించలేదు. ఇతడు క్రీ. శ/ 1132 లో జన్మించినట్లు కొంత మంది, క్రీ. శ. 1139 లో జన్మించినట్లు కొంతమంది భావిస్తున్నారు. వైశాఖశుద్ధ తదియ బసవ జన్మతిథి అని కర్ణాటక ప్రజలు జయంత్యుత్సవాలు జరుపుకుంటున్నారు. మొత్తం మీద 40 సంవత్సరాలులోపే జీవించాడు బసవేశ్వరుడు.

బసవేశ్వరుడు మాదిరాజు, మాదాంబ అనే బ్రాహ్మణ దంపతులకు నందికేశ్వరుడి అంశం వల్ల జన్మించాడు. చిన్నతనంలోనే జ్ఞాని అయ్యాడు. వర్ణవ్యవస్థను ధిక్కరించాడు. ఉపనయనాది బ్రాహ్మణ కర్మల్ని తిరస్కరించాడు. తల్లిదండ్రులను విడిచి వెళ్లిపోయి కళ్యాణ కటకంలో బిజ్జలుడి మంత్రిగా ఉన్న తన మేనమామ ఇంటికి చేరుకున్నాడు. మేనమామ కుమార్తె అయినా గంగాంబను బసవన్న కిచ్చి పెండ్లి చేశాడు. రాజాస్థానంలో ఉద్యోగం ఇప్పించాడు. క్రమంగా మామగారి అనంతరం మంత్రి అయ్యాడు. వీరశైవ మత ప్రచారానికి తన సర్వస్వాన్ని వినియోగించాడు. వీరశైవ కుటుంబాన్ని నానావర్ణ సమ్మిళితంగా దేశమంతా వ్యాపింపజేశాడు. బసవేశ్వరుడు కన్నడంలో మహాకవి; మధుర గాయకుడు. ఆయన నాలుగు లక్షల వచనాలు భక్తిగీతాలు వ్రాసినట్లు చెబుతుంటారు. "కూడలి సంగమేశ్వరా " అనేది మకుటం. బసవేశ్వరుడు తన వచనాలను గానం చేస్తుంటే శ్రోతలు పరశులై ఆయనకు అనుయాయు లయ్యేవారట !

ఈయన అనుచరుల్లో శరీర కష్టం చేసేవారు అధికం. 'కాయకమే కైలాసం' అన్నది బసవన్న ప్రబోధం. శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రబోధించిన కవియోగి బసవన్న.

### 1.3. 1 ఉద్దేశం :

పాల్కురికి సోమనాథుడుకి బసవపురాణంలోని అందమైన ఉపాఖ్యానాల్లో బెజ్జమహాదేవి కథ ఒకటి. ఇందులో స్త్రీ ఔన్నత్యం మాతృవాత్సల్యం , పరమేశ్వరుడి భక్తవాత్సల్యం మొదలైన అంశాలు గమనార్హాలు. తెలుగు సంప్రదాయాలు ముఖ్యంగా శిశుపోషణకు సంబంధించినవి ఎంతో హృద్యంగా ఈ పాఠంలో గోచరిస్తాయి.

### 1.3. 2 పాఠ్యభాగ సందర్భం :

బసవ పురాణంలోని ఉపాఖ్యానాల్లో సాహితీ ప్రియంభావుకులు సంభావించేవి నాలుగు. (1) గొడగూచి కథ (2) బెజ్జమహాదేవి కథ (3) కన్నప్ప కథ (4) సిరియాళుడి కథ. ఇందులో పరమరమణీయమైనది బెజ్జమహాదేవి కథ.

బసవపురాణం మొత్తం ఏడు ఆశ్వాసాల కావ్యం మొదటి ఆశ్వాసంలో కైలాస వర్ణనతో కథ ప్రారంభమౌతుంది. శివుడు నందికేశ్వరుణ్ణి భూలోకంలో బసవేశ్వరుడిగా జన్మించమని పంపిస్తాడు. బసవేశ్వరుడు జన్మిస్తాడు. ఆతరువాత తల్లిదండ్రులు వడుగు చేయబోగా వద్దని వాదిస్తాడు. బసవేశ్వరుడి వివాహం, సంగయ దేవుడు బసవేశ్వరుడికి ప్రత్యక్షమౌతాడు. తదుపరి ద్వితీయాశ్వాసంలో బసవేశ్వరుడు బిజ్జలుడి దగ్గర దండనాయకుడై కల్యాణకటకం చేరడం, బసవేశ్వరుడి శివాచారనిరతి, ఆయన వంగకాయలను లింగకాయలు చేయడం, జొన్నలను ముత్యాలుగా చేయడం, ఇంకా ఇతర శివ భక్తుల కథలు ఉన్నాయి.

తృతీయశ్వాసంలో బసవుడు తన భార్య చీరను విప్పించి ఒక జంగమానికి ఇంప్పించడం, ఆ తరువాత ముగ్ధ సంగయ్య కథ, రుద్రపశుపతి కథ, నక్కనైనారు కథ ఉన్నాయి. తరువాత కథ బెజ్జమహాదేవి కథ.

### 1.3. 3 కఠిన పదాలకు అర్థాలు

**పంక్తులు 550 - 560**

| | | |
|---|---|---|
| కటికంఠ | = | శివుడి యొక్క |
| శ్రీపాద | = | శోభగల పాదాలున్న |
| అంతరంగ | = | హృదయం కలిగింది |
| ఎల్లనియోగంబులు | = | ఆజ్ఞల ప్రకారం సేవించేవారందరూ |
| ఎల్లబాంధవులు | = | చుట్టాలందరూ |
| ఎల్లవారలు | = | (తదితరులు) అందరు |

| | | |
|---|---|---|
| భర్గునకున్ | = | శివుడికి |
| ఉదయించెన్ | = | పుట్టాడు |
| త్రైలోక్యపతికి | = | మూడు లోకాలకు ప్రభువైన శివుడికి |
| డస్సితిని | = | కృశించాను |
| ఇట్టిద కాదె | = | ఇట్లాంటిదే కదా ! |

**పంక్తులు 561 - 570**

| | | |
|---|---|---|
| తపస్వి | = | తపస్సు చేసే వాడు, కనిరింప దగ్గవాడు |
| జడల్+ గట్టు | = | నూనె రాయడం, దువ్వడం లేనందువల్ల కొన్ని వెంద్రుకలు ఒకదాని కొకటి అంటుకొని పోవడం |
| త్రావన్ + ఏల + ఇచ్చు | = | ఎందుకు త్రాగనిస్తుంది ? (త్రాగనివ్వదు) |
| తిరియన్ | = | భిక్షమెత్తడానికి |
| భువిన్ | = | భూమిమీదకు |
| సుతున్ | = | కుమారుణ్ణి |
| వల్లకాటికిని | = | శ్మశానానికి |
| ప్రల్లదుఁడు + ఐ | = | చెడ్డ పనులు చేసేవాడై |
| పాట్లకు వచ్చెన్ | = | ఆపదల పాలయ్యాడు. |

**పంక్తులు 571 - 580**

| | | |
|---|---|---|
| పలుమాఱు | = | చాలాసార్లు |
| పన్నుగా | = | చక్కగా |
| ఆఁకొనఁగాన్ | = | ఆకలి అయితే |
| కడుపు + అరసి | = | పొట్టచూచి |
| సాఁకించి | = | కాపాడేటట్లు చేసి |
| పెనుపదే | = | పెంచదా ? |
| జనని | = | తల్లి |
| పాటిజాతరలన్ | = | ఊళ్లో జరిగే శక్తి (అమ్మవారి) కొలువుల్లో |
| పోఁడిమి | = | సౌఖ్యం |
| వగవరే | = | దుఃఖించరా ? |

**పంక్తులు 518 - 590**

| | | |
|---|---|---|
| ఊరక | = | ప్రయత్నం చేయకుండా |
| ఉపేక్షించి | = | అశ్రద్ధ చేసి |
| హరునిన్ | = | శివుణ్ణి |
| అరసెదన్+కాక | = | విచారిస్తాను కాక |
| లోటులేకుండా | = | భేదభావం లేకుండా, కీడులేకుండా |
| పెనుచు | = | పెంచే |
| తరుణియ | = | స్త్రీయే |
| తల్లి ఎట్లుకాదు | = | తల్లి ఎలా కాదు ? |
| అనయంబు | = | అధికంగా, ఎల్లప్పుడు |
| తొంగిళ్లసైన + ఇడి | = | నూనె బొట్లు దేహం మీద |
| లింగమూర్తికిని | = | శివుడికి |
| అంగన | = | స్త్రీ (బెజ్జమహాదేవి) |

| | | |
|---|---|---|
| అభ్యంజనంబున్ | = | తలంటు స్నానం |
| కావించున్ | = | చేయిస్తుంది (తలకు పోస్తుంది) |
| ముక్కు+ ఒత్తున్ | = | ముక్కును నొక్కుతుంది |
| చెక్కు | = | చెక్కిలి, కపోలం |
| అక్కు | = | రొమ్ము |

**పంక్తులు 591 - 600**

| | | |
|---|---|---|
| వీడ్వడగన్ | = | విడిపోయేటట్లు |
| చరణముల్ | = | కాళ్లు |
| కరములు | = | చేతులు |
| చాగంగన్ + తిగుచు | = | సాగేటట్లు లాగుతుంది |
| అర్మిలిన్ | = | ప్రేమతో |
| జలములు | = | నీళ్లు |
| అంత + అంత | = | కొంచెం దూరంలో |
| వెగచి | = | వెక్కి వెక్కి ఏడ్చి |
| బెగడకుండన్ | = | భయపడకుండ |
| వెన్ను | = | వీపు నడిమి భాగాన |
| వ్రేయుచును | = | కొడుతూ |
| ఒగిన్ | = | క్రమంగా |
| మస్తకమునన్ | = | తలమీద |
| నీరు+ఒత్తు | = | నీటిని త్రోస్తూ తుడుస్తుంది |
| వదనంబు | = | నోటిలోకి |
| చొచ్చునో | = | ప్రవేశిస్తాయేమో |
| ఉదకంబులు | = | నీళ్లు |
| చెన్నుగాన్ | = | పద్ధతి ప్రకారం (చక్కగా) |
| పసుపు + ఆర్చి | = | పసుపు పూసి |
| మజ్జనము + చేయు | = | స్నానం చేయిస్తుంది |
| కాఁడంగన్+ ఊదు | = | నాటుకొనేటట్లు (గట్టిగా) ఊదుతుంది |

**పంక్తులు 601 - 610**

| | | |
|---|---|---|
| అంగిటిముల్లు | = | గొంతులో కలిగే వ్యాధి |
| అందంద | = | మరీ మరీ |
| తొంగిళ్లన్ | = | బొట్లు బొట్లుగా |
| కారు + నీరు | = | కారే నీటిని |
| తోన్ | = | వెంటనే |
| మిడుచు | = | నెటిక విరుస్తుంది |
| పడతి | = | స్త్రీ (బెజ్జమహాదేవి) |
| చేనీరన్ | = | చేతి నీటితో |
| తూపొడిచి | = | తూ తూ అంటూ ఉమ్మివేసి (దృష్టి దోష పరిహారార్థం) |

| | | |
|---|---|---|
| బొట్టు + ఇడును | = | బొట్టు పెడుతుంది |
| మడఁది | = | స్త్రీ (బెజ్జమహా దేవి ) |
| అంగుష్ఠంబు | = | బొటన వ్రేలితో |
| మన్ను +ఇంత | = | మట్టిని కొంచెం తీసుకొని |
| మెదిచి | = | నలిపి మెత్తగా చేసి |
| కడవన్ + అంటిన + అట్టి | = | నీరు కాచిన కుండ అడుగున అంటుకున్న |
| పిడుక విభూతి | = | కచ్చిక బూడిదను |
| అడరన్ | = | బాగా |
| నొసలు + ఆరంగన్ | = | నుదుటి నిండా |
| ఎత్తు + క్రుంగెడు + అని | = | ఎత్తు తగ్గుతాడనే నమ్మకంతో |
| ఎత్తంగన్ + వెఱచి | = | పైకెత్తడానికి భయపడి |
| ఇంతకన్ను+అగుననుచు | = | కళ్లు పెద్దవౌతాయనే నమ్మకంతో |
| మూడు కన్నులకు | = | మూడు కళ్లకూ |
| కలయన్ | = | ప్రతిదానికి సరిపోయేటట్లు |
| ఇడున్ | = | (కాటుకను) పెడుతుంది |

**పంక్తులు 611- 620**

| | | |
|---|---|---|
| పక్షులన్ + మీదన్ | = | పక్షులను తన కొడుకు మీదుగా |
| చనన్ + ఈదు | = | పోనివ్వదు. బిడ్డను ఆరుబయట పండుకోబెట్టదు. పక్షి పారిన దోషం వల్ల వ్యాధులు వస్తాయని నమ్మకం |
| ఆ+నాతి | = | ఆ స్త్రీ (బెజ్జమహాదేవి) |
| కొండొక | = | కొంచెం |
| చెక్కిలిన్ | = | బుగ్గమీద |
| గీటుడున్ | = | కొంచెం నొప్పి తగిలేటట్లు మీటితే, చిటికెవేస్తే, గిల్లితే |
| చెలఁగి | = | ఎక్కువగా |
| ఒక్కవేలు +ఇడి | = | ఒక వేలును ఒక ప్రక్కన అడ్డం పెట్టి |
| ఒక కొన్ని పాలు | = | కొంచెం పాలు |
| ఉగ్గులు | = | శిశువులకు కలిపి పోసే చనుబాలు, ఆముదం |
| ఉవిద | = | స్త్రీ (బెజ్జమహాదేవి) |
| అగ్గించు | = | పొగడుతుంది |
| చొగియించును | = | నొప్పిస్తుంది (ఏడ్పిస్తుంది) |
| నొగియించును | = | నవ్విస్తుంది |
| అటన్ | = | ఆ తరువాత |
| పన్నుగాన్ | = | చక్కగా |
| ఉదరంబున్ | = | పొట్టను |
| కున్నన్ | = | కూనను (పసివానిని) |
| జో+ చఱచుచు | = | జో కొడుతూ |
| సన్నుతిన్ + పాడున్ | = | చక్కని భగవత్ స్తోత్రాల్ని గానం చేస్తుంది. |

**పంక్తులు 621- 630**

| | | |
|---|---|---|
| ఈ+ భంగి | = | ఈ విధంగా |
| నిశ్చల | = | అచంచలమైన |
| ముగ్ధభావంబునకును | = | అమాయకమైన హృదయానికి |
| చేకొని+ఉండెన్ | = | స్వీకరించాడు. |
| శ్రుతి | = | వేదం |
| ఏక ఏవ హి రూపేణ | = | రూపంచేత ఒక్కటే |
| స్మృతి | = | ధర్మం శాస్త్రం |
| సాధకః సంస్మరేత్ సదా | = | సాధకుడు ఎల్లప్పుడూ (భగవంతుణ్ణి) మననం చేసుకోవాలి. |
| ధరన్ | = | భూమి మీద |
| తస్య తన్మయతాం యాతి | = | అతడి కోసం అదే రూపం పొందుతాడు, సాధకుడు కోరిన రూపాన్నే భగవంతుడు పొందుతాడు |

**పంక్తులు 631 - 640**

| | | |
|---|---|---|
| భక్త మండలి | = | భక్త సమూహం |
| వినుతింపన్ | = | పొగడగా |
| చనఁగన్ | = | గడిచిన తరువాత |
| ఆ+దేవదేవుండు | = | ఆ దేవతలకు దేవుడైన శివుడు |
| వెండి | = | మరి, తరువాత |
| దండిరోగంబు + ఐన | = | మహా వ్యాధి కలుగగా |
| తఱుచంటిక్రియను | = | తీవ్రమైన తీరులో |
| నోరు సంధిల్లన్ | = | నోరు పడిపోగా, దవడలు అంటుకొని పోగా |
| బిట్టు | = | చాలా |
| బిమ్మిటిన్ | = | వివశత్వంతో |
| కొట్టి | = | సమీపించి |
| నా పట్టి | = | నా కుమారా ! |
| నా చిన్న వడుగ | = | నా చిన్న బ్రహ్మచారీ ! |

**పంక్తులు 641 - 650**

| | | |
|---|---|---|
| ఎల్ల + ఎడన్ | = | అంతటా, ఈ లోకం మొత్తంలో |
| ఒరులన్ | = | ఇతరుల్ని |
| తలరక | = | కలత లేకుండా, దిగులులేకుండా |
| తరియింతును | = | ఆపదను దాటతాను |
| అజిమి + ఓ | = | అజీర్ణమో (?) |
| కోప + ఓ | = | కంఠవ్యాధియో |
| అంగిటి ముల్లు + ఒ | = | కొండనాలుక రోగమో (చిరునాలుక) |

**పంక్తులు 651 - 660**

| | | |
|---|---|---|
| పనవున్ పలవరించున్ | = | దుఃఖంతో అర్థం లేకుండా అతిగా మాటాడుతుంది |
| మై + ఉడ్కు | = | శరీరోష్ణం |
| కప్పు | = | దుప్పటి కప్పుతుంది |

| | | |
|---|---|---|
| తెఱచు | = | దుప్పటి తీస్తుంది |
| క్రమ్మఱన్ | = | మళ్లీ |
| తప్పక వీక్షించున్ | = | అలాగే చూస్తుంటుంది |
| తల్లడంబు + అందు | = | సంచలిస్తుంది |
| పొంగెడు కడుపు ముప్పునను | = | పొర్లుతూ ఉన్న గర్భశోకంతో |
| బొప్పనికి | = | అమాయకుడైన పసివాడికి |
| నరులు | = | ప్రజలు |
| అడలుచు | = | భయపడుతూ |
| జడధి | = | సముద్రం |
| ఎడ+పోయి | = | రాయబారం చేసి |

**పంక్తులు 661 - 670**

| | | |
|---|---|---|
| కునియుచు | = | తూగుతూ |
| అచ్చెరువుగ | = | ఆశ్చర్యంగా |
| బడలి | = | అలసి పోయి |
| వెడ + ఆటలు | = | అల్పమైన ఆటలు, పనికి రాని ఆటలు |
| వేఁగి | = | తపించి |
| గ్రక్కున | = | తొందరగా |
| పిట్టు | = | వండిన పిండి |

**పంక్తులు 671 - 680**

| | | |
|---|---|---|
| కామింపగా | = | తినమని కొరగానే |
| మఱఁగున | = | చాటున |
| నమిలి | = | తిని |
| పులి + అంబకళము | = | పులిసిన అంబటి పిండి, నూకలు చేర్చి అనుకుగా వండిన పదార్థం |
| ఎడపగా | = | ఆపకుండా |
| చవి+ ఐన | = | రుచిగా ఉన్న |
| కోరతోన్ | = | గిన్నెతో |
| కొని | = | తీసుకొని |
| ఆరగించి | = | తిని |
| చే కళ్లకు | = | చేతి ముద్దలకు |
| అంతటన్ + పోక | = | దానితో ఆగకుండా |

**పంక్తులు 681 - 690**

| | | |
|---|---|---|
| నెలఁతుక | = | స్త్రీ |
| ఆఱడి పుచ్చున్ + కూడునే | = | నిందల పాలు చేయవచ్చా ? వ్యర్థురాలినిగా చేయవచ్చా ? |
| మలమల మఱుగచున్ | = | ఆకలితో మలమలా మాడుతూ |
| ఇలన్ | = | భూమి మీద |
| ఆడన్ + ఏలా | = | వాద్యానుకూలంగా నృత్యం చేయడం దేనికి ? |
| కొలఁది తప్పిన | = | మితిమీరిన |

| | | |
|---|---|---|
| కుడ్పు | = | భోజనం |
| కుడవంగన్ + ఏల | = | తినడం దేనికి |
| పైకుడ్పులు | = | పై తిండ్లు |
| కడుపు + ఊదదు + అయ్యేడు | = | పొట్ట ఉబ్బరించకుండా ఉంటుందా? |
| చెపుమ | = | చెప్పు |
| ఎయిదదు + ఏ | = | సరిపోదా ; రుచించదా ? |
| ఆదటలేక | = | తృప్తి లేకుండా |

**పంక్తులు 690 - 700**

| | | |
|---|---|---|
| ఏ+ఎడ | = | ఎప్పుడుకూడా |
| వంచింపన్ | = | శక్తి వంచన చేయలేదు |
| రేయి + పగలున్ | = | రాత్రియును, పగలును |
| సిత గుండు | = | (కట్టబడిన వాడు, చుట్టబడిన వాడు), తల్లిని వదలని పెంకె పిల్లవాడు |
| ఒండు | = | వేరే కారణాల వల్ల కలిగిన |
| వేసరన్ | = | శ్రమతో |
| ఆసరన్+కన్నా | = | (ఆశ్రయం పొందిన ) కూడిన |
| జననిన్+కదా+అని | = | తల్లిని గదా అని |
| చనవునన్ | = | ప్రేమతో కూడిన అధికారంతో |
| పలుకన్ | = | ఏమీ అనను, ఎప్పుడూ అనను |
| తెల్లము | = | స్పష్టం |
| ఇప్పుడు | = | వర్తమానంలో |
| మీఁదన్ | = | భవిష్యత్తులో |
| తొల్లి | = | గతకాలంలో |
| నా+ అట్టి | = | నా వంటి ఓర్పు కలిగిన |
| తల్లులు+కలరె | = | తల్లులు ఉన్నారా ? (లేరు) |
| పనుగొనన్ | = | దృఢంగా (నిశ్చయంగా) |
| అనురక్తిన్ + కొని + ఆటకు | = | ప్రేమతో నిన్ను ముద్దుగా ప్రశంసించడానికి |
| నీవు+ఎ సాక్షి | = | నీవే సాక్షివి |

**పంక్తులు 701 - 710**

| | | |
|---|---|---|
| ఎట్టు +ఏని | = | ఎలాగైనా |
| మా+ఉంచిన+అట్టుల+ఉండి | = | మేము ఉంచినట్లుండి |
| ఏ+పాట | = | ఏ విధంగానైనా |
| తెవులు | = | వ్యాధి |
| సిద్ధించెన్ + కాక | = | కలిగింది ( వచ్చింది) కాని |
| ఈ సంకటంబు | = | ఈ ఇరుకున పడడం, ఈ ఆపద |
| వీఱిడితనము | = | అవివేకం |

**పంక్తులు 711 - 720**

| | | |
|---|---|---|
| శిరమునకు | = | తలకు ( తలమీద) |
| అలుగన్ + ఉన్న+ అంత | = | కోపింప బోతూ ఉన్నప్పుడు అంటే తల పగల గొట్టుకో బోతున్నప్పుడు |

| | | |
|---|---|---|
| అభిమతంబు | = | అంగీకారం (కోరిక) |
| అనుడున్ | = | అనగా |
| కొఱత | = | లోటు |
| నిరోగివి + ఐ | = | రోగరహితుడవై |
| నిత్యుండవై | = | చిరంజీవివై, |
| సుఖ+ అవాప్తిన్ | = | సుఖాలను పొంది |
| అగ్గలము | = | అధికం |
| ఈప్సితంబు | = | (నేను) కోరుకునేది |

**పంక్తులు 721 - 730**

| | | |
|---|---|---|
| మంద స్మిత | = | చిరునవ్వుతో కూడిన |
| ముఖ+ అరవిందుడు + ఐ | = | ముఖ పద్మం కలవాడై |
| అందంద | = | మళ్లీ మళ్లీ |
| కౌగిటన్ | = | కౌగిలిలో |
| అప్పళింపుచును | = | కప్పి వేస్తూ |
| ముత్త + అవ | = | వృద్ధురాలైనా అవ్వ (నాయనమ్మ) |
| నిత్యత్వము | = | శాశ్వతత్వం |
| అనుపమ | = | సాటిలేని |
| పరమ | = | ఉత్కృష్టమైన |
| పరా+ఆనందమూర్తి | = | మోక్షానందరూపిణి అయిన బెజ్జమహాదేవి |
| అమ్మ + అవ్వ | = | అమ్మ అయిన పూజ్యురాలు |
| నామము | = | పేరు |

## 1.3.4 పాఠ్య భాగ వివరణ :

బెజ్జమహాదేవి శివుని పాద పద్మాలను తన హృదయంలో నిలుపుకొన్న భక్తురాలు. ఆమె ఇలా ఆలోచించింది.

శివుడికి సేవకులు బంధువులూ అందరూ ఉన్నారు. కాని తల్లి లేకపోవడం విచిత్రం. అసలు, తల్లి లేకుండా ఆయన ఎలా జన్మించాడు ? అందువల్ల పరమేశ్వరుడి తల్లి లేక పోవడం కాదు, ఆమె చనిపోయిఉంటుంది. తల్లి చనిపోవడం వల్లనే నేను కృశించాను. అందరికీ మాతృవియోగ దుఃఖం ఇలాంటిదే ? శివుడి తల్లి బ్రతికి ఉంటే ఆయనను దయనీయ స్థితిలో వదిలేదా ? తపస్సు చేసుకోవడానకి అనుమతించేదా ? తలను జడలు గట్టనిచ్చేదా ? హాలాహల విషాన్ని త్రాగనిచ్చేదా ? గజచర్మాన్ని పాముల్ని ధరించ నిచ్చేదా ? బూడిదను పూసుకోనిచ్చేదా ? భిక్షం ఎత్తుకోవడానికి పంపేదా ? వల్ల కాటిలో నివసిస్తానంటే పంపేదా ? తల్లి లేని కుమారుడు కాబట్టి చెడ్డ పనులు చేసి ఇన్ని ఆపదలు పొందాడు.

తల్లి ఉన్నట్లయితే స్తన్యమిచ్చి, ఇంకా పాలు పోసి వెన్న పెట్టి, ఆకలైతే పొట్ట చూచి మళ్లీ మళ్లీ పాలిచ్చి సాకి పెద్దవాణ్ణి చేసేది కాదా ? తల్లి లేకపోతేనే ఆయన ఇంత పెద్దవాడయ్యాడు ! తల్లి ఉంటే ఇంకా ఎంత పెద్దవాడయ్యేవాడో ? ఎంత మగపిల్లలైనా పెండ్లిండ్లు, నోములు, పేరంటాలు, పండుగలు, కొలువులూ వచ్చినప్పుడు అలంకరించి సౌభాగ్యాన్ని కలిగించే తల్లి లేకపోతే దుఃఖపడరా మరి! అందువల్ల నేను ఏమీ ప్రయత్నం చేయకుండా అశ్రద్ధ చేయడం ఉచితం కాదు. నేను ఎంతో ప్రేమతో తల్లినై శివుడి కష్ట సుఖాలను విచారిస్తాను. ఇలా భేదభావం లేకుండా లోటు లేకుండా కీడు కలగకుండా పెంచే స్త్రీ శివుడికి తల్లి ఎందుకు కాదు ?

బెజ్జ మహాదేవి ఈ విధంగా ఆలోచించి పరమేశ్వరుణ్ణి కుమారుడిగా చేసికొని ఉపచారాలు చేస్తున్నది. కుమారుడి దేహం మీద నూనె బొట్లు వేసి తలంటు స్నానం చేయిస్తుంది. ముక్కును చెంపలను, వక్షఃస్థలాన్ని, కడుపుని ఒత్తుతుంది. మూడు కళ్లనూ స్పృశిస్తుంది. వీపును

నిమురుతుంది. బిడ్డ బాగా పెరగాలని కాళ్లను చేతుల్ని బాగా విడదీసి లాగుతుంది. బాగా నలుగు పెడుతుంది. బోర్ల పండుకోబెట్టి వెన్ను మీద కొడుతుంది. కుమారుడి తలమీద నీటిని దోసిటితో తోస్తూ తుడుస్తుంది. నీళ్లు నోటిలోకి ప్రవేశించకుండా నోటికి అడ్డం పెడుతుంది. పొట్టను కూడా అదుముతుంది. చక్కగా పసుపు పూసి స్నానం చేయిస్తుంది. కళ్లను చెవుల్ని గట్టిగా ఊదుతుంది. వ్రేలితో అంగిట్లో ఒత్తి కఫాన్ని తొలిగిస్తుంది. చిరునాలుక కాకుండా చూస్తుంది. నీళ్ల బొట్లను తుడిచి ప్రేమతో నెటికలు విరుస్తుంది. బెజ్జమహాదేవి చేతిలో నీరు నోట్లో పోసుకొని తూతూ అంటూ ఊసివేస్తుంది.

బెజ్జమహాదేవి బొటన వ్రేలితో కొంచెం మట్టి తీసుకొని మెత్తగా నలిపి బొట్టు పెడుతుంది. నీళ్లు కాచిన కుండ అడుగున ఉన్న పిడుకల బూడిదను నొసలి నిండా పూస్తుంది. ఎత్తుకున్నప్పుడు తన కన్నా ఎత్తు ఎత్తితే తన కొడుకు ఎత్తు పెరగడన్న భయంతో రొమ్ముకు హత్తుకుంటుంది. కాటుక పెడితే కళ్లు పెద్దవి అవుతాయన్న నమ్మకంతో ప్రతి కంటికి బాగా కాటుక పెడుతుంది. ఇలా మూడు కళ్లకూ పెడుతుంది. పుత్రుడకి పాలు ఇస్తుంది. బిడ్డను ఆరుబయట పండ బెట్టదు. అకాశంలో చరించే పక్షులు బిడ్డ పైగా వెళ్లితే అనారోగ్యం కలుగుతుందని భయం. పక్షిదోషం కలగకుండా ఉండటానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది.

బెజ్జమహాదేవి తన కొడుక్కి కొంచెం వెన్న పెడుతుంది. బుగ్గగిల్లి, బిడ్డ ఏడుస్తూ నోరు తెరిచినప్పుడు నోటిలో దవడ ప్రక్కన వేలు బెట్టి ఉగ్గుపాలు పోస్తుంది. అప్పుడప్పుడు మురిసిపోతూ కొడుకును మెచ్చుకుంటూ ఉంటుంది. నొప్పి కలిగిస్తుంటుంది. బుజ్జగిస్తుంది ముద్దాడుతుంది, నవ్విస్తుంది, ముద్దులు పెట్టమని అడుగుతుంది. "ఈయన ఎవరో" ! అని తానే బిడ్డ పెదవులకు తన చెక్కిళ్లను అద్దుకుంటుంది. తన పొట్టను పాన్పుగా చేసి బిడ్డను పండుకో బెట్టుకొని జో కొడుతుంది. చక్కని భగవత్ స్తోత్రాలను పాడుతుంది.

ఈ విధంగా బెజ్జమహాదేవి శివుణ్ణి స్తుతిస్తున్నది. అమె ఆమాయక హృదయాన్ని శివుడు కూడా మెచ్చుకొని ఆమె చేస్తున్న బాల్యోపచారాల్ని స్వీకరిస్తున్నాడు. వేదం 'ఏక ఏవహి రూపేన' (రూపంచేత ఒక్కటే) అని, ధర్మశాస్త్రం "సాధకః సంస్మరేత్ సదా" (సాధకుడు ఎల్లప్పుడూ దేవుణ్ణి తలచాలి అని, భక్తుడికి తాను కోరిన రూపంలోనే భగవంతుడు సాక్షాత్కరిస్తాడని చెబుతున్నాయి. ఇవన్నీ ఈశ్వర వాక్కులే. అవి తప్పవు. భక్తుడు ఏ విధంగా భావిస్తే శివుడు మానవుడిగా ఆ రూపంలోనే అతనికి అందుబాటులో ఉంటాడు. బెజ్జమహాదేవి శివుణ్ని కొడకుగా భావించింది. శివుడు ఆ రూపంలోనే ఆమె బాల్యోపచారాన్ని అందుకున్నాడు. విజ్ఞానులందరూ ఈ సన్నివేశాన్ని సన్నుతిస్తున్నారు, కొన్ని రోజులు దొర్లాయి.

ఆ తరువాత మహేశ్వరుడు తన తల్లి అయిన బెజ్జమహాదేవికి ప్రసన్నుడుకావాలనుకున్నాడు. ఇక ఆ బాలుడికి తీవ్ర రూపంలో మహావ్యాధి వచ్చింది. నోరు అంటుకుపోయింది. అసలు నోరు తెరువడం లేదు.

కొడుకు అనారోగ్యాన్ని చూచి బెజ్జమహాదేవి చాల ఉలికి పడింది. వివశురాలైంది. ఆమె దేహం స్వాధీనంలో లేదు. మహావిపన్మగ్నురాలైంది. ఇలా శోకిస్తున్నది.

ఓ నా ప్రియ కుమారా ! ఎందుకు పాలు త్రాగడం లేదు? నీ చెమటలు చూస్తేచాలు నేను రక్తసిక్తనౌతాను. ఈ పరిస్థితిలో నిన్ను చూడలేను ! కన్న కడుపు గదా ఎలా సహించగలను ! నువ్వు తప్పక నాకు ఎవరున్నారు. లేక లేక ఒక్కడివి పుట్టావు ! నేను సంచలించకుండా ఎలా ఉంటాను? ఈ ఆపదను ఎలా దాటతాను? నాకు నేలమీద కాళ్లు నిలవడం లేదు తండ్రీ ! ఎందుకు మాటాడడం లేదు? చెప్పు నీకు అజీర్ణ వ్యాధి వచ్చిందా ? కంఠవ్యాధి వచ్చిందా ? చిరునాలుక వ్యాధి వచ్చిందా ? నేనేమీ మందు మాకులు తెలిసినదాన్ని కాదు. అని ఇలా దుఃఖంతో రొల్లుతూ ఉంటుంది. పైనబడి పొర్లుతుంది. శరీరోష్ణాన్ని చూస్తూంటుంది. కౌగిలించుకొంటుంది. బిడ్డకు దుప్పటి కప్పుతుంది, తీస్తుంది. మళ్లీ కప్పుతుంది, మళ్లీ తీస్తుంది. కుమారుడి వైపే రెప్ప ఆర్పకుండా ఒకే చూపు చూస్తుంది. ఆ తల్లి తల్లడిల్లి పోతుంది. ఇలా గర్భశోకాన్ని అనుభవిస్తుంది. చూడడానికి వచ్చిన ప్రజలు అంగిటిముల్లు అయిందని అనగానే ఆమె భయపడి మహాశోక సముద్రంలో పడి తేలుతున్నది.

బెజ్జ మహాదేవి పుత్రుణ్ణి చూచి ఇలా అంటున్నది. నీకు పొట్టలో కొంచెం వెలితి రాగానే ఒడయనంబి దగ్గరకు వెళ్లి దౌత్యం చేశావు. అక్కడ తినడానికి లేకపోయేసరికి కుమ్మరి గుండయ్య దగ్గరకు వచ్చావు. అతడు వాద్యం వాయిస్తుండగా నాట్యం చేశావు. తీసుకొని తినడానికి అక్కడ కూడా ఏమీ లేకపోయేసరికి చేరమ చక్రవర్తి దగ్గరకు వెళ్లావు. ఆయన వాద్య వాదనం చేస్తుంటే ఆశ్చర్యం కలిగేటట్లు నాట్యం చేశావు. ఆకలితో అలసిపోయావు. 'ఇలాంటి పనికిరాని చిందులు ఎన్ని వేసినా కడుపునిండుతుందా' అని తొందరగా తిరిగి వచ్చావు.

ఆ తరువాత ఆకలి తీర్చుకోవడాని పిట్టవ్వ దగ్గరకు వచ్చావు. అక్కడ రాజకార్యంలో కూలిపని చేశావు. చిట్ట చివరకు అక్కడ కాస్త పిట్టు తిన్నావు. తరువాత సామవేదులవారి ఇంటికి వెళ్లావు. అక్కడ వారు చచ్చిన పెయ్యను వండి పెడితే తిన్నావు. ఆ తరువాత కరికాళవ్వ ఇంట్లో మామిడి పండ్లు రహస్యంగా తిన్నావు. అక్కడనుంచి చెన్నయ ఇంటికి వెళ్లావు. పులిసిన అంబలిని ఆపకుండా జుర్రుకున్నావు. అనంతరం చిరుతొండనంబి ఇంటికి వెళ్లావు. అతని కొడుకు మాంసాన్ని అడిగి అడిగి వండించుకొని తిన్నావు. వెంటనే నిమ్మవ్వ ఇంటికి వెళ్లి భోజనం చేశావు. చోడవ్వ దగ్గరకు వెళ్లి ఆమె గిన్నెనిండా పులగం పెడితే తిన్నావు. తదుపరి సురియ చౌడయ్య పెట్టే చేతి ముద్దలకు ఆశపడి తిన్నావు. ఒకామె నిన్న ఈ విషయాలన్నీ చెప్పింది.

ఓ కుమారా ! నన్ను ఇలా ఎందుకు నిందల పాలు చేస్తావు? పనికి మాలినదాన్ని చేస్తావు. అసలు నీవు ఆకలితో మలమలమాడుతూ నానా ప్రదేశాలు తిరగడమెందుకు ? మితిమీరిన తిండి తినడం ఎందుకు ? ఇలా పై తిండ్లు తినడం బ్రతకడానికేనా ? ఇట్లా తింటుంటే కడుపు ఉబ్బకుండా ఎలా ఉంటుంది ?

నీకు త్రాగడానికి నా పాలు ఇస్తున్నాను. ఇంకా చాల సార్లు వెన్న, పాలు వేళ తప్పకుండా ఇస్తున్నాను. మన ఇంట్లో లేకపోతే ఎక్కడనుంచైనా తెచ్చి నీకు పెడుతున్నాను. ఇది నీకు చాలడం లేదా? రుచించడంలేదా ? ఇతరుల ఇండ్లకు వెళ్లి, అందులోను ఆత్మగౌరవాన్ని వదలి వాళ్లను అడిగి పెట్టించుకొని తిన్నావు. ఇప్పటిదాక నీకు ఆహారం ఎలా సరిపోయింది ? నిన్న ఒక్కరోజే నీ పొట్ట ఎందుకు నిండలేదు? పగలైనా రాత్రిఅయినా నీకు ఆహారం నేను శక్తి వంచన లేకుండా పెడుతున్నానుకదా ? ఎప్పుడు నీవు చంకదిగని పెంకె పిల్లవాడివి.

నీవు ఇలా చేశావు అలా చేశావు అని నేను ఎంత విసుగుతో ఉన్నప్పుడు కూడా నిన్ను అనలేదు. తల్లిని కదా అనే ప్రేమాధికారాలతోనూ అనలేదు. ఈ విషయం నీకు కూడా తెలిసిందే. భూత వర్తమాన భవిష్యత్కాలలో, మూడు లోకల్లోను నాలాంటి సహనం గల తల్లులున్నారా? నేను గట్టిగా త్రికరణశుద్ధిగా నిన్నే నా ప్రాణంగా భావించి మెచ్చుకోవడానికి నీవే సాక్షివి. నీకు అన్ని తెలుసు గదా !

నేను ఉండమన్నట్లు ఉండి పెట్టినది తింటే ఈ జబ్బు, ఈ నొప్పి ఎందుకు వస్తాయి ? నిప్పుకు చెదలంటుతుందా ? నీ చేతులారా చేసుకున్నావు. స్వయంకృతాపరాధం వల్లే నీకు ఈ వ్యాధి వచ్చింది లేకపోతే ఎందుకు వస్తుంది ? మాటలవల్ల రోగం నయమవుతుందా? నా అవివేకం గాని, నిన్ను ఈ విషయాలు అడగడం ఎందుకు ? నేను నీ బాధను ఇంక చూడలేను. కుమారా ! నీ కోసం ప్రాణాలు వదలుతాను.

బెజ్జమహాదేవి ఈ విధంగా అంటూ తన శిరస్సును పగుల గొట్టుకోబోయింది. అంతలో శివుడు ఆమెకు ప్రత్యక్షమై 'చిరునవ్వుతో నవ్వుతూ నీ ఇష్టం ఏమిటో కోరుకో' ! ఇస్తాను అన్నాడు.

అప్పుడామె "కుమారా" ! నాకు కోరిక లేదు, ఏ లోటు లేదు, నీవు రోగం నొప్పి లేకుండా కలకాలం సుఖంగా ఉండు ! నాకు అంతే చాలు ! కన్న ప్రేమ కన్నా పెంచిన ప్రేమ ఎక్కువ అంటారు. అందువల్ల నిన్ను కళ్లారా చూస్తూ ఇక్కడ ఉండడమే నా కోరిక" అన్నది.

శివుడు ఆ మాటలు విని చిరునవ్వుతో చిందుతున్న ముఖ పద్మంతో తల్లిని గాఢాలింగనం చేసుకొని ఇలా అన్నాడు. నీవు నాకు తల్లివి కాబట్టి మూడు లోకాలకు ముత్తవ్వవు. అమ్మా ! నీలాంటి అమ్మ నాకుండగా నాకు రోగాలెందుకు వస్తాయి? ఇలా అని ఆమెకు శాశ్వతమైన కైవల్యాన్ని ప్రసాదించాడు.

బెజ్జ మహాదేవి మహోత్కృష్ట మోక్షానంద రూపిణి అయింది. జగత్పిత అయిన శివుడికి మాతృమూర్తి కావడంవల్ల ఆమె అమ్మవ్వ అయింది. అంటే అమ్మ అయిన పూజ్యురాలైంది.

## 1.3.5 సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. తల్లి లేకుండుఁట విచిత్రంబు !

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణం తృతీయాశ్వాసంలోని బెజ్జమహాదేవి కథనుంచి గ్రహించబడింది. (ఈ కవి పరిచయం ప్రతి సందర్భంలోనూ వ్రాయాలి.)

**సందర్భం :** శివభక్తురాలైన అందునా ముగ్ధ భక్తురాలైన బెజ్జమహాదేవి శివుడికి సేవకులు బంధవులు ఉన్నారు. కాని తల్లి లేదని బాధపడే సందర్భంలోనిది ఈ వాక్యం.

వివరణ : శివుడికి తల్లి లేకపోవడం వింత అని ఆమె భావిస్తున్నది. ఆయన ఆది మధ్యాంతరహితుడన్న ఆలోచన ఆమెకులేదు. మానవ మాత్రుడిగా భావించింది. ఆమె అమాయిక ప్రవృత్తికి ముగ్ధ భక్తికి ఈ వాక్యం నిదర్శనం.

**2. ఎల్ల వారికి దుఃఖ మిట్టిద కాదె !**

సందర్భం : శివభక్తురాలైన బెజ్జమహాదేవి శివుడికి మాతృవియోగం కలిగి ఉంటుందని, తనకు తల్లి మరణించడంవల్ల ఎంతో బాధకలిగింది కదా ! అని భావించే సందర్భంలోనిది ఈ వాక్యం.

వివరణ : అందరికీ దుఃఖం ఇలాంటిదే కదా అని భావం. మాతృవియోగం వల్ల తనకు దుఃఖం, కార్శ్యం కలిగినట్లే అందరికీ కలుగుతుంది కదా అని బెజ్జమహాదేవి ఆలోచించింది. శివుడిని కూడా మాతృవియోగ దుఃఖం కుంగ దీసి ఉంటుందని ఆమె భావించింది. అందరినీ తనలాగా భావించే మంచి హృదయం బెజ్జమహాదేవిది. 'ఆత్మవత్సర్వభూతాని' అన్న ఆర్యోక్తి ఆమెపట్ల అక్షరాలా నిజం.

**3. తల్లి యున్న విషంబు ద్రావ నే లిచ్చు ?**

సందర్భం : శివుడు తల్లి బ్రతికి ఉంటే ఆయనను తపస్సుకు అనుమతిస్తుందా ! నూనె రాసి తలదువ్వకుండా, జడలు కట్టనిస్తుందా ! అని బెజ్జమహాదేవి ఆలోచించే సందర్భంలోనిది ఈ వాక్యం.

వివరణ : శివుడి తల్లి బ్రతికి ఉంటే ఆయనను హాలాహలవిషం త్రాగనిస్తుందా ? అనిభావం. శివుడికి తల్లి లేదనే తన నమ్మకాన్ని బెజ్జమహాదేవి సిద్ధాంతీకరించడానికి చూపుతున్న ఉపపత్తులు బలంగా ఉన్నాయి. ఇది ఆమె ముగ్ధభక్తికి తార్కాణం.

**4. తానెంత పెరుగునో తల్లిగల్గినను ?**

సందర్భం : శివుడు తల్లి లేని కూమారుడు కాబట్టి చెడ్డ పనులు చేసి, కష్టాలు పడుతున్నాడని, తల్లి ఉంటే బిడ్డ ఆకలిగొన్నప్పుడు పొట్ట చూచి పెంచేదని బెజ్జమహాదేవి భావిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : శివుడు తల్లి లేకపోతేనే ఇంతవాడయ్యాడు. తల్లి ఉంటే ఇంకా ఎంత పెరిగేవాడో అని బెజ్జమహాదేవి భావిస్తుంది. బెజ్జమహాదేవి శివభక్తిమయమైన ఆలోచనకు, మాతృప్రేమకు మచ్చుతునక ఈ వాక్యం.

**5. ఇట్లఱలేక పెనుచు తరుణియ కాదెట్లు తల్లితాను ?**

సందర్భం: బెజ్జమహాదేవి తల్లి లేని కొడుకులు పడే బాధల్ని గురించి ఆలోచిస్తున్నది. ఊళ్ళోపెండ్లిళ్లు, పండుగలు, జాతరులు జరిగేటప్పుడు సౌఖ్యాన్ని కలిగించే తల్లి లేకపోతే మగపిల్లలైనా బాధపడతారు. కాబట్టి ఊరక ఉపేక్షించి ఉండకుండా తానే తల్లి అయి శివుడి కష్ట సుఖాలను చూస్తాననుకొంటున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : ఇట్లా భేదభావం, లోటులేకుండా పెంచే స్త్రీ తానే తల్లి అవుతుంది అని బెజ్జమహాదేవి భావించింది. కన్న స్త్రీయే కాదు పెంచిన స్త్రీ కూడా తల్లి అవుతుందన్న అభిప్రాయాన్ని బెజ్జమహాదేవి వ్యక్తం చేసింది.

**6. కాటుక యిడు మూఁడు గన్నుల ( గలయ.**

సందర్భం : బెజ్జమహాదేవి శివుడికి చేస్తున్న బాల్యోపచారాన్ని కవి వర్ణిస్తూ పలికిన మాట ఇది.

వివరణ : కాటుక పెడితే నేత్రాలు విశాలమౌతాయని, అందంగా ఉంటాయని తెలుగువారి విశ్వాసం. బెజ్జమహాదేవి శివుడు మూడు కళ్లకూ ప్రతికంటికి చక్కగాకాటుక పెటింది.

ఇక్కడ పాల్కురికి సోమన తెలుగు వారి ఆచారవ్యవహారాలను, సంప్రదాయాలను రాశీ భూతం చేశాడు. వాటిలో ఈ వాక్యం మణిపూస.

**7. భక్తు డెబ్బంగిగా భావించు శివుడు
వ్యక్తిగా దద్రూపుఁడై యుండు టరుదె ?**

సందర్భం : బెజ్జమహాదేవి చేస్తున్న బాల్యోపచారాల్ని శివుడు మెచ్చుకుంటూ స్వీకరించాడు. అప్పుడు విజ్ఞానులైన భక్తులు 'ఏక ఏవహిరూపేణ' అనే శ్రుతి వాక్యాన్ని 'సాధకః సంస్మరేత్ సదా' అనే స్మృతి వాక్యాన్ని 'తస్యతన్మయతా యాంతి' అనే హరుడి వాక్యాన్ని తలచుకొని ఈసన్ని

వేశాన్ని సన్నుతిస్తున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

వివరణ : భగవంతుడు రూపం చేత ఒక్కటే అని, భక్తుడు నిరంతరం భగవత్సంస్మరణం చేయాలని భక్తుడే రూపంలో భావిస్తే భగవంతుడు ఆయన రూపంలో ఉండి సేవలందుకుంటాడని భావం. ఇది శివుడు స్వయంగా అన్నమాట.

ఈ వాక్యం 'తస్యతన్మయతా యాంతి' కి అనువాదమే. ఇది ఈ కథలో కీలకమైన అంశం కనుక మళ్లీ చెప్పాడు. ఇందులో సోమన శ్రుతి స్మృతి పాండిత్యం, శివభక్తి తత్పరత గోచిస్తున్నాయి. సోమన ఎంత దేశి కవి అయినా తెలుగు దనానికి పట్టం కట్టిన దిట్ట అయినా అక్కడక్కడ సంస్కృత సమాసాల్నే కాదు వాక్యాలు కుండపోతగా కుమ్మరిస్తాడనటానికి ప్రబల నిదర్శనం ఈ ఘట్టం.

**8. నీ చెమటయుఁజూచి నెత్తురు నవుడు**
**ఎల్లెడ నొరుల నే నెఱుంగఁగదన్న !**

సందర్భం : బెజ్జమహాదేవి చేస్తున్న బాల్యోపచారల్ని అందుకుంటున్న శివుడు ఆమెకు ప్రసన్నుడు కాదలిచాడు. అప్పుడు బాలకరూపంలోని శివుడుకు ఒక పెద్ద వింత వ్యాధి వచ్చింది. నోరు తెరువడం లేదు. దాన్ని చూచి ఆమె వివశత్వంతో విలపిస్తున్న సందర్భలోనిది వాక్యం.

వివరణ : బెజ్జమహాదేవి శివుడితో " కుమారా ! నేను నీ చెమటలు చూచి నెత్తురై పోతాను. నీవు తప్పక నాకు ఈ ప్రపంచంలో ఇంకెవ్వరూ లేదు. నేలమీద నా కాళ్లు నిలవడం లేదు. అని పలవరించింది."

ఈ వాక్యం బెజ్జమహాదేవి శివుడితో "నీకు శ్రమకలిగితే నేను గామిమై పోతాను" అంటున్నది. ఇది అత్యంత శక్తిమంతమైన వ్యక్తీకరణం. చక్కని భావ చిత్రం. 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ' అన్న శరణాగతి కూడా ఇక్కడ కనిపిస్తుంది.

**9. చిఱుతొండ నంబి కొడుకు మాంసము వేడికొని తిని విందుచేసి.**

సందర్భం : బెజ్జమహాదేవి శివుణ్ణి బాల్యోపచారాలతో సేవిస్తున్న సందర్భలో ఆయనకు వింత వ్యాధి సోకి నోరుతెరవని పరిస్థితి ఏర్పడింది. ఆమె శోకిస్తుండగా ఇరుగు పొరుగు వారు అంగిటిముల్లు వ్యాధి సోకినట్లు చెప్పారు. అప్పుడామె శివుడు అసలు తినకుండా కొన్నాళ్లు, అదేపనిగా తిని కొన్నాళ్లు ఈ రోగం తెచ్చుకున్నాడని భావించి పలికిన మాట.

వివరణ : సామవేదుల ఇంటికి వెళ్లి చచ్చిన పెయ్యమాంసం తిన్నాడు శివుడు. ఆ మృత గోమాంసభక్షణంతో ఆగలేదు. చిరుతొండ నంబి సెట్టి ఇంటికి వెళ్లి వారి కొడుకుమాంసం వండించుకొని తిన్నాడు.

ఈ చిరుతొండ నంబి కథ 'దారుణరమణీయం'. దీన్ని ఒకకథగా పాల్కురికి సోమన అద్భుతంగా వ్రాశాడు. అనంతర కాలంలో శ్రీనాథుడ తన హరవిలాసకావ్యంలో ఈ కథను తీర్చి దిద్దాడు. శైవ వాఙ్మయ విషయంలో పాల్కురికి సోమనకున్న గురుస్థానం దీనివల్ల తెలుస్తుంది. ఈ సన్నివేశంలో పాల్కురికి సోమన ఎందరో శివభక్తులను ప్రస్తావించాడు.

**10. బ్రదుకున్నదే యిట్లు పై కుడ్పులందు ?**

సందర్భం : బెజ్జమహాదేవి అంగిటముల్లు వ్యాధి సోకిన తన కుమారుడైన శివుడితో అన్నమాట. కొన్నాళ్లు తిండిలేకుండా ఆకలితో మాడిపోయావు. కొన్నాళ్లు అదే పనిగా తిన్నావు. అపరిమితంగా తినడం మంచిదా ? అని ఆమె శివుడితో అంటున్నది.

వివరణ : మాములు ఆహారం కాకుండా అదనంగా ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పాడవుతుంది. బ్రతికే పని ఉండదు. అదిగాక ప్రతివాడు తనదేహానికి అనుకూలమైన ఆహారాన్ని సకాలంలో పరిమితంగా తీసుకోవాలి. ఇది యోగసాధకులకు, భక్తులకే పరిమితమైన ధర్మంకాదు, సర్వమానవులకు ఉపయోగకరమైన ధర్మం. "అనాభ్యాసే విషం శాస్త్రం ! అజీర్ణే భోజనం విషం" అని నీతిశాస్త్రం కూడా బోధిస్తున్నది.

**11. నిన్న నీ కడుపేల నిండదు సెపుమ ?**

సందర్భం : అంగిటముల్లు వ్యాధి సోకిన శివుడితో బెజ్జమహాదేవి అన్నమాట. పై తిండ్లు తింటే కడుపు ఉబ్బరం రాకుండా ఎలా ఉంటుంది? పాలు, వెన్న మొదలైన అహారాన్ని వేళ తప్పకుండా అవసరమైతే ఎక్కడనుంచి అయినా తెచ్చి పెడుతున్నాను కదా ! తృప్తి

లేకుండా పరువు మాలి అందరి ఇండ్లకూ పోయి అడిగి వండించుకొని తిన్నావు. నీకు ఇన్ని రోజులు ఆహారం సరిపోయింది కదా ! నిన్న ఒక్క రోజే ఎందుకు నిండలేదు.

వివరణ : ప్రతి రోజు తాను పెట్టిన ఆహారాన్ని తిని శివుడు తృప్తి పడేవాడని, నిన్న ఒక్కరోజే పై తిండ్లు తిన్నాడని కొంత పరిశీలనతో బెజ్జమహాదేవి కనుగొన్నది. నిన్న ఒక స్త్రీ చెప్పింది కూడా ! కాని శివుడి మాయగా గ్రహించలేకపోయింది. ఆమె అమాయక భక్తికి ఈ వాక్యం అద్దం పడుతున్నది.

**12. చేయి దిగం డిట్టి సితగుండు కలడె ?**

సందర్భం : అంగిటముల్లు వ్యాధితో నోరు తెరువకుండా పడి ఉన్న తన కుమారుడిగా ఉన్న శివుడితో అంటున్న మాట. తన కుమారుడి పూర్వ ప్రవృత్తిని నిన్నటి ప్రవృత్తిని పోల్చి చెబుతున్న మాట. ఇంతకుముందు ఎక్కడకు పోయి ఏమీ తినేవాడు కాదు. చంక దిగేవాడు కాదు.

వివరణ : శివుడు నిన్ననే పై తిండ్లు తిన్నది. అంతకుముందు ఎక్కడకూ పోయి ఏమి తినేవాడు కాదు. అసలు చంకదిగేవాడు కాదు. చేయి దిగని సితగుండు అంటే చంకదిగని పెంకె పిల్లవాడు. తల్లికి కట్టబడినవాడు, చుట్టబడినవాడు గుండులాగా బండలాగా కదలని వాడు. సితగుండు వైరి సమాసం. తెల్లటి గుండు. శివుడు తెల్లనివాడు, స్థాణుడు. ఇలా శివ స్వరూపం స్ఫురిస్తున్నది. ఆయన భక్తిపాశబద్ధుడు కూడా ! ఇక్కడ సోమనాథుడు సాధారణ లౌకికాను భూతిలో పరమాత్మ విభూతిని పొందుపరిచాడు.

**13. తెల్ల మిప్పుడు మీద ఁదొల్లి నాయట్టి**
**తల్లులు గలరె యీ ముల్లోకములను ?**

సందర్భం : అంగిటి ముల్లు జబ్బుతో నోరు తెరువకుండా పడి ఉన్న తన కుమార రూపంలో ఉన్న శివుణ్ణి ఉద్దేశించి బెజ్జమహాదేవి అన్నమాట.

వివరణ : తన బిడ్డను ఎన్నడూ ఒక్కమాట అనలేదని అంటున్నది. సాధారణంగా పనులవల్ల విసిగి వేసారి ఉన్నప్పుడు బిడ్డలను ఏదైనా తప్పుచేస్తే తల్లులు మందలిస్తారు. తాను అలా ప్రవర్తించలేదని, తనవంటి సహనం గల తల్లులు మూడు లోకాలలో సర్వమర్త్య పాతాళాలలో - ఎక్కడ లే`ని ఆమె అన్నది.

భగవంతుడికి తల్లి కావడం అదృష్టం, మూడు లోకాలలో ఎవ్వరికి అబ్బలేదు. అని ఆమె విశ్వాసం కావచ్చు. ఇది మాతృవాత్సల్యం సహన సమ్మిళితం కావాలన్న తత్వాన్ని బోధించే వాక్యం.

**14. పెట్టినంత గుడిచి యట్టుండి తేని**

**యెప్పాట నినుఁబొందునే తెవు ల్పొప్పి ?**

సందర్భం : అంగిటముల్లు వ్యాధితో బాధపడుతున్న తన కుమారుడైన శివుడితో బెజ్జమహాదేవి అన్నమాట.

వివరణ : పెట్టినంత వరకు తిని ఇంటి పట్టున ఉంటే నీకు ఈ వ్యాధి బాధ ఉంటుందా అని అన్నది.

ఆహార విహార విషయంలో ప్రతి వ్యక్తి తన్ను తాను నియంత్రించుకుంటే సాధారణంగా వ్యాధి బాధలుండవు. ఆ ఆరోగ్య సూత్రాన్ని కవి చక్కగా బెజ్జమహాదేవి ముఖాన వ్యక్తీకరించాడు. మన కవులు అవకాశం లభించినప్పుడు దేహారోగ్యాన్ని కాపాడుకోవడాన్ని గురించి చెప్పారు. అన్ని ధర్మసాధనలకు 'శరీరమే మూలంకదా ! శరీర మాద్యంఖలు ధర్మసాధనమ్' అని కాళదాసోక్తి కదా !

**15. నిప్పున ఁ జెదలంటునే ?**

సందర్భం : అంగిటిముల్లు వ్యాధితో బాధపడుతున్న తన కుమారుడిగా ఉన్న శివుడితో బెజ్జమహాదేవి అన్నమాట.

వివరణ : బెజ్జమహాదేవి శివుడితో "ఆహారనియమాలు పాటించక పోవడం వల్ల ఈ వ్యాధి వచ్చిందని, ఇది స్వయంకృతాపరాధమనీ" అన్నది. 'లేకపోతే నీ లాంటి వాడికి ఈ వ్యాధి రాదు అని అన్నది. కవి ఇక్కడ చక్కని దృష్టాంతాన్ని చెప్పాడు. ఇది ఇప్పటికీ తెలుగు ప్రజల వ్యవహారంలో ఉన్న వాక్యం.

**16. మాటల ( బాయునే తెవులు ?**

సందర్భం : వ్యాధిగ్రస్తుడైన శివుడితో బెజ్జమహాదేవి అన్నమాట.

వివరణ : మాటల వల్ల తన కుమారుడి ఈ వ్యాధి పోదని బెజ్జమహాదేవి ప్రాణార్పణానికి సిద్ధమైంది. ఇది శిరస్సుకు సంబంధించిన వ్యాధి కాబట్టి ఆమె బాధతో పాటు తన కుమారుడి రోగనివృత్తికి ఇది తోడ్పడుతుందనే విశ్వాసాన్ని ఈ వాక్యం వ్యక్తంచేస్తుంది. ఇది ముగ్ధభక్తి. మూఢ భక్తి.

**17. కన్న మోహంబున కంటె నగ్గలము**
**ఎన్న ( బెంచిన మోహమెందు నటంద్రు !**

సందర్భం : బెజ్జమహాదేవి తన కొడుకుగా ఉన్న శివుడు వ్యాధిబాధను చూడలేక శిరస్సు పగుల గొట్టుకోబోయింది. అప్పుడు శివుడు ఆమెకు ప్రత్యక్షమై ఇష్టమైన వరం కోరుకొమ్మన్నాడు. అప్పుడామె శివుడితో అన్నమాట ఇది.

వివరణ : నీవు ఆరోగ్యవంతుడవై శాశ్వతుడవై సుఖంగా ఉంటే చాలు. నిన్ను కళ్లారా చూస్తూ ఉంటాను. ఇంతకన్నా నాకు వేరే కోరిక ఏమీ లేదంటున్నది.

కన్నప్రేమ కన్నా పెంచిన ప్రేమ మిన్న అన్ని జనోక్తిని గుర్తు చేసింది. ఈ వాక్యం సోమన సమాజ పరిశీలనకు నిదర్శనం.

**18. అమ్మవ్వయను నామమయ్యె.**

సందర్భం : శివుడు ప్రసన్నుడై బెజ్జమహాదేవికి నిత్యత్వాన్ని అనుగ్రహించాడు. బెజ్జమహాదేవికి శివభక్త లోకంలో అమ్మవ్వ అనే వ్యవహారం రావడానికి కవి కారణం చెప్పాడు. ఇది కవి మాట; నిరుక్తి.

వివరణ : బెజ్జమహాదేవి అమ్మగా శివుణ్ణి పెంచింది. అందువల్ల ఆమె అమ్మ అయిన పూజ్యురాలు. సృష్టికర్త అయిన శివుడికి అమ్మ కాబట్టి ప్రపంచానికి నాయనమ్మ. ముత్తవ్వ. వృద్ధురాలైన నాయనమ్మ.

శివభక్తులు ఆత్మీయంగా వ్యవహరించే శబ్దాన్ని ఉదాహరించి సోమన చక్కగా వివరించాడు. వీరశైవకవి శిఖామణి అయిన పాల్కురికి హృదయస్పందన ఉదాత్త శైలీ నిర్వహణం ఇందులో తేజరిల్లుతున్నాయి.

## 1.3.6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు :

**1. బెజ్జమహాదేవి కథలో ప్రతిఫలించే మాతృహృదయాన్ని ఆవిష్కరించండి?**

లేదా

**బెజ్జమహాదేవి శివునికి తల్లిలా చేసిన ఉపచారాలు.**

లేదా

**బెజ్జమహాదేవిని శివుడు పరీక్షించిన తీరు.**

పాల్కురికి సోమనాథ మహాకవి రచించిన బసవపురాణంలోని బెజ్జమహాదేవి కథ అనుభవైక వేద్యం, సహృదయ నైవేద్యం . అది మాతృహృదయ మణిదర్పణం. భక్తి సాఫల్యానికి, పరమేశ్వర వాత్సాల్యానికి ఎత్తిన పతాక.

బెజ్జమహాదేవి మాతృవాత్సల్యంలో నాలుగైదు ప్రధాన సన్నివేశాలున్నాయి.

(1) శివుడికి తల్లి లేదని సానుభూతి చూపడం

(2) తానే తల్లిగా పెంచడం

(3) వ్యాధి బాధతో ఉన్న శివుణ్ణి చూచి పరితపించడం

(4) కూమారుడి ఆరోగ్యం కోసం, అతడి బాధను చూడలేక ఆమె ఆత్మార్పణానికి సంకల్పించడం

(5) శివుడు ప్రసన్నుడై వరం కోరుకొమ్మంటే ఆయన అభ్యుదయాన్నే కోరుకోవడం

వీటి నన్నింటిని సులభంగా సుందరమైన ద్విపదచ్ఛందంలో, జాను తెనుగులో, స్వభావోక్తి మయంగా సోమన తీర్చిదిద్దాడు.

బెజ్జమహాదేవి శివభక్తురాలు. శివునకు బంధువులు, సేవకులూ అందరూ ఉన్నారు, కాని పాపం తల్లిలేదు అనుకున్నది. తల్లి లేని

కొడుకులు ఉండరు కాబట్టి తల్లి చనిపోయి ఉంటుందనుకున్నది. తాను తల్లిలేని బిడ్డగా ఎన్ని బాధలు పడింది ఆమె తెలుసు గనుక అందరి బాధలు అలాంటివే అనుకొన్నది.

తల్లి ఉంటే శివుడును తపస్సుకు పోనివ్వదని, తల దువ్వకుండా ఉండదని, బూడిద పూసుకోనివ్వదని, బిచ్చమెత్తుకోవడానికి పంపదని, తల్లి లేని బిడ్డ కనుకనే బాధపడుతున్నాడనుకొన్నది. ఎంత మగపిల్లవాడైనా, తల్లిలేక పోతే బాధపడతాడనుకున్నది.

కాబట్టి తానే తల్లిగా శివుణ్ణి పోషించాలనుకున్నది. శివుడు ఆమె కుమారుడయ్యాడు. బాల్యోపచారాలు చేస్తున్నది. కుమారుడి ఒంటిమీద నూనె బొట్లు వేసి తలంటు స్నానం చేయిస్తున్నది. ముక్కులు, రొమ్ము, పొట్ట ఒత్తుతున్నది. వీపు నిమురుతున్నది. కాళ్ల చేతులు బాగా పెరగాలని విడదీసి లాగుతున్నది. నలుగులు పెడుతున్నది. నీళ్లు దోసిట్లో పోసుకొని వీపుమీద చరుస్తున్నది. భయపడకుండా ఉండడానికి వెన్ను తడుతున్నది. తలమీది నీరు తుడుస్తున్నది, నీరు నోటిలోకి పోకుండా అడ్డం పెడ్డుతున్నది. కళ్లను చెవుల్ని బాగా ఊదుతున్నది. దృష్టి దోషపరిహారార్థం తూతూ అంటు ఉమ్మివేస్తున్నది. బొటన వ్రేలితో మన్ను నలిచి, పిడకల బూడిదతో కలిపి నొసలి నిండ పూస్తున్నది. బొట్టుపెడుతుంది.

తన కన్నా పైకి ఎత్తితే కుమారుడు ఎత్తు పెరగడన్న విశ్వాసంతో అతణ్ణి పైకెత్తడానికి భయపడుతున్నది. కాటుక బాగా పెడితే కళ్లు పెద్దవౌతాయన్న నమ్మకంతో మూడు కళ్లకూ చక్కగా కాటుక పెడుతున్నది. పైన పక్షులు పొరాడకుండా జాగ్రత్తపడుతున్నది. ఉగ్గు పోస్తున్నది. నవ్విస్తూ, నొప్పిస్తూ, బుజ్జగిస్తూ ముద్దు పెట్టుకొంటున్నది. తన కుమారుణ్ణి పొట్టమీద పండబెట్టుకొని జోకొడుతున్నది.

పరమేశ్వరుడు బెజ్జమహాదేవి బాల్యోపచారాలను ప్రీతితో స్వీకరిస్తున్నాడు. శివుడు కూడా తన తల్లికి ప్రసన్నుడు కావాలనుకొన్నాడు. మహావ్యాధి సోకి శివుడికి దవడలు అంటుకు పోయాయి. నోరుతెరవడం లేదు. ఆ స్థితిని చూచి బెజ్జమహాదేవి వివశురాలైంది. " నీ చెమటయు నెత్తురు నౌదు.'' "ఎల్లెడ ఒరుల నేనెఱుగగదన్న'' నేలపై నా కాళ్లు నిలువవు ~న్న'' అంటూ నీకు అజీర్ణం చేసిందో, కంఠవ్యాధి వచ్చిందో ? అని పలవరించింది. ఇరుగు పొరుగు వారందరూ ఇది అంగిటిముల్లు వ్యాధి అని చెప్పారు.

అప్పుడు బెజ్జమహాదేవి కొడుకు వ్యాధికి కారణం అసలు తినకుండా మలమలమాడుతూ కుమ్మర గుండయ్య, చెరమ చక్రవర్తి వాద్యాను కూలంగా ఆడడం అనుకున్నది. ఆ తరువాత అదే పనిగా తినడం అందునా సామవేదుల ఇంట్లో చచ్చిన పెయ్యిమాంసం తినడం, అంతటితో ఆగక చిరుతొండ నంబి కొడుకు మాంసం తినడం అనుకున్నది.

చిట్టచివరకు నిప్పుకు చెదలు పడుతుందా ! శివుడికి రోగం వస్తుందా? అతడి స్వయం కృతాపరాధమని తేల్చుకుంది. అతడి కోసం శిరస్సును పగులగొట్టుకొని ప్రాణార్పణం చేయడానికి సిద్ధమైంది.

అప్పుడు శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. ఆమె "నాకేలోటు లేదు. నీవు ఆరోగ్యంతో శాశ్వతుడవై సుఖంగా ఉంటే చాలు. నాకు అంతే చాలు'' అన్నది. కన్న ప్రేమకన్నా పెంచిన ప్రేమ అధికం అన్నది. నిన్ను కళ్లారా చూస్తూ ఉండడమే నా కోరిక అన్నది.

అప్పుడు శివుడు చిరునవ్వుతో ఆమెతో అమ్మా! నీలాంటి అమ్మ ఉండగా నాకు రోగం ఎందుకు వస్తుంది అని మోక్షాన్ని ప్రసాదించాడు. ఆమెను మూడు లోకాల కెల్లా ముత్తవ్వగా పేర్కొన్నాడు శివుడు.

ఆమె జగత్పిత అయిన పరమేశ్వరుడికి అమ్మ కావడం వల్ల అమ్మవ్వ అని వ్యవహరించబడింది. అమ్మవ్వ అంటే అమ్మ అయిన అవ్వ. శివుడికి అమ్మ. అందరికీ నాయనమ్మ. ఇంకా శివుడికి అమ్మ అయిన పూజ్యురాలు అని కూడా భావించవచ్చు.

అందువల్ల బెజ్జమహాదేవి కథను ఆర్ద్రమైన మాతృ హృదయంగా సంభావించవచ్చు.

**2. బెజ్జమహాదేవి కథ ఆధారంగా పాల్కురికి సోమనాథుడి కవితా పాటవాన్ని వివరించండి?**

**జ)** పాల్కురికి సోమనాథుడు తెలుగులో మొదటి స్వతంత్ర రచయిత. నన్నయ్య ప్రారంభించిన మార్గ కవితా రాజమార్గంలో మత్తేభాదులపై ప్రయాణించకుండా దేశకవిత్వపు కాలిబాటలో నడచిన అచ్చమైన ద్విపద ప్రజాకవి పాల్కురికి సోమన. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో దేశికవితకు పునాది వేసిన మహాకవి పాల్కురికి . వీరశైవ మతాన్ని కావ్యరూపంలో సుస్థిరం చేసి కవితారంగం మీద జాను తెనుగు వెలుగులను ప్రసరింపజేసిన పాల్కురికి నైపుణ్యం అగణ్యం.

సోమన సులభంగా ప్రజానీకానికి అర్థమయ్యే ద్విపద ఛందస్సును స్వీకరించాడు. అది రోళ్లా రోకళ్ల నలిగిన తెలుగు వారికి ఆత్మీయమైన ఛందస్సు. అది తరువోజలో సగం భాగం. సంస్కృతంలో అనుష్టుప్ ఎలాంటిదో తెలుగులో ద్విపద అలాంటిది. అతడు "ఐహికాముష్మిక ద్విపదహేతు వగుట ద్విపద నాగబరగు'' అని ద్విపదను నిర్వచించాడు. ఐహికాముష్మికాలనే ద్విపదలు అంటే రెండు స్థానాలలో సౌఖ్యం లభించడానికి కారణం అన్నాడు.

ఇక భాషా విషయంలో జాను తెనుగును స్వీకరించాడు సోమన.

‘ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబు గామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు’

అని అందరికీ అర్థం కావడం కోసం జాను తెనుగును స్వీకరించాడు. సంస్కృత భూయిష్ఠరచన అందరికీ అందుబాటులో ఉండదని అభిప్రాయపడ్డాడు.

సోమన “ఆతత సకల పురాతన భక్త గీతార్థసమితియే మాతృక గాగ” బసవపురాణాన్ని రచించాడు. ఇది పేరులోనే పురాణం. కాని తెలుగు సమకాలీన సమాజాన్ని తొలిసారిగా చిత్రించిన సాంఘిక కావ్యం. తన నాటికి ప్రజల్లో వాడుకలో ఉన్న శివభక్తుల జీవిత గాథాకుసుమాల్ని సమీకరించి బసవేశ్వర జీవిత కథా సూత్రానికి సమన్వయించి కవితా సౌరభ పూరితమైన కావ్యహారాన్ని అల్లాడు. బసవపురాణ మందాకినిలో మణికర్ణికా ఘట్టం బెజ్జమహాదేవి కథ.

బెజ్జమహాదేవి శివుడికి తల్లి లేనందుకు విచారించి తల్లిగా సపర్యలు చేసి, అతడికి వ్యాధి సోకినప్పుడు బాధపడి, శివుడి బాధను చూడలేక శిరోభేదన మార్గానికి ఉపక్రమించిన ముగ్ధ భక్తురాలు. శివుడామెకు సాక్షాత్కరించి కైవల్యాన్ని ప్రసాదించడంతో కథ సుఖాంతమైంది. బెజ్జమహాదేవి అమాయక మాతృహృదయం, శివుడి భక్త వాత్సల్యం ఈ కథలో సాక్షాత్కరిస్తాయి.

ఇందులో బెజ్జమహాదేవి మాతృవాత్సల్య వర్ణన, శివునికి వ్యాధి సోకినప్పుడు ఆమె పడే ఆవేదన అత్యంత హృదయ రంజకంగా పాల్కురికి సోమన చిత్రీకరించాడు.

ఈ కథలో ఒడయనంబి, కుమ్మర గుండయ్య, చేరమ చక్రవర్తి, పిట్టవ్వ, సామవేది, కరికాళవ్వ, చెన్నయ్య, చిరుతొండనంబి, నిమ్మవ్వ, చోడవ్వ, సురియ చౌడయ్య మొదలైన భక్తుల ప్రసక్తి కూడా మనోహరంగా ఉంది. తెలుగును ఈసడించవద్దనీ, వేదములతో సమానంగా చూడమని తెలుగుకెంతో ప్రాధాన్యం ఇచ్చాడు పాల్కురికి.

“తెలుగు మాటలనంగవలదు, వేదముల కొలదియగా జూడు” డని కోరుకున్నాడు.

సోమన జానుతెనుగుకు ఈ పాత్యమంతా సాక్ష్యమే. “ముక్కొత్తు, జెక్కొత్తు, ముక్కన్ను బులుము ” లాంటి తెలుగు మాటలు అత్యంత ప్రశంస్యాలు. అయితే అక్కడక్కడా సంస్కృత వాక్యాలను సైతం వర్ణించడానికి సోమన వెనుదీయలేదు. “ ఏక ఏవహి రూపేణ”, “సాధక స్సంస్మరేత్సదా”, “తస్య తన్మయతాం యాంతి” ఇందుకు నిదర్శనాలు.

బెజ్జమహాదేవి శివుణ్ణి పెంచిన తీరంతా తెలుగు సంస్కృతికి నిదర్శనం. మన ఆచారవ్యవహారాలు, నమ్మకాలు ఇందులో రాశీభూతమయ్యాయి. “ఎత్తు గ్రుంగెడునని ఎత్తంగ వెఱచి”, “కాటుక యిడ నింత కన్నగుననుచు” ఇందుకు నిదర్శనాలు.

సోమన ప్రయోగించిన భావ చిత్రాలలో “నీ చెమటయు జూచి నెత్తురు నవుడు ” చాలా శ్రేష్ఠమైంది. ‘నేలపై నా కాళ్ల నిలువవురన్న, “ నిప్పుల జెదలంటునే ” కన్న మోహంబున కంటె నగ్గలము ఎన్న ఁబెంచిన మోహ మెందు” వంటి వాక్యాలు నేడూ తెలుగు వారి నాలుకలపైన నడయాడేవి.

అయినా సోమన కవితలో కావ్య శిల్పదృష్టి కన్నా ఆవేశం అధికం. కొన్ని చోట్ల భావాన్ని బాగా నాటుకొనేటట్లు చేయడానికేమో మరి పునరుక్తిని ఆశ్రయించాడు, “ తల్లి గల్గిన నేల తపసిగానిచ్చు” తరువాతి పది పంక్తులిందుకు ఉదాహరణలు.

ఈ సందర్భంగా సుప్రసిద్ధ పండితులు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారి అభిప్రాయం పేర్కోదగింది. పోతన భక్తి పారవశ్య కవిత్వానికి, శ్రీనాథమహాకవి నుడికారాల గడుసుదనపు చిన్నెలకు, కృష్ణరాయల వర్ణనా పటిష్ఠ. సందర్భాలకు, సోమన కావ్యాలే మార్గదర్శకాలని వారి అభిప్రాయం. ఇది ప్రత్యక్షర సత్యం.

అయితే సోమనాథుని మతదృష్టి వీరశైవేతరులకు కొందరికి ఆమోద దాయకం కాదు. అందులోని పరమత ద్వేషమే దానికి ప్రధాన కారణం. అది అలా ఉన్నా ఆధునిక విమర్శకులకు ఆయన భాషా సాహిత్య సాంస్కృతిక దృక్పథం ఉపాదేయం.

**డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి,** ఎం. ఏ పిహెచ్. డి
రీడర్ & ప్రిన్సిపాల్,
ఎస్. కె. ఆ. బి.ఆర్. కళాశాల

ఖండం : 1

ప్రాచీన పద్యభాగము

# ద్రౌపదీ పరిదేవనము-తిక్కన

**పాఠం - 5**

**1.5.0 పరిచయం**

**1.5.1 ఉద్దేశం**

**1.5.2 ప్రతిపదార్థ తాత్పర్యాలు**

**1.5.3 సందర్భ సహిత వ్యాఖ్యలు**

**1.5.4 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు**

**1.5.0 పరిచయం :** ఆంధ్ర మహాభారతంలో తిక్కన రచించిన ఉద్యోగపర్వంలోని ద్రౌపదీ పరిదేవనము పాఠానికి సంబంధించిన విశేషాలు తెలుసుకొన్నారు.

**1.5.1. ఉద్దేశం :** ముందుపాఠంలో పాఠ్యభాగ సందర్భం, కఠిన పదాలకు అర్థాలు, పాఠ్యభాగవివరణ తెలుసుకొన్నారు. ఇప్పుడు ముఖ్య పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు, సందర్భసహిత వ్యాఖ్యలు పరీక్షకురాదగిన ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొంటారు.

**ముఖ్య పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు తెలుసుకొంటారు.**

1.5.2 : ప్రతిపదార్థ తాత్పర్యాలు :

పద్యం 101 :

"అంతలుచేసి పోనడచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె యిట్టి యూఱట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు, తా
నంతన యూళులేవురకు నైదు సుయోధనుడిచ్చునొక్కొ, యీ
కంత కృపావిహీనమతి నాతడు నొంచునె యన్నదమ్ములన్" --

(102, 103, 104, 105, 107, 108, 110, 111, 112, 114, 118 పద్యాలకు పరిచయం, సందర్భం ఈ క్రింద యిచ్చినట్లుగానే అన్నింటికి రాయండి)

పరిచయం :

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

ఖండం : 1 ప్రాచీన పద్యభాగము

# ద్రౌపదీ పరిదేవనము - తిక్కన

## పాఠం - 4


1. 4. 0 పరిచయం

1. 4. 1 ఉద్దేశం

1. 4. 2 పాఠ్యభాగ సందర్భం

1. 4. 3 కఠిన పదాలకు అర్థాలు

1. 4. 4 పాఠ్యభాగవివరణ


**1-4.0. పరిచయం :-**

ప్రాచీన సాహిత్యంలో ఇంతకుముందే కొన్ని పాఠాల్ని గూర్చి తెలుసుకొన్నారు. ఇప్పుడు తిక్కన రచించిన ఉద్యోగపర్వంలోని ద్రౌపదీ పరిదేవనము గూర్చి తెలుసుకోబోతున్నారు.

ఆంధ్ర మహాభారతాన్ని రచించిన 'కవిత్రయమ' ను ముగ్గురు కవులలో రెండవకవి తిక్కన. మొదటి కవి నన్నయ. కాగా, మూడవ కవి ఎఱ్ఱన. తిక్కనకు 'కవిబ్రహ్మ', 'ఉభయకవిమిత్రుడు' - అనే బిరుదులున్నాయి. 'కవిబ్రహ్మ' అంటే ఉత్తమ కవితా సృష్టికి బ్రహ్మవంటివాడని, 'ఉభయకవి మిత్రు' డంటే అటు సంస్కృతకవులనూ, ఇటు తెలుగు కవులనూ తన అద్భుతమైన కవిత్వరచనతో మెప్పించగల వాడని అర్థం. కనుకనే 'ఉభయకవి మిత్రుడు'. తిక్కన క్రీ.శ 1205 - 1288 మధ్యకాలంలో జీవించినట్లు చరిత్రకారుల నిర్ణయం. ఇతడు మనుమసిద్ధి ఆస్థానకవి. మనుమసిద్ధి నెల్లూరు మండలాన్ని పరిపాలించిన చోడ వంశపురాజు. ఇతడు క్రీ.శ 1250 -1290 మధ్యకాలంలో రాజ్యాన్ని పరిపాలించినట్లు శాసనాధారాలను బట్టి తెలుస్తుంది. తిక్కన ఈ మనుమసిద్ధి ఆస్థానంలో కేవలం కవిమాత్రుడే కాక, మహామంత్రిగా ఉండి రాజ్యాంగ చక్రాన్ని నడిపేవాడు. మనుమసిద్ధి రాజ్యానికి వచ్చిన కొద్దికాలానికే దాయాదులవల్ల 'విజయాదిత్యుని' చేతిలో యుద్ధంలో ఓడిపోయాడు. అప్పుడు కాకతీయుల రాజ్యం ఈనాడు వరంగల్లు అనబడే ఓరుగల్లులో బలిష్ఠంగా ఉండేది. తిక్కన మంత్రిగా తన బాధ్యతను ఆ విపత్కర పరిస్థితుల్లో చక్కగా నెరవేర్చాడు. తాను కాకతిగణపతి దేవుని ఆస్థానానికి వెళ్లి, తన ప్రతిభావిశేషాలతో ఆ రాజును మెప్పించి, అతని సహాయంతో తిరిగి, మనుమసిద్ధికి రాజ్యాన్నిప్పించినట్లుగా పరిశోధకుల అభిప్రాయం. కాబట్టి తిక్కనకు రాజ్యపరిపాలన, రాయబారాలు నడపడం మొదలైన విషయాలలో అపారానుభవం ఉంది. ఆ అనుభవమంతా, మహాభారత రచనా పద్ధతిలో మనంచూడగలం.

తిక్కన గౌతమగోత్రుడు. ఆపస్తంబసూత్రుడు. 'కొట్టరువు' అనేది గృహనామం. కొట్టరువు భాస్కరమంత్రి తిక్కనతాత. ఇతడు గుటూరు విభుడు. అన్నమ, కొమ్మనమంత్రి తిక్కన తల్లిదండ్రులు. తిక్కన నివాసం పాత గుంటూరు. ఈనాటికి తిక్కన గృహముంది. తిక్కన మొదట మహేశ్వరోపాసకుడు. తరువాత కొంతకాలానికి హరిహరనాథుణ్ణి ఉపాసించాడు. తిక్కన కాలానికి నాటిసమాజంలో శైవం, వైష్ణం అనే భేదాలు ఉండేవి. ప్రజల్లో మత కలహాలు రేగి, సమాజం అల్లకల్లోలంగా ఉండేది. మతంపేరుతో సమాజంలో విద్వేషాలు పెరగకూడదని భావించిన తిక్కన, 'హరి', 'హరుడు' ఇద్దరూ ఒక్కరే అని, 'హరిహరనాథుడు'- అనే దైవాన్ని సృష్టిచేసి, తాను విరాటపర్వం మొదలుకొని స్వర్గారోహణ పర్వం వరకు అనువదించి ఆ హరిహరనాథునికే అంకితం చేసిన మహాకవి.

"శ్రీయన గౌరి నాబరగ చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్త జనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వము (గొల్చెద నిష్ట సిద్ధికిన్" -

అని హరహరాద్వైతాన్ని ప్రతిపాదించి, 'విష్ణురూపాయ నమశ్శివాయ' అని ప్రకటించాడు. దీనివల్ల ఆనాటి సంఘంలో శైవ వైష్ణవ మతావేశాలు తగ్గి ప్రశాంతత చేకూరింది.

**తిక్కన గ్రంథాలు :-**

మహాభారతంలో మొత్తం 18 పర్వాలున్నాయి. అందులో మొదటి మూడు పర్వాలు, అంటే ఆది, సభా, అరణ్య పర్వాలుకాకుండా, మిగిలిన 15 పర్వాలు తిక్కన అనువదించాడు. మహాభారత రచనకు యజ్ఞంచేసి సోమయాజి అయిన తరువాత పూనుకున్నాడు. ఆంధ్రమహాభారతం కాక, నిర్వచనోత్తర రామాయణం అనే గ్రంథాన్ని కూడా తిక్కన రచించాడు. ఈ గ్రంథం తిక్కన చిన్నతనంలోనిరచన. ఆ గ్రంథంలో 'అమలో దాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢి, బాటించు శిల్పమునం బారగుడ గళావిదుడ...' అని ఆత్మస్తుతి చేసికొన్నాడు. కాని భారతాన్ని రచించే కాలానికి వయస్సుతో పాటు, అపార అనుభవంతోడైంది. బుద్ధి పరిణతి చెందింది. జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు అనుభవించాడు. అందుకని, చక్కని ఓర్పు, సమదృష్టి, సమన్వయం తోడయ్యాయి. అందుకనే విరాటపర్వం ప్రారంభంలో, 'నా నేర్చిన భంగి జెప్పి వరణీయుడనయ్యెద భక్త కోటికిన్' - అని ఆత్మ సమర్పణం గావించుకున్నాడు. నిర్వచనోత్తర రామాయణం ప్రభువు మెప్పును కోరిన రచన. భారతం ప్రజల తృప్తిని ఆశించిన రచన. భారత రచనా కాలానికి తిక్కనకు ఆముష్మిక చింతనేకాని, లౌకిక దృష్టి ఎంతమాత్రమూలేదు.

నిర్వచనోత్తర రామాయణం, మహాభారతమే కాక, విజయసేనము, కవిసార్వభౌమ ఛందము, కృష్ణశతకము అనే గ్రంథాలను గూడ తిక్కన రచించాడని ప్రతీతి. కాని వీటికి నిర్దిష్టమైన ఆధారాలు లేవు.

**మహాభారత ప్రాశస్త్యం :-**

ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగిన సంఘర్షణే భారతం. ఇది ఏ యుగానికో, కాలానికో పరిమితం కాదు. నాటి నుంచి నేటిదాకా ఇది నిత్య నూతనమైందే. మహాభారతంలో పాత్రలు, కథ అందరికీ సుపరిచితమే. మానవుని మనస్సు అనేక భావాలకు నిలయమై ఉంటుంది. ఈర్ష్య, అసూయ, ద్వేషం, ప్రతీకారేచ్ఛ, అధికార కాంక్ష, తీరనికామం, లోభం, ఇవన్నీ మనస్సు పొందే వికారాలే. అలాగే సత్యదీక్ష, ధర్మనిష్ఠ , శాంతికాముకత, మొదలైనవి మనో వైకల్పికాలే. ఈ భావాలకు భారతంలోని ఒక్కొక్క పాత్ర, ఒక్కొక్క ప్రతీక. లోక కళ్యాణాన్ని కాంక్షించి, విష్ణు సన్నిభుడైన వేదవ్యాసమహర్షి, సంస్కృతంలో రచించిన భారతాన్ని, తూర్పు చాళుక్యరాజులలో రాజరాజ నరేంద్రుడు 11 వ శతాబ్దంలో, తన ఆస్థానంలో గల నన్నయ భట్టును "కృష్ణద్వైపాయన మునివృషభాభిహిత బద్ధ నిరూపితార్థ మేర్పడి తెనుగున రచియింపు మధికధీయుక్త మెయిన్" - అని అభ్యర్థించాడు. వైదిక ధర్మ ప్రతిపాదకమై, పంచమ వేదంగా భారతం లోకంలో సుప్రసిద్ధమైంది. నన్నయ ఆది, సభా పర్వాలు రచించి, అరణ్య పర్వంలో కొంతభాగం ఆంధ్రీకరించాడు. ఇక్కడ ఆంధ్రీకరణ అంటే యథాక్షరానువాదం కాదు. మూల భారతంలోని కథను కొన్ని ఘట్టాలను సందర్భోచితంగా తగ్గించి, కొన్ని పెంచి, మరికొన్నింటిని యథానువాదంగా వ్యాసమహర్షి హృదయానికి దగ్గరగా తెలుగులో నన్నయ అనువదించాడు. అందుకనే, ఆంధ్ర మహాభారతానికి రచయితలు ముగ్గురైనప్పటికీ, వారు విభిన్న కాలాలకు చెందిన వారైనప్పటికీ, 'గ్రంథాత్మ' మాత్రం ఒక్కటే. దానికి కారణం, నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు ముగ్గురు వ్యాస హృదయాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని అనువదించారు.

భారత రచనలో తిక్కనకు నన్నయయే మార్గదర్శకుడు. నన్నయను 'ఆంధ్ర కవిత్వ విశారదుడు', 'విద్యాదయితుడు', 'మహితాత్ముడు'- గా పేర్కొన్నాడు తిక్కన.

భారత రచనకు సంబంధించి తిక్కన

"కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁగ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీ విభవాస్ప దంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షా విధి నొంది పద్యములు గద్యములన్ రచియించెదం గృతుల్" -

అని చెప్పుకున్నాడు.

ఇక్కడ 'భారతము అనే అమృతమ్ము'- అని చెప్పాడు తిక్కన. 'అమృతము' - అంటే 'మృతి' లేనిది అని అర్థం. అంటే విశ్వజనీనమైన ధర్మాలను బోధిస్తూ శాశ్వతంగా లోకంలో నిలిచిఉండేది - అని అర్థం. రెండవ విషయం, 'ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ' - అంటే ఏమిటి ? ఈ ప్రశ్నకు నాటి సామాజిక స్థితిగతులు అవగతంచేసుకోవాలి. ఒకవైపు వీరశైవం,

వీరవైష్ణవం, జైనం, భౌద్ధం ఇత్యాది మతాలు సామాన్యుని జీవితాన్ని అల్లకల్లోలం చేశాయి. ఏది సత్యం ? ఏదసత్యమో అతనికి బోధపడే మార్గంలేదు. ఎవరికి తోచిన మతావేశాలతో వారు, సంయమనం కోల్పోయి, సంఘంలో అశాంతి నెలకొంది. ఆధ్యాత్మికతాభావాలు ఆవేశ కావేషాలకు లోనైనాయి. సాంఘిక వ్యవస్థ ఛిద్రమైంది. అటువంటి ప్రమాదకరపరిస్థితుల్లో దేశమున్నపుడు మహా దార్శనికుడైన తిక్కన వైదిక ధర్మప్రతిపాదితమైన 'సాత్యవతేయ సంస్కృతి శ్రీ విభవాస్పదమై' న భారతాన్ని ఆంధ్రావళికి సంతోషం కలిగే విధంగా, అంటే సమాజంలో శాంతిస్థాపన జరిగి మతపరమైన హింసా ద్వేషాలకు స్వస్తిపలికే విధంగా భారతరచన చేశాడు. ఇంతపెద్ద భారం తిక్కన భుజస్కంధాలపై పడిందిగాబట్టే తాను 'మహాకవిత్వ దీక్షావిధి' ని పొందాడు. అకుంఠితమైనదీక్ష అది. అంతేకాదు, వ్యాసమహర్షి దివ్య ప్రజ్ఞను తనమేధాశక్తితో ఏకంచేసి తిక్కన ధర్మాద్వైత ప్రతిపాదితమైన భారతాన్ని రచించాడు.

ధర్మ నిర్ణయం ఒక్కోసారి చాలా సంక్లిష్టంగా ఉంటుంది. శ్రుతులు, స్మృతులు, పురాణాలు ధర్మసూక్ష్మాలను నిర్ణయించేటప్పుడు ఒక్కొక్కసారి విభేదించవచ్చు. అటువంటప్పుడు భారతం దానికి పరిష్కారం చూపుతుందని తిక్కన పేర్కొన్నాడు.

"వేదములకు, నఖిల స్మృతి
వాదములకు బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్"-

అటువంటి భారతాన్ని శివకేశవులకు అభేదం చూపిస్తూ, ఆ హరిహరనాథునికే అంకితం చేశాడు తిక్కన. తిక్కన శ్రమ వృథాకాలేదు. భారతావతరణం నుంచి క్రమంగా తెలుగు సీమలో మతావేశాలు తగ్గి సమన్వయ దృష్టి ప్రబలింది. మహా కవుల ప్రభావం సమాజంపై తప్పనిసరిగా ఉంటుందని, సమాజానికి మార్గదర్శకుడు కవి మాత్రమేనని, తిక్కన జీవితమే దానికి పరమోదాహరణమని మనం గ్రహింపవచ్చు.

**1.4. 1.**

**ఉద్దేశం :-**

పరాభవింపబడిన స్త్రీ మనస్సులో చెలరేగే ప్రతీకారజ్వాల ఎటువంటిదో ఈ పాఠంలో చూస్తాం. సహనంలో, ఓర్పులో స్త్రీ భూదేవి వంటిది అని చెప్తారు. అయినా ఆమె సహనానాకి ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దులు చెరిగి పోయినప్పుడు ఆమె మనస్సులో ప్రతీకారేచ్ఛ చెలరేగుతుంది. దీనికి మహాభారతంలో నిలువెత్తు ఉదాహరణ ద్రౌపది. ద్రౌపది సామాన్య స్త్రీ కాదు. ఆమె అయోనిజ, అగ్నిసంభవ. పాండవుల పట్ట మహిషి. అరివీర పరాక్రమవంతులైన పాండవులను భర్తలుగా పొందింది. శౌర్య పరాక్రమోన్నతులైన పుత్రులను పొందింది. తోడబుట్టినవాడు ధృష్టద్యుమ్నుడు శత్రుభయంకరుడు. అన్నింటినీ మించి, దుష్టశిక్షకుడూ, శిష్టరక్షకుడైన కృష్ణుడున్నాడు. ఇంత రక్షణ ఉన్నా, ఆమె కౌరవసభలో కురువృద్ధులూ, గురువృద్ధులూ, బంధువులు, భర్తలముందు దారుణంగా అవమానించబడింది. అయినా పల్లెత్తుమాట అనకుండా జూద నియమానుసారం అరణ్య అజ్ఞాతవాసాలు ముగించింది. అందరూ ఉన్నా తన బాధను పంచుకోవడానికి ఎవరూలేరు. యుద్ధం ముంచుకొస్తున్నా ధర్మజుని శాంతికాముకత్వం సహింపరానిదిగా ఉంది. అందుకనే కౌరవసభకు రాయబారిగా వెళ్లే కృష్ణునిముందర తన మనస్సులోని గోడు వెళ్లబోసుకుంది. ఆప్తులనుచూస్తే పళ్ల బిగువున పట్టి ఉంచిన దుఃఖం ఒక్కసారిగా పెల్లుబుకుతుంది. ఆక్రోశం కట్టలు తెంచుకుంటుంది. ద్రౌపది పరిస్థితి కూడా అదే. అందుకనే కుండ బద్దలు కొట్టినట్లు తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పింది. ఈ సందర్భంలో తిక్కన రచన అద్భుతం. ద్రౌపదిని దుఃఖోద్విగ్నగా చిత్రీకరించిన తీరు అనితర సాధ్యం.

రాజవంశపు స్త్రీ అయిన తనకే రక్షణ లేకపోతే ఇంక ఎవరికి రక్షణ ఉంటుంది ? దుర్మార్గులు ఎలా శిక్షింపబడతారు ? పాండవుల పరాక్రమానికి అర్థం ఏముంటుంది ? కేవలం నీతి ధర్మాలు వల్లిస్తూ కూర్చుంటే, సామాన్యుని స్థితి ఏమిటి ? అయినా ఆనాడు కురుసభలో తన నవమానించినప్పుడు భీముడు చేసిన ప్రతిజ్ఞలు నెరవేరేమార్గం ఏది ? కాబట్టి యుద్ధం తప్పక జరగాలి. దుష్ట శిక్షణ, శిష్టరక్షణ జరగాలి. దానికి మూలకారకుడు కృష్ణుడే. అందుకు సమర్థుడు కూడా ఆయనే. ఇదీ ద్రౌపది మనస్సులోని ఆలోచన. అందుకనే కృష్ణునితో తనమనస్సులో ఇన్నాళ్లు దాచుకున్న బాధ, దుఃఖం, ఆక్రోశం, కౌరవులపట్ల గల క్రోధం, ఇవన్నీ ఒక్కసారి ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. వీటన్నింటితో కలిసిన ద్రౌపది హృదయావేదన ఇక్కడ మనంచూస్తాం.

## 1.4. 2. పాఠ్యభాగ సందర్భం :-

ఈ పాఠ్యభాగం ఉద్యోగపర్వంలో తృతీయాశ్వాసంలోని రాయబార ఘట్టంలోనిది. పురోహితుడు, సంజయుడు, శ్రీకృష్ణుడు రాయబారాలు జరిపారు. ఈ పాఠ్యభాగం శ్రీ కృష్ణ రాయబార ఘట్టంలోనిది. వేదవ్యాసమహర్షి మహా భారత కర్త మాత్రమేకాదు. కురువంశానికి మూలపురుషుడు కూడ. పరాశరమహర్షి వలన సత్యవతీ దేవికి జన్మించినవాడు వ్యాసుడు. వ్యాస మహర్షి వలన అంబిక, అంబాలికలకు జన్మించిన వారే ధృతరాష్ట్ర , పాండురాజులు. వీరిలో ధృతరాష్ట్రుడు పెద్దవాడు. అయితే పుట్టుగ్రుడ్డి. గ్రుడ్డివానికి రాజ్యాన్ని పరిపాలించే అర్హతలేదు కాబట్టి చిన్నవాడైన పాండురాజు రాజైనాడు. అయినా అన్నమీద గౌరవభావంతో పాండురాజు, ధృతరాష్ట్రునే సింహాసనంమీద కూర్చోబెట్టాడు. తాను శత్రువులను జయిస్తూ, యుద్ధాలుచేస్తూ రాజ్యాన్ని సుస్థిరంచేసి మరణించాడు. ఇతని సంతానమే పాండవులు. ధృతరాష్ట్రుని వలన గాంధారికి జన్మించిన వారు నూరుగురు కౌరవులు. వీరే దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైనవారు. వీరినే ధార్తరాష్ట్రులని కూడా అంటారు. పాండురాజువలన కుంతీదేవికి జన్మించిన వారే పాండవులైదుగురు. ధర్మరాజాదులు. నిజానికి అందరూ కురువంశానికి చెందిన కౌరవులే. పుట్టినప్పటినుంచి ఉన్న మనస్పర్ధల కారణంగా వీరు కౌరవ, పాండవులయ్యారు.

దుర్యోధనునికి రాజ్య కాంక్ష అధికం. అతడు ధర్మరాజు కంటే చిన్నవాడే. అంతేకాక న్యాయంగా ధర్మజునికే రాజ్యం దక్కాలి. కానీ దుర్యోధనాదులకు ధర్మజుని పట్టాభిషేకం ఇష్టంలేదు. ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డి మాత్రమే కాదు. పుత్రులమీది ప్రేమతో నిజంగానే గుడ్డివాడై న్యాయాన్యాయ విచక్షణలేకుండా వ్యవహరించాడు. అందుకనే కౌరవులు అనేక పర్యాయాలు పాండవులను అష్టకష్టాలు పెట్టారు. ఎలాగైనా వారికి రాజ్యందక్కకూడదనే దురాలోచనకు మేనమామ శకునికూడా తోడైనాడు. తండ్రిని ఒప్పించి మాయాజూదం ఆడారు. పన్నెండేళ్ల అరణ్యవాసం, ఒకయేడు అజ్ఞాతవాసం నియమంగా పెట్టారు. జూదంలో ధర్మరాజు సర్వస్వం కోల్పోయాడు. నాటి సభలో దుర్యోధనాదులు పాండవులనే కాక, పట్టమహిషి అయిన ద్రౌపదిని కూడా దారుణంగా అవమానించారు. దుశ్శాసనుడు ద్రౌపదిని జుట్టుపట్టి నిండుసభలోకి ఈడ్చుకుని వచ్చాడు. దుర్యోధనుడు ద్రౌపదిని తన తొడమీద కూర్చోమన్నాడు. తుదకు కర్ణుని ప్రోద్భలంతో ఆమెకు వస్త్రాపహరణం చేశారు. ఆపద్బాంధవుడైన కృష్ణుడు ద్రౌపదికి అక్షయ వస్త్రాలిచ్చి, ఆమె మానం కాపాడాడు.

ఇలా ఎన్నో అవమానాలు భరించి, పాండవులు జూద నియమానుసారం అరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తిచేశారు. అప్పుడు ధృతరాష్ట్రుడు ఏం చెయ్యాలి ? న్యాయంగా వారికి రావలసిన రాజ్యభాగం ఇవ్వాలి. కాని, అలాచేయక ఉపప్లావ్యంలో ఉన్న పాండవుల వద్దకు, తన మంత్రియైన సంజయుణ్ణి రాయబారిగా పంపిస్తాడు. పాండవుల యోగక్షేమాలు కనుక్కొని రమ్మంటాడు. సంజయుని మాటలకు ధృతరాష్ట్రుని సందేశానికి శాంతికాముకుడైన ధర్మరాజుకూడా క్రోధోద్రిక్తుడౌతాడు. అతని క్రోధంచూసి సంజయుడు కూడా ఆశ్చర్యపడి, ధర్మజుని శాంతింపజేస్తాడు. తిరిగివచ్చి సంజయుడు ధృతరాష్ట్రునితో జరిగిన విషయం వివరిస్తాడు. వారు యుద్ధానికి సన్నద్ధులౌతున్నారని చెప్తాడు. ఆ రాత్రి ధృతరాష్ట్రునికి నిద్రపట్టలేదు. విదురుడు అనేకరకాలుగా నీతి బోధిస్తాడు. అయినా భీమసేనాదుల పరాక్రమాన్ని తలచుకొని ఎంతో దుఃఖిస్తాడు ధృతరాష్ట్రుడు.

ఇక అక్కడ సంజయుడు వెళ్ళిపోగానే, ధర్మజుడు ద్రౌపదితోసహా తమ్ములను, ఆప్తులను, సేవకులందరినీ పిలిచి కృష్ణునివద్దకు బయలుదేరాడు. అనేకవిధాలుగా యుద్ధంవల్లకలిగే నష్టాలు వివరించి, ఈ ఆపదనుండి తమను రక్షించడానికి నీవే సమర్థుడవని పేర్కొంటాడు. రాయబారిగా తమ పక్షాన కౌరవసభకు వెళ్ళుమని అర్థిస్తాడు. కృష్ణుడు రాయబారిగా వెళ్లేముందు విడివిడిగా పాండవులందరి అభిప్రాయాలు తెలుసుకుంటాడు. భీమార్జునులు ధర్మజుని మార్గాన్ని అనుసరిస్తున్నట్లు తోచగానే, వారిని యుద్ధానికి ప్రోత్సహిస్తాడు. చివరికి ద్రౌపది అభిప్రాయం తెలుసుకోవడానికి ఆమెవద్దకు వస్తాడు కృష్ణుడు. ఆమె భోరున విలపిస్తుంది. తన పరాభవాగ్ని చల్లారేదెప్పుడని నిలదీస్తుంది. ప్రతీకారం కోరుకుంటుంది. వేదనలో తల్లడిల్లే ద్రౌపదిని అనేక విధాలుగా ఊరడిస్తాడు కృష్ణుడు. ఈ సందర్భంలోనిదే ఈ పాఠ్యభాగం. ద్రౌపది తనకు జరిగిన అవమానాలను గుర్తుచేసుకుంటూ, కృష్ణునితో తాను పడిన భంగపాటును వివరించే సందర్భమిది.

## 1.4. 3

## కఠిన పదాలకు అర్థాలు :-

ఈ పాఠ్యభాగంలోని కొన్నికఠిన పదాలకు అర్థాల్ని తెలుసుకొందాము.

**100 ప.**

| | | |
|---|---|---|
| పరిదేవనము | = | దుఃఖం |
| భంగపాటు | = | అవమానం |
| ధర్మనందను పలుకులు | = | ధర్మజుని మాటలు |
| తాపము | = | దుఃఖము, బాధ |
| హృదయతాపము | = | హృదయానికి బాధ |
| ఒనరింప | = | కలిగించగా |
| దైన్యము | = | దీనభావం |
| కనలి | = | కోపించి |
| శౌరితో | = | కృష్ణునితో |
| గద్గదకంఠి | = | గద్గదమైన కంఠం కలదియై (రోషం, దుఃఖం కలిసిన కారణంగా దుఃఖంతో గొంతు బొంగురు పోయినదై) |
| పాంచాలి | = | పాంచాలదేశరాజైన ద్రుపద మహారాజు కుమార్తె అయిన ద్రౌపది |

ఒయ్యన్ + పలికెన్ (ఒయ్యబలికెన్) = మెల్లగా మాటాడినది.

(101, 102, 103, 104, 105 పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

**106. ప.**

మఱియున్ + ఇట్లు + అనియె = మఱియునిట్లనియె = ఇంకా ఇలాఅంది.

(107, 108 పద్యాలకు ప్రతి పదార్థ తాత్పర్యాలలో చూడండి).

**109. ప.**

అట్లున్ + కాక = అట్లుంగాక = అంతేకాకుండా

(110, 111, 112 పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి).

**113. ప.**

అని + అట్లు = అనియట్లు = అని ఆ విధంగా

ఉగ్గడించి = చెప్పి, (లేదా, పలికి, లేదా మాట్లాడి.)

(114 పద్యానికి ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

**115. ప.**

| | | |
|---|---|---|
| గోవిందు | = | కృష్ణుని |
| ముందటన్ ÷ పెట్టి | = | ముందటంబెట్టి = ముందుగపెట్టి (లేదా) ఎదురుగా పెట్టి |
| ఇట్లు + అనియె | = | (ద్రౌపది) ఈ విధంగా మాట్లాడింది. |

**116. ప.**

| | | |
|---|---|---|
| అచ్యుత | = | (నాశనము (చ్యుతి) లేనివాడా ! ) కృష్ణా ! |
| ఇవి | = | ఈ వెంట్రుకలు |
| దుస్ససేను వ్రేళ్లన్ | = | దుశ్శాసనుడి చేతి వ్రేళ్లకు |
| తవిలి | = | తగిలి (లేదా) చుట్టుకొని |
| సగము | = | సగభాగం |
| త్రెవ్విపోయి | = | తెగిపోగా |
| తక్కిన + అవి=తక్కినయవి | = | మిగిలినవి |
| వీనిన్ | = | ఈ మిగిలిన శిరోజాలను |

| | | |
|---|---|---|
| కౌరవుల కడన్ | = | కౌరవసభలో |
| తీఱు మాటల | = | సంధిమాటలను చెప్పే |
| అవసరమున | = | సందర్భంలో |
| తలపవలయున్ | = | తలచుకొనుము (లేదా) గుర్తుచేసుకొనుము. |

**117. ప.**

| | | |
|---|---|---|
| తొలుతగా | = | ముందుగా |
| పోరిలో | = | యుద్ధంలో |
| దుస్ససేను తనువు | = | దుశ్శాసనుని శరీరం |
| ఇంతలింతలు తునియలై | = | ఇంతింత చిన్న చిన్న ముక్కలై |
| చెదరి | = | చెల్లాచెదరై |
| రూపు + అఱియున్నన్ | = | గుర్తుపట్టడానికి వీల్లేకుండా రూపం నశించిపోగా |
| ఉడుకు | = | నా మనస్సులోని కోపం |
| ఆఱున్ | = | తీరుతుంది |
| అలుపాలన్ | = | చిన్న పనులతో |
| పొనుపడునట్టి | = | సమసిపోయే |
| చిచ్చు + ఏ | = | నిప్పుకాదిది. |
| పెనుగద | = | పెద్దగద |
| బాహుబలంబు | = | భుజబలం |
| కట్టి విక్రమంబు | = | అర్జునుని పరాక్రమం (అర్జునుడు నల్లగా ఉంటాడు) |
| కాల్పనే | = | తగలబెట్టనా ? |
| బన్నములు | = | అవమానాలు |
| కానన్ + పడయమైతిమేని | = | చూడకపోయినట్లైతే |

(118 పద్యానికి ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

**119. ప.**

| | | |
|---|---|---|
| ఎలుంగు | = | గొంతు, కంఠస్వరం |
| రాలుపడన్ | = | జీరపడునట్లుగా |
| యాజ్ఞసేని | = | ద్రౌపది |
| కృపాయత్త చిత్తుడై | = | కరుణగల మనస్సు కలవాడై |
| నారాయణుండు | = | కృష్ణుడు |
| ఊరార్చి | = | ఓదార్చి |
| పెను + నెఱివేణి =పెన్నెఱివేణి | = | పెద్దగా, అందంగా ఉన్న శిరోజాలను |
| ముడువన్ | = | ముడివేయడానికి |
| నియోగించి | = | నియమించి |
| ఆ + మానిని =అమ్మానిని | = | ఆ ద్రౌపదితో |

(120 పద్యానికి ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

**121. ప.**

| | | |
|---|---|---|
| లలనా | = | (ఓ స్త్రీ) ఓ ద్రౌపదీ ! |
| ఉడుగుము | = | ఊరడిల్లుము |

| | | |
|---|---|---|
| కురునృపాల పుత్రుల | = | ధృతరాష్ట్రుని కొడుకులైన కౌరవుల |
| కళత్రంబుల | = | భార్యల యొక్క |

122. ప.

| | | |
|---|---|---|
| యమ మహిష ఘంటికానాదము | = | యమధర్మరాజు యొక్క వాహనమైన దున్నపోతుమెడలోని గంటల సవ్వడి |
| కౌతూహలము | = | కుతూహలం, ఉత్సాహం |
| చిత్తము | = | మనస్సు |

123. ప.

| | | |
|---|---|---|
| పాంచాలసుతా ! | = | పాంచాల దేశపురాజు ద్రుపదుని పుత్రిక ద్రౌపదీ ! |
| విధినియతి | = | బ్రహ్మదేవుని నిర్ణయం |
| అదిఘటింపక పోదు | = | అది జరుగక పోదు |
| మేరువు తిరిగెనేని | = | మేరు పర్వతం తలక్రిందులైనా |

124. ప.

| | | |
|---|---|---|
| రిపుక్షయము | = | శత్రునాశనం |
| ఉజ్వల పుణ్యలక్ష్మీ సమేతులైన | = | గొప్పపుణ్యము అనే సంపదతో కూడిన (పాండవులు) |
| అధిక విభవము | = | అధికమైన వైభవము |
| తడవులేదు | = | వ్యవధి లేదు. |

**1.4. 4**

**పాఠ్యభాగ వివరణ :-**

**ద్రౌపది తనకు జరిగిన అవమానాల్ని కృష్ణునికి వివరించడం :**

ధర్మరాజు మాటలు ద్రౌపదికి ఎంతో మనస్తాపం కల్గించాయి. ముఖంలో దైన్యం కనబడుతుండగా, కోపంతో దుఃఖంతో కంఠం వణికి, జీరపడగా కృష్ణునితో ఈ విధంగా చెప్పింది. "కృష్ణా ! మమ్మల్ని కౌరవులు అన్ని అవమానాలపాలు చేసి, (అంటే మాయాజూదం ఆడి, రాజ్యం అపహరించి, తనకు వస్త్రాపహరణం చేసి, అడవుల పాలుచేసి) సంజయునితో రాయబారం పంపిస్తారా ? అంతమాత్రానికే ధర్మరాజు మనస్సులో సంతోషించాడు. అంతతేలిగ్గా దుర్యోధనుడు ఐదుగురికి ఐదూళ్లు తనంతటతానుగ ఇస్తాడా ? మామీద ఏ మాత్రం దయచూపించక, అతడు అన్నదమ్ములను బాధించలేదా ? అయినా ఈ ధర్మరాజు, దుర్యోధనుని మీదగల ప్రేమతో తాను ఇంతకుముందు పడ్డ అవమానాలనన్నింటిని సహిస్తాడా ? రాజ్యంలో భాగం లేకుండా వారితో ఈనాడు సంధికంగీకరిస్తే ఈ పాండవులందరు తెలివితక్కువ వారు, యుద్ధానికి అసమర్థులు, సిగ్గులేని వారని లోకులంతా నవ్వరా ?

కృష్ణా ! ఈ పాండవులు తమగౌరవం నశించేటట్లు, తమనుతాము తక్కువగా అంచనా వేసుకోవడమెందుకు ? వీరు సంధికంగీకరిస్తే ఆలోచిస్తే, కౌరవులకే అదిలాభం. వీరిబలం, అటు కౌరవుల సామర్థ్యం గనుక పోల్చిచూసుకున్నట్లయితే పాండవులు వారిపై పగతీర్చుకోలేరా? అట్లాగాక యుద్ధంలో వారిని చంపవలసివస్తే అందులో సందేహమెందుకు ? ఎటువంటి ఆపదలనైనా సహించి ఊరుకోవడానికి వారేమీ బ్రాహ్మణులా ? అచ్యుతా ! తాను ఓడిపోతాననే భావం దుర్యోధనుని మనస్సులో ఏ మాత్రం లేదు. నీ మాటల వల్ల అతని దురభిమానం ఇంకా పెరుగుతుంది. అక్కడ యుద్ధంవచ్చే పరిస్థితి గనుకవస్తే ఈ పాండవులు యుద్ధానికి సిద్ధపడతారా ? లేక మళ్లీ అరణ్యవాసం చేస్తారా ? నేనిలా అంటున్నానని నీవు వేరేవిధంగా భావించవద్దు. నీవు ధర్మరాజు, మిగిలిన తమ్ముళ్లు బాగా ఆలోచించి మనపని అయ్యేటట్లు చూడండి. మీ మంచితనం చెడకుండా, సంధి చేయాల్సివస్తే ఎంతోనేర్పుతో మీకు నచ్చినట్లు చేయండి.

ఎన్నో అవమానాలు పొంది, వాటి దుష్ఫలితాలను అనుభవించిన బాధతో సరిగ్గా మనస్సు నిలుపలేక మాటలు నోటికివచ్చినట్లు ప్రేలుతున్నానేమో ? (క్రోధంతో మతి చెడిన మనిషికి వివేకం ఎట్లా ఉంటుంది ? )

కృష్ణా ! నేను వరంవల్ల జన్మించాను. భరతవంశంలో కాలుపెట్టాను. అందులోనూ పాండురాజుకు కోడలినయ్యాను. జనులచేత నమస్కరింపదగిన పాండవులను భర్తలుగా పొందాను. రాజనీతిలోనూ, పరాక్రమంలోనూ సుస్థిరులైన కుమారులను కన్నాను.

తోడబుట్టినవారి అండకూడా నాకున్నది. ఇన్ని రకాలుగా నేను ప్రశస్తిని పొందాను. నీవు సుభద్రకంటె నన్ను ప్రేమతో గౌరవంతో సంభావిస్తావు. ఇటువంటి నన్ను రాజసూయం చివరగా చేసే పవిత్రమైన అవబృథ స్నానంతో వృద్ధిపొందిన నా జుట్టు పట్టుకొని ఈ అయిదుగురూ చూస్తుండగా కౌరవసభకు ఒక నీచుడు ఈడ్చుకునివెళ్లాడు. కులస్త్రీని ఈ విధంగా చేస్తారా ? ఆ సభకు ఏకవస్త్రనైన (రజస్వలగా ఉన్న) నన్ను లాక్కునివచ్చి అవమానించే దుశ్శాసనుణ్ణి చూస్తూ కూడా నాభర్తలు తగిన చేష్టలులేక, నాపై ఆశలు వదిలివేసి, బొమ్మల్లాగా చూస్తూ ఉండిపోయినప్పుడు నీ మీది విశ్వాసంతో నా మనస్సులో నిన్ను స్మరించుకున్నాను. అది గుర్తుతెచ్చుకో.

ధృతరాష్ట్రుడు ఏ మాత్రం ఆలోచించకుండా నా భర్తలు జూదంలో ఓడినప్పుడు నన్ను దాసినిచేశాడు. ఇప్పుడు మళ్లీ నాభర్తలు ఆ మహాపురుషుని దగ్గరకు వెళితే నేను అక్కడ కోడలిగా ఉండనా ? లేక దాస్యం చెయ్యనా ? నీవే నిశ్చయింపుము.

అనిపలికి ద్రౌపది తన పెద్దదైన జుట్టుముడి ఒక్కసారిగా విప్పి, ఆ వెంట్రుకలను ఎడంచేత్తో పట్టుకుంది. ఆ జుట్టు వ్రేలాడుతున్న నల్లని పెద్దపాములాగా ఉంది. మనస్సులోనుంచి పైకి తన్నుకుని వచ్చే విషాదరోషాలు ఆపుకోలేక కూర్చున్న చోటునుండి దిగ్గునలేచి ఆ జుట్టు గోవిందుని ముందుపెట్టి కృష్ణునితో ఎంతో ఆర్తిగా ఇలాచెప్పింది. "అచ్యుతా ! ఇవి దుశ్శాసనుడి చేతి వ్రేళ్లతగిలి సగం తెగిపోగా మిగిలినవి. నీవు కౌరవుల దగ్గర సంధి మాటలు మాట్లాడేటప్పుడు వీటిని గుర్తుంచుకో ! ఈ వెంట్రుకలు పట్టి ఈడ్చిన ఆ దుశ్శాసనుడి చెయ్యి యుద్ధంలో ముందుగా ముక్కలు కావాలి. అతని శరీరం గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఇంతింత చిన్న చిన్న ముక్కలై చెల్లాచెదురు కావాలి. ఆ దృశ్యం నేనుచూస్తేనే కాని నా మనస్సులోని దుఃఖం చల్లారదు. అంతంత మాత్రం పనులతో ఆరే చిచ్చు కాదిది. ఇన్ని అవమానాలపాలైన ధర్మరాజు, నేనూ కలిసి రాజరాజు శవాన్ని కళ్లారా చూస్తేగాని నా అవమానభారం తగ్గదు. లేకపోతే, పెద్ద గదనుపట్టిన భీముని బాహుబలం, గాండీవమనే ధనస్సును మోసే అర్జునుడి పరాక్రమం ఎందుకు ? తగలబెట్టనా ? తప్పనిసరిగా నిప్పును ఒళ్లో దాచుకున్నట్లు చాలాకాలం ఈ అవమానమనే అగ్నిని భయంకరమైన ఓర్పుతో భరించాను. దుష్టశిక్షణ చేసి, జగత్తును రక్షించే నీవు, పరాక్రమవంతులైన భర్తలుండగా ఇది ఆరేదెన్నడో కదా ! అని కంఠస్వరం బొంగురుపోయేటట్లు ద్రౌపది దుఃఖించింది.

**కృష్ణుని ఓదార్పు :-**

ద్రౌపది దుఃఖాన్నిచూసి, కరుణాంతరంగుడై కృష్ణుడు ఆమెను ఓదార్చి కూర్చోబెట్టాడు. ఆమె కన్నీటిని తుడవడానికి, పెద్ద జుట్టును ముడివేయడానికి పరిచారికలను నియమించి ఇలా మాట్లాడసాగాడు.

"అమ్మా ! ద్రౌపదీ ! నేనుండగా నీవు దుఃఖించడం ఎందుకు ? భీమార్జునులిరువురు నాకు తోడుకాగా, ధర్మజుని ఆజ్ఞానుసారం, నీవు మెచ్చుకునేటట్లుగా తప్పకుండా శత్రునాశనం చేస్తాను. వేరొకడెవ్వడూ ఈ పనికిచాలడు. ఊరికినే దురాత్ములైన కౌరవులు రాజ్యాన్నిస్తారా ? నీ దుఃఖం ఇంక కొంతకాలమే. ఇంక కౌరవుల భార్యల ఏడుపులు వింటూ నీవు కలకలా నవ్వేరోజులు దగ్గరపడుతున్నాయి. యమధర్మరాజు యొక్క వాహనమైన దున్నపోతు మెడలోని గంటల చప్పుడు వినడానికి కుతూహలపడే కౌరవులకు సంధి, శాంతివచనాలు ఇష్టంకావు. విధినియమం కూడా అంతే. అదిజరుగక తప్పదు. మేరువు తల్లక్రిందులైనా జరగాల్సిన పని జరుగుతుంది. నేను గట్టిగా చెబుతున్నాను విను. శత్రుసంహారం చేసి పాండవులు గొప్ప వైభవంతో పుణ్యలక్ష్మీ సహేతులుకావడం నీవు తప్పక చూడగలవు. దీనికి ఇంక ఆలస్యంలేదు. ఇది నిజం" - అని కృష్ణుడు ద్రౌపదిని ఓదార్చాడు.

**డాక్టర్. జి. వైదేహి,** ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
రీడర్, తెలుగు శాఖ,
టి.జె.పి.ఎస్. కళాశాల.

**1.5.0 పరిచయం :** ఆంధ్ర మహాభారతంలో తిక్కన రచించిన ఉద్యోగపర్వంలోని ద్రౌపదీ పరిదేవనము పాఠానికి సంబంధించిన విశేషాలు తెలుసుకొన్నారు.

**1.5.1. ఉద్దేశం :** ముందుపాఠంలో పాఠ్యభాగ సందర్భం, కఠిన పదాలకు అర్థాలు, పాఠ్యభాగవివరణ తెలుసుకొన్నారు. ఇప్పుడు ముఖ్య పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు, సందర్భసహిత వ్యాఖ్యలు పరీక్షకురాదగిన ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొంటారు.

**ముఖ్య పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు తెలుసుకొంటారు.**

**1.5.2 : ప్రతిపదార్థ తాత్పర్యాలు :**

**పద్యం 101 :**

“అంతలుచేసి పోనడచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె యిట్టి యూఱట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు, తా
నంతన యూళులేవురకు నైదు సుయోధనుడిచ్చునొక్కొ, యూ
కంత కృపావిహీనమతి నాతడు నొంచునె యన్నదమ్ములన్’’ --

(102, 103, 104, 105, 107, 108, 110, 111, 112, 114, 118 పద్యాలకు పరిచయం, సందర్భం ఈ క్రింద యిచ్చినట్లుగానే అన్నింటికి రాయండి)

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| అక్కటా | = | అయ్యో! |
| అంతలు + చేసి | = | జూదం, వస్త్రాపహరణం మొదలైన అన్ని అవమానాలు (అకృత్యాలు) చేసి, |
| పోన్ + అడచి | = | వాటిని మరచిపోయి (తమను అరణ్యాలపాలు చేసి) |
| సంజయుచేతన్ | = | సంజయుని ద్వారా |
| చెప్పి పుత్తెంతురు + ఏ | = | రాయబారాన్ని పంపిస్తారా? |
| ఇట్టి | = | ఇటువంటి |
| ఊఱట | = | ఊరడింపు మాటలతో |
| యుధిష్ఠిరుండు | = | ధర్మరాజు |
| మదిన్ | = | మనస్సులో |
| ప్రియము + అందెన్ | = | సంతోషించెను |
| తాన్+ అంతన | = | తనకు తానుగా |
| ఐదు ఊళులు | = | ఐదూళ్లు |
| ఏవురకున్ | = | ఈ ఐదుగురు అన్నదమ్ములకు |
| సుయోధనుడు | = | ఆ దుర్యోధనుడు |
| ఇచ్చున్ + ఒక్కొ ! | = | అంతతేలికగా ఇస్తాడా? |
| ఆతడు | = | అతడు |
| కృపావిహీన మతిన్ | = | దయలేనివాడై |
| ఈక + అంత | = | ఐదూళ్లను గూడ ఇవ్వక |
| అన్నదమ్ములన్ | = | ఈ పాండవులను |
| నొంచునె | = | బాధ పెట్టునా? |

**తాత్పర్యం :-** అయ్యో ! తమను అన్ని అవమానాల పాలుచేసి, ఇంకను సంజయుని చేత సంధిమాటలు చెప్పి పంపిస్తారా? ఈ ఊరడింపు మాటలతో ధర్మజుడు సంతోషించిననూ ఆ దుర్యోధనుడు ఐదూళ్లను అన్నదమ్ములకు పంచిఇచ్చునా? ఇవ్వకుండా ఇంకా అన్నదమ్ములను బాధ పెట్టునా?

**102. ప**

"తన మును పడ్డ బన్నములుఁ దమ్ములపైఁగల కూర్మిపేర్మి నీ
జనపతిసైఁప కున్నె యదిసక్కన రాజ్యము పాలులేక తీ
ఱున కొడఁ బాటు కల్గిన నెఱుంగమిపెట్టరె చాలరైరి వీ
రన రొకొ నానలేమి యని యాడరె లోకమువారు కేశవా !" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| కేశవా ! | = | ఓ కృష్ణా ! |
| ఈ జనపతి | = | ఈ ధర్మరాజు |
| తన | = | తనయొక్క |
| మునుపడ్డ | = | ఇంతకుముందు అనుభవించిన |
| బన్నములు | = | అవమానాలు, కష్టాలు |
| తమ్ముపైగల | = | తమ్ముని మీద గల |
| కూర్మి పేర్మిన్ | = | అధికమైన ప్రేమతో |
| సైపక + ఉన్న ? | = | సహింపకుండునా? |
| అది + చక్కన | = | అది మంచిదే, |
| రాజ్యము | = | కురుసామ్రాజ్యమందు |
| పాలులేక | = | భాగాన్ని పొందక |
| తీఱునకున్ | = | సంధికి |
| ఒకబాట కల్గిన | = | ఒప్పందము చేసికొన్నచో |
| లోకమువారు | = | లోకంలోని ప్రజలందరు |
| వీరు | = | ఈ పాండవులు |
| ఎఱుంగమి పెట్టరె ? | = | అవివేకులని ఆరోపింపరా ? |
| చాలరు + ఐరి | = | యుద్ధం చేయడానికి సామర్థ్యం లేనివారు అని |
| నానలేమియని | = | సిగ్గులేని వారని |
| ఆడరె ? | = | పలుకకుంటారా ? |

**తాత్పర్యం :** ఓ కృష్ణా ! ఈ ధర్మరాజు తమ్ముని మీదగల అభిమానంతో తాను ఇంతకుముందు అనుభవించిన కష్టాలన్నింటిని సహిస్తాడు. అది చాలక, రాజ్యభాగం లేక, సంధికి ఒప్పందం కుదుర్చుకుంటే, వీరు అవివేకులని, యుద్ధానికి చాలరని, వీరకి సిగ్గు లేదని ప్రజలందరు ఆరోపించరా?

103. ప.

“పెంపేదం దమకిట్టి తక్కువలు రూపింపంగ నేలా, విచా
రింపగన్ వారిక మేలు సంధి, తమువారింజూచినం దారు సా
ధింపంజాలరొ, కాకపోరఁ దగ మర్దింపం దలంపేని శం
కింపం బట్టొకొ వారు బ్రాహ్మణులె యేకీడైన సైరింపగన్” --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| తమకున్ | = | పాండవులకు |
| పెంపు + ఏదన్ | = | తమకున్న ఆధిక్యం నశించగా |
| ఇట్టి తక్కువలు | = | తాము తక్కువ వారమనే ఆలోచన |
| రూపింపంగన్ + ఏలా ? | = | నిరూపించడం ఎందుకు? |
| విచారింపక | = | ఆలోచించి చూస్తే |
| వారిక | = | వారికే, ఆ కౌరవులకే |
| సంధిమేలు | = | సంధి మంచిది |
| తము | = | పాండవులను |
| వారిన్ | = | ఆ కౌరవులను |
| చూచినన్ | = | పోల్చి చూసినట్లైతే (బలాబలాలు పోల్చుకుంటే) |
| తారు | = | ఆ పాండవులు |
| సాధింపన్ + చాలరొ | = | కౌరవుల పై ప్రతీకారం తీర్చుకోలేరా? |
| కాక | = | ఆ విధంగా కాక |
| పోరన్ | = | యుద్ధమందు |
| తగమర్దింపన్ | = | తగినట్లుగా సంహరించడానికి |
| తలంపు + ఏనిన్ | = | ఆలోచన ఉన్నట్లైతే |
| శంకింపన్ | = | సందేహించడం |
| పట్టుకో | = | అదొక విషయమా? |
| ఏకీడు + ఐనన్ | = | ఎటువంటి ఆపదనైనా, |
| సైరింపగన్ | = | సహించడానికి |
| వారు | = | ఆ కౌరవులు |
| బ్రాహ్మణులు + ఏ | = | బ్రాహ్మణులా ? (కారుకదా!) |

**తాత్పర్యం :-** ఈ పాండవులు తమని తాము తక్కువగా అంచనా వేసుకోవడం ఎందుకు? ఆలోచిస్తే సంధి ఆ కౌరవులకే మంచిది. తమను, ఆ కౌరవులను పోల్చిచూసుకున్నట్లైతే, ఆ కౌరవులను వీరు సాధించలేరా ? అలాకాకుండా యుద్ధంలో కౌరవులను సంహరించాలన్న ఆలోచన ఉంటే సందేహించడమెందుకు ? ఇంకా, ఎటువంటి ఆపదలైనా సహించడానికి ఆ కౌరవులు బ్రాహ్మణులు కారు కదా !

104. ప

"ఓట యొకింత యేనియు సుయోధను చిత్తమునందు లేడు నీ
మాటలఁ బోవునే దురభిమానము యెక్కుడు పూనుఁగాక య
చ్చోటన సంగరంబులగు చొప్పులు పుట్టిన నైనఁ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ పోదురొ కానలనుండ నచ్యుతా" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| అచ్యుతా | = | ఓ కృష్ణా! |
| సుయోధను | = | ఆ దుర్యోధనుని |
| చిత్తమునందు | = | మనస్సులో |
| ఓట | = | ఓడిపోతామనే భయం |
| ఒక + ఇంత + ఏనియు | = | కొంచెమైనా |
| లేడు | = | లేదు. |
| నీ మాటలన్ | = | నీ మాటలను బట్టి |
| పోవునే | = | అతడు నడచుకొంటాడా ? |
| దురభిమానము + అ | = | దురహంకారమే |
| ఎక్కుడు | = | అధికంగా, ఎక్కువగా |
| పూనున్ + కాక | = | కలిగి ఉంటాడు |
| ఆ + చోటన్ | = | ఆ కౌరవసభలో |
| సంగరంబులు + అను | = | యుద్ధమే తప్పదను |
| చొప్పలు | = | పరిస్థితులు |
| పుట్టిన + ఐనన్ | = | ఏర్పడినట్లైతే, |
| పాండవుల్ | = | ఈ పాండవులు |
| పోటునకు | = | యుద్ధానికి, |
| ఇచ్చగింతురు + ఒకొ! | = | ఇష్టపడతారా ? లేక |
| కానలనుండన్ | = | మళ్లీ అరణ్యాలలో నివసించడానికి |
| పోదురో | = | పోతారా? |

**తాత్పర్యం :-** కృష్ణా ! దుర్యోధనుడి మనస్సులో తాను ఓడిపోతాననే భావం ఏమాత్రం లేదు. నీ సంధి వచనాలతో అతనిలోగల దురభిమానం ఇంకా ఎక్కువౌతుంది. ఆ కౌరవసభలో తప్పనిసరిగా యుద్ధమే తప్పదన్న పరిస్థితులు గనుక వస్తే, ఈ పాండవులు యుద్ధం చెయ్యడానికి ఇష్టపడతారా ? లేక మళ్ళీ అరణ్యాలకు వెళతారా?

105 ప.

"ఏనిటులంటి నా వలవ దింకను నీవును రాజు(దమ్ములుం
గా నుచితంబు చూచి మనకార్యము మీ సుజనత్వముంజెడం
గా నొక భంగి చేయక, తగం గురువర్గము తోడి సంధి మీ
కైన తెఱంగునన్ వలచినట్టుల చేయుడు నేర్పులేర్పడన్'' --

**పరిచయం :**

**సందర్భం :**

| | | |
|---|---|---|
| ఏన్ | = | నేను |
| ఇటుల + అంటి | = | ఈవిధంగా పలికితిని |
| నా వలవదు | = | అని భావించవద్దు |
| ఇంకను | = | ఇకమీదట |

| | | |
|---|---|---|
| నీవును | = | నీవును (కృష్ణుడును) |
| రాజున్ | = | ధర్మరాజు |
| తమ్ములున్ | = | భీమాది సోదరులు |
| ఉచితంబు | = | తగినది |
| కాన్ | = | అగునట్లుగా |
| చూచి | = | ఆలోచించి |
| మన కార్యమున్ | = | మన పని |
| మీసుజనత్వమున్ | = | మీ మంచితనం |
| చెడన్ + కాన్ | = | చెడిపోవునట్లుగా |
| ఒక భంగి | = | ఒక మార్గాన్ని, పద్ధతిని, |
| చేయక | = | అనుసరించక |
| కురువర్గము తోడి | = | కౌరవులతో |
| సంధి | = | సంధి |
| తగన్ | = | అనుకూలమగునట్లు |
| మీకు + ఐనతెఱంగునన్ | = | మీకు తగిన పద్ధతిలో |
| నేర్పులు + ఏర్పడన్ | = | నైపుణ్యము స్పష్టమగునట్లు |
| వలచినట్టుల | = | నచ్చిన విధంగా |
| చేయుడు | = | చేయవలసింది. |

**తాత్పర్యం :-** నేను ఈ విధంగా మాట్లాడానని భావించవద్దు. నీవు, ధర్మజుడు, భీమాది సోదరులు కలసి తగిన విధంగా ఆలోచించి, మీ మంచితనం, మన కార్యం చెడకుండునట్లుగా, మీ నేర్పులు స్పష్టమగునట్లుగా కౌరవులతోటి సంధి నచ్చినట్లుగా చేయండి.

107. ఉ.

"ఆఱడి ఁబోకయున్ ఫలము నందుటయుంగని పల్కు నేరమిన్
మాఱట నోరి దాననయి మాటలు చిత్తము నందు నిల్వ కేఁ
గాఱులు ప్రేలెదన్ వినుడు కర్జము నెగ్గను గాన నల్కమై
వీఱిఁడి యైన మానిసికి వెండి వివేకము కల్గనేర్చునే" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| ఆఱడిన్ + పోకయున్ | = | నింద పోగొట్టుకోలేక (మరచిపోలేక) |
| ఫలమున్ | = | వాటిఫలితాన్ని |

| | | |
|---|---|---|
| అందుటయున్ | = | పొందిన దానవై యుండి |
| కని | = | చూచి |
| పల్కనేరమిన్ | = | మాట్లాడు పద్ధతి తెలియక |
| మాఱట నోరి దానన్ + అయి | = | చెప్పిన దానినే పదేపదే చెప్తుతూ |
| మాటలు | = | పలుకులు |
| చిత్తమందు | = | మనస్సునందు |
| నిల్పక | = | నిలుపు కొనలేక |
| ఏన్ | = | నేను |
| కాఱులు | = | కఠినపు మాటలు |
| ప్రేలెదన్ | = | మాట్లాడుతున్నాను. |
| వినుడు | = | బాగావినండి |
| కర్జమున్ | = | తగిన కార్యాన్ని |
| ఎగ్గను | = | కీడును |
| కానన్ | = | తెలియదు. (ఉచితానుచితాలు నాకు తెలియవు) |
| అల్కమై | = | కోపంతో |
| వీఁటిడియైన | = | అవివేకి అయిన |
| మానిసికి | = | మనుష్యునికి |
| వెండి | = | మరల |
| వివేకము | = | విచక్షణాజ్ఞానం |
| కల్గనేర్చునే | = | కలుగుతుందా? |

**తాత్పర్యం :-** అనేక బాధలనుభవించి, వాటి ఫలితాన్ని పొందిన కారణంగా సరైన పద్ధతిలో మాట్లాడలేక, చెప్పిన వాటినే పదేపదే పల్కుతూ మనస్సు నిలుపుకోలేక కఠినంగా పరుషపు మాటలు మాట్లాడుతున్నాను. నాకు మేలేదో కీడేదో తెలియదు. కోపంతో మతిస్థిమితం లేని మనిషికి వివేకం కలుగుతుందా ?

**108. ప**

"వరమునఁబుట్టితిన్ భరత వంశముఁ జొచ్చితి నందుఁ బాండు భూ
వరునకుఁ గోడలైతి జనవంద్యులఁ బొందితి నీతి విక్రమ
స్థిరులగు పుత్రులం బడసితిన్ సహజన్ములఁ బ్రాపు కాంచితిన్
సరసిజనాభ యిన్నిటఁ బ్రశస్తికినెక్కిన దాన నెంతయున్" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| సరసిజనాభ | = | పద్మము నాభియందుగల ఓ కృష్ణా ! |
| వరమునన్ | = | దేవతల వర ప్రభావం చేత |
| పుట్టితిన్ | = | జన్మించితిని. |
| భరతవంశమున్ | = | భరతవంశమందు |
| చొచ్చితిన్ | = | ప్రవేశించితిని, (మెట్టితిని) |
| అందున్ | = | అందుకూడ |
| పాండు భూవరునకున్ | = | పాండురాజుకు |
| కోడలు + ఐతిన్ | = | కోడలినయ్యాను. |
| జన వంద్యులన్ | = | ప్రజలచేత నమస్కరింపదగు పాండవులను |
| పొందితి | = | భర్తలుగా పొందితిని. |
| నీతి విక్రమ స్థిరులు + అగు | = | రాజనీతిలోను, పరాక్రమంలోను గొప్పవారైన |
| పుత్రులన్ | = | కుమారులను (ఉపపాండవులను) |
| పడసితిన్ | = | పొందితిని |
| సహజన్ముల | = | తోబుట్టువుల యొక్క |
| ప్రాపు | = | అండను, సహకారాన్ని |
| కాంచితిన్ | = | పొందితిని |
| ఇన్నిటన్ | = | ఇన్ని విషయాలలోను |
| ఎంతయున్ | = | ఎంతగానో (నేను) |
| ప్రశస్తికిన్ + ఎక్కిన దానను | = | ప్రసిద్ధి పొందిన దానను |

**తాత్పర్యం :-** ఓ కృష్ణా ! నేను వరప్రభావం చేత జన్మించాను. భరతవంశంలో కాలుపెట్టి అందునా పాండురాజుకు కోడలినయ్యాను. ప్రజలందరిచేత నమస్కరింపదగు పాండువులను భర్తలుగా పొందగలిగాను. రాజనీతి, పరాక్రమోపేతులైన కుమారులకు జన్మనిచ్చితిని. నాకు తోబుట్టువు అండకూడ కలదు. నేను ఇన్నిటిలో ప్రసిద్ధి పొందినదానను.

110. ప

"నీవు సుభద్ర కంటెఁ గడునెయ్యము గారవముందలిర్ప సం
భావన చేయు దిట్టినను ఁబంకజనాభ యొకండు రాజ సూ
యావబృథంబు నందు శుచియై పెనుపొందిన వేణి వట్టి యీ
యేవురు ఁజూడగా సభకునీడ్చె ఁగులాంగన నిట్లొనర్తురే" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| పంకజనాభ ! | = | పద్మము నాభియందు గలవాడా ! ఓ కృష్ణా ! |
| నీవు | = | నీవు |
| సుభద్ర కంటె | = | నీ చెల్లెలైన సుభద్ర కన్నను |

| | | |
|---|---|---|
| కడు | = | మిక్కిలిగా |
| నెయ్యము | = | వాత్సల్యము |
| గారవమున్ + తలిర్ప | = | గౌరవమును అతిశయించగా |
| సంభావన చేయుదు | = | సమ్మానిస్తావు (భావిస్తావు) |
| ఇట్టిననున్ | = | ఇటువంటి నన్ను |
| ఒకండు | = | ఒక నీచుడు |
| రాజసూయ + అవబృథంబునందున్ | = | రాజసూయ యాగాంతమందు చేసే మంగళ స్నానమందు |
| శుచియై | = | పవిత్రనై |
| పెను + పొందిన | = | వృద్ధి పొందిన |
| వేణిన్ + పట్టి | = | శిరోజాలను పట్టి |
| ఈ + ఏవురు | = | ఈ అయిదుగురు (తన భర్తలైన పాండవులు) |
| చూడగా | = | చూచుచుండగా |
| సభకున్ + ఈడ్చెన్ | = | రాజసభలోకి ఈడ్చుకొని వచ్చాడు. |
| కుల + అంగనన్ | = | కులస్త్రీని |
| ఇట్లు + ఒనర్తురే | = | ఈ విధంగా చేస్తారా ? |

**తాత్పర్యం :-** ఓ కృష్ణా ! నీవు సుభద్ర కన్న, నన్ను ఎంతో ప్రేమతో గౌరవిస్తావు. అటువంటి నన్ను రాజసూయ అవబృథ స్నానంతో పవిత్రమై వృద్ధి పొందిన నాజుట్టు పట్టుకొని ఈ నా భర్తలు అయిదుగురు చూస్తుండగానే ఒక నీచుడు సభలోకి ఈడ్చుకొని వచ్చాడు. కులస్త్రీని ఈవిధంగా చేస్తారా ?

**111. ప**

ఆ సభ కేకవస్త్ర యగునట్టి ననుంగొని వచ్చి నొంచు దు
శ్శాసనుఁ జూచుచుం బతులసంభ్రమములై తగుచేష్ట లేక నా
యాసలుమాని చిత్రముల యాకృతి నున్నయెడన్ ముకుంద, వి
శ్వాసముతోడ నిన్‌గొలువ వచ్చె మనం బదియుం దలంపవే" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| ముకుంద | = | కృష్ణా ! |
| ఆ సభకు | = | ఆనాటి కౌరవ సభలోకి |
| ఏకవస్త్ర + అగున్ + అట్టి | = | ఏకవస్త్రనైన |
| ననున్ + కొనివచ్చి | = | నన్ను తీసికొనివచ్చి |
| నొంచు | = | అవమానించు |

| | | |
|---|---|---|
| దుశ్శాసనున్ | = | దుశ్శాసనుని |
| చూచుచున్ | = | ఊరికే చూస్తూ |
| పతులు | = | నా భర్తలు |
| అసంభ్రములు + ఐ | = | కదలిక లేక |
| తగు చేష్టలేక | = | చేష్టలుడిగి |
| నా + ఆశలు మాని | = | నా మీద ఆశలు వదలుకొని |
| చిత్రముల + ఆకృతి | = | కేవలం బొమ్మలవలె |
| ఉన్న యెడన్ | = | ఉన్నప్పుడు |
| మనంబు | = | నా మనస్సు |
| విశ్వాసము తోడ | = | నీవు రక్షిస్తావనే నమ్మకంతో |
| నిన్ + కొలువవచ్చె | = | నిన్ను ప్రార్థించ వీలైంది. |
| అదియున్ | = | ఆ విషయం కూడ |
| తలంపవే | = | జ్ఞప్తి యందుంచుకో. |

**తాత్పర్యం :-** ఓ కృష్ణా ! నాటి సభలోకి ఏకవస్త్రనైన నన్ను తెచ్చి అవమానించు దుశ్శాసనుని చూస్తూ నా భర్తలు నా మీది ఆశలు మానుకొని కేవలం బొమ్మలలాగా చేష్టలుడిగి ఉన్నప్పుడు నీవు రక్షిస్తావనే నమ్మకంతో నామనస్సు నిన్ను ప్రార్థించింది. సంధి మాటలు మాట్లాడేటప్పుడు ఈ విషయం కూడ జ్ఞప్తియందుంచుకో.

**112. ప**

"అరయమిఁ జేసి కోడలనకప్పుడు దాసిగఁజేసె నమ్మహా
పురుషుని పాలికిం బతులు పోవగ వీరలతోన యేను జె
చ్చెరఁజని కోటరంబు దగఁజేయుదునో యట గాక పాడిమై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ నిశ్చయింపుమా" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| మాధవ | = | లక్ష్మీ భర్త అయిన శ్రీ కృష్ణా ! |
| అరయమిన్ + చేసి | = | ఆలోచనలేక (అజ్ఞానంలో) |
| కోడలు + అనక | = | కోడలని ఆలోచించకుండ |
| అప్పుడు | = | ఆ జూద సమయమందు |
| దాసిగన్ + చేసె | = | దాసిగా చేశాడు. |
| ఆ + మహాపురుషుని పాలికిన్ | = | అటువంటి ధృతరాష్ట్రుని వద్దకు |
| పతులు పోవగ | = | నా భర్తలు వెళ్లితే, |
| వీరలతోన | = | వీరితో కలసి |

| | | |
|---|---|---|
| ఏను | = | నేను |
| చెచ్చెరన్ + చని | = | వెంటనే వెళ్లి |
| కోటరంబు తగన్ | = | తగినట్లు కోడలిగ |
| చేయుదునో | = | చేయుదునా ? |
| అటున్ + కాక | = | ఆ విధంగా కాక |
| వారికి | = | ఆ ధృతరాష్ట్రునకు |
| వరవుడము + ఓపి | = | దాస్యం సహించి |
| చేయుదునా | = | చేయుదునా ? |
| పాడిమై | = | న్యాయంగా |
| నిశ్చయింపుమా | = | నీవే నిశ్చయింపుము. |

**తాత్పర్యం :-** ఓ కృష్ణా ! నాటి జూద సమయమందు కోడలని కూడ ఆలోచించక సభలో దాసిగా నిర్ణయించబడ్డాను. అటువంటి ధృతరాష్ట్రుని వద్దకు నేడు నా భర్తలు రాజ్యం కొరకు వెళ్లితే వీరితో కలసి నేను కోడరికము చేయుదునా ? లేక దాస్యం చేయుదునా? నీవే నిశ్చయింపుము.

**114. ఉ**

“ద్రోపది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెండ్రుకల్
దా వలచేతఁ బూని యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలగు మనంబునఁ బొంగు విషాదరోషముల్
కావఁగ లేక బాష్పములు గ్రమ్మగ దిగ్గనలేచి యార్తయై’’ --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| ద్రోపది | = | ద్రౌపది |
| బంధురంబు + అయిన | = | దట్టమైన |
| క్రొత్త + ముడి = క్రొమ్ముడి | = | జుట్టుముడిని |
| తాన్ | = | తాను |
| వలచేతన్ + పూని | = | కుడిచేతి యందుంచుకొని, |
| అసితచ్ఛవిన్ | = | నల్లని కాంతితో నున్న |
| మహాభుజంగమోనాన్ | = | పెద్ద పామో అనునట్లుగా |
| విలసిల్లి | = | ప్రకాశించి |
| వ్రేలగు | = | వ్రేలాడు |
| వెండ్రుకల్ | = | వెండ్రుకలను, (జుట్టును) |

| | | |
|---|---|---|
| గ్రమ్మన | = | గ్రక్కున |
| విడ్చి | = | విప్పి |
| మనంబున | = | మనస్సునందు |
| పొంగు | = | పొంగుకొనివచ్చు |
| విషాదరోషముల్ | = | దుఃఖమూ కోపమూ |
| కావగలేక | = | ఆపుకొనలేక |
| బాష్పములు | = | కన్నీరు |
| గ్రమ్మగన్ | = | కారుతుండగ |
| దిగ్గనలే+ | = | ఒక్కసారిగా లే+ |
| ఆర్తయై | = | దుఃఖితురాలై |

**తాత్పర్యం :-** ద్రౌపది, నల్లని పెద్దపాము వలె వ్రేలాడు దట్టమైన జుట్టును ఊడదీసి, మనస్సులో విషాదరోషాలు ముసురుకోగా ఎంతో దుఃఖంతో కన్నీరు కార్చుతూ, ఒక్కసారిగా లేచి దీనంగా కృష్ణునితో పలుకసాగింది.

**118. ప**

"నెట్టన యిట్టి యల్క మదినిల్పితి రక్కెసతాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు పెద్దయును కాలము దీనికి నాఋ టెన్నడుం
బుట్టదు దుష్టనిగ్రహము పూని జగంబులు కాచునట్టితో
బుట్టువు నీవు ఁదేజమునుఁ బొల్చిన భర్తలుఁ గల్గ నచ్యుతా" --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :**

కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి ధర్మరాజు నిశ్చయించాడు. అపుడు కృష్ణుడు పాండవులైదుగురి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకొని, చిట్ట చివరకు ద్రౌపది వద్దకు వచ్చాడు. ఆమె మిగుల దుఃఖంతో ప్రతీకారవాంఛతో రగిలిపోతుంది. అందుకని వ్యంగ్యంగా ధర్మజుని శాంతివచనాలను తిప్పి కొట్టింది. తన మనస్సులోని నిశ్చితాభిప్రాయాన్ని కృష్ణునికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| అచ్యుతా ! | = | ఓ కృష్ణా ! (నాశనము లేనివాడు అచ్యుతుడు) |
| నెట్టన | = | పూనికతో, (తప్పనిసరియై) |
| రక్కెసతాల్మిన్ | = | రాక్షసమైన ఓర్పుతో (మానవులకు అసాధ్యమైన ఓర్పుతో) |
| ఇట్టియల్క | = | ఇటువంటి కోపాన్ని |
| చిచ్చు + ఒడిన్ + కట్టినయట్ల | = | నిప్పును ఒడిలో కట్టినట్లుగా |
| పెద్దయును కాలము | = | చాల కాలం |
| మది నిల్పితిని | = | మనస్సులో దాచుకొన్నాను. |
| దుష్టనిగ్రహము | = | దురాత్ములను సంహరించడమనే కార్యాన్ని |
| పూని | = | వహించి |
| జగంబులు | = | లోకాలను |
| కాచునట్టి | = | రక్షించునట్టి |

| | | |
|---|---|---|
| తోబుట్టువు నీవు | = | సోదరుడివైన నీవు, |
| తీవ్ర తేజమునన్ + పొల్చిన | = | అమిత పరాక్రమంతో ఒప్పుతున్న |
| భర్తలుగల్గన్ | = | భర్తలుండగా |
| దీనికిన్ | = | నేను పొందిన అవమానానికి |
| ఆఱుట + ఎన్నడున్ + పుట్టదు | = | ఎప్పటికి చల్లారదేమో ! |

**తాత్పర్యం :-** ఓ కృష్ణా ! రాక్షసమైన ఓర్పుతో నేను పొందిన అవమానాన్ని నిప్పును ఒడిలో దాచుకున్నట్లుగా మనస్సులో దాచుకున్నాను. దుష్టశిక్షణ చేసే నీవు, పరాక్రమవంతులైన భర్తలుండగా, ఈ అవమానాగ్ని ఎన్నడు చల్లారుతుందో తెలియదు.

**120. ఉ**

ముచ్చిర నేల నేఁగలుగ ముద్దియ నాకు వృకోదరుండు, వి
వ్వచ్చుడు ఁదోడు కాగ జనవంద్యుడు ధర్మసుతుండు పంప, నీ
మెచ్చుగ సంక్షయము మేకొని చేసెదఁగాక వేఱొకం
డచ్చుపడంగ నేర్చునె, దురాత్ములు కౌరవు లుర్వి యిత్తురే ? --

**పరిచయం :**

ఈ పద్యం 13వ శతాబ్దికి చెందిన కవిబ్రహ్మ బిరుదాంకితుడైన తిక్కన సోమయాజిచే రచింపబడిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది. తిక్కన భారతంలో 15 పర్వాలు తెనిగించాడు. నాటకీయశైలి, వర్ణనా వైశిష్ట్యం, రసానుగుణ రచన తిక్కన కవిత్వంలోని ప్రధాన లక్షణాలు.

**సందర్భం :-** ద్రౌపది దుఃఖాన్ని చూసి, కృష్ణుడు ఆమెనోదార్చాడు. తానుండగా దుఃఖింపవలసిన పనిలేదని, తప్పక శత్రునాశనం జరుగుతుందని ఆమెను ఊరడించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :-**

| | | |
|---|---|---|
| ముద్దియ | = | ఓ ద్రౌపదీ ! |
| నేన్ + కలుగ | = | నేనుండగా |
| ముచ్చిరన్ + ఏల | = | దుఃఖించుట ఎందుకు ? |
| నాకు | = | నాకు |
| వృకోదరుండు | = | భీముడును, |
| వివ్వచ్చుడున్ | = | అర్జునుడును, |
| తోడు కాగ | = | యుద్ధంలో తోడుగా ఉండగా |
| జనవంద్యుడు | = | ప్రజలచేత నమస్కరింపబడు |
| ధర్మసుతుండు | = | ధర్మరాజు |
| పంపన్ | = | నన్ను పంపగా |
| నీ మెచ్చుగన్ | = | నీవు మెచ్చుకొనునట్లు |
| శత్రు సంక్షయము | = | శత్రు నాశనం |
| మే కొని | = | పూనుకొని |
| చేసెదన్గాక | = | చేస్తాను. |
| వేఱొకండు | = | ఇంకొక రకంగా |
| అచ్చుపడంగ నేర్చునె | = | జరుగుట సాధ్యమగునా ? |
| దురాత్ములు | = | దుర్మార్గులైన |
| కౌరవులు | = | ఆ కౌరవులు |

ఉర్విన్ = రావలసిన రాజ్యభాగాన్ని
ఇత్తురే = ఇస్తారా ? (ఇవ్వరు)

**తాత్పర్యం :-**

ఓ ద్రౌపదీ ! నేనుండగా నీవు దుఃఖించవలసిన పనిలేదు. భీమార్జునులు తోడురాగా, ధర్మజుడు పంపగా, నీవు మెచ్చునట్లుగా శత్రునాశనం చేస్తాను. మరోవిధంగా జరుగదు. అంతతేలికగా, దురాత్ములైన కౌరవులు రాజ్యమునివ్వరు - అని శ్రీకృష్ణుడు పలికాడు.

## 1.5.3. సందర్భ సహిత వ్యాఖ్యలు :

**( 1 నుంచి 11 వరకు పరిచయం, సందర్భం ఈ క్రింద యిచ్చినట్లుగానే అన్నింటికి రాయండి.)**

### 1. ఆతడు నొంచునె యన్నదమ్ములన్ !

**పరిచయం :-** తిక్కన రచించిన ఆంధ్రమహాభారతంలోని ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం నుంచి గ్రహించిన 'ద్రౌపది పరిదేవనము' అనే పాఠ్యభాగంలోని దీ ఈవాక్యం.

**సందర్భం :-** పాండవులు, కౌరవుల వద్దకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి నిశ్చయించారు. ఐదుగురికి, ఐదూళ్లు ఇచ్చినా సరేనంటాడు ధర్మజుడు. యుద్ధం వల్ల ఎలాచూసినా అంతానష్టమే కానీ, లాభం లేదంటాడు. కృష్ణుడు విడివిడిగా మిగిలిన పాండవులకడకు వచ్చి వారివారి అభిప్రాయాలు తెలుసుకుంటాడు. చివరగా ద్రౌపది వద్దకు వస్తాడు. ధర్మజుని మాటలు ఆమెకు ఎంతో మనస్తాపం కలిగించాయి. తాను నాటి కౌరవ సభలో పడిన అవమానాలన్నీ ఒక్కసారిగా మనస్సులో కదిలాయి. తమను అనేక అవమానాల పాలుచేసిన కౌరవులతో సంధి ఆమెకు ఇష్టంలేదు. ఎంతో దుఃఖంతో ద్రౌపది, కృష్ణునికి తనమనస్సులోని అభిప్రాయాలు వివరించే సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** ఆ దుర్యోధనుడు అన్నదమ్ములైన పాండవులను బాధపెట్టడా ! (తప్పక బాధపెడతాడు అని అర్థం) కృష్ణా ! ఆ కౌరవులు మాయాజూదం ఆడి, వస్త్రాపహరణం చేసి, అడవులకు పంపి అవమానించిన వాటిని మరచిపోయి, ఈనాడు ఆ సంజయుని చేత రాయబారం పంపిస్తారా ? అటువంటి ఊరడింపు మాటలకే ధర్మరాజు సంతోషించాడు. ఐదూళ్లిచ్చినా చాలని అంటున్నాడు. దుర్యోధనుడు తనంతటతానుగా పాండవులకు ఐదూళ్లైనా ఇస్తాడా? ఏమాత్రం దయలేకుండా అతడు అన్నదమ్ములను తప్పక బాధిస్తాడు.

### 2. నానలేమియని యాడరె లోకమువారు కేశవా?

**వివరణ :-** ఓ కృష్ణా ! ఈ పాండవులు సిగ్గులేనివారని లోకులు నిందించరా ?

కృష్ణా ! ధర్మజుడు, తాను ఇంతకుముందు పడ్డ కష్టాలు, అవమానాలు తమ్ముడైన దుర్యోధనునిపై గల ప్రేమతో సహించకుండా ఉంటాడా ? ఆ విధంగా రాజ్యంలో భాగంలేకుండా, ఈనాడు సంధికి గనుక ఒప్పుకొన్నట్లయితే, ఈ పాండవులు తెలివి తక్కువ వారనీ, యుద్ధానికి చాలరని, సిగ్గులేని వాళ్లని లోకులంతా నిందించరా ?

### 3. వారు బ్రాహ్మణులె యేకీడైన సైరింపగన్?

**వివరణ :-** ఆ కౌరవులు ఏ ఆపదనైనా సహింపడానికి బ్రాహ్మణులా?

మన గొప్పదనం నశించిపోయేటట్లుగా, మనకి మనమే తక్కువభావం ఆపాదించుకోవడమెందుకు ? ఆలోచిస్తే ఈ సంధి ఆ కౌరవులకే మంచిది. తమను, ఆ కౌరవులను పోల్చిచూసి నట్లైతే ఈ పాండవులు, వారిని జయించలేరా? లేక వారిని సంహరించాలనుకుంటే అనుమానమెందుకు? ఇంకా ఆపదలన్నింటినీ భరించడానికి ఆ కౌరవులేమీ బ్రాహ్మణులా? (కారుకదా! అని అర్థం).

### 4. పోదురా కానలనుండ నచ్యుతా !

**వివరణ :-** పాండవులు మళ్లీ అడవుల్లో నివసించడానికి ఇష్టపడతారా?

తాను ఓడిపోతాననే భావం, ఆ దుర్యోధనుడి మనస్సులో ఏమాత్రం లేదు. నీ సంధివచనాలతో అతని దురభిమానం ఇంకా ఎక్కువౌతుంది. అక్కడ యుద్ధమే తప్పనిసరి అనే పరిస్థితులు గనక వస్తే, ఈ పాండవులు యుద్ధం చేస్తారా ? లేక మళ్లీ అరణ్యవాసం చేస్తారా ?

**5. “వలచినట్టుల చేయుడు నేర్పులేర్పడన్” .**

**వివరణ :-** మీ నేర్పరితనం కనిపించేటట్లుగా, మీరు అనుకున్నట్లుగానే చేయండి.

కృష్ణా ! నేను ఈ విధంగా అన్నానని నీవు ఏమీ అనుకోవద్దు. నీవు, ధర్మరాజు, భీమాదులు అందరూ కలసి ఆలోచించి, మనపని, మీ మంచితనం చెడకుండా ఉండేటట్లు కౌరవులతో సంధి చెయ్యండి. ఇందులో మీ నేర్పు, నైపుణ్యం ప్రస్ఫుటం కావాలి.

**6. వీటిడి యైన మానిసికి వెండి వివేకము కల్గ నేర్చునే !**

**వివరణ :-** కోపంతో వెర్రివాడైన అవివేకికి, మళ్లీ జ్ఞానం కలుగుతుందా?

నేను అనేక అవమానాలు పొందడం వల్ల ఆలోచించే స్థిమితం కోల్పోయాను. చెప్పినదానినే మళ్లీ మళ్లీ చెప్తూ, నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాను. నాకు మంచి, చెడులు తెలియడం లేదు. కోపంతో విచక్షణా జ్ఞానం కోల్పోయిన మనిషికి మళ్లీ వివేకం కలుగుతుందా ? (కలుగదు)

**7. ‘ఇన్నిట ప్రశస్తికి నెక్కిన దానవెంతయున్’ !**

**వివరణ :-** ఇన్ని విషయాలలో ఎంతో ప్రసిద్ధి పొందినదానను -

ఓ కృష్ణా ! నేను దేవతల వరంవల్ల జన్మించాను. ప్రశస్తమైన భరతవంశంలోకి అడుగుపెట్టాను. అందునా పాండురాజుకు కోడలినయ్యాను. ప్రజలందరి చేత నమస్కరింపదగు పాండవులను భర్తలుగా పొందాను. పరాక్రమవంతులైన బిడ్డలను కన్నాను. తోబుట్టువుల అండకూడా నాకున్నది. ఇన్నింటిలో నేను ఎంతో ప్రశస్తిని పొందాను.

**8. కులాంగన నిట్లొనర్తురే ?**

**వివరణ :-** కులస్త్రీని ఈ విధంగా అవమానపరుస్తారా ?

కృష్ణా ! నీవు సుభద్ర కంటె ఎంతో ప్రేమాభిమానాలతో నన్ను గౌరవిస్తావు. అటువంటి నన్ను, రాజసూయ యాగాంతంలో చేసే అవబృథ స్నానంతో పవిత్రమై వృద్ధిపొందిన నా జుట్టుపట్టి ఒకనీచుడు, ఈ అయిదుగురు చూస్తుండగా రాజసభకు ఈడ్చుకుని వచ్చాడు. ఎక్కడైనా కులకాంత నీవిధంగా అవమానం చేస్తారా?

**9. ‘నిన్‌గొలువవచ్చె మనం బదియుం దలంపవే ’ !**

**వివరణ :-** నా మనస్సు నిన్ను భక్తితో సేవించింది. అది గుర్తుంచుకొనుము.

ఏకవస్త్రనైన నన్ను ఆ సభలోకి ఈడ్చుకొని వచ్చి, అవమానించే దుశ్శాసనుణ్ణి చూస్తూ, నా భర్తలు చేష్టలుడిగి, నామీది ఆశలు మానుకొని బొమ్మల్లాగా ఉండిపోయారు. అపుడు నన్ను రక్షించే దిక్కు ఎవ్వరూ లేరు. నీవు ఆర్త రక్షకుడవనే విశ్వాసంతో, నామనస్సు నిన్ను శరణువేడింది. ఈ విషయం గుర్తుపెట్టుకో కృష్ణా !

**10. ‘మాధవ నిశ్చయింపుమా’ !**

**వివరణ :-** ఓ కృష్ణా ! నీవే నిశ్చయింపుము.

ఏ మాత్రం ఆలోచన లేకుండా, జూద సమయంలో ఆ ధృతరాష్ట్రుడు అప్పుడు నన్ను దాసిగా నిశ్చయించాడు. అటువంటి ఆయన వద్దకు నా భర్తలు వెళ్లితే, నేను అక్కడ కోడరికం చెయ్యాలా ? లేక దాస్యం చెయ్యాలా ? కృష్ణా ! నీవే నిశ్చయింపుము.

**11. ‘కట్టి విక్రమంబు కాల్పనే’ ?**

**వివరణ :-** అర్జునుని పరాక్రమమెందుకు? తగలబెట్టడానికా ? (అర్జునుడు నల్లగా ఉంటాడు. అందుకని ద్రౌపది కోపావేశంతో అర్జునుణ్ణి ‘కట్టి’ అని సంబోధించింది)

ఓ కృష్ణా ! కౌరవసభలో ఈ వెంట్రుకలు పట్టి ఈడ్చిన ఆ దుశ్శాసనుడి చేయి ముందుగా ఖండించబడాలి. తరువాత అతని శరీరం ఇంతింత చిన్న చిన్న ముక్కలుగా చెల్లాచెదరై పోవాలి. అప్పుడుగాని నా మనస్సులో ఉండే కోపం చల్లారదు. అంతంతమాత్రం

పనులతో ఆరే చిచ్చుకాదిది. దుర్యోధనుడి శవాన్ని నేను, ధర్మరాజు కళ్ళారా చూడనిదే, పెద్దగదను పట్టుకొని తిరిగే భీముని బాహుబలం, గాండీవమనే విల్లుని ధరించితిరిగే అర్జునుని పరాక్రమం ఎందుకు ? తగులబెట్టనా ?

**(12 నుంచి 16 దాకా, పరిచయం, సందర్భం ఒక్కటే. ఈ క్రింద యిచ్చినట్లే రాయండి.)**

**12. దురాత్ములు కౌరవులుర్వి యిత్తురే ?**

**పరిచయం :-** తిక్కన రచించిన ఆంధ్రమహాభారతం ఉద్యోగపర్వం, తృతీయా శ్వాసనుంచి గ్రహింపబడిన 'ద్రౌపది పరిదేవనము' అనే పాఠ్యభాగంలోనిదీవాక్యం.

**సందర్భం : -** కౌరవసభకు రాయబారిగా వెళుతున్న కృష్ణునితో ద్రౌపది అనేకవిధాలుగా తనభంగపాటును చెప్పి దుఃఖించింది. దుశ్శాసనుడి శరీరం ముక్కలై పోవాలని, దుర్యోధనుడి శవాన్ని తాను, ధర్మరాజు కళ్ళారాచూడనిదే తన క్రోధం చల్లారదని కృష్ణునితో చెప్పింది. ఆమెను ఓదారుస్తూ కృష్ణుడు పలికిన సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :-** దుర్మార్గులైన కౌరవులు భూభాగాన్ని ఇస్తారా ? (ఇవ్వరు)

ఓ ద్రౌపదీ ! నీవు ఇంతగా దుఃఖించడమెందుకు ? భీమార్జునులిరువురు నాకు తోడు రాగా, ధర్మజుడు ఆశీర్వదించి పంపగా, నీవు మెచ్చుకొనునట్లుగా శత్రు సంహారం చేస్తాను. ఇంకొకరికి ఇది సాధ్యం కాదు. వేరొక విధంగా కూడా జరుగదు. అంతేకాని, దుర్మార్గులైన కౌరవులు అంతతేలికగా రాజ్య భాగం ఇవ్వరు.

**13. 'కలకల నవ్వుచు వినంగ కాలం బయ్యెన్ ' !**

**వివరణ :-** కలకలా నవ్వుతూ వినేసమయం ఆసన్నమైంది.

అమ్మా ద్రౌపదీ ! నీ దుఃఖం తొలగిపోయే సమయం వచ్చింది. ఇంక మీదట కౌరవుల భార్యల యేడుపులు నీవు వినగలవు. వాటిని వింటూ నీవు కలకలా నవ్వే రోజులు సమీపించాయి.

**14. 'ఇష్టము లగునే సంధి కార్య శాంత వచనముల్' ?**

**వివరణ :-** కౌరవులకు సంధి చేయడానికి సంబంధించిన శాంతవచనాలు ఇష్టమౌతాయా?

యమధర్మరాజు వాహనమైన దున్నపోతు మెడలోని గంటలసవ్వడి వినడానికి కుతూహలపడే కౌరవులకు సంధికి సంబంధించిన శాంతవచనాలు ఇష్టమౌతాయా? (కావు)

**15. 'మేరువు దిరిగెనేని పాంచాలసుతా' !**

**వివరణ :-** ఓ ద్రౌపదీ ! మేరుపర్వతం తల్లక్రిందులైనా జరిగేది తప్పదు.

దైవనిర్ణయం కూడా అలాగే ఉంటుందని పెద్దలంటారు. అది తప్పక జరుగుతుంది. ఎవరెన్ని రకాలుగా చెప్పినప్పటికీ, కౌరవులు తమనిర్ణయం మార్చుకోరు. మేరుపర్వతం తల్లక్రిందులైనా జరిగేది జరుగకమానదు.

**16. 'తడవు లేదిది నిజంబు' .**

**వివరణ :-** ఆలస్యం లేదు. ఇది సత్యం

ఓ ద్రౌపదీ! శత్రుసంహారం చేసి, పాండవులు, అధిక పుణ్యాలక్ష్మీ సమేతులై ఉజ్వలవైభవంతో అలరారే శుభగడియలు సమీపిస్తున్నాయి. దీనికి ఎంతో ఆలస్యంలేదు. ఇది నిజం.

## 1.5.4 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు :

**1. ద్రౌపది తన భంగపాటును కృష్ణునితో వివరించిన విధం.**

**సమాధానం :-** పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు ముగించిన పిమ్మట ఉపప్లావ్యంలో ఉన్న వారివద్దకు ధృతరాష్ట్రుడు తన

మంత్రియైన సంజయుని ద్వారా వారియోగ క్షేమాలను విచారించి రమ్మని పంపిస్తాడు. ఎక్కడా, వారికి రావలసిన రాజ్యభాగమిస్తానని ప్రకటించలేదు. తదుపరి పరిణామాలననుసరించి ధర్మరాజు కౌరవసభకు శ్రీకృష్ణుని రాయబారిగా పంపడానికి నిశ్చయించాడు. తమకు అయిదుగురికి, ఐదూళ్లైనా యిమ్మని కౌరవులను తమ పక్షాన అర్థించమంటాడు. అపుడు కృష్ణుడు, విడివిడిగా పాండవుల అభిప్రాయాలు తెలుసుకొని, చివరిగా ద్రౌపది వద్దకు వస్తాడు. ధర్మరాజు మాటలు ద్రౌపదికి ఎంతో మనస్తాపాన్ని కలిగిస్తాయి. ఐదూళ్లైనా యిమ్మని అర్థించడం ద్రౌపదికి వేదన కలిగించింది. సంధి ప్రయత్నాలు ఆమెకు రుచించలేదు. తాను ఇంతకుముందు కౌరవసభలో పొందిన అవమానాలన్నీ ఒక్కసారిగా గుర్తుకువచ్చాయి. ఆప్తబంధువైన కృష్ణుడు తన అభిప్రాయం తెలుపమనగానే, దుఃఖం, రోషం, విషాదం అన్నీ ఒక్కసారిగా ఆమె మనస్సును పెనవేసుకొన్నాయి. ఆ భావాలు వ్యంగ్య వాగ్బాణాలై సంధించబడ్డాయి. ద్రౌపది దుఃఖంలో గద్గదమైన కంఠంతో కృష్ణునితో ఇలా పలుకసాగింది.

"కృష్ణా ! మమ్ములను అన్ని అవమానాల పాలుచేసి, ఈనాడు సంజయునితో కౌరవులు రాయబారం పంపిస్తారా ? ఆ ఊరడింపు మాటలకే ధర్మజుడు మనస్సులో సంతోషపడ్డాడేమోకానీ, ఆ దుర్యోధనుడు మాత్రం ఐదుగురకు ఐదూళ్లుకూడా యివ్వడు. ఇంకా మా మీద దయలేకుండా, అతడు మమ్ములను తప్పనిసరిగా బాధపెట్టడం మాత్రం తథ్యం. ఈ ధర్మజుడు తానింతకు ముందు అనుభవించిన అవమానాలు, కష్టాలూ తమ్ముడైన దుర్యోధనునిపైగల ప్రేమాభిమానాలతో సహించి, రాజ్యంలో భాగం లేకుండా, ఈనాడు సంధికి గనక ఒప్పుకున్నట్లైతే, ఈ పాండవులు అవివేకులు, యుద్ధంచేయడానికి వారికి బలంచాలదు, సిగ్గులేనివారని లోకులంతా నిందించరా ? ఈ పాండవులు తమకైతాముగా, తక్కువతనం ఎందుకు ఆపాదించుకోవాలి ? తమను తక్కువగా ఎందుకు అంచనావేసుకోవాలి ? ఆలోచిస్తే ఈ సంధివల్ల ఆ కౌరవులకు మేలు చేకూరుతుంది. ఇద్దరి బలాబలాలు గనుక సరిపోల్చుకున్నట్లయితే, ఆ కౌరవులను వీరు జయింపలేరా ? లేక వారిని సంహరించాలనుకుంటే బలం చాలదన్న అనుమానమెందుకు ? యుద్ధంలో తాను ఓడిపోతాననే భయం దుర్యోధనుడి మనస్సులో ఏ కొంచెంగూడా లేదు. నీ మాటలతో అతని దురభిమానం మరింత ఎక్కువౌతుంది. ఆ కౌరవసభలో యుద్ధమే తప్పనిసరి అయితే ఈ పాండవులు యుద్ధం చెయ్యడానికి ఇష్టపడతారా? లేక మళ్లీ అరణ్యాలకే పోతారా?

కృష్ణా ! నేనిట్లా మాట్లాడుతున్నానని నీవు అన్యథా భావించవద్దు. నీవు, ధర్మజుడు, భీమాదులు కలిసి ఉచితానుచితాలు ఆలోచించండి. మీ మంచితనం చెడకుండా మన కార్యం సిద్ధించే ఉపాయం చూడండి. దీనివల్ల మీ నైపుణ్యం, కార్యనిర్వహణా సామర్థ్యం లోకానికి వెల్లడి కావాలి. అయినా, అవమానాలన్నింటినీ పొంది, వాటి ఫలితాన్ని కూడా అనుభవించినదాన్ని కాబట్టి, మనస్సు నిలుపుకోలేక, చెప్పిన విషయాన్నే మళ్లీ మళ్లీ చెపుతున్నాననుకోవద్దు. నాకు ఉచితానుచితాలు తెలియకపోవచ్చు. కోపంతో విచక్షణ కోల్పోయిన మనిషికి వివేకం ఎలా కలుగుతుంది ?

కృష్ణా ! నేను వరప్రభావం చేత జన్మించాను - అందునా ఎంతో ప్రసిద్ధి పొందిన భరతవంశంలో అడుగుపెట్టాను. పాండురాజుకు కోడలినయ్యాను. ప్రజలచేత నమస్కరింపదగు పాండవులకు ఇల్లాలినయ్యాను. రాజనీతిలో, పరాక్రమంలో సాటిలేని పుత్రులను పొందాను. అమితపరాక్రమోపేతుడైన సోదరుల అండకూడా నాకున్నది. నీవు కూడా, సుభద్ర కన్న నా మీదనే ఎక్కువ ప్రేమాభిమానాలు చూపిస్తున్నావు. ఇటువంటి నన్ను, రాజసూయావభృథ స్నానంతో శుచియై వృద్ధిపొందిన నాశిరోజాలను పట్టుకొని, ఒక నీచుడు నిండుకౌరవసభకు, ఈ అయిదుగురు చూస్తూ ఉండగా ఈడ్చుకొని వస్తాడా ? ఏకవస్త్రనైన నన్ను ఈడ్చుకుని వచ్చి అవమానించే దుశ్శాసనుణ్ణి చూస్తూ, నా భర్తలు చేష్టలుడిగి, బొమ్మల్లాగా నిల్చుండి పోయినపుడు నీవు ఆర్తత్రాణ పరాయణుడవనినమ్మి, నామనస్సు నిన్ను ప్రార్థించింది. ఇది మనస్సులో పెట్టుకో.

అయినా, జూద సమయంలో నేను కోడలినని మరచిపోయి, ఆ ధృతరాష్ట్రుడు నన్ను కూడా దాసిగానే భావించాడు. నీవు సంధి కుదుర్చుకుని వస్తే, నా భర్తలు ఆ మహానుభావుని వద్దకు వెళితే , నేను కోడలిగా వెళ్లాలా? లేక మళ్లీ దాసిగా వెళ్లాలా? నీవే నిశ్చయించు.'-

అని పలికి ద్రౌపది తన పెద్దదైన జుట్టుముడిని ఊడదీసి కుడిచేత్తో పట్టుకుంది. అది వ్రేలాడే నల్లని పాములాగా ఉంది. కన్నీళ్లు ఒక్కసారిగా ఉప్పొంగిరాగా, కూర్చున్న చోటునుంచి దిగ్గునలేచి ఆ జుట్టును గోవిందునికి చూపిస్తూ ఇలా అన్నది "కృష్ణా ! ఈ శిరోజాలు దుశ్శాసనుడి చేతివ్రేళ్లు తగిలి సగం తెగిపోగా మిగిలినవి. రేపు సంధి మాటలు మాట్లాడేటప్పుడు వీటిని గుర్తుపెట్టుకో" -

ఈ విధంగా ద్రౌపది తానింతకు ముందు అనుభవించిన అవమానాలను ఒక్కసారిగా కృష్ణునిముందు వెళ్లగ్రక్కింది.

**2. ద్రౌపది తన అవమానానికి ప్రతీకారం కోరిన తీరును పేర్కొని, కృష్ణుడామెను ఓదార్చిన విధం తెలుపండి?**

**సమాధానం :-** రాయబారిగా కౌరవుల వద్దకు వెళ్లబోయే కృష్ణునితో ద్రౌపది తన భంగపాటును అనేక రకాలుగా వివరించింది. తన ఆభిజాత్యాన్ని చెప్పుకుంది. తాను సామాన్య స్త్రీని కానని, అయోనిజనని, వరప్రభావం చేత జన్మించానని చెప్పింది. సంధి చెయ్యడం ఆమెకు ఏమాత్రం ఇష్టంలేదు. ఆ అభిప్రాయన్నే కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. ఎన్నో కీలకమైన ప్రశ్నలడిగింది. చివరకు తనపెద్దదైన జుట్టుముడిని విప్పి, కుడిచేత్తో పట్టుకుని పాములాగా వ్రేలాడే శిరోజాలను కృష్ణునికి చూపిస్తూ దిగ్గునలేచి దుఃఖంతో ఇలా అన్నది.

"కృష్ణా ! ఈ జుట్టు దుశ్శాసనుని చేతివ్రేళ్లు తగిలి సగం తెగిపోగా మిగిలినవి. కౌరవసభలో సంధి వచనాలు పలికేటప్పుడు వీటిని గుర్తుపెట్టుకో. ఈ వెంట్రుకలు పట్టి, సభలోకి ఈడ్చుకునివచ్చిన ఆ దుశ్శాసనుడి చెయ్యి ముందుగా యుద్ధంలో తెగిపడాలి. అతని శరీరం ముక్కలు ముక్కలుగా ఖండించబడి, చెల్లాచెదురు కావాలి. గుర్తు పట్టడానికి కూడా వీల్లేనంతగా అతని రూపం నశించిపోవాలి. అప్పుడుకాని, నామనస్సులో రేగిన మంటలు చల్లారవు. అంతంత మాత్రం పనులతో ఆరే చిచ్చుమాత్రం కాదిది. నేను, ధర్మరాజు కలిసి ఆ దుర్యోధనుడి పీనుగును కళ్లారా యుద్ధభూమిలో చూడాలి. లేకపోతే పెద్దగదను పట్టుకొని తిరిగే భీముడి బాహుబలం, గాండీవమనే పెద్ద విల్లుని వీపునమోసే అర్జునిని పరాక్రమం ఎందుకు? తగలబెట్టనా?

మానవులకు అసాధ్యమైన ఓర్పుతో, ఈ అవమానమనే అగ్నిని ఇన్నాళ్లూ నిప్పును మూటగట్టి ఒళ్లో దాచుకున్నట్లుగా నా మనస్సులో భరించాను. ఇంకనైనా ఇది ఆరేదెన్నడో కదా? దుష్టశిక్షణ చేసే నీవు, పరాక్రమవంతుడైన భర్తలుండగా ఈ పరాభవాగ్నిని చాలాకాలం భరించాను. ఇక నావల్ల కాదు" - అని ద్రౌపది ఎంతో దుఃఖంతో తాను పొందిన అవమానాలకు ప్రతీకారాన్ని కోరుకుంది.

రాయబారం కోసం కౌరవసభకు బయలుదేరే శ్రీకృష్ణునితో తన అభిప్రాయాలన్నింటిని ద్రౌపది నిర్మొగమాటంగా చెప్పింది. తాను పడిన అవమానాలను గుర్తు చేసింది. తన పుట్టినింటి గొప్పదనాన్ని, మెట్టినింటి వైభవాన్ని విశదీకరించి, తాను ఆభిజాత్య సంపన్ననని తెలిపింది. పట్టమహిషికి జరుగకూడని అన్యాయం జరిగిందని దుఃఖపడింది. దానికి ప్రతీకారం ఎలా జరగాలో కూడా వివరించింది. తప్పనిసరి పరిస్థితుల్లోనే, విధిలేక ఆ అవమానాగ్ని తాను ఇన్నాళ్లూ భరించాననీ, ఇంతకాలం జరిగినా, ఆ అగ్ని తనను దహిస్తూనే ఉందని, ఇది ఆరేదెన్నడోనని గొంతురాలుపడేటట్లుగా ఏడ్చింది.

ద్రౌపది దుఃఖంచూసి, కృష్ణుడు కరుణార్ద్రచిత్తుడై ఆమెను పరిపరివిధాలుగా ఓదార్చాడు. ఆమెను కూర్చుండ బెట్టాడు. వీడిన జుట్టును ముడికట్టడానికి పరిచారికలను నియోగించాడు. తగిన సపర్యలు చేయమని ఆజ్ఞాపించాడు. పిదప అభిమానవతియైన ద్రౌపదితో ఇలా పలుకనారంభించాడు.

" అమ్మా ద్రౌపదీ ! నీవు ఇంతగా దుఃఖపడడం ఎందుకు ? ధర్మరాజు ఆజ్ఞానుసారం, భీముడు, అర్జునుడు తోడు రాగా నీవు మెచ్చుకొనునట్లుగా శత్రు సంహారం చేస్తాను. ఈ కార్యం ఇంకొక విధంగా జరుగదు. వేఱొకని వల్లా సాధ్యం కాదు. కౌరవుల విషయంలో ఇది జరిగితీరుతుంది లేకపోతే కౌరవులు అంతతేలికగా రాజ్యభాగం ఇస్తారా ? నీ దుఃఖం ఉపశమించే రోజులు సమీపించాయి. ఇంక కౌరవుల భార్యలు యేడ్పులు నీవు వినే కాలం దగ్గర పడుతోంది. వారి దుఃఖం చూచి, నీవు కలకలమని నవ్వి సంతోషించే ఘడియలు ఆసన్నమైనాయి. యమధర్మరాజు వాహనమైన మహిషం మెడలోని గంటలధ్వనిని వినడానికి కుతూహలపడే కౌరవులకు సంధి కార్యాలూ, శాంతవాచనాలూ రుచించవు. అసలు దైవ నిర్ణయం కూడా ఇలానే ఉంటుందని పెద్దలంటారు. ఆ విధి నిర్ణయాన్ని ఎవ్వరూ ధిక్కరించలేరు. ఎవ్వరే విధంగా చెప్పినా, జరగాల్సింది జరుగక మానదు. మేరువు తల్లక్రిందులైనా శత్రునాశనం జరిగి తీరుతుంది. నా సహాయంతో పాండవులు కౌరవులను నాశనంచేసి, అధిక పుణ్యలక్ష్మీ సమేతులై, ఉజ్వలమైన వైభవంతో అలరారే స్థితిని, అతి త్వరలో నీవు చూడగలవు. ఇందులో ఆలస్యం లేదు. ఇది యథార్థం" అని, కృష్ణుడు అనేక విధాలుగా ద్రౌపదిని ఓదార్చాడు.

### 3. ద్రౌపది పాత్రను తిక్కన చిత్రించిన తీరుతెన్నులు :

**సమాధానం :-** 'ద్రౌపదీ పరిదేవనము' ను ఈ పాఠ్య భాగంలో కవిబ్రహ్మ తిక్కన సోమయాజి, అనన్య సాధ్యమాన్యంగా ద్రౌపది పాత్రను చిత్రీకరించాడు. రాయబారిగా వెళ్లే కృష్ణునితో ద్రౌపది తన మనస్సు విప్పి మాట్లాడింది. గొప్ప వాక్చాతుర్యం, వ్యంగ్య వైభవం, ద్రౌదది సంభాషణలో కనిపిస్తాయి. అంతేకాదు తాను సంధికి విముఖురాలనని విస్పష్టంగా ప్రకటించింది. ప్రతీకారేచ్ఛను ప్రకటించింది. తన ఆభిజాత్యాన్ని గుర్తుచేసింది. అవమాన దగ్ధగా, అభిమానవతిగా, రాజనీతిజ్ఞురాలిగా ద్రౌపది పాత్ర ఈ ఘట్టంలో అద్భుతంగా పోషింపబడింది.

**వాక్చాతుర్యం :-** కృష్ణునితో ద్రౌపది జరిపిన సంభాషణ అంతా వ్యంగ్య వైభవంతో కూడి ఉంది. 'అంతలు చేసి ...' అన్న పద ప్రయోగంలోనే, తాము పొందిన అవమానాలన్నీ అందులో ఇమిడి ఉన్నాయని తెలిపింది. లోకంమీద నిందపెట్టి పాండవులు తెలివితక్కువవారని, యుద్ధానికి చాలరని, సిగ్గులేనివారిని వ్యంగ్యంగా దెప్పిపొడిచింది. సంధి విఫలమైతే మళ్ళీ అరణ్యవాసం చేస్తారా ? అని సూటిగా ప్రశ్నించింది. తాను అధికంగా మాట్లాడుతున్నానని తెలిసి, దాన్ని కప్పి పుచ్చుకోవడానికి 'ఏ నిటలంటి నా వలవదు' - అని పల్కింది. తనకు ఉచితానుచితాలు తెలియవని, తాను కోపంతో వెర్రిదాన్నైనానని తన స్థితిని తానే సమర్థించుకుంది. ధృతరాష్ట్రుని, 'అమ్మహాపురుషు' - అని ఎత్తి పొడిచింది. నిజంగా ధృతరాష్ట్రుడు మహాపురుషుడైతే తమకిన్ని ఆపదలు రావు. కపట నీతిగలవాడు కాబట్టే అతణ్ణి 'మహాపురుషడ' ని దెప్పి పొడించింది. అంతేకాక అతడి వద్ద తాను కోడరికం చెయ్యాలా? లేక దాసిగా వెళ్లాలా ?" అని హేతుబద్ధంగా నిలదీసింది. వస్త్రాపహరణం సందర్భంలో తనభర్తలు చేష్టలుడిగి కొయ్యబారి బొమ్మలాగా ఉండిపోయారని తీవ్రంగా విమర్శించింది. "నీవే నన్ను కాపాడావు, నా మనస్సు నిన్నే ప్రార్థించింది" అనడంలో అప్పుడేకాదు ఇప్పుడు కూడా కృష్ణుడే కాపాడాలని, తన మనోభీష్టం నెరవేర్చగలవాడు అతడే అని నేర్పుగా సంభాషించింది.

**ప్రతీకారవాంఛ :-** తన జుట్టుముడిని ఊడదీసి కృష్ణునికి చూపించే సందర్భంలో ఆమె గుండెలోతుల్లో నుండి పైకి రేగిన ప్రతీకార జ్వాల ఆమె మాటల్లో మనకు గోచరమౌతుంది. తాను అవమాన దగ్ధ కాబట్టి, ఆ జ్వాలలే కౌరవారణ్యాన్ని సమూలంగా దహించి వెయ్యాలని కోరుకుంటుంది. " ..... దుస్ససేను తను వింతలింతలు తునియలై..." అన్నపుడు ఆమె కోపం పరాకాష్ఠకు చేరుకుంది. ఆ దుర్మార్గుడు ఒకేసారి చావటం కాదు, ఇంతింత ముక్కలుగా ఖండింపబడాలని కోరుకోవడంలోనే ఆమె ప్రతీకార వాంఛా తీవ్రత ద్యోతకమౌతుంది. అంత కోపంలో కూడా ధర్మజుని గౌరవంగా సంభావించింది. దుర్యోధనుడి పీనుగును తాను, ధర్మజుడు కలిసి కళ్లారా చూడాలని కోరుకుంది. అలా జరగనట్లయితే, భీమార్జునుల పరాక్రమాలు వ్యర్థమని తిట్టిపోసింది. అర్జునుణ్ణి 'కట్టి' - అని సంబోధించడంలోనే వ్యాజనింద మనకు అర్థమౌతుంది. చివరకు దుఃఖాన్ని ఆపుకోలేక 'నిప్పును మూటకట్టినట్లుగా, ఈ పరాభవాగ్నిని తాను ఇన్నాళ్లు సహించాననీ చెప్పటంలో స్త్రీ సహజలక్షణం కనిపిస్తుంది.

**ఆభిజాత్యసుసంపన్న :-** తాను సామాన్య స్త్రీని కానని దేవతల వరంతో జన్మించాననీ, అత్యంత ప్రసిద్ధి పొందిన భరతవంశంలో కాలుపెట్టానని, పరాక్రమోపేతులైన భర్తలు, కుమారులు గలరని తన ఆభిజాత్యాన్ని ప్రకటించుకుంది. పాండవ పట్టమహిషినైన తనే యిన్ని అవమానాలు పొందితే, ఇంక సామాన్య స్త్రీలకి రక్షణ ఎక్కడ? అని ధ్వని పూర్వకంగా ప్రశ్నిస్తుంది. 'నీవు సుభద్ర కన్న నన్నే ఎక్కువగా ఆదరిస్తావు ' - అనడంలో కృష్ణుని వాత్సల్యాన్ని, సోదరప్రేమను తాను పొందగలిగానని పరోక్షంగా ప్రకటించుకుంది.

**నిశ్చితాభిప్రాయ ప్రకటన :-** ఇంత ఆభిజాత్య సంపన్న అయినా, దుర్మార్గులైన కౌరవుల అకృత్యాలలో ఆమె స్వాభిమానం దెబ్బతిన్నది. యుద్ధంచేసి శత్రువులను సంహరించి, విజయలక్ష్మిని వరించడమే, పరాక్రమవంతులు, రాజనీతిజ్ఞుల లక్షణమని తెల్పింది. అవమానాలన్నింటినీ భరించి ఊరుకోరాదనీ, అది రాజలక్షణం కాదనీ ధర్మం రక్షింపబడాలనీ, దుష్టశిక్షణ జరగాలనీ తన నిశ్చితాభిప్రాయాన్ని ప్రకటించింది.

ఈ విధంగా ఈ ఘట్టంలో తిక్కన, ద్రౌపదిపాత్రను అత్యద్భుతంగా చిత్రీకరించడం జరిగింది. ఆమె విసరిన వ్యంగ్య వాగ్బాణాలు, ఆమె వాక్చాతుర్యానికీ, రాజనీతిజ్ఞతకు ఉదాహరణలు. పరాభవాగ్నిలో దహించుకుపోయి, తగిన సమయంలో ప్రతీకారం కోరుకునే రాచస్త్రీగా , ద్రౌపదిని తిక్కన క్రోధరసావేశ పరిపూర్ణగా చిత్రీకరించాడు.

**4. "ద్రౌపది పరిదేవనము" - అను పాఠ్యభాగం ద్వారా తిక్కన కవితా లక్షణాలను వివరించండి.**

**సమాధానం :-** " తను కావించిన సృష్టి తక్కొరులచేతం గాదు ....." అని ఎఱ్ఱనచే కీర్తింపబడిన తిక్కన 'మహాకవిత్వ దీక్షావిధి'తో భారతరచన చేశాడు. పాత్రల చిత్రీకరణలో, సంభాషణా చాతురిలో, నాటకీయ శైలిలో, రస పరిపోషణలో తిక్కనకు మరెవ్వరూ సాటి లేరనడంలో అతిశయోక్తిలేదు. అందుచేతనే శ్రీనాథుడు కూడా "భాషింతు తిక్కయజ్వ ప్రకారము రసాభ్యుచిత బంధముగ నొక్కొక్క మాటు - " అని ప్రత్యేకంగా ప్రశంసించాడు.

**పాత్ర పోషణ :-** తిక్కన పాత్రలు సజీవశిల్పాలు. ఆయా సన్నివేశాలను బట్టి, తమ తమ బాహ్య, ఆంతర ప్రవృత్తులను తామే వ్యక్తం చేసుకుంటాయి. ఈ పాఠ్యభాగంలో ద్రౌపది పాత్రను రోషాగ్ని పరిపూర్ణంగా, స్వాభిమానవతిగా, ఆభిజాత్య సంపన్నగా, వివేకవతిగా చిత్రీకరించాడు. దుశ్శాసనుని శరీరం ముక్కలు ముక్కలుగా ఛిద్రం కావాలనే కోరికను తెలిపి, ఆమెలో రేగే ప్రతీకార వాంఛను అద్భుతంగా నిరూపించాడు.

**నాటకీయత :-** తిక్కన భారతంలోని అద్భుత ఘట్టాలలో ఈ సన్నివేశం చాలా ఉత్తమమైంది. ద్రౌపది మాట్లాడే ప్రతిమాట ఎంతో వ్యంగ్య వైభవంతో ఉంటుంది. "అంతలు సేసి .... తమ్ముని పైగల కూర్మి పేర్మి ఈ జనపతి సైపకున్నె ...." " పోదురొ కానలనుండ నచ్యుతా! " "ఏనిటులంటి నా వలవదు-- " "..... కోటరంబు దగజేయుదునో యటుగాక పాడిమై వరవుడ మోపి చేయుదునో ....." "కట్టి విక్రమంబు కాల్పనే " - మొదలైన మాటలలోని వ్యంగ్య వైభవం తిక్కన రచనా నైపుణ్యానికి పరాకాష్ఠ. ఇటువంటి వ్యంగ్య రచన వల్ల కావ్యసౌందర్యం ఇనుమడించి, పాత్రల మనస్తత్వం, పాఠకులకు దగ్గరౌతుంది.

ఇక తిక్కన కథను తాను చెప్పినట్లు గాక, నాటకంలో లాగా సంభాషణా రూపంలో పాత్రల ద్వారానే నడిపిస్తాడు. అభినయ విన్యాసాల ద్వారా, పాత్రలు సజీవంగా తమ కళ్లముందు కదలాడిన అనుభూతి పాఠకుడు పొందుతాడు. అందుకనే తిక్కన భారతం శ్రవ్య కావ్యమైనా, దృశ్యకావ్యానుభూతి అంటే రంగస్థలం మీద నాటకం ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతిని పాఠకుడు అనుభవిస్తాడు. తద్వారా పాఠకుడు ఆ పాత్రల్లో, తాను కూడా మమేకమైపోయి, రసానందాన్ని పొందగలుగుతాడు. ఇటువంటి నాటకీయ రచనా విధానం తిక్కనకే సాధ్యమైంది. ఈ పాఠ్యభాగంలో ద్రౌపది సంభాషించేటప్పుడు "అంతలు సేసి పో నడచి ...." అన్నపుడు ద్రౌపది ముఖ కవళికలు, హస్త విన్యాసం పాఠకుల మనస్సుకు గోచరమౌతాయి.

అలాగే దుశ్శాసనుడు తన జుట్టు పట్టుకొని సభలోకి ఈడ్చుకుని వచ్చాడనే సందర్భంలో ".... యీ యేవురు జూడగా సభకు నీడ్చె " - అనడంలో, ద్రౌపది అక్కడే ఉన్న తన భర్తలైన పాండవులను హస్త విక్షేపంతో చూపిస్తున్నట్లు స్పష్టమౌతుంది. ఇక "ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి ......" అన్న పద్యంలో ద్రౌపది తన జుట్టును కుడిచేత్తో పట్టుకున్న తీరూ, ఆ శిరోజాలు పాములాగా వ్రేలాడే దృశ్యం, ఆమె కన్నీరు కార్చడం, ఒక్కఉదుటున లేచి ఆర్తితో సంభాషించడం - ఇవన్నీ స్పష్టంగా పాఠకుడు తన మనోఫలకం మీద తప్పక దర్శింపగలుగుతాడు. ఒక చిత్రకారుడు ఈ పద్యం చదివి, ఆ ద్రౌపది పాత్రను, ఆ సన్నివేశాన్ని చక్కగా యవనిక మీద చిత్రీకరించగలడు. ఇది తిక్కన సజీవ పాత్ర చిత్రణకు, నాటకీయ సన్నివేశ రచనకు చక్కని ఉదాహరణ.

**రసపోషణ :-** తిక్కన రసపోషణావిధానం అత్యద్భుతం. ఒక ప్రధానరసాన్ని పరిపోషించేటప్పుడు, ఆ రసానికి తగిన రసాంగిక విషయాలన్నింటిని కూడా పాత్రలో పొందుపరచి, ఆ రస స్వరూపాన్ని ప్రదర్శింపచేస్తాడు తిక్కన. ఈ పాఠ్యభాగంలో ద్రౌపదిని క్రోధోద్విగ్నగా ఒక సన్నివేశంలోనూ, మరొకచోట కరుణరస పరిపూర్ణగానూ చిత్రీకరించడంలో తిక్కనది అందెవేసినచేయి. ద్రౌపది తనకు జరిగిన అవమానానికి ప్రతీకారాన్ని కోరుకునేటప్పుడు రౌద్ర రసస్ఫూర్తి ద్యోతకమౌతుంది. అలాగా దుఃఖంతో రాలుపడిన గొంతుతో కృష్ణునికి విన్నవించేటప్పుడు కరుణరసం గోచరిస్తుంది. పాఠ్యభాగం మొత్తం పరిశీలించినట్లైతే ద్రౌపది సంభాషణలో రౌద్రం, కరుణరసాలు చక్కగా పోషింపబడ్డాయి.

**పదప్రయోగచాతురి :-** పదాలను తూచినట్లుగా, అర్థవిశేషాలతో, ఆయా సన్నివేశాలకు అతికిపోయేటట్లు ప్రయోగించడం తిక్కన రచనా విశేషాలలో మరొక లక్షణం. కేవలం తెలుగుపదాలు, లేక కేవలం సంస్కృత పదాలనే వాడాలనే నియమం తిక్కనకు లేదు. సందర్భాన్ని బట్టి ఆ పదప్రయోగచాతురి ప్రదర్శితమౌతుంది. గడియారం వేంకట శేష శాస్త్రి గారు చెప్పినట్లు "తిక్కన రచనలోని శబ్ద ప్రపంచ సౌభాగ్యము వర్ణనాతీతమైంది. అది అంతయు ఆయన సొంత ఆస్తి " -

ఉదాహరణకు 'రాజరాజు పీనుంగు', 'రక్కెసతాల్మి, చిచ్చొడింగట్టినయట్లు ...', 'ఎలుంగురాలు పడనేడ్చిన', 'కలకల నవ్వుచు వినంగ', 'మేరువు దిరిగెనేని.....' 'తడవు లేదిది నిజంబు' - ఇత్యాది పద ప్రయోగాలు తిక్కన రచనా వైశిష్ట్యానికి మచ్చుతునకలు.

ఈ విధంగా ఈ పాఠ్యభాగంలో నాటకీయత, రసోన్మీలనం, ఉత్తమ పాత్రచిత్రణ, సంభాషణాచాతురి, పదప్రయోగ వైశిష్ట్యం మొదలైన లక్షణాలు తిక్కన కవితా ప్రతిభకు పరమోదాహరణాలు.

**డాక్టర్ జి. వైదేహి,** ఎం.ఏ., ఎం.ఫిల్, పి.హెచ్.డి.

రీడర్ & తెలుగు శాఖ

టి.జె.పి.యస్. కళాశాల

గుంటూరు - 6

ఖండం - 1

## ప్రాచీన పద్య భాగము

# శ్రీకృష్ణుని బాల్య క్రీడలు -ఎఱ్ఱన

## పాఠం . 6

1.6.0 పరిచయం
1.6.1 ఉద్దేశం
1.6.2 పాఠ్యభాగ సందర్భం
1.6.3 కఠిన పదాలకుఅర్థాలు
1.6.4 పాఠ్యభాగ వివరణ

### 1.6. 0 పరిచయం:

ఈ పాఠంలో మీరు ఎఱ్ఱన రచించిన హరివంశం పూర్వభాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలకు సంబంధించిన అంశాల్ని తెలుసు కొంటారు. ఇది ప్రాచీన పద్య భాగానికి చెందింది. ప్రాచీన పద్యభాగానికి సంబంధించిన పాఠాల్ని ఇంతకుముందు చదివారు. ఇప్పుడు ఆరవ పాఠాన్ని చదవబోతున్నారు. ఈ పాఠాన్ని చదవబోయేముందు పాఠ్యభాగాన్ని రచించిన ఎఱ్ఱన మహాకవిని గూర్చి పాఠ్యభాగంగా స్వీకరించబడిన గ్రంథం హరివంశాన్ని గూర్చి కొన్ని విషయాలు తెలుసుకోవటం అవసరం.

**ఎఱ్ఱన - పరిచయం:**

తెలుగు సాహిత్యంలో వెలసిన కవుల్లో ఎఱ్ఱన ఒక ప్రముఖ కవి. ఆంధ్రమహాభారతాన్ని తెలుగు సాహితీలోకానికి అందించిన కవిత్రయంలో మూడవవాడు. భారతానువాద విధానాన్ని చక్కని మార్గంలో తీర్చిదిద్దిన నన్నయ తిక్కనల బాటలో నడిచి తనదైన ప్రత్యేకతను ప్రదర్శించినవాడు ఎఱ్ఱన. నన్నయ తెలుగు పద్య విద్యకు ఆద్యుడుకాగా తిక్కన దేశీయతతో రసాభ్యుచిత బంధంతో ప్రసిద్ధి కెక్కాడు. వారిద్దరి మార్గాన్ని అనుసరిస్తూ తెలుగు కవిత్వ పటుత్వ రచనా ధురంధరుడై ప్రబంధ పరమేశ్వరునిగా ఎఱ్ఱన ప్రస్తుతి పొందాడు.

ఎఱ్ఱన నాలుగు రచనలు చేసినట్లు తెలుస్తున్నది. వాటిలో హరివంశము, భారత అరణ్య పర్వ శేషము, నృసింహపురాణము అనేవి లభ్యమవుతున్నాయి. ఆయన రచించినాడని చెప్పబడుతున్న రామాయణం లభించలేదు.

ఎఱ్ఱన రచించిన 'నృసింహ 'పురాణము' ను బట్టి ఆయనకు సంబంధించిన అనేక విషయాలు తెలుస్తున్నాయి. ఎఱ్ఱన తల్లిదండ్రులు పోతమాంబికా సూరనార్యులు. ఎఱ్ఱన పితామహుడు ఎఱపోతసూరి. ఎఱ్ఱని నివాసస్థలం ఈనాడు ప్రకాశం జిల్లాలోని గుడ్లూరు గ్రామం.. ఆయన పూర్వులది వేగినాటిలోని కారాపర్తి అగ్రహారం. ఎఱ్ఱన గురువు శంకరస్వామి. ఎఱ్ఱన పాండిత్య విశేషాల్ని గూర్చిన ఆయన తాత ఎరపోతసూరి పలికిన పలుకుల్ని గమనించినప్పుడు ఎఱ్ఱనకున్న బిరుదులు స్పష్టమవుతాయి.

"ఉన్నత సంస్కృతాదిచతురోక్తి పథంబుల గావ్య కర్త వై
యెన్నికమైఁ బ్రబంధ పరమేశుఁ డనంగ నరణ్య పర్వ శే
షోన్నయ మంధ్ర భాష సుజనోత్సవ మొప్పగ నిర్వహించి, తా
నన్నయ భట్ట తిక్క కవి నాథుల కెక్కన భక్తి పెంపునన్ (నృపు. 1-17)
"గిరిశ పద భక్తి రసత
త్పర భావము కలిమి శంభుదాసుండనగా
బరగియు గోవింద గుణా
దర సంభృత సౌమనస్య ధన్యుఁడ వెందున్ " (నృ. పు 1-18)

- ఈ పద్యాలవల్ల ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడు, శంభుదాసుడు అనే బిరుదులున్నట్లు గుర్తించవచ్చు.

ఎఱ్ఱన కొండవీటిని పాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. తాను రచించిన రామాయణ హరివంశాలను ఎఱ్ఱన ప్రోలయ

వేమారెడ్డికే అంకితమిచ్చినట్లు తెలుస్తుంది. ఎర్రనను వేమారెడ్డి ఆయన సోదరుడు మల్లారెడ్డి ఆదరించిన తీరును తెలుపుతూ ఎర్రన కాలాన్ని నిర్ణయిస్తూ 'ఎర్రన - రసపోషణ' అనే గ్రంథంలో ఆచార్య ఎస్. గంగప్పగారు ఈ విధంగా వివరించారు.

"ప్రోలయ వేమారెడ్డి - అద్దంకి రాజధానిగా 1325 - 1355 వరకు రాజ్యం చేశాడు. ఇతని కనిష్ఠ సోదరుడు మాల్లారెడ్డి . ఇతడు కురుమలూరికి అధిపతి. మాల్లారెడ్డి ఎర్రనను మొదట ఆదరించి చదలవాడలో రామాలయం నిర్మించాడు. ఆ సందర్భంలో వేమారెడ్డి చదలవాడకు వేంచేసి తమ్ముడు కట్టించిన రామాలయానికి ఒక అగ్రహారం దానమిచ్చాడు. ఈ అగ్రహారానికే మల్లారెడ్డి పేర మల్లవరం అనిపేరు వచ్చింది. బహుశః ఈ సందర్భంలోనే ఎర్రనను అన్న ఆస్థానంలో నియమింపజేసి ఉండవచ్చు. ప్రోలయ వేముని మరణానంతరం కూడా ఎర్రన జీవించినట్లు, కొల్లూరనే గ్రామన్ని అనవేముడు ఎర్రనకు ధారపోసినట్లు కొల్లూరు శాసనం వల్ల తెలుస్తుందని నోరి నరసింహశాస్త్రి గారి అభిప్రాయం. ఇందువల్ల ఎర్రన అనపోతారెడ్డి కాలంలోనే (1353- 1364) కాక అతని తమ్ముడైన అనవేముని రాజ్యకాలంలో (1364 - 1386) కొన్ని సంవత్సరాలు జీవించినట్లు చెప్పవచ్చు. అంటే ఎర్రన కాలం 1280 - 1364 అని నిర్ణయించటంలో విప్రతిపత్తిలేదు" (పుట 3).

నన్నయ్యది కథా కథనశైలి, తిక్కనది నాటకీయశైలి కాగా ఎర్రనది వర్ణనాత్మకశైలి. ఎర్రన సూక్తి వైచిత్రి విమర్శకుల ప్రశంసలకు నోచుకున్నది. సాహిత్యంలో ఒక గొప్ప కవిగా నిలిచాడు ఎర్రన

**హరివంశము:-**

**గ్రంథపరిచయం:-** ' శ్రీ కృష్ణుని బాల్య క్రీడలు' అనే పాఠ్య భాగం ఎర్రన రచించిన ' హరివంశము' లోనిదని ఇంతకుముందే తెలుసుకొన్నారు. ఇప్పుడు హరివంశాన్ని గూర్చి కొన్ని విషయాల్ని ముచ్చటించుకొందాం.

సంస్కృత సాహిత్యంలో 'హరివంశ పురాణం' బాగా ప్రసిద్ధి కెక్కింది. సంస్కృత భాషలో దీన్ని వ్యాస మహర్షి రచించాడు. తెలుగులోనికి హరివంశాన్ని అనువదించాడు. హరివంశాన్ని రచించవలసిందిగా ప్రోలయ వేమారెడ్డి ఎర్రనను ప్రోత్సహించినట్లు హరివంశంలోని పద్యాల్ని బట్టి తెలుస్తున్నది.

" నా తమ్ముండు ఘనుండు మల్ల రథినీనాథుండు నిన్నాతత
శ్రీతోడన్ సముపేతుఁ జేసి యెలమింజేపట్టి మాకిచ్చుటన్
జేతో మోద మెలర్పరామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాంతిం బొందితి మింకనున్ ( దనియ నే గావ్యామృతాస్వాదనన్ "

"భారత పరాంశమని యిం
పారగ జెప్పుదురు బుధులు హరివంశము నీ
వా రమ్య కథఁ దెనుంగున
ధీరోత్తమ నిర్వహించి తెలుపుము మాకున్" అని వేమారెడ్డి పలకగా

ఎర్రన " కావునఁ జెప్పెదఁ గళ్యా
ణావహ మహనీయ రచన హరివంశము స
ద్భావమున నవధరింపుము
భూవినుతగుణాభిరామ ప్రోలయ వేమా !" అని చెప్పాడు.

సంస్కృత హరివంశంలో హరివంశ పర్వం, విష్ణు పర్వం, భవిష్య పర్వం అనే మూడు భాగాలుండగా ఎర్రన హరివంశంలో పూర్వ భాగంలో 9 ఆశ్వాసాలు, ఉత్తర భాగంలో 10 ఆశ్వాసాలు ఉన్నాయి. హరివంశం భారతానికి పూరణ గ్రంథంగా భావించారు. హరివంశంలో శ్రీ కృష్ణునికి సంబంధించిన అనేక విశేషాలు వర్ణితమయ్యాయి.

**1.6. 1 ఉద్దేశం :**

శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగాన్ని చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాన్ని గుర్తిస్తారు.

ఈ పాఠ్య భాగాన్ని ఎర్రన రచించిన హరివంశము అనే గ్రంథంలో నుంచి స్వీకరించారు. ఇది హరివంశంలోని పూర్వ భాగమునందలి 5 వ ఆశ్వాసం లోనిది.

శ్రీకృష్ణుడు తన విచిత్రమైన చేష్టలతో అందరినీ ఆనందింపజేశాడు. గోపికలు శ్రీకృష్ణుని వింత చేష్టలకు మురిసిపోయి తమ పనుల్ని తామే మరచి పోయేవారు.

శ్రీకృష్ణుని చిలిపి చేష్టలకు తట్టుకోలేక గోపికలు అతన్ని పట్టితెచ్చి యశోదకు అప్పగించేవారు. ఒకసారి గోపికలందరూ యశోద దగ్గరకు వచ్చి శ్రీకృష్ణుని దుష్ట చేష్టల్ని మాయల్ని వివరించారు. వ్రేపల్లెను వదలి వెళతామన్న గోపికల్ని యశోద అనునయించింది.

**1.6. 2 పాఠ్య భాగ సందర్భం :**

హరివంశంలోని పూర్వభాగంలో యదువంశ చరిత్ర, శ్రీకృష్ణుని అవతారం, శ్రీకృష్ణుని లీలలు, బాల్యక్రీడలు, కంసవధ, శ్రీకృష్ణుడు తన గురువైన సాందీపనికి మరణించిన గురుపుత్రుని తిరిగి బ్రతికించి తెచ్చి గురుదక్షిణగా సమర్పించడం మొదలైన విశేషాలున్నాయి.

హరివంశంలోని పూర్వ భాగంలో వసుదేవుడు తన పుత్రుని వ్రేపల్లెకు చేర్చటం, అక్కడ ఆయన యశోద తనయుడుగా పెరుగుతూ ఉన్నప్పుడు పూతనాది రాక్షసుల్ని పరిమార్చటం మొదలైన అంశాల్ని ఎర్రన వర్ణించాడు. తర్వాత శ్రీకృష్ణుని బాల్యక్రీడల్ని మధుర మనోజ్ఞంగా వర్ణించిన తీరు ఈ పాఠ్యభాగంలో మనం గమనిస్తాము. ఎర్రన వర్ణనాత్మకమైనశైలి అందరిని ఆకట్టుకొంటుందనటంలో సందేహంలేదు.

## 1.6. 3 కఠిన పదాలకు అర్థాలు :

**193.**

| | | |
|---|---|---|
| పొలుపు+ ఆరగాన్ | = | ఒప్పారగా |
| బోరగిలి | = | రొమ్ము భూమి ఆనేటట్లు పడుకోవటం |
| లలిన్ | = | ప్రేమతో |
| కపోలంబులు | = | చెక్కిళ్లు |
| తారితారి | = | తిరిగి తిరిగి |
| అంగుళులు | = | వేళ్లు |
| ఊత | = | ఆధారం |
| తప్పు + అడుగులు | = | తప్పుగా వేసే అడుగులు |
| విందుల విందవు | = | అతిథులకే అతిథివి |
| అర్థిన్ | = | కోరికతో |
| శైశవ + ఉత్సవములన్ | = | బాల్యక్రీడలతో |

**194.** (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

**195.**

| | | |
|---|---|---|
| ఉల్లసిల్లెన్ | = | ప్రకాశించాడు. |
| రొంపి | = | బురద |
| పెండ | = | పేడ |
| మసటు+ పట్టి | = | మురికి పట్టి |
| పాంసు సంక్రీడ | = | దుమ్ములో ఆడుకోవటం |
| ధాతు + ఛటా = ధాతుచ్ఛటా | = | గైరికాది ధాతువుల సమూహం |
| శైల కుంజర కలభంబు | = | కొండ యేనుగు గున్న |

**196.**

| | | |
|---|---|---|
| నిచ్చలు | = | నిత్యం, ఎల్లప్పుడు |
| కుడకలన్ | = | గిన్నెలతో |
| పట్టికి | = | కుమారునికి |
| సెలవిన్ | = | పెదవి మూల |

క్రోలించుచు = తాగిస్తూ
వెరవు = ఉపాయం

197.

చమిరి = అరచేతితో కొట్టి
ఆ+ముదిత = అమ్ముదిత = ఆస్త్రీ ఆ యశోద
అక్కు = రొమ్ము
నిమిరి = శరీరాన్ని మెల్లగా తడివి.
చారు = మనోహరమైన, (అందమైన)

198. (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

199.

తరిత్రాడు = కవ్వానికి (పెరుగుచిలికే క్రరకు) కట్టిన తాడు
పొరిన్ + పొరి = మాటి మాటికి (మిక్కిలి)
గనయంబు = పోకముడి
విరియన్ = ఊడిపోయేవిధంగా
వలువచెరుగు = చీరచెంగు (కొంగు)
వ్రేతలు = గోపికలు

200.

అచ్యుతుడు = నాశనం లేనివాడు (శ్రీకృష్ణుడు)
మువ్వ = మొనలో మూడు సందులుగల పెద్ద గజ్జె
మొరయన్ = మోగగా

201.

ఏనిక కొదమ = ఏనుగు గున్న
కరంబునన్ = తొండంలో
మానుగ = తగిన రీతిలో
వెలిదమ్మి = తెల్లతామర
దానవరిపు = రాక్షసులకు శత్రువు
నవనీతము+ కబళము=నవనీతపుకబళము = వెన్నముద్ద

202.

సురలు + తరువగ = దేవతలు మథించగా
సుధాశీకరములు = అమృతపు బొట్లు
మెయిన్ = శరీరంపై
నిర్మథనం = చిలకటం
దధిబందువులన్ = పెరుగు చుక్కలు (బొట్లు)

203. (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

204.

ప్రవర్ధమానుండయి = పెరిగి
కేళీలాలసులై = ఆటల్లో ఆసక్తి కలవారై

| | | |
|---|---|---|
| పొదివికొని | = | చుట్టుకొని |
| బల్లిదుడై | = | బలవంతుడై |

205. (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

206.

| | | |
|---|---|---|
| బానలు | = | పెద్దకుండలు |
| తరునన్+ పెట్టిన | = | చిలుకుటకు సద్దాలుగా పెట్టి |
| నురువులు+ ఎసగ | = | నురుగులు ఎక్కువకాగా |
| క్రోలి | = | స్వీకరించి (తిని) |
| ఉరలన్ + త్రోచు | = | పడదోస్తూ |
| ఉక్కివము + గతి | = | కపటమార్గం |

207. (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

208.

| | | |
|---|---|---|
| ఓలి | = | వరుసగా |
| బానలందున్ | = | మట్టి కడవలందు |
| ఉట్లు | = | పిడతలు మొదలైన పాత్రల్ని ఉంచటానికి తాళ్లతో అల్లి వేలాడగట్టేవి. |
| బావుకొనుచు | = | నోటిలో క్రుక్కుకొంటూ |
| వ్రచ్చి | = | చీల్చి - (తెగగొట్టి) |

209.

| | | |
|---|---|---|
| ప్రాచి చల్లలు | = | నిల్వ ఉన్న మజ్జిగ |
| ఆజ్యము | = | నెయ్యి |
| తలుగులు | = | పశువుల్ని కట్టివేసే తాళ్లు |
| పెయ్య | = | పాలు విడిచిన ఆడదూడ |
| నలుగడల | = | నాలుగువైపుల |
| ఉఊక | = | కారణం లేకుండా |
| దామెన | = | కొయ్యలుపశువుల్ని కట్టటానికి పెక్కు పలుపులు పెట్టిన తాడుకట్టినకొయ్యలు |
| కావళ్ల + ఉట్లను | = | కావిడికి ఉన్న ఉట్లను (తాళ్లను) |

210. (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

211.

| | | |
|---|---|---|
| ఈ భంగి | = | ఈ విధంగా |
| నేలకున్ + కోలకున్ + తెచ్చు | = | చిందరవందర చేయటం (కింద మీదుచేయటం) |
| అలవి + కాక | = | సాధ్యంగాక |
| ఉల్లంబుల | = | హృదయాల్లో |
| వెక్కసము + పడి | = | ఆశ్చర్యపడి |
| కూడన్ + పడి | = | ఒకచోటచేరి |

212.

| | | |
|---|---|---|
| గోతి | = | స్త్రీ |
| గారాబు కొడుకు | = | ముద్దుల బిడ్డ |

| | | |
|---|---|---|
| అరయవ | = | తెలుసుకోవా |
| బలియరు+ ఐన | = | బలవంతులైన |
| తగవు | = | న్యాయం |

213.

| | | |
|---|---|---|
| కుటిలవు | = | కపటబుద్ధిగలదానివి |
| తనూభవున్ | = | కొడుకును |
| ఆత్మన్ | = | మనసులో |
| ఇంచుకయున్ | = | కొంచమైనా |
| అక్కటికంబు | = | దయ |
| ఆత్మజకృతముల్ | = | కొడుకు చేష్టలు |

214.

| | | |
|---|---|---|
| ఆ+నాతి | = | ఆ స్త్రీ, ఆ యశోద |

215.

| | | |
|---|---|---|
| 'కే' యని | = | 'కే' అని పెద్ద కేక వేస్తూ |
| కడవ | = | పెద్ద కుండ |
| బోరగిలన్ | = | తల్లకిందులయ్యేటట్లు |
| కేరుచున్ | = | ఉత్సాహంతో గంతులు వేస్తూ |

216.

| | | |
|---|---|---|
| ఒండు + ఎద్ది | = | వేరేమి ఉంటుంది. |
| సేఁగి | = | నష్టం |
| నాఁగ | = | అనగ |
| గొల్లలేమ | = | గోప స్త్రీ |
| రేఁగి | = | విజృంభించి |

217. (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

218.

| | | |
|---|---|---|
| అలుక | = | కోపం |
| ఓర్తు | = | ఒకతె |
| కృష్ణజనని | = | కృష్ణుని తల్లి, యశోద |
| కదిసి | = | సమీపించి |

219 (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

220.

| | | |
|---|---|---|
| చిచ్చు + పెట్టి | = | నిప్పుపెట్టి |
| ఏపగిదిన్ | = | ఎలాగైనా |

221.

| | | |
|---|---|---|
| అతివ | = | స్త్రీ |
| అరుగుదెంచి | = | వచ్చి |
| చెట్టలు | = | చెడ్డలు (కీడులు) |

| | | |
|---|---|---|
| ఆగడీడు | = | దుష్టచేష్టలు చేసేవాడు |
| నెలత | = | స్త్రీ |
| పంట్లు | = | మూతి వెడల్పుగా ఉన్నకుండలు |
| ఉర్విపై | = | భూమి మీద |
| కాలన్ + కేలన్ | = | కాళ్ళు చేతులతో |
| వెసన్ | = | వెంటనే |
| పెంచికలు | = | పెంకులు |
| దొంతులు | = | కుండల వరుసలు |

**222.**

| | | |
|---|---|---|
| పూసద్రాడు | = | పూసలతో ఉన్న తాడు |
| దుయ్యను | = | లాగటానికి |
| పొలతి | = | స్త్రీ |
| ఎల్లదానను | = | అన్ని రకాలుగా |
| ప్రాయిగల పట్టి | = | భాగ్యం గలిగిన కొడుకు |
| పొట్టన్ + పెట్టి | = | కడుపున బెట్టి (అప్పగించి) |

**223.**

| | | |
|---|---|---|
| పెలుచని | = | పెద్ద |
| ఎలుంగు | = | కంఠధ్వని |

**224.** (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

**225.**

| | | |
|---|---|---|
| సైచునె | = | ఓర్చుకోగలడా (క్షమించగలడా) |
| తెల్లము | = | స్పష్టము |
| దిగవిడచున్ | = | వదిలివేస్తాడు |
| మొగమోటన | = | సంకోచంతో |
| మనుపుచున్ + ఉండి | = | బ్రతుకుతూ |
| మూసితిన్ | = | దాచిఉంచాను |

**226.**

| | | |
|---|---|---|
| యవపిండి | = | యవల పిండి |
| ఒదవన్ | = | తగినరీతిగా |
| దేవర+ఆన | = | దేవుని మీద ఒట్టు |

**227.**

| | | |
|---|---|---|
| గూన+ ఎడు | = | పెద్దకుండలో పట్టినంత |
| బావికొనియె | = | నోటినిండా కుక్కుకొన్నాడు |
| చయ్యన | = | వెంటనే |
| పడంతి | = | స్త్రీ |
| అడంగెడు | = | అణగి ఉండే |

228. (ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి.)

229

| | | |
|---|---|---|
| పుట్టి | = | బుట్ట |
| గనప | = | పెద్ద (ఎత్తయిన) |
| అంతవట్టు | = | అది· అంతా |

230.

| | | |
|---|---|---|
| ఆ+చేడియ | = | ఆ స్త్రీ |
| అధిక్షేపించిన | = | నిందించగా |

231.

| | | |
|---|---|---|
| ఈ+ కష్టము పాటు | = | ఈ బాధను పొందటం |
| ఏము + ఓర్వము | = | మేము సహించలేము |
| చొక్కము + కొడుకు | = | అందమైన కొడుకు |
| ఒక్కతలై | = | ఒకటై |
| స్రుక్కు | = | సంకోచం (దు:ఖం), బాధ |

232.

| | | |
|---|---|---|
| అనునయించి | = | ఓదార్చి |

233.

| | | |
|---|---|---|
| సేగులు | = | నష్టాలు |
| అచ్చెద | = | దండుగ ఇస్తాను (నష్టాన్ని తీరుస్తాను) |
| వేసరకుడు | = | దిగులు చెందవద్దు |
| వేగునె | = | తెల్లవారుతుంది (జరుగుతుందా) |

234.

| | | |
|---|---|---|
| బొంకు+ ఆడెడు | = | అబద్ధమాడే |
| గటితలె | = | స్త్రీలా ? |
| ఎట్లు+ అడచెదనో | = | ఏ విధంగా అణచివేస్తానో |
| కింక | = | కోపం |
| కలక | = | కలత |
| శంక | = | అనుమానం |
| సదనంబులకున్ | = | ఇళ్లకు |

235.

| | | |
|---|---|---|
| అట్లకాక | = | అలాగే అని |
| నిజస్థానంబులకు | = | తమ యిళ్లకు |
| చనిరి | = | వెళ్లారు. |

## 1.6. 4 పాఠ్యభాగ వివరణ :

హరివంశం అంటే శ్రీకృష్ణ చరిత్ర. జగద్రక్షణ కోసం అవతరించిన పురుషోత్తముడు శ్రీ కృష్ణుడు. దేవకీవసుదేవుల గర్భంలో జన్మించి నంద యశోదల దగ్గరకు చేరాడు. బాల్యప్రాయంలోనే పూతన శకటాసురాది రాక్షసుల్ని సంహరించి వ్రేపల్లెలోని గోపాలురకు,

గోపికలకు అమందానందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించాడు. ప్రస్తుత పాఠ్యభాగం శ్రీకృష్ణుని శైశవ క్రీడలతో, చిలిపి చేష్టలతో, ఆయన మీద గోపికలు యశోదకు చెప్పిన దుడుకు పనులతో, యశోద సమాధానంతో నిండి ఉన్నది.

**శ్రీకృష్ణుని శైశవోత్సవాలు :-**

శ్రీకృష్ణుడు పాన్పుమీద బోరగిల పడి నాలుగు మూలలకు జరుగుతాడు. ప్రేమతో చెక్కిళ్ళ మీద గిలిగింతలు పెట్టి నవ్విస్తే కలకల నవ్వుతాడు. ముద్దులు గొలిపేటట్లు మోకాలిని చేతితో తడువుతూ ఇక్కడ అక్కడ తిరుగుతాడు. శ్రీకృష్ణుని నిలబెట్టి చేతి వేళ్లను ఊతమిస్తే సంతోషంతో తప్పటడుగులు వేస్తాడు. "అన్ననుగంటి, తండ్రినిగంటి, అయ్యను గంటి ఇక్కడకు రావయ్యా ! విందుల విందువవుతూ", అని ప్రేమతో పిలిస్తే ముచ్చట గొలిపే నడకలతో బాల్యంలో విరాజిల్లాడు. అంటే శ్రీ కృష్ణుని చేష్టలు అందరికీ ఆనందాన్ని కలిగిస్తున్నాయని చెప్పవచ్చు.

శ్రీకృషుని బాల్య క్రీడల్ని చూసి మురిసిపోతూ ఎవరైనా ఎత్తుకొని ముద్దులాడాలని భావిస్తే పరుగులుతీస్తు చంచలమైన చూపులతో మువ్వలు, గంటలు మోగుతూఉండగా నుదిటి మీద రావిరేక ముచ్చటగొలుపుతూ ఉండగా జనానికి తన అందాన్ని చూడాలనే కోరికను పెంచుతూ ఆడతాడు. అంటే శ్రీకృష్ణుని చూడగానే ఎత్తి ముద్దులాడాలనిపిస్తుంది. ఆయన ఒంటి మీద ఉన్న మువ్వలు, గంటలు మోగుతూ ఉండగా ఎంతో మురిపెంగా ఆటలాడతాడని చెప్పవచ్చు. ఆయన బాల్యక్రీడలే ప్రజలకు ఆనందదాయకాలుగా ఉన్నాయని భావించవచ్చు.

మట్టి, బురద,పేడలతో మురికిపట్టి దుమ్ములో ఆడుతున్న శ్రీ కృష్ణుడు అనేక గైరిక ధాతువులతో ప్రకాశించే కొండ యేనుగు గున్నలాగా ఉన్నాడు. అంటే శ్రీకృష్ణుడు దుమ్ములో ఆడుతూ మురికి పట్టి ఉన్నా ఒక వింత కాంతితో ప్రకాశిస్తున్నాడని భావం.

**యశోద మాతృ హృదయం :**

ప్రతిరోజు యశోద శ్రీకృష్ణునికి వెన్నపాలు గిన్నెల్లో తీసి పెడుతూ ఉండేది. శ్రీకృష్ణుని నోటిలో పెదవి చివర వేలు పెట్టి ఆయన చేత పాలు తాగించి వెన్న పెడుతూ ఉండేది. శ్రీకృష్ణునికి రుచి కలిగేటట్లుగా యశోద అతని నోటిలో ఉపాయంతో కొంచెం కొంచెం పెట్టటంవల్ల అతడు సంతోషంతో స్వీకరించేవాడు. యశోద శ్రీ కృష్ణునికి కడుపునిండా వెన్నపాలు ఇచ్చి మూతికి ఉన్న వెన్న జిడ్డును ముఖానికి, శరీరానికి పూస్తూ ఉండేది. అతని రొమ్మును నిమిరేది. అప్పుడు శ్రీకృష్ణుడు ఏనుగుదిన్న వెలగ పండులాగా ఉండేవాడు.

**శ్రీకృష్ణుని పిల్ల చేష్టలు :**

యశోద శ్రీకృష్ణునికి పాలు, వెన్నలు తృప్తిగా పెట్టి యింటి పనుల్లో మునిగి ఉన్నప్పుడు ఆమె కన్ను గప్పి ఆటలకోసం గోపికల దగ్గరకు వెళ్లేవాడు. వాళ్లు పెరుగులు చిలుకుతూ ఉంటే వెన్నలు పెట్టమని అడిగేవాడు. ఎంతపెట్టిన ఆ వెన్నల్ని మింగుతాడే గాని తృప్తి పడేవాడుకాడు. గోపికలకు అనేక రకాల చికాకులు కలిగిస్తూ ఉండేవాడు. వాళ్లు కవ్వంతో పెరుగును చిలుకుతూ ఉంటే కవ్వం తిరగకుండా తర్రిదాడు పట్టుకొనేవాడు. వెన్నలు తింటూ వాళ్ల చీరల పోకముడులు జారి పోయేటట్లు లాగుతూ ఉండేవాడు. పైట కొంగులు పట్టి గోపికల్ని లాగుతూ ఉండేవాడు.

గోపికలు శ్రీకృష్ణుని చేష్టలకు మురిసిపోతూ "వెన్న పెడతాము, ఆడు" అనేవాళ్లు. వెంటనే ఆతడు మువ్వలు మొలగంటలు మోగేటట్లు ఆడుతూ ఉంటే గోపికలు తమను తాము మరిచిపోయి, పెరుగు చిలకటం ఆపి తదేకంగా శ్రీకృష్ణుని చూసి మురిసిపోతూ ఉండేవారు.

శ్రీకృష్ణుని చేతిలో ఉన్న వెన్నముద్ద ఏనుగు తొండంతో పట్టిన తామర మొగ్గ లాగా ఉంటుంది. గోపికలు పెరుగును చిలుకుతున్నప్పుడు శ్రీకృష్ణుని మీద పడిన పెరుగుచుక్కలు క్షీర సాగర మథన సమయంలో పురుషోత్తముని శరీరాన్ని అంటిన అమృత బిందువుల్లా ప్రకాశించాయి. శ్రీకృష్ణుని చిలిపి చేష్టలకు తట్టు కోలేక అతణ్ణి పట్టి తెచ్చి గోపికలు యశోదకు అప్పగించి వెళ్లేవారు. వాళ్లు వెంటనే ఒక్క గడియ కాలంలోనే శ్రీకృష్ణుడు గోకులంలోని యిల్లిల్లూ తప్పకుండా తిరిగి వచ్చేవాడు.

**వ్రేపల్లెలో శ్రీకృష్ణుని దుడుకు చేష్టలు :**

శ్రీకృష్ణుడు క్రమంగా పెరిగి పెద్దవాడవుతూ ఉండగా అన్న బలరామునితో పెక్కుమంది గోపబాలురతో కలిసి వ్రేపల్లె అంతా తిరిగి ఆటలాడుతూ ఉండేవాడు. కుండల్లోను, చట్లలోను మూతిపెట్టి పాలు, నెయ్యి పుక్కిలించేవాడు. పద్మాలలాగా ప్రకాశించే చేతులతో

పాలు, నెయ్యి తీసుకొని మట్టిలో చల్లి తొక్కి, ఎవరికీ వశం కాకుండా ఉదార చేష్టలతో అంటే దుడుకు పనులతో ప్రవర్తిస్తూ ఉండేవాడు. అతడు చేసే పనుల్ని ఎవరైనా వారించటానికి ప్రయత్నించినా వారికి వశమయ్యేవాడు కాదు. చిలకటానికి సిద్ధంగా ఉంచిన బానల్లోని పెరుగును కదిలించి పేర్చిన వెన్నను తిని తర్వాత కుండల్ని కూలగొట్టి పొయ్యేవాడు.

పాల సముద్రాన్ని మధించి దేవతలకు అమృత ధారలు అందించిన రీతిలో, బాగా కాగిన పాలమీగడల్ని చేతులతో తీసి తనతోటి బాలురకు పెట్టి తాను తినేవాడు. వరుసగా కట్టిన ఉట్లను తెగగొట్టి, బానల్లో ఉన్న వెన్నను నోటిలో కుక్కుకొని, మిత్రులకు కూడా కొంత వదిలి పెట్టి పారిపోతూ ఉండేవాడు. కడవల్లోని పాలు సగం తాగి మిగిలిన సగాన్ని నీటితో నింపేవాడు. బానల్లోని పెరుగునంతా తిని ఆ బానల్లో పాచిన చల్లను పోసేవాడు. నేతుల్ని తీసుకొని నిప్పుల్లో పోసి పెద్ద మంటలు వచ్చేటట్లు చేసేవాడు. పెరుగులో పాలు, పెరుగులో వెన్న, వెన్నలో మజ్జిగ, మజ్జిగను నెయ్యిలో కలిపేవాడు. దూడల తాళ్లు వదిలించి తల్లి పాలు తాగటానికి వాటిని విడిచి పెట్టేవాడు. పశువుల్ని కట్టివేసే కొయ్యల్ని పెకలించి, కావళ్ళ తాళ్లను తెంచేవాడు.

ఆటల కోసం పిల్లలందరినీ శ్రీకృష్ణుడు ఒక చోటికి తెచ్చేవాడు. ఆయా ఆటల్లో ఆందరిని ఓడించి వాళ్ల వీపులువంచి ఒక్కొక్కడి వీపులమీద ఎక్కేవాడు. పెక్కుమందిని ఒకచోట చేర్చి వాళ్ల పిల్ల జుట్లను ముడివేసి 'కో' అని అరిచేవాడు. ఎవరినైనా ఆటల్లో తన వశం చేసుకొని శ్రీకృష్ణుడు తన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ ఉండేవాడు.

### శ్రీకృష్ణుని దుష్ట చేష్టలను గోపికలు యశోదకు చెప్పటం :

శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో గందర గోళం సృష్టిస్తూ ఉంటే గోపాలురు ఏమి చేయ్యలేక నిస్సహాయంగా ఉన్నారు. అప్పుడు గోపికలందరూ ఒక్కటై యశోద దగ్గరకు వెళ్లి శ్రీకృష్ణుని దుష్ట చేష్టల్ని ఈ విధంగా తెలియజేశారు.

" ఓ యశోదా ! నువ్వే గారాబు కొడుకును కన్నావా ? మా కష్టాల్ని గమనించవా ? ఎంత బలవంతులైనా న్యాయాన్ని పాటించకుండా ఉంటారా? శ్రీకృష్ణుడు చిన్న పిల్లవాడని మేమేమి అనటం లేదు. నీవు కపట స్వభావం కలిగినదానవై కొడుకును ఊరుమీదకు విడిచి పెట్టావు. నీ మనసులో కొంచెంకూడా దయలేదు. నీ కొడుకు చేస్తున్న పనుల్ని వివరిస్తాము. చెవులారా వినమ్మా" అని పలకగానే ఒక గోపిక యశోద ముందుకు వచ్చి ఈ విధంగా పలికింది.

" నా యింట్లో పది కడవల నెయ్యి , పెరుగు, పాలు తాగిన నీ ముద్దుల కొడుకు కడవలన్నిటినీ బోరగిల తోసి ఆనందంగా కేకలు వేస్తూ వెళ్లాడు. మేము పేదవాళ్లం. ఈ రకమైన పీడకు గురి అయ్యాము. ఇక మా బతుకు ఎలా సాగుతుంది. ఇంతకు ముందు మాకు కలిగిన నష్టానికి లెక్కలేదు". అని ఒక గోపిక పలకగా మరో గోపిక విజృంభించి " తల్లి నీ కొడుకు రాక్షసుడై ఉంటాడు. అందుకే ఉట్ల మీద జాగ్రత్తగా నేను దాచిన యాభై బానల వెన్న మింగి బానలు కూలదోశాడు. ఉట్లు తెంచాడు. ఇకమాకు దిక్కెవరు ? మేం ఎక్కడికి పోవాలి చెప్పు" అని పలికింది.

"యశోదతో మరొక గోపిక నాట్యభంగిమలలో నిలబడి పలుకుతూ" మాయింటి లోపల గదిలో మూలన ఎన్నో బానలున్నాయి. మాయావియైన నీ కొడుకు తాళం తలుపులు పడదోసి లోపలకు వెళ్లాడు. వెంటనే నేను పరుగెత్తుకు వచ్చాను. తాగాడో మరేంచేశాడో గాని కుండల లోపల ఒక నేతి బొట్టు కూడా మిగలలేదు".

"మేము ఎక్కడికైనా వెళ్లి బతకుతాము ఈ పల్లెకు నిప్పు పెట్టి ఎక్కడికైనా వెళ్లి పోతాం. ఇక్కడ చెడిపోవటం కంటే మాకు పనులు దొరికిన ప్రాంతంలో హాయిగా బతుకుతాం" అన్నది.

అక్కడ చేరిన వారందరిని తోసుకొని ముందుకు వచ్చిన ఒక గోపిక "నాయింట్లో జరిగిన నష్టం ఎంతని చెప్పేది. దుష్టుడైన నీ కొడుకు మా యింటికి వచ్చి పది కడవల నెయ్యి, పాలు', పెరుగు కలగలిపి నేలమీద వరదలుగా పారేటట్లు చేశాడు. కుండల్ని బద్దలు గొట్టాడు. పాయసం, కూర, కూడు తనతోటి వారికి పెట్టి కుండల దొంతులు పగలగొట్టాడు. దూడలన్నిటినీ పాల కోసం విడిచి పెట్టాడు. దూడల్ని లాగటానికి పూసతాడు కూడా లేదు. ఇంట్లో ఏడ్చే పిల్లలకైనా పెరుగు పాలు వదిలిపెట్టలేదు. అన్నీ భాగ్యవంతుడైన నీ కొడుకు పొట్టన బెట్టి అన్ని విధాలూ చెడిపోయాం" అని పలికింది.

ఒక గోపిక పెద్ద గొంతుతో "తల్లీ ! నాభర్త బిడ్డలు ఇష్టపడితే పాలు పిండి పులకండం వెన్న పెట్టి 'అట్లు'(పిండి వంటలు) వండాను. అప్పుడు నీ కొడుకు వచ్చి నాలుగైదు కుండలు వరుసలోనుంచి దించి వాటినన్నింటినీ మింగివేశాడు. ఆశ్చర్యంగా ఉన్నది. ఒకవేళ నీ

కొడుకు కడుపులో భూతాలేమైనా ఉన్నాయా ? నా భర్త నన్ను క్షమిస్తాడా ? నన్ను వదిలివేయటమో చంపటమో చేస్తాడు. ఇది స్పష్టం, ఈ విషయలన్నీ చెబితే అతడు నమ్ముతాడా ? అందుకే చెప్పకుండా నోరుమూసుకొని ఉన్నాను. " అని పలికింది.

ఇంకొక గోపిక యశోదతో " అమ్మా ! బానలో యవలపిండి పంచదార కలిపి మూలన దాచాను. నీ కొడుకు వచ్చి మొత్తం తినేశాడు. దేవుని మీద ఒట్టు. అంతటితో పోకుండా కుండలోని కూడంతా నోట్లో కుక్కుకొన్నాడు. ఇదంతా విష్ణుమాయ గాక పిల్లలు చేసే పనేనా ?" అని పల్కింది.

ఒక గోపిక ముఖంలో దిగులు కనిపిస్తూ ఉండగా యశోద ముందుకు వచ్చి " ఓ యశోదమ్మా నీ కొడుకు మా ఆవుల్ని దూడల్ని కలిపి అరుస్తూ బయటకి తోలివేశాడు. అవి భయంకరమైన ప్రాంతాల్లోకి వెళ్లి పోయాయి. మాయింట్లో భర్త, పిల్లలు లేని సమయంలో నీ కొడుకు ఈ రకంగా మమ్మల్ని బాధించాడు. వెన్ననంతా ఒక పెద్ద కుప్పగా పోయగా అటు ఇటు చూసే లోపలే మొత్తం మింగేశాడు. ఇలాంటి వారు లోకంలో ఉంటారా ?" అని ఆశ్చర్యంగా పలికింది.

**యశోద అనునయం:-**

ఈ విధంగా గోపికలందరూ ఒక్కటై యశోదను నిందించి మళ్లీ ఇలా పలుకుతున్నారు. " ఈ కష్టాల్ని మేము సహించలేము. ఎక్కడికైనా వెళ్లిపోతాము. నీవు నీ ముద్దుల కొడుకు సుఖంగా ఉండండి" అని నిష్ఠూరంగా పలకటంతో ఆమె వారందరిని ఓదార్చుతూ " మీరు నష్టపోయిన దాన్ని నేను తిరిగి ఇస్తాను. మీరు విసుగు చెందవద్దు. మీరు లేకుండా మాకు జరగుతుందా ? పిల్లవాడు కాబట్టి ఈ పనులు చేశాడో లేదో. మీరు మాత్రం అబద్ధం ఆడేవారు కాదు గదా ? వీడిని ఎలా అణగ గొడతానో ఇక మీదట చూడండి. మీ మనసుల్లోని కోపం, కలత, సందేహం వదిలి మీ యిళ్లకు సుఖంగా వెళ్లండి" అని పలకటంతో గోపికలందరు తమతమ గృహాలకు తిరిగి వెళ్లారు.

శ్రీకృష్ణుడు విష్ణువు యొక్క అంశతో జన్మించిన వాడు కావటం వల్ల గోపికలు ఆశ్చర్యపోయే పనులనెన్నిటినో చేశాడు. మట్టిలో ఆటలాడుతూనే అందరినీ అలరింప జేశాడు. శ్రీకృష్ణుని చేష్టలకు మురిసి పోయిన గోపికలు అతన్ని దగ్గరకు తీసి ఆప్యాయంగా వెన్నలు పెడుతూ ఉండేవారు. యశోద కూడా శ్రీకృష్ణునికి వాత్సల్యంతో వెన్నలు పాలు పెట్టేది. దీన్ని బట్టి ఆమె పుత్ర ప్రేమ స్పష్టమవుతుంది. గోపికలు శ్రీకృష్ణుని చేష్టలకు మురిసి పోయిన కొన్ని సందర్భాల్లో అతని చేష్టలు మితిమీరటంతో నష్టాన్ని, కష్టాన్ని తట్టుకోలేక యశోదకు అతని దుడుకు పనుల్ని విన్నవించుకొన్నారు, తమ మనుగడకే ప్రమాదం సంభవించటం వల్లనే యశోద దగ్గరకు వెళ్లి అతడు చేసిన 'నమ్మలేని పనుల్ని ' తెలియజేశారు. యశోద అందరి మాటల్ని విని తన కొడుకు తప్పు చేశాడనే విషయాన్ని అంగీకరించక ' మీరు చెప్పినవన్ని పిల్లవాడైన శ్రీకృష్ణుడు చేశాడో లేదో' అని పలికి మళ్లీ తన పలుకులు వారికి బాధ కలిగిస్తాయేమోనని 'మీరు అబద్ధం ఆడేవారు కాదు కదా !" అని అనునయించింది. వారి తృప్తి కోసం తన కొడుకును దండిస్తానని పలకటంతో వారంతా యిళ్లకు వెళ్లి పోయారు. ఇన్ని విశేషాలు శ్రీకృష్ణుని బాల్య క్రీడల్లో దాగి ఉండి చదివేవారికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి.

డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఎం.ఏ., పిహెచ్. డి.,

రీడర్ & తెలుగు శాఖాధిపతి

ఆంధ్ర లొయోల కళాశాల

ఖండం - 1. ప్రాచీన పద్యభాగము

# శ్రీకృష్ణుని బాల్యక్రీడలు - ఎర్రన

## పాఠం 7.

1.7. 0. పరిచయం

1.7. 1. ఉద్దేశం

1.7. 2. ప్రతి పదార్థ తాత్పర్యాలు.

**1.7. 1 పరిచయం:**

పాఠ్య భాగంలో కొన్ని పద్యాలు ప్రతి పదార్థ తాత్పర్యాలకు అర్హమై ఉంటాయి. సాధరణంగా వృత్తపద్యాల్ని ప్రతిపదార్థ తాత్పర్యలాకు అడుగుతారు. పద్యాన్ని పూర్తిగా ఇస్తారు. కాబట్టి ఆపద్యం ఏ పాఠ్యభాగం లోనుంచి స్వీకరించబడిందో ముందుగా తెలపడం మంచిది. ఆ తర్వాత ప్రతి పదాన్ని విడ దీసి అన్వయ క్రమంలో అర్థం రాసి చివరగా తాత్పర్యం రాయాలి.

**1.7. 1 ఉద్దేశం :** ఈ పాఠంలో శ్రీకృష్ణుని బాల్యక్రీడలు అనే పాఠ్యాంశంలో ఉన్న కొన్ని పద్యాలకు ప్రతి పదార్థాలను తెలుసు కొంటారు. పద్యాన్ని ఒకటి, రెండు సార్లు చదివి ఆతర్వాత దాని ప్రతి పదార్థం రాయటానికి ప్రయత్నించాలి. ప్రతిపదార్థాల్ని చదవటం ద్వారా పద విభజనం, పదాస్వరూపం, పదం యొక్క అర్థం తెలుసు కోవటానికి అవకాశం కలుగుతుంది .ఈపాఠంలో 10 పద్యాలకు ప్రతిపదార్థల్ని తెలుసు కొంటారు.

**1.7. 2 ప్రతిపదార్థ తాత్పర్యాలు :**

**(194, 198, 203, 205, 207, 210, 217, 219, 224, 228** పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు**)**

**ప .194 .**

ఎవ్వరుగన్న నెత్తు కొని యెంతయు వేడుకముద్దులాడగా
నెవ్వల (బాటి పాటి తరళేక్షణ దీధితు లొప్ప నొప్పుమై
మువ్వలు గంటలు న్మొరయ ముందటి కూకటి రావిరేకతో
నవ్వనజాక్షు (,డాడు (జెలు వర్మిలి (బెంచు జనంబు చూడ్కికిన్.

పరిచయం: ఈ పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ప్రతి పదార్థం :

| | | |
|---|---|---|
| ఆ +వనజ + అక్షుడు | = | పద్మాల లాంటి కన్నులు కలిగిన ఆశ్రీకృష్ణుడు |
| ఎవ్వరు + కన్నన్ | = | తనను ఎవరైనాచూసినా |
| ఎత్తుకొని | = | ఎత్తుకొని |
| ఎంతయున్ | = | మిక్కిలిగా |
| ముద్దులు + ఆడగాన్ | = | ముద్దులు పెట్టగా |
| ఏ + వలన్ | = | ఎటువైపో |
| పాటి పాటి | = | బాగాపరుగెత్తి |
| తరళ + ఈక్షణ | = | చంచల మైనచూపులయొక్క |
| దీధితులు | = | కాంతులు |
| ఒప్పన్ | = | ప్రకాశించగా |
| ఒప్పుమైన్ | = | తగినరీతిలో |
| మువ్వలు | = | మువ్వలు (మొనలో మూడు సందులు గల గజ్జెలు) |

| | | |
|---|---|---|
| గంటలున్ | = | గంటలు |
| మొరయ | = | మోగుతుండగా |
| ముందటి | = | నొసటి ముందున్న |
| కూ ( కటి | = | పిల్ల జుట్టు |
| రావి రేకతోన్ | = | పిల్లలకు జుట్టులో కట్టే రావాకులాంటి ఆభరణంతో |
| ఆడున్ | = | ఆడుతూ ఉంటాడు. |
| జనంబు | = | ప్రజలు |
| చూడ్కిన్ | = | చూపులకు |
| చెలువు | = | (శ్రీకృష్ణుని) అందం |
| అర్మిలిన్ | = | అపేక్షను |
| పెంచున్ | = | పెంచుతాడు |

**తాత్పర్యం:** శ్రీకృష్ణుడు తనను ఎర్రవైనా చూసి ఎంతో సంతోషంతో ఎత్తుకొని ముద్దులాడగా ఏదో ఒకవైపు పరుగులు తీస్తూ చంచలమైన చూపుల కాంతులతో ప్రకాశిస్తూ తాను ధరించిన గజ్జెలు, మువ్వలు మోగుతూ ఉండగా నుదుటి మీద పిల్ల జుట్టులో ధరించిన రావిరేకుతో ప్రజలకు తన అందాన్ని చూడాలనే అపేక్షను పెంచుతూ ఆట లాడుతూ ఉంటాడు.

**ప. 198.**

తనునాప్యాయితుంజేసి తేపు గృహ కృత్యంబుల్పొనర్పం దొడం
గిన తల్లిం గినుమాడి తప్పడుగులం గ్రీడారతిం బోయి , యం
గనలన్ వెన్నలు వేడు (బెర్వు దరువంగా నెంతయేం( బెట్టినం
దనియం డింపుగ మ్రింగు మానం( డొకటం దావారి గారించుచున్.

**పరిచయం:** D పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తనున్ | = | తనను (శ్రీకృష్ణుని) |
| ఆప్యాయితున్+ చేసి | = | తృప్తి పరచి |
| తేపు | = | ఉదయ కాలంలో |
| గృహ కృత్యంబుల్ | = | ఇంటి పనులు |
| పొనర్పన్ | = | చేసు కోవటానికి |
| తొడంగిన | = | పూను కొన్న |
| తల్లిన్ | = | తల్లి యశోదను |
| గినుమాడి | = | వంచనచేసి |
| తప్పు + అడుగులన్ | = | తప్పటడుగులు వేస్తూ |
| క్రీడారతిన్ | = | ఆటలు పట్ల ఆసక్తితో |
| పోయి | = | వెళ్లి |
| అంగనలన్ | = | గోప స్త్రీలను |
| పెర్వు | = | పెరుగు |
| తరువంగా | = | చిలుకుతూ ఉండగా |
| వెన్నలు వేడున్ | = | వెన్నలు అడిగే వాడు |
| ఎంతయేన్ +పెట్టినన్ | = | గోపికలు వెన్న ఎంత పెట్టినా |
| తనియండు | = | తృప్తిపడడు |

| | | |
|---|---|---|
| ఇంపుగన్ | = | తగిన రీతిలో |
| మ్రింగున్ | = | మింగేవాడు (తినేవాడు) |
| తాన్ | = | ఆ శ్రీకృష్ణుడు |
| ఒకటన్ | = | ఏవిధంగా నైనా |
| వారిన్ | = | గోపికల్ని |
| కారించుచున్ | = | బాధిస్తూనే ఉంటాడు కాని |
| మానడు | = | బాధించడం మాను కోడు |

తాత్పర్యం: శ్రీకృష్ణునికి తృప్తి కలిగింప జేసిన తల్లియశోద ఇంటి పనుల్లో మునిగి పోయేది. అప్పుడు శ్రీకృష్ణుడు ఆమెను మోసగించి ఆడుకోవాలనే కోరికతో తప్పటడుగులు వేస్తూ పెరుగులు చిలుకుతున్న గోపికల దగ్గరకు వెళ్లి వెన్నలు పెట్టమని అడిగేవాడు. వాళ్ళు ఎంత పెట్టినా తిని సంతృప్తి చెందేవాడు కాడు . అంతేకాదు ఇంకా పెట్టవలసిందని వారిని బాధిస్తూ ఉండేవాడు.

**ప. 203 .**

పాపని ( బట్ట రమ్మ యని బాధల కోర్వక తెచ్చి తెచ్చి తన్
గోపిక లయ్యశోదకును గుప్పున నొప్పన సేయ( జేయ నా
గోపిక యందు నందు(జన గోకుల మిల్లిల్లు దప్పకుండ, ల
క్ష్మీపతి గ్రమ్మరున్ గడియ సేపున రేపున నిచ్చి నిచ్చలున్.

పరిచయం: ఈ పద్యం ఎఱ్ఱన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ప్రతిపదార్థం:

| | | |
|---|---|---|
| గోపికలు | = | గోపకాంతులు |
| బాధలకు | = | శ్రీకృష్ణుడు పెట్టే బాధలకు |
| ఓర్వక | = | సహించలేక |
| పాపనిన్ | = | బాలుని ( శ్రీకృష్ణుని) |
| పట్ట రమ్మ | = | ఎక్కడికీ కదలకుండా పట్టుకోరా |
| అని | = | అని పలికి |
| తెచ్చి తెచ్చి | = | గట్టిగా పట్టి తెచ్చి |
| తన్ | = | శ్రీకృష్ణుని |
| ఆ + యశోదకును | = | తల్లి యైన యశోదకు |
| గుప్పునన్ | = | వెంటనే |
| ఒప్పన్ + చేయన్ | = | అప్పగించగా |
| ఆగోపిక | = | ఆయశోద |
| అందునన్ + అందునన్ | = | అక్కడక్కడకు |
| చనన్ | = | వెళ్లగా |
| లక్ష్మీపతి | = | లక్ష్మీదేవికి భర్తయైన (విష్ణువు) శ్రీకృష్ణుడు |
| నిచ్చలున్ + నిచ్చలున్ | = | ప్రతిరోజూ |
| రేపున | = | ఉదయకాలంలో |
| గోకులము | = | వ్రేపల్లెలోని |
| ఇల్లు + ఇల్లు | = | ప్రతియింటిని |
| తప్పకుండ | = | వదలకుండా |
| గడియసేపునన్ | = | క్షణకాలంలో |

| | | |
|---|---|---|
| క్రుమ్మరున్ | = | తిరుగుతూ ఉంటాడు. |

**తాత్పర్యం:** శ్రీకృష్ణుడు పెట్టే బాధలకు తట్టు కోలేక వ్రేపల్లెలోని గోపికలు" నీకొడుకును గట్టిగా నీదగ్గరే ఉంచు కోవమ్మా" అని అతన్ని పట్టి తెచ్చి యశోదకు అప్పగించేవారు. ఆమె అటూఇటూ తిరుగుతూ తనపనిలోని నిమగ్నం కాగా శ్రీకృష్ణుడు ప్రతిరోజూ ఉదయం గోకులంలోని ఏ ఇంటినీ వదల కుండా క్షణ కాలంలో తిరుగుతూ ఉంటాడు.

**విశేషణం:** ఇక్కడ శ్రీకృష్ణుడు అనిచెప్పడానికి "లక్ష్మీ పతి" అనటం వల్ల ఆయన విష్ణ్వంశ సంభూతుడని గ్రహించవచ్చు.

**ప . 205 .**

పనఁటుల ( జట్ల మూతి యిడి పాలును నేయియు ఁబుక్కిలించియుం
దొనుకుచు దోయి లించి కరతోయరుహంబుల జల్లి మట్టిలో
నెనయఁ గ ద్రొక్కి త్రొక్కి ధవళేక్షణ రోచు లెలర్ప నాడు నె
వ్వనికి మాన్పరాక యదు వంశ కుమారుఁ డుదారచేష్టలన్.

**పరిచయం:** ఈ పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| యదు వంశకుమారుడు | = | యాదవ వంశంలో పుట్టిన శ్రీకృష్ణుడు |
| ఉదార చేష్టలన్ | = | గొప్ప పనులు చేస్తూ (అల్లరిచేష్టలు) |
| ఎవ్వనికిన్ | = | ఏ ఒక్కరికీ |
| మాన్పరాక | = | మాన్పించటానికి సాధ్యం కానిరీతిలో |
| పనఁటులన్ | = | వంట కుండల్లో |
| చట్ల | = | మూతి వెడల్పుగా ఉన్న మట్టి పాత్రల్లో |
| మూతి + ఇడి | = | మూతి పెట్టి (నోరు పెట్టి) |
| పాలును | = | పాలను |
| నేయియున్ | = | నేతిని |
| పుక్కిలించియున్ | = | నోటిలో పోసుకొని బయటకు ఉమ్మివేస్తూ |
| కరతోయరుహంబులన్ | = | పద్మాల లాంటి చేతులతో |
| దోయిలించి | = | దోసిట పట్టి |
| తొనుకుచున్ | = | ఒలికి పోయేటట్లుగా (పాలు నేయి) |
| చల్లి | = | చిమ్మి |
| ఎనయఁగన్ | = | తగిన రీతిలో |
| మంటిలో | = | మట్టిలో |
| త్రొక్కి త్రొక్కి | = | బాగా కాళ్లతో తొక్కి |
| ధవళ +ఈక్షణ | = | తెల్లని చూపుల యొక్క |
| రోచులు | = | కాంతులు |
| ఎలర్పన్ | = | అతిశయించగా (ఎక్కువకాగా) |
| ఆడున్ | = | ఆటలాడుతూ ఉంటాడు |

**తాత్పర్యం:** యదువంశంలో పుట్టిన శ్రీకృష్ణుడు చిన్నవాడైన పెద్ద పనులు చేస్తూ ఉన్నాడు. అతడు చేసేపనుల్ని నివారించడం ఎవ్వరికీ సాధ్యంకావటం లేదు. వ్రేపల్లెలోని వంట కుండల్లో, చిన్నపాత్రల్లోపెట్టిన పాలను నేతిని మూతి బెట్టి నోటిలోనికి తీసుకొని పుక్కిలించే

వాడు. పద్మాల లాంటి చేతులతో పాలు నెయ్యి తీసుకొని అవి ఒలికి పోయేటట్లు చల్లి మట్టిలో గట్టిగా కాళ్లతో తొక్కుతూ, తన తెల్లని చూపులు కాంతులు మిక్కిలిగా వెలుగొందుతూ ఉండగా ఆటలాడుతూ ఉండేవాడు.

ప . 207 .

క్షీరాంభోధి మథించి తాను గృపతో గీర్వాణ కోటిన్ సుధా
పూర ప్రీతిగఁ జేసినట్టి చెలువంబుంజూపు నట్టింపుగా
నారం గాగినపాల మీగడలు హస్తాబ్జంబులం దేవి లీ
లారమ్యంబుగ ( దోడి బాలురకు నెల్లం బెట్టిన తానుం గొనున్.

పరిచయం: D పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ప్రతిపదార్థం:

| | | |
|---|---|---|
| తాను | = | శ్రీ కృష్ణుడు (మోహినీరూపంలో ఉన్న విష్ణువు) |
| క్షీర + అంభోధిన్ | = | పాల సముద్రాన్ని |
| మథించి | = | చిలికి |
| కృపతో | = | దయతో |
| గీర్వాణ కోటిన్ | = | దేవతల సమూహాన్ని |
| సుధాపుర | = | అమృత ప్రవాహాన్ని (ఇవ్వటంలేదు) |
| ప్రీతిగన్ | = | సంతోషింప జేసిన విధంగా |
| చేసిన + అట్టి | = | చేసినప్పటి |
| చెలువంబున్ | = | అందాన్ని |
| చూపు + ను + అట్టు | = | చూపించే విధంగా |
| ఇంపుగాన్ | = | ఆనందాన్ని కలిగించేటట్లు |
| ఆరన్ + కాగిన | = | బాగా కాగిన |
| పాలమీఁగడలు | = | పాలపై ఉన్నమీగడలను |
| హస్త + అబ్జంబులన్ | = | పద్మాల లాంటి చేతులతో |
| దేవి | = | తోడి తీసి |
| లీలా రమ్యంబుగన్ | = | మనోహరమైన క్రీడలాగా |
| తోడి | = | తనకు తోడుగా ఉన్న |
| బాలరకున్ + ఎల్లన్ | = | బాలకులందరికీ |
| పెట్టి | = | ఇచ్చి |
| తానున్ | = | తానుకూడా (శ్రీకృష్ణుడుకూడా) |
| కొనున్ | = | తీసుకొనే వాడు |

తాత్పర్యం: శ్రీకృష్ణుడు, పూర్వం పాలసముద్రాన్ని మథించి దేవతా సమూహానికి అమృతాన్ని పంచి సంతోష పరచిన అందాన్ని ప్రదర్శిస్తున్న రీతలో ఆనందాన్ని కలిగిస్తూ మరగ కాగినపాల మీద ఉన్న మీగడలను పద్మాల లాంటి తనచేతులతో తోడితీసి వినోదంగా తనతోటి బాలకులకు లందరికీ పంచేవాడు. తానూ తీసుకొనేవాడు.

విశేషం: విష్ణువు మోహినీ అవతారంలో దేవతలకు అమృతాన్ని పంచిన విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీకృష్ణుడు విష్ణుని అంశ కలిగినవాడని కవి ప్రకటించాడు.

ప. 210 .

ఆడఁగఁ దెచ్చి బాలకుల నందఱ నయ్యయి యాటనొక్కమై
నోడఁగఁ జేసి వీఁ పడచి యొక్కనినొక్కని నెక్కుఁ బల్వురం
గూడఁగఁగూకటుల్ముడిచి కోయని యార్చు గాసిసేయు సం
క్రీడల నెంత లావరియు గీల్పడి చిక్కఁగ ( గృష్ణుఁడుద్ధతిన్.

పరిచయం: ఈ పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ప్రతిపదార్థం:

| | | |
|---|---|---|
| కృష్ణుడు | = | శ్రీకృష్ణుడు |
| బాలకులన్ | = | బాలురను |
| అందఱన్ | = | అందరినీ |
| ఆడఁగన్ | = | ఆడు కోవటానికని |
| తెచ్చి | = | తీసు కొని వచ్చి |
| ఆ + అయి + ఆటన్ | = | ఆయా ఆటల్లో (రకరకాల ఆటల్లో) |
| ఒక్క మైన | = | ఒక్కవిధంగా |
| ఓడగన్ + చేసి | = | ఓడి పోయేటట్లు చేసి |
| వీఁపు | = | శరీరపు వెనుక భాగాన్ని |
| అడచి | = | వంచి |
| ఒక్కనిన్ + ఒక్కనిన్ | = | ప్రతి ఒక్కని (వీపుపై) |
| ఎక్కున్ | = | ఎక్కుతాడు. |
| పల్వురన్ | = | పెక్కుమందిని |
| కూడఁగన్ | = | ఒకచోట కూడేటట్లు (చేసి) |
| కూఁకటుల్ | = | పిల్ల జుట్లు |
| ముడిచి | = | ముడివేసి (బిగించి) |
| కో + అని | = | 'కో' అంటూ |
| ఆర్చుచున్ | = | అరుస్తూ |
| సంక్రీడలన్ | = | ఆటల్లోని ఆధిక్యంతో |
| ఎంతలావరియున్ | = | ఎంతబలవంతుడైనా |
| కీల్పడి | = | లోబడి |
| చిక్కగన్ | = | దొరకగా |
| ఉద్ధతిన్ | = | గర్వంతో |
| గాసి + చేయున్ | = | బాధిస్తాడు |

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఆడుకోవ టానికని గోప బాలకులందరినీ ఒకచోట చేర్చేవాడు. ఆయా ఆటల్లో అందరనీ ఓడించి వాళ్లనివంచి ప్రతి ఒక్కరి వీపులు మీద ఎక్కేవాడు. చాలమందిని ఒకచోటకు చేర్చి వారి జుట్టుల్ని ముడివేసి 'కో 'యనిపెద్దగా కేకలు పెట్టేవాడు. ఎంత బలవంతుడైనా తనకు లోబడి దొరకగా గర్వాతిశయంతో అతనిని బాధించేవాడు,

విశేషణం: ఈపద్యంలో శ్రీకృష్ణుని ఆధిక్యం, గోప బాలుర న్యూనత్వం సప్పష్టమవుతున్నాయి.

ప . 207 .

అసురయొ కాక నీ తనయుఁ డంగన ! యేఁబది బానలందుఁ బొ
ల్పెసఁగెడు వెన్న యుట్లు పయి నేఁ బదిలంబుగడించియుండ, వె
క్కసముగ మ్రింగె బానలును గ్రమ్మనఁ గూలఁగఁద్రోచె నుట్టులు
న్వెస నుఱుమాడె నేమి గతి వేఁగుదు నేక్కడఁ జొత్తుఁ జెప్పుమా !

పరిచయం: ఈ పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ప్రతిపదార్థం:

| | | |
|---|---|---|
| అంగన! | = | ఓ స్త్రీ (ఓయశోదా!) |
| నీతనయుడు | = | నీకొడుకైన శ్రీకృష్ణుడు |
| అసుర + ఒ | = | రాక్షసుడా? |
| కాక | = | కాకపోతే |
| ఏఁబది బానలందు | = | ఏభైకుండల్లో |
| పొలుపు +ఎసగెడు | = | అధికంగా ఒప్పుతున్న (ప్రకాసించే) |
| వెన్న | = | వెన్నను |
| ఉట్ల పయిన్ | = | ఉట్లమీద |
| నేన్ | = | నేను (గోపికను ) |
| పదిలంబుగ | = | భద్రంగా |
| డించి + ఉండ | = | చేర్చిఉంచగా |
| వెక్కసముగ | = | అధికంగా (ఎక్కువగా) |
| మ్రింగె | = | మింగాడు (తిన్నాడు) |
| గ్రమ్మనన్ | = | వెంటనే |
| బానలును | = | కుండల్ని |
| కూలగన్ + త్రోచెన్ | = | కింద పడేటట్లు నెట్టాడు |
| వెసన్ | = | వెంటనే |
| ఉట్టులున్ | = | ఉట్టులను కూడా |
| నుఱుమాడెన్ | = | తెంచి ముక్కలు చేశాడు |
| ఏమిగతిన్ | = | ఏరీతిగా |
| వేగుదున్ | = | తపించిపోవాలి |
| చొత్తున్ | = | వెళ్లేది? |
| చెప్పుమా | = | చెప్పవమ్మా! |

తాత్పర్యం: ఓ యశోద! నీకొడుకు రాక్షసుడై ఉంటాడు. కాక పోతే ఏభై కుండల్లో మంచి వెన్నను ఉట్లమీద నేను భద్రంగా దాచి పెడితే మొత్తం నీకొడుకు మింగేశాడు. అంతటితో ఊరుకోకుండా కుండలన్నింటి నీ కూల దోశాడు, ఉట్లనన్నిటినీ తెంచి ముక్కలు చేశాడు ఈ బాధల్ని ఎలా భరించేది.? ఈప్రాంతం వదలి ఎక్కడికి వెళ్ల గలను? చెప్పవమ్మా "? అని ఒక గోపిక యశోదతో పలికింది.

ప. 219 .

ఓవరి లోన గొంది దెసనున్నవి యెన్ని యొ యెన్నఁబెద్ద భాం
డావళి దాళముందలుపునావల బోఁబడ మీటి చొచ్చె మా
యావి భవత్సుతుండు వెసనంతన యేనును బాఱు దెంచితిం
ద్రావెనొ యేమి సేసెనొ ఘృతం బొక బొట్టును లేదు లోపలన్ !

పరిచయం: ఈ పద్యం ఎఱ్ఱన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ఒక్కగోపిక యశోదతో పలుకుతున్న పద్యమిది.

ప్రతిపదార్థం:

(ఓ యశోదా!)

| | | |
|---|---|---|
| ఓవరిలోన | = | మాయింటి లోపలిగదిలో |
| గొంది దెసన్ | = | మూల దిక్కున |
| ఎన్నన్ | = | లెక్కించగా |
| ఎన్నియొ | = | ఎన్నో (లెక్కలేనన్ని) |
| పెద్ద | = | పెద్దవియైన |
| భాండ + ఆవళి | = | బానలు సముహాలు |
| ఉన్నవి | = | ఉన్నాయి |
| మాయావి | = | మోసగాడైన |
| భవత్ | = | నీయొక్క |
| సుతుండు | = | కొడుకైన శ్రీకృష్ణుడు |
| తాళమున్ | = | ఇంటికి (తలుపుకు) వేసిన తాళాన్ని |
| తలుపున్ | = | తలుపును |
| ఆవలన్ + పోన్ | = | పక్కకుపోయేటట్లు |
| పడమీటి | = | పడగొట్టి |
| చొచ్చె | = | ఇంటిలోపలికి ప్రవేశించాడు |
| వెసన్ | = | వెంటనే |
| అంతన | = | అప్పుడు |
| ఏనును | = | నేనుకూడా |
| పాఱుదెంచితిన్ | = | పరుగు తీస్తూలోపలికి వెళ్లాను. |
| ఘృతంబు | = | నేతిని |
| త్రావెనొ | = | తాగాడో |
| ఏమి + చేసెనొ | = | ఏమిచేశాడో (తెలియదుగాని) |
| లోపలన్ | = | ఆ బానల్లో |
| ఒక్కబొట్టును | = | ఒక్కనేతి బొట్టుకూడా |
| లేదు | = | లేకుండా పోయింది. |

తాత్పర్యం: ఓయశోదా! మాయింటి లోపలి గదిలో ఒక మూలన ఎన్నో పెద్ద పెద్ద కుండల సమూహాలున్నాయి. మాయావిమైన నీకొడుకు మాయింటి తాళం తలుపు పక్కకు పడగొట్టి యింటి లోపలికి ప్రవేశించాడు. అతని వెంటనే నేను కూడా పరుగెత్తుకొని యింటిలోనికి వెళ్లాను. కుండలోని నేతిని నీ కొడుకుతాగేడో మరి ఏంచేశాడో తెలలియదుగాని కుండల్లో ఒక్కనేతి బొట్టు కూడా మిగలలేదు అని పలికింది.

**ప. 224 .**

కలయఁగ ఁబాలుపిండి పులకండమువెన్నయుఁ బెట్టి యట్టులై
యలవడ వండితిం బతియు నాత్మజులుం బ్రియ పడ్డ నాలుగే

నలకుల దొంతి డించి యవియన్నియు నుగ్మలి నీతనూజుఁడొ
ప్పులు వడ మ్రింగెఁ జోద్యమిది బూతములున్నవి గాక కడ్పునన్ !

పరిచయం: ఈ పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ప్రతిపదార్థం:

| | | |
|---|---|---|
| ఉగ్మలి! | = | ఓ స్త్రీ (ఓయశోదా) |
| పతియున్ | = | నాభర్త |
| ఆత్మజాలున్ | = | పిల్లలు (సంతానం) |
| ప్రియము + పడ్డ | = | ఇష్టపడగా |
| పాలు | = | పాలు |
| పిండి | = | పిండి |
| పులకండము | = | కండచక్కెర |
| కలయగన్ | = | కలిసేటట్లుగా (కలిపి) |
| వెన్నయున్ | = | వెన్ననుకూడా |
| పెట్టి | = | కలిపి |
| అట్టులు +ఐ + అలవడన్ | = | అట్టులనే పిండి వంటలుగా |
| వండితిన్ | = | వండాను (తయారుచేశాను) |
| నీతనూజుడు | = | నీకొడుకైన శ్రీకృష్ణుడు |
| నాలుగు + ఏన్ | = | నాలుగైదు |
| అలకుల | = | కుండల యొక్క |
| దొంతి | = | వరుసను |
| డించి | = | దింపి |
| అవి + అన్నియు | = | వండిన పదార్థాలన్నిటినీ |
| ఒప్పులు + పడ | = | చక్కగా |
| మ్రింగెను | = | మింగాడు |
| ఇది | = | ఈ విధంగా మింగటం |
| చోద్యము | = | ఆశ్చర్య కరమైన విషయం |
| కడ్పునన్ | = | (నీకొడుకు) పొట్టలో |
| బూతములు | = | పిశాచాలు |
| ఉన్నవి + కాక | = | ఉన్నాయేమో! (ఉండి ఉంటాయి) |

తాత్పర్యం: "ఓ యశోదమ్మా ! నాభర్త పిల్లలు ఇష్టపడగా పాలు,పిండి కండచక్కెర కలిపి వాటికి వెన్న చేర్చి చక్కగా అట్టులు అనే పిండివంటలు వండాను. నీకొడుకు వచ్చి నాలుగైదు కుండల వరుసల్ని దించి ఆ కుండల్లోని పిండి వంటల్ని పూర్తి మింగేశాడు. అన్ని పదార్థాల్ని మెక్కిన నీకొడుకు పొట్టలో భూతాలేమైనా ఉన్నాయా? ఉండే ఉంటాయి అని గోపిక పలికింది.

**ప. 228.**

నావుడు నోర్తు నెమ్మొగమునం గడు దైన్యము దోఁప వచ్చి, నా
యావులుఁ గ్రేపులం గలిపి యార్చి వెలార్చినఁ బోయి ఘోరదు
ర్గావలి సొచ్చె నింట మగ' ఁడాత్మజు లెవ్వరు లేరు ప్రల్లదుం
డీ విధి మమ్ము మన్ని గొనియెన్ భవదీయ సుతుండు గోపికా!

పరిచయం: ఈ పద్యం ఎర్రన రచించిన హరివంశంలోని పూర్వభాగానికి చెందిన ఐదవ ఆశ్వాసంనుంచి స్వీకరించబడిన "శ్రీకృష్ణుని బాల్య క్రీడలు" అనే పాఠ్య భాగంలోనిది.

ఒక గోపిక దైన్యంతో యశోదతో పలికిన పద్యమిది.

ప్రతిపదార్థం:

| | | |
|---|---|---|
| నావుడు | = | అని ఒకగోపిక పలకగా |
| ఓర్తు | = | వేరొక గోపిక |
| నెఱ + మొగమునన్ | = | ముఖంనిండా |
| కడు | = | మిక్కిలి |
| దైన్యము | = | దిగులు |
| తోఁప | = | కనిపించగా |
| వచ్చి | = | యశోద దగ్గరకు వచ్చి |
| నా + ఆవులన్ | = | మా ఆవుల్ని |
| క్రేపులన్ | = | దూడల్ని |
| కలిపి | = | ఒకచోట చేర్చి |
| ఆర్చి | = | పెద్దగాకేక పెట్టి |
| వెలార్చి నన్ | = | వాటిని బయటకు తోలగా |
| పోయి | = | ఆ పశువులు దూరంగా వెళ్లి |
| ఘోర | = | భయంకరమైన |
| దుర్గ + ఆవలిన్ | = | వెళ్లటానికి వీలు లేని ప్రాంతాల్లోనికి |
| చొచ్చెన్ | = | ప్రవేశించాయి |
| ఇంటన్ | = | (ప్రస్తుతం) ఇంటిలో |
| మగడు | = | భర్త గాని |
| ఆత్మజులు | = | కొడుకులు గాని |
| ఎవ్వరు లేరు | = | ఎవ్వరు లేరు |
| గోపికా | = | ఓ యశోదా |
| ఈ విధిన్ | = | ఈ విధంగా |
| ప్రల్లదుండు | = | చెడ్డ వాడైన |
| భవదీయ సుతుండు | = | నీకొడుకు శ్రీకృష్ణుడు |
| మమ్మున్ | = | మా (యొక్క), (మమ్మల్ని) |
| మన్ని గొనియెన్ | = | ప్రాణాలు తీశాడు (బాధించాడు) |

తాత్పర్యం: గోపికలందురూ ఒక్కొక్కరు తమ బాధల్ని యశోదకు తెలుపుతున్నప్పుడు ఒక గోపిక ముఖంలో దిగులు నింపుకొని యశోద ముందుకు వచ్చి ఈ విధంగా పలికింది "ఓ యశోదా! నీ కొడుకు మా ఆవుల్ని దూడల్ని కలిపి పెద్దగా అరిచి బయటకు తోలి వేశాడు. అవి మనం ప్రవేశించటానికి వీలు లేని ప్రాంతంలోకి వెళ్లిపోయాయి. ఇంట్లో ప్రస్తుతం నామగడుగాని, కొడుకులు గాని లేరు. ఈ విధంగా భర్త పిల్లలు లేని సమయం చూసి నీ కొడుకు మమ్మల్ని ఎంతో బాధించాడు."

డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఎం. ఏ., పిహెచ్. డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర లొయోల కళాశాల

ఖండం 1 ప్రాచీన పద్యభాగము

# శ్రీకృష్ణుని బాల్యక్రీడలు

## పాఠం : 8

1: 8: 0 పరిచయం

1: 8: 1 ఉద్దేశం

1: 8: 2 సందర్భ సహిత వ్యాఖ్యలు

1: 8: 3 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

### 1.8. 0 పరిచయం :

ఇంతకు ముందు పాఠాల్లో కవిని గూర్చి, గ్రంథాన్ని గూర్చి, కఠిన పదాలకు అర్థాల్ని గూర్చి, పాఠ్యాంశ వివరణను గూర్చి ప్రతి పదార్థాలను గూర్చి తెలుసుకున్నారు. ఈ పాఠంలో రెండు విషయాల్ని గూర్చి అంటే సందర్భ సహిత వ్యాఖ్యలు, పరీక్షకు రాదగిన ప్రశ్నలు వాటికి రాయవలసిన సమాధానాల్నిగూర్చి తెలుసుకొంటారు.

### 1.8. 1 ఉద్దేశం :

ఈ పాఠాన్ని చదివిన తర్వాత ఎర్రన రచించిన 'శ్రీకృష్ణుని బాల్య క్రీడలు' అనే పాఠ్యాంశంలోని కొన్ని సందర్భ సహిత వాక్యాలకు వ్యాఖ్యానాల్ని తెలుసుకొంటారు. ఇంకా ఈ పాఠంలో ప్రస్తుత పాఠ్యాంశంలోని కొన్ని ప్రశ్నలకు సమాధానాల్ని గ్రహిస్తారు. దీనితో ఈ పాఠ్యాంశానికి సంబంధించిన అన్ని అంశాల్ని తెలుసుకొన్నట్లవుతుంది.

### 1: 8: 2 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. శైల కుంజర కలభంబు వోలె నొప్పె (ప. 195)**

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం:- శ్రీకృష్ణుని బాల్య క్రీడల్ని వర్ణిస్తున్న సందర్భంలో శ్రీకృష్ణుడు తనను ఎత్తుకొని ముద్దులాడే వారికి కనువిందు చేస్తూ మువ్వలు, గంటలు మోగుతూ ఉండగా అటుఇటు తిరిగే వాడని, దుమ్ములో కూడా శ్రీకృష్ణుడు ఆడుతూ ఉంటే అతడు ఒక ప్రత్యేక రీతిలో కనిపిస్తున్నాడని చెబుతున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

వివరణ :- మట్టి, బురద, పేడలతో మురికి పట్టి దుమ్ముతో శ్రీకృష్ణుడు ఆడుతూ ఉండటం వల్ల అతని శరీరం వింతగా ప్రకాశిస్తూ ఉండి గైరికాది ధాతువులతో వెలుగొందే కొండయేనుగు గున్న శరీరంలా ఉన్నదని భావం. చిన్ని కృష్ణుని శరీరాన్ని కొండ ఏనుగు గున్నతో పోల్చటం సముచితంగా ఉన్నది.

**2. ఏనుగు దిన్న వెలగపండు నాగ నొప్పు ( ప 197)**

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణునికి ఆహారం పెట్టటం యశోదకు చాల కష్టంగా ఉండేది. అయినా ఆమె ఉపాయంతో పాలు, వెన్న గిన్నెల్లో పోసి రుచి గొలిపే రీతిలో పెట్టినా, అన్నీ తిని ఏమి తిననట్లుండే శ్రీకృష్ణుని గూర్చి తెలుపుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు

వివరణ :- యశోద శ్రీకృష్ణునికి సంతోషంతో కడుపు నిండా పాలు వెన్న పెట్టి అతని మూతి జిడ్డును ముఖానికి శరీరానికి పూసి రొమ్ము నిమిరేది. అప్పుడు శ్రీకృష్ణుడు ఏనుగు దిన్న వెలగ పండులాగా అంటే కరి అనే పురుగు చేత డొల్లగా కొట్టబడినా పైకి మాత్రం బాగా కనిపించే వెలగపండు లాగా ఉన్నాడని భావం. అన్నీ తిన్నా ఏమీతినని వానిలా ప్రశాంతంగా కనిపిస్తున్నాడని చెప్పవచ్చు.

**3. మానం డొకటం దా వారి గారించుచున్ (ప 198)**

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణునికి తల్లి యశోద అన్నీ పెట్టి సంతృప్తి పరిచినా అతడు పెరుగులు చిలుకుతున్న గోపికల దగ్గరకు వెళ్లి వారిని బాధిస్తూ ఉంటాడని కవి వర్ణిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- యశోద తన పనుల్లో తాను మునిగి ఉన్నప్పుడు ఆమెకు తెలియకుండా శ్రీకృష్ణుడు తప్పటడుగులు వేసుకుంటూ గోపికల దగ్గరకు వెళ్లి వాళ్ల పెరుగులు చిలుకుతున్నప్పుడు వెన్న అడిగి, వారు పెట్టినదంతా తిని వారిని వేధిస్తూ ఉండేవాడని వారిని బాధించడం మానడని భావం.

4. పెరుపు దరువను మఱచి పంప్రీతిఁజూడ (ప 200)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుడు పెరుగును చిలికే గోపికల దగ్గరకు వెళ్లి వారి చేతుల్లోని కవ్వం పట్టుకొనేవాడు. వారి కోకముడులు జారేటట్లు పైట కొంగులాగుతూ ఉండేవాడు. అయినా అతని చేష్టలకు మురిసిపోతూ గోపికలు తమ పనులు తాము చేసుకోవటం మరిచి తన్మయత్వం పొందేవారని కవి వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ:- తమ దగ్గరకు వచ్చిన శ్రీకృష్ణునితో గోపికలు 'వెన్నలు పెడతాము' ఆడమంటే మువ్వలు గంటలు మోగేటట్లు ఆడేవాడు. అతని ఆటలకు మురిసిపోయి తన్మయత్వంలో గోపికలు పెరుగు చిలకటం కూడా మాని తదేకంగా శ్రీకృష్ణుని చూసే వారని భావం.

5. పిదప నురలం ద్రోచుచును బోవు నుక్కివపు గతిన్ (ప 206)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుని ఉదార చేష్టల్ని వర్ణిస్తూ కవి అతడు పెద్ద మూతులున్న బానల్లో మూతి పెట్టి పాలు, నెయ్యి నోటిలోనికి తీసుకొని పుక్కిలిస్తూ, ఇంకా పాలను, నేతిని మట్టిలో చల్లుతూ కుండల్ని పడదోసి పోయేవాడని చెబుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- గోపికలు చిలకటానికి సిద్ధంగా ఉంచిన బానల్లోని పెరుగును, అంతకు ముందే చిలికించి పెట్టిన వెన్నలను బాగాతిని తర్వాత కుండల్ని కపట భావంతో పడదోసి వెళ్లే వాడని భావం.

6. పెను మంట లొండొండఁ దనరఁ జేయు
7. కావళ్ల యుట్లను వ్రచ్చి తెంచు.
} (ప 209)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో గావిస్తున్న అనేకమైన అల్లరి పనుల్ని కవివర్ణిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- పాలల్లో నీళ్లు, పెరుగులో పాచిచల్ల కలుపుతూ నేతుల్ని తీసుకొని పోయి నిప్పుల్లో పోసేవాడు. నిప్పుల్లో నెయ్యి పొయ్యటంతో పెద్ద పెద్ద మంటలు వచ్చేవి. పెరుగులో పాలు, వెన్న, వెన్నను మజ్జిగలో, మజ్జిగను నేతిలో కలిపేవాడు. తాళ్లతో కట్టిన దూళ్లను విడిచి, గోపాలుర కావళ్లకు ఉన్న తాళ్లను తెంపి ముక్కలు చేసేవాడు.

8. ఎట్టి బలియురైన ఁదగవు పాటింపరే?
9. చిన్నవాడని నమ్మియ మిన్న కునికి.
} (ప 212)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- వ్రేపల్లెలో శ్రీకృష్ణుడు చేసే అల్లరి పనులకు తట్టుకోలేక గోపికలందరూ ఒక్కటై యశోద దగ్గరకు వచ్చి నిష్ఠూరంగా పలుకుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- గోపికలు యశోదతో "ఓ యమ్మా నీవే ముద్దుల కొడుకును కన్నావా? ఏమిటి? మేము పడే పాట్లు కాస్త గమనిస్తావా ? ఎంత బలవంతులైనా న్యాయాన్ని పాటిస్తారు కదా ! అయ్యో శ్రీకృష్ణుడు చిన్నవాడే కదా అని ఇంతకాలం ఊరుకొన్నాము అని పలికారు. అంటే అతని పనుల్ని ఇప్పటి వరకూ సహించాము. ఇక మీదట సహించలేమని భావం. బలవంతులైనా న్యాయాన్ని పాటించండని విజ్ఞప్తి చేసినట్లు కూడా గ్రహించవచ్చు.

**10. ఏమిగతి వేఁగుదు నెక్కడఁజొత్తు ఁజెప్పుమా (ప 217)**

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- గోపకాంతలు శ్రీకృష్ణుని దుష్ట చేష్టితాలను యశోదకు వివరిస్తున్న సందర్భంలో ఒక గోపిక శ్రీకృష్ణుడు రాక్షసుడా అని ఆశ్చర్య పడుతూ తన ఇంటిలో అతడు చేసిన పనుల్ని వివరిస్తున్న సందర్భం లోనివి ఈ పలుకులు.

వివరణ :- గోపిక ఏభై బానల్లో వెన్న పెట్టి ఉట్లమీద ఉంచింది. శ్రీకృష్ణుడు ఆమె యింటిలోనికి వెళ్లి ఆ బానల్లోని వెన్ననంతా మింగి వేశాడు. అంతటితో ఊరుకోక కుండల్ని కూలదోశాడు. ఉట్లు తెంచేశాడు. ఈ పనులు సాధారణ బాలునికి సాధ్యం కాదనే భావంతో ఆ గోపిక శ్రీకృష్ణునితో రాక్షసాంశ ఉన్నదేమోనని సందేహించింది. అందుకే వ్రేపల్లెలో బ్రతకటం కష్టమని, ఎక్కడకు వెళ్లాలో చెప్పమని యశోదను అడిగింది.

**11. ఏమిసేసెనో ఘృతం బొక బొట్టును లేదు లోపలన్ (ప 219)**

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- గోపికలందరూ యశోద దగ్గరకు వెళ్లి శ్రీకృష్ణుని దుష్ట చేష్టల్ని వివరిస్తున్న సందర్భంలో ఒక గోపిక నాట్య భంగిమలో చేతులు సాచి యశోదతో పలుకుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- ఇంటి లోపల గదిలో ఒక మూలన ఎన్నో నేతి కుండలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు ఒక గోపిక యింటి తాళం, తలుపు పడదోసి లోపలికి వెళ్ళాడు. అతని వెనుకే గోపిక పరుగెత్తుకొంటూ వెళ్లింది. శ్రీకృష్ణుడు ఏమి మాయ చేశాడో గాని అక్కడ ఉన్న అసంఖ్యాకమైన పెద్ద కుండల్లో ఒక నేతి బొట్టుకూడా లేదు. అతడు తాగాడో, మాయ చేశాడో గోపికకు అర్థం కాక యశోదకు చెప్పింది.

**12. ఈ పల్లెకుఁ జిచ్చు పెట్టి యేఁగెద మేమున్**
**13. ఏ పగిదిని బ్రతుకరాదె యిటు చెడుకంటెన్** } (ప 220)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుని అల్లరి పనులకు తట్టుకోలేని గోపికలు ఒక్కటైన యశోద దగ్గరకు వచ్చినప్పుడు ఒక గోపిక నాట్యభంగిమలో చేతులు సాచి శ్రీకృష్ణుని చేష్టలకు తట్టుకోలేక వ్రేపల్లెను వదలి వెళతామని యశోదతో పలుకుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- 'లోకంలో బతకటానికి మంచి ప్రదేశం దొరకకుండా ఉంటుందా ? అందుకే ఈ పల్లెకు నిప్పు పెట్టి మేము ఎక్కడికైనా

వెళ్లిపోతాము. ఇక్కడ ఉండి నష్ట పోవటం కంటే మాకు అనుకూలమైన చోట ఎలాగైనా బతుకుతాము" అని పలికింది. అంటే శ్రీకృష్ణుని బాధల్ని భరించటం కంటే వేరొక చోటికి వెళ్లటం ఉత్తమమని ఆమె భావం.

14. "ఎల్ల దానను౯ జెడితి మొల్లబోయితిమి ప్రాయిగల పట్టి పొట్ట౯ బెట్టి" ( ప 222)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీ కృష్ణుని దుష్ట చేష్టలిన్ని అని చెప్పటానికి వీలు లేదు. పాలు పెరుగులు తాగటమే కాకుండా కుండలన్నిటినీ పగలగొడుతూ గోపికల యిళ్లలోని పాయసం, కూర, కూడు మొదలైన వాటిని గోపాలురకు పెడుతూ, దూడల్ని ఆవుల వద్దకు వదలి అనేక రకాలుగా పీడిస్తున్న తీరును ఒక గోపిక యశోదకు వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- దూడల్ని లాగటానికి మెడలో పూసల తాడు కూడా శ్రీకృష్ణుడు మిగల్చలేదు. ఏడ్చిన పిల్లలకు పెట్టటానికి పెరుగు పాలు కూడా లేకుండా చేశాడు. అందుకే సమస్తమూ భాగ్యవంతుడైన శ్రీకృష్ణుని పొట్టన బెట్టి అన్ని విధాలా చెడిపోయామని గోపిక పలికింది.

15. చోద్యమిది బూతము లున్నవిగాక కడ్పునన్ (ప 224)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- యశోద వద్దకు వచ్చిన గోపికల్లో ఒక గోపిక తన భర్తకూ పిల్లలకు ఇష్టమైన పిండి వంటల్ని చేసి కుండల్లో పెడితే శ్రీ కృష్ణుడు వాటినన్నింటినీ మింగేశాడని యశోదకు వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- భర్త, పిల్లలు ఇష్టపడ్డారని ఒక గోపిక పాలు, పిండి, కండచక్కెర కలిపి వాటితోపాటు వెన్న కూడా చేర్చి కమ్మని పిండివంటలు చేసింది. శ్రీకృష్ణుడు వాళ్ల యింటిలోనికి ప్రవేశించి నాలుగైదు కుండల వరుసల్ని దింపి, పిండివంటలు మొత్తం మింగేశాడు. అందుకే గోపిక 'శ్రీకృష్ణుని పొట్టలో పిశాచాలేమైనా ఉన్నాయా? అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

16. మొగమోటన మనుపు చుండి మూసితి నబలా ! (ప 225)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుని దుష్ట చేష్టల్ని వివరిస్తున్న ఒక గోపిక యశోదతో శ్రీకృష్ణుడు తమ యింటిలోని పిండి వంటల్ని మొత్తం తిన్న విషయాన్ని తన భర్తకు చెప్పకుండా రహస్యంగా ఉంచానని చెబుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ:- ఇంటిలోని పిండి వంటల్ని శ్రీకృష్ణుడు పూర్తిగా తినేశాడని భర్తకు తెలిస్తే గోపికను వదలి వేయటం గాని, చంపటంగాని చేస్తాడు. శ్రీకృష్ణుడు తినేశాడని చెప్పినా నమ్మడు. అందుకే చెప్పకుండా నోరుమూసుకొని ఉన్నానని యశోదకు చెప్పింది. శ్రీకృష్ణుని చేష్టలు భార్యాభర్తల మధ్య వైషమ్యాలు పెంచుతాయనే విషయాన్ని ఇక్కడ మనం గమనించవచ్చు.

17. ఇవి శిశువు నందడంగెడు పనులే (ప 227)

పరిచయం :- ఈ వాక్యం ఎర్రన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుని దుష్ట చేష్టితాల్ని యశోదకు వివరిస్తున్న ఒక గోపిక తాను యవ పిండి, పంచదారను కలిపి బానలో మూలన దాచి ఉంచగా మొత్తం తిని ఇంకా కూడు కూడా తిన్నాడని చెబుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- యవపిండి, పంచదార కలిపి ఉంచగా తినటమే కాకుండా శ్రీకృష్ణుడు బానలో అన్నమంతా తిన్నాడు. ఇది వైష్ణవ మాయ కాకపోతే కేవలం శిశువులకు అంత పదార్థాన్ని తినటం సాధ్యమౌతుందా ? సాధ్యం కాదని భావం. శ్రీకృష్ణుడు విష్ణువు అంశతో పుట్టిన వాడనే విషయం ఇక్కడ స్పష్టమవుతుంది.

**18. ఇట్టి మనుజులుర్వి గలరె ? (ప 229)**

పరిచయం :- ఈ వాక్యం ఎఱ్ఱన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుని దుష్ట చేష్టల్ని యశోదకు గోపికలు వివరిస్తున్న సందర్భంలో ఒక గోపిక దిగులుతో తన యింటిలో భర్త, పిల్లలు లేని సమయంలో శ్రీకృష్ణుడు తమ ఆవుల్ని, దూడల్ని బయటకు వెళ్ల గొట్టాడని, పెద్ద కుప్పగా ఉన్న వెన్నను మింగేశాడని చెబుతున్న సమయంలోనివి ఈ పలుకులు.

వివరణ :- బుట్టెడు వెన్నను ఒక పెద్ద పోగుగా చేర్చగా అటూ ఇటూ చూసే లోపు శ్రీకృష్ణుడు వెన్నంతా మింగేశాడు. ఇలాంటి మానవులు భూమి మీద ఉంటారా ? ఉండరని భావం. శ్రీకృష్ణుడు సాధారణ మానవుడు కాడని దైవాంశతో పుట్టిన వాడని ఈ పలుకుల ద్వారా గుర్తించవచ్చు.

**19. ఎక్కడి కేనియు బోయెదము . (ప 231)**

పరిచయం :- ఈ వాక్యం ఎఱ్ఱన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుని దుష్ట చేష్టల్ని గోపికలు యశోదకు చెప్పి, యశోద తన కొడుకును అదుపులో ఉంచలేదని నిందిస్తూ వ్రేపల్లెను వదలి వేరొక ప్రాంతానికి వెళ్లిపోతామని యశోదతో పలుకుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ :- " అమ్మా! యశోదా ! నీ కొడుకు పెట్టే కష్టాలను మేమింక సహించలేము. వ్రేపల్లెను వదలి ఎక్కడికైనా వెళ్లిపోతాము. నీ కొడుకు, నీవు సుఖంగా ఉండండి" అని బాధను గోపికలు వెళ్లగక్కారని భావం.

**20. అసురపుంబనులు నిజము లనియెదరు బలే (ప. 233)**

పరిచయం :- ఈ వాక్యం ఎఱ్ఱన రచించిన హరివంశము - పూర్వ భాగంలోని 5 వ ఆశ్వాసం నుంచి స్వీకరించబడిన శ్రీకృష్ణుని బాల్య క్రీడలు అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :- శ్రీకృష్ణుడు పెట్టిన బాధల్ని గోపికలు యశోదకు తెలియజేసిన తర్వాత యశోద వారిని ఓదారుస్తూ పలికిన పలుకులివి.

వివరణ :- " ఓ గోపకాంతలారా ! మీరు పడ్డ నష్టాలనన్నిటినీ తీరుస్తాను. మీరు దిగులు చెందవద్దు. మీరు లేకుండా మాకు జరుగుతుందా? రాక్షసులు చేసే పనులు మా శ్రీకృష్ణుడు చేశాడంటున్నారు. చేశాడో చెయ్యలేదో?" అని యశోద గోపికలతో పలకటం ద్వారా పుత్ర పక్షపాతాన్ని, వ్యామోహాన్ని ప్రదర్శించింది. అయితే గోపికలు పొందిన నష్టాన్ని తీరుస్తానని చెప్పటం ద్వారా వారికి న్యాయం కలుగుతుందని భావించవచ్చు.

## 1.8. 3 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు :

**1. శ్రీకృష్ణుని శైశవోత్సవాలను వివరించండి (లేదా) శ్రీకృష్ణుని శిశు చేష్టల్ని తెలియజేయండి.**

జ) ఎఱ్ఱన హరివంశంలో శ్రీకృష్ణుని చరిత్రను, అవతార ప్రాశస్త్యాన్ని వర్ణించాడు. హరివంశంలోని పూర్వభాగంలోని ఐదవ ఆశ్వాసంలో శ్రీకృష్ణుని శైశవ క్రీడల్ని ఎఱ్ఱన మధుర మనోహరమైన రీతిలో వర్ణించాడు. ఎఱ్ఱన తనదైన ధోరణిలో శ్రీకృష్ణుడు శిశు దశలో ఉన్నప్పుడు చేసిన పనుల్ని పాఠకుల కళ్లకు కట్టేటట్లు విశదీకరించాడు.

శ్రీకృష్ణుడు శిశువుగా ఉన్నప్పుడు పాన్పుమీద బోరగిల పడుకొని నలుమూలలకు జరిగేవాడు. ఎవరైనా చెక్కిళ్లమీద గిలిగింతలు పెడితే కలకల నవ్వేవాడు. మోకాళ్లని చేతితో తడువుతూ అటూ ఇటూ తిరుగుతాడు. ఎవరైనా చేతి వేళ్ళను ఊతమిస్తే తప్పటడుగుల వేస్తాడు. "అన్నను గంటి, తండ్రిని గంటి, అయ్యనుగంటి" అని ముద్దుముద్దుగా పలుకుతూ దగ్గరకు పిలిస్తే ముచ్చటగొలిపే నడకలు సాగిస్తూ బాల్యంలో ప్రకాశించాడు.

శ్రీకృష్ణుని చూసినవారికి ఎత్తుకొని ముద్దులాడాలనిపించేది. అప్పుడతడు పరుగులుతీస్తూ ఉంటే అతని ఒంటిమీద మువ్వలు, గంటలు మధురంగా మోగుతూ ఉండేవి. నుదుటిమీద పిల్ల జుట్టులో రావిరేక ముచ్చటగా ఉండేది. శ్రీకృష్ణుని చేష్టలన్ని జనాకర్షకంగా

ఉండేవి. శ్రీకృష్ణుని చూపులు చంచలంగా ఉండి అందరినీ ఆకట్టు కొనేవి. మట్టి, బురద, పేడలతో మురికి పట్టి దుమ్ములో ఆడుతుంటే శ్రీకృష్ణుడు వింత కాంతిలో ప్రకాశించేవాడు. ఆ సమయంలో అతడు గైరికాది ధాతువులతో విరాజిల్లే కొండ ఏనుగు గున్నలా ఉండేవాడు.

ప్రతిరోజు యశోద శ్రీకృష్ణునికి వెన్న పాలు గిన్నెల్లో తీసి పెడుతూ ఉండేది. తాను పెట్టేవి రుచిగా ఉండటం కోసం యశోద శ్రీకృష్ణుని నోటిలో పెదవి చివర వేలు పెట్టి కొంచెం కొంచెం తినిపించేది. శ్రీకృష్ణునికి కడుపునిండా పాలు, వెన్న పెట్టిన తర్వాత ఆయన మూతికి ఉన్న జిడ్డును ముఖానికి శరీరానికి పులిమేది, రొమ్మును నిమిరేది. యశోద పెట్టినవన్ని తిని శ్రీకృష్ణుడు ఏమీ ఎరగని వానిలా 'కరిమ్రింగిన వెలగపండులా' ఉండేవాడు.

శ్రీకృష్ణుడు ఒక్కొక్కసారి యశోద కన్నుగప్పి ఆటలకు వెళుతూ ఉండేవాడు. ఆమె యింటి పనుల్లో మునిగి ఉన్నప్పుడు గోపికల దగ్గరకు వెళ్లి వెన్న పెట్టవలసిందిగా అడిగేవాడు. ఎంత వెన్న పెట్టినా తిని గోపికలకు చికాకు కలిగించేవాడు. వాళ్లు పెరుగు చిలుకుతుంటే కవ్వం తాడు పట్టుకొనేవాడు. వాళ్ల పైటచెంగులు పట్టి లాగి పోక ముడులు జారేటట్లు చేసేవాడు.

గోపికలు శ్రీకృష్ణుని చూసి "వెన్నపెడతాము ఆడవయ్యా" ! అంటే మువ్వలు, మొలగంటలు మోగేటట్లు ఆడుతూ ఉంటే గోపికలు తన్మయత్వంతో తాము పెరుగు చిలకటం మాని శ్రీకృష్ణుని చూస్తూ ఉండేవారు.

శ్రీకృష్ణుడు వెన్నతింటున్నప్పుడు అతని చేతిలో వెన్నముద్ద ఏనుగు తొండంతో పట్టిన తామర మొగ్గలా ప్రకాశిస్తూ ఉండేది. గోపికలు పెరుగును చిలికేటప్పుడు శ్రీకృష్ణుడు వారి దగ్గరకు వెళ్లినప్పుడు ఆయన మీద పెరుగుచుక్కలు చింది పడుతూ ఉండేవి. అప్పుడు శ్రీకృష్ణుడు క్షీరసాగర మథన సమయంలో అమృత బిందువులంటిన విష్ణుమూర్తిలా ఉండేవాడు.

గోపికల్ని శ్రీకృష్ణుడు పెట్టే బాధల్ని తట్టుకోలేక అతన్ని పట్టి తెచ్చి యశోదకు అప్పగించి 'నీ కొడుకును ఎటూ కదలనివ్వకూండా పట్టి ఉంచవమ్మా ! " అని చెప్పేవారు. యశోద తన పనుల్లో తాను మునిగి ఉండటాన్ని గమనించిన శ్రీకృష్ణుడు గోకులంలోని ప్రతి ఇంటికీ రోజూ ఉదయం పూట వెళ్లి వచ్చేవాడు.

ఈ విధంగా శ్రీకృష్ణుడు శైశవ దశలో ఉన్నప్పుడు గోకులంలోని అందరికి ఆనందాన్ని కలిగింపజేస్తూ, తల్లి ప్రేమను పొందుతూ, ఒక్కొక్కసారి గోపికలకు చికాకు కలిగిస్తూ , మరోసారి వారిని తన్మయుల్ని చేస్తూ క్రమక్రమంగా పెరిగి పెద్దవాడై శైశవ క్రీడల్ని వదలి దుడుకు చేష్టలు చెయ్యటం ప్రారంభించాడు.

2. శ్రీకృష్ణుని ఉదార చేష్టల్ని వర్ణించండి.

(లేదా)

శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో గావించిన దుడుకు పనుల్ని వివరించండి.

(లేదా)

శ్రీకృష్ణుడు కేళీలాలసుడై వ్రేపల్లెలో ప్రవర్తించిన తీరును తెల్పండి.

జ. శ్రీకృష్ణుడు శైశవదశలో వ్రేపల్లెలోని అందరకీ వినోదం కలిగించాడు. అందరూ అతని పనులకు సమ్మోహితులై దగ్గరకు పిలిచి ఆదరించేవారు. అయితే అతడు కొంచెం పెరిగిన తర్వాత ఉదార చేష్టలతో అంటే దుడుకు పనులతో వ్రేపల్లె వాసులకు చికాకు కలిగించాడు.

శ్రీకృష్ణుడు గోపికల గృహాల్లో ప్రవేశించి వెడల్పు మూతి ఉన్న పాత్రల్లో జాగ్రత్తచేయబడిన పాలను నేతిని మూతిబెట్టి నోటిలోనికి తీసుకొని పుక్కిలించేవాడు. చేతులతో తీసి దోసిళ్లతో మట్టిలో చల్లి కాళ్లతో బాగా తొక్కేవాడు. అతని దుడుకు పనుల్ని మాన్పటం ఎవరికి సాధ్యమయ్యేది కాదు. అందువల్ల నిరాటంకంగా తన పనులు తాను చేసుకొని వెళుతూ ఉండేవాడు. చిలకటానికి సిద్ధం చేసిన బానలోని పెరుగును, అంతకు ముందే చిలికి తీసిన వెన్నను మొత్తం తిని బానల్ని పడదోసి పారిపోయేవాడు.

పాలసముద్రాన్ని మథించినప్పుడు వచ్చిన అమృతాన్ని తాను మోహినీ రూపంలో దేవతలకు పంచిన విషయాన్ని గుర్తుకు తెచ్చు విధంగా గోపికలు బాగా కాగ బెట్టిన పాల మీద ఉన్న మీగడలను తన చేతులతో తోడి తీసి రమణీయమైన క్రీడగా తన తోటి బాలకులకు అందించి తానూ తీసుకొనేవాడు. వరుసగా ఉన్న ఉట్లను తెంచి బానల్ని పడదోసి, కొంత వెన్నను మిత్రులకు వదలి వెళ్లేవాడు.

శ్రీకృష్ణుడు కడవల్లోని సగం పాలు తాగి ఆ మిగిలిన పాలల్లో నీళ్లు పోసి కడవలు నింపేవాడు. బానల్లో పెరుగంతా తాగి ఆ బానల్లో చద్ది చల్ల పోసేవాడు. నేతులు తీసుకొని వెళ్లి నిప్పుల్లో పోసి పెద్ద మంటలు రగిలేటట్లు చేసేవాడు. పెరుగులో పాలు, పెరుగును వెన్నునుచల్లతోను, పెరుగును వెన్నతోను, చల్లను నేతితోను కలిపేవాడు. దూడల మెడలకున్న పలుపులు విప్పి తల్లి పాలకోసం వాటిని తోలేవాడు. మరికొన్నింటిని అన్ని వైపులకు తోలేవాడు. పశువుల్ని కట్టివేసే కొయ్యల్ని పెకలించి పారవేసేవాడు. గోపాలుర కావళ్లకు ఉన్న తాళ్లను తెంపి ముక్కలు చేసేవాడు.

ఆటలకోసమని పిల్లలందరినీ తెచ్చి అన్ని ఆటల్లోను వారిని ఓడించి వాళ్ల వీపులు వంచి మీద ఎక్కేవాడు. పెక్కుమందిని ఒక చోట చేర్చి వారి పిల్లజుట్లు ముడివేసి 'కో' యని అరుస్తూ, ఎంత బలవంతులనైనా లోబరచుకొని తన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ ఉండేవాడు.

శ్రీకృష్ణుని ఉదార చేష్టల్లో చిలిపితనం, దుడుకుతనం ఔద్ధత్యం కనిపిస్తున్నాయి.

(గమనిక :- శ్రీకృష్ణుని శైశవోత్సవాలు వివరించండి లేదా

శ్రీకృష్ణుని ఉదార చేష్టలు వివరించండి - అన్ని ప్రశ్నలడిగితే పై విధంగా విడివిడిగా సమాధానాలు రాయాలి. అలా కాకుండా "శ్రీకృష్ణుని బాల్య క్రీడా విశేషాల్ని వివరించండి' అని అడిగితే పై ప్రశ్నల సమధానాల్ని కలిపి ఒకే సమాధానంగా (కొంత తగ్గించి) రాయాలి).

3. గోపికలు శ్రీకృష్ణుని దుష్ట చేష్టితాలను యశోదకు చెప్పిన తీరును తెల్పండి.

(లేదా)

శ్రీకృష్ణుడు గోపికల్ని బాధించిన తీరును వారు యశోదకు చెప్పిన విధమును వివరించండి.

జ. ద్రేపల్లెలో శ్రీకృష్ణుడు గందరగోళం సృష్టిస్తున్నా ద్రేపల్లెలోని ఎవరికీ అతన్ని వారించటం సాధ్యం కాలేదు. ఆశ్చర్యపడి చూడటం తప్ప ఎవరూ ఏమి చెయ్యలేకపోయారు. అప్పుడు గోపికలందరు ఒక్కటై యశోద దగ్గరకు వెళ్లి శ్రీకృష్ణుని దుష్టచేష్టితాలను తెలియజెశారు. "ఓ యశోదా ! నీవు బలే ముద్దుల కొడుకును కన్నావమ్మా ! అతడు చేసే పనుల్ని గమనించావా ? ఎంత బలవంతులైనా న్యాయాన్ని పాటిస్తారు కదా ! ఇన్నాళ్లు శ్రీ కృష్ణుడు చిన్నవాడని ఊరుకొన్నాము. ఇక మీదట అతని దుష్టచేష్టల్ని సహించలేము. నీ కొడుకు చేసిన పనుల్ని చెవులారా వినవమ్మా" అని అందరూ అంటుండగానే ఒక గోపిక ముందుకు వచ్చి యశోదతో ఇలా అంది.

"నీ కొడుకు నా యింట్లో పదికడవల నెయ్యి, పెరుగు, పాలు తాగి కడవలన్నిటినీ పడదోసి పొయ్యాడు. మేము పేదవాళ్లం. ఇలా చేస్తే మేం బతికేదెలా ? ఇంతకు మందు మేము పడ్డ నష్టానికి లెక్కలేదు" అని చెప్పగానే మరొక గోపిక చెలరేగి

"యశోదమ్మా ! నీ కొడుకు రాక్షసుడై ఉంటాడు. కాకపోతే ఏభై బానల్లో మంచి వెన్నను ఉట్టి మీద భద్రంగా దాచి ఉంచితే ఆశ్చర్యంగా మొత్తం మింగి కుండలు కూల దోసి ఉట్లు తెగ గొట్టాడు. ఇక నేను ఎక్కడికి వెళ్లాలో నువ్వే చెప్పు".

గోపిక పలుకుల్ని యశోద వింటున్న సమయంలో మరొక గోపవనిత నాట్యభంగిమలో చేతులు ముందుకు సాచి యశోద దగ్గరకు వెళ్లి " తల్లీ ! నీ కొడుకు మోసగాడు. మాయింటి లోపలి గదిలో మూలన ఎన్నో పెద్దకుండలున్నాయి. వాటిలోని నేతిని మొత్తాన్ని మా యింటి తాళం తలుపులు తొలగించి మాయజేశాడు. తాగాడో మరి ఏం చేశాడో తెలియదు గాని బానల్లో ఒక్క నేతి బొట్టుకూడా లేదు. ఈ పని క్షణకాలంలో చేశాడు. నీ కొడుకు బాధల్ని తట్టుకొలేము. ఈ పల్లెకు చిచ్చు పెట్టి ఎక్కడికైనా వెళతాము. ఇక్కడ ఉండి చెడిపోవటం కంటే అనుకూలంగా ఉన్న ఏ ప్రాంతానికైనా వెళ్లి బతుకుతాము". అని పలికింది.

ఒక గోపిక కోపంతో మందుకువచ్చి "నా యింటిలో జరిగిన కీడును ఏమని చెప్పగలను? దుష్టుడైనా నీ కొడుకు పది కుండల్లోని నేయ్యి, పాలు, పెరుగును కలిపి నేలమీద వరదలుగా పారించాడు. కుండల్ని కాళ్లతో, చేతులతో తన్ని కొట్టి చిన్న పెంకులుగా చేశాడు. పాయసం, కూరలు, అన్నం తన తోటి పిల్లలకు పెట్టి కుండల్ని వరుసగా పడగొట్టి, దూడల్ని పాల కోసం వదిలాడు. దూడల్ని లాగటానికి మెడలో పూసతాడు కూడా మిగలలేదు. ఇంట్లో ఏడ్చే బిడ్డకు పెరుగు పాలు కరువయ్యాయి. ఉన్నవన్నీ నీ కొడుకు పొట్టన బెట్టి అన్ని విధాలుగా నష్టపోయాము." అని పలికింది.

ఒక గోపిక పెద్ద గొంతుతో " యశోదమ్మా ! నా భర్త పిల్లలు ఇష్టపడితే పాలు, పిండి, పులకండం, వెన్న కలిపి పిండివంట చేశాను. కానీ నీ కొడుకు కుండల వరుసల్లో నాలుగైదు దించి మొత్తం పిండి వంటల్ని మింగేశాడు. నీ కొడుకు కడుపులో పిశాచాలేమైనా

ఉన్నాయా? ఈ విషయాల్ని ఇంకా నా భర్తకు చెప్పలేదు. ఆయనకు తెలిస్తే క్షమిస్తాడా ? నన్ను వదిలి పెట్టటమో, చంపటమే చేస్తాడు. ఒక వేళ నేను చెప్పినా నమ్మడు. అందుకే నోరుమూసుకొని ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాను. " అని పలికింది.

వేరొక గోపిక తన బాధను వివరిస్తూ " తల్లీ ! దేవుడి మీద ఒట్టు పెట్టి చెబుతున్నాను. బానలోపల యవపిండి, పంచదారా కలిపి మూలన దాచి పెట్టాను. నీ కొడుకు ఎక్కడనుంచివచ్చాడో మొత్తం తినేశాడు. అంతటితో పోకుండా కుండలోని కూడంతా నోటిలో కుక్కుకొన్నాడు. ఇదంతా వైష్ణవ మాయలాగా ఉన్నది. లేకపోతే చిన్న పిల్లలకు ఇలాంటి పనులు సాధ్యమవుతాయా?" అని పలికింది.

ఒక గోపిక దిగులుతో యశోద దగ్గరకు వచ్చి " నీ కొడుకు మా ఆవుల్ని, దూడల్ని దూరంగా తోలితే అవి దుర్గమ ప్రాంతాలకు పోయాయి. ఇంటిలో నాభర్త కొడుకులు లేనప్పుడు నీ కొడుకు ఈ పని చేశాడు. ఈ విధంగా మమ్మల్ని బాధించాడు. గంపంత వెన్న పెద్ద పోగుగా పెట్టగా చూస్తుండగానే మొత్తం మింగేశాడు. ఇలాంటి మానవులు లోకంలో ఉంటారా ?" అని పలికింది. ఆ తర్వాత అందరూ కలిసి శ్రీకృష్ణుడు పెట్టే కష్టాల్ని భరించలేమని వ్రేపల్లెను వదలి ఎక్కడికైనా పోతామని యశోద శ్రీకృష్ణులు సుఖంగా ఉండవలసిందని పలికితే యశోద వారిని వారించి వారు నష్టపోయిన దాన్ని తాను తీరుస్తానని చెప్పి, తన కొడుకును దండిస్తానని పలికి వారిని వాళ్ల యిళ్లకు పోవలసిందని పలికింది.

యశోదమాట విని గోపికలందరూ తమతమ నివాసాలకు వెళ్లారు.

ఈ విధంగా గోపికలు శ్రీకృష్ణుని కొంటె చేష్టల్ని, దుడుకు పనుల్ని గూర్చి యశోదకు వివరించగా ఆమె వారిని అనునయించి యిళ్లకు పంపింది.

4. 'శ్రీకృష్ణుని బాల్య క్రీడలు' పాఠ్య భాగమాధారంగా ఎఱ్ఱన కవితా రీతుల్ని వివరించండి.

జ. ఎఱ్ఱన హరి వంశంలోని ప్రధాన కథ శ్రీ కృష్ణచరిత్ర. తెలుగు కవిత్రయంలో ఒకడైన ఎఱ్ఱన నన్నయ తిక్కనలమార్గాన్ని అనుసరిస్తూనే తనదైన మార్గాన్ని ఏర్పరుచుకొన్నాడు. నన్నయ ఆఖ్యాన పద్ధతికీ , తిక్కన నాటకీయ పద్ధతికీ , ఎఱ్ఱన వర్ణనాత్మక పద్ధతికీ గణుతి కెక్కిన వారుగా ప్రశస్తి పొందినప్పటికీ, ఎఱ్ఱన నన్నయ తిక్కనల మార్గాన్ని కూడా అనుసరించటం వల్ల ఒక విశిష్టమైన శైలిని సంతరించుకొన్నాడు. 'శ్రీకృష్ణుడు బాల్య క్రీడలు' అనే పాఠ్యభాగంలో ఎఱ్ఱన వర్ణనాత్మక పద్ధతితో పాటు నాటకీయ పద్ధతిని కూడా అనుసరించాడు. ఆలంకారిక రచనలోను, రసనిర్వహణలోను, పద ప్రయోగంలోను తనదైన ప్రతిభను ప్రదర్శించాడు. ఎఱ్ఱన విశిష్ట శైలిని ఈ విధంగా గమనించవచ్చు.

వర్ణనాత్మక విధానం :-

వర్ణనా నిపుణుడైన వానినే కవిగా గుర్తిస్తారు. కవితాను చెప్పదలచుకొన్న అంశాన్ని ముందుగా తన భావనలో పదిల పరచుకొని తర్వాత పాఠకుల కళ్లకు గట్టేటట్లు వర్ణిస్తాడు. ఎఱ్ఱన శ్రీకృష్ణుని శైశవోత్సవాలను వర్ణిస్తూ

"పాలు పారగా బోరగిలి పాన్పు నాల్గుమూ
  లలకును వచ్చును మెలఁగి మెలఁగి
లలిఁగపోలంబులు గిలిగింతలు వుచ్చి
  నవ్వింపఁ గలకల నవ్వి నవ్వి
ముద్దులు దొలకాఁడ మోఁకాలఁగేలను
  దడవుచు నెందును తారితారి
నిలుచుండఁ బెట్టి యంగుళి యూఁత సూపగాఁ
  బ్రీతి తప్పడుగులు వెట్టి వెట్టి ...." అని

శ్రీకృష్ణుని పాఠకులకు ప్రదర్శించాడు. ఎఱ్ఱన పలుకుల్ని గమనించిన పాఠకుల ముందు శ్రీకృష్ణుడు ఆయా చేష్టలు చేస్తూ ఉన్న అనుభూతి కలుగుతుంది. మాటల ద్వారా దృశ్యాన్ని సాక్షాత్కరింప జేసే అపూర్వమైన ప్రతిభను ఎఱ్ఱన ఈ వర్ణనలో ప్రదర్శించాడు.

గోపికలు దగ్గరకు వచ్చిన బాలకృష్ణునితో వారు 'మేము వెన్న పెడతాము. ఆటలాడు' అనగానే అతడు ఆటలాడి గోపికల్ని తన్మయుల్ని చేసిన దృశ్యాన్ని ఎఱ్ఱన

"వెన్న పెట్టెద మాడుమా యన్న యన్న
మువ్వలును మొలగంటలు మొరయనాడు
నచ్యుతుఁడు గోపికలు తమ యాత్మ భ్రమసి
పెరువును దరువను మరచి సంప్రీతిఁజూడ" -

అని వర్ణించాడు. వెన్నపెడతామని గోపికలు పలకటంతోనే శ్రీకృష్ణునికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. అందుకే తాను ధరించిన మువ్వలు, మొలలోని గంటలు మోగుతూ ఉండగా ఆటలాడాడు. బాలకృష్ణుని ఆటలకు మురిసిపోయిన గోపికలు తమను తాము మరిచిపోయారు. అంటే తన్మయులయ్యారు. పెరుగును చిలుకుతున్న ఆ గోపకాంతలు తమ పనిని మరచి శ్రీకృష్ణుని ఆటల్నే చూస్తున్నారని కవి వర్ణించాడు. 'అచ్యుతుడు' అనే శబ్దాన్ని ప్రయోగించటం ద్వారా శ్రీకృష్ణుడు విష్ణువుయొక్క అంశతో జన్మించిన వాడనే విషయాన్ని కూడా కవి ధ్వనింపజేసినట్లు గుర్తించవచ్చు..

నాటకీయ శైలి :- శ్రవ్యకావ్యంలో దృశ్య కావ్య లక్షణాలను సాక్షాత్కరింపజేసిన పద్ధతికి కవిబ్రహ్మ తిక్కన సోమయాజి ఆద్యుడు. తిక్కన మార్గాన్ని అనుసరిస్తూ తనదైన ధోరణిలో ఎఱ్ఱన కూడా నాటకీయ శైలిని అక్కడకూడా ప్రదర్శించాడు. 'శ్రీకృష్ణుడు బాల్యక్రీడలు' అనే పాఠ్యభాగంలో గోపికలు అందరూ ఒక్కటై యశోద దగ్గరకు వచ్చి శ్రీకృష్ణుని దుష్టచేష్టల్ని వివరించటం, వారిమాటల్ని విన్న యశోద వారిని అనునయించి సమాధానం చెప్పిన విధానం నాటకీయ రీతిలో ఉన్నదని చెప్పటం సముచితం.

గోపికలందరూ ఒక్కటై యశోదతో "తల్లీ! నీవే ముద్దుల కొడుకును కన్నావా! మేము పడేపాట్లు అంటే నీ కొడుకు మమ్మల్ని బాధించే తీరును గమనించవా? ఎంతబలవంతులైనా న్యాయాన్ని పాటించరా? అయ్యో శ్రీకృష్ణుడు చిన్నవాడేలే అని ఊరుకొన్నాము" అని పలికిన తీరు నాటకీయంగా ఉన్నది.

ఇంకా గోపికలు ఒకరితర్వాత ఒకరు వచ్చి యశోదతో పలికిన తీరును "అనునెడ నొక్క వ్రేత యన్నాతి ముందరికి వచ్చి" "మున్ను వోయిన సేఁగికి వెన్నఁ గొలది లేదు, నాఁగ వేఱొక గొల్లలేమ రేఁగి" "అని పలుక నలుక తోడ గోపిక యొర్తు నర్తించు విధంబున ఁజేతులు సాఁచుచుఁ గృష్ణ జననిం గదిసి యిట్లనియె." "అనుచుండ మఱియొక్క యతివ యా గ్రహమున నందఱఁ ద్రోచి కొంచరుగుదెంచి" 'అట్టి యెడ నొర్తు పెలుచని యెలుంగున" "వేఱొక్క గొల్లెత యమ్మ! వినుము" "నావుడు నొర్తు నెమ్మొ గమునం గడు దైన్యము దోఁప వచ్చి" అనే వాక్యాల్ని గమనించినప్పుడు ఎఱ్ఱన నాటకీయ శైలి స్పష్టమవుతున్నది. ఇంకా గోపికలు పలికిన పలుకుల్లో నాటకీయ ధోరణి స్పష్టమవుతుంది. ఒక గోపిక యశోదతో శ్రీకృష్ణుడు తమ యింటిలోని పిండివంటల్ని భర్త పిల్లల కోరిక మేరకు చేయగా వాటినన్నిటినీ తినిపోయాడని తన భర్తకు తెలిస్తే క్షమించడని చెప్పే పలుకుల్ని ఎఱ్ఱన

"మగఁ డింగ నన్ను సైఁచునె
దిగవిడచుం జంపుఁగాక తెల్లము మదిన
మ్మిగ పుట్టునె యిది చెప్పిన
మొగమోటన మనుపుచుండి మూసితి నబలా!"

అని నాటకీయ ధోరణిలో రచించాడు. "అబలా!" అని యశోదను సంబోధించటం, మిగిలిన పలుకుల్ని పలకటం నాటకీయ ధోరణిగా చెప్పవచ్చు. గోపికల పలుకుల్ని విన్న యశోద వారితో మాట్లాడిన

"మీ సేఁగు లెల్ల నచ్చెద
వేసరకుఁడు మీరు లేక వేగునె మాకున్
జేసెంజేయఁడు బాలకుఁ
డాసురపుం బనులు నిజము లనియెదరు బలే." అనే పలుకుల్లో నాటకీయమైన సంభాషణాత్మక శైలి స్పష్టమవుతున్నది.

ఆలంకారిక రచన : 'శ్రీకృష్ణుని బాల్య క్రీడలు' అనే పాఠ్యభాగంలో ఎఱ్ఱన ఆలంకారికమైన పద్యాల నెన్నిటినో రచించాడు. అర్థాలంకారాలనే ఎక్కువగా ప్రయోగించాడు. శబ్దాలంకారాలక్కడక్కడా ఉన్నాయి.

"అన్నఁగంటిఁ దండ్రిఁ గంటి నయ్యఁ గంటి" అనే పాదంలో ఆయా పదాల చివర 'కంటి' అనే శబ్దం ప్రయోగించటం వల్ల అంత్యానుప్రాసను గుర్తించవచ్చు.

'ఇంద రావయ్య విందుల విందవగుచు' అన్నచోట పూర్వబిందు పూర్వక 'ద' కారం ప్రయోగంచటం వల్ల వృత్త్యను ప్రాసను గుర్తించవచ్చు.

"బల్లిదుడై వ్రేపల్లె నెల్లెడలం" అన్నప్పుడు ద్విత్వ 'ల' కార ప్రయోగంలో

"ఒక్కమై నోడఁగఁజేసి వీఁపడచి యొక్కని నొక్కని నెక్కు" అనే చోట ద్విత్వ 'క' కార ప్రయోగంలో వృత్త్యనను ప్రాసను గుర్తించవచ్చు. దుమ్ములో ఆడుకొంటున్న శ్రీకృష్ణుని వర్ణనలో స్వభావోక్తితో కూడిన ఉపమాలంకారాన్ని ఎఱ్ఱన మనోహరంగా

"మన్ను రొంపియుఁ బెండయు మసటువట్టి
పాంసు సంక్రీడఁ దనమేను భాసురముగ
హరి యనేక ధాతుచ్ఛటా వ్యక్తమైన
శైల కుంజర కలభంబు వోలెనొప్పు" అని రచించాడు.

- మట్టి, బురద, పేడలో మురికి పట్టి దుమ్ములో ఆడుకొంటున్న రీతిలో స్వభావోక్తిని గుర్తించవచ్చు. దుమ్ములో ఆడుకొంటున్న శ్రీకృష్ణుడు అనేక గైరిక ధాతువులలో కూడిన కొండయేనుగు గున్నలా ఉన్నాడని చెప్పడంలో ఉపమాలంకారాన్ని గుర్తించవచ్చు.

శ్రీకృష్ణుని చేతిలోని వెన్నముద్ద ఏనుగు తొండంమీద ఉన్న తెల్ల తామర మొగ్గలా ఉన్నదని చెప్పిన తీరులోను ఉపమాలంకారాన్ని గుర్తించవచ్చు. ఇలా ఎఱ్ఱన ఈ పాఠ్యభాగంలో చాల సందర్భాల్లో ఆలంకారిక శైలిని ప్రయోగించాడు.

**రస నిర్వహణం :** ఎఱ్ఱన ప్రస్తుత పాఠ్యభాగంలో అద్భుత రసాన్ని, కరుణ రసాన్ని పోషించినట్లు గుర్తించవచ్చు. శ్రీకృష్ణుని చేష్టలన్నీ అద్భుతరస పూరితాలని చెప్పవచ్చు. గోపికలు యశోదకు చెప్పిన శ్రీకృష్ణుని చేష్టల్లో అద్భుతరస ప్రవాహం ఉన్నది.

"నాయింట బదిగడవల
నేయి పెరుగుఁ బాలుఁ ద్రావె నీ తనయుండు" అన్నప్పుడు,
"అసురయొ కాక నీ తనయు డంగన! యేఁబది బానలందుఁబొ
ల్పెసఁగెడు వెన్న యుట్లపయి నేఁబదిలంబుగ డించియుండ వె
క్కసముగ మ్రింగె" అన్నప్పుడు,
"త్రావెనొ యేమి సేసెనొ ఘృతం బొక బొట్టును లేదు లోపలన్" అన్నచోట,

"పుట్టియంత వెన్న ప్రోవుగఁ బేర్చిడి
గడగి కడిగి యొక్క గనప చేర
నంత వట్టు మ్రింగె నటసూచి చూడంగ
నొంటి నిట్టి మనుజులుర్వి గలరె" అనే పద్యంలో అద్భుతరసం కనిపిస్తుంది.

"మగడింక నన్ను సైఁచునె
దిగవిడుచుం జంపుఁగాక తెల్లము" అనే చోట,
"నావుడు నోర్తు నెమ్మొ గమునం గడుదైన్యము దోఁపవచ్చి" అనే పద్యంలో కరుణరసం ఉన్నది.
యశోద శ్రీకృష్ణునికి వెన్నపాలు పెట్టే సమయంలో వాత్సల్యం కనిపిస్తున్నది.

**పదప్రయోగ దక్షత :-** ఎఱ్ఱన నుడికారాలు జాతీయాలు నెన్నిటినో ప్రయోగించి తన ప్రత్యేకతను ప్రదర్శించాడు. "ఏనుగు దిన్న వెలగ పండునాగ" "ఇల్లిలు దప్పకుండ" 'నిప్పులఁబోసి' "వీఁపడచి" "కోయని యార్చుచు" "చెవులారంగ' 'ఎక్కడఁజొత్తు" "ఒకబొట్టును లేదు" "పొట్టఁ బెట్టి " బూతము లున్నవి గాక కద్పునన్ " "దేవరాన" అటసూచి చూడంగా " మొదలైనవి ఎఱ్ఱన ప్రత్యేకతను స్పష్టం చేస్తాయి.

శ్రీకృష్ణుని బ్యాల్య క్రీడల్లో ' ఎఱ్ఱన బహుముఖీనమైన కవితా ప్రతిభను ప్రదర్శించి రసజ్ఞ మనోహరంగా పాఠ్యభాగాన్ని రచించాడని చెప్పవచ్చు.

డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఎం. ఏ., పిహెచ్. డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర లొయోల కళాశాల

ఖండం - 3

నవలాపరిచయం

# కాలాతీత వ్యక్తులు - డా ॥ పి. శ్రీదేవి

పాఠం - 17

| | | | |
|---|---|---|---|
| 3.17. 0 | పరిచయం | : | నవల - లక్షణాలు |
| 3.17. 1 | ఉద్దేశం | : | తెలుగులో నవలా రచన |
| 3.17. 2 | పాఠ్యభాగ సందర్భం | : | రచయిత్రి పరిచయం - నవలలోని పాత్రల పరిచయం |
| 3.17. 3 | పాఠ్యభాగ వివరణ | : | కాలాతీతవ్యక్తులు - కథా సంగ్రహం |

**3.17. 0 పరిచయం: నవల - లక్షణాలు :**

ఇంతకు ముందు 1,2 ఖండాలలో ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను, ఆయా పాఠాలను గూర్చి తెలుసుకొన్నారు. ఇప్పుడు వచన రచన కాలాతీతవ్యక్తులు నవలలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు, పాత్రల మనస్తత్వం మొదలైన అంశాలను గూర్చి తెలుసుకొంటారు.

నవల అనేది ఆధునిక కవితా ప్రక్రియ. ఈ పదం 'నావెల్' అనే ఇంగ్లీషు పదం నుంచి పుట్టింది. నూతనత్వం కలిగి ఉన్నది అని దీని అర్థం. జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించి, కల్పనలతో, ఊహలతో నిర్మించుకుంటూ వెళ్ళిన పెద్ద రచనను నవల అని చెప్పుకోవచ్చు. ఇది వచనంలో ఉండాలి.

మంచి నవలకు ఉండే లక్షణాలను ఇలా చెప్పుకోవచ్చు. 1. ఇతివృత్తం. 2. పాత్ర పోషణ 3. సరళమైన భాష 4. కీలకమైన సంఘటనలతో కూడిన కథ 5. రచయిత ప్రజ్ఞను, ఆత్మలక్షణాన్ని వ్యక్తం చేసే శైలి 6. తీసుకొన్న కథను మంచిభాషలో, చదివించగల శైలిలో, ఊహించని సంఘటనలను కలుపుతూ, సజీవ పాత్రల ద్వారా ఆద్యంతాలను కలిపే విధంగా చేయగల సంవిధానం.

**3.17. 1 ఉద్దేశం : తెలుగులో నవలా రచన :**

తెలుగు నవల ప్రారంభ వికాసాలను ఇందులో తెలుసుకొంటారు.

నరహరి గోపాలకృష్ణమసెట్టి 1872లో 'శ్రీరంగరాజచరిత్ర' అనే నవలను రచించారు. అది తెలుగులో మొదటి నవల. 1878 లో కందుకూరి వీరేశలింగం పంతులుగారు 'రాజశేఖర చరిత్ర' అనే నవలను రచించారు. దాన్ని ఆయన 'వచన ప్రబంధం' అన్నారు. నవలను తొలి రోజులలో పాశ్చాత్య పద్ధతి రచనను అఖ్యాయిక, ఉపన్యాసం, కాదంబరి అని వ్యవహరించేవారు. మొట్టమొదట 'నవల' అని నామకరణం చేసిన వారు కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు. 1896లో ఈ వచన రచనకు నవల అనే పేరు స్థిరపడింది.

తెలుగులో గొప్ప సంచలనం కలిగించిన నవల ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి'. ఆ పిదప విశ్వనాథ సత్యనారాయణ, గుడిపాటి వెంకట చలం మొదలైన వారు నవలా సాహిత్యాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నవలారచన అభివృద్ధి చెందింది. గోపీచంద్, బుచ్చిబాబు, కొడవటి గంటి మొదలయిన రచయితలతో పాటు లత, రంగనాయకమ్మ వంటి రచయిత్రులు కూడా నవలా రచనకు పూనుకున్నారు. వీరు రచించిన నవలల్లో మధ్యతరగతి కుటుంబ జీవనం వస్తువుగా స్వీకరించబడింది. స్వాతంత్ర్యానంతరం వచ్చిన నవలల్లో అసమర్థుని జీవయాత్ర, చివరకు మిగిలేది, అల్పజీవి, అతడూ - ఆమె, కాలాతీత వ్యక్తులు - అనే ఐదు నవలలు పంచకావ్యాల వంటివని సాహిత్యవేత్తలు గుర్తించారు. వీనిలో 'కాలాతీత వ్యక్తులు' నవలను రచించిన రచయిత్రి డాక్టర్ పి. శ్రీదేవి.

**3.17. 2 పాఠ్యభాగ సందర్భం : రచయిత్రి పరిచయం :**

ఇందులో కాలాతీతవ్యక్తులు నవలా రచయిత్రిని గూర్చి, పాత్రల పరిచయాన్ని తెలుసుకొంటారు.

డాక్టర్. పి. శ్రీదేవి తూర్పుగోదావరి జిల్లా అనకాపల్లిలో 1929 సెప్టెంబరు 21వ తేదీన జన్మించారు. ఆమె తండ్రి గుళ్ళపల్లి నారాయణమూర్తి గారు గొప్పనాటకకర్త, రచయిత, జాతీయవాది. ఆమె కాకినాడ, విశాఖపట్టణాల్లో చదివి, ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసి డాక్టరయింది. ఆమె రచనల్లో మధుకలశం, కవితాసుమం, ఉరుములు- మెరుపులు, కలం తెచ్చిన రూపాయలు అనే గేయ కవితలు,

కథలు, ఆమెకు మంచిపేరు తెచ్చిపెట్టాయి. శ్రీదేవికి భాషపై అధికారం ఉంది. ఆమె శైలి మనోహరంగా ఉంటుంది. ఆమె కలంనుంచి జాలువారిన రచనల ద్వారా ఆమెకు అచిర కాలంలోనే ఆంధ్ర దేశంలో అపారమైన కీర్తి లభించింది. కాని మూడు పదుల వయస్సులో 29-7-1961లో ఆమె పరమపదించారు.

నవలలోని పాత్రల పరిచయం.

**1. ఇందిర:-** 'కాలాతీత వ్యక్తులు' నవల కథ ఈ పాత్ర చుట్టూ తిరుగుతుంది. ఆమె ఈ నవలలో కథానాయిక అనవచ్చు. దేనికీ తలవంచని వ్యక్తిత్వం. ఎవరికీ భయపడని ధైర్యం ఆమె సొంతం. పురుషాధిక్య సమాజంలో ఇమడిపోవడం ఆమెకు ఇష్టం లేదు. జీవితాన్ని అనుభవించడానికి ఆమె ఎంతటికైనా తెగిస్తుంది. కష్టాలను, ఒడిదుడుకులను ఏమాత్రం గణించే స్వభావం కాదామెది. తన పని ఎలా సాధించుకోవచ్చో, అందుకు ఎలా మసలుకోవాలో ఆమెకు బాగా తెలుసు. పిరికితనమంటే ఆమెకు అసహ్యం. చుట్టూ వ్యాపించి ఉన్న చీకట్లను చూచి భయపడక - ఆ చీకటి మధ్య స్వేచ్ఛగా, నిర్భయంగా, ధైర్యంగా పోరాటం సాగిస్తూ జీవితంలో వెలుగు కోసం తపించే గొప్ప పాత్ర ఇది.

**2. కళ్యాణి :-** అణకువ, వినయం, విధేయత, సౌశీల్యం, అభిమానం కలగలిపిన పాత్ర ఇది. కష్టాలెన్ని ఎదురైనా ఓర్పుతో భరిస్తూ, తన కాళ్ళపై తను నిలబడడానికి యత్నించే పాత్ర ఇది. సంప్రదాయం మూర్తీభవించిన తెనుగింటి ఆడపడుచులా, అందరి అభిమానానికి ఆప్యాయతకు పాత్రమైన పాత్ర. జీవితంలో చీకటి కలకాలం ఉండదని, చీకటి తరువాత వెలుగు వస్తుందని అప్పటివరకు ఓర్పు అవసరమని తెలియజెప్పే పాత్ర.

**3. కృష్ణమూర్తి :-** సంపన్న కుటుంబంలో పుట్టిన విలాసపురుషుడు. విలాసంగా బతకడం తప్ప బాదరబందీకి ఇష్టపడడు. కాని మనసున్న మంచిమనిషి. స్నేహశీలి. పరోపకార పరాయణుడు. నమ్మిన దాని కోసం ఎవరినైనా ఎదిరించగలడు. దేనినైనా త్యజించగలడు. తప్పు అని తెలిస్తే దిద్దుకోవాలనే తపన ఉన్నవాడు. ఇందిరను వివాహమాడిన సంస్కారి. అతని పట్టుదల ముందు ఎవరైనా తలవంచవలసిందే.

**4. ప్రకాశం :-** నిలువెల్లా పిరికితనం, మనసునిండా అవకాశవాదం ఉన్నవాడు. చదువుతున్నది డాక్టరు కోర్సు అయినా ఇతరుల మనసులను తెలుసుకోలేనివాడు. స్వతంత్ర వ్యక్తిత్వం కాని సొంత నిర్ణయాలుగాని లేని చంచల స్వభావి. మామ పడగనీడలో పెరిగిన అయోగ్యుడు.

**5. చక్రవర్తి :-** వృత్తిరీత్యా డాక్టరు. పెంపుడు తల్లి, భార్య వలన సంసారంలో బాధలుపడి విరక్తితో ఒంటరిగా జీవించే మంచి మనిషి. స్నేహశీలి. కృష్ణమూర్తికి స్నేహితుడు. అవసరంలో సాయపడే స్వభావం, మంచితనాన్ని స్వాగతించే గొప్పతనం అతనిలోని లక్షణాలు. కళ్యాణిని వివాహమాడిన ప్రేమమూర్తి.

**6. వసుంధర :-** సంపన్నుల ఇంట్లో పుట్టి, గారాబంగా పెరిగిన అమ్మాయి. కష్టాలంటే తెలియవు. స్నేహం కోసం ప్రాణం ఇచ్చే తత్వం. కళ్యాణికి స్నేహితురాలు. ఆమె కోసం అయిన వారికి దూరం కావడానికి కూడా వెనుకాడలేదు. సంస్కారవతి, గుణవతి. మంచితనం కనిపిస్తే ఆదరించే స్వభావం గల యువతి.

**7. ఆనందరావు :-** ఇందిర తండ్రి. వ్యసనపరుడు. విలాసంగా బతికి ఉద్యోగం పోగొట్టుకున్నవాడు. ఇతనికి నీతి నియమాలు తెలియవు. సుఖంగా బ్రతకడానికి ఏమయినా చేస్తాడు. తన కూతురు కన్నా తన సుఖమే ముఖ్యమనుకునే తత్వం. అవకాశవాది. లౌకికుడు. తామరాకు మీద నీటిబొట్టులా ఉండగలడు.

**8. రామినాయుడు :-** మంచి మనసున్న మనిషి. తన స్నేహితుడు అచ్యుతరామయ్య మరణించడంతో, అతని కూతురు కళ్యాణికి సహాయపడాలని తపించిన వాడు. తన వలన ఇతరులు ఇబ్బంది పడకూడదనే తత్వం. నీతి, నిజాయితీలు కలిగిన వాడు.

**9. శేషావతారం :-** ప్రకాశం మేనమామ. దుర్మార్గుడు. డబ్బుకోసం దేనికయినా తెగించే మనిషి. మమతలు, అనురాగాలు, అభిమానాలు ఇతనికి లేవు. ఇతడు డబ్బుకోసం ఏ పనినయినా చేస్తాడు. ఎత్తులు వేయడంలో దిట్ట.

**10. అచ్యుత రామయ్య :-** కళ్యాణి తండ్రి. జీవితంలో కష్టాలు తప్ప సుఖాలు తెలియనివాడు. మంచితనంతో బ్రతికి, చితికి పోయాడు. కూతురికి ఏమీ మిగల్చలేకపోయాడు.

**11. జగన్నాథం :-** ప్రకాశానికి తెలిసిన వాడు. ఓ విద్యార్థి ఏ జంటయినా ప్రేమించుకుంటున్నారని తెలిస్తే సహించలేని ఈర్ష్యాళువు. ఉత్తరాల ద్వారా కల్లోలాలు సృష్టించడంలో నేర్పరి.

**12.** వసుంధర పిన్ని :- అతి సామాన్యమైన స్త్రీ. సంప్రదాయపు కట్టుబాట్లలో గుట్టుగా బ్రతికేతత్వం. మంచిది అని పేరు పొందాలనే తాపత్రయం ఎక్కువ. సూటిపోటి మాటలు అనడంలో దిట్ట - వసుంధరకు సాయంగా వైజాగ్‌లో ఉంటూ ఉంటుంది.

ఇంకా నవలలో ఇందిర ఇంట్లో సూరమ్మ అనే పనిమనిషి, చక్రవర్తి ఇంట్లో ఒక కాంపౌండరు, నెల్లూరులో చక్రవర్తి స్నేహితుడు గోపాలరావు, అతని భార్య అనే పాత్రలున్నాయి.

## 3.17. 4 పాఠ్యభాగ వివరణ :

## కాలాతీత వ్యక్తులు - కథాసంగ్రహం

విశాఖపట్టణంలో ఎం.బి.బి.ఎస్. చదివే ప్రకాశం, కాలేజీ ఎదురుగా ఒక మేడ పైభాగంలో ఉండేవాడు. క్రింది భాగంలో ఉండే నాలుగు గదుల్లో కూడ విద్యార్థులే ఉండేవారు. వారిలో ఒకడైన కృష్ణమూర్తి జల్సాపురుషుడు. మిగిలిన విద్యార్థులందరూ కృష్ణమూర్తి డబ్బుతో సుఖాలు అనుభవించేవారు. బి.ఏ. పరీక్షలో తప్పిన కృష్ణమూర్తి డిగ్రీ పూర్తి చేయడానికి విశాఖపట్టణం వస్తే అతనికి ప్రకాశం తప్ప మిగిలిన స్నేహితులెవరూ కనిపించలేదు. కృష్ణమూర్తి అతని స్నేహితులు ఖాళీ చేసిన తరువాత ప్రకాశం ఉండే మేడ క్రింది భాగంలో ఇందిర తన తండ్రి ఆనందరావుతో అద్దెకు చేరింది. ఆమెకు రైల్వేలో ఉద్యోగం. చాలా కలుపుగోలుమనిషి. ఎవరితోనైనా ఇట్టే స్నేహం చేసుకోగలదు. ఆమె ప్రకాశంతో చనువుగా ఉంటుంది. గంటలకొలది అతని గదిలో కబుర్లు చెప్తూ కాలక్షేపం చేస్తుంది. ఇందిర తండ్రి ఆనందరావు కూడా ప్రకాశంతో కబుర్లు చెబుతూ ఉంటాడు.

ఇందిరకు ఇంటర్‌లో సహాధ్యాయి అయిన కళ్యాణి ఆనర్స్‌లో చేరింది. హాస్టలులో ఉంటే ఖర్చు ఎక్కువని, కళ్యాణి కూడా ఇందిర ఆహ్వానంతో వచ్చి ఆ ఇంట్లో చేరింది. కళ్యాణి ఎవరితోనైనా మృదువుగా మాట్లాడుతుంది. వినయవిధేయతలు ఉట్టిపడేలా ఒద్దికగా ఉంటుంది. కళ్యాణి వచ్చి ఆ ఇంట్లో చేరిన రోజు ప్రకాశానికి ఆమె మీద ప్రత్యేకమైన అభిప్రాయం కలుగలేదుగాని క్రమక్రమంగా కళ్యాణి ప్రకాశం మనస్సును చూరగొంది.

ప్రకాశం కోసం వచ్చిన కృష్ణమూర్తి ఇందిరను చూసి, ఆమెను గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ప్రకాశం ఆమె గురించి తనకు తెలిసిన విషయాలన్నీ చెబుతాడు. ఆమెను కృష్ణమూర్తికి పరిచయం చేస్తాడు. తరువాత ఇందిర, కృష్ణమూర్తి ఎక్కువగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఒకరోజు కృష్ణమూర్తి ఇందిరను బీచ్‌కి ఆహ్వానిస్తాడు. అతనితో వెళ్ళడానికి ఆమె అంగీకరిస్తుంది. వాళ్లిద్దరూ బయలుదేరే సమయానికి ప్రకాశం రావడంతో ముగ్గురూ కలిసి బీచ్‌కి వెళ్ళి కాలక్షేపం చేశారు. ఇందిర తనతో చనువుగా ఉండడం ప్రకాశానికి ఇబ్బందిగా ఉంది. దానివలన అతని చదువుకు భంగం కలగడం అతనికి బాధ కలిగించినా, ఆమెతో మాట్లాడడం అతనికి ఏదో చెప్పలేని ఒక ఆనందాన్ని కలిగించేది. ఇందిర ప్రవర్తన, ఆమెకోపం, ఆమె చూపే ఆప్యాయత ప్రకాశానికి ఆమెపట్ల భయం కలిగించాయి.

ఒకనాటి సాయంత్రం బీచ్‌నుంచి తిరిగివచ్చిన ఇందిర, ప్రకాశం- జ్వరంతో అపస్మారకంగా పడి ఉన్న కళ్యాణిని చూచి కంగారుపడి పోయారు. చూస్తే నూట మూడు డిగ్రీల జ్వరం. ప్రకాశం ఆమెకు వైద్యం చేశాడు.

### 2

కళ్యాణి పుట్టిన ఊరు నందూరు. తునికి పన్నెండు మైళ్ళు దూరంలో ఉన్న ఆ పల్లెటూరిలో కళ్యాణి తండ్రి అచ్యుతరామయ్య బడి పంతులుగా, బ్రాంచి పోస్టుమాస్టరుగా ఉద్యోగం చేస్తూ ఉండేవారు. అచ్యుతరామయ్య మంచిమనిషి. గాంధీగారిని, స్వాతంత్ర్యోద్యమాన్ని ఇష్టపడేవారు. బీహారులో భూకంపం వచ్చిన రోజు అచ్యుతరామయ్య భార్య కళ్యాణిని ప్రసవించి కన్నుమూసింది. పక్క ఇంటి పుణ్యాత్మురాలు కళ్యాణిని ఒక ఏడాది పాటు పెంచింది. తర్వాత అచ్యుత రామయ్య ఒక బాల వితంతువును కళ్యాణికి సహాయంగా తీసుకు వచ్చాడు. తండ్రి ఆమెను పిన్నీ అని పిలిస్తే, కళ్యాణి కూడా ఆమెను పిన్నీ అని పిలవడం అలవాటు చేసుకుంది. కళ్యాణికి పదేళ్ళ వయస్సు వచ్చేసరికి రుక్మిణీ కళ్యాణం, గజేంద్ర మోక్షం చదువుకుంది. పదకొండేళ్ళ కళ్యాణికి పెండ్లి చేయమంటూ పిన్ని గొడవ చేసిందిగాని, అచ్యుతరామయ్యకు చిన్నవయస్సులో పెండ్లి చేయడం ఇష్టంలేక తునిలో బడిలో చేర్పించాడు. కళ్యాణి స్కూల్ ఫైనల్ పాసయింది. అప్పుడు వివాహం చేద్దామని అనుకున్నాడు గాని కట్నం ఇవ్వడం తనవల్ల కాదని ఆ ప్రయత్నం మానుకున్నాడు. ఆమెను విశాఖపట్నం పంపి ఇంటరులో చేర్పించాడు. తెలివి తేటలు గల కళ్యాణి ఇంటరు పాసయింది. ఎం.బి.బి.ఎస్. చదవాలి అనుకుంది. అప్పటికే అప్పుల్లో ఉన్న తండ్రి ఆర్థికంగా తట్టుకోలేడని ఆ ప్రయత్నం మానుకుంది. ఒక సంవత్సరం ఊర్లోనే ఉండి, తరువాత సంవత్సరం తన తండ్రి పొలం అమ్మి చదువుకు పంపిస్తే వాల్తేరులో ఆనర్సులో చేరింది.

జ్వరంతో ఉన్న కళ్యాణిని ప్రకాశం ఆసుపత్రిలో చేర్పించాడు. ఆ జ్వరం టైఫాయిడ్‌గా మారింది. ఇరవై రోజుల పాటు మంచం దిగకుండా చేసింది. అన్ని రోజులు ప్రకాశం ఆమెకు తనకు చేతనైన సహాయం చేశాడు. అతడు తనపట్ల చూపిస్తున్న ఆదరణ కళ్యాణికి అతని పట్ల సదభిప్రాయం కలిగేలా చేసింది. ఇందిర, ప్రకాశం తనకు మంచి మిత్రులని కళ్యాణి నమ్మింది. ప్రకాశం మాటల ప్రస్తావనలో తన తండ్రి తాను చిన్నవాడుగా ఉన్నప్పుడే మరణించాడని, తన మేనమామ తనను చదివిస్తున్నాడని, తన చదువు ఆర్థిక ఇబ్బందుల వలన సాగుతుందో, సాగదో తెలియని విధంగా ఉందనీ కళ్యాణితో చెబుతాడు. తనలాగే ఇబ్బందుల్లో ఉన్న ప్రకాశం కళ్యాణికి ఇంకా ఆత్మీయుడిగా కనిపించాడు. తనతో మర్యాదగా, లాలించే విధంగా మాట్లాడే ప్రకాశం మీద కళ్యాణికి ఒక విధమైన గౌరవం ఏర్పడింది.

ప్రకాశం కళ్యాణి పట్ల చూపిస్తున్న శ్రద్ధను జగన్నాథం అనే ప్రకాశం క్లాస్‌మేట్ ఎగతాళి చేశాడు. ఆ విషయంపై ప్రకాశం అతనితో గొడవ పడ్డాడు. ఆ విషయం తెలిసిన ఇందిర ప్రతి మనిషితో తగాదాలు పెట్టుకోవడం మంచిదికాదని, తాను తన ఆఫీసులో అలాగే ఉంటానని, ఎవరేమన్నా పట్టించుకోనని ప్రకాశానికి హితబోధ చేస్తుంది. ఆ పూట ఇద్దరూ కలసి భోజనం చేస్తారు. ప్రక్కన ప్రేమతో ఒక స్త్రీ కొసరి వడ్డిస్తుంటే కసురుకుంటూ, విసుక్కుంటూ అన్నంపెట్టే తన అత్తయ్య గుర్తుకు వస్తుంది. ఇందిరతో కలిసి భోజనం చేయడం అతని హృదయాన్ని ఆనందంలో ముంచివేసింది. జగన్నాథంతో పోట్లాడడం తప్పని ఇందిర ముందు ప్రకాశం అంగీకరించాడు. "కళ్యాణిలో ఏం చూసి జగన్నాథంతో పోట్లాట పెట్టుకున్నావ్" అంటూ ఇందిర వెళ్ళిపోయింది.

## 3

జ్వరం తగ్గి కళ్యాణి ఇంటికి వచ్చింది. ఆమె పూర్తిగా కోలుకోకపోయినా ధైర్యంగా ఉండేటట్లు చేయగలిగాడు ప్రకాశం. ఆ రోజు సాయంత్రం ఇందిర కృష్ణమూర్తితో బీచ్‌కి వెళ్ళింది. ప్రకాశం కళ్యాణిని బీచ్‌కి వెళదాం రమ్మని ఆహ్వానించాడు. తలనొప్పిగా ఉందంటూ కళ్యాణి తప్పించుకుంది. తనతో కళ్యాణి రానందుకు ప్రకాశం బాధపడ్డాడు. ఇందిర వచ్చి ఆ రోజు తన పుట్టినరోజని, కృష్ణమూర్తి కేకుకొని ఇచ్చాడంటూ ప్రకాశానికి కేకు ఇచ్చింది. ప్రకాశం తాను కూడా ఇందిరకు పుట్టిన రోజు బహుమతి ఇవ్వాలని అనుకున్నాడు. కృష్ణమూర్తి దగ్గర ఇరవైరూపాయలు అప్పు తీసుకున్నాడు. ఇందిరకు బహుమతిగా ఏమిస్తే బాగుంటుందో చెప్పమంటూ కళ్యాణిని అడిగాడు. టాయిలెట్ సెట్ కొని ఇవ్వమని, రామిరెడ్డి గారి పానశాల దొరికితే తీసుకోమని కళ్యాణి సలహా ఇస్తుంది. మరునాడు ప్రకాశం ఇందిరను బజారుకు తీసుకువెళ్ళి టాయిలెట్ బాక్స్ కొన్నాడు. ఇందిర సినిమాకు వెళదామని బలవంతం చేస్తుంది. ప్రకాశం ఆమెను సినిమాకు తీసుకుపోయాడు. అతని దగ్గర ఇరవై రూపాయలు అయిపోయాయి. అతడు పానశాల పుస్తకం కొనలేకపోయాడు. పుస్తకం కొననందుకు కళ్యాణి ఏమనుకుంటుందోనని ప్రకాశం బాధపడ్డాడు. ఆమె ఎదురుపడడానికి భయపడ్డాడు. ఆ రాత్రి కళ్యాణి ప్రకాశం గదిలోనుంచి 'రేజర్స్ ఎడ్జ్' అనే పుస్తకం తీసుకొని వెళ్ళింది. ఆ పుస్తకం ఆమెనే ఉంచుకోమని, అది తన కానుక అని ప్రకాశం కళ్యాణితో చెబుతాడు. ఆమె సంతోషిస్తుంది. తన కానుక ఆమెకు తృప్తికలిగించినందుకు ప్రకాశం ఆనందించాడు. ఆమె నవ్వు అతడిని సమ్మోహితుడిని చేసింది. ఇద్దరూ ఏకవచనంతో సంబోధించుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రకాశం ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకున్నాడు. ఆ క్షణాలు తన జీవితంలో మధురక్షణాలని, వాటిని తన మనస్సులో పదిలంగా దాచుకుంటానని కళ్యాణికి చెబుతాడు. ప్రకాశం చూపించిన అనురాగంతో కళ్యాణి పులకించింది. ఆ రాత్రి కళ్యాణి నిద్రకు దూరమయింది. కలలుకంటూ, పలవరిస్తూ గడిపింది.

## 4

సముద్రం ఒడ్డున నడుస్తున్న ప్రకాశానికి మేనమామ గుర్తుకు వచ్చాడు. డబ్బు పంపకుండా, అతడు పెట్టే ఇబ్బందులు గుర్తుకు వచ్చాయి.కృష్ణమూర్తి, ఇందిర, ఆనందరావులతో తన జీవితాన్ని పోల్చుకుంటూ, బాధపడుతూ ప్రకాశం ఇంటికి వచ్చాడు. ఆనందరావు, ఇందిర, ప్రకాశం భోజనానికి వచ్చారు. కాని కళ్యాణి రాలేదు. తలనొప్పిగా ఉందని రానని ఇందిరతో చెప్పింది. ప్రకాశం వెళ్ళి, తలనొప్పికి కారణం అడిగాడు. తన తండ్రి ఉత్తరం వ్రాసాడని, మనస్సు బాగా లేదని ఆమె అసలు విషయం చెప్పింది. ప్రకాశం ఆమెకు నచ్చజెప్పి భోజనానికి తీసుకువచ్చాడు. తను పిలిస్తే రాకుండా, ప్రకాశం పిలిస్తే కళ్యాణి వచ్చినందుకు ఇందిరకు కోపం వచ్చింది. భోజనం చేస్తున్నంత సేపూ ఇందిర దెప్పుతూనే ఉంది. ఆమెమాటలు కళ్యాణిని, ప్రకాశాన్ని బాధపెట్టాయి. తండ్రి తనకు ఆరోగ్యం బాగులేదంటూ వ్రాసిన ఉత్తరం కళ్యాణిని కలవరపెట్టాయి. తనపై సానుభూతి చూపిన ప్రకాశం మాటలు ఆమెకు అతనిమీద అభిమానం కలిగేలా చేస్తే

ఇందిర దెప్పిపొడుపులు ఆమెమీద కోపం వచ్చేలా చేశాయి. తన మీద ఇందిరకు ఈర్ష్య ఉందేమో అని కళ్యాణి అనుకుంది. రాత్రి సరిగా నిద్రలేక పోవడం వల్ల కళ్యాణి ప్రొద్దుటే లేవలేదు. ఆమె లేచేసరికి ఇందిర ఆఫీసుకి, ప్రకాశం ఆసుపత్రికి వెళ్ళారు. కళ్యాణితో మాట్లాడడానికి ప్రకాశం పదకొండు గంటలకే ఇంటికి వచ్చాడు. వ్యాలీ గార్డెన్స్‌కి వెళితే బాధలు మరచి పోవచ్చుని చెప్పి కళ్యాణిని రమ్మన్నాడు. మనస్సులో ఇందిర గురించి భయం ఉన్నా ఆమె అంగీకరించింది.

కళ్యాణి, ప్రకాశం వ్యాలీ గార్డెన్స్‌కి వెళ్ళారు. పడవ ప్రయాణం, అక్కడి విహారం కళ్యాణికి ఆనందం కలిగించాయి. తన తండ్రి ఉత్తరం గురించి, తమ ఇంటి మీద అప్పు గురించి, తండ్రి అనారోగ్యం గురించి కళ్యాణి ప్రకాశానికి చెప్పింది. కళ్యాణి తండ్రిని వైజాగ్ తెచ్చి వైద్యం చేయిస్తే బాగుంటుందని, తాను సహాయం చేస్తానని ప్రకాశం మాట ఇచ్చాడు. తన తండ్రి రాడని ప్రారంభించి, తన చిన్నప్పుడే తల్లి పోవడం, పిన్ని పోషణలో పెరగడం, తన తండ్రి వైరాగ్యం మొదలైన విషయాలను కళ్యాణి కన్నీళ్ళతో ప్రకాశానికి వివరించింది. ప్రకాశం కూడా తన మామ తనను చదివిస్తున్నాడని, తాను ఆమెకు సహాయంగా ఉంటానని అన్నాడు. అలా చెప్పవద్దని, తన అదృష్టంమీద తనకే నమ్మకం లేదని అంటుంది కళ్యాణి. ప్రకాశం తాను బాసటగా నిలబడతానని బాధపడవద్దని అనునయించాడు. ఇంతలో వాన ప్రారంభమయింది. చీకటి పడింది. ఇద్దరూ వర్షంలో తడుస్తూ ఇంటికి చేరుకున్నారు.

## 5

కళ్యాణి తండ్రి అచ్యుతరామయ్యకు సీరియస్‌గా ఉందని ఉత్తరం రావడంతో కళ్యాణి స్వగ్రామానికి బయలుదేరింది ఇందిర. ప్రకాశం ఆమెను రైలు ఎక్కించాడు. కళ్యాణి తిరిగి వైజాగ్ రాదేమోనని ప్రకాశం భయపడ్డాడు. రైలు బయలుదేరేవేళ కళ్యాణి చూపు, ఉత్తరం వ్రాయమంటూ జాలిగా పలికిన పలుకులు ప్రకాశానికి గుర్తుకొచ్చాయి. అవసరమయితే తను వస్తానని, డబ్బు పంపుతానని తాను అన్నమాటలు గుర్తుకొచ్చాయి. కళ్యాణి తండ్రి అనారోగ్యం గురించి విని కళ్యాణి కన్న ఎక్కువగా బాధపడ్డ ప్రకాశం వింతమనిషి అని అనుకొంది ఇందిర. ఇలా ఆలోచించుకుంటూ ఇందిర, ప్రకాశం ఇంటికి చేరుకున్నారు. ప్రకాశం తన గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. తానుకూడా కళ్యాణితో వెళ్తే బాగుండేదని భావించాడు. వెళ్ళలేని తన అశక్తతను తిట్టుకున్నాడు. డబ్బుంటే తాను అచ్యుతరామయ్యకు వైద్యం చేయించేవాడను కదా అనుకున్నాడు. ఇందిర పిలవడంతో ఆమె మాటను జవదాటలేక ఆమెతో పాటు సినిమాకు వెళ్ళాడు.

మరునాటి ఉదయం కృష్ణమూర్తి వచ్చాడు. అప్పటికి ఇందిర ఇంకా నిద్ర లేవలేదు. కృష్ణమూర్తి ఆవిడను నిద్ర లేపాడు. ఆమె ఐదు నిమిషాల్లో వస్తానని లోనికి వెళితే, కృష్ణమూర్తి తమకున్న ఆస్తులను గురించి గొప్పగా ఆనందరావుకు చెప్పుకున్నాడు. ఇందిర ఇచ్చిన టీ త్రాగుతూ ఉంటే షావుకారు దూత అద్దె కోసం వచ్చాడు. ఇందిర ఇంటి అద్దె కృష్ణమూర్తే చెల్లించాడు. ఆ డబ్బు తీసుకోవడం ఇష్టం లేనట్లు నటించింది. కృష్ణమూర్తి కోరికపై అతనితో పాటు సీతమ్మ ధారకు వస్తానని మాట ఇచ్చింది. ఆమెకు ఇబ్బంది కలుగకుండా పెట్టె బండిలో తీసుకు వెళతానని కృష్ణమూర్తి అనడంతో పదినిమిషాల్లో వాళ్ళందరూ బయలుదేరారు.

ప్రకాశం ఆసుపత్రి నుంచి వస్తుంటే అతని బాల్య స్నేహితుడు కిష్టయ్య కనిపించాడు. ప్రకాశం అతనితో పాటు వారింటికి వెళ్ళాడు. కిష్టయ్య భార్య ప్రకాశంతో ప్రకాశం తల్లి కీళ్ళనొప్పులతో బాధ పడుతున్నదని, ప్రకాశం మేనమామ డబ్బు పంపలేకపోతున్నట్లు చెప్పమన్నాడని మొదలైన అనేక విషయాలు చెప్పింది. వాళ్ళ బలవంతంపై అక్కడే భోజనం చేసి, మామయ్య పంపకపోతే తాను పడే బాధలు తలచుకుంటూ ఇంటికి వచ్చాడు.

## 6

ఆనందరావు హాయిగా నిద్రపోతాడు. గుమాస్తాగా పనిచేసేటప్పుడు నిద్రకోసం అప్పుడప్పుడు మానేసేవాడు. ఉద్యోగం ఊడినా భార్య మరణించినా, పోలీసులు అరెస్టు చేసినా నిబ్బరంగా ఉండేతత్వం అతనిది. అలాగే ఆపద వస్తే కంగారు పడకుండా, దానిని ప్రక్కవాడి మీద తోసేయడమన్నది అతనికి పుట్టుకతో అబ్బిన విద్య. ఆ రోజు ఇందిర కృష్ణమూర్తితో బయటకు వెళ్ళింది. ఆనందరావు నిద్రలేచి బయటకు వెళ్ళాడు. ఇందిర లేకపోవడంతో ప్రకాశానికి నిరాశగా ఉంది. కళ్యాణి గుర్తుకొచ్చింది. ఉత్తరం వ్రాద్దామని ప్రయత్నించాడు. వ్రాయలేకపోయాడు. ఇందిరతో ఎలాంటి సంబంధం పెట్టుకోకుండా చదువు కోవాలని అనుకున్నాడు. అంతలో తల్లి గుర్తుకు వచ్చింది. ఆమెను సుఖపెట్టాలి అనుకుంటూ పుస్తకం తెరిచాడు.

తొమ్మిది గంటలకు ఇందిర వచ్చింది. కృష్ణమూర్తితో తాను షికారుకు వెళ్ళడం ప్రకాశానికి కోపం తెప్పించిందని గ్రహించింది. బలవంతంగా ప్రకాశాన్ని భోజనానికి తీసుకువెళ్ళి కొసరి కొసరి వడ్డించింది. తర్వాత గొడవ చేసి సినిమాకు తీసుకువెళ్ళింది. ప్రకాశం

కళ్యాణి ప్రస్తావన తెస్తే కళ్యాణిలాగా తనకూ కష్టాలు ఉన్నాయని, అయినా ఆమెలాగా తాను ఏడవలేనని, తనకు ఏడవడం చేతకాదని ఇందిర ప్రకాశంతో చెప్పింది. ఇందిర, ప్రకాశం ఇంటికి వచ్చారు. ఆనందరావు తలుపుతీసి మళ్ళీ ఆవలిస్తూ మంచమెక్కాడు. ప్రకాశం తన గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. కలత నిద్రలో కలలు - కలల్లో కళ్యాణి - ఇలా సన్నివేశాలు జరిగిపోతున్నాయి.

ఇందిర ప్రకాశాన్ని నిద్రలేపింది. మంచం మీద దుప్పటి మార్చింది. కునికిపాట్లు పడుతున్న ప్రకాశం మల్లెల వాసనకు పూర్తిగా మేలుకొన్నాడు. ఇందిర అలంకరణ, అంగసౌష్ఠవం, అతనిని ఆకర్షించాయి. ఇందిర అతని చేతిని అందుకుంది. అతని శరీరమంతా విద్యుత్తు ప్రవహించింది. అతనిలో అనంతమైన కోర్కెలు బయట పడ్డాయి. లైటు ఆరిపోయింది. రాత్రి గడిచిపోయింది. పనిమనిషి కేకతో వేకువ జామున ఇందిర మేడదిగి వెళ్ళిపోయింది. ప్రకాశం అలాగే నిద్రపోయాడు. నిద్రలో కళ్యాణి తనను చేరుకోలేక పడిపోయినట్లు కనిపించింది. బాగా ప్రొద్దెక్కేవరకు అతడలా నిద్రపోతూనే ఉన్నాడు.

## 7

కళ్యాణి తండ్రి అచ్యుతరామయ్య చనిపోయాడు. కర్మకాండలు పూర్తి కాగానే కళ్యాణి విశాఖపట్టణం బయలుదేరింది. ఆమెను పంపడానికి మున్సబు రామినాయుడు, ఆయుర్వేద వైద్యుడు ఆచార్లు తుని స్టేషనుకు వచ్చారు. చదువు మానేసి ఊళ్లో ఉండిపొమ్మని మున్సబు అడిగినా, ఆనర్సు పూర్తి చేస్తే తనకు ఆసరాగా ఉంటుందని చెప్పి కళ్యాణి విశాఖపట్టణం బయలుదేరింది. ఇల్లు అమ్మి బాకీలు తీరుస్తానని మున్సబు చెప్పి, ఆమె చదువు కోసం అవసరమయిన సహాయం తప్పక చేస్తానని అన్నాడు. అంతేకాదు వందరూపాయలు తీసి ఆమె చేతిలో పెట్టాడు. అవసరమయితే ఉత్తరం వ్రాయమని చెప్పి ఆమెను రైలు ఎక్కించి వెళ్ళిపోయారు.

కళ్యాణి ఎక్కిన కంపార్టుమెంటులో వసుంధర కూడా ఉంది. ఆమె కళ్యాణితో పాటు చదువుకుంటున్న అమ్మాయి. కళ్యాణి తండ్రి మరణించాడని తెలుసుకొని బాధపడింది. కళ్యాణిని చదువు మానేసి ఇంటికి రమ్మన్నట్లు ఇందిర చేసిన ప్రచారం గురించి వసుంధర కళ్యాణికి చెప్పింది. ఆ విషయం విని ఇందిరతో పాటు ఉండకూడదని కళ్యాణి నిర్ణయించుకుంది. వసుంధరకు కళ్యాణి అంటే చాలా ఇష్టం. అందుచేత ఇల్లు మారదలిస్తే వచ్చి తన ఇంట్లో ఉండమని వసుంధర కళ్యాణికి సూచన చేసింది. తన ఇంట్లో పిన్ని తప్ప ఇతరులెవరూ లేరని, ఎంతకాలం తన ఇంట్లో ఉన్నా అభ్యంతరం లేదని తెలియజేసింది. వాల్తేరులో దిగిన తరువాత నాతో వస్తావా? అంది వసుంధర. రేపు ఉదయం వస్తా నంది కళ్యాణి. అడ్రసుకూడా అడిగి తీసుకుంది.

కళ్యాణి వచ్చేసరికి ఇందిర, ప్రకాశం ఇంట్లో లేరు. పనిమనిషి, ఆనందరావు కళ్యాణిని పలకరించారు. ఆమె తండ్రికి వచ్చిన పక్షవాతం గురించి వైద్యం గురించి చెప్పింది. సాయంత్రం ఆరింటికి ఇందిర, ప్రకాశం కలిసి వచ్చారు. ఎప్పుడు వచ్చావని అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పింది. ప్రకాశం మరేమీ మాట్లాడలేకపోయాడు. ఇందిర వచ్చి పలకరించింది గాని ఆ పలకరింపులో వ్యంగ్యం ఉంది. ఇందిర, ప్రకాశం ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించారు. ఆమెకు ఆ మాటలు కోపాన్ని, అసహ్యాన్ని కలిగించాయి. కళ్యాణి వెంటనే సామాను సర్దుకొని రిక్షా పిలిపించుకొని, ఇందిరతో, ప్రకాశంతో చెప్పి బయలుదేరింది. తర్వాత వెళ్లవచ్చుగదా ! అన్నాడు ప్రకాశం. ఆమె వినలేదు. ఆ ఇంట్లో చేరిన దగ్గరనుంచి కళ్యాణికి కష్టాలు, నష్టాలు కలగడం వల్ల ఆమె వెళ్ళిపోతున్నట్లు ఇందిర వ్యాఖ్యానించింది. కళ్యాణి బయలుదేరిన వెంటనే ముందే ఏర్పాటు చేసుకుని వచ్చినట్లుంది అంటూ ఇందిర నిష్ఠూరంగా మాట్లాడింది. ప్రకాశం మాట్లాడలేదు.

## 8

ఆ రోజు ఆదివారం. ప్రకాశం ఆసుపత్రికి వెళ్ళాడు. ఇందిర సరదాగా గడపాలని అనుకుంది. చేతిలో చిల్లిగవ్వ లేదు. చిరాకు వేసింది. ఎదురుగా ఉన్న కళ్యాణి నివసించిన గదిలో ఖాళీగా కనిపించింది. ఆ గదిలో కృష్ణమూర్తి ఉండేలా చేస్తే ఎంత లాభమో అనుకుంది. అనుకున్నట్టే అతడు వచ్చాడు. తనప్లానుకు ఉపోద్ఘాతంలా లాడ్జీల గురించి, అందులో ఉండే సౌకర్యాల గురించి ఉపన్యాసం ఇచ్చింది. తర్వాత ఆ గదిలో కృష్ణమూర్తిని చేరమంటూ సూచించింది. ఆనందరావు కూడా బలవంతం చేశాడు. నాల్గురోజుల్లో కళ్యాణి వస్తే నేనేమైపోవాలి అంటూ కృష్ణమూర్తి సందేహించాడు. కళ్యాణి ఖాళీ చేసి పోయిందని ఇందిర బదులిచ్చింది. ఎందుకు? అంటూ కృష్ణమూర్తి ప్రశ్నించాడు. ఎక్కడికి వెళ్ళిందని అడిగాడు. ఇందిర సరిగ్గా జవాబు చెప్పలేకపోయింది. కృష్ణమూర్తికి కోపం వచ్చింది. తండ్రి మరణించడం వల్ల మనసు విరిగి పోయిందని, ఎవరినో ఆశ్రయిస్తే ఆమెను చేరదీసి ఉంటారని ఆనందరావు వివరణ ఇచ్చాడు. తండ్రి మరణించిన స్థితిలో కళ్యాణిని బయటకు పంపినందుకు కృష్ణమూర్తి ఇందిరను కోప్పడ్డాడు. ఆ సమయంలో ఇందిర, ఆనందరావు చెప్పిన మాటలు కృష్ణమూర్తికి నమ్మబుద్ధి కాలేదు. అతడు కళ్యాణి గురించి ఆలోచించడం ప్రారంభించాడు. అతనికి

ఇందిరకు, కళ్యాణికి మధ్యగల తేడా తేటతెల్లం అయింది. అతని కోపాన్ని అర్థం చేసుకున్న ఇందిర టీ తెస్తానంటూ లేచి వెళ్ళిపోయింది. వేరే చోటికి భోజనానికి వెళ్ళాలి అంటూ కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

కృష్ణమూర్తికి దారిలో ప్రకాశం ఎదురయ్యాడు. కళ్యాణి గది ఖాళీ చేయడంలో ప్రకాశం పాత్ర తెలుసుకోదలచిన కృష్ణమూర్తి ప్రకాశాన్ని కళ్యాణి గురించి ప్రశ్నించాడు. అతడు సరైన సమాధానం చెప్పలేదు. కళ్యాణి ఎక్కడ ఉంది? అని ప్రశ్నిస్తే తనకు తెలియదని భయంగా కంగారుగా ప్రకాశం బదులిచ్చాడు. కళ్యాణి వెళ్ళిపోవడంలో ఇందిర, ఆనందరావులతో పాటు ప్రకాశం పాత్ర కూడా ఉందని కృష్ణమూర్తికి అర్థమయింది. ప్రకాశం ఇంటికి వెళ్ళాడు. ఇందిర భోజనం వడ్డిస్తే తిన్నాడు - తాను ఇందిర చేతిలో కీలుబొమ్మలా మారడం ప్రకాశానికి బాధ కలిగించింది. అతని బాధకు ఇందిర కారణం చెప్పమంటూ ప్రశ్నిస్తే, తన మామ తనకు డబ్బు పంపను అని కబురు చేశాడని, అప్పుచేసి చదువుకోమన్నాడని ప్రకాశం విచారంగా చెప్పాడు. ఉన్న భూమి అమ్మి చదువుకోవలసినది గాను, ఆస్తి లెక్కలు తేల్చుకోవలసినదిగాను ఇందిర సలహాఇస్తుంది. అలాచేస్తే తన మామయ్య తన అమ్మను బయటకు తరిమివేస్తాడని, అమ్మ ఏడుస్తుందని అంటాడు ప్రకాశం. అతని సమాధానం విని కోపించిన ఇందిర వెళ్ళిపోయింది. కళ్యాణి అయితే బాధతో ఉన్న తనను ఇందిరలా వదలి వెళ్ళిపోదని ప్రకాశం అనుకున్నాడు. తాను ఇందిరకు లొంగడం అతనికే తప్పు అనిపించింది. తనను కళ్యాణికి దూరం చేసింది ఇందిరేనని అనుకున్నాడు. తాను కనీసం కళ్యాణికి ఉత్తరం వ్రాసి ఉంటే బాగుండేదని అనుకున్నాడు. చివరికి తాను విధి చేతిలో కీలుబొమ్మనని, నిమిత్తమాత్రుడనని సమాధానం చెప్పుకున్నాడు.

ఇందిర నిద్ర పోతున్న ప్రకాశాన్ని లేపి బీచ్‌కి వెళ్దామని బలవంతం చేసింది. ప్రకాశం కాదనలేకపోయాడు. బీచ్‌లో ఇందిర కృష్ణమూర్తికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ప్రకాశం మీద చేతులు వేసింది. అతడు వివశుడయ్యాడు. రేపు మీ మామయ్యతో తేల్చుకో అంటూ రెచ్చగొట్టింది. ప్రకాశం తనకు భయమని అన్నాడు. నా దగ్గరకు తీసుకురా. నేను అడుగుతా అని భరోసా ఇచ్చింది. రేపు తానే వస్తానన్నాడు అని చెప్పాడు ప్రకాశం. దూరంగా నిజంగానే అతని మామయ్య కనిపించాడు. ప్రకాశం భయపడ్డాడు. తప్పనిసరి అవడంవల్ల ప్రకాశం, ఇందిరతో మామయ్య ముందుగా ఇంటికి వెళ్ళిపోయాడు.

## 9

వసుంధరకు కష్టాలు తెలియవు. ఆమె తండ్రి బాగా సంపాదించాడు. ఆమెకు నలుగురు అన్నయ్యలు. అల్లారుముద్దుగా పెరిగింది. అన్నయ్యలు ఉద్యోగాలు చేస్తున్నారు. చివరి అన్నయ్య చదువుతున్నాడు. అన్నయ్యలతో పాటు వదినలు కూడా వసుంధరను ప్రేమగా చూస్తారు. డబ్బు సమస్య అనేది ఆమెకు తెలియదు. కళ్యాణి అహర్నిశలు బాధపడడం కంటే ఏదయినా నిర్ణయించుకోవడం మంచిదని వసుంధర కళ్యాణికి సూచించింది. తండ్రి మరణం తనను సగం చంపితే, ప్రకాశం మిగిలిన సగం చంపాడని, తండ్రితో చనిపోవాలనుకుంటే మున్సబు రామినాయుడు తనను బ్రతికించాడని కళ్యాణి చెబుతుంది. ప్రకాశం వదలి వెళ్ళడమే మంచిదని వసుంధర అంటుంది. కలికాలంలో ధర్మబద్ధంగా బతికిన తనతండ్రి అప్పుల పాలైపోవడం, రావణుడు వంటి తన తాత డబ్బు సంపాదించడం విచిత్రమని కళ్యాణి అంటుంది. తన ఇల్లు అమ్మితే ఆ సొమ్ము బాకీలకు సరిపోతుందని, తనకేమీ మిగులదని కళ్యాణి వివరిస్తుంది. కృష్ణమూర్తి విలాస పురుషుడని, అలాంటి వారితో స్నేహం, పరిచయం మంచివి కావని కళ్యాణి వసుంధరకు హితవు చెప్పింది.

ముందురోజు ప్రకాశం మేనమామ శేషావతారం కృష్ణమూర్తిని కలిసి అనేక రకాలుగా దుర్భాషలాడాడు. అతని మాటలు ప్రకారం కృష్ణమూర్తి కళ్యాణిని తెచ్చి ప్రకాశానికి పరిచయం చేశాడు. ఆ అమ్మాయి కృష్ణమూర్తిని మరచిపోయి ప్రకాశం వలలో పడింది. ఆ సంగతి గ్రహించి ఆనందరావు కళ్యాణిని ఇంటినుంచి తరిమివేశాడు. ఆ కోపంతో కృష్ణమూర్తి ప్రకాశాన్ని గురించి శేషావతారానికి ఉత్తరాలు వ్రాశాడు. ఇవన్నీ విని ఆ రాత్రి కృష్ణమూర్తి నిద్రపోలేదు. శేషావతారం తనను నిందించడానికి ఆనందరావు కారణమని కృష్ణమూర్తి గ్రహించాడు. ఆనందరావంటే అతనికి అసహ్యం వేసింది. ప్రకాశంతో మాట్లాడదామని ప్రయత్నించాడు కాని అతడు దొరకలేదు. బస్సు స్టాపులో కళ్యాణి వసుంధర కనిపించారు. కళ్యాణి అతనిని వసుంధరకు పరిచయం చేసింది. మరునాడు వాళ్ళింటికి వస్తానని అడ్రసు తీసుకున్నాడు.

ఆరోజు సాయంత్రం ఇందిర, కృష్ణమూర్తి కలుసుకున్నారు. కళ్యాణి మీద పుకార్లు ఎందుకు పుట్టించావంటూ కృష్ణమూర్తి ఇందిరను ప్రశ్నించాడు. ఆమె అనేక విషయాలు తన ప్రమేయం లేకుండా జరిగాయని తన దురదృష్టానికి తన తండ్రే కారణమని, తనను తనతండ్రి ఒంటరిగా ఉన్నప్పుడు హింసపెడుతుంటాడని కన్నీళ్ళు కారుస్తూ చెప్పింది. ప్రకాశం, కళ్యాణి మధ్య కొంత కథ నడిచిందని

కథలు అల్లింది. ఆమె చెప్పిన మాటలు, ఆమె నటన, అతనికి వెగటు కలిగించాయి. ఇందిర చాతుర్యమైన మాటలు తలచుకుంటే కృష్ణమూర్తికి భయం వేసింది. ఇందిరను గురించి, కళ్యాణి గురించి సమీక్షించుకున్నాడు. వసుంధర ఇంటికి వెళ్ళి చూస్తే అరుగుమీద వసుంధర, కళ్యాణితో పాటు రామినాయుడు కూడా కూర్చొని ఉన్నాడు. అతడిని చూచిన కృష్ణమూర్తికి అడుగు ముందుకు పడలేదు. వసుంధర ఆహ్వానంతో వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

## 10

ప్రకాశం మేనమామది నిడదవోలుకు దగ్గరలో ఉన్న వేలవెన్ను గ్రామం. అతడు నల్లగా ఉంటాడు. అతనికి డబ్బే దైవం. డబ్బుకోసం ఏమయినా చేస్తాడు. చెల్లెలు ఆస్తికి యాజమాన్యం వహించి దాన్ని కరిగించాడు. అందులో కొంత ప్రకాశం చదువుకోసం, మిగతాది రాజమండ్రిలో తాను కట్టించే ఇంటికోసం ఖర్చు చేశాడు. ఇల్లు పూర్తయిందిగాని ఇదువేలు అప్పు మిగిలింది. ప్రకాశానికి పెండ్లి చేసి, వచ్చే కట్నంతో ఆ అప్పు తీర్చుకోవాలని శేషావతారం ఆలోచన, సంబంధాలు చూస్తున్నారు. ప్రకాశంతో తగాదాపడ్డ జగన్నాథం శేషావతారానికి ఉత్తరాలు వ్రాశాడు. శేషావతారం విశాఖపట్టణం వెళ్ళి జగన్నాథాన్ని కలిశాడు. ప్రకాశం ఆడపిల్లలతో తిరుగుతున్నట్లు శేషావతారం గ్రహించాడు.

శేషావతారం ప్రకాశాన్ని చూచి రౌద్రాకారం దాల్చాడు - చీవాట్లు పెట్టాడు. మామయ్య అంటే చిన్నప్పనుంచి భయపడే ప్రకాశం నోరు మెదపలేదు. శేషావతారం ప్రకాశం ఇంటికి వెళ్ళి పులిలా గాండ్రించాడు. పోలీసులకు పట్టిస్తానని, ఉద్యోగం ఊడగొట్టిస్తాననీ ఇందిరను, ఆనందరావును హడల గొట్టాడు. ఇందిర బెదిరిపోయింది. ఆనందరావు తాను ప్రకాశాన్ని బాగు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు శేషావతారంతో లౌక్యంగా చెప్పాడు. ఇందిర, కళ్యాణిల్లో ఎవరు ధనవంతులయితే వారిని ప్రకాశానికి ఇచ్చి చేయాలని శేషావతారం అనుకున్నాడు. కళ్యాణి పేదపిల్ల అని తెలుసుకొని ఆమె లాభం లేదనుకొన్నాడు. కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళి నానా హంగామా చేశాడు. అందరితో మాట్లాడిన తరువాత తన మేనల్లుడు తన చేయి దాటిపోలేదని గ్రహించాడు. తన ఇష్టప్రకారం అతనికి పెండ్లి చేయవచ్చని అనుకున్నాడు. ప్రకాశాన్ని తన వెంట రమ్మని హెచ్చరించి, మిగతా విషయాలు చూచుకొని స్వగ్రామానికి బయలుదేరాడు. ఇందిరను వదల లేక పోయాడు ప్రకాశం. మేనమామను ఎదిరించమని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనమని ఇందిర ప్రకాశానికి నూరిపోసింది. అలాగేనంటూ ప్రకాశం మేనమామతో సొంతగ్రామం వచ్చాడు. రైలులోనే శేషావతారం తిట్లదండకం ఎత్తుకున్నాడు. ప్రయోజకత్వం అంటే డబ్బు లేని ఆడపిల్లలతో కులకడం కాదని, డబ్బున్న అమ్మాయిని వివాహం చేసుకోమని హితవు చెప్పాడు. పెండ్లి విషయంలో కూడా నా ఇష్టాయిష్టాలకు విలువలేదా? అని ప్రశ్నించాడు ప్రకాశం. పెండ్లి విషయంలో తన ఇష్టం తప్ప ప్రకాశానికి స్వేచ్ఛలేదని శేషావతారం తేల్చి చెప్పాడు.

వేలవెన్ను లో మేనమామ ఇంట్లో ఉన్న ప్రకాశానికి ఈ విషయాలన్నీ వరసగా గుర్తుకు వచ్చాయి. రాజమండ్రి వెళ్ళి అమ్మాయిని చూచివద్దామని శేషావతారం అంటే ప్రకాశం రాను అన్నాడు. తన మాట వినకపోతే, తాను అతని చదువు కోసం చేసిన అప్పు తీర్చవలసిందేనని, పెండ్లి అయ్యేవరకు గడపదాటడానికి వీలులేదని శేషావతారం స్పష్టంగా చెప్పాడు. ప్రకాశానికి శేషావతారాన్ని చూస్తే భయం వేసింది. ఇందిర చెప్పిన మాటల్ని మరచిపోయాడు. మామయ్యను ఎదిరించలేక పెండ్లి చూపులకు రాజమండ్రి వెళ్ళాలని, అటునుంచి వాల్తేరు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. తన మేనల్లుడు చవట అని, అతనితో ఎలాంటి పని అయినా చేయించవచ్చని శేషావతారం గ్రహించాడు. అతనికి ప్రకాశాన్ని చూస్తే అసహ్యం, జాలితో పాటు తృప్తి కూడ పొందాడు.

## 11

కృష్ణమూర్తికి వసుంధర ఇంట్లో రామినాయుడిని చూచిన వెంటనే భయం కలిగింది. కృష్ణమూర్తి బి.ఏ., చదివే రోజుల్లో సింహాచలం వెళ్ళి, అక్కడ అమ్మాయిల విషయంలో కొంతమందితో గొడవపడ్డాడు. అంతలో రామినాయుడు వచ్చి కృష్ణమూర్తి చెంపలు పగులకొట్టాడు. ఆ సంఘటన గుర్తుకు వస్తే రామినాయుడు ఏమని అనుకుంటాడోనని కృష్ణమూర్తి అనుకున్నాడు. రామినాయుడికి ఆసంఘటన గుర్తుకు రాలేదు. ఆయన కళ్యాణి కష్టాలగురించి చెప్పి, బాగా చదువుకోమని కృష్ణమూర్తికి హితవు చెప్పాడు. సాయంత్రం వెళతానంటూ రామినాయుడు పైకి లేచి, కళ్యాణిని లోపలకు పిలిచి ఇంటిని అమ్మివేశానని, బాకీలు తీర్చానని, ఏమీ మిగలక పోగా తన బాకీ మిగిలి ఉందని, తన అప్పు తీర్చక పోయినా ఫరవాలేదని అంటూ వెయ్యి రూపాయలు కళ్యాణికి ఇవ్వబోయాడు. ఆమె తీసుకోలేదు. అతడా డబ్బును వసుంధరకు ఇచ్చి, తాను బయటకు వెళ్లి వస్తానని చెప్పి పనులమీద వెళ్ళిపోయాడు. కృష్ణమూర్తి మెడికల్ సర్టిఫికేట్ తెస్తానని, ప్రొఫెసర్‌తో మాట్లాడి కళ్యాణి చదువు ఆగిపోకుండా చూస్తానని, సాయంత్రం కలుస్తానని వెళ్ళిపోయాడు.

ఒంటి గంటకు వచ్చిన రామినాయుడు భోజనం చేసి పడుకున్నాడు. ఆయనకు ఆయాసం వచ్చింది. పైకి లేవబోయి కళ్ళుతిరిగి పడిపోయాడు. అంతలో కృష్ణమూర్తి వచ్చి డాక్టరును తీసుకొని వస్తానంటూ బయటకు వెళ్ళాడు. కళ్యాణి రామినాయుడుకి సేవలు చేస్తూ అతని మంచం దగ్గరే ఉండిపోయింది. కృష్ణమూర్తి డాక్టరు చక్రవర్తిని తీసుకొని వచ్చాడు. డాక్టరు, పరీక్షలు చేసి, ఇంజక్షను ఇచ్చి, హార్ట్ ఎటాక్ వచ్చిందని, ఆసుపత్రిలో చేర్చడం మంచిదని, లేకపోతే ప్రమాదమని హెచ్చరించాడు. నాయుడిని ఆసుపత్రిలో చేర్పించే ఏర్పాట్లన్నీ డాక్టరు, కృష్ణమూర్తి చూశారు. అలాంటి సమయంలో కంగారు పడవద్దని, తామంతా సాయంగా ఉంటామని వసుంధర మాటఇచ్చింది. డాక్టరు ఫోన్ చేయడంతో అంబులెన్స్ వచ్చింది. రామినాయుడుని ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు. వెనుక కారులో కృష్ణమూర్తి, డాక్టరుతో పాటు కళ్యాణి, వసుంధర ఆసుపత్రికి చేరుకున్నారు.

## 12

ఆసుపత్రిలో రామినాయుడికి తెలివివచ్చింది. ఏమి జరుగుతున్నదంటూ ప్రశ్నించాడు. ప్రమాదం లేదని నచ్చజెప్పారు. డాక్టరు చక్రవర్తి తన పలుకుబడిని ఉపయోగించి వైద్యం సక్రమంగా జరిగేటట్లు చూశారు. తన కోసం వచ్చిన రామినాయుడు ఆసుపత్రి పాలుకావడం కళ్యాణికి బాధకలిగించింది. వసుంధర, కృష్ణమూర్తి ఆ రాత్రంతా ఆసుపత్రిలోనే గడిపారు. నాయుడి పరిస్థితి క్రమక్రమంగా దిగజారుతోంది. ఊరికి కబురు చేయాలన్నా ఫోను సౌకర్యం లేదు. వేకువ జామున మూడు గంటల వేళ రామినాయుడు ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కళ్యాణికి అర్థం కాలేదు. అలాగే రామినాయుడి ఊపిరి అనంత వాయువుల్లో కలిసిపోయింది. తన కోసం రాతంత్రా ఆసుపత్రిలో గడిపిన కృష్ణమూర్తి, డాక్టరు, వసుంధర నిస్వార్థ సేవను కళ్యాణి మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

నాయుడి దేహాన్ని మార్చురీకి తరలించారు. కృష్ణమూర్తి, నాయుడి బంధువుల కోసం నందూరు వెళ్ళారు. అనుకున్నట్లు కృష్ణమూర్తి ఆ సాయంకాలం రాలేదు గాని మరునాటి ఉదయానికి నాయుడి కొడుకులతో ఆసుపత్రికి వచ్చాడు. నందూరులో నాయుడి కొడుకులు నానాయాగీ చేశారని, నాయుడిని చంపి ఉంటారని వారు అనుమానిస్తున్నారని కృష్ణమూర్తి చెప్పాడు. డాక్టరు గట్టిగా మాట్లాడేసరికి వారు మౌనంగా శవం తీసుకొని తమ గ్రామానికి మరలిపోయారు. తాము డబ్బుకోసం నాయుడిని చంపి ఉంటామని అనుమానించిన నాయుడి కొడుకుల అల్పబుద్ధికి కళ్యాణి బాధపడింది. తన శక్తి మేరకు నాయుడిని బ్రతికించడానికి కళ్యాణి చేసిన ప్రయత్నాన్ని ఆయన కొడుకులు గుర్తించనందుకు ఆమె బాధపడింది. రామినాయుడి మంచితనం, ఆయన కొడుకులకు రాలేదని డాక్టరు కళ్యాణిని ఓదార్చాడు. నాయుడి మరణంతో, ఆయన కొడుకుల ప్రవర్తనతో కళ్యాణిలో వైరాగ్య భావం పుట్టుకొచ్చింది. ఆ భావాన్ని ఆదిలోనే త్రుంచి వేయాలని డాక్టరు అనుకున్నారు. ఆమెను బలవంతంగా సినిమాకు తీసుకుని వెళ్ళాడు.

## 13

పదిహేను రోజులయినా ప్రకాశం రాకపోయేసరికి ప్రకాశం తన మామను ఎదిరించలేకపోయాడని ఇందిర అర్థం చేసుకుంది. ఆమెకు ఆరోజు చిరాగ్గా ఉంది. తన బ్యాగులో ఉన్న ఐదురూపాయలతో తన తండ్రి మందుకోసం ఖర్చుచేసింది. ఆనందరావు అప్పుగా తెచ్చిన టీ తాగి ఆఫీసుకి వెళ్ళింది. వైదేహి అనే ఆమె సెలవు పెట్టడంతో ఆమె పనికూడా ఇందిరే చేయాల్సివచ్చింది. పని ఎగగొట్టడానికి ప్రయత్నించిందిగాని వీలుకాలేదు. ఆఫీసులో పనిచేసే వైదేహి ఇందిరకంటె పెద్దది. ఆరుగురు అన్నదమ్ముల మధ్య ఒక్కతే ఆడపిల్ల. అందరూ ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా వైదేహికి సంబంధాలు చూస్తున్నా ఒక్కటీ ముడిపడడంలేదు. ఆరోజు కూడా పెండ్లి చూపులు ఉండడంవల్ల వైదేహి సెలవుపెట్టి ఉంటుందని ఇందిర భావించింది. ప్రకాశం వ్రాసిన ఉత్తరం వస్తే దాన్ని బ్యాగులో ఉంచుకుంది. అంతలో వైదేహి అన్నయ్య నమస్కారమంటూ వచ్చాడు. వైదేహి ఇంట్లో ఉత్తరం వ్రాసిపెట్టి వెళ్ళిపోయిందని అతడు ఇందిరతో చెప్పాడు. వారి అతి జాగ్రత్త వల్లే వైదేహి అలా చేసి ఉంటుందని, అలాచేయడం తప్పుకాదని ఇందిర వ్యాఖ్యానించింది. వైదేహికి సంబంధం కుదిరిందని, వరుడు పశువుల డాక్టరని, పెండ్లికి అంగీకరించిన వైదేహి ఉత్తరం వ్రాసిపెట్టి ఉడాయించిందని చెప్పి, వైదేహి ఎక్కడుందో చెప్పమంటూ అతను ఇందిరను బ్రతిమిలాడాడు. తనకు తెలియదని ఇందిర బదులిచ్చింది. అతను నమ్మలేదు. అతనిని ఇంటికి తీసుకొని వెళ్ళి తన తండ్రికి పరిచయం చేసింది. ఆనందరావు కూడా వైదేహి తమ ఇంటికి రాలేదని, అనుమానంగా ఉంటే వెతుక్కోమని చెప్పాడు. ఇంటినుంచి పారిపోయిన వాళ్ళు ఊర్లో ఉండరని, మద్రాసు వెళ్ళి ఉంటుందని అతడిని భయపెట్టాడు.

వైదేహి అన్నయ్య వెళ్ళిన తరువాత వైదేహి ఇంట్లోనే ఉందని ఇందిరతో చెప్పాడు ఆనందరావు. ఆమె తన గురించి చెప్పవద్దని ముందుగా హెచ్చరించడం వల్ల అలా చెప్పానని కూడా చెప్పాడు. ఇందిర ప్రకాశం వ్రాసిన ఉత్తరాన్ని తండ్రికి ఇచ్చి వైదేహి దగ్గరకు వెళ్ళింది. నిలబడి పోరాడని తప్ప పారిపోయి రావడం తప్పని వైదేహికి తెలియజెప్పింది. తన అన్నయ్యలు తన ఇష్టానికి ఎలా వ్యతిరేకంగా

పెండ్లి సంబంధం కుదిర్చారో వైదేహి ఇందిరకు తెలియ చెప్పింది. ఇందిర లాగా స్వేచ్ఛగా బ్రతకటం తనకు ఇష్టమని చెప్పింది. ప్రొద్దుట వచ్చి మీ అన్నయ్యలకు బుద్ధి చెబుతానని ఇందిర వైదేహికి మాట ఇచ్చింది.

ఇందిర, వైదేహి, ఆనందరావు భోజనం చేద్దామని అనుకుంటున్న సమయంలో ప్రకాశం వచ్చాడు. పెండ్లికి పిలవడానికి వచ్చావా? అని ఇందిర ఎగతాళిగా అంది. తాను తప్పించుకొని వచ్చానని ప్రకాశం చెప్పాడు. తాను రాజమండ్రిలో అమ్మాయిని చూశానని, మామయ్య మరో ఊరు వెళితే తాను తప్పించుకొని వచ్చానని ప్రకాశం చెబితే ఇందిర దొంగతనంగా రావడం గొప్పకాదని, తనకు అతనితో ఎలాంటి సంబంధం ఉండబోదని తేల్చి చెప్పింది. నీ కోసమే వచ్చానంటూ ప్రకాశం ప్రాధేయపడ్డాడు. "మామయ్యను ఎదిరించలేని పిరికివాడివి, నువ్వు నాకు వద్దు. వెళ్ళి నీ మామ చెప్పిన అమ్మాయిని చేసుకో" అని ఇందిర ప్రకాశాన్ని విడిచి వెళ్ళిపోయింది.

ఆనందరావు ప్రకాశం రాకను గమనించలేదు. ఇందిర వచ్చి ప్రకాశం వచ్చాడని చెప్పింది. ప్రకాశాన్ని భోజనానికి రమ్మని పిలిచింది. తనకు ఆకలిలేదని, ఇందిరపై ఆశతో వచ్చానని, ఆమె కోపం తగ్గించుకుంటేనే భోజనానికి వస్తానని ప్రకాశం ప్రాధేయపడ్డాడు. ముందు భోజనానికి రా అని ఇందిర అతనిని పిలుచుకుని వచ్చింది. వైదేహి ఎవరని ప్రకాశం ప్రశ్నిస్తే నీలాగే పారిపోయి వచ్చిన అమ్మాయి అని ఇందిర బదులిచ్చింది.. భోజనాలు అయిన తర్వాత ఇందిర, వైదేహి మేడ మీదకువెళ్తే, ప్రకాశం క్రింది గదిలో పడుకున్నాడు. తనను సంతలో పశువులాగా బేరానికి పెట్టడం ఇష్టంలేక వచ్చానని, తానొక వ్యక్తిని ప్రేమించానని, అతనికి వివాహం అయ్యిందని వైదేహి ఇందిరతో చెప్పింది. రేపు ఉదయం నిన్ను మీ ఇంటి వద్ద దించివస్తానని చెప్పి, మాటలమధ్య క్రింద ఉన్న ప్రకాశం తన మాజీ ప్రియుడని, అతడు వేరే అమ్మాయిని చేసుకోబోతున్నాడని, దుఃఖంలో ఉన్నాడు గనుక ఓదార్చి వస్తానని వైదేహితో చెప్పి ఇందిర క్రిందికి వెళ్లింది.

ప్రకాశం కళ్ళు మూసుకుని ఉంటే పెళ్ళికూతురు గురించి కలలు కంటున్నావా? అంటూ ఎగతాళి చేసింది. ప్రకాశం ఆమెను దగ్గరగా తీసుకోబోయినా ఆమె అంగీకరించలేదు. పరస్పరం దగా చేసుకోవడం వద్దని ప్రొద్దున్నే వెళ్ళిపొమ్మని ఇందిర చెప్పింది. తాను చేసిన తప్పేమిటో చెప్పమన్నాడు ప్రకాశం. "నీవేమి అపచారం చెయ్యలేదు. నీ కోసం నీవు ఏమీ చేసుకోలేని వాడవు. నీమీద ఆశలు పెంచుకున్నాను. నీకు వెన్నెముక లేదు. నా సాహచర్యంతో అది గట్టిపడుతుందనుకున్నాను. నీవు సగం మనిషివి. నీకు వ్యక్తిత్వం లేదు. నిన్ను బాగుచేయడం నావల్ల కాదు. నీకు ధైర్యం లేదు. నీవు అసమర్థుడివి. నిన్ను జీవితాంతం కాపాడుకోలేను. నాకు ధైర్యం చెప్పే మగాడు కావాలి. నీలాంటి వాడు కాదు. నువ్వు నీ మామయ్యను ఎదిరించి మీ అమ్మను తీసుకొని వస్తే నేను నీ భార్యను అయ్యేదాన్ని. అలా జరగలేదు. నీకు నాకూ సంబంధం లేదు- గుడ్ బై. రేపు ఉదయం వెళ్ళిపో. రాజమండ్రి అమ్మాయిని చేసుకో" అని చెప్పి ఇందిర వైదేహి దగ్గరకు వెళ్ళిపోయింది.

ప్రకాశం నిశ్చేష్టుడయ్యాడు. అతని ఆశలు ఆవిరయిపోయాయి. తానువస్తే ఇందిర సంతోషిస్తుందని అనుకున్నాడు. అలా జరగక ఆమె తనను తిరస్కరించడం అతనిని బాధించింది. ఆ బాధలో అతనికి ఇందిర మోసకారి అనిపించింది. ఆమె మంచిది కాదు అనుకున్నాడు. ఆమె తనను కాదనడం తనకే మేలు అనుకున్నాడు. అమ్మ, మేనమామ, రాజమండ్రి పిల్లతప్ప మిగిలిన లోకమంతా అతనికి దుర్మార్గులుగా కనిపించారు. సంప్రదాయ బద్ధంగా చేసుకునే పెండ్లి వలనే సుఖసంతోషాలుంటాయని అనుకున్నాడు. ఇందిర కాదనడం తనమంచికే అనుకున్నాడు. ప్రొద్దున్నే లేచి వెళ్ళిపోదామనుకున్నాక ప్రకాశానికి నిద్ర పట్టింది.

## 15

చక్రవర్తి వద్దకు వసుంధర వచ్చింది. కళ్యాణి అంగీకరించలేదని, కృష్ణమూర్తి వస్తే చెప్పమని డాక్టరుతో చెప్పింది. ఎందుకు ? అని డాక్టరు ప్రశ్నించాడు. మనం చెప్పవలసింది చెప్పాం. మిగిలింది ఆమె ఇష్టం అని అంది వసుంధర. డాక్టరు వసుంధరను దించి తన పని మీద వెళ్ళిపోయాడు. కృష్ణమూర్తి కళ్యాణికి సహాయపడాలని అనుకోవడం, ఆ సాయాన్ని నిరాకరించడం మొదలైన వాటిని గుర్తు చేసుకుంటూ డాక్టరు రౌండ్లు ముగించి ఇంటికి వచ్చాడు.

చక్రవర్తి, కృష్ణమూర్తి క్లాస్‌మేట్స్ కాదు. ఒకే కాలేజీలో చదవలేదు. ఒక ఊరివారు అంతకన్నా కాదు. కాని వారిద్దరికి ఒకరంటే ఒకరికి ఎంతో ఇష్టం. రామినాయుడు జబ్బుపడినప్పుడు చక్రవర్తి మొదటిసారి కళ్యాణిని చూశాడు. ఏదో ఒక విధమైన అభిమానం ఏర్పడింది. రామినాయుడికి సేవ చేసే కళ్యాణిలో ఒక విధమైన లాలిత్యం, నిబ్బరం, అనిర్వచనీయమైన ప్రవర్తన అతనికి కనిపించాయి. ఆమెకు ఎలా బతకాలో తెలియదని అతడు గ్రహించాడు. వరుసగా వచ్చిన కష్టాలు ఆమెకు జీవితం మీద నమ్మకాన్ని పోగొట్టాయని, అయాచితంగా వచ్చే సహాయాన్ని ఆమె అంగీకరించదని గ్రహించాడు.

చక్రవర్తి మంచి డాక్టరు. చిన్నప్పుడే పెంపకానికి వెళ్ళాడు. అతడిని పెంచుకున్న వితంతువుది జలగప్రేమ. అది భరించలేక చదువు కోసం చక్రవర్తి మద్రాసు పారిపోయాడు. పెంపుడు తల్లి అప్పుడు గాని అతని చదువును అంగీకరించలేదు. చదువుకు పెళ్ళితో ముడివేసి వెంటనే పెళ్ళి చేసింది. పెంపుడు తల్లికి చక్రవర్తి భార్య ఆయుధమయింది. చక్రవర్తి అంటే అతని భార్యకు ఈర్ష్య, అనుమానం. అతని జీవితాన్ని ఆమె నరకంగా మార్చింది. ఆరోగ్యం చెడగొట్టుకొని, మంచమెక్కి కన్నుమూసింది. పెంపుడు తల్లి స్వగ్రామం వెళ్ళిపోయింది. చక్రవర్తి ఒంటరివాడయ్యాడు. అతనికి వైవాహిక జీవితం వెగటు కలిగించింది. వైజాగ్ లో ప్రాక్టీసు పెట్టుకొని రోగులకు సేవచేస్తూ బ్రతికే చక్రవర్తికి సమస్యలు పట్టించుకోకుండా అవినీతికి అతీతంగా బ్రతికే కృష్ణమూర్తి అంటే చాలా ఇష్టం. కృష్ణమూర్తిని కళ్యాణి ఆకర్షించింది. అతడు ఆమెకోసం ఏమయినా చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. కానీ అతని సహాయాన్ని కళ్యాణి నిరాకరిస్తున్నది.

కళ్యాణి తమ ఇంట్లో ఉండడం వసుంధర పిన్నికి ఇష్టంలేదని, ఆమె అసంతృప్తిగా ఉందని గమనించింది. తన అన్నయ్యకూడా సన్నితంగా మందలిస్తూ కళ్యాణిని దూరంగా పంపమంటూ ఉత్తరం వ్రాయడంలో వెనుక ఉన్న శక్తి పిన్నియేనని వసుంధర గుర్తించింది. తాను కళ్యాణికోసం తన వాళ్ళనందరినీ దూరం చేసుకోలేనని ఆమెకు తెలుసు. అందుకే కృష్ణమూర్తి సహాయాన్ని అందుకోమని వసుంధర కళ్యాణికి సూచన చేసింది. కాని కళ్యాణి నిరాకరించింది.

కృష్ణమూర్తి చక్రవర్తి వద్దకు వచ్చినపుడు చక్రవర్తి అతనికి కళ్యాణి నిర్ణయాన్ని తెలియజేశాడు. అలాగయితే కళ్యాణిని ఏం చేద్దామంటూ కృష్ణమూర్తి చక్రవర్తిని నిలదీశాడు. తానేమీ చేయలేనని చక్రవర్తి చేతులెత్తేశాడు. తనకు కళ్యాణిని చూస్తే అభిమానమనీ, స్నేహితుడిగా కళ్యాణిని ఓదార్చడం తప్ప, తన మనస్సులో మరే ఉద్దేశం లేదని చక్రవర్తి చెబితే, కళ్యాణికి బ్రతుకు తెరువు కల్పించాలనే ఆలోచన తప్ప తన మనస్సులో వేరే ఉద్దేశాలు లేవని కృష్ణమూర్తి అన్నాడు. కృష్ణమూర్తి వెళ్ళిన తర్వాత కళ్యాణి మీద తనకున్న అభిప్రాయాన్ని చక్రవర్తి సమీక్షించుకున్నాడు. అతనికి కళ్యాణి మీద సానుభూతితో పాటు ప్రేమ ఉందని అతనికి అర్థమయింది. తన ఆలోచన తప్పని, కళ్యాణి విషయం వదలివెయ్యాలి అని చక్రవర్తి నిర్ణయించుకున్నాడు.

## 16

కళ్యాణి గొడవల వల్ల చదువును నిర్లక్ష్యం చేసిన వసుంధర పరీక్షలు దగ్గర పడడంతో తనధ్యాసను చదువు మీదికి మళ్ళించింది. మరునాడు సంక్రాంతి. పిన్ని వసుంధరను నిద్రలేపి పండుగపూట కళ్యాణిని భోజనానికి పిలవమంటూ గొడవచేసింది. అలాగే పిలుస్తానంది వసుంధర. కళ్యాణి తన ఇల్లు విడిచివెళ్ళడానికి కారణమయిన పిన్ని అదేమీ తనకు తెలియనట్లు కళ్యాణిని భోజనానికి పిలవమని చెప్పడం వసుంధరకు ఆశ్చర్యం కలిగించింది. మనుషులు ఇలా ఉంటారు కాబోలు అనుకున్నది వసుంధర.

వారం రోజుల క్రితమే కళ్యాణి తన బంధువుల ఇంట్లో గది అద్దెకు తీసుకుని వసుంధర ఇంటినుంచి వెళ్ళిపోయింది. కళ్యాణి వచ్చిన కొత్తలో వసుంధర పిన్ని అభ్యంతరం చూపలేదుగాని, రామినాయుడు మరణం, ఆ తర్వాత కృష్ణమూర్తి, చక్రవర్తి రాకపోకలు ఆమెకు కష్టం కలిగించాయి. తన అయిష్టాన్ని అన్యాపదేశంగా ఆమె సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకున్న కళ్యాణి ఇంటినుంచి వెళతాను అంటే వసుంధర కాదనలేకపోయింది. స్నానం చేసి బయలుదేరుతుంటే కృష్ణమూర్తి వచ్చాడు. వసుంధర, కృష్ణమూర్తి కాసేపు మాట్లాడుకున్నారు. కృష్ణమూర్తి ప్రవర్తన, మాలిన్యంలేని అతని మనస్సు వసుంధరను లోబరచుకున్నాయి. కృష్ణమూర్తి కాసేపు మాట్లాడి బయలుదేరితే అతనితో పాటు వసుంధరకూడా కళ్యాణి ఇంటికి బయలుదేరింది. ఇద్దరూ కళ్యాణి ఇంటికి వెళ్ళారు. వసుంధర పండుగనాడు తమ ఇంటికి భోజనానికి రమ్మని ఆహ్వానించింది. పండుగనాడు ఇంటివాళ్ళు ఆహ్వానించి ఉండడంవల్ల ఆ రోజు రాలేనని, మరొక రోజు ఆహ్వానం లేకపోయినా వస్తానని కళ్యాణి చెప్పింది. వసుంధరకు బాధకలిగినా కళ్యాణి మాటకు సరేనంది. వసుంధరను ఇంటివద్ద దించి కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

సంక్రాంతి పండుగ సాదాగా గడిచిపోయింది. జనవరి పదిహేడవ తేది కళ్యాణి పుట్టినరోజు. ఆ రోజుతో ఇరవై సంవత్సరాలు నిండిన కళ్యాణి ఆ రోజు నుంచి స్వయంకృషితో నిలబడాలి అనుకుంది. ఇతరుల సాయాన్ని తీసుకోకూడదు అని అనుకున్నది. ట్యూషన్లు చెప్పాలని, చిన్న ఉద్యోగం ఏదయినా సంపాదించుకోవాలని అంతకు ముందే అనుకున్న కళ్యాణి ట్యూషన్లు ఏర్పాటు చేసుకున్నది. అందుకే వేరే ఇంటిని అద్దెకు తీసుకుని వసుంధర ఇంటినుంచి బయటకు వచ్చింది. కళ్యాణి పుట్టినరోజని తెలిసి ఇంటావిడ చీర, జాకెట్టు పెట్టింది. ఆరోజు వసుంధరను కలవడానికి బయలుదేరిన కళ్యాణికి దారిలో చక్రవర్తి కనిపించాడు. ఆమె పుట్టిన రోజని

తెలుసుకొన్న చక్రవర్తి ఆమెకు బహుమతులు కొన్నాడు. కళ్యాణి వాటిని నిరాకరించింది. కళ్యాణి, చక్రవర్తితో పాటు అతని ఇంటికి వెళ్ళింది. చక్రవర్తి తన గురించిన విశేషాలు చెప్పుకున్నాడు.

## 17

వసుంధర పెద్దన్నయ్య వచ్చినపుడు పిన్ని అతనితో ఏదో చెప్పడం, ఆయన సున్నితంగా గౌరవ వంశానికి చెందిన యువతి ఎలా ఉండాలో తెలపడం, విలువలేని స్నేహాల వలన వచ్చే అనర్థాలను గురించి చెప్పడం - వసుంధర మనస్సులోకి వచ్చాయి. తాను తన అన్నయ్యకు ఇష్టంలేని పనులు దాదాపు చేయలేదు అనుకున్నది. అన్నయ్య మాటల వలననే కళ్యాణి ఇల్లు తీసుకున్నా వసుంధర మాట్లాడలేదు. తాను కృష్ణమూర్తితో చనువుగా ఉంటున్నట్లు పిన్ని చెప్పడంవల్ల అన్నయ్య అలా అని ఉంటాడని వసుంధర భావించింది. ఇంతమంది కాదంటున్నారు కాబట్టి తనకు కృష్ణమూర్తి మీద అభిమానం పెరుగుతున్నదా అని వసుంధర అనుమానించింది. పిన్ని, అన్నయ్య తనను తమ మాటలతో రెచ్చగొడుతున్నట్లు వసుంధర నిర్ణయించుకుంది. వసుంధర తనకు దగ్గరవుతున్నదనే భావన కృష్ణమూర్తికిలేదు. సినిమాకు వెళదామని వసుంధర అడిగితే కాసేపు బీచ్‌లో కూర్చుందామని కృష్ణమూర్తి ఆమెను బీచ్‌కి తీసుకెళ్ళాడు. తనచుట్టూ సంప్రదాయాల దడి బిగించడం ఆమె సహించలేకపోయింది. ఆమె ప్రవర్తన కృష్ణమూర్తికి వింతగా అనిపించింది. తనకు కళ్యాణి అన్నా, వసుంధర అన్నా గౌరవం, భయం ఉన్నాయని ఇందిరను గురించి అడుగవద్దని కృష్ణమూర్తి వసుంధరతో అన్నాడు. అతని మంచితనాన్ని వసుంధర మెచ్చుకుంది. అప్రయత్నంగా అతని చేతిని తనచేతిలోకి తీసుకుంది. కృష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు. ఆలస్యం చేయకుండా ఇంటికి వెళదాం అన్నాడు. అవసరం వస్తే తప్పకుండా సహాయం చేస్తానని ఆమెకు మాట ఇచ్చాడు. ఇద్దరూ డాక్టరు ఇంటికి వెళదామనుకున్నారు.

ఇద్దరూ డాక్టరు ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. లోపలికి వెళ్ళిన వారికి కళ్యాణి కనిపించింది. ఇద్దరూ ఆశ్చర్యపోయారు. తాను వసుంధర ఇంటికి బయలుదేరినట్లు కళ్యాణి చెప్పింది. ఆరోజు కళ్యాణి పుట్టిన రోజని డాక్టరు వసుంధరకు కృష్ణమూర్తికి చెప్పాడు. చక్రవర్తి కళ్యాణిని, వసుంధరను తన కారులో వసుంధర ఇంటివద్ద దింపాడు. వసుంధర పిన్ని విసుక్కుంటూ తలుపు తీసింది. పిన్నిని వంట చేయమని చెప్పి వసుంధర స్నానానికి వెళ్లింది. పిన్ని వచ్చి కళ్యాణిని పలుకరించింది. పండుగ రోజు పిలిచినా రాని దానివి ఈ రోజు ఎందుకు వచ్చావని ప్రశ్నించింది. నీ లాంటి దానికి ఎక్కడయినా బాగుంటుందంటూ దెప్పి పొడిచింది. తన పుట్టినరోజు అలాంటి మాటలు సహించలేక కళ్యాణి వెళ్ళి పోతానంటూ కేకేసి వసుంధరతో చెప్పి బయటకు నడిచింది. వసుంధర స్నానం చేసివచ్చేలోపు కళ్యాణి వెళ్ళిపోవడం వెనుక పిన్ని హస్తం ఉందని ఆమె అనుకున్నది. పిన్నిని గట్టిగా మందలించింది. కళ్యాణి ఆ రాత్రి ఏమవుతుందో అని భయపడుతూ కూలబడిపోయింది. కళ్యాణి నేరుగా చక్రవర్తి ఇంటికి వెళ్ళింది. ఆమెను చూచి చక్రవర్తి ఆశ్చర్యపోయాడు. ఏమి జరిగిందని ప్రశ్నించాడు. కళ్యాణి చక్రవర్తి ఒడిలో వాలిపోయి వెక్కివెక్కి ఏడ్చింది. చక్రవర్తి ఆమెను ఓదార్చాడు.

## 18

డాక్టరు ఇంటినుంచి బయలుదేరిన కృష్ణమూర్తికి వసుంధర ప్రవర్తన గుర్తుకొచ్చింది. ఇంతలో ఎదురుగా ఇందిర వచ్చింది. ఇంటిదాకా దిగబెట్టి వెళ్ళమని అడిగింది. ఆమె బలవంతం చేయడంతో కాదనలేక ఇంటిదాకా వెళ్ళాడు. ఆనందరావు ఎక్కడికి వెళ్ళాడని ప్రశ్నిస్తే పెళ్ళి కొడుకుని వెదకడానికి ఊరెళ్ళాడంటూ ఇందిర కృష్ణమూర్తిని లోపలకు తీసుకు వెళ్ళింది. ఇద్దరూ ప్రేమ, త్యాగం, ఆకలి గురించి మాట్లాడుకుంటూ భోజనం ముగించారు. ఇందిర కోరికపై కృష్ణమూర్తి ఆ రాత్రి అక్కడే ఉండడానికి అంగీకరించాడు. వసుంధర, కృష్ణమూర్తి కలిసి తిరగడం తనకు తెలుసునని, ప్రకాశం రాజమండ్రిలో వివాహం చేసుకోబోతున్నాడని, ప్రకాశం వచ్చి ప్రాధేయపడినా తను అతనిని నిరాకరించానని ఇందిర చెప్పింది. ఇందిర, ఆనందరావు మనుషులను వాడుకునే రకమని కృష్ణమూర్తి అన్నాడు. తనకు జీవించడం తప్ప మిగిలిన సంగతులు పట్టవని, మూర్ఖంగా బ్రతకడం తనకు అసహ్యమని ఇందిర తన గురించి చెప్పి తన తండ్రి గురించి, తనగతం గురించి వివరించింది.

ఆనందరావు మెట్రిక్ పాసయి, తండ్రి చనిపోయిన తర్వాత తాలుకాఫీసులో గుమాస్తా అయ్యాడు. పెండ్లి అయిన తర్వాత వరుసగా కాన్పులు, పుట్టిన పిల్లలు గిట్టడం మొదలైన వాటితో అతనికి జీతం చాలేదికాదు. క్రమంగా పెద్దవాళ్ళతో పరిచయాలయ్యాయి. కలెక్టరు ఆఫీసుకి మారాడు - దొరల్లాగా ఉందామనుకున్నాడు - ఒక సానిని చేరదీశాడు- డబ్బు కోసం తప్పుదారిలో పడ్డాడు.

ఉద్యోగం ఊడింది. రైల్వేలో ఉద్యోగం సంపాదించాడు. అప్పుడే కూతురిని కని భార్య చనిపోయింది. ఇంట్లో వాళ్ళంతా క్రమంగా చనిపోయారు. అతని ఉద్యోగం ఊడి జైలు పాలయ్యాడు. ఇందిర చదువుకొని ఉద్యోగం సంపాదించింది. హాయిగా సదుపాయంగా బ్రతకటం నేర్చుకుంది. ఇందిర చెప్పిన ఈ కథను విని కృష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు. తను అవసరంగా ఆమెను బాధపెట్టానంటూ కృష్ణమూర్తి బాధపడ్డాడు. ఆమె అతనిని దగ్గరగా లాక్కుంది. హాయిగా బ్రతకటం నేర్చుకోమని చెప్పింది. అతడామె ఆకర్షణకి లొంగిపోయాడు. వేకువ జామున ఇందిర తన చేతులను తప్పిస్తూ ఉంటే మెలకువ వచ్చింది. ప్రొద్దుటే ఆనందరావు గురించి మరల ప్రశ్నించాడు కృష్ణమూర్తి. భోగిపండగనాడు స్నేహితులతో తాగుతుంటే అరెస్టు చేసి, జైలులో పెట్టారని, మూడు నెలలు శిక్షపడవచ్చని ఇందిర చెప్పింది. ఆమె నిర్లిప్త స్వభావానికి కృష్ణమూర్తి అవాక్కు అయ్యాడు.

## 19

ఇందిర ఆఫీసుకి బయలు దేరింది. ఆరోజు సెలవు పెట్టమని, అనేక విషయాలు చర్చించాలని కృష్ణమూర్తి అంటే సాయంత్రం కలుద్దామని ఇందిర అతడిని ఒప్పించింది. ఇద్దరూ వెళ్ళిపోయారు ! సాయంకాలం కలుసుకుందాం అనుకుంటూ ఆసుపత్రిలో పరధ్యానంగా ఉన్న చక్రవర్తి వద్దకు వసుంధర వచ్చింది. కళ్యాణి రాత్రి తన ఇంటికి వచ్చిందని, తెల్లవారిందాకా అక్కడే ఉందని, తాను క్షేమంగా ఉన్నట్లు నీకు తెలియ జేయమందని చక్రవర్తి వసుంధరతో అన్నాడు. తాను చక్రవర్తితో, కృష్ణమూర్తితో చనువుగా ఉండడం చూచి పిన్ని సహించలేక పోయిందని, ఆమె ఈ గొడవకు కారణమని, ఈ కారణంగా తన చదువు కుంటుపడుతున్నదని వసుంధర చక్రవర్తికి చెప్పింది. ఒక్కసారి కృష్ణమూర్తితో మాట్లాడాలని, అతడిని పిలిపించమని చెప్పి వసుంధర వెళ్ళి పోయింది. చక్రవర్తి కృష్ణమూర్తి రూముకు వెళ్ళాడు. అతడు తన స్వగ్రామానికి వెళ్ళడానికి తయారవుతున్నాడు. డాక్టరు తనతో రమ్మంటే కృష్ణమూర్తి అంగీకరించలేదు. అతడేదో నిశ్చయానికి వచ్చి ఉంటాడని డాక్టరు నిర్ణయించుకున్నాడు.

కళ్యాణి ట్యూషన్లు ముగించుకొని వచ్చింది. ఇంటాయన వచ్చి ఆమెకు టెలిఫోను ఆపరేటర్ ఉద్యోగం చూస్తున్నానని, తప్పకుండా వస్తుందని చెప్పాడు. ఆమెకు రాత్రి పిన్ని అన్నమాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆ పిన్ని ప్రవర్తన వల్ల తనకు పునర్జన్మ లభించింది. తానింక లోకానికి భయపడవలసిన అవసరంలేదు. ఇలా ఆలోచించుకుంటూ సాయంత్రం దాకా గడిపిన కళ్యాణి లేచి డాక్టరు ఇంటికి బయలు దేరింది. దారిలో ప్రకాశం కనిపించి క్షమించమంటూ పలకరించినా, కళ్యాణి అతనితో మాట్లాడడం ఇష్టంలేనట్లుగా ప్రవర్తించింది. కళ్యాణి వెళ్ళే సమయానికి డాక్టరు కృష్ణమూర్తిని బస్సు ఎక్కించడానికి వెళ్ళాడు. అతని కోసం ఎదురు చూస్తూ కూర్చుంది కళ్యాణి. బస్సు స్టాండులో ఎంత చెప్పినా కృష్ణమూర్తి వసుంధరతో మాట్లాడడానికి అంగీకరించలేదు. తానీ జీవితంలో ఆమె ముఖం చూడలేనని, ఇందిరను తప్ప ఇతరులను వివాహం చేసుకోనని, వక్రంగా ఆలోచించలేనని కృష్ణమూర్తి చక్రవర్తితో నిక్కచ్చిగా చెప్పి బస్సు ఎక్కాడు.

## 20

కళ్యాణి, చక్రవర్తి కారులో ప్రయాణం చేస్తున్నారు. కళ్యాణి అలసిపోయినట్టు వెనక్కి వాలి పడుకుంది. తెల్లవారే లోపు నెల్లూరు వెళ్ళాలని చక్రవర్తి ఆలోచన. కృష్ణమూర్తి, ఇందిర ఎక్కడ ఉంటారని కళ్యాణి అడిగితే నెల్లూరులోగాని, తిరుపతిలోగాని ఉంటారని చక్రవర్తి బదులిచ్చాడు. ఇందిరలో వచ్చిన మార్పుకు కళ్యాణి సంతోషించింది. కృష్ణమూర్తి తన ఊరిలో కూర్చుని ఆలోచించుకున్నాడని, తాను వసుంధరకు తగినవాడు కాదని నిర్ణయించుకున్నాడని, అతని ఆలోచన మంచి మార్గంలో నడిచిందని కృష్ణమూర్తి గురించి చక్రవర్తి కళ్యాణికి చెప్పాడు. తన వలన వసుంధర అనేక విధాలుగా బాధపడిందని కళ్యాణి వాపోయింది. రామినాయుడు కారణంగా కళ్యాణి తనకు పరిచయం కావడం తన అదృష్టమని చక్రవర్తి అనుకున్నాడు. జీవితం మీద విరక్తిని పెంచుకొన్న తనకు జీవితం మీద ఆశకలిగేలా చేసింది కళ్యాణి అని చక్రవర్తి అనుకున్నాడు. కారులో తిరుపతి దాకా వెళ్ళి పెండ్లి చేసుకోవాలని చక్రవర్తి కళ్యాణితో బయలుదేరాడు.

నెల్లూరులో చక్రవర్తి స్నేహితుడు గోపాలరావు ఉన్నాడు. ఇందిర, కృష్ణమూర్తి వాళ్ళింట్లో దిగారు. దోమల వలన ఇందిర ఆ రాత్రి నిద్రపోలేదు. చక్రవర్తి, కళ్యాణి వచ్చిన తర్వాత తిరుపతి వెళ్ళి పెండ్లి చేసుకోవాలని అనుకున్నారు. కృష్ణమూర్తి తన కోసం అన్నింటికీ సిద్ధపడడం ఇందిరకు ముచ్చట కలిగించింది. తనకు ఎలాంటి మగతోడు కావాలని ఆశించిందో, అలాంటి మగతోడు లభించినందుకు ఆనందించింది. కళ్యాణి వస్తే మాట్లాడాలా అని ఇందిర అంటే మామూలుగా పలకరించమని కృష్ణమూర్తి బదులిచ్చాడు. కృష్ణమూర్తి మాటలకు తల ఊపింది ఇందిర.

## 21

కృష్ణమూర్తి , కళ్యాణి, చక్రవర్తి కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరోవచ్చి అర్జెంటు అని గోపాలరావును తీసుకు వెళ్ళారు. కారులో వస్తున్న చక్రవర్తి యాక్సిడెంటు చేశాడు. అతి ప్రయత్నం మీద కళ్యాణి, చక్రవర్తి కారులోనుంచి బయటపడ్డారు. కళ్యాణి భయపడింది. అదృష్టవశాత్తు బయట పడ్డామని చెప్పి, కారును అక్కడే వదిలేసి టాక్సీలో నెల్లూరు వచ్చారు. యాక్సిడెంటు విషయం చెప్పారు. గోపాలరావు కారును తెప్పించే ఏర్పాటు చేశాడు. ఇందిర, కళ్యాణి చిరునవ్వుతో పలుకరించుకున్నారు. తిరుపతి వెళ్ళడానికి బస్సు ఏర్పాటుచేసుకొని అందులో అందరూ బయలుదేరారు. జోకులు వేసుకుంటూ కులాసాగా తిరుపతి చేరారు. అంతకు ముందే రైల్లో వసుంధర అక్కడకు చేరుకుంది. కాంపౌండరు పెండ్లి ఏర్పాట్లన్నీ చూస్తున్నారు. వసుంధర, కళ్యాణి ఆప్యాయంగా పలకరించుకున్నారు. కృష్ణమూర్తి వసుంధరతో థాంక్స్ అన్నాడు. కాంపౌండరు చేసిన ఏర్పాట్లను ఇందిర మెచ్చుకుంది. రెండు జంటలకు వివాహాలు అయ్యాయి. ఇందిర, కృష్ణమూర్తి ఎలా జీవించాలో ముచ్చటించుకున్నారు. వసుంధర గట్టిగా చదివి పరీక్షలు వ్రాస్తాను అంది. కళ్యాణి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తానని చెప్పింది. జీవితం సమస్యల వలయం అని, ఒక సమస్య తీరితే మరొక సమస్య వస్తుందనీ, నిర్భయంగా నిండుగా బ్రతకాలనీ, రేపటి సమస్యలు తలచుకొని భయపడకూడదని, జీవితాన్ని ప్రేమించాలని ఇందిర ఓచిన్న ఉపన్యాసం ఇచ్చింది. అందరూ ఆనందంగా బంగళాలోకి దారితీశారు.

డాక్టర్. ఎన్. ఆదినారాయణ ఎం.ఏ, పిహెచ్.డి.
రీడర్ & ప్రిన్సిపాల్
బి. ఎస్. ఎస్. బి. డిగ్రీ కళాశాల

ఖండం - 1 ప్రాచీన పద్యభాగము

# చిఱుతొండ నంబి కథ - శ్రీనాథుడు

## పాఠం - 9

1. 9. 0. : పరిచయం
1. 9. 1. : ఉద్దేశం
1. 9. 2. : పాఠ్యభాగ సందర్భం
1. 9. 3. : కఠిన పదాలకు అర్థాలు
1. 9. 4. : పాఠ్యభాగ వివరణ

### 1. 9. 0. పరిచయం :

చిఱుతొండనంబి కథ అను పాఠ్యభాగం హరవిలాసము అను కావ్యము లోనిది. ఈ కావ్య కర్త శ్రీనాథుడు (1384 - 1455). ఇతడు 15 వ శతాబ్దిలోని వాడు. తండ్రి మారయ, తల్లి భీమాంబ. గొప్ప శివభక్తుడు. ఈశ్వరార్చనకళాశీలుడు, బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. సకల విద్యా సనాథుడు, కవి సార్వభౌమ బిరుదాంచితుడు. కవిత్రయము తరువాత మళ్ళీ చెప్పుకోదగిన ప్రతిభాధురంధరుడు. మహాకవి. మహత్తరమైన కావ్యాలను మనకు అందించాడు.

"చిన్నారి పొన్నారి చిఱుత కూకటి నాడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర"

అనే పద్యంలో శ్రీనాథుడు వ్రాసిన కొన్ని కావ్యాలు కనబడతాయి. మరుత్తరాట్చరిత్ర చిన్నతనంలోనే వ్రాశాడు. చిన్న వయసులోనే కవియై కవిసార్వభౌముడైన మహానుభావుడు శ్రీనాథుడు. మరుత్తరాట్చరిత్ర. శాలివాహన సప్తశతి, మొదలగు కొన్ని గ్రంథాలు అలభ్యాలు. క్రీడాభిరామం విషయంలో కర్తృత్వం చర్చనీయాంశం అయింది. కాగా కాశీఖండము, భీమేశ్వరపురాణము, హరవిలాసము, శివరాత్రి మాహాత్మ్యము, శృంగార నైషధము అనేవి అతని జగత్ప్రసిద్ధములైన మహాకావ్యాలు. శ్రీనాథ మహాకవి మనకందించిన పరిపూర్ణమైన కావ్యరత్నాలివి. ప్రౌఢ దేవరాయల ఆస్థానంలో గౌడడిండిమభట్టు నోడించి కనకాభిషేక సత్కారం పొందాడు. కొండవీటిని పాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి. పెదకోమటి వేమారెడ్డి కొలువులో 'విద్యాధికారి' పదవి నలంకరించాడు. రాజమహేంద్ర వరం రెడ్డి రాజుల కొలువులోను సత్కరింపబడి వారికి కావ్యాలు అంకితం చేశాడు. రాజాశ్రయం, భోగపరాణయత్వం ఆయన గుణాలు. ఎంతో భోగాలనుభవించిన శ్రీనాథుడు అవసాన దశలో అష్టకష్టాలనుభవించాడని "కవిరాజుకంఠంబు గౌగిలించెను గదా పురవీధి నెదురెండ బొగడదండ" "కాశికా విశ్వేశు ఁగలిసె వీరారెడ్డి" వంటి పద్యాలు సాక్ష్యమిస్తాయి.

కవిత్రయ కవితా వైభవాన్ని అవగతం జేసుకొని, తన ప్రతిభావ్యుత్పత్తులతో కవితామృతాన్ని పంచిపెట్టి, పెద్దనాది కవులకు మార్గదర్శియై కావ్యజగత్తును రసమయం చేసిన రసజ్ఞశేఖరుడు శ్రీనాథుడు.

**హరవిలాసం - పరిచయం.**

ఈశ్వరార్చన కళాశీలుడైన శ్రీనాథుని కావ్యాలలో ఒక ప్రత్యేక లక్షణం గల కావ్యం హరవిలాసం. ఇది ఏడు ఆశ్వాసాల గ్రంథం. ఇందు ప్రధానంగా నాలుగు కథలు గలవు. సిరియాళ చరిత్ర, గౌరీకల్యాణం, హాలాహలభక్షణం, కిరాతార్జునీయం అనేవి నాల్గు నాలుగు వేరు వేరు కథలు. అయినా వస్త్వైక్యము కొఱవడలేదు. ప్రతికథలోను అనుస్యూతంగా ఈశ్వర విలాసం ఉంది. తాను ఈశ్వరార్చన కళాశీలుడు అనే విషయం అణువణువున ప్రతిష్ఠాపింపబడింది. గౌరీకల్యాణ మనే ద్వితీయ విలాసం అంతా కాళిదాసుని కుమార సంభవానికి అనువాదంగా కన్పిస్తుంది.

ప్రస్తుత పాఠ్యభాగమైన చిఱుతొండనంబి కథ మొదటి రెండు ఆశ్వాసాలలో ఉంది. పాఠ్యభాగం ద్వితీయాశ్వాసంలోని 94 వ పద్యంతో ప్రారంభమై ఆశ్వాసాంతం వరకు సాగుతుంది.

హరవిలాసము అనే కావ్యాన్ని తన బాల్య సఖుడైన అవచి తిప్పయసెట్టికి అంకితమిచ్చాడు. ఇతడు కొమరగిరి రెడ్డి సుగంధ ద్రవ్య భండాగారాధ్యక్షుడు. ఇతడు కూడా శివభక్తుడే. చక్కని సామెతలతో జాతీయలతో, తెలుగునుడులతో, పలుకుబడులతో, లోకోక్తులతో హరవిలాసము పరమ రమణీయం.

### 1.9. 1. ఉద్దేశం :

కావ్య పఠనం బుద్ధి వికాసాన్ని కలిగిస్తుంది. మెదడుకు పదును పెడుతుంది. ఆలోచనా శక్తిని పెంచుతుంది. రసానందాన్ని అందిస్తుంది. ఉపదేశాన్నిస్తుంది. భాషా సంపత్తిని వృద్ధి చేస్తుంది. సంస్కృతి సంప్రదాయాలను వెలారుస్తుంది. సామాజిక స్పృహను కలిగిస్తుంది. ఆదర్శధర్మ పథ నిర్దేశం గావిస్తుంది.

చిఱుతొండనంబి కథలో ముగ్ధభక్తి గోచరిస్తుంది. ఎంతకష్టమైననూ పెట్టుకొన్న నియమాన్ని ఉల్లంఘించరాదని చిఱుతొండనంబి పాత్ర వల్ల తెలుస్తుంది. ఎంత మార్చాలని ఎవరు ప్రయత్నించినా మన మార్గం మంచిదైనప్పుడు మారరాదని తిరువెంగనాంచి పాత్ర సూచిస్తుంది. భర్తృచిత్తానుసార ప్రవర్తన కన్పిస్తుంది. వంశమర్యాద కాపాడటం పుత్రుని లక్షణంగా సిరియాలుని పాత్ర తెలియజేస్తుంది. తల్లిదండ్రులు పంచిన పని చేయడమే పుత్ర విధియని చాటడమైనది.

స్వార్థం వీడితేనే భక్తి గాఢమౌతుంది. తోటి వారి నందఱనూ కైలాసానికి గొంపోయినచో నేనూ వస్తాను అని చిఱుతొండనంబి అనడం పదిమందిమేలు కోరేతత్త్వం. ఇంతకన్నా అలవరచుకోవలసిన ఆదర్శమేముంది?

### 1. 9. 2. పాఠ్యభాగ సందర్భం :

దుర్వాస మహాముని శాపం వల్ల తుంబురుడను గంధర్వుడు చిఱుతొండనంబి అనే పేరుతో కాంచీ నగరంలో వైశ్యకులంలో పుట్టాడు. తుంబురుని భార్య అయిన అప్సరస తిరువెంగనాంచి అను పేరుతో పుట్టి చిఱుతొండనంబికి భార్యఅయింది. వారి కుమారుడే సిరియాలుడు.

పూర్వజన్మ వాసనా విశేషం వల్ల చిఱుతొండనంబి వీరశైవచార పరాయణుడై జంగమప్రమథులకు వారేది కోరినా లేదనకివ్వడమే వ్రతంగా జీవిస్తున్నాడు.

ఒకనాడు ఒక భిక్షావృత్తి జంగం వచ్చి 'శివకారుణ్యము' అని దీవించి "కంచినగరి పాటి గట్టుతూమున తూమెడిక్షురసము" హరుని అభిషేకమునకై కావాలని, అదీ చేతిగానుగ చేత ఆడినదై ఉండాలనీ చిఱుతొండనంబిని కోరాడు. అతడు సరేనని జంగానికి విందొనర్ప వంటకాలు సిద్ధం చేయవలసిందని భార్యకు చెప్పి, డబ్బు తీసుకొని వెళ్ళి, జంగము అడిగిన రసమునకు కావలసిన నూఱు కోలల చెఱకు గొని మోపు కట్టాడు. ఆ మోపు నెత్తలేక ముందుకు తూలిపడ్డాడు. అతనికి చెమటపట్టింది. కైలాసం నుంచి శివుడే దిగివచ్చి సాయం పట్టాడు. చేతిగానుగ నాడించాడు. ఆ రసంతో జంగానికి అభిషేకం గావించాడు.

ఇక్కడ చిఱుతొండనంబి మోపు మోసుకొని వస్తూండగా వెండి కొండపై అచ్చరల నాట్యం చూస్తున్న శివునకు చెమట పట్టింది. అచ్చరలను చూచి శివుడు చెమర్చాడని ఎంచి పార్వతీదేవి కేళి పద్మంతో శివుని మొత్తింది. అచ్చరలను చూడటంచేత పుట్టిన మన్మథ వికారం వల్ల తనకు చెమటపట్టలేదని, అర్థదేహమైన నీకు తెలియకుండ ఏ భావమైన నాకెట్లు కలుగుతుందని చెప్పి చిఱుతొండనంబిని గూర్చి వివరించాడు. పార్వతి చిఱుతొండనంబిని చూడాలన్నది.

వెంటనే శివుడు ఇంద్రుని పిలిచి కంచిలో ఇరువది ఒక్క రోజులు రేబగళ్ళు కుండపోతగా వర్షం కురిపించవలసిందని ఆజ్ఞాపించాడు. అట్లే ఇంద్రుడు కావించాడు. జంగమారాధన చేయనిదే చిఱుతొండనంబి భోజనంచేయడు. ఇది ఆతని వ్రతం. ఆ దుర్దినాలలో సైతం తన వ్రతం భంగం కాకుండా కాపాడుకొన్నాడు. వానవెలిసే రోజు వచ్చింది. ఆరోజు ఒక్క జంగం కూడా కన్పించలేదు. ముసురుపట్టిన దినాలలో సైతం మన పంచలోనే అనేకమంది శివయోగులుండే వారే, నేడేమి ఒక్కడు లేడని భార్యతో పల్కి జంగమప్రమథులను వెదకడానికి బయల్దేరాడు. కంచంతా గాలించినా ఒక్కడూ దొరకలేదు. చివరకు ఊరి వెలుపల పాడుపడిన గుడి గర్భమంటపంలో ఎనబైఏళ్ల ముసలి యోగీ, అతని పాదాలొత్తుతూ గుడ్డి అవ్వ కన్పించారు. చిరుతొండనంబి వారికి మ్రొక్కి, అతిథ్యానికి ఆహ్వానించాడు. శివార్చన చేయడానికి తన ఇంటికి రమ్మన్నాడు. అప్పుడా యోగి చిఱుతొండనంబితో ఇట్లన్నాడు. శివునుద్దేశించి తాను నిరాహారవ్రతం చేస్తున్నాననీ, ఆ వ్రతానికి ఉద్యాపనం పశూపహారమనీ, అందునా నరుడు కావాలనీ, అతడు కూడా పిన్నవయసువాడు, రూపసి అయియుండాలనీ అతనిని వాని తల్లిదండ్రులే వడుగుచేసిన పిమ్మట పాకమొనర్చి వడ్డించాలనీ ఆ పంక్తిలో తనతో పాటు చిఱుతొండనంబి, వాని కొడుకు కూడా కూర్చోవాలనీ చెప్పినాడు. చిఱుతొండడంగీకరించాడు. దీనికి నీ భార్య, కుమారుడు అంగీకరిస్తారా అని యోగి అడిగాడు. శివభక్తి విశ్వాసం, జంగమారాధన నిష్ఠ, తనమాట దాటకుండడం అనే లక్షణాలు తన భార్యకు, కుమారునికి ఉండటంవల్ల చిఱుతొండనంబి మాయా మహాయోగి నియమాన్ని ఒప్పుకొన్నాడు. ఇంటికి వచ్చి భార్య కీ విషయాన్ని చెప్పాడు. తిరిగి శివయోగిని ఇంటికి తీసురావడానికి బయల్దేరాడు.

ఇంతలోనే తన ముసలి రూపం వీడి శివుడు సిరియాలుడు చదువుకొనే గురువు గారింటికి వెళ్ళాడు. అతనితోనిట్లన్నాడు. నిర్భాగ్యుడైన నీతండ్రి నిన్నుచంపి శివయోగికి భోజనంగా పెట్టబోతున్నాడు. అతడు తండ్రా ! రాక్షసుడా ! నీ వెక్కడికైనా పారిపో అన్నాడు. దానికి సిరియాలుడు చక్కగా బదులిచ్చాడు. పరార్థమై తనువును వెచ్చించటమే గదా జన్మసాఫల్యం. దధీచి, మేఘవాహనుడు, శిబి మొదలైన వారిని గూర్చి తెలియనివారా ! అల్పులా ! "పరోపకారార్థమిదం శరీరం" అని కదా వేద వాక్యం అంటూ చెప్పాడు. సిరియాలుడు చిఱుతొండనంబికంటే అధికుడని శివుడనుకొన్నాడు.

అంత తిరువెంగనాంచి మనసుమార్చి ఆమెలో పుత్ర వాత్సల్యం పెంచి కొడుకును చంపే ప్రయత్నాని విరమింపచేయాలనే ఉద్దేశంతో వారిని పరీక్షించడానికి పార్వతీదేవి పదహారు సంవత్సరాల పచ్చిబాలెంతరాలుగా చిఱుతొండనంబి ఇంటికి వస్తుంది. ఇది కథా సందర్భం.

### 1. 9. 3. కఠిన పదాలకు అర్థాలు :

**పద్యం : 94**

| | | |
|---|---|---|
| ఫాలపట్టికయందున్ | : | నుదుటియందు. |
| భస్మము | : | విభూతి |
| త్రిపుండ్రము | : | నొసట నుంచిన విభూతి లోనగు వాని మూడు రేఖలు |
| కర్ణము | : | చెవి |
| దోయి | : | రెండు |
| గంత | : | బొంత |
| కటి | : | మొల |
| కరకంచు(కరక+అంచు) | : | కరక్కాయ నీటితో వ్రాసిన యంచు |
| పుట్టము | : | వస్త్రం |
| సంది | : | దండచేయి, భుజానికి మోచేతికి నడిమి భాగం |
| గిరి పెండ్లి కొడుకు కుఱ్ఱ | : | శివలింగము |
| పచ్చడము | : | వస్త్రము |
| కండ | : | ఖండము, తునుక. |
| పురంధ్రి | : | స్త్రీ, కుటుంబంగల స్త్రీ. |
| పాపడు | : | చంటి పిల్లవాడు. |

**(ప. 95 ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**పద్యం 96**

| | | |
|---|---|---|
| కృపాళుమూర్తి | : | కరుణాస్వరూపిణి |
| శూలి నాంచారు | : | శివుని భార్య పార్వతీదేవి. |
| చూచుకములు | : | చనుమొనలు |

**(పద్యం 98 ప్రతిపదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**పద్యం 99**

| | | |
|---|---|---|
| జోగులు | : | యోగులు |
| ప్రాగల్భ్యము | : | ప్రగల్భత్వము - ప్రతిభ కలిగి ఉండడం |
| ఓగిరం | : | ఆహారం |
| ఉచితము | : | తగినది |

**పద్యం 100**

| | | |
|---|---|---|
| వెలది | : | స్త్రీ |
| అలఁదికొను | : | పూసుకొను |
| కాటన్ | : | శ్మశానమందు |
| నిసువు | : | శిశువు |

**పద్యం 101**

| | | |
|---|---|---|
| మానవతి | : | అభిమానము గల స్త్రీ |
| మ్రాను | : | చెట్టు |

**పద్యం 102**

| | | |
|---|---|---|
| తడవు | : | ఆలస్యం |
| అలమటన్ | : | చింతతో |
| నిండుకొని | : | సంతోషించి |
| కేలుదోయి | : | చేతులజంట |
| కీలుకొల్పు | : | తగులునట్లు చేయడం |
| వ్యాపారము | : | పని |

**పద్యం 103**

| | | |
|---|---|---|
| ఒజ్జ | : | గురువు |
| ఉత్పలము | : | కలువ. |

**పద్యం 104**

| | | |
|---|---|---|
| చెలువ | : | స్త్రీ |
| పొలుపు | : | శోభ |
| ఎసలారు | : | అతిశయించు |
| ముక్తకన్య | : | మోక్షమనే స్త్రీ |

**పద్యం : 106**

| | | |
|---|---|---|
| అడరు | : | అతిశయించు |
| పుత్తెంచు (పుచ్చు+తెంచు) | : | పంపించు |
| కర+అంగుళి | : | చేతివ్రేలు |

**పద్యం 108**

| | | |
|---|---|---|
| కూఁకటి | : | పిల్లజుట్టు |
| చొబ్బిలగన్ | : | స్రవించగా, తడియగా |
| సంకుమదము | : | జవ్వాది |
| నయము | : | మృదువు |
| ఉద్వర్తనము | : | నలుగు |
| చిఱుబంతి పసుపు(చిఱుత + బంతి పసుపు) | : | పూసికొను పసుపు |
| పొరసిన | : | కలిపిన |

| | | |
|---|---|---|
| గంధసారము | : | చందనము |
| తీర్థమాడు | : | స్నానం చేయడం |
| ఈటార్చి | : | తడియార్చి |
| తొడివి | : | ఆభరణాలు అలంకరించి |
| పూసి | : | గంధం మొ॥పూసి |

**పద్యం : 109**

| | | |
|---|---|---|
| కయిసేసి | : | అలంకరించి |

**పద్యం : 110**

| | | |
|---|---|---|
| పారణ | : | ఉపవాసముండి మరుసటి రోజు చేసే భోజనం |
| పలలము | : | మాంసం |
| భైరవ యోగి | : | శివయోగి |

**(పద్యం 112 ప్రతి పదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**పద్యం 114**

| | | |
|---|---|---|
| ఇయ్యకొనినన్ | : | అంగీకరించిన |
| తారతమ్యము | : | తేడా,భేదం |
| సమయము | : | సిద్ధాంతం |

**పద్యం : 115**

| | | |
|---|---|---|
| పురస్సరము | : | ముందున్నది |

**పద్యం : 116**

| | | |
|---|---|---|
| ప్రణాళము | : | తామర తూడు |
| అట్టిక | : | మట్టిపాత్ర |
| సంతరించు | : | ధరించు |
| మొగిడ్చు | : | ముకుళించు |
| కుందక | : | దుఃఖింపక |
| వారిధి | : | సముద్రం |
| ఏకవాక్యము | : | ఒకే మాట |
| సంసిద్ధి | : | పొందడం |

**(పద్యం 117 ప్రతి పదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**(పద్యం 119 ప్రతి పదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**పద్యం : 120**

| | | |
|---|---|---|
| పన్నిదము | : | పందెం |
| అనువు | : | విధం |

**పద్యం : 121**

| | | |
|---|---|---|
| జీరకము | : | జీలకర్ర |
| కరాంబువు | : | లవంగం, నీటి ఉసిరిక |
| తరళాక్షి | : | చంచలమైన కన్నులు గలది - స్త్రీ |

**పద్యం : 122**

| | | |
|---|---|---|
| కఱకుట్టు | : | ఇనుప సలాకయందు గుచ్చి కాల్చిన మాంసఖండం |
| పరిపాటి | : | సామాన్య పద్ధతి, మామూలు |
| మూల్గు | : | మజ్జ - ఎముకలోనుండు మాంససారం |
| ముదుక | : | చిక్కన; లావు. |
| జాఁదు (జాఁజు రూపాంతరం) | : | ఎరుపు |
| నల్ల | : | నెత్తురు |
| సంబారములు | : | ఉప్పు, చింతపండు మొదలైనవి |
| బలియించు | : | సమృద్ధిగా ఉంచడం |
| దళము | : | అధికం; దట్టం |
| తాల ఁబోయు | : | తాలింపు పెట్టు |
| షట్ + రసములు | : | ఆరు రసాలు (వగరు, తీపి, ఉప్పు, కారము, చేదు, పులుపు) |
| ఉపేతము | : | కూడుకొన్నది |
| అబ్ధి | : | సముద్రం |
| శీతకరుడు | : | చంద్రుడు |

**పద్యం : 123**

| | | |
|---|---|---|
| సూన+అస్త్రుడు | : | పూవులు అస్త్రములుగా గలవాడు - మన్మథుడు |
| ఆనాలుగ | : | ఆనవాలు యొక్క రూపాంతరం (ఆన+పాలు) గురుతుగ |
| అట్టికలు | : | కుండలు |
| బోనాము | : | భోజనం |
| దొంతి | : | ఒకటి మీద ఒకటిగా ఉంచిన కుండలులోనగు వాని వరుస. |

**పద్యం : 124**

| | | |
|---|---|---|
| గొజ్జగ నీరు | : | పన్నీరు |
| పట్టు | : | పూత |
| పాటించి | : | ఆదరించి |
| ఒడగూర్చి | : | సిద్ధపరచి |
| కప్పురము | : | కర్పూరం |
| కలయన్ | : | అంతట |
| పడిగెంబు | : | వెడల్పు అంచుగల పాత్ర |
| గరగ | : | నీళ్ళు త్రాగుటకు ఉపయోగించు చిన్న పాత్ర |
| విమలము | : | నిర్మలము |
| డించి | : | దించి, పెట్టి |
| సర్వ+ఆయితంబు+అయ్యెన్ | : | అన్నీ సిద్ధమయ్యాయి |

**పద్యం : 125**

| | | |
|---|---|---|
| వ్యాపారి సార్వభౌముడు | : | సెట్టి శ్రేష్ఠుడు (చిఱుతొండనంబి) |

**పద్యం : 126**

| | | |
|---|---|---|
| చిగురు | : | లేత |

| | | |
|---|---|---|
| కదళీ | : | అరటి |
| పలాశము | : | ఆకు |
| పుచ్చి | : | తీసి |
| ప్రక్షాళించు | : | చక్కగా కడుగు |
| ఉపస్తరించు | : | అభిఘరించు |
| అపూపము | : | పిండివంట |
| సూపము | : | పప్పు |
| పుండ్రేక్షువు | : | నలుపు కలిగిన యెర్ర చెరకు |
| మధువు | : | తేనె |
| శర్కర | : | చక్కెర |
| ఘృతము | : | నెయ్యి |
| దధి | : | పెరుగు |
| శిఖరి | : | దానిమ్మ రసం |
| పొలసు | : | మాంసం |
| భరిత భోజనము | : | అన్ని రుచులతో పూర్ణమైన భోజనం |
| యోగి+ఈశ్వరుడు | : | యోగులలో శ్రేష్ఠుడు; యోగియైన ఈశ్వరుడు |
| విరూప+అక్షుడు=విరూపాక్షుడు | : | విరూపమైన (బేసి) కన్నులు కలవాడు - శివుడు |

**పద్యం : 127**

| | | |
|---|---|---|
| భైరవ యోగిరాజు | : | శివయోగులలో శ్రేష్ఠుడు |
| నంజుడు | : | మాంసం |
| మస్తకము | : | తల |
| వణిగ్వరుడు | : | వర్తకశ్రేష్ఠుడు |
| ఉత్తమాంగము | : | తల |
| నిసర్గ | : | సహజమైన |

**పద్యం : 128**

| | | |
|---|---|---|
| ఉజ్జగించి | : | వదలిపెట్టి |

**పద్యం : 129**

| | | |
|---|---|---|
| ఆలోకించు | : | చూచు |
| చిట్టమిడుచు | : | చిటికె వేయు |
| బెడంద కాండ్రు | : | బాధించేవాళ్లు |
| యోగి బృందారకులు | : | యోగి శ్రేష్ఠులు |
| చందము | : | విధము |
| పాకము | : | ఉన్న స్థితి నుండి మరొక స్థితికి మారుట |
| కుహనా భైరవుడు | : | మయా మహేశుడు |

**పద్యం : 130**

| | | |
|---|---|---|
| బంతిన్ | : | భోజన పంక్తి యందు |
| ఆరగించు | : | తిను |
| అఘము | : | పాపం |

**పద్యం : 131**

| | | |
|---|---|---|
| నిర్భాగ్యుడు | : | భాగ్యం (అదృష్టము) లేనివాడు, దరిద్రుడు |

**పద్యం : 132**

| | | |
|---|---|---|
| ప్రతీక్షించు | : | ఎదురు చూచు |
| అదను | : | సమయం |
| యోగి చూడామణీ | : | యోగి శ్రేష్ఠుడా ! |

**పద్యం : 133**

| | | |
|---|---|---|
| ఉత్తమాంగన | : | భార్య |
| ఎలుంగు | : | గొంతు |
| కుడుతము | : | తినెదము |
| ఒఱగొడ్డెము | : | మనసు నొప్పించెడు వంకరమాట |
| పడ్డపాటు | : | పడిన శ్రమ |
| గొడ్డేఱు | : | శూన్యమైన |
| జిడ్డుపఱచు | : | వృథ పుచ్చు |
| ప్రసాదము | : | అనుగ్రహం |

**పద్యం : 134**

| | | |
|---|---|---|
| వారాశి | : | సముద్రం |
| హిమదాముడు | : | చంద్రుడు |
| వికస్వరము | : | వికసించినది. |
| అంభోరుహము | : | పద్మం |
| కంఠీరవ+ఇంద్ర+కిశోరము | : | సింహశ్రేష్ఠం యొక్క పిల్ల. |
| ధీ | : | బుద్ధి |
| రౌహిణేయుడు | : | బుధుడు (బలరాముడు, శని అని కూడా) |
| మనోభవుడు | : | మన్మథుడు |
| వడుగు | : | బ్రహ్మచారి |
| తనూజుడు | : | కుమారుడు |
| రాజీవము | : | పద్మం |
| చీరు | : | పిలుచు |

**(పద్యం : 135 ప్రతి పదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**(పద్యం : 136 ప్రతి పదార్థ తాత్పర్యాలలో చూడండి)**

**పద్యం : 137**

| | | |
|---|---|---|
| ముప్పిరి+కొను | : | అతిశయించు |
| స్తుతియించు | : | పొగడు. |

**పద్యం : 138**

| | | |
|---|---|---|
| కంధరము | : | కంఠం |
| నీహారధరాధరేంద్రము | : | హిమవత్పర్వతము |
| తనయ | : | కుమార్తె |
| చారు | : | అందమైన, మనోహరమైన |
| సంలగ్నము | : | అంటుకొన్నది |
| పటీరము | : | గంధం |
| రజస్సు | : | పొడి |
| సంపన్నము | : | కూడినది. |

**పద్యం : 139**

| | | |
|---|---|---|
| మర్త్యులు | : | మానవులు |

**పద్యం : 140**

| | | |
|---|---|---|
| వాడ | : | వీధి |
| వాసివట్టము | : | హెచ్చు, తగ్గు |
| తారకరాజు | : | చంద్రుడు |
| ఒడగూడు | : | సిద్ధించు |
| విచ్చేయుము | : | పొమ్ము |
| అభవ | : | శివుడా ! |
| కూడిమాడి | : | కలసిమెలసి |

**పద్యం : 142**

| | | |
|---|---|---|
| నాణెపుం గోమటులు | : | శ్రేష్ఠమైన కోమట్లు |
| అభ్ర వీథి | : | ఆకాశ మార్గం |
| భాసుర స్ఫూర్తి | : | ప్రకాశ స్ఫురణం |

## 1.9.4. పాఠ్యభాగ వివరణ :

నొసట మూడు విభూతి రేఖలు, చెవులకు రాగికమ్మలు, చేతిలో ఇత్తడి కంటె, స్తనాలపై కాషాయ వర్ణం గల బొంత ఇత్యాదిగా మునికాంత వేషం సంతరించుకొని పదారేండ్ల పచ్చిబాలెంతరాలుగా పార్వతీదేవి తిరువెంగనాంచిని సమీపించింది. ఆమెలో పుత్రవాత్సల్యాన్ని ప్రేరేచి పుత్రుని చంపటానికి కనికరం అడ్డువచ్చేట్లు చేయాటానికై అందరు జోగెతలలాగానే తానుకూడా తన బిడ్డకు పాలు పోయవలసిందని అడిగింది. తిరువెంగనాంచి మరియే ఆలోచనలేక యథాలాపంగా పాలుపోసింది. అంత పార్వతిదేవి మాటలతో తిరువెంగనాంచితో మాతృభావన పెల్లుబుకునట్లుగా పాలచేపున గిలిగింతవాఱు తన చనుమొనలను నరచేత ఒత్తుకొంది.

నగరంలోని ప్రతివీధి ప్రజలు మహాపాపమని అనుకొంటున్నారు. అది నిజమో కాదో తెలియదు కాని, మీరు కఠినాత్ములై సుకుమారుడైన మీకుమారుని చంపి ఒక యోగికి భోజనంగా పెట్టుతున్నారటగదా! ఇది ఈ లోకంలో ఎక్కడైనా ఉందా ! యోగులు కపటోపాయాలలో నేర్పరులు. నిధుల కోసం, క్రొత్త సిద్ధుల కోసం ఏ విధంగానైనా ప్రవర్తిస్తుంటారు. అట్టివారికి భోజనంగా కొడుకును చంపటం న్యాయం కాదు. కొంచెం విభూతి రాసుకొంటే గుమ్మడి కాయంత వెఱ్ఱి పుట్టునంటారు. నీమగని బుద్ధి వల్లకాటిలో కలిసిపోను చిన్ని పాపని చంపనెంచాడు. అతడు కన్నులు కానక ఉన్నాడు. నీకుమారుని చంపుట కతడెవడు? మగవాడో, మ్రానో అనేమాట ఒక నాటిదా ! అని అన్నది.

తిరువెంగనాంచి పార్వతిమాటలకు ఎలాంటి వికారమూ పొందక ఆమెతో నిట్లన్నది. అమ్మా ! శివునకు శివయోగికి తేడా ఉందా! శరణుకోరిన వారి అర్థం ప్రాణం శివునకే అధీనాలు కావా ! శివుడే కర్త, శివుడే భోక్త. దీనికి విచారించడం దేనికి ? నీకు ఆలస్యమవుతుంది.

బాలింతరాలవు కదా! నీ బిడ్డ ఎంత అలమట చెందుతాడో ? పాలు చాలుగదా! మాఇంటికి వస్తూపోతూ  ఉండవలసింది. సంతోషంగా ఉండు అని పల్కినది. అట్ల పల్కి నమస్కరించి తన పనిలో మునిగిపోయింది. పార్వతిదేవి అంతర్ధానమైంది.

అంత చిఱుతొండసెట్టి తిరువెంగనాంచిని గురువు నింటికి వెళ్ళికుమారుని తెమ్మన్నాడు. తెచ్చివడుగు చేసినవెంటనే "ఇరుగుపొరుగు వారు భాగ్యసంపదలు" అతిశయించడానికి కులమభివృద్ధిచెందడానికి పిల్లవానికి ముక్తికన్యతో వివాహం చేయాలన్నాడు. తిరువెంగ నాంచి గురువుగారింటికి వెళ్ళి కుమారుని తెచ్చింది. మేనత్తలు పంపిన భక్ష్యాలను నేయిలో ముంచి తింటూ సిరియాలుడు ఇంటిముంగిట తిరుగాడుతుంటాడు.

సిరియాళునికి జడల అల్లికను విప్పి, సంపంగి నూనె వ్రాసి, జవ్వాది రసంతో బాగా నలుగుపెట్టి, పన్నీరు పోసి నూరిన క్రొత్త పసుపులో  గలిపి, కస్తూరి కలిపిన చందనంతో,  సీకాయ ఎరువుతో జిడ్డుపోగొట్టి, తేట అయిన నులివెచ్చని నీటితో స్నానంచేయించి, జుట్టు నారబెట్టి, సురపొన్నపూలు  పెట్టి, తెల్లని వస్త్రం గట్టి, కాటుక దిద్ది, ఆభరణాలు తొడిగి, గంధాదులు పూసి, నొసట విభూతిరేఖలు తీర్చి తల్లిదండ్రు  లిట్లన్నారు.

ప్రియకుమారా ! ఒక శివయోగిచేస్తున్న శైవవ్రతక్రియా విధానంలో చివర చేసే భోజనానికై నిన్ను వండిపెట్టబోవుతున్నాము. నీమనస్సులో సంసారాన్ని వదలి పెట్టలేని బాధలేదు గదా ! అని అడిగారు. సంసారభ్రమ నాలో రవంతయైన లేదు. మీ వంశం కూడా ఇట్టిదే కదా ! శోకభయాలను వీడండి. మాయా మహాయోగికి మాంసాహారం అవుతాను. హింసచేస్తున్నామని బాధపడకండి. మీరునాకు పెద్దలు. మిమ్ము ప్రార్థిస్తున్నాను.  అని అన్నాడు. చావడానికంగీకరించిన పుత్రునకు, చంపడానికి ఒప్పుకొన్న దంపతులకు వీరశైవాచార నియమ విధానాన్ని గౌరవించే విషయంలో  తేడా లేదు. అని ఈ విధంగా తన భార్య లిద్దరు ఒకే నిశ్చయానికి వచ్చారు.

తల్లి బిడ్డకు పాలిస్తున్నట్లు తారువెంగనాంచి సిరియాలుని తొడపై పడుకోబెట్టుకుంది. చందనిక మట్టి పాత్రను చేతితో పట్టుకుంది. అందమైన బుగ్గలపైకి నవ్వుపొకుతుండగా సిరియాలుడు నమస్కరించాడు. చిఱుతొండనంబి కత్తి బాగా నూరి పదును పెట్టాడు. ముగ్గురి హృదయాలు సంతోషంతో ఉన్నాయి. వారు సిరియాలునితో ఇట్లన్నారు. " నాయానా ! మనస్సులో సందేహించకు మా యందలి ప్రేమ, స్నేహం, వాత్సల్యాలను  లెక్కించకుము. నాలుకచివర  పంచాక్షరీ నమశ్శివాయ మంత్రంను పఠించు.  ఇదే బ్రహ్మార్థసిద్ధి", శివార్థమనే నమ్మకంతో చిరుతొండనంబి భార్య తొడపైనున్న  బిడ్డమెడపై కత్తిమోపాడు. తలతెగి పడింది. అదినేలపైబడి నమశ్శివాయ మంత్రాన్ని పఠిస్తున్నది. సిరియాలు ముఖం కందలేదు.  కాంతిహీనం కాలేదు. చిఱునవ్వువీడలేదు. నిద్రపోతున్నట్లుగానే ఉంది. తల్లిదండ్రుల మనస్సు ఆనందించింది. పందెంలో గెలిచినట్లు, అప్పుసొంతం తీర్చినట్లు దంపతులు కొడుకును చంపి  వీరశైవవ్రతాన్ని జరిపారు.

మిరియాలు, ఉల్లిపాయలు, పసుపు, మెంతి, ఇంగువ, జీలకఱ్ఱ, చక్కెర, చింతపండు, లవంగం, నెయ్యి, నూనె, పెరుగు, కలిపి  ఆ యిద్దరు స్త్రీలు కఠినమైన మనస్సు గలవారై సిరియాలుని అనేక విధాలుగా వండారు. కమ్మగా కాల్చిన కఱకుట్టు మాంసాన్ని నీరుపోయేట్టు బాగా పిండి నేతిలో వేయించారు. సన్నగా తఱిగిన మాంసపు ముక్కలను జుఱ్ఱు కోడానికి వీలుగా వండారు. మజ్జ కలిగిన ఎముకలతో రుచి పట్టు చెడకుండ ఎఱ్ఱగా ఉండేట్లు నెత్తురుతో చారుకాచారు. ఉప్పు, చింతపండు మొదలగు పదార్థాలు, వడియాలు సమృద్ధిగా జేసి, కొవ్వుతో తాలింపుపెట్టారు. తిరువెంగనాంచి , చందనిక సిరియాలుని ఆరు రుచులు అమరునట్లుగా వండారు.  ఆ రకంగా అనేక విధాలుగా పాకాలు చేసి, ఆ పాకాన్ని నాలుగు  కుండలలో ఉంచి ఒకదానిపై ఒకటి పెట్టారు.  బాగాతోమిన భోజన పాత్రలను భోజనశాలలో చేర్చారు. పన్నీటితో అలికి రత్న కంబళం పరిచారు. దేవతార్చనకోసం దీప ధూపాదులు సిద్ధం చేశారు.  కర్పూరంతో ముగ్గు పెట్టారు. ఎడమవైపు రాగితో చేసిన వెడల్పుమూతి గల పాత్రనొకదానిని పెట్టారు. చిన్న పాత్రతో మంచినీరుంచారు. 'అంతా సిద్ధమైంది. అయ్యగారు తినే సమయమైంది'. అని చెప్పగనే సెట్టి జంగము వృద్ధ దంపతులను తీసుకొనివచ్చాడు.

చిఱుతొండనంబి దంపతులు వారిపాదాలు కడిగారు. ఆ తరువాత లేతా ముదురూ కాని, పొడవు వెడల్పు  గలదీ అయిన అరటి యాకును మధ్య ఈనె తీసివేసి పరిచారు. దానిని నీటిచే శుభ్రపరచి, నెయ్యభిఘరించి, పాయసం, అవుపాలు, పప్పు, చెఱుకురసం, ద్రాక్షపానకం, ఆవుపాలు, తేనె, చక్కెర, నెయ్యి, పెరుగు, రసాలు, శాకపాకాలు, దానిమ్మపండ్లరసం, ప్రియమైనకొడుకు మాంసం తోడి మంచి భోజనాన్ని వడ్డించారు. గ్రుడ్డి యవ్వకు  అట్లే వడ్డించారు. తినవలసిందని ప్రార్థించాడు. తాను తన భార్యా ప్రార్థనా పూర్వకంగా భక్తి విశ్వాసాలతో నమస్కరించారు.

ఆ శివయోగి శ్రేష్ఠుడు. ఆ పిల్లవాని మాంసపు కూరలను బాగా పరిశీలించి చూశాడు. అందులో తల మాంసం లేదని గ్రహించి యీ నీరసమాంసం నాకెందుకు? తలమాంసం కూరలుగా చేయలేదేమి? ఇదేకదా పుత్రప్రేమ ? నా వ్రతాన్ని కూడా పాడుచేశావు. ఇంక నేనేమి పారణచేసేది? ఇదేకాక తల మాంసం లేక అధమాంసము నేనెలాతింటాను? అని అనగానే చిఱుతాండనంబి భయపడ్డాడు. భార్యవైపుచూశాడు. అంతలో చందనిక తలమాంసం తెచ్చి ఎదురుగా బెట్టింది. పేచీలమారి యోగులు విధానం తెలిసిన దాన్ని కాబట్టి పాకం చేసి సిద్ధంగాఉంచాను. ఈ ముని మనస్సు మారకుండానే వడ్డిస్తానని వడ్డించింది. బంతిలో నీవు కూడా ఉండాలని యోగి చిఱుతొండనంబి నడిగాడు. ఒక్కడు భోజనం చేయరాదు. తోడులేకుండా భోజనం చేస్తే పాపం వస్తుందన్న వేదవాక్యాన్ని నీవు వినలేదా అని చిఱుతొండనంబి నడిగాడు. అంతేకాదు నీకుమారుని కూడా భోజనానికి రప్పించమన్నాడు. అప్పుడు చిఱుతొండనంబి శివయోగితో నిట్లన్నడు. దేవా!తమరు మొదటే సెలవిచ్చారు. మేమూ దానిని మరచిపోలేదు. నాకు కొడుకు ఇంకనూగలడు. వాడాటలకు వెళ్ళాడో! చదువుకోడానికెళ్ళాడో! పిలిపిస్తాను. వాని రాకకెదురు చూచేలోగా కూరలు చల్లారిపోతాయి. అనిచెప్పగా చిఱుతొండనంబితో ఆతపోధనుడిలా పలికాడు. నీభార్యను గొంతెత్తి పిలవమను. నీకొడుకు వస్తే బంతిలో కూర్చోబెట్టుకొని భుజిద్దాము. రాకపోతే నేను నీముసలి అవ్వతింటాము. అంతేకాని నీ పడ్డ శ్రమను వృధాపోనియ్యం. అని అనగానే తిరువెంగనాంచి గొంతెత్తి కుమారుని పిలిచింది. అన్ని దిక్కుల క్రమంగా మళ్ళీ పెద్దగా పిలిచింది. అలా పిలవగానే ఆయా కూరల వంట వాసనలుకల అవయవ ప్రదేశాలతో వేగంగా నడుస్తూ వారి మనసు ఉప్పొంగునట్లు సిరియాలుడు వచ్చాడు.

అంతట తెల్లని విభూతి దేహంతో, పాముకంఠాభరణంతో, కంఠమందలి నలుపుతో, జటాజూటంతో, చంద్రరేఖతో, చిచ్చరకంటితో పరమేశ్వరుడు సిరియాలుని తండ్రి హృదయానికి ఆనందం కలిగేట్లు సాక్షాత్కరించాడు. చిఱుతొండనంబి పరమేశ్వరుని స్తుతించాడు. పరమేశ్వరుడు అతనికి తన పూర్వ జన్మ ప్రకారాన్ని వివరించాడు. వారిని సశరీరంగా కైలాసానికి రమ్మన్నాడు. ఓ! చంద్రశేఖర! వైశ్యకులంలో వేయి గోత్రాలతో వెల్గుతూ వీరశైవాచారం వదలక ఏడు వాడల వారం అందఱం హెచ్చుతగ్గులు లేక ప్రవర్తిస్తున్నాము. ఇట్టి బంధువులను వదలి నేనొక్కణ్ణి ఎలా వస్తాను? ఇంతమందిని తీసుకొని పోతానంటే వస్తాను. అలా కాకపోతే మరలిపో! అని చిఱుతొండనంబి బదులిచ్చాడు. ఈశ్వరుడు కరుణించి చిఱుతొండనంబి కోరిన వరాన్నిచ్చాడు. కంచిలోని ఏడువాడల కోమటులతో అఖిల జీవకోటితో చిఱుతొండనంబి కైలాసానికి వెళ్లిపోయాడు.

**డాక్టర్ శ్రిష్ట చంద్రమౌళి శర్మ** ఎం.ఏ., పి హెచ్.డి.,

రీడర్ & ప్రిన్సిపాల్

ఎస్.వి.కె.పి.డిగ్రీ కళాశాల

పొదిలి

ప్రకాశం జిల్లా

ఖండం - 1 ప్రాచీన పద్యభాగము

# చిఱుతొండ నంబి కథ - శ్రీనాథుడు

## పాఠం - 10

1.10.0 : పరిచయం

1.10.1 : ఉద్దేశం

1.10.2 : ప్రతిపదార్థ తాత్పర్యాలు

1.10.3 : సందర్భ సహిత వ్యాఖ్యలు

**1. 10. 0 పరిచయం :** ప్రతిపదార్థాల వల్ల పదవిభాగం అర్థమై, విషయం స్పష్టమౌతుంది. వృత్త పద్యాలను మాత్రమే ప్రతిపదార్థ తాత్పర్యాలకు ఇస్తారు. పదాన్ని విడదీసి, అన్వయ క్రమంలో రాసి, చివర తాత్పర్యాలు రాయాలి. అదే విధంగా సందర్భ సహిత వ్యాఖ్యలు. ఆయాసందర్భాలలోని వాక్యం, వాక్యాలు ఇవ్వబడతాయి. వాటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయవలసి ఉంది.

**1. 10. 1 ఉద్దేశం :** చిరుతొండనంబి కథలోని శ్రీనాథుని పద్యరచనా రీతిని ఈ ప్రతిపదార్థ తాత్పర్యాలలోను, ప్రయోగ విశిష్టతను సందర్భసహితల వ్యాఖ్యలవల్ల తెలుసుకొంటారు.

**1.10.2. ప్రతిపదార్థ తాత్పర్యాలు :**

**ప. 95**

మక్కువ రేగి నెయ్యపు ꠰గుమారుని ꠰జంపుట కంత రాయమై
యక్కటికంబు పుట్టుటకు నల్లన వచ్చి భవాని యత్తఱిం
దక్కటి మాయ జోగెత విధంబున బిడ్డకు పాలువేడ నా
యక్కయు ꠰బోసె నెల్ల సమయంబుల ꠰బోలె నిరాకులాత్మయై.

**సందర్భం :**

ఈ పద్యము కవి సార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమను కావ్యంలోని ద్వితీయాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన చిఱుతొండనంబి కథలోనిది. (ఇది అన్ని పద్యాలకు మొదట రాయండి)

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| మక్కువ | : | ప్రేమ |
| రేగి | : | మిక్కిలి అధికమై |
| నెయ్యము+కుమారునిన్ | : | ప్రియమైన పుత్రుని |
| చంపుటకున్ | : | చంపడానికి |
| అంతరాయము+ఐ | : | అడ్డంకిఅయి, అవరోధమై |
| అక్కటికంబు | : | దయ |
| పుట్టుటకున్ | : | పుట్టుటకు |
| భవాని | : | పార్వతీదేవి |
| అల్లనన్ | : | మెల్లగా |
| వచ్చి | : | వచ్చి |
| ఆ+తఱిన్ | : | ఆ సమయమందు |
| తక్కటి | : | మిగత |
| మాయజోగెత విధంబునన్ | : | మాయజోగురాలు వలెనే |
| బిడ్డకున్ | : | బిడ్డకు |

| | | |
|---|---|---|
| పాలు | : | పాలు |
| వేడన్ | : | కోరగా |
| ఎల్ల సమయంబులన్ | : | ఎప్పటి మాదిరిగనే |
| నిరాకుల+ఆత్మ+ఐ | : | చెదరని మనస్సుకలదై |
| ఆ+అక్కయున్ | : | ఆమె(తిరువెంగనాంచి) |
| పోసెన్ | : | పోసింది |

**తాత్పర్యం :** ప్రేమ మిక్కుటమై ప్రియపుత్రుని చంపటానికి అడ్డంవచ్చి కనికరం పుట్టేందుకు గాను పార్వతీదేవి వచ్చి అందరి మాయ జోగెతల వలెనే పిల్లవానికి పాలు అడగగా తిరువెంగనాంచి చెదిరిపోని మనస్సుతో ఎప్పటిలాగే పాలు పోసింది.

**ప. 98**

ప్రజలెల్లం బురి ।గంత క్రంతల మహా పాపంబుగా ।బల్కెడున్
నిజమో కల్లయొ కాని మీరట। కడున్ నిస్త్రింశ భావంబునన్
నిజపుత్రున్ సుకుమారు ।జంపి యొక దుర్నిర్వాణికిన్ జోగికిన్
భుజియింపంగ నొనర్చు వార టిది యెందుం గల్గనే యిద్ధరన్.

**సందర్భం :**

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| ప్రజలు+ఎల్లన్ | : | ప్రజలంతా |
| పురిన్ | : | నగరంలో |
| క్రంత క్రంతలన్ | : | రాజవీధుల సందు త్రోవలలో |
| మహా పాపంబుగాన్ | : | మహాపాపమంటూ |
| పల్కెడున్ | : | అనుకొంటున్నారు |
| నిజమో | : | (ఆ విషయం) నిక్కమో |
| కల్లయొ కాని | : | అబద్ధమో కాని |
| మీరు+అట | : | మీరటకదా |
| కడున్ | : | మిక్కిలి |
| నిస్త్రింశ భావంబునన్ | : | దయలేని మనస్సు |
| నిజపుత్రున్ | : | తమ కుమారుని |
| సుకుమారున్ | : | సుకుమారుని |
| చంపి | : | చంపి వేసి |
| ఒక దుర్నిర్వాణికిన్ | : | చెడ్డ మార్గంలో మోక్షం పొందినవానికి |
| జోగికిన్ | : | యోగికి |
| భుజియింపంగన్ | : | తినునట్లుగా |
| ఒనర్చు వారు+అట | : | చేస్తున్న వారట కదా ! |
| ఇది | : | ఇట్టిపని |
| ఈ+ధరన్ | : | ఈలోకంలో |
| ఎందున్ | : | ఎక్కడైనా |
| కల్గునే | : | జరుగుతుందా ? |

**తాత్పర్యం :**

నగరంలోని రాజవీధుల సందుల త్రోవలలో ప్రజలంతా చాల పాపమంటూ అనుకొంటున్నారు. అది నిజమో అబద్ధమో కాని మీరు దయా విహీనులై సుకుమారుడైన మీ కుమారుని ఒక దుష్ట మార్గంలో ముక్తి పొందిన యోగికి భోజనంగా చేస్తున్నారట గదా ! ఈ లోకంలో ఇలాంటిది ఎక్కడైనా జరుగుతుందా !

**ప. 112**

సంసారభ్రమ మించుకేనియును మత్స్వాంతంబునన్ లేదు మీ
వంశంబీ పరిపాటిదే యుడుగుడీ వైక్లబ్య సంభావనల్
మాంసాహారము నయ్యెదన్ శివునకున్ మాయా మహాయోగికిన్
హింసాక్లేశము మానుడీ గురులు మీరే మిమ్ము ప్రార్థించెదన్.

**సందర్భం :**

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| సంసార | : | సంసారము నందలి |
| భ్రమము | : | భ్రాంతి |
| ఇంచుక+ఏనియున్ | : | కొంచెం కూడా |
| మత్ | : | నా యొక్క |
| స్వాంతంబునన్ | : | మనస్సులో |
| లేదు | : | లేదు |
| మీ | : | మీ యొక్క |
| వంశంబు | : | వంశం |
| ఈ పరిపాటిదే | : | ఈ క్రమం కలదే కదా ! |
| వైక్లబ్య | : | భయశోకాదులకు సంబంధించిన |
| సంభావనల్ | : | ఆలోచనలు |
| ఉడుగుడీ | : | మానుకొనండి |
| మాయా | : | మాయలు కల |
| మహా | : | గొప్ప |
| యోగికిన్ | : | యోగికి (యోగి యైన) |
| శివునకున్ | : | శివునకు |
| మాంస+ఆహారమున్ | : | మాంసపుటాహారంగా |
| అయ్యెదన్ | : | అవుతాను |
| గురులు | : | తల్లిదండ్రులు; పెద్దలు |
| మీరే | : | మీరలే కావున |
| మిమ్మున్ | : | మిమ్ము |
| ప్రార్థించెదన్ | : | వేడుకొంటాను |
| హింసాక్లేశమున్ | : | హింసకు పాల్పడుతున్నామనే దుఃఖాన్ని |
| మానుడీ | : | మానుకోండి. |

**తాత్పర్యం :**

సంసారం మీది వ్యామోహం నాలో ఎంత మాత్రమూ లేదు. మీ వంశం కూడా యిట్టి వైఖరి కలదే. విచార భావనలను వదలి వేయండి. కపటపు జోగియైన శివునకు మాంసాహారమయ్యెద. తల్లిదండ్రులు పెద్దలు మీరే కావున మిమ్ము వేడుకొంటున్నాను. హింసకు పాల్పడుతున్నామనే దుఃఖం పొందకండి.

**ప. 117**

మది శంకింపకు మన్న ! మా వలని ప్రేమ స్నేహ వాత్సల్య సం
పద పాటింపకు మన్న ! నాలుకతుదిన్ పంచాక్షరీ మంత్రముం
బదిలం బొప్ప పఠింపు మన్న ! పరమ బ్రహ్మార్థ సంసిద్ధి యి
య్యది సుమ్మన్న ! యనుంగునందన ! సిరాలా ! వీరశైవ వ్రతా !

**సందర్భం :**

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| అనుంగు | : | ప్రియమైన |
| నందన ! | : | కుమారా ! |
| వీరశైవ వ్రతా ! | : | వీర శైవ దీక్ష కలవాడా ! |
| సిరాలా ! | : | సిరియాళుడా ! |
| మదిన్ | : | మనస్సులో |
| శంకింపకుము+అన్న | : | సందేహింపకుమయ్యా |
| మా వలని | : | మా యందలి |
| ప్రేమ | : | ప్రేమ యొక్క |
| స్నేహ | : | స్నేహము యొక్క |
| వాత్సల్య | : | తండ్రీ(తల్లి) కొడుకుల అనురాగము యొక్క |
| సంపదన్ | : | సమృద్ధిని |
| పాంటిపకుము+అన్న | : | లక్ష్యపెట్టకు నాయనా ! |
| నాలుక తుదిన్ | : | నాలుక చివర |
| పంచాక్షరీ మంత్రమున్ | : | ఐదక్షరముల మంత్రాన్ని (నమశ్శివాయ) |
| పదిలంబు+ఒప్పన్ | : | స్థిరంగా |
| పఠింపుము+అన్న | : | వల్లించుము తండ్రీ ! |
| పరమ | : | ఉత్కృష్టమైన |
| బ్రహ్మార్థ | : | బ్రహ్మజ్ఞానము యొక్క |
| సంసిద్ధి | : | ప్రాప్తి |

ఈ+అది+చుమ్ము+అన్న = ఇయ్యది సుమ్మన్న :ఇదే సుమా కుమారా !

**తాత్పర్యం :**

వీర శైవ దీక్షగల ప్రియమైన సిరియాల కుమారా ! మనస్సులో సందేహపడవద్దు. మా యందలి ప్రేమ స్నేహ వాత్సల్యములను లెక్కచేయవద్దు. నాలుక చివర నమశ్శివాయ మంత్రాన్ని వల్లెవేయుము. శ్రేష్ఠమైన బ్రహ్మజ్ఞానమును పొందుట అంటే ఇదే సుమా !

**ప. 119**

కందక గాజువాఱక వికాసము దప్పక మందహాసని
ష్యందము చెక్కు టద్దముల జాఱక నెమ్మది నిద్రవోవు న
ట్లందము నొందె ధాత్రి సిరియాల కుమారుని వక్త్రచంద్రు డా
నందము నొందె నప్పు డెలనాగ మనంబును భర్త చిత్తమున్.

**సందర్భం :**

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| సిరియాల కుమారుని | : | కుమారుడైన సిరియాలుని యొక్క |
| వక్త్ర చంద్రుడు | : | చంద్రుని వంటి ముఖం |
| కుందక | : | వాడక |
| గాజు+పాఱక | : | కాంతి కోల్పోక |

| | | |
|---|---|---|
| వికాసము | : | తెలివి |
| తప్పక | : | వీడక |
| మందహాస | : | చిఱునవ్వనెడి |
| నిష్యందము | : | ప్రవాహము |
| చెక్కు+అద్దములన్ | : | అద్దాల వంటి చెక్కిళ్ల నుంచి |
| జాఱక | : | తొలగిపోకుండ |
| నెమ్మదిన్ | : | హాయిగ |
| నిద్రపోవునట్లు | : | నిద్రపోతున్నట్లు |
| అందమున్ | : | అందాన్ని |
| ఒందెన్ | : | పొందాడు |
| అప్పుడు | : | అప్పుడు |
| ఎలనాగ | : | స్త్రీ యొక్క (తిరువెంబనాంచి యొక్క) |
| మనుంబును | : | మనస్సు |
| భర్త | : | భర్త యొక్క (చిఱుతొండనంబి యొక్క) |
| చిత్తమున్ | : | మనస్సు |
| ఆనందమున్ | : | సంతోషాన్ని |
| ఒందెన్ | : | పొందాయి. |

**తాత్పర్యం :**

కుమారుడైన సిరియాలుని చంద్రుని వంటి ముఖం వాడిపోక, కాంతి విహీనంకాక, తెలివిదప్పక, చిరునవ్వు అద్దాల వంటి చెక్కిళ్ళ నుంచి తొలగక నేలమీద హాయిగా నిద్రపోతున్నట్లు అందంగా ఉంది. అప్పుడు తిరువెంగనాంచి మనస్సు, చిఱుతొండనంబి మనస్సు సంతసించాయి.

**ప. 135**

అత్తన్వంగి సమస్త దిక్కులను పర్యాయక్రమం బొప్పగా
నొత్తెం జిన్ని కుమార ! రార యని యత్యుచ్చైశ్రుతిం జీరినన్
చిత్తం బుబ్బగ వచ్చె బాలుడు మహా శీఘ్ర ప్రచారంబునం
దత్తద్వ్యంజన పాక గంధ్యవయవ స్థాన ప్రతానంబుతోన్.

**సందర్భం :**

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| ఆ+తన్వంగి | : | ఆ స్త్రీ (తిరువెంగనాంచి) |
| పర్యాయ | : | ఒకదాని పిమ్మట ఒకటిగా |
| క్రమంబు | : | పద్ధతి |
| ఒప్పగాన్ | : | ఒప్పునట్లుగ |
| సమస్త దిక్కులను | : | అన్ని దిక్కులందూ |
| అతి | : | మిక్కిలి |
| ఉచ్చైః | : | పెద్దదైన |
| శ్రుతిన్ | : | ధ్వనితో |
| చిన్ని కుమార | : | ఓ చిన్ని కుమారా ! |

| | | | |
|---|---|---|---|
| | రార | : | రమ్మ |
| | అని | : | అని |
| | ఒత్తెన్ | : | ఊ ఁదెను (అనెను) |
| | చీరినన్ | : | అట్లు పిలువగనే |
| | మహా | : | గొప్పదైన |
| | శీఘ్ర | : | వేగం |
| | ప్రచారంబునన్ | : | నడకతో |
| - | తత్+తత్ | : | ఆ, ఆ |
| | వ్యంజన | : | కూరల తోడి |
| | పాక | : | వంట యొక్క |
| | గంధి | : | వాసన కల |
| | అవయవ | : | అవయవాల యొక్క |
| | స్థాన | : | ప్రదేశాల యొక్క |
| | ప్రతానంబుతోన్ | : | సమూహంతో |
| | చిత్తంబు | : | మనస్సు |
| | ఉబ్బగన్ | : | ఉప్పొంగేట్లుగా |
| | బాలుడు | : | పిల్లవాడు (సిరియాళుడు) |
| | వచ్చెన్ | : | వచ్చాడు. |

**తాత్పర్యం :**

తిరువెంగ నాంచి వరుసగా అన్ని దిక్కుల వైపునకు మళ్ళీ చిన్ని కుమార ! రార ! యని పెద్ద గొంతుతో పిలిచింది. అలా పిలిచినంతనే కూరలు మొదలగు వంట యొక్క వాసనకల అవయవ ప్రదేశ సమూహంతో వేగంగా నడుస్తూ మనస్సు ఉప్పొంగేట్లు బాలుడు వచ్చాడు.

**ప. 136**

రక్షా పాండురమైన దేహము నహిగ్రైవేయమున్ కంధరా
కుక్షిం గప్పును ఁబ్రస్ఫురద్ఘన జటాకోటిన్ శశాంకార్థముం
జక్షుః పద్మము తోడ ఫాలతలమున్ సంధిల్ల శంభుండు ప్ర
త్యక్షంబయ్యె సిరాలు తండ్రికి హృదాహ్లాదంబు సంధిల్లగన్.

**సందర్భం :**

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| రక్షా | : | విభూతిచే |
| పాండురము+ఐన | : | తెల్లనైన |
| దేహమున్ | : | శరీరమూ |
| అహి | : | పాము అను |
| గ్రైవేయమున్ | : | కంఠాభరణమూ |
| కంధరా | : | కంఠం యొక్క |
| కుక్షిన్ | : | మధ్య భాగంలో |
| కప్పును | : | నలుపును |

| | | |
|---|---|---|
| ప్రస్ఫురత్ | : | మిక్కిలి ప్రకాశిస్తున్న |
| ఘన | : | దట్టమైన |
| జటా | : | జడల యొక్క |
| కోటిన్ | : | సమూహంలో |
| శశాంక+అర్థమున్ | : | అర్థ చంద్రుడు |
| చక్షుః పద్మము తోడన్ | : | పద్మము వంటి కన్నులతో (మూడో కంటితో) |
| ఫాలతలమున్ | : | నుదుటి ప్రదేశము |
| సంధిల్లన్ | : | కూడుకొనగా |
| శంభుండు | : | ఈశ్వరుడు |
| సిరాలు తండ్రికిన్ | : | సిరియాలుని తండ్రి అయిన చిఱుతొండనంబికి |
| హృత్+ఆహ్లాదంబు=హృదాహ్లాదంబు | : | హృదయానందం |
| సంధిల్లన్ | : | కలుగునట్లుగా |
| ప్రత్యక్షంబు+అయ్యెన్ | : | సాక్షాత్కరించాడు |

**తాత్పర్యం:**

విభూతితో తెల్లనైన శరీరమూ, పాము కంఠాభరణమూ, కంఠ మధ్యమున నలుపూ, ప్రకాశించే పెద్ద జటా జూటంలో అర్థ చంద్రుడూ, పద్మంలాంటి కంటితో నుదురూ కూడిన పరమేశ్వరుడు చిఱుతొండనంబికి హృదయానందం కలిగేట్లు ప్రత్యక్షమయ్యాడు.

### 1.10.3 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. ఇది యెందుం గల్గనే యిద్ధరన్?**

**పరిచయం :**

ఈ వాక్యం కవి సార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతమైన హరవిలాసమను కావ్యంలోని ద్వితీయాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన చిఱుతొండనంబి కథ లోనిది. (ఇది అన్ని సందర్భ సహితవ్యాఖ్యల తరువాత రాయండి)

**సందర్భం :**

కపటపు జంగమ దేవి రూపమున పదహారు సంవత్సరాల పచ్చిబాలెంతరాలుగా వచ్చిన పార్వతీదేవి తిరువెంగనాంచితో పల్కిన పల్కులివి.

**వివరణ :**

నగరంలోని రాజవీధులలో అన్ని సంధుల త్రోవలలోను ప్రజలు 'మహాపాప' మంటూ అనుకొంటున్నారు. అది నిజమో కాదో గాని, మీరు కఱకుదనంతో కన్నబిడ్డ గొంతుకోసి ఒక యోగికి ఆహారంగా చేయదలచారట గదా ! అని అంటూ ఇది ప్రపంచంలో ఎక్కడైనా ఉందా అని అన్నది.

కన్న కుమారుని చంపడం లోకంలో ఎక్కడైనా ఉందా ! అని అర్థం. లేదని భావం.

**2. ఆవగింజంత భూతివైనలది కొనిన, వెలది గుమ్మడి కాయంత వెట్టిపుట్టు.**

**పరిచయం :**

**సందర్భం:**

కపటపు జంగమదేవి రూపంలో పదహారేళ్ళ పచ్చిబాలింతరాలుగా వచ్చిన పార్వతీదేవి తిరువెంగనాంచితో పల్కిన పల్కులివి. ఆహారంగా సుతుని (జంపుట తగదని చెప్పి ఈ మాటలన్నది.

వివరణ :

కొంచెంగా విభూతి వ్రాసుకొంటే విపరీతంగా వెఱ్ఱిపుడుతుంది అని భావం. అవగింజంత భూతి గుమ్మడి కాయంత వెఱ్ఱి అనేది ఒక చక్కని సామెత.

**3. మగవాడో మ్రానో యనుమాట నేటి మాటయె చెపుమా?**

**పరిచయం:**

సందర్భం :

కపటపు జంగమదేవి రూపంలో పదహారేళ్ల పచ్చిబాలింతరాలుగా వచ్చిన పార్వతీదేవి తిరువెంగనాంచితో పల్కిన పల్కులివి. మీ మగనికి కన్నులు కన్పించవు కాబోలు. నీ బిడ్డను చంపుట కత డెవడు ? అని, యీ మాటలన్నది.

వివరణ:

మగవాడా మ్రానా-మగడా మొద్దా అన్న లోకోక్తిని సందర్భ శుద్ధిగా ప్రయోగించినాడు శ్రీనాథుడు. కొడుకును చంపబూనిన వారి మనసును మరలించుటకు చేసే ప్రయత్నానికి ఉపకరించిన దీ ప్రయోగం.

**4. శణార్థుల అర్థ ప్రాణంబులు శివాధీనంబులు.**

పరిచయం:

సందర్భం :

కపటపు జంగమదేవి రూపంలో పదహారేళ్ల పచ్చిబాలింతరాలుగా వచ్చిన పార్వతీ దేవి తిరువెంగనాంచితో చిఱుతొండనంబి నిజపుత్రునిచంపటం తప్పని చెప్పగా ఆమెతో తిరువెంగనాంచి చెప్పిన పల్కులివి.

వివరణ :

శ˘ణుకోరే వారి సంపద, ప్రాణం శివుని అధీనాలు అని అర్థం. మగడొనర్పబోయే పని తగవు మాలినది కాదని తిరువెంగనాంచి తీర్మానించింది. భగవంతుడిచ్చిన వానిని భగవంతునికే అర్పించడం; మగని చర్యను సమర్థించడం ఇందు కన్పిస్తుంది. అనన్య శివభక్తి ఆమె మాటలో ప్రకటితమైంది.

**5. గురులు మీరే మిమ్ము ప్రార్థించెదన్.**

**పరిచయం :**

సందర్భం :

భైరవ యోగికి తనను పలల పాకంగా పెట్టబోవు జననీ జనకులనుద్దేశించి వారిని ఓదారుస్తూ సిరియాళు డన్న మాటలివి. తనకు సంసారభ్రమ మేమాత్రం లేదని, వైక్లబ్యం వద్దనీ, హింసాక్లేశం మానండనీ పల్కి ఈ మాటలన్నాడు.

వివరణ :

ఇందు సిరియాళుని మాతృభక్తి, పితృభక్తి, దైవభక్తి, శైవాచార రక్తి వ్యక్తమవుతున్నాయి. 'గురులు' అను ప్రయోగం విశేషం. తండ్రి గురుశబ్ద వాచ్యుడు. గురువులలో మొదటి గురువు తల్లి. ఈ ప్రయోగం ఈ సందర్భంలో జననీజనకులనే అర్థాన్ని గర్భీకరించుకొన్నది.

**6. ఇవిగో నిజపుత్ర నిసర్గమోహముల్ !**

పరిచయం :

సందర్భం:

చిఱుతొండనంబి దంపతులు తమ కుమారుడైన సిరియాలుని చంపి వండి వడ్డించారు. అప్పుడు భైరవ యోగిరాజు ఆ మాంసంతో తలలోని మాంసం లేదని చూచి తల మాంసాన్ని కూరలుగా చేయకపోతివి గదా ! అని యీ మాటలను చిఱుతొండనంబితో అన్నాడు.

వివరణ:

తమ పుత్రులందు సహజమైన మోహమంటే ఇదిగో ఇట్లానే ఉంటాయి. పుత్రుల యందు సహజమైన ప్రేమ ఉంటుంది. కాని భక్తులు వీని కతీతంగా ఉండాలి. అని చిఱుతొండనంబిని పరీక్షించడానికి పరమశివుడిలా అన్నాడు.

**7. ఇందఱ (గొని పోయి తేని వత్తు !**

**పరిచయం :**

**సందర్భం :**

చిఱుతొండనంబి దంపతుల భక్తి తాత్పర్యాలకు ప్రీతి నొంది ప్రసన్నుడైన పరమేశ్వరుడు వారిని శరీరాలతో కైలాసానికి రమ్మని అనుగ్రహించిన సందర్భంలో పరమేశ్వరునితో చిఱుతొండనంబి పల్కిన పల్కులివి.

**వివరణ:**

చిఱుతొండనంబి పరమభక్తుడు. భక్తుడు స్వార్థరహితుడు, పరహితరతుడు. అందుచేతనే తనకొక్కనికే లభించిన అదృష్టాన్ని అందరకు పంచడానికి ఆలోచించాడు. ఇక్కడ ఏడువాడల కులం వారితో జీవిస్తున్నాను. వారు గూడా వీర మహేశ్వరా బార పరులే. ఇందరిని తీసుకొని పోతే నేను కూడా కైలాసానికి వస్తానని చిఱుతొండనంబి భక్తుని లక్షణ మెట్టిదో చాటడమే గాక భగవంతుని భక్తి పరాధీనతను ప్రకటించాడు.

డాక్టర్. శ్రిష్టి చంద్రమౌళి శర్మ ఎం.ఏ., పిహెచ్.డి
రీడర్ & ప్రిన్సిపాల్
ఎస్.వి.కె.పి. డిగ్రీ కళాశాల,
పొదిలి,
ప్రకాశం జిల్లా.

ఖండం - 1 ప్రాచీన పద్యభాగము

# చిఱుతొండ నంబి కథ

## పాఠం - 11

1. 11. 0 : పరిచయం

1. 11. 1 : ఉద్దేశం

1. 11. 2. : పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు.

**1. 11. 0 పరిచయం :** శ్రీనాథ కృతమైన హరవిలాసములోని చిఱుతొండనంబి కథకు సంబంధించిన అనేకాంశాలు తెలుసుకొన్నారు. ఇప్పుడు అందులో పరీక్షకురాదగిన ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొంటారు.

**1. 11. 1 ఉద్దేశం :** ఆయా ప్రశ్నలకు సమాధానాలు రాయడం చదివిన అంశాలను జాగరుకతతో తగిన రీతిలో ఎంచుకోవడంలో మీవివేచన పెరుగుతుంది. సముచితంగా రాయడం వల్ల పదజాలం ప్రాముఖ్యమూ, వాక్యనిర్మాణ పద్ధతీ తెలుస్తాయి. వ్యాసరచనారీతి తెలుస్తుంది.

## 1.11. 2 పరీక్షకు రాదగిన ప్రశ్నలు-సమాధానాలు :

**1. చిఱుతొండనంబి దంపతుల శివభక్తిని వర్ణించండి.**

**లేదా**

**పార్వతీ పరమేశ్వరులు చిఱుతొండనంచి భక్తిని పరీక్షించి, అనుగ్రహించిన విధం తెలుపండి.**

చిఱుతొండనంబి కంచి నివాసి. నిరంతర శివసేవా విరాజి. వీరశైవ వ్రతాచారపరుడు. పూర్వజన్మలో తుంబురుడు, అతని భార్య తిరువేంగనాంచి పూర్వజన్మలో అప్సరోభామిని. వారి కుమారుడు సిరియాలుడు గతజన్మలో కుమారస్వామి. చిఱుతొండనంబి నిత్యమూ జంగాలకు భోజనం పెట్టనిదే తాను తినడు. అది ఆయన నియమం.

ఒకనాడు ఒక వృద్ధశివయోగినీ, అతని భార్యను భోజనాని కాహ్వానించాడు. కొడుకుని చంపి వండి వడ్డించి, ఆ పంక్తిలో చిఱుతొండనంబి, అతని కుమారుడు కూర్చొని తింటే తాముకూడా తింటామని వృద్ధశివయోగి తన నియమాన్ని చెప్పాడు. చిఱుతొండడు సరేనని భార్యకీ విషయం చెప్పి వానినింటికి తెచ్చాడు. ఆ వృద్ధదంపతులే పార్వతీపరమేశ్వరులు.

పార్వతీదేవి తన వేషం మార్చి పదహారేళ్ల పచ్చిబాలింతరాలుగా కపటవు జంగమదేవి రూపంలో వచ్చి తిరువెంగనాంచిని చేరి తన బిడ్డకు పాలుపోయమంది. పాలుపోయడం వల్ల తిరువెంగనాంచిలో పుత్రవాత్సల్యం మిక్కుటమై పుత్రుని చంపే యత్నం మానుకోవాలని అలా అడిగింది. జంగమారాధనమేతప్ప మరేమి పట్టని తిరువెంగనాంచి ఏ మాత్రం చెదరక యథాలాపంగా పాలుపోసింది. కొడుకును చంపడం, ఒక దుర్నిర్వాణి అయిన జోగికి భోజనంగా పెట్టడం పాపమంటూ నగరమంతా అనుకొంటున్నది, ఇది ఎక్కడైనా ఉండదనీ, నీ కొడుకు చంపటానికి అతడెవడు ? అతడు మగమడా? మ్రానా ! అని తిరువెంగనాంచితో పలికింది. శివునకు శివయోగికీ తేడా లేదని, శివుడేకర్త, శివుడే భోక్తఅని; దీనికి చింతించాల్సిన అవసరం లేదని తిరువెంగనాంచి పార్వతికి బదులిచ్చింది.

చిఱుతొండనంబి వచ్చి భార్యను గురువుల ఇంటికి వెళ్ళి కుమారుని తెమ్మన్నాడు. వడుగుచేసి వెంటనే ముక్తికన్యతో కొడుకుకు వివాహం జరిపించాలన్నాడు. ఆమె గురువుల ఇంటికి వెళ్ళి కొడుకును తెచ్చింది. సిరాలునికి తలంటి స్నానం చేయించి, అలంకరించి త్రిపుండ్రేలు దిద్ది తల్లిదండ్రులిట్లన్నారు. కుమారా! ఒక శివయోగి చేసే పాశుపతివ్రతచర్యలో చివరి భోజనానికై నిన్ను మాంసాహారంగా వండి పెట్టుతున్నాము. సంసారాన్ని వదలలేని బాధ నీలో లేదుగదా ! అని అనగానే సిరియాలుడు నాలో అలాంటిది లేదు. మీ వంశమే? అటువంటిది గదా ! నేను ఆమాయమహా యోగికి మాంసాహారమౌతాను. మీరేమి చింతించకండి; అని వీరశైవవ్రతాచారమార్గ గౌరవాన్ని ప్రకటించాడు. చంపడానికిచ్చగించే తల్లిదండ్రులకు, చావడానికొప్పుకొనే పిల్లవాడికి ఆ విషయంలో తేడాలేనేలేదు. అది వారి శివభక్తి.

పాలిచ్చునట్లుగా పసిబిడ్డని తన తొడలపై పడుకోబెట్టుకుంది తిరువెంగనాంచి. పరిచారికయైన చందనిక అటిక పట్టుకుంది. చిఱుతొండనంబి కత్తి పదునుగా నూరాడు. ముప్వురు సిరియాలునితో ఇలా అన్నారు. "మనస్సులో సందేహించకు నాయానా ! మా మీద ప్రేమను స్నేహాన్ని, వాత్సల్యాన్ని లెక్కపెట్టవద్దు బిడ్డా ! నాలుక చివర నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని పఠించు కుమారా! ఓ వీరశైవవ్రతా ! సిరాలా ! ఇదే బ్రహ్మార్థ సిద్ధి సుమా !" అని పల్కి శివార్థమనే నమ్మికతో సిరియాలుని మెడపై కత్తిమోపాడు. తల తెగిపడింది. నమశ్శివాయ మంత్రాన్ని పఠిస్తున్నది. సిరాలుని ముఖం కాంతిహీనం కాలేదు. చిఱునవ్వు జాలువాఱుతూనే ఉంది. ఆ దంపతులు ఆనంద పరవశులైనారు. ఇది వారి శివభక్తి పరాకోటికి నిదర్శనం.

మిరియాలు, ఉల్లి, పసుపు, మెంతి, ఇంగువ, జీలకఱ్ఱ, చింతపండు, లవంగం, నేయి మొదలైనవి కలిపి అనేక రకాలుగా ఆ స్త్రీలు సిరియాలుని పాకంచేశారు. మాంసంలోని నీరు తీసివేసారు. సన్నగా తరిగి జుఱ్ఱుకొనడానికి వీలుగా వండారు. మజ్జగల ఎముకలతో నెత్తుటి చారుకాచారు. క్రొవ్వుతో తాలింపుపెట్టారు. వడియాలు సిద్ధం చేసారు. భోజన పాత్రలను భోజనశాలలోనికి చేర్చారు. దేవతార్చనకు దీపధూపాదుల నమర్చారు. సర్వం సిద్ధంచేశామని భార్యచెప్పగానే చిఱుతొండనంబి వృద్ధయోగిని అతని గ్రుడ్డిఅవ్వను తెచ్చి కాళ్ళు కడిగాడు.

అంత లేతా, అంత ముదురూ కాని అరటి ఆకు నడిమియానే తీసి పరచాడు. అభిఘరించారు. పాయసం, చెరకురసం, ఆవుపాలు, తేనె, నెయ్యి పెరుగు మొదలుగు అనేక శాకపాకాలు గలిగిన కొడుకు మాంసంతోడి భోజనాన్ని సర్వరుచి సమంచితంగా ఇద్దరికీ వడ్డించారు.

అప్పుడా శివయోగి ఆ మాంసపు కూరలలో తలమాంసం లేనందుకు అభ్యంతరం చెప్పి, నీరసమాంసాన్ని తిననన్నాడు. చూశావా! నీలో పుత్రవ్యామోహం పోలేదుగదా ! అన్నాడు. మా వ్రతం చెడిపోయిందన్నాడు. ఇక మా పారణ ఎట్లన్నాడు. చిఱుతొండనంబి భయపడ్డాడు. తిరువెంగనాంచి ముఖాన్ని వెలవెల బోతూచూశాడు. పేచీల మారి యోగుల పద్ధతి తెలిసిన చందనిక జాగ్రత్తపడి తలమాంసాన్ని వండి ఉంచిన దాన్ని తెచ్చి ముందట బెట్టింది. తబిసి మనసు బాధపడకుండా వడ్డిస్తానని వడ్డించింది. వారిభక్తిని పరీక్షించడానికి వచ్చినవారు గనుక శంభుడు భుజింపక ఓ పరమపుణ్యా ! అని చిఱుతొండనంబిని సంబోధించి అతనిని గూడా పంక్తిలోనికి రమ్మన్నాడు. అతడు రాక తనకు చేయాడదన్నాడు. ఒక్కడుగా కూడు కుడువరాదన్నాడు. ఇది వేద విహితమైనదన్నాడు. ఇంకో భోజన నియమాన్ని పెట్టాడు. పిన్నవాడు బంతి భోజనం చేయకపోతే కూడు నోటికి బోదన్నాడు. అందుచే కుమారుని పిలిపించవలసిదని పరమేశ్వరుడు చిఱతొండనంబికి చెప్పాడు.

అప్పుడు చిఱుతొండనంబి దేవా ! మీరు ముందే శెలలిచ్చారు. నేను మర్చిపోలేదు. నాకు కొడుకింకను గలడు. వాడాడుకోటానికి వెళ్ళాడో, చదువుకోటానికి వెళ్ళాడో ! పిలిపిస్తాను. వానికోసం ఎదురుచూసేలోపు కూరలు చల్లారిపోతాయి. కాబట్టి భుజించండి అని అన్నాడు.

అంత నాయోగి చిఱుతొండనంబితో ఇట్లన్నాడు. నీ భర్యను గొంతెత్తి కేకవేసి బాలుని పిలువమను. వస్తే అందరం తిందాము. రాకపోతే నేను ముసలి అవ్వతింటాములే. నీ శ్రమను వృథా చెయ్యను అని అనగానే తిరువెంగనాంచి అన్ని దిక్కులను పర్యాయక్రమం తప్పక 'రారా కుమార !' అని కేకవేసింది. ఆయా వ్యంజనపాక ప్రదేశాలతో సిరియాలుడు నడుస్తూ మహావేగంగా వారికి సంతోషకరంగా వచ్చాడు. ఇది వారి భక్తి తత్పరతకు నిదర్శనం.

విభూతితో తెల్లని దేహంతో, పాపహారంతో, మెడకప్పుతో, జటాజూటంతో, అర్ధచంద్రునితో, నొసలి కంటితో పరమేశ్వరుడు వారికి సాక్షాత్కరించాడు. భయభక్తి తాత్పర్యాలతో వానిని వారందరూ స్తుతించారు. పరమేశ్వరుడు కరుణించి వారిని సశరీరంగా కైలాసానికి రమ్మన్నాడు. కాని చిఱుతొండడంగీకరించలేదు. ఇన్నాళ్ళు వీరశైవవ్రతంతో కలసిమెలసి ఉన్న ఈ ఏడువాడల కోమటులను కూడా తీసికొని వెళ్ళే పక్షంలోవస్తానన్నాడు. లేకపోతే మరలిపొమ్మన్నాడు.

చిఱుతొండనంబి శివభక్తికి, వీరమాహేశ్వరాచార నిష్ఠకు కరుణించిన భగవంతుడు చిఱుతొండనంబి కోరిన వరాన్నిచ్చాడు. ఇందు చిఱుతొండనంబి దంపతుల శివభక్తి పరాయణత్వము పరమేశ్వరుని భక్తిపరాధీనత, భగవదనుగ్రహప్రాప్తి స్పష్టమవుతాయి.

2. చిఱుతొండనంబి - తిరువెంగనాంచి - సిరియాలుడు వీరి గుణశీలాలను వివరించండి.

చిఱుతొండనంబి, తిరువెంగనాంచి దంపతులు. వారి కుమారుడు సిరియాలుడు. మాయామహాయోగికై వీరశైవ వ్రతాచార మార్గ గౌరవంతో కొడుకును చంపడానికి అంగీకరించిన తల్లిదండ్రులు వారు. అందుకోసమే చావటానికి సిద్ధమైన కుమారుడు సిరియాలుడు. ఇది వారి గుణశీలాలకు మూలం.

చిఱుతొండనంబి పూర్వజన్మలో తుంబురుడు. దుర్వాసుని శాపం వల్ల కంచిలో వైశ్యకులంలో చిఱుతొండనంబిగా జన్మిస్తాడు. నిత్యజంగమారాధకుడు. వీరశైవవ్రతాచార శీలి. ఇరుగు పొరుగుల వారల భాగ్యసంపదలు అభివృద్ధి చెందాలనే తలంపుకలవాడు. అందువలననే "పొలుపెసలారగా నిరుగు పొర్గుల వారల భాగ్యసంపదకు; కుల మభివృద్ధి చెంద మన కూర్మినందను పెండ్లిసేయగా వలయు..... ముక్తి కన్యతో'' అని అన్నాడు.

వీరశైవవ్రతాచార పాలనమే వారిజీవన వ్యాపారము. పాశుపతవ్రత చర్యతీరున భైరవయోగికి కుమారుని పలలపాకంగా చేయడానికి సంసిద్ధుడయ్యాడు. భక్తుడు శివుని సొమ్మేయను విశ్వాసం గలవాడు చిఱుతొండనంబి. కొడుకును చంపుట పందెంలో గెలిచినట్లు భావించాడు. అప్పు తీర్చినట్లానందించాడు.

భోజనానికి తెచ్చిన వృద్ధయోగి పాదాలను కడగటం, ఆ నీటిని గొనటం వాని భక్తిని తెలుపుతాయి. భోజనానికి కూర్చున్నయోగి తలమాంసం లేదని, ఇకతాను తిననని అనగానే చిఱుతొండనంబి భయపడ్డాడు. వెలవెల బోయాడు. ఇది యాతని దీనావస్థను తెలుపుతాయి. వ్రతభంగాన్ని ఓర్చుకోలేనివాడు గాను, అతిథిమర్యాదలలో లోపాన్ని తట్టుకోలేనివాడు గాను కనబడతాడు.

అతిథి భోజనం చేయడేమో అన్న బాధతో చిన్న అబద్ధంకూడా ఆడాడు చిఱుతొండనంబి. ఇది అతని అతిథిమర్యాదకు నిదర్శనమే కాని అబద్ధమాడాడని అనుకోరాదు. "నాకుంకొడుకింకనుం గలడు వాడాడబోయెనో చదువబోమెనో అంటాడు'' "ధర్మంయో బాధతేధర్మః నస ధర్మ : కుధర్మతత్'' అనునది ఇక్కడ ప్రమాణం. నిజం చెప్పడమనే ధర్మాన్ని ఆచరిస్తే అతిథి భోజనం చేయడమే ధర్మాన్ని బాధిస్తుంది. అందుకే చిఱుతొండనంబి అబద్ధమాడినా అది ధర్మమే అవుతుంది.

చిఱుతొండనంబిలో స్వార్థం లేదు. తనను సశరీరంగా శివుడు కైలాసానికి రమ్మంటే తనతో ఇన్నాళ్లు వీరశైవ వ్రతం చేస్తూ కంచిలోనున్న తోటి కోమటులను కూడా తీసికొని పోతే తానూ వస్తానన్నాడు. దానికి శివుడామోదించాడు. ఇలా పరమశివుని కరుణకు పాత్రుడైన పరమభక్తుడు చిఱుతొండనంబి.

**తిరువెంగనాంచి :**

తిరువెంగనాంచి పూర్వజన్మలో అప్సరోంగన. చిఱుతొండనంబి యిల్లాలు. సిరియాలుని తల్లి. భర్తృచిత్తానుసార ప్రవర్తనైకశీలి. శూలిభక్తిపాయని మగనికి తగ్గ యాలు.

పుత్రవాత్సల్యం నెలకొల్పి కొడుకును చంపు పనికి ఆటంకము కల్పించి దయ పుట్టించడానికి వచ్చిన పార్వతీదేవి మాటలకు చెదరక సమాధానం చెప్పినది. నిర్వికారమైన ఆకారంతో మాటాడినది. బిడ్డకు పాలను ఎప్పటిలాగే పోసింది కాని మనసు మారలేదు. ఆమె మాట్లాడిన మాటలలో శివభక్తేకాని అన్యం లేదు. శివునకు శివయోగికి తేడాలేదన్నది. అంతా శివాధీనమన్నది. దీనిని బట్టి పుత్రవాత్సల్యం కన్న శివభక్తి గొప్పదని ఆమె మతం.

భర్త చిత్తానుసారం నడచుకొనే భార్య తిరువెంగనాంచి. భర్త చెప్పగనే గురుగృహానికేగి కొడుకును తెచ్చింది. తలంటి స్నానం చేయించింది. పాలిచ్చునట్లుగా తొడలపై పడుకోబెట్టుకొంది. కొడుకు శిరం భూమిపై పడగానే ఆనందించింది. ఇది శివభక్తికి పరాకోటి. సిరాలుని మాంసాన్ని చక్కగావండింది. షడ్రసోపేతంగా వండి సర్వాయితం చేసి మగనికి చెప్పింది. మీ కుమారుని పిలువవలసినదని యోగి అనగానే పతి అనుమతితోనే గొంతెత్తి పిలిచింది. ఆ పిలుపులో ఆప్యాయత నొలకబోసింది. తన కొడుకు గణగణాలను వర్ణించింది. అందులో కూడా వీరశైవవ్రతాసక్తి ప్రకటించింది. రారా ! మహాఘోరవీరశైవాచార ! అని అన్నది. పతివ్రతగా, పశుపతిసేవారతగా, నిశ్చలమతిగా తిరువెంగనాంచి గోచరిస్తుంది.

**సిరియాలుడు :**

కుమార స్వామియే చిఱుతొండినంబి. తిరువెంగనాంచి దంపతుకు సిరియాలుడై జన్మించాడు. అతడు వైశ్యవంశమనే సముద్రానికి చంద్రుని లాంటివాడు. వికసించిన పద్మవంటి కన్నులు గలవాడు. మహాఘోర వీరశైవాచారపరుడు. గొప్ప ఉదారగుణ స్వభావుడు. పిల్లలలో సింహశ్రేష్ఠపు పిల్లవంటివాడు. బుద్ధిలో బుద్ధుని వంటివాడు. నిస్సారమైన సంసారానికి దూరంగా ఉండే గుణం కలవాడు. అందమైనవాడు. చిఱుతొండనంబి దంపతులకు ప్రాణపదమైనవాడు.

తండ్రిని మించిన కొడుకు. "వీడు చిఱుతొండనంబి కంటేను అధికుండు పొమ్ము" అని పరమేశ్వరుడే మెచ్చుకొన్నాడు. మేనత్తలు పంపిన భక్ష్యాలను నేతిలో ముంచి చిన్ని చేతులు వంచివంచి తల్లిదండ్రులను ఊరించుచు తింటూ ముద్దుగొలిపాడు. సంసారం పాయజాలని విచారం లేదు గదా అని అడిగిన తల్లిదండ్రులకిచ్చిన సమాధానం సిరియాలుని తత్వానికి అద్దం పడుతుంది.

సంసారభ్రమ తనకు లేదని, మీ వంశం కూడా ఇట్టిదే కదా అన్నాడు. వంశ పరంపరాగతమైన గౌరవప్రతిష్ఠలను, మర్యాదలను, నియమాలను నిలబెట్టే గుణం కలవాడు సిరియాలుడని చెప్పవచ్చును. భయశోకాదులను మానండి అని తల్లిదండ్రులకు చెప్పాడు. అంటే సిరిమాలునికి ప్రాణభయం లేదని, శోకరహితుడని చెప్పవచ్చును. " మాంసాహారము నయ్యెదన్" అని అనడంలో చావటానికి సిద్ధంగా నున్నాడని అర్థం. హింసాక్లేశాలు మానుకొమ్మని తల్లిదండ్రులతొ అనడంలో చంపడం గూర్చి బాధచెందవద్దని భావన. అందుకే శ్రీనాథుడు తరువాత పద్యంలో "చావనియ్యకొనిన సత్పుత్రునకును, చంపనియ్యకొనిన దంపతులకు" అని వ్రాసాడు. "గురులు మీరే మిమ్ము ప్రార్థించెదన్" అని సిరియాలుడన్నాడు. మీకు నేనేమేమో చెప్తున్నాననుకోకండి. మీరు నాకు గురువులు. అందుకే మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. తనను చంపవలసిందని, చంపుతున్నామనే బాధ చెందవద్దని సిరియాలుని ప్రార్థన.

చావులోను బ్రతుకులోనూ పంచాక్షరీ మాత్రమే సిరియాలునికి తెలిసింది. అంతటి శివాచారపరుడు గావుననే మెడతెగి పడినను ఆ మంత్రమే పఠిస్తున్నది. ముఖం కందలేదు. కాంతిహీనం కాలేదు. చిరునవ్వు చెరగలేదు.

మహేశ్వరానుగ్రహంతో తిరిగి సజీవుడై, అతని కారణంగా తల్లిదండ్రులు కూడా శివకారుణ్యంతో శివసాక్షాత్కారం పొంది కైలాసప్రాప్తి పొందారు. తల్లిదండ్రులను చరితార్థులను చేసిన సత్పుత్రుడు సిరియాలకుమారుడు.

3. శ్రీనాథుని కవితా వైభవాన్ని ప్రదర్శించండి.

శ్రీనాథుని అవతరణంతో ఆంధ్రసాహిత్యం ఒక ప్రత్యేకశోభను సంతరించుకొంది. కవిత్రయం వారి కవితా మాధుర్యాన్ని రంగరించుకొని తనదైన శైలిలో మహా కావ్యాలను నిర్మించి కవిసార్వభౌముడైన మహానుభావుడు మహాకవి శ్రీనాథుడు. అనంతర కవులైన పెద్దనాదులకు అనుసరణీయుడు ఆదర్శ ప్రాయుడునైన అసమాన ప్రతిభాధురంధరుడు. బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. ఈశ్వరార్చన కళాశీలుడు.

తన కవితా రీతులను గూర్చి కాశీఖండంలో ఇలా చెప్పుకొన్నాడు.

"వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండ లీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయ భట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్క యజ్వ ప్రకారము రసా
భ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
సూక్తివైచిత్రి నొక్కొక్క మాటు". ఈ విధంగా పూర్వాంధ్రకవుల కవితా రీతులు ఉన్నాయని స్పష్టమవుతుంది.

అలాగే భీమ ఖండంలో ఇలా తెలిపాడు.

"ప్రౌఢి పరికింప సంస్కృత భాష యండ్రు

పలుకు నుడికారమున నాంధ్ర భాష యండ్రు"

అలాగే - "హరచూడా హరిణాంకవక్రతయు, కాలాంతః పురచ్చండికా

పరుషోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్

సరసత్వంబును సంభవించెననగా ..........................అనీ చెప్పుకొన్నాడు."

మొదటి పద్యంలోని ఉభయవాక్ప్రౌఢి, రెండవ పద్యంలోని ప్రౌఢి నుడికారము, మూడవ పద్యం లోని కాఠిన్యము ఒకదానితో నొకటి సమన్వయం గలవి. అనగా శ్రీనాథుని కవిత్వంలో సంస్కృత ప్రౌఢి, తెలుగు నుడికారం సమృద్ధిగా గలవని నిర్ణయం.

మొదటి పద్యంలోని రసాభ్యుచిత బంధం, మూడవ పద్యంలోని సరసత్వమూ ఒకటే. అంటే శ్రీనాథుని కవితలో రసాభ్యుచిత బంధం మరో లక్షణం.

మొదటి పద్యంలోని సూక్తివైచిత్రి, మూడవ పద్యంలోని వక్రత ఒక్కటే. శ్రీనాథుని కవితలో సూక్తివైచిత్రి యొక అంశం.

**ఉభయ వాక్ప్రౌఢి :**

శ్రీనాథుని రచనలో సంస్కృత ప్రౌఢి, తెలుగు నుడికారం సందర్భానుసారంగా సర్వాంగ సుందరంగ పోషింపబడ్డాయి.

**1. సంస్కృత ప్రౌఢి** : "తత్తద్వ్యంజన పాకగంధ్యవయవ స్థాన ప్రతానంబుతోన్", "నీహారధరాధరేంద్ర తనయాచారుస్తన ద్వంద్వ సంశ్రయ సంలగ్న పటీర కుంకుమ రజస్సంపన్న బాహాంతరా !" వంటి దీర్ఘ సమాసభరితమైన రచన శ్రీనాథుని సంస్కృత ప్రౌఢికి తార్కాణ.

**2. తెలుగునుడికారం:**

సంస్కృత ప్రౌఢి యెంత గంభీరంగా ఉంటుందో తెలుగునుడికారము అంత సొగసుగా ఉంటుంది.

" పాలచేపున గిలిగింతవాఱుటయును

మెత్తమెత్తన నఱచేత నొత్తుకొనుచు"

"కట కటా! యెట్లు తన బుద్ధి కాటిఁగలియ"

"కానండ్రు గాక కన్నులు

దానేమిట వాడు నీదు తనయునిజంపన్" లాంటి రచన శ్రీనాథుని తెలుగు ప్రౌఢకి ఒక ఉదాహరణ.

**రసాభ్యుచిత బంధం :** శ్రీనాథునిలో రసోచిత రచన సమృద్ధిగా ఉంది.

మదిశంకింపకుమన్న ! మావలని ప్రేమ స్నేహ వాత్సల్యసం

పద పాటింపకుమన్న ! నాలుకతుదిన్ పంచాక్షరీ మంత్రముం

బదిలంబొప్ప పఠింపుమన్న ! పరమబ్రహ్మార్థ సంసిద్ధియి

య్యది సుమ్మన్న ! యనుంగు నందన సిరాలా ! వీరశైవ వ్రతా !

ఈ పద్యంలో కరుణం జాలు వారుతుంది.

**సూక్తి వైచిత్రి :** కుంతకుడు చెప్పిన వక్రోక్తియే శ్రీనాథుని సూక్తి వైచిత్రి. శ్రీనాథునిలో పదపర్యాయవక్రత, రూఢి వక్రత, భావవైచిత్రి వక్రత మొదలగు అనేక వక్రతాభేదాలు గలవు.

'భక్తుడు' అనే అర్థం రావటానికి ఎన్నో శబ్దాలున్నాయి. కాని ఇచ్చట "నంబి" అని ప్రయోగించడం గమనార్హం. దానికి చిఱుతొండనంబి యనే అర్థం కూడా సరిపోతుంది.

"నంబి శివార్థమన్మనసు నమ్మిక"

ఇది పదపర్యాయ వక్రతకు ఉదాహరణ.

శ్రీనాథుని కవితలో చక్కని జాతీయాలు కన్పిస్తాయి. ఉదా:- చేయాడు; నిండుకొని మొదలైనవి. సామెతలూ సాక్షాత్కరిస్తాయి. **ఉదా:** మగవాడో మ్రానో, ఆవగింజంత భూతి, గుమ్మడి కాయంత వెట్టి "బుద్ధికాట గలియు" వంటి లోకోక్తులు దర్శనమిస్తాయి. "తొడివి" "పూసి" వంటి ప్రయోగాలు, "సర్వాయితము" "భరిత భోజనము" వంటి భావపుష్టిగల పదబంధాలు;"ఒఱగొడ్డెములు" గొడ్డేఱు, జిడ్డు పఱచు, జుఱ్ఱుపదను వంటి అందమైన తెలుగు నుడులు గోచరిస్తాయి.

శ్రినాథుని పద్యశిల్పం పరిశీలింపదగింది. సీసపద్యరచనలో అందెవేసిన చేయి. యతిస్థానం కడ పదం విరగడం, పాదాంతంతో భావం పూర్తి కావడం ఆయన సీస పద్య లక్షణాలు.

"ఫాల పట్టికయందు భస్మత్రిపుండ్రంబు
కర్ణంబులను రాగి కమ్మదోయి"

శ్రీనాథుని వర్ణనలు భావనా చాతుర్యంతో కూడి ఉంటాయి. పార్వతీదేవి జోగినిగా మారిన తీరును అమోఘంగా వర్ణించాడు. పై పద్యమే ఉదాహరణ. భోజన పదార్థాల వర్ణనను శ్రీనాథుడు బాగా చేస్తాడు. కమ్మగా గా+న కఱకుట్టు నంజుళ్ళను....." అనే పద్యం మాంసాహారం తయారీకి ఉదాహరణ. "పాయసాపూప సూప పుండ్రేక్షు ద్రాక్షా గోక్షీర మధు శర్కరాఘృతదధి రసావళీ శాకపాక శిఖరి పానకుంబులతోడ" ఇది మరో వర్ణన.

నైషధాంధ్రీకరణ విధానంలో ఒకటిగా శ్రీనాథుడు పేర్కొన్న భావోపలక్షణం ఆయన రచనలో విస్తృతం. "వడుగు చేసిన చేతడి యారకుండగా...... మన కూరిమినందను బెండ్లిసేయగా వలయు..... ముక్తి కన్యతోన్" అని వ్రాశాడు. వడుగు మొదట, ఆ తర్వాత పెండ్లి ఇది క్రమం. ఇక్కడ వడుగుచేసి చంపబోతున్నారు. అందుకే పెండ్లి ముక్తి కన్యతోన్ అని పేర్కొన్నాడు. శివార్థమైన మరణం వల్ల ముక్తి వస్తుందని భావం. ముక్తి కన్యతో పెండ్లి అంటే చంపటం అనే భావం ఉపలక్షించబడింది.

శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడు అనడానికి అనేక ఉదాహరణలు సూచించవచ్చు. ఈశ్వరుడు చిఱుతొండనంబి దంపతులకు సాక్షాత్కరించిన సందర్భంలోని " రక్షాపాండురమైన దేహము......... హృదాహ్లాదంబు సంధిల్లగన్" అన్నది, చిఱుతొండనంబి గావించిన ఈశ్వర స్తుతి ఆయన భక్తికి నిదర్శనాలు.

ఈ విధంగా శ్రీనాథుని కవిత రసహృదయ రంజకమై ఆయన కవిసార్వభౌమ బిరుదాన్ని ప్రతిష్ఠాపిస్తుంది.

**డాక్టర్. శ్రిష్టి చంద్రమౌళి శర్మ** ఎం.ఎ., పిహెచ్.డి.
రీడర్ & ప్రిన్సిపాల్
ఎస్.వి.కె.పి. డిగ్రీ కళాశాల
పొదిలి - ప్రకాశం జిల్లా

**ఖండం - 2** ఆధునిక పద్యభాగం

**పాఠం - 12** **(అ) భాగం - దేశభక్తి** - గురజాడ అప్పారావు

2. 12. 0 పరిచయం

2. 12. 1 ఉద్దేశం

2. 12. 2 పాఠ్యభాగ సందర్భం

2. 12. 3 కఠిన పదాలకు అర్థాలు

2. 12. 4 పాఠ్యభాగ వివరణ

2. 12. 5 సందర్భ సహిత వ్యాఖ్యలు

2. 12. 6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

**(ఆ )భాగం : ప్రబోధము** - రాయప్రోలు సుబ్బారావు

2. 12. 0 పరిచయం

2. 12. 1 ఉద్దేశం

2. 12. 2 పాఠ్యభాగ సందర్భం

2. 12. 3 కఠినపదాలకు అర్థాలు

2. 12. 4 పాఠ్యభాగ వివరణ

2. 12. 5 సందర్భ సహిత వ్యాఖ్యలు

2. 12. 6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు.

## (అ) భాగం : 'దేశభక్తి'

**2.12. 0. పరిచయం :-**

నవ్యకవితోద్యమానికి వెలుగుబాట చూపిన మహనీయుడు శ్రీ గురజాడ వెంకట అప్పారావు గారు. కవిత్వం ఏ కొందరి సొత్తో అనుకునే రోజుల్లో, వాడుక భాషకు పట్టాభిషేకం చేసి, 'ప్రజలకోసమే కవిత్వం' - అని నిరూపించిన మహామనీషి . డా॥. సి. నారాయణ రెడ్డి గారి "కందుకూరి సాంఘిక విప్లవమును, గిడుగు భాషావిప్లవమును తనలో సమన్వయించుకొని, సరిక్రొత్త సాహిత్య విప్లవమును లేవనెత్తిన నవయుగవైతాళికుడాయన. ఆయన చేతిచలువతో అస్పృశ్యముగా పడియున్న వాడుక భాష అందలమెక్కింది. ఆంధ్రభారతి అంతకుముందటి అలంకారభారమునుడుల్చివేసి, ముచ్చటగా ముత్యాల సరాలనలంకరించుకొన్నది. నాటకము, గేయము, వ్యాసము, కథానిక - ఆయన వాఙ్మహిమతో ఎన్నడూ లేని జవమును, జీవమును పుంజుకొన్నవి" అనే మాటలు అక్షరసత్యం.

కౌసల్యమ్మ, వెంకటరామదాసు దంపతులకు, విశాఖ జిల్లా ఎలమంచిలి తాలూకా, రాయవరంలో గురజాడ అప్పారావుగారు జన్మించారు. వీరి జననం **30-11-1861** అని కొందరు, **21-9-1862** అని మరికొందరు భావిస్తున్నా, **21-9-1862** తేదీ సరైనదని అంటున్నారు. **1882** లో మెట్రిక్ పాసయ్యారు. తర్వాత ఎఫ్.ఏ చదివారు. **1884-86** లో బి.ఏ. పూర్తయింది. **1885** లో వివాహమైంది. కాలేజీలో కొన్నాళ్లు ఉద్యోగంచేసి, డెప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్ గుమస్తాగా పనిచేశారు. కొన్నాళ్లు అసిస్టెంటు లెక్చరరుగా చేసి, విజయనగరం మహారాజా ఆనందగజపతి గారి సంస్థానంలో సంస్థాన పరిశోధకుడిగా కొన్నాళ్లు ఉద్యోగంచేసి, తరువాత రీవారాణి గారి ఆంతరంగిక కార్యదర్శిగా **1898** లో చేరారు. కొన్నాళ్లు మద్రాసు యూనివర్సిటీ 'ఫెలో'గా నియమించబడ్డారు. **1915** నవంబరు **30** న మరణించారు.

**గురజాడ రచనలు :-**

ప్రారంభంలో సంప్రదాయరీతిలో వృత్తాలలో గురజాడ రచనలుచేశారు. అవి 'మాటల మబ్బులు, పుష్పలావికలు, మెరుపులు, సుభద్ర, ఋతుశతకము'- అనేవి. కాని కాలక్రమ పరిణామంలో ఆంగ్లగ్రంథాల నెన్నింటినో చదివి జీర్ణించుకొన్నారు. కన్యాశుల్క నాటకరచన దగ్గరినుంచి, ఆ పరిణామ క్రమం మనకు గోచరిస్తుంది. వారి కొన్ని ప్రధాన రచనలు : కన్యాశుల్కం - తొలి ముద్రణ 1891, రెండో ముద్రణ 1909. పాతకొత్తల మేలుకలయికగా ముత్యాల సరాలు' రచించారు. తెలుగులో మొట్టమొదటి కథ దిద్దుబాటు. కొత్త ఛందస్సులో, కొత్త కథా వస్తువులతో సాంఘికాంశాలకు ప్రాధాన్యం ఇస్తూ, రచనలో కృత్రిమత్వం లేకుండా, వాడుకభాషలో రాయబడిన కవితలసంపుటి 'ముత్యాల సరాలు' -ఇందులో లవణరాజుకల, కన్యక, పూర్ణమ్మ, డామన్ పితియస్, దేశభక్తి, నీలగిరిపాటలు వంటి ఖండికలున్నాయి. సామాన్యులని మాన్యులనుచేస్తూ వీటిని రచించారు. 'లవణరాజు కల' లో మాలెతనాయిక, 'కన్యక'లో సెట్టికూతురు, 'పూర్ణమ్మ'లో పూజారికూతురు నాయికలు.

అస్పృశ్యతను నిరసిస్తూ, విశ్వమానవ ప్రేమను సర్వ మానవ సమానత్వాన్ని చాటుతూ -
'మంచి చెడ్డలు మనుజులందున యెంచిచూడగ రెండెకులములు - మంచియన్నది మాలయైతే మాలనే అగుదున్' - అనీ
'యెల్లలోకము లొక్కయిల్లై వర్ణభేదము లెల్ల కల్లై - వేలనెరుగని ప్రేమబంధము వేడుకలు కురియ' - అనీ,
మతములన్నియు మాసిపోవును
జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును' - అనీ భవిష్యద్దర్శనం చేశారు.

**ముత్యాల సరాలు - ఛందస్సు :-**

దీన్లో నాలుగు పాదాలుంటాయి. మొదటి మూడు పాదాలలో 3 + 4, 3 + 4 = 14 మాత్రలు, నాల్గవ పాదంలో 7 నుంచి 14 మాత్రలుంటాయి. గురజాడ వారు సంఘసంస్కరణంతో పాటు భాషాసంస్కరణను కోరుకొని వ్యావహారిక భాషలో రచనలు చేయడం వారి ప్రత్యేకత.

**2.12. 1. ఉద్దేశం :-**

గురజాడ వారి 'దేశభక్తి' అనే ఈ గేయం లో ఎల్లలు లేని విశ్వమానవ ప్రేమ, స్వచ్ఛమైన దేశభక్తి, జాతీయతాభావం మొదలైన ఆధునిక భావజాలం గోచరిస్తుంది. బంకించంద్రుని 'వందేమాతరం' - రవీంద్రుని 'జనగణమన' - ఇక్బాల్ 'సారే జహాసె అచ్ఛా' - వంటి గీతాలతో సమానమైన గొప్ప గీతమిది.

శ్రమవిలువని గుర్తించాలని, నాణ్యమైన దేశీయమైన సరుకులనుత్పత్తి చేసి, పోటీ తత్వం పెంచుకొని, విశ్వ విపణిలో మన స్థానం సుస్థిరం చేసుకోవాలని, ఆర్థికంగా దేశం పరిపుష్టం కావాలని, దేశంలో అపారమైన మానవ వనరులున్నాయని, వర్తమానంలో కర్తవ్యదీక్ష పెరగాలని, ఈర్ష్యాసూయలు దరిజేరగూడదని, జాతిమత భేదాలకు అతీతంగా, ప్రజలందరు ఐక్యమత్యంగా ఉండాలనీ, అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని ప్రబోధించారు. ఆధునిక సాహిత్యం తొలిదశలో ఇటువంటి నూతన భావజాలాన్ని ఆవిష్కరించిన మహాకవి గురజాడ. ఊహల్లో జీవించక, వాస్తవంలో బ్రతకాలనీ, తేలిక భాషలో కవిత్వం సమాజానికి దగ్గర కావాలనీ, అప్పుడే అది మనగలదనీ, ప్రజలను స్పందింపచేయగలదనీ ఉత్తమ భావాలను ప్రకటించారు గురజాడవారు.

**2.12. 2. పాఠ్య భాగ సందర్భం :-**

1885 నుంచి ఆధునిక సాహిత్యయుగం ప్రారంభమైంది. బ్రిటిషువారి పాలన వల్ల పాశ్చాత్య జీవనప్రభావం, భారతీయుల మీద బలంగా పడింది. దేశమంతా ఆంగ్లవిద్యా ప్రభావం మొదలైంది. అది ఎన్నో క్రొత్తమార్పులకు నాందిపలికింది. క్రొత్త ఆలోచనలు మొదలయ్యాయి. ముద్రణాయంత్రాల వల్ల పత్రికలు ప్రజలకు అందుబాటులోకి రావడం మొదలుపెట్టాయి. అయితే జాతీయోద్యమ ప్రభావం దేశంలో అందరిమీద పడింది. తత్ప్రభావం చేత కవులందరూ, జాతీయభావాలతో, మూఢవిశ్వాసాలను అంతంచేస్తూ ప్రజలలో దేశభక్తిని రగుల్కొల్పుతూ, పరాయి పాలనను అంతం చెయ్యాలని రచనలారంభించారు. కవిత్వంలో 'దేశభక్తి' ఒకభాగమైంది. అస్పృశ్యత, నిమ్నజాతుల ఉద్ధరణ, అక్షరాస్యత, స్త్రీ విద్యా వ్యాప్తి మొదలైనవన్నీ దీనిలో అంతర్భాగాలైనాయి. గురజాడ అప్పారావు గారు, చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు గా౹౹, రాయప్రోలు సుబ్బారావు గారు మొదలైన వారెందరో సమాజాభివృద్ధికి, ప్రజలలో చైతన్యం పెంచడానికి ఎంతో కృషిచేశారు.

దీనిలో భాగంగానే ఆధునిక భాషోద్యమంగూడా ప్రారంభమైంది. గిడుగు రామమూర్తి పంతులు గారి వ్యావహారిక భాషోద్యమం, గ్రాంథికభాషమీద పిడుగులా పడింది. కాల్పనిక వాదం, మానవతావాదం, మొదలైన వాదాలు కొత్త పోకడలకు వాకిళ్ళు తెరిచాయి. ఆధునిక సాహిత్య పరిధి చాలా విస్తృతమైంది. శైలీనవ్యత, దేశభక్తి మొదలైనవి ఆధునిక కవిత్వ లక్షణాలైనాయి.

ప్రజల్లో దేశభక్తిని ప్రబోధించి సంఘ సంస్కరణ ద్వారా సామాజిక చైతన్యం ఆశించి 'ముత్యాలసరాలు' రచించారు. అందులోనిదే 'ఈ దేశభక్తి' గేయం. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని తన నూతన భావజాలంతో సుసంపన్నం చేసిన మహాకవి గురజాడ వారు.

**2.12. 3. కఠిన పదాలకు అర్థాలు :-**

| | | |
|---|---|---|
| పొంగిపొర్లు | = | ప్రవహించు, పుష్కలంగా లభించు |
| పాటుపడు | = | కష్టపడు |
| జల్దుకొని | = | వేగిరపాటుతో |
| దేశీ సరుకులు | = | దేశంలో తయారైన ఉత్పత్తులు |
| గతము | = | జరిగిపోయిన కాలం |
| పూని | = | ప్రయత్నించి |
| స్పర్థ | = | పోటీ |
| వ్యర్థ కలహం | = | అనవసరమైన పోట్లాట |
| కలిమి | = | సంపద |
| నేర్పరి | = | నైపుణ్యం కలవాడు |
| చెట్ట పట్టాల్ | = | ఒకరినొకరు చేయి, చేయి కలుపుకుని, |
| దొడ్డవృక్షం | = | గొప్పవృక్షం |

**2.12. 4 పాఠ్యభాగ వివరణ :-**

గురజాడ వారు చక్కటి దేశభక్తి ప్రబోధం చేశారు ఈ పాఠ్యభాగంలో. నీ దేశాన్ని ప్రేమించు 'మంచి' అనేభావాన్ని పెంపొందించుకో. ప్రయోజనంలేని అనవసరమైన మాటలువద్దు. ప్రజలకు మేలు చేసే కార్యాలు తలపెట్టు. దేశంలో పాడిపంటలు అభివృద్ధి చెందేటట్లు కష్టపడు. కడుపునిండా తిండి ఉంటేనే మనిషి పుష్టిగా ఉంటాడు. అప్పుడే అతడు బలసంపన్నుడౌతాడు. మనుషులంతా ఉసూరుమంటూ నీరసంగా ఉంటే దేశం బాగుపడదు. దేశీయమైన కళలభివృద్ధి చేసుకుని, సరుకుల ఉత్పత్తిని పెంచుకోవాలి. అన్ని దేశాలు పరస్పరం వర్తక వాణిజ్య సంబంధాలు పెంపొందించుకొని, తమతమ ఉత్పత్తులను అమ్ముకోవాలి. దేశానికి ఆర్థిక పరిపుష్టి ఎంతో అవసరం. ఆర్థికంగా బలహీనమైన దేశం అభివృద్ధిచెందదు. మాటిమాటికి గత చరిత్రను ప్రస్తావించుకుంటూ, వర్తమానంలో బాధ్యతను విస్మరించకూడదు. ముందు చూపుతో ప్రగతి మార్గంవైపు పయనించాలి. స్పర్థ వల్ల విద్య, వైద్యం (పోటీ) వల్ల వాణిజ్యం అభివృద్ధి చెందుతుంది. వ్యర్థ కలహాల వల్ల ప్రయోజనం ఉండదు.

నాకు దేశాభిమానం ఉందని గొప్ప డాంబికాలు చెప్పకుండా, ప్రజలకు నిజంగా మేలుచేసి చూపించాలి. అసూయ అనే పిశాచం దేశ సంపదను శక్తి సామర్థ్యాలను కొల్లగొట్టింది. ఇతరులకు మేలుజరగాలనే భావంతో ఐకమత్యం పెంపొందించుకోవాలి. ఇతరుల సంపదను చూసి దుఃఖపడు పాపాత్మునికి సుఖం ఉండదు. ఇతరుల మేలుని తనమేలుగా భావించే ఉత్తముడికి ఎప్పుడూ మేలు జరుగుతుంది. స్వార్థపూరితమైన లాభాన్ని కొంతైనా మానుకుని ఇతరులకు సహాయపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలి.

దేశమంటే కేవలం మట్టి కాదు. అపార మేధా సంపత్తిగల మనుషులతో నిండిందే దేశం. దేశప్రజలంతా పరస్పరం ఐకమత్యంతో మెలగాలి. విభిన్న జాతులు, మతాలు ద్వేషభావాన్ని వదలి, అన్నదమ్ముల్లా మెలగాలి. మతాలు వేరైనా మనసులొకటి కావాలి. దేశమనే పెద్దవృక్షం ప్రేమ సుమాలను విరబూయాలి. మనుషులంతా కష్టించి పనిచేసి, స్వేదంచిందించి దేశసంపదనభివృద్ధి చెయ్యాలి. ఆకుల సందుల్లో కోకిల, తనగానాన్ని ప్రపంచానికి వినిపించినట్లుగా కవి అనే కోకిల తన కవితాగానంతో దేశ ప్రజలని ఉత్తేజితులను చెయ్యాలి.

జాతీయ భావాలు పాదుకొల్పి, దేశాభిమానాన్ని రేకెత్తించాలి. ఇదంతా దేశభక్తికి సంబంధించిందే. తద్వారా మనదేశం అభ్యున్నతి పథంలో పయనించగలదని గురజాడ వారు దేశభక్తి ప్రబోధం చేశారు.

**2.12.5 సందర్భ సహిత వ్యాఖ్యలు :**

1. వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్ట వోయి !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గా ు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** నాయకులు వేదికలెక్కి ఉపన్యాసాలిస్తూ శుష్క వాగ్దానాలు చెయ్యడం పరిపాటి అయిపోయింది. 'చెప్పేది కొండంత, చేసేది పిసరంత' - అన్నట్లుగా కాలపరిస్థితి, దేశపరిస్థితి మారింది. అటువంటి వారికి చురకలంటిస్తూ, డాంబికమైన వ్యర్థ ప్రేలాపనలు అనవసరమని కవి పల్కిన సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** నిష్కల్మషమైన మనస్సుతో దేశమాతను ప్రేమించాలి. మనుషుల్లో 'మంచి' తనాన్ని పెంపొందించాలి. ప్రజలకు శుష్కవాగ్దానాలు శూన్యహస్తాలూ చూపించకుండా, ఏదైనా నిర్మాణాత్మక కార్యక్రమాలు దేశాభివృద్ధికి దోహదం చేసేవిధంగా ఉండాలని కవి భావం.

2. 'తిండి కలిగితె కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయి !'

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** దేశంలో ప్రజలు దారిద్ర్య బాధనుంచి విముక్తం కావాలనీ, అందరికీ తిండి దొరకాలనీ, మంచి ఆరోగ్యమైన దేహం ఉంటేనే వాడు మంచి ఆలోచనలు చెయ్యగలడనీ, అందుకని, దేశంలో పాడిపంటలు పొంగి పొరలేటట్లుగా అందరూ కృషి చెయ్యాలని కవి ఉద్బోధించే సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** దేశంలో పాడిపంటల అభివృద్ధికి అందరూ తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలనీ, అందరికీ సమానంగా తిండి లభిస్తేనే, మనుషులు బలిష్ఠంగా ఆరోగ్యంగా ఉంటారని దానికి నీవు, నేను అనే భేదంలేకుండా అందరూ కృషి చెయ్యాలని ఈ పాదాల సారాంశం.

3. 'ఈ సురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్?'

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** దేశంలోని ప్రజలందరికీ సమానంగా తిండి, బట్ట లభ్యం కావాలని, అది ఏ కొందరికో మాత్రమే సొంతమై మిగిలిన వారు తినడానికి తిండిలేక, చెయ్యడానికి పనిలేక ఈసురోమని ఉంటే దేశం బాగుపడదని కవి హెచ్చరిస్తున్నాడు. కాబట్టి ప్రజలందరికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట ప్రాథమికావసరాలని కవి చెప్పే సందర్భం లోని దీ వాక్యం.

**వివరణ :** ఉసూరుమంటూ, నిస్సత్తువతో మనుషులుంటే దేశంలో పని గంటలు పెరగవు. పని గంటలు పెరగకపోతే ఉత్పత్తి సామర్థ్యం పెరగదు. అది లేక పోతే దేశాభివృద్ధి కుంటుపడుతుంది. అందుకని ప్రాథమికావసరాలు తీర్చుకొని, ఉత్సాహంతో దేశీయమైన విద్యలన్నింటినీ నేర్చుకుని, దేశం స్వయం పోషకత్వం కావాలి. దేశీయమైన ఉత్పత్తులు, నాణ్యతతో కూడిన సరుకులు పెరగాలి.

4. 'డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపదలబ్బవోయి' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** అన్ని దేశాలు, దేశీయంగా తమ తమ ఉత్పత్తులను పెంచుకొని, పరస్పర సహకారంతో, అవగాహనతో అన్ని దేశాలకు, అవసరాన్ని బట్టి ఎగుమతి చెయ్యాలి. తమ వస్తువులకు, ఎగుమతి చెయ్యందే దేశ సంపద పెరగదు. కేవలం పదవికోసం పాకులాడే నాయకులకు, పేరు ప్రఖ్యాతులు లభించవు. నాణ్యమైన ఉత్పత్తులు పెంచి, ఎగుమతి విధానం నిర్దిష్టంగా, నిర్దుష్టంగా అమలు చేసినప్పడే, పేరు ప్రఖ్యాతులు వస్తాయని చెప్పే సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** ప్రపంచంలోని అన్ని దేశాలు కలిసి తమతమ ఉత్పత్తులకు పరస్పరం ఎగుమతి విధానం ద్వారా అమ్ముకోవాలని, తద్వారా దేశసంపదనభివృద్ధి చెయ్యాలని, ఆ విధంగా చెయ్యలేని వారికి కీర్తి ప్రతిష్ఠలు లభ్యం కావని వారు ప్రజల మనస్సులో చిరకాలం మనలేరని కవి భావన.

5. 'మంచి గతమున కొంచెమేనోయ్' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గా ు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :-** గత చరిత్ర తలుచుకుంటూ వర్తమానాన్ని విస్మరించకూడదని గతవైభవాన్ని తలచుకుంటూ కూర్చుంటే లాభం లేదని, గతంలో మంచి కొంచెమేనని, సాధించాల్సింది ఎంతో ఉందని, కర్తవ్య హీనులు ఉంటే అభివృద్ధి సాధ్యం కాదనీ, పోటీ ప్రపంచంలో మనం వెనకపడగూడదని, అలాగైతే, వెనకనే ఉండి పోతామని కవి చెప్పే సందర్భం ఇది.

**వివరణ :-** గతంలో మంచి కొంచెమేనని, ఇంకా సాధించాల్సింది కొండంతగా ఉందనీ, కార్యశూన్యులుగా ప్రజలుండి పోరాదనీ ఏరంగంలోనూ వెనుక పడగూడదనీ, ఆ విధంగానైతే, అభివృద్ధి సాధ్యం కాదనీ కవిభావన.

6. 'పూనుస్పర్థలు విద్యలందే
వైరములు వాణిజ్యమందే !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :-** 'స్పర్థ యావవర్థతే విద్యా' అన్నది ప్రాచీన ఆర్యోక్తి. అంటే స్పర్ధ వల్ల విద్య వృద్ధిపొందుతుంది. గురజాడ వారు ఇంకొక్క అడుగు ముందుకువేసి, విద్యల్లోనేకాక, వర్తక వాణిజ్యాల్లో కూడా, స్పర్థలుండాలని భావిస్తున్నారు. అంటే పరస్పరం పోటీ తత్వం వల్లనే నాణ్యమైన ఉత్పత్తులు పెరిగి, ఎగుమతుల రేటు వృద్ధి పొందడానికి అవకాశం ఉంటుంది. తద్వారా విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుంది. దేశాలమధ్య వ్యర్థ కలహాలు అనవసరమని, కత్తివైరం తగలబడాలని, స్నేహసుహృద్భావ వాతావరణాలు పెరగాలని కవి చెప్పే సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** స్పర్థలు విద్యల్లోను, వర్తక వాణిజ్యాలలోను ఉండాలనీ తద్వారా దేశాభివృద్ధి సాధ్యమౌతుందని, స్వార్థ ప్రయోజనాల కోసం వ్యర్థకలహాలు పెంచవద్దని ఈ వాక్యాల భావం.

7. 'దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పకోయ్' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం:** దేశభక్తిని గూర్చి, దేశాభిమానాన్ని గూర్చి అతిగా మాట్లాడే కుహనాదేశభక్తులను గూర్చి కవి చెప్పే సందర్భంలోనిది.

**వివరణ :** డాంబికమైన భావాలు, ఆడంబరపు మాటలు మాట్లాడడంలో వాక్కు , క్రియకు ఎంతో తేడా చూపించే కుహనా దేశ భక్తులను గూర్చి కవి విమర్శిస్తున్నాడు. వ్యర్థ ప్రలాపాలు పలికేకన్నా, ఒక నిర్మాణాత్మమైన, ప్రజోపయోగకరమైన పనిచేసి చూపించాలని, అటువంటివారి మీదనే ప్రజలకు గౌరవం కలుగుతుందని కవి భావన.

**8.** 'ఐకమత్యం నేర్చవోయి' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం:** పరస్పర కలహాల వల్ల అనైక్యం వల్ల ఈర్ష్యాద్వేషాల వల్ల దేశ సంపద అంతా కొల్లగొట్టబడిందని ఇప్పటికైనా అనైక్య భావం వదలి, ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలని కవి ఉద్బోధించే సందర్భం ఇది.

**వివరణ :** ఈర్ష్యాసూయలు, పరస్పరద్వేషమనే పిశాచి దేశం యొక్క రక్తమాంసాలు, జీవధాతవులూ పీల్చివేసింది. అంటే దేశ సంపద కొల్లగొట్టబడింది. ఇప్పటికైనా ఒకరివల్ల ఇంకొకరికి మేలు కలగాలనే భావంతో ఐకమత్యం పెంపొందాలని కవి భావం.

**9.** 'పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయ్?

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం:** ఇతరుల సంపదకు, వైభవానికి అసూయపడి దుఃఖించే పాపాత్మునికి జీవితంలో సుఖం లేదని, అంటే అంతశ్శత్రువైన మాత్సర్యభావాన్ని వీడాలని కవి చెప్పే సందర్భంలోని దీ వాక్యం

**వివరణ :** సాధారణంగా మనిషికి ఈర్ష్యాసూయలు అధికంగా ఉంటాయి. వీటిని జయిస్తే మానవుడు మహాత్ముడౌతాడు. జయించలేని వారు జీవితాంతం మత్సర భావంతో దుఃఖపడుతూ ఉంటారు. అటువంటి పాపులకు సుఖం దూరమౌతుందని, ఇతరులకు జరిగే మేలు, తనకు కూడా మేలేనని భావించే విశాల బుద్ధికలవానికి అనేక శుభ పరిణామాలు కలుగుతాయని, కాబట్టి అసూయా భావం విడనాడాలని కవిభావన.

**10.** 'స్వంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడు పడవోయ్' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం:** కేవలం స్వలాభం కోసం జీవించక, పొరుగువాడి హితాన్ని మానవుడు కోరుకోవాలని చెప్పే సందర్భం ఇది. 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' అన్న భావం ఇందులో ఇమిడి ఉంది.

**వివరణ :** స్వలాభం మానుకుని, పొరుగువాడి అభ్యున్నతికి కొంతవరకైనా సహకరించాలని, దేశమంటే కేవలం మట్టేకాదని, ఆ మట్టిని నమ్ముకున్న మనుషులంతా ఉన్నారని, అటువంటి వారికి మేలు జరగాలని కవి భావం.

**11.** 'అన్న దమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** ప్రజలలో ఐకమత్యం పెరగాలనీ, ఈ జాతి, మత వర్ణ భేదాలు తొలగిపోవాలని కవి ఆకాంక్షించే సందర్భం లోని దీ వ్యాకం

**వివరణ :** ఆదినుంచి భారతదేశంలో అనేక మతాలు, జాతులు, కులాలూ, వర్ణాలూ ఉన్నాయి. వీరిలో వీరు పరస్పరం కలహించు కుంటూ ఉంటే, మనిషి సాంఘిక జీవనం, ఆంతరంగిక జీవనం ముక్కలౌతుంది. క్షేమంకోసం ఎన్నో మతాలు, జాతులూ ఉన్నప్పటికీ, అన్నదమ్ములను భావంతో, అంటే సోదర భావంతో ప్రజలంతా మెలగాలి. అంటే అన్ని మతాలు మూల సూత్రాలు ఒక్కటే. ఆభావం అర్థమైనప్పుడు ప్రజలతో భేదాభిప్రాయాలు సమసిపోయి సహజీవనం సంప్రాప్తిమౌతుందని కవిభావం.

12. 'దేశమనియెడు దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం:** దేశమనే పెద్ద వృక్షం ప్రేమలను పుష్పాలను వికసింప చెయ్యాలి. ఆ పుష్పాల పరిమళాన్ని ఆస్వాదిస్తూ, ఆ వృక్షం నీడలో ప్రజలంతా సుఖాన్ని పొందాలి అన్న సందర్భంలోనిది.

**వివరణ :** ప్రేమపుష్పాలను, దేశమనబడే పెద్దవృక్షం అందించాలనీ, ప్రజలంతా చెమటోడ్చి, కష్టించి పనిచేసి, దేశ సంపదనభివృద్ధి చెయ్యాలని కవిభావం. ప్రజలు సోమరులైతే దేశాభివృద్ధి జరుగదు. కేవలం హక్కులకోసం పోట్లాడుతూ, బాధ్యతలను విస్మరించరాదని, 'కష్టేఫలీ' అన్న సిద్ధాంతాన్ని ప్రజలందరూ గౌ ంచి ఆచరించాలనీ, 'కృషితోనాస్తి దుర్భిక్షమ్' అన్న దాన్ని సార్థకం చెయ్యాలని కవి భావం. శ్రమించి, కష్టించిన వాడే సుఖపడగలడని, వాడే బాధ్యత గలపౌరుడని దేశాభివృద్ధికి కారకుడని కవి భావన.

13. 'ఆకులందున అణగి మణగీ
కవిత కోకిల పలకవలెనోయి' !

**పరిచయం :** ఈ వాక్యాలు శ్రీ గురజాడ అప్పారావు గారు రచించిన 'ముత్యాల సరాలు' - అనే ఖండ కావ్య సంపుటిలో 'దేశభక్తి' అనే ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం:** కవి అనబడే కోకిల తన గానంతో పరోక్షంగా సంఘాన్ని అభ్యుదయం వైపు నడిపించాలని చెప్పే సందర్భమిది.

**భావం :** కోకిల మామిడి చిగుర్లుతిని, చెట్ల ఆకుల సందుల్లో దూరి శ్రావ్యంగా పాట పాడుతుంది. ఆ కోకిల గానానికి పరవశింపని మనస్సుండదు. అలాగే కవి అనబడే కోకిల కూడా, తన కవితా గానంతో ప్రజలను చైతన్య వంతులను చెయ్యాలి. మత్తుగా బాధ్యత మరచి నిద్రించే జాతిని కవి వైతాళికుడై తన గానంతో మేల్కొల్పాలి అని కవి భావం.

## 12.6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

1. గురజాడ అప్పారావు గా 'దేశభక్తి' ఖండికలో ప్రబోధించిన విషయాలు పేర్కొనండి? **లేదా** గురజాడవారు దేశభక్తి ద్వారా విశదీకరించిన సంస్కరణతత్వాన్ని తెలుపండి?

**సమాధానం:-**

ఆధునిక సాహిత్యయుగంలో సప్రసిద్ధి చెందిన కవి శ్రీ గురజాడ అప్పారావుగారు. తెలుగు సాహిత్యంలో కొత్త రచనా విధానానికి ఆద్యుడు గురజాడవారు. సంఘసంస్కరణ దృష్టితో వీరు రచించిన 'కన్యాశుల్కం' నాటకం బహుళ ప్రజాదరణ పొందింది. 'దేశభక్తి' అనే ఈ గేయం నాటి నుంచి నేటి దాకా జాతికి నిత్య నూతన ప్రబోధమై వెలుగొందుతుంది. ఇది కేవలం ఒక దేశానికో, ఒక కాలానికో సంబంధించింది కాదు. విశ్వమానవ గీతంగా దీనిని పేర్కొనవచ్చు. ఈ గీతం వీరి రచనలో ఆణిముత్యం వంటిది.

సాధారణంగా నాయకులు వేదికల మీద చెప్పే మాటలకు చేతలకు పొంతన ఉండదు. నాటి నుంచి కూడా ఇది సాధారణ విషయమే. అటువంటి వారికి చురకలంటిస్తూ

'సొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయి' -

అని హెచ్చరిస్తూ ప్రజలకు మేలుచేకూర్చే పనులు చిత్త శుద్ధితో చేయమని, నిజమైన దేశభక్తులు దేశాన్ని ప్రేమించి, ప్రజలలో 'మంచి' అనే గుణాన్ని పెంపొందించాలని ప్రబోధించారు. దేశంలో పాడి పంటలు సమృద్ధిగా ఉండడానికి ప్రతిఒక్కరూ ఆ దిశలో కృషి చేయాలి. కోట్లాది ప్రజలు తిండిలేక ఈసురోమని ఉంటే దేశం బాగుపడదు. పుష్టికరమైన తిండి లభ్యమైతేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అటువంటి వారే దేశాభివృద్ధికి కారకులౌతారు.

అన్ని దేశాలు కలిసి పరస్పర సహకారంతో దేశీయ ఉత్పత్తులు పెంచుకొని, వర్తకవాణిజ్యాలు అభివృద్ధి చేసుకోవాలి. గత కాలపు ఘనకీర్తిని స్మరించుకుంటూ ప్రస్తుత కర్తవ్యాన్ని విస్మరించగూడదు. గతం నుంచి వర్తమానానికి అనుభవ పాఠాలు నేర్చుకోవాలి. అదే భవిష్యత్తుకు పునాది అవుతుంది. ప్రజలందరు చైతన్యస్రవంతులై ముందుకడుగు వేయాలి. లేకపోతే అభివృద్ధి సాధించలేక ప్రపంచదేశాలలో వెనకపడతాము. 'స్పర్ధయా వర్ధతే విద్యా' అన్నట్లుగానే, వర్తక వాణిజ్యాలలో కూడా ఆరోగ్యకరమైన పోటీ తత్త్వంతో, దేశంలో వ్యాపారాభివృద్ధి జరగాలి.

'దేశాభిమానం' నాకు కద్దని వట్టి గొప్పలు చెప్పకుండా నాయకులంందరూ, నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు అమలుపరచాలి. పరాయి పాలన, దారిద్ర్యపిశాచి, దేశసంపదను పీల్చివేశాయి. ఇప్పటికైనా ఐకమత్యం నేర్చుకుని, ప్రజలు, నాయకులు మనుగడ సాగించాలి. మనిషి స్వాభావిక లక్షణం అసూయ. ఈ గుణాన్ని జయించినవాడు మహనీయుడౌతాడు. ఇతరుల సంపదను చూసి అసూయతో దుఃఖపడే పాపికి ఎప్పుడూ సుఖసంతోషాలు దొరకవు.

దేశమంటే కేవలంమట్టి కాదు. బుద్ధిజీవులైన మానవ సంపద అపారంగా ఉంది. ఆ మానవ వనరులను సంపూర్ణంగా ఉపయోగించుకోగలిగితే భూతలం సస్యశ్యామలమౌతుంది. మనిషి స్వార్థచింతన కొంతవరకైనా వీడి, ఇతరులకు తోడ్పడే సహకార గుణం పెంపొందించుకోవాలి.

జాతి విద్వేషాలు, మత విద్వేషాలు ప్రపంచంలో మారణహోమాన్ని సృష్టిస్తున్నాయి. ఇవి ఎప్పుడూ, ఎక్కడా పనికిరావు. వీటిని మరచి, ప్రజలందరూ అన్నదమ్ముల్లాగా మెలగాలి. అదే జాతికి శ్రీరామరక్ష. భిన్న మతాలు, జాతులున్నప్పటికి మనసులొక్కటై ప్రజలందరూ ఐక్యంగా ఉండాలి. దేశమనే మహా వృక్షం, ప్రేమ కుసుమాలను వెదజల్లాలి. ప్రజలందరూ స్వేదం చిందించి, కష్టించి పనిచేస్తే పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయి. ధన సంపాదన ఆ విధంగానే జరగాలిగానీ, అనైతికంగా జరుగకూడదు.

కోకిలమ్మ చెట్ల ఆకుల సందుల్లో దూరి, తన మధుర గానంతో ప్రపంచాన్ని పరవశింపచేసేటట్లు కవికోకిలగూడ తన కవితా గానంతో ప్రజలలో చైతన్యం నింపాలి. మధురమైన కవివాక్కులతో ప్రజలలో పరస్పరం అభిమానాలు మొలకెత్తాలి.

ఈ విధంగా సుమారుగా వంద సంవత్సరాల క్రిందటే విశ్వజనీనమైన వాస్తవాలకు అభ్యుదయ దృక్పథంతో చాటిచెప్పిన మహాకవి గురజాడ చిరస్మరణీయుడు.

**2.** 'దేశభక్తి' గేయం ఆధారంగా గురజాడ కవితా వైశిష్ట్యాన్ని వివరించండి?

**సమాధానం:-** ఆధునిక కవితా యుగానికి యుగకర్త శ్రీగురజాడ అప్పారావుగారు. 'భాషా, భావం, ఛందస్సు: ఈమూడింటిలో ప్రస్ఫుటమైన మార్పు తీసుకునివచ్చిన నవయుగ వైతాళికుడాయన. ఈదేశభక్తి గేయం ద్వారా గురజాడ కవిత్వంలోని ముఖ్యలక్షణాలను పరిశీలిద్దాం.

**వస్తునవ్యత:-** ఈ గేయంలోని కవితా వస్తువు పూర్తిగా నవ్యమైంది. ఏపురాణాలనుంచో, ప్రాచీన కావ్యాల నుంచో వస్తువు స్వీకరించలేదు దేశం, ప్రజలు, దేశభక్తి, వర్తక వాణిజ్యాభివృద్ధి, జాతిమతాల ఐక్యత మొదలైన వాటిని, కవితావస్తుగా స్వీకరించి వాస్తవిక దృక్పథంతో, విశ్వజనీన గీతంగా దీనిని రచించారు.

**భావనవ్యత :-** ఎన్నో క్రొత్తభావాలు ఈ గేయంలో గోచరిస్తాయి. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే భావం చాలా నూతనమైంది. అపారంగా ఉన్న మానవ వనరులతోనే దేశం అభివృద్ధి చెందుతుంది. ఈభావమే రానురాను ఒక నినాదంగా రూపుదిద్దుకుంది. అలాగే 'వైరములు వాణిజ్యమందే' అన్న భావం కూడా నూతనమైంది. సుమారు వందసం॥ల క్రిందట వర్తక వాణిజ్యాల గూర్చి ఎవ్వరూ ఆలోచించలేదు.

వ్యాపారాభివృద్ధిలో దేశాభివృద్ధి ముడిపడింది. అక్కడ ఆరోగ్యకరమైన పోటీ తత్వం ఉండాలి. నాణ్యమైన వస్తూత్పత్తి జరగాలి. ఎగుమతులు అభివృద్ధి చెందాలి. విదేశీమారక ద్రవ్య నిల్వలు పెరగాలి. ఈ భావాలు ఈనాడు అందరికీ సుపరిచితాలే కానీ, దాదాపు వంద సం॥ క్రిందట ప్రజల ఆలోచన, దేశ పరిస్థితి అలా లేదు. ఒక శతాబ్ద కాలంలో జరుగబోయే అభివృద్ధి సూత్రాలను ఆయన ఆనాడే చెప్పారు. ఇది చాలా గొప్ప నవ్యభావం.

అలాగే గతంలోని ఘన కీర్తిని చాటుకుంటూ ప్రస్తుతం, నిష్క్రియా పరత్వంలో ఉంటే దేశాభివృద్ధి జరగదన్నారు. అందుకే 'మందగించక ముందు కడుగేయ్ వెనక పడితే వెనకేవోయి' అన్న ఈ భావాలు అన్ని రంగాలకు, కాలాతీతంగా వర్తిస్తాయి.

**శైలీనవ్యత:-** గురజాడ కవిత్వశైలిలో ఎంతో మార్పు తీసుకుని వచ్చారు. దీర్ఘ సమాసాలతో కూడిన పద్యరచన కన్నా, చిన్న పదాలలో లోతైన అర్థాన్నిచ్చే గేయం ప్రజలకు బాగా చేరువౌతుందని గ్రహించారు. గ్రాంథిక భాషను వదిలేసి, వాడుక భాషకు కావ్య గౌరవాన్ని కల్పించారు. 'ముత్యాసరాలు' అనే కొత్త ఛందస్సును ప్రవేశపెట్టారు. ఇది మాత్రాచ్ఛందస్సు.

**అభ్యుదయ భావాలు :-**

ఈ గేయంలో గురజాడ ఎన్నో అభ్యుదయ భావాలను చూపించారు. ప్రగతి మార్గానికి దారిచూపారు. సార్వత్రికమైన శాంతి, సహకారాలుండాలని కోరారు. జాతి, మత, వర్ణ విద్వేషాలు పనికి రావన్నారు. పోటీతత్వంతో వ్యాపారాభివృద్ధి జరగాలని కోరుకున్నారు. దేశంలో ఉత్పత్తులు పెంచుకోవాలన్నారు. అందరికీ సమానంగా తిండి, గుడ్డ లభ్యం కావాలన్నారు. శుష్కవాగ్దానాలు పనికి రావన్నారు. ఈర్ష్యా, అసూయలు విడనాడాలన్నారు. దేశమంటే మట్టి కాదని, మనుషులనీ పేర్కొన్నారు. ప్రజలలో ప్రేమాభిమానాలు పెరగాలన్నారు. వ్యర్థ కలహాల వల్ల ప్రయోజనం లేదని పదే పదే గతాన్ని పట్టుకుని వేళాడ వద్దన్నారు. వర్తమానంతో పాటు రాబోయే కాలం ముఖ్యమన్నారు.

ఈ విధంగా కవిత్వానికి ఆద్యంతం ఒక కొత్తరూపు నిచ్చి భాషలో, భావంలో, శైలీ విధానంలో నవ్యతను చేకూర్చి, ప్రజలకు మార్గదర్శకుడయ్యారు శ్రీ, గురజాడ అప్పారావుగారు.

## (ఆ) భాగం ప్రబోధము

### 2.12.0 పరిచయం :

సుబ్బారావు గారు బాపట్ల తాలూకా గార్లపాడు గ్రామంలో 1892 లో జన్మించారు. మేనమామ అవ్వారు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి దగ్గర సంస్కృతాంధ్రభాషలు నేర్చుకున్నారు. వారి సాహచర్యంలోనే రాయప్రోలు వారికి చిన్ననాటనే ఆశుకవిత్వం, అవధానాల మీద ఆసక్తి పెరిగింది. 1908 - 09 సంవత్సరాలలో రాజమహేంద్ర వరంలోనే విద్యాభ్యాసం చేశారు. చిలుకూరి వీరభద్రరావు, అత్తిలి సూర్యనారాయణ, గంటి లక్ష్మన్న పంతులు మొదలైన సాహితీ వేత్తల పరిచయం వీరికి చిన్ననాడే లభించింది. 1909లో 'లలిత' కావ్యాన్ని రాశారు. అది ఆంగ్లకవి గోల్డ్‌స్మిత్ రాసిన హెర్మిట్ కు అనువాదం. అలాగే 1910లో 'టెన్నిసన్' రచించిన 'డోరా' అనే చిన్న కావ్యాన్ని 'అనుమతి' అనే పేర తెనిగించారు. 1912లో 'తృణకంకణమ'నే కావ్య రచన వీరికి ఎనలేని పేరు ప్రఖ్యాతులు తీసుకొనివచ్చింది. ఆంగ్ల కావ్యాలను గూడా బాగా చదివారు. రవీంద్రుల శిష్యులై బెంగాలీ సాహిత్యం మీద కూడా మక్కువ పెంచుకున్నారు. కొమఱ్ఱాజు లక్ష్మణరావు వారి సాహచర్యం జ్ఞాన నేత్రాన్ని వికసింపజేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖకు ఆచార్యులై, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖాధ్యక్షులై ఎందరో కవులకు, విమర్శకులకు మార్గదర్శకులై నవ్యాంధ్ర సాహితీజగత్తులో అత్యుత్తమ స్థానాన్ని అలంకరించారు శ్రీ, రాయప్రోలువారు.

లలిత, అనుమతి ఆంగ్లనుంచి అనువందించారు. 'మధుకలశం' ఉమర్‌ఖయ్యాం రుబాయీలకు అనువాదం మొదలైన రచనలు చేశారు. తృణకంకణం, కష్టకమల, స్నేహలత, స్వప్నకుమారం మొదలైన స్వతంత్ర కావ్యాలు వీరికి భావ కవితా ప్రసిద్ధిని తీసుకు వచ్చాయి. ఆంధ్రావళి, జడకుచ్చులు, మంజరి అనేవి ఖండకావ్యాలు

రమ్యాలోకం, మాధురీదర్శనం అనేవి కవిత్వాన్ని, రసాలంకారాదుల గూర్చి పద్యకవిత్వంతో కూడిన లక్షణ గ్రంథాలు. 'రూపనవనీతం' అనేది స్త్రీ మనస్తత్వాన్ని నిరూపించే గ్రంథం.

అంతవరకు స్త్రీని భోగ్యవస్తువుగా చూపించిన పూర్వకవుల భావన పట్ల వీరు విముఖత చూపించారు. స్త్రీకి గౌరప్రదమైన స్థానమిచ్చిన మహనీయుడు. సంభోగ వియోగ శృంగారాలలో, వీరు వియోగశృంగారానికే అధిక ప్రాధాన్యాన్ని యిచ్చారు.

వీటికి ఉదాహరణంగా తృణకంకణము, స్నేహలతాదేవి, కష్టకమల, స్వప్నకుమారము, రూపనవనీతము మెదలైన గ్రంథాలు వ్రాశారు. నిజానికి ఇవన్నీ ప్రణయ వస్తు సంబంధమే. వీరు ప్రతిపాదించిన వియోగశృంగారం, శరీర స్పర్శ లేనిది. వియోగం అంతకంటే స్నేహం లోనే మాధర్యముందని, అదే అమలిన శృంగార మని వీరిభావం. స్త్రీని భోగ్యవస్తువుగా చేసిన ప్రాచీన వ్యవస్థను, అప్పుడే విద్యార్జన కోసం, బయటకువస్తున్న యువతీ యువకుల మధ్య స్నేహభావాన్ని కాంక్షించడం కోసం, వారిని అదుపులో పెట్టడం కోసం వీరు అమలిన శృంగార సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం జరిగింది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా" "పొగడరా నీ తల్లి భూమి భారతిని" అన్న వీరి దేశభక్తిగీతం ప్రజలలో నూతన చైతన్యాన్ని రేకెత్తించింది. వీరిలో ఆంధ్రాభిమానం మెండు. 'నాదు దేశము - నాదుజాతి-నాదుభాష' - అని సగర్వంగా చాటుకున్నారు. 'జాతి, దేశం, భాష' ఈ మూడింటిమీద అమితమైన మమకారాన్ని పెంచుకున్నారు. అందుకే వారు ప్రబోధం చేశారు.

### 2. 12. 1 ఉద్దేశం:-

ఆధునిక కవిత్వానికి ఒక ఉద్యమకర్త, ఆంధ్రభిమానం పుష్కలంగా కలిగిన మహాకవి శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు. దేశాభిమానం, జాతీయాభిమానం నశిస్తూ, నైతికపు విలువలు కాకుండా, కేవలం ధన సంపాదనే ప్రధానంగా జీవిస్తున్న ప్రస్తుత యువతరానికి నిజంగా ఒక మేలుకొల్పు ఈప్రబోధమనే ఖండిక. మన గత వైభవాన్ని, గతచరిత్రను గుర్తించుకొని, తద్వారా స్ఫూర్తిని పొందాలి. ఇటువంటి మాహాకవులెందరో నాటి జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించి, ప్రజలను ఉత్తేజితులను గావించారు. ఆనాటి జాతీయోద్యమానికి ఇటువంటి దేశభక్తి పూరితమైన రచనలన్ని ఎంతో దోహదం చేశాయి. ముఖ్యంగా వారికి గల దేశ, జాతి, భాషాభిమానాలు మనం కూడా అర్థం చేసుకుని, కొంతైనా స్ఫూర్తిని పొందాలి. నేటి సమాజంలో ఇవి పూర్తిగా లోపిస్తున్నాయి. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం.

### 2. 12. 2 పాఠ్యభాగ సందర్భం:-

రాయప్రోలు వారికి గల ఆంధ్రాభిమానం వీరి 'ఆంధ్రావళి' అన్న కావ్యంలో సుస్పష్టంగా కనపడుతుంది. జాతీయోద్యమంలో భాగంగానే,1913 లో కొండా వెంకటప్పయ్య పంతులు మొదలైన వారు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకై బాపట్లలో 'ఆంధ్రమహాసభ' ను నిర్వహించారు. ఆ సందర్భంలో భిన్నాభి ప్రాయాలు వ్యక్తమైనాయి. అపుడు, ఆంధ్రులంతా సమైక్యంగా నిలవాలని, వారిలో అంతర్గతంగా నిద్రాణమైన ఆంధ్రాభిమానాన్ని, ఆంధ్రపౌరుషాన్ని మేల్కొల్పాలని, కర్తవ్యాన్ని ప్రబోధించాలని వీరు 1914 లో 'ప్రభోధమ'నే ఖండికను రచించడం జరిగింది. ఇందులోని పద్యాలు నెల్లూరులో జరిగిన అనంతర ఆంధ్రమహాసభ (1914) లో దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు చదవగా సభ్యులందరు ఆనందోత్సాహాలు ప్రకటించారట. అప్పుడు వారిలో ఉండే అనైక్యభావం పోయి, లక్ష్యసాధన కోసం పరిశ్రమించడం జరిగింది. 'తెనుగుతల్లి' అనే పదం వీరు ప్రాచుర్యంలోకి తీసుకుని వచ్చారు. ఆంధ్రసంతతి, తెనుగు వాణి, తెనుగుకత్తి, తెనుగురేఖ, తెనుగుభూమి మొదలైన పదప్రయోగంతో పాటు 'చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర' ఇత్యాది భావసంపద ఎంతో ప్రశస్తమైంది. అందరికీ అభిమాన పాత్రమైంది.

## 2. 12. 3 కఠిన పదాలకు అర్థాలు :-

| | | |
|---|---|---|
| అమరావతీ పట్టణము | = | గుంటూరు జిల్లాలోని అతిప్రాచీనమైన సుప్రసిద్ధ శైవ క్షేత్రం (ఒకప్పుడు ఇక్కడ బౌద్ధమతం వెల్లివిరిసింది) |
| బౌద్ధులు | = | బుద్ధుని మతమును అనుసరించేవారు. |
| రాజవీరలాంఛనము | = | రాజపుత్రుల వారసత్వానికి గుర్తు, సంకేతం |
| పలు | = | అనేక |
| శస్త్రశాలలు | = | ఆయుధాగారాలు |
| నిలుపునాడు | = | స్థాపించినప్పుడు |
| విద్యానగరము | = | కృష్ణదేవరాయల రాజ్యానికి (విజయనగర సామ్రాజ్యానికి) ముఖ్యపట్టణము |
| దిగ్జయస్తంభము | = | రాజులు తమ విజయానికి సంకేతంగా స్థాపించే విజయస్తంభం |
| ఆంధ్ర సంతతి | = | ఆంధ్రప్రజలు |
| మహితాభిమానము | = | గొప్పఅభిమానం |
| దివ్యదీక్షాసుఖస్ఫూర్తి | = | గొప్ప దీక్షతో కూడిన ప్రేరణ |
| తీవరించె | = | ఎక్కువైంది, తీవ్రమైంది |
| మహావేశము | = | గొప్పదైన ఆవేశం |
| అర్థించి | = | కోరుకుని |
| అక్షతలు | = | దీవెనలు సూచకగా చల్లు పసుపుతోటి బియ్యం |
| | | క్షతి (నాశనము) లేనివి అక్షతలు |
| గీతి | = | కృతి, పాట |
| అఱవజాతిని | = | తమిళులను |
| పాటకులుగా | = | గొప్పగాయకులుగా |
| వర్థిల్లిన | = | వృద్ధిపొందిన |
| తెనుగువాణి | = | తెలుగుసాహిత్యం |
| పోటులు | = | శక్తి సామర్థ్యాలు |
| విరోధి తండములు | = | శత్రు సమూహాలు |
| వసుంధర | = | భూమి |
| అస్మత్ | = | నాయొక్క |
| ఆర్ద్రమనోవీధి | = | తడిసిన మనస్సు అనే వీధి |
| మహోజ్వల చరిత్ర | = | గొప్ప ప్రకాశవంతమైన చరిత్ర |
| తరంగపంక్తి | = | అలల వరుసలు |
| ఆంధ్రతేజస్సు | = | ఆంధ్రుల పరాక్రమం |
| నైపుణి | = | నైపుణ్యం, నేర్పరితనం |
| పంతమాడు | = | పోటీపడు |
| చెండాడు | = | చంపు |
| కంకణవిసర్జనలు | = | దీక్షను సడలించడం (వదలివేయటం) |

**2.12. 4 పాఠ్యభాగ వివరణ :**

నేటి శైవక్షేత్రమైన అమరావతి, ఒకప్పుడు సుప్రసిద్ధ బౌద్ధమత కేంద్రం. ఆచార్య నాగార్జునుడు కులపతిగా బౌద్ధులచట విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కాకతీయుల రాజధాని ఓరుగల్లులో వారి పరాక్రమానికి లాంఛనాలుగా అనేక ఆయుధాగారాలను నిర్మించారు. విజయనగర సామ్రాజ్యరాజధాని విద్యానగరంలో ఆంధ్ర కవిత సర్వాలంకార భూషితమైంది. కృష్ణరాయలు తగ దిగ్విజయాలకు సంకేతంగా పొట్నూరు వద్ద దిగ్జయ స్తంభం కట్టించాడు. గత వైభవానికి స్ఫూర్తితో, ఆంధ్రులను మేల్కొల్పి అక్షతలు చల్లుమని కవి ప్రబోధించాడు.

తెలుగు కృతులు, కీర్తనలు అరవజాతి వారిని గొప్ప సంగీతజ్ఞులుగా నిలబెట్టాయి. తెలుగువీరుల పరాక్రమంలో శత్రు సైనికులకు సహింపరానిదిగా ఉండేది. తెలుగు నేల తన అందాలతో నదీప్రవాహాలతో వసుంధరను సస్యశ్యామలం చేసింది. ఆంధ్రులు గతంలో మహోజ్వల చరిత్రను కలిగి ఉండేవారు. దీనికి మరణం లేదు. ఇది నామననో వీధిలో దర్శనమిస్తుంది. కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో ఉన్నరేవు పట్టణాలలో నౌకా విన్యాసాలు జరిగేవి.

తెలుగు నేలను ప్రతియింట దేశ సాహిత్య దీపం వెలిగేది. ఇంకా శిల్పసంపదలో ఆంధ్రుల నైపుణ్యం సాటిలేనిది. సైనిక వ్యూహరచనా పాటవం కూడా అద్వితీయమైంది. ఈగత వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుని, ఆంధ్ర ప్రజలందరు స్వాతంత్ర్య దీక్షా బద్ధ కంకణులు కావాలి. ఆ భావన నుంచి వెనుకకు మరలరాదు. లక్ష్యం సాధించే దాకా తెలుగు వారికి విశ్రాంతిలేదు అని ప్రబోధించిన రాయప్రోలు వారి పలుకులు ఎల్లప్పుడు మననం చేసుకోవలసినవి.

**2.12.5 సందర్భ సహిత వ్యాఖ్యలు:-**

1. "కవితకు పెండ్లి పందిళ్లు కప్పించునాడు"

**పరిచయం:** ఈవాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన 'ఆంధ్రావళి' అనే ఖండ కావ్యం నుంచి స్వీకరించన 'ప్రబోధము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** ఆంధ్రుల గత వైభవాన్ని ముఖ్యంగా కృష్ణ దేవారాయల కాలం నాటి కవిత్వవైభవాన్ని చెప్పే సందర్భం లోనిది.

**వివరణ :** విజయనగర స్రామాజ్యాధిపతియైన శ్రీకృష్ణదేవ రాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు. ఆయన స్వయంగా కవి. 'ఆముక్త మాల్యద'అనే ప్రౌఢ ప్రబంధాన్ని రచించాడు. అల్లసాని పెద్దనాది అష్టదిగ్గజాలనబడే మహాకవులను తన ఆస్థానంలో పోషించి మనుచరిత్రాది ప్రబంధ రచనలకు ఉత్తమ కావ్య సృష్టికి కారణమైనాడు. ఆ వైభవాన్ని స్మరించుకుంటూ రాయప్రోలు వారు, రాయల కాలంలో ఆంధ్రకవిత్వానికి పెండ్లి పందిళ్లు కప్పారని అభిప్రాయ పడ్డారు. అంటే తెలుగు సాహిత్యం సర్వాలంకార శోభితమైందని కవిభావన.

2. "ఆంధ్ర సామ్రాజ్య దిగ్జయస్తంభ మెత్తించునాడు"

**పరిచయం:** ఈవాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన 'ఆంధ్రావళి' అనే ఖండ కావ్యం నుంచి స్వీకరించన 'ప్రబోధము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** కృష్ణరాయలు తన సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకునేటప్పుడు జరిగిన కళింగ యుద్ధ విజయానికి సంకేతంగా జయస్తంభాన్ని కట్టించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** కృష్ణరాయలు ఎన్నో గొప్ప యుద్ధాలు చేసి తన రాజ్యానికి శత్రువుల బెడదలేకుండా చేసుకున్నాడు. పొట్నూరుకు సమీపంలో, తన విజయ చిహ్నంగా జయస్తంభాన్ని స్థాపించాడు. ఇటువంటి గత వైభవం ఆంధ్రుల సొంతమని కవి అభిప్రాయం

3. "చల్లుడాంధ్ర లోకమున అక్షతలునేడు"

**పరిచయం:** ఈవాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన 'ఆంధ్రావళి' అనే ఖండ కావ్యం నుంచి స్వీకరించన 'ప్రబోధము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** ఆంధ్రుల ఘనమైన గత చరిత్రను అందరూ ఒక్కసారి గుర్తుచేసుకుని, ఆ స్ఫూర్తితో స్వాతంత్రోద్యమానికి సమాయత్తులు కావాలని కవి చెప్పే సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** ఆంధ్ర ప్రజలందరూ స్వాతంత్ర్యదీక్షతో కృతనిశ్చయులు కావాలని పిలుపునిస్తూ, ఆమహనీయ చరిత్ర గల ఆంధ్రదేశాన, మహావేశ స్ఫూర్తితో అక్షతలు చల్లుమని కవి ప్రబోధిస్తున్నాడు. క్రీస్తుపూర్వమే విశ్వవిద్యాలయాల స్థాపన జరిగిందని, కృష్ణరాయలకాలం కవితకు, పరాక్రమానికి సార్వభౌమాధికారం నెలకొల్పిందని, కాకతీయుల పరాక్రమంలో పలు ఆయుధాగారాలు నెలకొల్ప బడ్డాయని తలచుకుంటూ నేడు ఆ దీక్షాస్ఫూర్తితో ఆంధ్రలోకానికి జేజేలు పలకండని కవి ప్రబోధిస్తున్నాడు.

4. 'తనగీతి యఱవ జాతిని పాటకులనుగా దిద్ది వర్ధిల్లిన తెనుగు వాణి'

**పరిచయం:** ఈవాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన 'ఆంధ్రావళి' అనే ఖండ కావ్యం నుంచి స్వీకరించన 'ప్రబోధము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** ప్రాచీన ఆంధ్ర సంగీత వైభవాన్ని సంస్మరించే సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** ఆంధ్ర సాహిత్యమెంత ప్రశస్తమైనదో, సంగీతం గూడా అంతే ప్రసిద్ధి పొందింది. 'నాద బ్రహ్మ' త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తాస్వామి దీక్షితులు అను సంగీతత్రయం సంగీత సామ్రాజ్యానికి పితామహులు. వీరంతా తెలుగులో కృతులు రచించారు. తమిళులకు సంగీతాభిమానం ఎక్కువ. భాషా పరంగా భేదమున్నప్పటికీ, వారు త్యాగరాజాదులు రచించిన తెలుగు కృతులను ఆలపించి నాదోపాసన చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుగు కృతులు తమిళులను శాస్త్రజ్ఞులుగా రూపుదిద్దిందని గర్వంగా కవి చెప్పే భావనయిది.

5. ' హృదయములు చీల్చి చదువుడో సదయులార! '

**పరిచయం:** ఈవాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన 'ఆంధ్రావళి' అనే ఖండ కావ్యం నుంచి స్వీకరించన 'ప్రబోధము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** గత చరిత్రను గుర్తు చేస్తూ ఆంధ్రుల మహోజ్వల చరిత్రను హృదయమును చీల్చిచదవండని కవి చెప్పే సందర్భంలోని దీ వాక్యం.

**వివరణ :** తెలుగువారి శౌర్యపరాక్రమాలు, తెలుగువారి సాహిత్యం, సంగీతం, ప్రకృతి ప్రసాదించిన అమృతోపమానమైన జలవనరులు మొ॥న వాటిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ కవి, ఆవేశంతో, ప్రజలను జాతీయోద్యమంవైపు కదలిరండని, ఆంధ్రుల గత చరిత్రను చదివి ప్రేరణ పొందడని కవి పిలుపునిస్తున్నాడు.

6. "కంకణ విసర్జనల కిది కాలమగునె"?

**పరిచయం:** ఈవాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన 'ఆంధ్రావళి' అనే ఖండ కావ్యం నుంచి స్వీకరించన 'ప్రబోధము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** ఆంధ్రప్రజలను విశ్రాంతి ఎరుగకుండా స్వాతంత్ర్య సముపార్జన కోసం పాటుపడాలని కవి ఉద్బోధించే సందర్భంలోని దీ వాక్యం.

వివరణ : ఆంధ్రుల గత ఘనకీర్తినిజ్ఞప్తికి తెచ్చుకుని, చదివి, స్ఫూర్తినిపొంది, దీక్షాబద్ధ కంకణులు కావాలని, ఆ దీక్షతోనే స్వాతంత్ర్య సముపార్జన చెయ్యాలని, వెనకాడే పరిస్థితి రాకూడదని కంకణ బద్ధులైన ప్రజలు వాటిని విసర్జించరాదని ప్రబోధిస్తున్నాడు కవి.

**2. 12. 6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు :**

1. రాయప్రోలు సుబ్బారావుగారు ఆంధ్రులగత వైభవాన్ని కీర్తిస్తూ, తెలుగువారిని ప్రబోధించిన తీరు **లేదా** రాయప్రోలువారు ఆంధ్రుల విశిష్టతను వర్ణించిన విధం :

సమాధానం :

అభినవాంధ్ర కవితకు క్రొత్త ఒరవడిని సృష్టించిన గొప్పకవి శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారు. నాటి సమకాలీన సమాజంలో గల సమస్యల నెన్నింటినో స్పృశించి, తన రచలన ద్వారా ప్రజలను చైతన్య పరిచారు. తెలుగుజాతి, తెలుగుభాష, తెలుగు నేల అంటే వీరికి ప్రాణపదాలు. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా'- అన్న వీరి గీతం ఎంతో ప్రజాదరణపొందింది. ఈ ప్రబోధమనే ఖండికలో ఆంధ్రుల పూర్వవైభవాన్ని స్మరించుకుంటూ నిస్తేజమైన తెలుగుజాతిని ప్రబోధిస్తూ జాతీయోద్యమం వైపు ఉరకలు వేయించారు. ఈ నేల శతాబ్దాల తరబడి మహోన్నత చరిత్ర సంస్కృతులకు ఆలవాలమైంది.

వేల సంవత్సరాల క్రిందటే అమరావతీ పట్టణంలో బౌద్ధులు విశ్వవిద్యాలయాలు స్థాపించారు. బుద్ధుని శిష్యులలో ప్రముఖుడైన ఆచార్య నాగార్జునుడు కులపతిగా ఇచట విశ్వవిద్యాలయం స్థాపించడం జరిగింది. ఓరుగల్లు ప్రాంతమంతా శస్త్రచాలన విద్యలతో మార్మోగి పోయింది. కృష్ణదేవరాయల కాలంలో కవితాలక్ష్మికి పెండ్లి పందిళ్లు కప్పించారు. అంటే తెలుగుకవిత సర్వాలంకార శోభితమై, అంగరంగ వైభవంతో అలరారింది. సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు ఒక ప్రక్క తన పరాక్రమంతో రాజ్యాన్ని విస్తరించి, మరోప్రక్క తన ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులతో సాహితీ సమారాధనం చేస్తూ ఆణిముత్యాల్లాంటి ప్రబంధ రచన చేయించాడు. స్వయంగా తాను కూడ కవి. 'ఆముక్తమూల్యద' అనే ప్రబంధ రచన చేశాడు. తన సామ్రాజ్య విస్తరణకు సూచికగా రాజ్యసరిహద్దులో పొట్నూరు వద్ద దిగ్విజయ స్తంభం స్థాపించాడు. నాటి మహనీయ వైభవం జ్ఞప్తికి తెచ్చుకొని ఆంధ్రలోకాన అక్షతలు చల్లుమని ప్రబోధించాడు.

తమిళులు సంగీత ప్రియులు. అయితే తమిళ భాషలోని కవులకన్నా, మన తెలుగు వారైన త్యాగయ్య ఇత్యాది వాగ్గేయకారుల కృతులు, సంకీర్తనలే తమిళులు ఎంతో భక్తి పారవశ్యంతో పాడుకుంటూ తన్మయులౌతుంటారు. త్యాగరాజ కృతులు లేకపోతే అరవజాతి వారు అంతగొప్ప సంగీత శాస్త్రజ్ఞులుగా పేరుపొందేవారు కారేమో? మన తెలుగువాణి, వారి బాణికి ప్రాణమైంది. తెలుగువారి శౌర్య పరాక్రమాలు ఎంతోమంది శత్రురాజులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. కృష్ణా, గోదావరి, తుంగభద్ర మొదలైన నదీ ప్రవాహాలతో ఈ ప్రదేశమంతా సస్యశ్యామలంగా వృద్ధి పొందింది.

ప్రాచీన ఆంధ్రుల మహోజ్వల చరిత్ర ఆర్ద్రమైన నా మనోనేత్రాలలో కదలాడుతుంది. దీనికి చావులేదు. హృదయాలు చీల్చి గతకీర్తిని స్మరించండి.

సముద్ర తీర ప్రాంతంలో కూడా మనవారు ఎన్నో వ్యాపారాలు అభివృద్ధి చేశారు. ఎన్నో రేవు పట్టణాలు వెలిశాయి. నౌకల మీద మన ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేయబడేవి. ఇంకా శిల్ప శాస్త్రవేత్త లెందరో ఈ దేశాన పుట్టి, అజరామరమైన శిల్పసృష్టి చేశారు. అనేక యుద్ధాలలో శత్రువులను ముప్పుతిప్పలు పెట్టి వ్యూహరచన చేయగల నేర్పరు లెందరో!

వాటినన్నింటిని తలచుకొని, మనశ్శరీరాలు ఉప్పొంగగా ఆంధ్రులు నూతన శక్తిని పొంది దీక్షా కంకణబద్ధులై జాతీయోద్యమంలో పాల్గొనాలి. కార్యసిద్ధి జరిగే దాకా, దీక్షా కంకణాలను విసర్జించకూడదు. వెనుదిరిగి చూడవద్దు - అని రాయప్రోలు వారు తెలుగువారిని గొప్పస్ఫూర్తితో ప్రబోధించారు. ఇది ఈ నాటికి మనకు వర్తించే విషయం.

**డాక్టర్ జి. వైదేహి,** ఎం. ఏ; ఎం.ఫిల్; పిహెచ్.డి.

రీడర్, తెలుగు శాఖ, టి.జె.పి.యస్. కళాశాల

ఖండం - 2 ఆధునిక సాహిత్యం

# కృషీవలుడు - దువ్వూరి రామిరెడ్డి

## పాఠం :13

2. 13. 0 పరిచయం

2. 13. 1 ఉద్దేశం

2. 13. 2 పాఠ్య భాగ సందర్భం

2. 13 .3 కఠిన పదాలకు అర్థాలు

2. 13. 4 పాఠ్య భాగ వివరణ

2. 13. 5 సందర్భ సహితవ్యాఖ్యలు

2. 13 .6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

**2. 13. 0 పరిచయం :**

ఆధునికాంధ్ర కవిత్వంలో కర్షకవాఙ్మయానికి శ్రీకారం చుట్టిన మహనీయుడు శ్రీదువ్వూరి రామిరెడ్డి. ఆయన విద్య కేవలం పాఠశాల వరకే పరిమితమైంది. అయినా స్వయంకృషితో స్వీయ ప్రతిభతో చాల భాషల్లో పాండిత్యం సంపాదించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇంగ్లీషు, ఫ్రెంచి, బెంగాలీ, సంస్కృతం, ఉర్దూ, తమిళం, ఇత్యాది భాషల్ని నేర్చుకొన్నారు, విజ్ఞానశాస్త్రం ఆయనకు ఎంతో ప్రీతి పాత్రమైంది. చిత్రకళ, శిల్పం - వంటి కళల్లో గూడ నైపుణ్యాన్ని సంతరించుకున్నారు. జ్యోతిష్యం ఆయన అభిమాన విద్య. రేడియో, కెమేరా వంటి యంత్ర పరికరాలను గూడ స్వయంగా తయారుచేసేవారు. 'చిత్రనళీయం' -అనే సినిమాకు దర్శకత్వ బాధ్యత కూడా వహించారు.

**జీవిత విశేషాలు:**

వీరు నెల్లూరు జిల్లా గూడూరులో 9-11-1895 న జన్మించారు. 1915 లోనే కవిత్వం చెప్పడం మొదలు పెట్టారు. కట్టమంచి వారిచే స్వర్ణ పతకం పొందారు. 1929 లో బెజవాడ ఆంధ్రమహాసభలో 'కవికోకిల' బిరుదును పొందారు. 11-9-1947న మరణించారు. వీరి రచనలు 'కవికోకిల గ్రంథావళి' అను పేర ఏడు సంపుటాలుగా ప్రచురించబడ్డాయి. 'Voice of the Reed' అనే ఆంగ్ల గ్రంథం కూడా ప్రచురించారు.

**రచనలు:**

పద్య విద్యను సాధనచేస్తూ, చిరుప్రాయంలో రసిక జనానందం, స్వప్నాశ్లేషము, అహల్యానురాగం, కృష్ణరాయబారం మొదలైన కావ్యాలు రచించారు. వీటిలో కొన్ని మాత్రమే వెలుగులోకి వచ్చాయి. తనతల్లి వంశానికి చెందిన 'నలజారమ్మ' అనే త్యాగశీల చరిత్రను పద్యకావ్యంగా రచించారు. 'వనకుమారి' విజయనగరం మహారాజావారి ఆస్థానంలో జరిగిన కావ్యాల పోటీల్లో బహుమతి పొందింది.

1919 లో 'కృషీవలుడు' 1920 లో జలదాంగన, 1930 లో యువక స్వప్నము, కడపటి వీడ్కోలు అనే గ్రంథాలను రచించారు. ఉమర్‌ఖయాం రుబాయిలకు 'పానశాల' కావ్యంగా రచించారు. అదేకాక ఋతుసంహారం, పుష్పబాణవిలాసం, గులిస్తాను, పళ్లతోట అనే అనువాద కావ్యాలు గూడ రచించారు.

మాతృశతకం, మిత్రార్థ శతకాలను, కర్షక విలాసం, కుంభరాణా, సీతావనవాసం, మాధవవిజయం, కాంగ్రెస్ వాలా అనే నాటకాలను గూడా వ్రాశారు. వీరి రచనల్లో కృషీవలుడు, పానశాల, పలితకేశము - బాగా ప్రసిద్ధి పొందాయి.

దేశభక్తి, అభ్యుదయ భావాలు, రైతు జీవన విధానాలు, పల్లె ప్రకృతి, గ్రామీణ వ్యవస్థ, హేతువాదదృక్పథం ఆయన రచనల్లో గోచరిస్తాయి.

“ఈ గ్రంథమునందు పొలము కాపులయు, కాపుటిల్లాండ్రయు దైనందిన చర్యలతో ఋతు వర్ణనములను కవి బహు చమత్కారముగా సమన్వయించియున్నాడు. ఇందు గ్రామాంతర నివాసము, వ్యవసాయవృత్తి ఇత్యాది ప్రకృతి సామాన్య జీవితమునకును, మనుష్య స్వభావ ప్రకృతికిని ఉండు సంబంధము చూపబడియున్నది. కృషీవలుల జీవితము ప్రధానాంశముగా, గ్రహించిన తెలుగు గ్రంథములలో ఇదియె -మొదటిది” అని కట్టమంచి రామలింగారెడ్డిగారి ప్రశంసావాక్యాలు వాస్తవం.

రామిరెడ్డిగారి మాటలలోనే ఆయన అభిప్రాయం, కవితానేపథ్యం చూద్దాం. “నాకు ఒక కుగ్రామం నివాసం. ఇప్పటివరకూ నా జీవితమంతా ఆగ్రామంలోనే కొనసాగిపోయింది. పరిసరాల ప్రభావం వల్లనో యేమో నా జీవితంలోనూ, కవిత్వంలోనూ గ్రామీణత్వం పరిస్ఫుటంగా అంకితమైఉంటుంది”.

ఈవిధంగా చూస్తే కర్షక జీవితాన్ని గ్రంథస్థం చేసి వెలుగులోకి తీసుకుని వచ్చిన కవి దువ్వూరి రామిరెడ్డి గారని చెప్పవచ్చు.

**2. 13. 1 ఉద్దేశం**

గ్రామీణ వాతావరణాన్ని, అందులోనూ, దేశ సౌభాగ్యానికి మూల బిందువైన కర్షకుల జీవన చిత్రణమిందులో చూడవచ్చు. పట్టణ జీవన విధానానికి అలవాటుపడ్డ నేటి యువతకు గ్రామీణ ప్రాంత జీవన విధానం పట్ల అంతగా అవగాహనలేడు. మానవమేధలో ఎన్నో క్రొత్త వస్తువులను కనిపెట్టి, జీవితాలను సుఖమయం చేసుకోవచ్చు గానీ, ప్రజలందరూ తినడానికి తిండి మాత్రం కృషీవలుని చేతిచలువ వల్లనే సాధ్యమౌతుంది. వ్యవసాయదారుని జీవన చిత్రణ, అతనికి గల నిరాడంబరత, నిస్వార్థ చింతన, నిష్కల్మషత్వం, ఆత్మతృప్తి మొదలైన ఉదాత్త లక్షణాలన్నీ యిందులో ఆవిష్కరింపబడ్డాయి. తాను దేశ సౌభాగ్యానికి మూల భూతమైనప్పటికీ, ఏమాత్రం డాబు దర్పం లేనివాడు రైతు. ఈ రంగంలో కూడా రైతు శ్రమ దోపిడీ జరుగుతుంది. అతని పంటకు, శ్రమకు తగిన విలువను పొందలేక పోతున్నాడు. ఇప్పటికీ మన దేశంలో వ్యవసాయం వర్షాధారంగా ఉంది. అత్యాధునిక వ్యవసాయ పద్ధతులు అందరికీ అందుబాటులో లేవు. సుమారు 100 సం॥ల క్రిందట రైతు జీవితాలు ఏ విధంగా ఉండేవో దువ్వూరి వారు ఈ కావ్యంలో వివరించారు. కర్షకుని జీవితం ఎలా ఉంటుందో ఈ పాఠం ద్వారా విద్యార్థులు అర్థం చేసుకోగలుగుతారు.

**2.13.2 పాఠ్యభాగ సందర్భం:**

ఆధునిక కవితాయుగంలో ఒక శాఖ భావకవిత్వం. అందులో ఒక భాగం ప్రకృతి కవిత్వం. ఆధునిక కవులు యథార్ధ దృష్టితో, పూర్వ కావ్యాల్లో స్థానం దక్కించుకోని వారికి సముచితంగా కావ్యగౌరవాన్ని కల్పించారు. అందులో ‘కర్షకుడు -ఆతని జీవన చిత్రణ ప్రధానం. కర్షక జీవన విధానాన్ని చిత్రీకరించిన వారిలో దువ్వూరి రామిరెడ్డి ప్రథములు. పల్లీయుల జీవన విధానాన్ని చిత్రీకరించడానికి రెండు కారణాలు చెప్పవచ్చు. ఒకటి స్వదేశీయం, రెండోది విదేశీయం. జాతీయోద్యమం మహోధృతంగా సాగే రోజుల్లో గాంధీజీ చేత ఎందరో ప్రభావితులై రచనలు సాగించారు. గాంధీజీ చేసిన నినాదాలలో ప్రధానమైంది 'Back to Villages' (పల్లెటూళ్లకు తరలండి) అన్నది. పల్లెల ప్రగతే, దేశప్రగతి అని వారు భావించారు. ఆ ప్రభావంతో నవ్యకవులు గ్రామీణ వాతావరణాన్ని అందునా కర్షకుల జీవితాలను చిత్రీకరించడం మొదలుపెట్టారు. అదీకాక ఆధునిక కవులు చాలా మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే.

ఇక రెండవ కారణం ఆంగ్ల కవిత్వం. అందులో 'Nature Poetry' కి అగ్రస్థానం ఉంది. వర్డ్స్ వర్త్, మైకేల్ మొదలగు కవులు పల్లీయుల జీవన విధానాన్ని చిత్రీకరించారు. ఆధునిక కవులు చాలామంది, ఆంగ్ల కవిత్వం చేత ప్రభావితులైన వారే. ఆ ప్రభావంకూడా ఇటువంటి కవిత్వానికి దోహదం చేసింది. అందుకనే కర్షకుడే నాయకుడుగా ‘కృషీ వలుడు’ కావ్యం రచింపబడింది.

**2.13.3 కఠిన పదాలకు అర్థాలు :**

**ప.60**

| | | |
|---|---|---|
| హాలిక! | = | కర్షక (రైతు) |
| నెయ్యంబు+ఆర | = | ప్రేమమీర |
| నిర్ఝర సార వేగమునన్ | = | సేలయేటి అధికవేగంతో |

| | | |
|---|---|---|
| వాక్పూరంబు | = | వాక్కులు అనబడే నీటి ప్రవాహము |
| మాధుర్య సంపన్నంబై | = | మాధురీ సంపదతో కూడి, |
| భగ్న + ఆశులై | = | చెదరి పోయిన ఆశగలవారై |
| ఈర్ష్యతో | = | అసూయతో |
| కర్షక పక్షపాతి | = | రైతు పక్షం వహించేవాడు |
| నిందావాక్యములు+ పల్కరే | = | నిందతో కూడిన మాటలు మాట్లాడుదురు గదా ! |

**ప.61**

| | | |
|---|---|---|
| వనలత | = | అరణ్యంలో స్వేచ్ఛగా పెరిగే తీగ |
| పత్ర పుటంబులన్ | = | ఆకులనెడి దొన్నెలతో |
| పూవురెమ్మలన్ | = | పూలరేకులతో |
| దినదినజృంభ మాణమయి | = | దినదినమూ వృద్ధి పొందినదయి |
| తేజరిలెన్ | = | ప్రకాశించింది |
| సహజ ప్రరోహ వర్ధన | = | సహజంగా అతిశయించి వృద్ధిపొంది |
| నియమ+అనుసారముగ | = | నియమాలను అనుసరించి |
| తత+లత | = | ఆ లత |
| రమణీయత | = | అందము |
| అపూర్వ పద్ధతిన్ | = | అపూర్వమైన రీతిలో (ఇంతకు ముందు లేని విధంగా) |

**ప.62**

| | | |
|---|---|---|
| పంజరనిబద్ధకీరంబు | = | పంజరంలో బంధించబడిన చిలుక |
| బయలు గాంచి | = | బయటి ప్రపంచాన్ని చూసి |
| అడ్డుకమ్ముల | = | పంజరానికున్న కమ్ములను |
| బహిః+నియమంబుల | = | బాహ్యమైన నియమాలను |
| అతకరించి | = | అతిక్రమించి |
| మత్+మనంబు | = | నా మనస్సు |
| స్వాతంత్ర్య సీమకు | = | స్వతంత్రమైన ప్రదేశానికి |
| చరించు | = | సంచరించు |

**ప.63**

| | | |
|---|---|---|
| భావలోకము | = | భావప్రపంచం |
| అళుకు | = | సంకోచం |

**ప.64**

| | | |
|---|---|---|
| సైరికా | = | హలికా |
| భారతక్ష్మాతల+ఆత్మ | = | భారత భూమికి ఆత్మవు |
| శూరమణివి | = | శూరులయందు శ్రేష్ఠుడవు |
| ధారుణీపతి | = | రాజు |
| పాలనదండము | = | రాజదండం |
| హలంబు | = | నాగలి |

ప్రార్థనీయము+అగునె = ప్రార్థింప తగినది అగునా? (కాదు)

**ప.65**

దైనిక+ఆవశ్యకములు = ప్రతిదినము కావల్సిన అవసరాలు
నీ యిచ్చలు = నీ కోరికలు
అవధిగా = హద్దుగా
నీ విచారము = నీ ఆలోచన

**ప.66**

ఈసు = అసూయ

**ప.67**

సర్వప్రపంచసీమ = సమస్త ప్రపంచం
ప్రియ = భార్య
రమణీయ విగ్రహంబు = అందమైన శరీరంకలది
మతము = అభిమతం, అభిప్రాయం

**ప. 68**

కష్ట+ఆర్జితంబు = కష్టపడి సంపాదించినది
నీ పంచకు = నీ ముంగిటికి

**ప. 69**

కృషి = వ్యవసాయం
కీలుచీల = కేంద్రబిందువు, ప్రధానమైంది
వాణిజ్య సాధనంబు = వ్యాపారానికి ఆధారం
భోగ+ఉపలబ్ధి = భోగాలు పొందడం

**ప.70**

ఉత్కృష్ట = విశిష్టమైన
కట్టన్+కుడువను = కట్టుకోవడానికి, తినడానికి

**ప.71**

ఫలముల్+మెక్కెడివారు = పండ్లను తినేవారు
తత్+ఫల = ఆ ఫలాలయొక్క
రస+ఆస్వాదన క్రియాలోలురై = రసమును ఆస్వాదించడంలో ఆసక్తిగలవారై
సంభావింతురు+ఏగాని = గౌరవిస్తారేగాని
హేతుక్రమ = కారణమైన
రమా కలితులు = సంపదకలవారు, ఐశ్వర్యవంతులు

**ప.72**

కృతఘ్నులు = కృతజ్ఞత లేనివారు
సేద్యనాద్యపున్ ఘట్టనన్ = వ్యవసాయ పనుల వత్తిడివల్ల

| | | |
|---|---|---|
| స్వశ్రమ+ఆర్జితము | = | సొంతశ్రమతో సంపాదించుకున్నది |

ప.73

| | | |
|---|---|---|
| విస్తారశక్తి | = | అధికమైన శక్తి |
| సతతము | = | ఎల్లప్పుడు |

ప. 74

| | | |
|---|---|---|
| సమ్మథితము | = | సంఘర్షణ |

ప. 75

| | | |
|---|---|---|
| కల్యకాంతి | = | వేకువ కాంతి |
| వారిదము | = | నీటిని ధరించునది మేఘం |
| నూత్నపథము | = | కొత్తమార్గం |

ప.76

| | | |
|---|---|---|
| చక్రదండంబులు | = | చక్రాల కర్రలు (ఆకులు) |

ప.77

| | | |
|---|---|---|
| కష్ట+ఉత్కటంపు | = | అధికమైన కష్టాల యొక్క |
| ఆత్మ విజ్ఞానమయముగా | = | ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుని |

ప.78

| | | |
|---|---|---|
| పెల్లు+ఏటికి | = | పెద్దనదికి |
| పూరావేగంబున | = | నీటిప్రవాహ వేగానికి |
| కాంక్ష+ఉడుపంబు | = | కోరిక అనే తెప్ప |
| మన+స్వేచ్ఛాప్రకారంబు | = | మనస్సుకు నచ్చినట్లుగా |

ప.79

| | | |
|---|---|---|
| సస్యకేదార ఖండంబు | = | పచ్చగా ఎదిగిన వరి పొలం |
| భావలోచనము | = | భావదృష్టిని |
| ఎరువు | = | బదులు |
| అంతర్లీనము | = | లోపల ఉన్న |

**2.13.4 పాఠ్యభాగవివరణ :**

దువ్వూరి రామిరెడ్డిగారు రైతు జీవితం గూర్చిన రచించిన కవులలో ప్రథములు. రైతుజీవితాన్ని, విశిష్టతను పేర్కొని రైతు దేశానికి వెన్నెముక అనే అంశాన్ని తెలిపారు.

రైతు సోదరా ! నీ జీవన విధానాన్ని వర్ణించడానికి పూనుకోగానే సెలయేటి లాగానే వాక్ప్రవాహం సాగుతుంది. కానీ యితరులు ఈర్ష్యతో నన్ను కర్షక పక్షపాతియని నిందిస్తారు. వనలత లాగా నా కవిత దినదినమూ వృద్ధిచెందుతూ నియమాను సారంగా ప్రకాశిస్తూ ఉంది. దానికి తోటమాలి ప్రమేయం లేదు. పంజరంలో బంధించబడ్డ చిలుక బయటి ప్రపంచంలోకి రావాలని ఆశపడ్డట్లుగానే, నా మనస్సులో కూడా, స్వాతంత్ర్య కాంక్ష కలుగుతుంది. ఎవ్వరెట్లు భావించినప్పటికీ, కాలమనంతం, భూమి విశాలమైంది. నేనెందుకు సందేహపడాలి? హాలికా! నీవు భారత భూమి గర్వించేంతటి పవిత్రమూర్తివి. రాజదండమెప్పుడూ, నీ నాగలికన్న పూజనీయంకాదు.

నీ కోరికలు దైనందిన అవసరాలకు మాత్రమే పరిమితమై ఉంటాయి. ప్రొద్దుపొడిచింది మొదలు ప్రొద్దుక్రుంకేదాకా, నీవే కష్టపడతావు గానీ, యితరుల సంపదకాశించవు. అనుదినమూ శ్రమ చేయడమే నీ అభిమతం. ఏ సమయంలో అతిథులు వచ్చినప్పటికీ, వారికి తృప్తిగా పెట్టగలవాడవు నీవే.

నిరంతర పరిశ్రమే సౌభాగ్య సాధనం. సమాజ సౌభాగ్యాలకు నీవే కారకుడవు. నీకు ఎప్పుడూ కరువులేదు కాని లోకం తీరువేరు. మనుష్యులు తియ్యని ఫలాలను తింటూ, ఆమాధుర్యాన్ని అనుభవిస్తారే కానీ, దానికి కారణమైన చెట్లను గూర్చి ఎవ్వరూ ఆలోచింపరు. అట్లే నీవు పెట్టిన అన్నాన్ని తింటూ, ఎవ్వరూ నిన్ను గూర్చి ఆలోచించరు. అయినా అటువంటి వారిని లెక్క చేయకుండా ప్రతికూల పరిస్థితులెదురైనా, నీ శ్రమనే నీవు నమ్ముకుంటావు.

శౌర్యానికి, ఆచార వ్యవహారాలకు మధ్యన లోకం నలుగుతుంది. కాలగర్భంలో ఎటువంటి వింతలు సంభవిస్తాయో ! వేకువకు ముందు అంధకారం, వర్షానికి ముందు మేఘాడంబరం సహజంగా ఉంటాయి. అలాగే జీవితంలో కష్టసుఖాలు, నిమ్నోన్నతాలు సాధారణమే. ఓ హాలికా ! నీవు కష్టాలనే అనుభవించవలసిన పనిలేదు. నిన్ను శాసించగలవారెవ్వరు? ఆత్మజ్ఞానంతో నీ జీవితాన్ని సాగించు. దారిద్ర్యమనే ఏరుదాటడానికి ధైర్యం లేదనుకోకూడదు.

కర్షకా ! చక్కని పంటపొలాలను దర్శించి సత్కవుల భావుకతను ఎరువుగా తెచ్చుకొనుము. లేనిచో అందులోని అంతర్లీనమైన ప్రకాశాన్ని సందర్శించలేవు.

## 2.13.5 సందర్భసహిత వ్యాఖ్యలు :

**1. నన్నుం గర్షక పక్షపాతి యని నిందా వాక్యముల్పల్కరే !**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది
సందర్భం : కర్షక జీవితాన్ని (ప్రేమతో) వర్ణించు సందర్భంలో కవి భావన యిది.

వివరణ : రైతు సోదరా ! నీ జీవితాన్ని గూర్చి వర్ణించడానికి ప్రారంభించగానే సెలయేటి ప్రవాహం లాగా, నా వాక్ప్రవాహం సాగుతుంది. నీ గురించి ఎంత చెప్పినా తీరదు. కాని ఇతరులు ఈర్ష్యతో నన్ను కర్షక పక్షపాతియని నిందిస్తారు గదా !

**2. 'వన్యరమణీయత జిల్కునపూర్వ పద్ధతిన్'.**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : కవి తన కవితను వనలతతో పోల్చి చెప్పే సందర్భంలోనదీ వాక్యం.

వివరణ : నా కవిత్వం అరణ్యంలో సహజంగా పెరిగే తీగెలాగా దినదిన ప్రవర్ధమానమై స్వేచ్ఛగా పెరుగుతుంది. దానికి తోటమాలితో పనిలేదు. అయినా అది అపూర్వమైన పద్ధతిలో అందంగా ఉంటుంది.

**3. మన్మనంబు స్వాతంత్ర్యసీమకు ఁజరించు.**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : తన కవిత పూర్వ నియమబద్ధం లేకుండా స్వతంత్రంగా ఉంటుందని తన మనస్సు స్వాతంత్ర్య కాంక్షతో ఉందని కవి చెప్పే సందర్భంలోనిది.

వివరణ : పంజరంలో బంధించబడిన చిలుక, అడ్డుకమ్ములను దాటి బయటి ప్రపంచంలోకి రావాలని ఆశపడినట్లే, తన మనస్సు కూడా, నియమాలను అతిక్రమించి, స్వాతంత్ర్యాన్ని కోరుకుంటుందని చెప్పడంలో దేశానికి వెన్నెముక అయిన రైతు విశిష్టతను చెబుతూ జాతీయోద్యమ ప్రభావంతో తన స్వాతంత్ర్య కాంక్షను ఇందులో వివరించారు దువ్వూరివారు.

**4. ఏల హృదయంబు వెలిపుచ్చ వింత యళుకు?**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : మార్పులకు అనుగుణంగా ప్రజల భావజాలంలో మార్పు వస్తుందని కవి భావించే సందర్భంలోనిది.

వివరణ : ఎవ్వరేమి అనుకున్నప్పటికీ కాలమనంతమైంది. భూమి విశాలమైంది. ప్రజల భావజాలంలో క్రమంగా మార్పు సంభవిస్తుంది. అంతే కానీ, తన మనస్సుకు సంకోచమక్కరలేదని కవిభావం.

**5. "నీ హలంబు కన్నను ప్రార్థనీయమగునె"?**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : రైతు గొప్పతనాన్ని కవి వర్ణించే సందర్భంలోని దీ వాక్యం.

వివరణ : హాలికా ! నీవు భారత భూమికి ఆత్మ వంటివాడివి. గౌరవమైన పవిత్రమూర్తివి. శూర శిఖామణివి. రాజుగారి రాజదండం కన్నా నీ నాగలి ఎక్కువ పూజనీయమైనదని స్పష్టంగా వివరించారు.

**6. "ఎంత నిర్మలమోయి నీ హృదయకళిక" ?**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : రైతు స్వచ్ఛమైన జీవన విధానాన్ని వర్ణించే సందర్భంలోని దీ వాక్యం.

వివరణ : ప్రొద్దుపొడించింది మొదలు, ప్రొద్దు గ్రుంకు వరకు నీవు కష్టపడి పనిచేయదువేగాని, యిరుగుపొరుగు సంపదలను గూర్చి, నీవు ఈర్ష్య పడవు. నీ హృదయం చాలా నిర్మలమైంది. అంటే రైతు శ్రమించునే తప్ప ఈర్ష్యాసూలకు లోనుకాడని కవి అభిప్రాయం.

**7. "అనుదిన పరిశ్రమయె మతమగును నీకు !" -**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : రైతు జీవనవిధానాన్ని, వ్యక్తిత్వాన్ని వివరించే సందర్భంలోనిది.

వివరణ : 'నీకు, నీవు నివసించే పల్లె పట్టే సమస్త ప్రపంచం. పరకాంతాభిలాష లేకుండా, భార్యని మాత్రమే ఆరాధించు ఏకపత్నీవ్రతుడవు నీవు. బంగారం పండు పంట పొలాలే భాగ్యనిధులు. నిరంతర పరిశ్రమమే నీ మతము'- అని కవి, కర్షకుని విశిష్టతను గూర్చి అభిప్రాయ పడుతున్నాడు.

**8. 'సిరియె భోగోపలబ్ధికి జీవగఱ్ఱ' !**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీ వలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : వ్యవసాయం, పరిశ్రమల ప్రాధాన్యాన్ని కవి వివరించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ : వ్యవసాయం సమస్త పరిశ్రమలకు మూలాధారం. మంచి పరిశ్రమలే వాణిజ్యానికి కారణం. అన్ని వర్తక వాణిజ్యాల. వల్లే, దేశసంపద వృద్ధి పొందుతుంది. సిరిసంపదకు, మనిషి భోగ జీవితానికి ఆధారమౌతాయి.

**9. 'కట్టఁ గుడువను గఱవె యెక్కాలమందు' ?**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది.

సంధర్భం : సమాజంలో కర్షకుని దయనీయ స్థితిని గూర్చి వివరించు సంధర్భంలోనిదీ వాక్యం.

వివరణ : సమాజంలోని సౌఖ్యసంపదలకు మూల కారకుడు కర్షకుడే. నీ కష్టాన్ని యితరులనుభవిస్తారు. అయినా అన్నికాలాల్లోనూ తినడానికి తిండి, కట్టడానికి బట్ట ఎప్పుడూ కరువే. అని కవి కర్షకుని స్థితిని వివరించాడు.

**10. 'నిన్నుంగన్నెత్తియుంజూతురే' ?**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సంధర్భం : రైతు యొక్క శ్రమదోపిడిని గూర్చి కవి ఆవేదనపడు సందర్భంలోని దీ వాక్యం

వివరణ : తియ్యని పండ్లను ప్రీతిగాభుజించేవారు, ఆ ఫలాల చెట్లను గూర్చి ఆలోచించరు. అట్లే నీ కారణంగా వృద్ధి పొందిన సంపదలనుభవిస్తూ, ధనికులు నిన్ను కన్నెత్తికూడా చూడరుగదా ! రైతు స్థితిగతులను పట్టించుకోరని అర్థం.

**11. ' ప్రకృతి భావంబునకు నూత్న పథముగాదు !**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : ప్రకృతిలో సంభవించు సహజ పరిణామ క్రమాన్ని గూర్చి కవి చెప్పే సందర్భంలోని దీ వాక్యం.

వివరణ : వేకువకాంతికి ముందు అంధకారం, వార్షానికి ముందు మేఘాడంబరమూ సహజమే. ఇది ప్రకృతి సిద్ధమైనదే. క్రొత్త విషయం కాదు. కానీ వెలుగుతో అంధకారం అంతరిస్తుంది. వాన వెలసిన వేంటనే మేఘాడంబరం తొలగిపోతుంది. కాబట్టి అధికార వర్గం ఆధిపత్యం తొలగిన వెంటనే మంచి కాలం వస్తుందని కవి అభిప్రాయం.

**12. 'భావి పరిణామ మెవ్వరు పలుక గలరు' ?**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది

సందర్భం : కాలగతిలో సంభవించే మార్పులను గూర్చి కవి పల్కే సందర్భంలోని దీ వాక్యం.

వివరణ : జీవితంలో కష్టసుఖాలు, నిమ్నోన్నతాలు చక్రరీతిలో జరుగుతుంటాయి. ఎవ్వరికీ ఎల్లకాలం సుఖమే జరుగదు. కష్టమే జరుగదు. ఇటువంటి మార్పులు అనంతంగా కాల చక్ర పరిభ్రమణంలో సహజంగా జరుగుతాయి. కాబట్టి, భవిష్యత్తులో ఎటువంటి మార్పు సంభవిస్తుందో ఎవ్వరు తెలుపగలరు ?

**13. 'ఆత్మ విజ్ఞానమయముగా నలవరింపు'**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది.

సందర్భం : కర్షకుని కష్టస్థితికి జాలిపడి, కవి ప్రబోధించు సందర్భంలోని దీ వాక్యం.

వివరణ : ఓ కృషీవలా ! నీవు అధికమైన దుర్భరస్థితిలో కొట్టుమిట్టాడక, ఆత్మజ్ఞానాన్ని పొందడం అలవాటు చేసుకో. నిన్ను శాసించగల వారెవ్వరు ? ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నుడవైతే నీకేమి లోటు ఉండదు గదా ! అని కవి అభిప్రాయపడుతున్నాడు.

**14. ' ధైర్యమున్విడకుమయ్యా, నీవు వేయింటికిన్' ?**

పరిచయం : ఈవాక్యం 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'కృషీవలుడు' అను పాఠ్యభాగం లోనిది.

సందర్భం : రైతుకు ధైర్యాన్నిస్తూ, ప్రేరణ కలిగించు సందర్భంలో కవి పల్కిన దీ వాక్యం.

వివరణ : దారిద్ర్యమనే యేటికెదురీదుతూ, దానిని దాటడానికి ప్రయత్నిస్తూ, నీటి ప్రవాహవేగానికి వెనుకంజవేయకు. నీ స్వేచ్ఛాను సారమే కార్యాన్ని, అంటే లక్ష్య సిద్దిని సాధించు. ధైర్యమును వదలవద్దు. అని కవి, కృషీవలుని ప్రేరేపిస్తున్నాడు.

### 2.13.6 పరీక్షకురాదగిన ప్రశ్నలు - సమాధానం :

1. దువ్వూరి రామిరెడ్డిగారు కృషీవలుని గూర్చి వెల్లడించిన అభిప్రాయాలను తెలుపండి.

   లేదా

   కృషీవలుని ప్రాధాన్యాన్ని జీవనచిత్రాన్ని దువ్వూరి రామిరెడ్డిగారు వర్ణించినతీరును వివరించండి

   లేదా

   దువ్వూరి రామిరెడ్డి గారు 'కర్షక పక్షపాతి' అనే అంశాన్ని మీ పాఠ్యభాగమాధారంగా చిత్రించండి.

**సమాధానం :** దువ్వూరి రామిరెడ్డి గారు ఆధునికాంధ్ర కవులలో సుప్రసిద్దులు. వీరు కర్షక కవిగా ప్రఖ్యాతి పొందారు. కృషీవలుడను ఈ పాఠ్యభాగంలో రైతుజీవితాన్ని గూర్చి చక్కగా వివరించారు.

'రైతుసోదరా! నీ జీవన విధానాన్ని వర్ణించడానికి ప్రారంభించగానే, గలగలా ప్రవహించే సెలయేరులాగా, నావాక్కు గూడా సాగుతుంది. దానిని సహించలేని అసూయాపరులు కొందరు నన్ను కర్షక పక్షపాతియని నిందిస్తారు. నా కవితావనంలో స్వేచ్ఛగా పెరిగే తీగెలాంటిది. అది సహజంగా వృద్ధి పొంది పూలతో, రెమ్మలతో సాగినట్లే నా కవితా లత గూడా స్వేచ్ఛా సంచారం చేస్తుంది. పంజరంలో బంధించబడ్డ చిలుక బయటి ప్రపంచాన్ని చూసి పంజరాన్ని దాటి బయటకు రావాలని ఆశపడుతుంది. అలాగే నా మనస్సు కూడా బాహ్యనియమాలనతిక్రమించి స్వేచ్ఛగా సంచరించాలని కోరుకుంటుంది.

ఇక్కడ కవి భావన రెండు విధాలుగా ఉంది. పరాయిపాలనలో బ్రతుకుతున్న తనకు స్వాతంత్ర్యం కావాలని ఒకటి. మరొకటి, కవిత్వపరంగా కూడా తన స్వేచ్ఛా ప్రియత్వాన్ని చాటుకుంటున్నాడు కవి.

కవి నిరంకుశుడు. భావనాస్వేచ్ఛ గలవాడు. కాబట్టి కవిత్వమనే చిలుకను పంజరంలో బంధించరాదని, దానిని స్వేచ్ఛగా సాగనివ్వాలని కోరుకుంటున్నాడు. అందుకు తన కవిత 'అరణ్యంలోని లత' అని చెప్పుకుంటున్నాడు. వనంలో పెరిగే లతకు ఎటువంటి ఆటంకాలు ఉండవు. కాబట్టి ఎవ్వరేవిధంగా భావించినప్పటికి తాను సంశయించననీ, కాలమనంతమనీ, భూమి విశాలమని, లోకంలో మార్పు సహజమనీ తన భావ ప్రకటనా స్వేచ్ఛను చాటుకున్నాడు.

రైతు భారతభూమిలో గౌరవ పవిత్రమూర్తి. రాజుల చేతిలోగల రాజదండం కన్నా రైతు చేతిలో గల నాగలి ప్రార్థనీయం. హాలికుని కోరికలెప్పుడు పరిమితంగా ఉంటాయి. అవి దైనందిన అవసరాలను దాటిపోవు. అతని ఊహ, ఆలోచన, నైపుణ్యం అంతవరకే ఉంటాయి. అంటే రైతు అత్యాశలకుపోడని, ఉన్న దానితోనే అతడు సంతృప్తి పొందుతాడని కవి భావిస్తున్నాడు.

అతను ప్రొద్దంతయు కష్టపడతాడు. ఇతరుల సంపదనుచూసి ఈర్ష్యపడడు. అతని హృదయమెంతో నిర్మలమైంది. పల్లెసీమే అతనికి సర్వప్రపంచం. భార్యకు నమ్ముకున్న ఏక పత్నీవ్రతుడు. అనుదిన పరిశ్రమే అతని మతం. పస్తులున్నప్పటికి ఇతరులు కష్టార్జితానికి ఆశ పడడు. ఏసమయమందు వచ్చిన అతిథియైనా, తృప్తిగా భుజించి వెళ్లగలడు. రైతు చేసే కృషి కారణంగా దేశ సంపదలు పెరుగుతున్నాయి. కాని రైతు పరిస్థితి మాత్రం ఎప్పుడూ దయనీయమే.

మధురమైన పండ్లను భుజించేవారు, వాటిలోని మాధుర్యాన్ని అనుభవిస్తారేగాని, ఆ పండ్ల నిచ్చిన చెట్టును గూర్చి ఆలోచించరు. అలాగే భోగభాగ్యాలనుభవించే నాయకులు రైతు కష్టాన్ని గూర్చి కొంతైనా ఆలోచించరు. అయినా అట్టి కృతఘ్నులను గూర్చి ఇతడు ఆలోచించడు. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా, కర్షకుడు తన కృషి మాత్రం వదులుకోడు.

ఈ రాజకీయప్రపంచంలో ఆచారాలకీ, శాసనాలకీ పొంతన ఉండదు. వేళ్లుపాతుకున్న పద్ధతులు అంత తేలికగా మారవు. వెలుగుకు ముందు చీకటి, వర్షానికి ముందు మేఘాలు ఆడంబరాన్ని ప్రదర్శిస్తాయి. ప్రకృతిలో ఇదికొత్తకాదు. కష్టసుఖాలు, నిమ్నోన్నతాలు చక్రగతులలాగే నిరంతరం సంభవిస్తుంటాయి. ఇక భావి పరిణామాలెవ్వరు చెప్పగలరు?

కర్షకుని శాసించగల వారెవ్వరూలేరు. దారిద్ర్యమనే ఏటికి ఎదురీదుతూ, దాని వేగానికి తట్టుకోలేక కొట్టుకొని పోయే పెద్దదుంగలే చివరకు తెప్పలుగా ఏవిధంగా సహాయపడతాయో, ఆవిధంగానే రైతు కష్టాలకు చలించక ధైర్యంగా నిలిస్తే చివరకు అతడే జాతికి దేశానికి ఆధారమౌతాడు. సత్కవుల ఆలోచనా సరళిలో భవిష్యత్తును దర్శించాలనీ అప్పుడే కాంతిపథం గోచరిస్తుందని కవి ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నాడు.

ఈవిధంగా దువ్వూరి రామిరెడ్డిగారు, "కృషీవలుని" జీవన విధానాన్ని గూర్చి చక్కగా వివరించారు.

**డా॥. జి. వైదేహి, ఎం. ఏ., ఎం.ఫిల్., పిహెచ్. డి.**

రీడర్, తెలుగుశాఖ

టి.జె.పి.యస్. కళాశాల

ఖండం - 2 ఆధునిక పద్యభాగం

# కిన్నెర నడకలు - విశ్వనాథ సత్యనారాయణ

## పాఠం - 14

2.14. 0. పరిచయం
2.14. 1. ఉద్దేశం
2.14. 2. పాఠ్యభాగ సందర్భం
2.14. 3. కఠిన పదాలకు అర్థాలు
2.14. 4. పాఠ్య భాగ వివరణ
2.14. 5. సందర్భ సహిత వ్యాఖ్యలు
2.14. 6. పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

**2.14. 0. పరిచయం :**

'కిన్నెర నడకలు' అనే ఖండిక విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'కిన్నెరసాని పాటలు' కావ్యం నుంచి గ్రహించబడింది.

విశ్వనాథ సత్యనారాయణ గారు జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన మొదటి తెలుగుకవి. కవి సమ్రాట్ బిరుదాంచితులు, పద్మభూషణులు, శతాధిక గ్రంథ రచయితలు. బహు సాహిత్య ప్రక్రియలలో సిద్ధహస్తులు. మహాకావ్యం, ఖండకావ్యం, గేయకావ్యం, నవల, నాటకం, కథానిక, విమర్శ మొదలైన అన్ని ప్రక్రియలను చేపట్టి, పట్టిన ప్రతిదాన్ని బంగారం చేసిన రససిద్ధుడు. రామాయణ కల్పవృక్షం, ఆంధ్రప్రశస్తి, శృంగార వీథి, కిన్నెరసాని పాటలు, వేయిపడగలు, ఏకవీర, నర్తనశాల, నన్నయగారి ప్రసన్న కథాకవితార్థయుక్తి, అల్లసాని వాని అల్లిక జిగిబిగి, ఒకడు నాచన సోమన్న అనేవి వీరి ప్రముఖ రచనలలో కొన్ని. వారి పాండిత్యం ఆంధ్రాంగ్ల సంస్కృత సాహితీ సాగరపారీణం, వారి ఉపన్యాసాలు విషయ గాంభీర్య చమత్కార చాతురీ విన్యాసవైఖరీ విలసితాలు.

సత్యనారాయణ గారు కృష్ణాజిల్లా నందమూరు గ్రామంలో పార్వతమ్మ, శోభనాద్రి పుణ్యదంపతులకు 10.9.1895న జన్మించారు. సహస్ర చంద్రదర్శనోత్సవానంతరం 18.10.1976న శివసాయుజ్యం చెందారు.

విశ్వనాథవారు తిరుపతి వేంకటకవులలో ఒకరైన చెళ్ళపిళ్ల వేంకట శాస్త్రి గారి శిష్యులు. గురువుగారి లాగే కళాప్రపూర్ణ బిరుదాంకితులు. ప్రభుత్వ ఆస్థానకవులుగా పనిచేశారు. శిష్య పరంపరను తీర్చిదిద్దారు. సంప్రదాయ కవిత్వాన్ని పండించారు. నమ్మిన సిద్ధాంతాన్ని నిర్భయంగా వ్యక్తీకరించి దూషణ భూషణాలను పొంది సమచిత్తంతో వ్యవహరించారు. కమ్మని కంఠంలో రాగరంజితంగా కవితాగానం చేసి శ్రోతలను పరవశింపజేశారు. లాక్షణికులు కావ్యహేతువులుగా పేర్కొన్న ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాలు మూడింటికీ కూడలిగా రాణించారు.

కవి సమ్రాట్టుల కావ్య కదంబంలో కమనీయమైనది కిన్నెరసాని పాటలు. విశ్వనాథవారి ఈ అద్భుత సృష్టి ఆంధ్ర సహృదయ హృదయకేదారాలకు అమృతవృష్టి. కిన్నెరసాని పాటలు, తెలుగు గేయకావ్య ప్రక్రియలో ఈ కావ్యాన్ని 1917లో ప్రారంభించారు. 1927లో ప్రచురించారు అగ్రగణ్యమైనది. ఈ కావ్యంలోని కొన్ని భాగాల్ని సత్యనారాయణగారు స్వయంగా పాడి ప్రజల్ని మంత్రముగ్ధుల్ని గావించారు. ఆ రోజుల్లో- ముఖ్యంగా 1920 - 1930 సంవత్సరాల మధ్య ఆయన ఏ విషయాన్ని గురించి ఉపన్యసించడానికి సభావేదిక నధిరోహించినా ప్రజలు కిన్నెరసానిపాటలు పాడమని కోరేవారు. విశ్వనాథగారు రామాయణ కల్పవృక్షాన్ని అధికంగా ప్రేమిస్తే సాహితీప్రియులు కిన్నెరసాని పాటల్ని అధికంగా ప్రేమించారు. కిన్నెరసాని పాటలు "సరసులైన కవుల చెవులకు నెక్కిన" మధుర గేయకావ్యం.

**2.14. 1. ఉద్దేశం :**

"కిన్నెరసాని పాటలు" కావ్య నేపథ్యం భారతీయ సంప్రదాయం. వివాహవ్యవస్థ ఏకపత్నీ వ్రతం, పాతివ్రత్యం, ప్రణయగౌరవం, పశ్చాత్తాపం మొదలైన ఆదర్శాలు మన పాఠ్యమైన 'కిన్నెరసానినడకల'లో ప్రతిఫలిస్తున్నాయి. ఇందులో విశ్వనాథవారి ఉపమాన పరంపరను, ప్రకృతి పరిశీలనను, లలిత శైలీ విలాసాన్ని, సంగీత లక్షణ సమ్మిళిత నాదమాధుర్యాన్ని గమనించవచ్చు. ఇది జలశాస్త్ర రహస్యనిధికూడా. కరుణ విప్రలంభ శృంగారాలు - ఆభాసరూప మనోహరాలు - ఆస్వాదనీయాలు కిన్నెరసాని వెన్నెలపైటతో మైమరపింపజేయడాన్ని అనుభవైక వేద్యం చేసుకోవచ్చు. రసరాజధానిలో రమ్యవిహారం చేయవచ్చు.

**2.14. 2. పాఠ్యభాగ సందర్భం :**

విశ్వనాథ వారి కిన్నెరసాని పాటలలో నాయిక కిన్నెరసాని. సాని అంటే స్వామిని, ప్రభ్వి. భద్రాద్రి దగ్గర కొండచుట్టూ తిరిగి ప్రవహించే వాగు పేరు కిన్నెరసాని. ఆ కొండనూ, నదినీ చూచిన తరవాత విశ్వనాథవారి మనస్సులో కలిగిన భావవీచీ ప్రచారం ఒక కథా కల్పనగా, ఒక మధుర వీణా ఝుంకృతిగా రూపుదిద్దుకుంది.

విశ్వనాథవారు ఈ కథాకల్పనపై ఏ ఇతర ప్రభావం లేదని చెప్పారు. అయినా పోలికలున్న కథలున్నాయి. (1) వాల్మీకి రామాయణంలో విశ్వామిత్రుడి చెల్లెలు కౌశికి తన అన్న సిద్ధాశ్రమంలో తపస్సు చేసుకుంటూ ఉండగా సోదరప్రేమతో ఆ ఆశ్రమం దగ్గర నదీ రూపంలో ప్రవహించడం. (2) రామరాజ భూషణుడు రచించిన వసుచరిత్రలోని శుక్తిమతి అనే నది, కోలాహలుడనే పర్వతం నాయికా నాయకులు కావడం (3) ఆంగ్ల కవిత్వంలో షెల్లీ వ్రాసిన ఎరితూజా (ARETHUSA) (4) ఆధునిక కవుల్లో ప్రముఖులైన అబ్బూరి రామకృష్ణారావుగారు వ్రాసిన 'నదీ సుందరి'.

విశ్వనాథ సత్యనారాయణ గారి తండ్రి శోభనాద్రిగారు. శోభనాద్రిగారు సంపన్నుడూ, దాత. క్రమంగా ఆయన ఆర్థిక పరిస్థితి బలహీనమైంది. కంకివంటి వాడు గగ్గి అయ్యాడు. ఆగడ్డు రోజుల్లో నందమూరిలోని వ్యవసాయం లాభించలేదు. ఋణబాధ ముమ్మరమైంది. భద్రాచలం దగ్గర కాటాపురం అనే ఊళ్లో కొంతపొలం కొని 'బొగ్గుగుట్ట' నుంచి నడచి 'గుండాల' మీదుగా కాటాపురం చేరాలి. గుండాల అడవి మధ్య 'రాళ్లవాగు', దాని తరువాత 'కిన్నెరసాని వాగు' ఉన్నాయి. ఒక్కప్పుడు వేసవికాలంలో తండ్రిగారు ఒంటరిగా కాటాపురం వెళ్లుతుండగా సత్యనారాయణగారు కూడా వారితో వెళ్లారు. కాలినడకను పోతూ కిన్నెరసాని వాగును చూశారు. కిన్నెరసాని అనే ఖండకావ్యాన్ని వ్రాశారు. ఆ తరువాత 'కిన్నెరసాని పాటలు' వ్రాశారు.

**'అసువు లీ దేహమందు నున్నంత వరకు**
**నేను విడలేను కిన్నెరసాని వాగు**
**నా మనస్సును లాగుకొన్నదది, లోక**
**దివ్యమోహనముగ పాడి తెలుగుపాట'**

అని ఖండకావ్యంలో అన్నమాట తరువాత లోకమోహనమైన తెలుగుపాట అయింది; కిన్నెరసాని పాటలు అయింది.

కిన్నెరసాని పాటలలోని కథాకల్పనం తెలుగు వారి సంసారాన్ని ఆధారంగా చేసుకొని సాగింది. కిన్నెర తెలుగుకోడలు. ఉద్విగ్న హృదయ. ఆమె అత్త, కొడుకు సుఖ మెరుగని ఉన్మత్త. ఇంటిపెత్తనానికి, మూర్ఖత్వానికి ప్రతీక. ఆమె కోడల్ని నిందించింది. ఆలుమగలు మధ్య ఆరమరికలు లేకపోయినా, అత్తపెట్టిన ఆరళ్లకు ఓర్చుకోలేక కిన్నెర దారి బట్టింది. ఆమె రసాకృతి కనుక ధునీ వైఖరి వహించింది. భర్త శిలాత్యుడు, తల్లికీ భార్యకు చెప్పలేక బండలాగా పడిఉన్నాడు. కాబట్టి కొండ అయిపోతాడు. ఇద్దరి దుఃఖాలు ఒకటే అయినా సంసారభేదం వల్ల భిన్న పరిణామాలు తారసిల్లాయి. కిన్నెర లలితమధురోద్వేగ స్వభావం కలది కనుక నది అయింది. భర్త ధీరగంభీరుడు కాబట్టి శిలీభూతుడయ్యాడు.

'కిన్నెరసాని పాటలు' కావ్యంలో ఎనిమిది భాగాలు ఉన్నాయి. కిన్నెర పుట్టుక, కిన్నెరనడకలు, కిన్నెర నృత్యం, కిన్నెర సంగీతం, కడలిపొంగు, కిన్నెర దుఃఖం, గోదావరీ సంగమం, కిన్నెర వైభవం. 'కిన్నెర పుట్టుక'లో విప్రలంభం, వియోగశృంగారం, నాయకపరంగా ఉంది. ఆమె నదిగా మారిన తరువాత భర్త విలపించిన ఘట్టం.

'కిన్నెరనడకలు'లో విప్రలంభం నాయికాపరం 'కిన్నెరనృత్యం', 'కిన్నెర సంగీతం'లో సంయోగశృంగారం ధ్వనిస్తుంది. 'కిన్నెర సంగీతం'లో ఆమె గర్భవతి అయిన లక్షణాలు క్రమంగా సూచించబడ్డాయి. 'కడలి పొంగు'లో సముద్రుడి రతిభావం సువ్యక్తం. 'కిన్నెర దుఃఖం'లో ఆశలడుగంటిన కరుణస్థితి. 'గోదావరీ సంగమం'లో నాయికాశీల రక్షణకు ఆశ్రమ ప్రాప్తి కలిగింది. 'కిన్నెర వైభవం'లతో నిర్వాణ ప్రయత్నం.

కిన్నెర ఇంటినుంచి బయటకు వచ్చి అడవి దారిపట్టింది. భర్త ఆమె వెంట పరుగెత్తాడు. శోకించాడు. ఆ తరువాత రాయి అయ్యాడు. కిన్నెర ఆ స్థితిని చూచి శోకించింది. ఆమె ప్రవహిస్తూ ఉన్నది. సముద్రుడామెను చెరపట్టాలని ప్రయత్నించాడు. పెద్దముత్తైదువ గోదావరీదేవి ఆమెను ఒడిలో చేర్చుకొని రక్షించింది. గోదావరిలో కలసి భద్రాద్రి రాముణ్ణి సేవించింది. బ్రహ్మాసాయుజ్యాన్ని పొందింది.

మన పాఠ్యం కిన్నెరనడకలు. ఇందులో కిన్నెర అందాలనడకలు, కిన్నెర విరహవేదన, పశ్చాత్తాపం వ్యక్తమౌతున్నాయి.

**2.14. 3. కఠిన పదాలకు అర్థాలు :**

| | | | |
|---|---|---|---|
| **1.** | తరుణి | = | యౌవనంలో ఉన్న స్త్రీ |
| | తరకల్లు | = | తరకలు ; తెట్టెలు, (అలలు) |
| | పరుగుల్లు | = | పరుగులు |
| **2.** | వొ(ఒ)దుగుల్లు | = | ప్రక్కకు తొలగడాలు |
| | సుదతి | = | చక్కని పలువరుసగల స్త్రీ |
| | ముదిత | = | సంతోషాన్ని పొందిన స్త్రీ |
| | నురుగుల్లు | = | నురుగులు |
| **3.** | కడరాళ్లు | = | కోసురాళ్లు |
| | గ(క)డిచింది | = | దాటింది |
| | మొరసింది | = | మోగింది |
| | జడిసి | = | భయపడి, కదలి, తొలగి |
| | కడలు + అందు | = | దిక్కుల్లో, ప్రక్కల్లో, సమీపంలో |
| | వొ(ఒ)రిసింది | = | రాచుకుంది |
| | సుడిసి | = | చుట్టుకొని |
| | జడలుగా కట్టింది | = | పాయలుగా ఏర్పడింది |
| **4.** | కాంత | = | కోరదగ్గ స్త్రీ |
| | తరగచాలుల మధ్య | = | కెరటాల వరుసల నడుమ |
| | నురుసుపిండులతోడ | = | నురుగు గుంపులతో |
| **5.** | పదువు కట్టిన | = | గుంపు కట్టిన (బారులు తీరిన) |
| | లేళ్ల కదుపులా | = | లేళ్ల మందలాగా |
| | తోచింది | = | ప్రత్యక్షమైంది |
| | విరిసింది | = | ఉప్పొంగింది. |
| **6.** | నాతి | = | స్త్రీ |
| | బెడగుపోయిన | = | అందం పోయిన |
| | రత్నపేటి | = | రత్నాల పెట్టె |
| **7.** | ముగద | = | ముగ్ధ, ఉదయిస్తున్న యౌవనం కలది<br>పంద్రెండేండ్లు నిండిన వయస్సు కలది, అందం కలది. |
| | వెలది | = | నిర్మలమైనది, అందమైనది, ( స్త్రీ ) |
| **8.** | పూని | = | ప్రయత్నించి |
| | పొగిలించి | = | కుమిలిపోయింది |
| | ముక్తగీతిక | = | ఒకేసారి వెలువడిన పాట |
| **9.** | మనిసి | = | మనుష్యరూపంలోని |
| **10.** | ప్రణయమ్ము | = | ప్రేమ |
| | చెలిమి | = | స్నేహం |

| | | | |
|---|---|---|---|
| | సొలసె | = | పారవశ్యాన్ని పొందింది |
| 11. | పతితోడి | = | భర్తతోడి |
| | వనిత | = | అనురాగవతి అయిన స్త్రీ |
| | వనరింది | = | దీనాలాపా లాడింది; శోకించింది, ఏడ్చింది. |
| 12. | తుదకు | = | చివరకు |
| | ఎద + పోక | = | మనస్సుపోక |
| | అలవోక | = | స్వేచ్ఛ |
| | గుట్టపై | = | చిన్నకొండ మీద |
| | అతివ | = | స్త్రీ (కిన్నెరసాని) |
| | వెతనొంది | = | దుఃఖాన్ని పొంది |
| | బిట్టు | = | శీఘ్రంగా |
| | ఘోషించింది | = | మోగింది |
| 13. | మాద్రిగా | = | మాదిరిగా |
| | నీటుకాణ్ణి | = | ప్రియుణ్ణి (శ%ంగార గర్వం కలవాణ్ణి) |
| 14. | నాకు మల్లే | = | నా లాగే |
| | జలముగా | = | నీరుగా |
| | కెరటాలు | = | తరంగాలు |
| 15. | ఆన పెట్టితివి + ఏని | = | ఆజ్ఞాపిస్తే |
| 16. | కలగిపోయింది రా | = | సంక్షోభించింది రా |
| | బడలి పోయిందిరా | = | అలసిపోయింది రా |
| 17. | నీ + అందు | = | నీ పట్ల, నీవిషయంలో |
| 19. | తగులు | = | సంబంధం |
| 21. | నీలిమబ్బులన్ + పోలు | = | నల్లటి మేఘాలలాంటి |
| | నిడివి | = | పొడవైన |
| | చేరగా తీవు కాబోలు | = | దగ్గరకు తీసుకోవు (లాగుకోవు) కాబోలు |
| | నిమురవు కాబోలు | = | ప్రేమతో తడమవు కాబోలు |
| 22. | పదములు | = | పాదాలు |
| | తెలచి | = | నమస్కరించి |
| | తేర్చుకుంటూ | = | ఉపశమింపజేసుకుంటూ |
| 23. | తలిరు + ఆకు | = | చిగురుటాకు |
| | తార్చి | = | దగ్గరకు తీసుకొని |
| | నా మోమును | = | నాముఖాన్ని |
| | నా + ఒడల్ | = | నా శరీరం |
| | మివులన్ + అందము +కుప్ప | = | మహాసౌందర్య రాశి |
| | ఎల్లతావుల | = | అన్నిచోట్ల |

| | | | |
|---|---|---|---|
| **24.** | రొద | = | ధ్వని |
| | పావురాయి | = | పావురం |
| | డిగ్గి | = | దిగి |
| **25.** | నెలత | = | స్త్రీ |
| | పలపలా | = | కన్నీరుకారుతూ ఉండగా కృశించి |
| | కుందింది | = | కుంగిపోయింది. |
| **26.** | చలము + పెట్ట | = | మాత్సర్యాన్ని కలిగించగా (పట్టుపట్టగా) |
| | చాన | = | స్త్రీ |
| | బాల | = | స్త్రీ (పదహారేండ్ల లోపు పిల్ల) |
| **27.** | పలుపు + ఓసి | = | పలుపు వేసి (మెడ తాడువేసి) |
| | లేగలా | = | ఆవుదూడలాగా |
| **28.** | జాలుగా | = | సన్నటి ప్రవాహంగా |
| | వొ(ఒ)లక బోసిన + అట్లు | = | చిందేటట్లు, కారేటట్లు, పోసినట్లుగా |
| | వెల్లి + పారిన + అట్లు | = | ప్రవాహంగా ప్రవహించినట్లు , పరంపరగా ప్రవహించినట్లు |
| **29.** | దిశా + ఆళిని | = | దిక్కుల సమూహాన్ని |
| | పాల + ఆట్రగడము | = | తెల్లదనమున్న వడ్లు |
| | ముద్ద + ఆలి మనస్సు | = | ముగ్ధ అయిన స్త్రీ మనస్సు |
| **30.** | పరికిణీ | = | పావడ, గాగర |
| | తొక్కి + ఆడు | = | తొక్కి ఆటలాడే |
| | తెల్లని + ఆఁబెయ్యలం | = | తెల్లని ఆవుపెయ్య (పాలు విడిచిన దూడ) లాగా |
| | సెలవి + పారిన | = | పెదవి మూల దాకా ప్రవహించిన |
| **31.** | చందము + లు + కాన్ | = | విధాలు అయ్యేటట్లుగా |
| | గడియ | = | ఇరవైనాలుగు నిమిషాలు |
| **32.** | తోగు | = | ముంపు, వాగు |
| | కొబ్బరిపాలు | = | కొబ్బరికాయలోని నీరు |
| | వాకలు | = | ప్రవాహాలు |
| | వెయ్యి + ఆవులు | = | వెయ్యి (చాలా) గోవులు |
| | పిదికిన+ అట్లు +అయిపోయే | = | పాలిచ్చినట్లు అయింది. |
| **33.** | తారకల వెంట | = | నక్షత్రాల వెంట |
| | తలిరు పూవుల వెంట | = | లేత పూవుల వెంబడి |
| | తావిలా | = | పరిమళం లాగా |
| **34.** | వొ(ఒ)య్యారి నడలతో | = | విలాసమూ సౌందర్యమూ గల నడకలతో |
| | భూదేవతలు | = | బ్రాహ్మణులు |
| **35.** | పాఱు | = | ప్రవహించే |
| | పజ్జలందున | = | ప్రక్కల, సమీపంలో |

| | | | |
|---|---|---|---|
| | కొన | = | చివర |
| | విచ్చి | = | విప్పి |
| **36.** | తెఱవ | = | స్త్రీ |
| **37.** | తోరము + ఐ | = | అధికమై |
| | విరియుచూ | = | చీలుతూ |
| **38.** | అడుగు + అడుగు | = | ప్రతి అడుగునా |
| | నెమ్మదితనము | = | నిదానం (తొందరపాటు లేకపోవడం) |

**2.14. 4. పాఠ్యభాగ వివరణ :**

కిన్నెరసాని బాగా కరగిపోయింది. అలా కరిగివరదలై ప్రవహించింది. తరకలు కట్టింది. పరుగులు పెట్టింది. కిన్నెరసాని బాగా కదలింది. ఒదుగుతూ ప్రవహించింది. సుళ్లు తిరిగింది. నురగలు కక్కింది. కోసురాళ్లు మీద నడిచింది. పచ్చిక బయళ్లను దాటింది. సుడులలో బాగా ధ్వనించింది. అటుప్రక్క ఇటుప్రక్క రాచుకుంది. పాయలు కట్టింది. కిన్నెర బాగా కరిగిపోయింది. తరంగపరంపర మధ్య తళతళా మెరిసింది. ఫేనపుంజాలతో బిరబిరా నడిచింది. ఇసుకనేలలమీద బుసబుసా పొంగింది. కదులుతూ ఉన్న కిన్నెరసాని బారుతీరిన లేళ్ల మందలా సాక్షాత్కరించింది. కదుల్తూ ఉన్న తెల్లని పూలనదిలా కదలింది. వదలిన తెల్లత్రాచు పడగలా ఉప్పొంగింది. కిన్నెరసాని నడుస్తూ ఉన్నప్పుడు తొడిమవీడిన పువ్వులాగా, బాగా సిగ్గుపడుతున్న రాజకన్యలాగా, అందాన్ని కోల్పోయిన రత్నాల పెట్టెలాగా కన్పించింది.

కిన్నెరసాని తన భర్త రాయిగా పడిఉన్న ప్రదేశాన్ని వదలలేక అక్కడక్కడే తిరిగింది. బాధతో గలగలా తిరిగింది. తాను నదిగా ఎందుకు మారానని తన మనస్సులో కుమిలి పోయింది. ముక్తగీతికలాగా ధ్వనించింది. ఒకచోట నిలువలేక పరుగులు తీసింది. మళ్లీ ఏ ఉపాయం చేతనైనా మానవరూపాన్ని పొందాలన్న ఆపలేని కోరికతో, ఏడ్చింది. 'తాను వదలిపెడితే తన భర్త ఓర్చుకోలేడు కాబోలు' ననుకున్నది. బ్రతికి ఉన్నప్పుడు ఇంత ప్రేమ ఉందని చెబితే ఇంకా ఎంత స్నేహం ఉండేదో అని ఆలోచించి ఆలోచించి వివశురాలైంది. అటువంటి భర్తతోడి కాపురాన్ని ఇలా చేసుకున్నానే అని ఎక్కడా లేనంతా సంతాపాన్ని పొందింది. దీనాలాపాలు కావించింది. చిట్టచివరకు ఏమీ చేయడానికి మనస్సుపోక, భర్త రాయిగా మారి పడిఉన్న ఆ చిన్న కొండను తన తరంగహస్తాలతో చుట్టి ఎంతో ఆక్రోశించింది.

కొండలాగా పడిఉన్న తన నీటుకాణ్ణి కౌగలించుకొని 'పలకవా' ? అంటూ పలకరిస్తూ పైనవాలి ఇలా విలపించింది. నాథా! నాలాగే నీవూ నదివై ప్రవహించు. ఇద్దరం నీరై కలిసిపోదాం. అలలు అలలుగా కౌగలించుకుందాం! ఇక నేను నీ పట్ల అపరాధం చేయను. నీ ఆజ్ఞను జవదాటకుండా నడుచుకుంటాను. ఇక జన్మలో కోపపడను. నీభార్య అయిన కిన్నెర ఎంతో సంక్షోభానికి గురి అయింది, నలిగిపోయింది, అలసి పోయింది. నేను చేసిన తప్పును ఎలాగైనా దిద్దుకుంటాను. నీ త్రోవనీది, నా త్రోవనాది అవుతుందా? మళ్లీనాతో నీవు మాటాడవు గదా!

కిన్నెరసాని తనభర్తను 'ఓనాథ! ఓనాథ!' అని ఎడతెగకుండా పిలిచింది. పిలిచి పిలిచి ఆపివేసింది. ఆమె అలసిపోయి పడిపోయినట్లయింది. ఆమె కెరటాలు తగ్గిపోయాయి. కిన్నెరసాని శోకించి శోకించి మండి ఆరిన నిప్పులా ఆరిపోయింది. తనకర్మ ఇంతే ననుకున్నది మనస్సులో. తనకిక భర్తృ సంబంధం లేదనుకున్నది. తాను చేతులారా చేసుకున్నానని ఏడ్చిన ఏడుపులా, పడిన దుఃఖమూ - అవి కూడా నీరై పోయి ఆమెలో కలిసినాయి.

కిన్నెర తన దీనాలాపాల్లో పూర్వ స్మృతుల్ని ఇలా నెమరువేసుకుంటున్నది. నీలిమేఘాల్లాంటి నీ దీర్ఘ బాహువులు ఇక నన్ను కౌగలించడానికి రావు కాబోలు! చాలా ప్రేమతో దగ్గరకు తీసుకోవు కాబోలు! సున్నితంగా నా దేహాన్ని నిమరవు కాబోలు! నేను కోపాన్ని పొంది నీ ప్రక్కన ఉన్నప్పుడు, వద్దన్న కొద్దీ నా కాళ్లు ఒత్తుతూ, నమస్కరించి కౌగిలిలోకి చేర్చుకుంటూ, నాకు ప్రసన్నత కలిగిస్తూ నా రొమ్ము మీద నీ తలను ఆనించడానికి రావు కాబోలు ! నాముఖాన్ని దగ్గరకు తీసుకొని చిగురాకులాంటి ఎర్రని మెత్తని పెదవితో అద్దడానికి రావు కాబోలు ! నా శరీరాన్ని సౌందర్యరాశి అంటూ అన్ని చోట్లా ముద్దుపెట్టడానికి రావు కాబోలు.

ఈ విధంగా కిన్నెరసాని సన్నని గొంతుతో ఏడ్చింది. ధ్వని తగ్గిన పావురాయి గొంతులాగా ఉంది ఆమె కంఠం. తనలో తాను మెల్లగా రొదచేసుకుంటూ పల్లపునేలకు దిగి పడిపోయింది.

అప్పుడు జలదేవతలు వచ్చి కిన్నెర సానిని పదపదమంటూ బలవంతపెట్టారు. అప్పుడు భర్తచుట్టూ మళ్లీ మళ్లీ తిరిగింది, వలవలా ఏడ్చింది. కన్నీరు కార్చుతూ కృశించి క్రుంగిపోయింది. జలదేవతలు గట్టిగా పట్టుబట్టారు. ఆమె పతి గుట్టను - తన భర్త శిలీభూతుడైన చిన్న కొండను వదలలేక పోలేక పోలేక ఉంది. చిట్టచివరకు తల్లి దగ్గర నుంచి మెడకు పలుపువేసి లాగిన ఆవుదూడలా కదలింది. కవి ఇక్కడ పూర్వం కిన్నెర అత్తవారింటికి తొలిసారి ప్రయాణమైన సన్నివేశాన్ని స్ఫురింపజేస్తున్నాడేమో!

చిట్టచివరకు కిన్నెర ముందుకు సాగింది. జాలుగా సాగింది. ఆవు పొదుగునుంచి పాలు ధారకట్టినట్లు, వనదేవతలు నీళ్లు ఒలకపోసినట్లు, తల్లి చల్లని ప్రేమ ప్రవహించినట్లు సాగింది. కిన్నెర జాలుగా జలజలా పొంగుతూ ప్రవహించింది. ఆదృశ్యం లేత ఎండలు నలుదిక్కులా కమ్ముకొన్నట్లు, పాలాట్రగడం వడ్లను పాతరనుంచి తీసినట్లు, ముద్దరాలి మనస్సు పొంగినట్లూ ఉంది. పరికిణీ తొక్కుతూ నడుస్తున్న పదిసంవత్సరాల కన్యలాగా, చిన్న చిన్న గంతులు వేస్తున్న తెల్లటి ఆవుదూడలాగా, సెలవులు దాటిన పసిపాపబోసి నవ్వులాగా కిన్నెర పొంగులు వారుతూ నడిచింది. ఇలా ఎన్నో రకాల అందాలతో నడిచింది. గడియలోనే అడవి వాగుల రాణి అన్నట్లు ఆమె కనిపించింది. కిన్నెర బంగారు తీగలో పానకం లాగా, కొబ్బరి పాల ప్రవాహంలాగా, వెయ్యావులొక్కసారి పిదికితే కనిపించే క్షీరధారలాగా అయిపోయింది.

జలదేవతలు ముందు నడిచారు. వారి వెనుక కిన్నెర నడిచింది. తెల్లని నక్షత్రాలను అనుసరిస్తున్న వెలుగులాగా, లేతపూల సాగే పరిమళంలాగా, తెలుగుపాటలను వెన్నంటి ఉండే మాధుర్యం లాగా జలదేవతలను కిన్నెర అనుసరించింది. శృంగా ంతో కూడిన నడకలతో వచ్చే కిన్నెరసాని మీద వనదేవతలు పూలు కుమ్మరించారు. బ్రాహ్మణు లామెకు ఎదురువెళ్లి దీవించారు. వాయుదేవతలు ఆహ్వానగీతిక లాలపించారు. ప్రవహిస్తున్న కిన్నెరసానికి ఉభయపార్శ్వాలలో కోకిలలు తమగొంతుకొనలు విప్పి పాడినాయి. పికిలిపిట్టలు బాగా కూసినాయి. తెలుగు పిట్టలు మైమరచి గానం చేశాయి.

కిన్నెరసాని తాను పోయినంత దూరమూ వెనక్కు తిరిగి చూస్తూ వెళ్లింది. భర్తను చూస్తూ వెళ్లింది. తిరిగి తిరిగి నాథుణ్ణి చూస్తూ వెళ్లింది. అప్పుడు భూమి తనంత తానుగా ఎక్కువగా చీలుతూ త్రోవను ఏర్పాటు చేసింది. అంతేకాని ఆమె కెరటాలతో చొచ్చుకు పోవడం లేదు. కిన్నెరసాని బ్రతికి ఉన్నరోజుల్లో, ఎంత ఒయ్యారంగా ఉండేదో అంత ఒయ్యారాన్ని అడుగడుగునా చూపింది. ఎంత నిదానంగా ఉండేదో అంత నిదానాన్ని చూపింది. అవి కిన్నెరనడకలు. అది కిన్నెర అందం.

## 2.14. 5. సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. నడిచింది కడరాళ్ళు గడిచింది పచ్చికల్

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెరసాని ఏరుగా మారిన తరువాత ప్రవహిస్తూ ముందుకు సాగిన తీరును వర్ణిస్తూ కవి అన్నమాట.

**వివరణ :** కిన్నెరసాని నదీ రూపంలో కోసురాళ్ల మీద నడచింది. పచ్చిక బయళ్లను దాటింది. She left down the rocks. Her steps paved with green అన్నషెల్లీ 'ఏరితూజా' నడక లిటువంటివే.

ఇందులో కవి స్వభావోక్తి సుందరమైన వర్ణనావైదగ్ధ్యం గోచరిస్తున్నది. ఇందులో 'ఖండగతి' అనే మాత్రాఛ్ఛందస్సు ఉంది.

2. **'తరగ చాలుల మధ్య తళతళా మెరిసింది'**
**'నురసు పిండుల తోడ బిరబిరా నడిచింది'**
**'ఇసుక నేలలపైన బుసబుసా పొంగింది.'**

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండికనుంచి గ్రహించబడ్డాయి.

సందర్భం : కిన్నెరసాని ఏరుగా ప్రవహిస్తున్న తీరును, ఒక్కొక్క సందర్భంలోని సొరుసు (అందాన్ని) కవివర్ణించిన సందర్భంలోనిది.

వివరణ : కిన్నెరసాని తరగల వరుసల మధ్య తళతళా మెరిసింది. నురుగు మొత్తాలతో బిరబిరా సాగింది. ఇసుకనేలల మీద బుసబుసా పొంగింది.

తరగల విరుపులలో సూర్యకాంతి ప్రసరించినప్పుడు ప్రభవించే మెరుపును విశ్వనాథవారు వివిధ కావ్యాల్లో పేర్కొన్నారు.

ఇందులో 'తళతళా' 'బిరబిరా' 'బుసబుసా' అనే చక్కని ధ్వన్యనుకరణ శబ్దాల కూర్పు అందంగా ఉంది. ధ్వన్యనుకరణ పద శైలికి ఈ 'ఖండగతి' పాదాలు అఖండమైన ఉదాహరణలు

3. **'పదువు కట్టిన కదుపులా తోచింది'**
**'కదలు తెల్లని పూలనదివోలె కదిలింది'**
**'వదలు తెల్లని త్రాచు పడగలా విరిసింది'**

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహింపబడ్డాయి.

సందర్భం : కిన్నెరసాని వాహినీ వైఖరిని వర్ణిస్తూ కవి అన్న మాటలు.

వివరణ : కిన్నెరసాని కదులుతూ లేళ్ల గుంపులా, తెల్లని పూలనదిలా, వదలిన తెల్లత్రాచు పడగలా ఉంది. ఇక్కడ విశ్వనాథవారి ప్రకృతి పరిశీలన, ఉపమాలంకార ప్రయోగ నైపుణ్యం, రచనలోని సమత మనోహరంగా ఉన్నాయి. ఇందులోని ఉపమానాలన్నీ చలనశీలాలై కిన్నెర సౌందర్య వ్యంజకాలై రాణిస్తున్నాయి.

4. **తొడిమ యూడిన పూవు పడతిలా తోచింది**
**కడు సిగ్గుపడు రాచకన్నెలా తోచింది**
**బెడగు పోయిన రత్న పేటిలా తోచింది.**

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యం లోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** కిన్నెరసాని గమనాన్ని వర్ణిస్తూ కవి అన్నమాటలు.

వివరణ : కిన్నెరసాని తొడిమ ఊడిన పూవులాగా, సిగ్గులమొగ్గ అయిన రాజకన్యలాగా, కాంతి విహీనమైన రత్నాలపెట్టెలాగా ఉంది.

ఇక్కడ విశ్వనాథగారు ప్రయోగించిన ఉపమానాలు కిన్నెర లాలిత్య సౌందర్య కాంతి విషాదాలను సూచిస్తున్నాయి.

5. **మనిసి కిన్నెరసాని నగుదామ యనిపించి**
**ఆపలేనంత కోరిక చేత విలపించి**
**ముగుద కిన్నెరసాని మొరసింది !**

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండికనుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెరసాని తనభర్త రాయిగా మారిపడిఉన్న చోటనే బాధతో తిరగింది. తాను నదిగా ఎందుకయ్యానా ? అని బాధతో, ఒకచోట నిలువలేక పరుగులు తీసిన సందర్భంలో కవి అన్నమాట.

వివరణ : కిన్నెరసాని ఏ ఉపాయం చేతనైనా మళ్లీ మానవరూపాన్ని పొందాలనుకున్నది. కాని అది సాధ్యంకాక శోకంతో ఏడ్చింది.

కిన్నెర ఉద్విగ్న హృదయ. తొందరపడి ఇల్లు దాటి వచ్చి నదీరూపాన్ని పొందింది. కొంత సమయం తరువాత పొరపాటును సర్దుకుందామంటే, పూర్వస్థితిని పొందుదామంటే సాధ్యం కాలేదు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లయింది. చివరకు శోకమే మిగిలింది.

ఈవాక్యం 'తొందరపడి ఏపనీ చేయరాదు. అవివేకమే పరమాపదాలకు ఆస్పదం' అన్న భారవి సూక్తిని గుర్తు చేసున్నది.

6. బ్రతికుండగా యింత ప్రణయమ్ము కలదంచు
తెలిపితే యింకెంత చెలిమి వుండే దంచు
తలపోసి తలపోసి సొలసె!

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెరసాని తనభర్త రాయిగా మారిపడి ఉన్నచోటనే బాధతో తిరిగింది. తాను నదిగా మారడం చూచిన తనభర్త రాయిగా మారడం ఆమె ఊహించని సంఘటన. దాన్ని మననం చేసుకుంటూ కిన్నెర బాధపడడాన్ని కవి వర్ణించిన సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణం :** తాను దూరమైతే తన భర్త ఓర్చుకోలేడు కాబోలుననుకున్నది. బ్రతికి ఉన్నప్పుడు ఇంతప్రేమ ఉన్నట్లు చెబితే ఇంకా ఎంతో స్నేహం ఉండేది కదా అనుకున్నది.

తనను అత్త నిందించినప్పుడు భర్త ఎవరికీ ఏమీ చెప్పకపోవడం వల్ల తనపై అతనికున్న ప్రేమను తక్కువగా అంచనా వేసింది. ఇప్పుడు తన భర్త శిలీభూతుడు కావడాన్ని చూచి అతని ప్రేమను అవగతం చేసుకుంది. బాధపడి వివశురాలైంది.

లోకంలో కొందరు గంభీరస్వభావం కలవారు ఉంటారు. వారి హృదయాలను మహాకవుల కావ్యాలను చదివినట్లు 'సారమతితో' 'లోనారసి' చూడాలి. కిన్నెర భర్త అటువంటి గంభీరుడు.

'అనిర్భిన్న గభీరత్వా దంతర్గూఢ ఘన వ్యథః
పుటపాక ప్రతీకాశో రామస్య కరుణోరసః'

అన్న భవభూతి శ్లోకం ఈ సందర్భంలో స్ఫురిస్తున్నది.

7. నాకు మల్లే నీవు నదివోలె పారరా
జలముగా యిద్దరము కలిసి పోదామురా
కెరటాలు కెరటాలు కౌగిలిద్దామురా!

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** తాను నదియైన తర్వాత, తనభర్త రాయిగా మారిన తర్వాత కిన్నెరసాని పశ్చాత్తాపాన్ని పొందింది. కొండమాదిరిగా పడిఉన్న తన భర్తను కౌగిలించుకొని ఏడుస్తున్న సందర్భంలోవి ఈ వాక్యాలు.

**వివరణ :** ఓనాథా ! నాలాగే నీవు కూడా నదిలా ప్రవహించు. ఇద్దరం నీరుగా కలిసిపోదాం. తరంగాలు తరంగాలుగా కౌగిలించుకుందాం.

ఈ పంక్తుల రచనలో విశ్వనాథవారు, తమ పూర్వులైన రాయప్రోలు సుబ్బారావుగారు ప్రతిపాదించిన అమలిన శృంగారాన్ని అనుసరించినట్లు కనిపిస్తున్నది. ఇది అంగాంగ శృంగార వర్ణనలులేని భావనా ప్రధానమైన ఆధునిక ధోరణి.

8. నీ యందు తప్పింక నేను చెయ్యను లేర
ఆన వెట్టితిలేని అడుగు దాటను లేర
ఇక జన్మలో కోపమింత పొందను లేర !

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెర సాని పాటలు' గేయ కావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** తాను నదియైన తర్వాత, తనభర్త రాయిగా మారిన తర్వాత కిన్నెరసాని పశ్చాత్తపాన్ని పొందింది. కొండమాదిరిగా పడిఉన్న తన భర్తను కౌగిలించుకొని ఏడుస్తున్న సందర్భంలోనివి ఈ వాక్యాలు

వివరణ : ఓ నాథా ! నేను ఇక తప్పు చేయను నువ్వు ఆజ్ఞాపిస్తే అడుగుదాటకుండా ఉంటాను. ఇక జన్మలో ఇంత కోపాన్ని పొందను.

విశ్వనాథవారు ఇల్లు వదలిన స్త్రీ పడే బాధల్ని కిన్నెరసాని పాటల్లో నిరూపించారు. తమ సమకాలికులైన చెలం ప్రభృతులు ప్రవచించిన అతివేల స్వేచ్ఛ ఈయనకు ఆమోదయోగ్యం కాదు. ఈ 'చెలియలికట్ట' వల్ల విశ్వనాథవారు వివాదాస్పదులయ్యారు.

విశ్వనాథవారు నమ్మిన సనాతన ధర్మాన్ని వ్యక్తం చేసే వాక్యాలివి.

**9.** **మండి యారిన నిప్పు మాద్రిగా నారింది**
**తన కర్మ మింతియే యని లో ననుకుంది**
**తన కింక పతితోడి తగులు లేదనుకుంది !**

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** తాను నదియైన తర్వాత, తన భర్త రాయిగా మారిన తర్వాత కిన్నెర పశ్చాత్తాపాన్ని పొందింది. పలవించి పలవించి ఆగిపోయింది. ఆ సందర్భంలో కవి అన్నమాట.

వివరణ : కిన్నెరసాని కెరటాలు తగ్గి మండి ఆరిన నిప్పు మాదిరిగా ఉంది. ఇక తన కర్మ ఇంతే అనుకుంది. తనకిక భర్తతోడి సంబంధం లేదనుకుంది.

ఇక్కడ 'మండి ఆరిన నిప్పు' సముచితమైన ఉపమానం. విశ్వనాథవారి ఉపమాలంకార ప్రయోగానికి చక్కని నిదర్శనం. ఆ తరువాత భారతీయ సంప్రదాయానికి కీలకమైన కర్మసిద్ధాంతాన్ని ప్రస్తావించారు విశ్వనాథ వారు. కిన్నెర తన కర్మ ఇంతే ననుకున్నదన్నారు. ఆమె తనకిక భర్తృ సంబంధం లేనట్లేనని నిరాశకు లోనుకావడానికి కవి కౌశలంతో కథనం చేశాడు.

**10.** **అవి కొండ జలములై ఆమెలో కలిసినై .**

**పరిచయం :** ఈవాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తాను నదిగా మారిన తర్వాత, తన భర్త రాయిగా మారిన తర్వాత కిన్నెరసాని పొందిన దుఃఖాన్ని వర్ణిస్తూ కవి అన్నమాట.

వివరణ : కిన్నెరసాని ఏడ్పులూ, దుఃఖమూ ఇవి కూడా నీటిరూపమై కిన్నెరలో కలిసిపోయాయి. కిన్నెర నీటి రూపాన్నే కాకుండా కన్నీటి రూపాన్ని కూడా కవి అద్భుతంగా వర్ణించాడు. ఈ వాక్యం విశ్వనాథవారి అత్యద్భుత భావనాశక్తికి నిదర్శనం.

**11.** **వలదన్న కొద్ది నా పదము లొత్తుచు నీవు**
**తెలచి కౌగింటిలో తేర్చుకుంటూ నీవు !**

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెరసాని 'విప్రలంభం' ఇక్కడ వర్ణితం. గతించిన తమ శృంగారం కిన్నెర స్మృతి పథంలో తరంగితమౌతున్న సందర్భం. కిన్నెర అన్నమాటలు ఇవి.

వివరణ : వద్దనే కొద్దీ నీవు నా పాదాలొత్తావు. నాకు నమస్కారం చేస్తూ కౌగిలిలో చేర్చుకున్నావు.

కుపిత నాయికను ప్రసన్నం చేసుకొవడానికి నాయకుడనుసరించే మార్గాలలో 'నతి' పాదనమస్కారం ఒకటి. ముక్కు తిమ్మన పారిజాతాపహరణ ప్రబంధంలో ఈ 'నతి' ఎన్నో వంపు సొంపులు పోయింది. ఆ సౌందర్య కిరణాలు ఈ వాక్యాలలో కనిపిస్తున్నాయి.

**12.** **రొదయడంగిన పావురాయి గొంతుక వోలె !**

**పరిచయం :** ఈ వాక్యం 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

సందర్భం : కిన్నెర తమ శృంగారానుభవాన్ని సన్నగొంతుతో అనుకున్న సందర్భంలో కవి అన్నమాట.

వివరణ : కిన్నెర కంఠం ధ్వని తగ్గిన కపోతి కంఠంలా ఉంది. విశ్వనాథవారి ప్రకృతి పరిశీలన ఈ వాక్యంలో వ్యక్తమౌతున్నది.

13. తల్లి దగ్గర నుండి తన మెడకు పలుపోసి
లాగగా బడ్డట్టి లేగలా సాగింది !

పరిచయం : ఈ వాక్యం 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

సందర్భం : కిన్నెరసాని మెల్లమెల్లగా రొదచేసుకుంటూ పల్లపు నేలలో పడిపోయింది. అప్పుడు జలదేవతలు వచ్చి పదపదమని తొందర పెట్టారు. కిన్నెరసాని పతిగుట్టను వదలలేక ఎట్టకేలకు ముందుకు సాగింది. ఈ సందర్భంలో కవి అన్నమాట ఇది.

వివరణ : తల్లి దగ్గరనుంచి మెడకు పులుపువేసి లాగబడ్డ ఆవుదూడలాగా సాగింది కిన్నెరసాని.

ఈ ఉపమానం వల్ల విశ్వనాథ వారికి పాశుపాల్య జీవనంతో ఉన్న (Pastoral Life) పరిచయం వ్యక్తమవుతున్నది.

14. ఆవు పొదుగున పాలు ధార కట్టిన యట్లు
వనదేవతలు నీళ్లు వొలక బోసినయట్లు
తల్లి చల్లని ప్రేమ వెల్లివారిన యట్లు !

పరిచయం : ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహింపంబడింది.

సందర్భం : కిన్నెర ప్రవాహాన్ని వర్ణిస్తూ కవి అన్న మాట.

వివరణ : ఆవు పొదుగునుండి పాలు ధారగా ప్రవహించినట్లు , వన దేవతులు నీళ్ల ఒలక బోసినట్లు, తల్లి చల్లని ప్రేమ ప్రవహామైనట్లు కిన్నెరసాని జాలుగా సాగింది.

విశ్వనాథవారు ముందు మూర్తమైన (Concrete) ఉపమానాన్ని చెప్పి తరువాత అమూర్తమైన (abstract) ఉపమానాలను చెప్పారు. అందువల్ల సహృదయుడు ఆస్వాదించడానికి మార్గం సుగమమైంది. వనదేవతలు అంటే జలదేవతలనీ, అరణ్యదేవతలనీ శ్లేష .

15. లేత యెండలు దిశాళిని క్రమ్ముకొన్నట్లు
పాలాట్రగడము పాతర తీసికొన్నట్లు
ముద్దరాలి మనస్సు పొంగి వచ్చిన యట్లు !

పరిచయం : ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయ కావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

సందర్భం : కిన్నెరసాని ప్రవాహాన్ని వర్ణిస్తూ కవి అన్నమాట.

వివరణ : లేత ఎండలు దిక్కులన్నిటినీ కమ్ముకున్నట్లు పాలాట్రగడం వరి ధాన్యాన్ని పాతర నుంచి తీస్తుకున్నట్లు, ముద్దరాలి మనస్సు పొంగినట్లు కిన్నెర జాలుగా పారింది, జలజలా పొంగింది.

విశ్వనాథ మొదటి రెండు మూర్తమైన ఉపమానాలను చెప్పి, తరువాత అమూర్తమైన ఉపమానం చెప్పారు. విశ్వనాథ కృషీవల జీవన పరిచయం ఇందులో సువ్యక్తం.

16. పరికిణీ తొక్కాడు పదియేండ్ల కన్నెలా
చిన్ని గంతులు వేయు తెల్లనాఁ బెయ్యాలా
పసిపాప సెలవివారిన బోసినవ్వులా !

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెరసాని ప్రవాహాన్ని వర్ణిస్తూ కవి అన్న మాట.

**వివరణ :** పరికిణీ తొక్కుతూ ఆడుకునే పది సంవత్సరాల కన్యలాగా, చిన్న చిన్న గంతులు వేసే తెల్లని ఆవుపెయ్యలాగా, పసిపాప సెలవుల వరకు వ్యాపించిన బోసినవ్వులాగా కిన్నెర ప్రవహిస్తుంది.

ఇందులో మానవజీవితంలోని వేరు వేరు అవస్థలను, తిర్యక్కులను కవి ఉపమానాలుగా స్వీకరించాడు. విశ్వనాథ లోక పరిశీలనం ఈ వాక్యంలో ద్యోతితమౌతున్నది.

**17.** **గడియలోపల పెద్ద కాల్వగా కట్టింది**
**అడవి తోగుల రాణి అన్నట్లు తోచింది !**

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యం లోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెరసాని ప్రవాహ పరిణామాన్ని వర్ణిస్తూ కవి అన్నమాట.

**వివరణ :** గడియ అంటే ఇరవైనాలుగు నిమిషాలు. అంత స్వల్పకాలంలో కిన్నెరసాని జాలు పెద్దకాలువ అయింది. పెద్దవాగు అయింది. అందులోనూ ఇంకా పెద్దది అయింది. వాగుల రాణి అయింది.

ఇందులో కిన్నెర గమనవేగ సౌందర్య వికాసం బాగా చిత్రించబడింది.

**18.** **కొబ్బరిపాలు వాకలు కట్టినట్లయ్యె**
**వెయ్యావు లొకసారి పిదికినట్లయి పోయె !**

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయవాక్యం లోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** కిన్నెరసాని ప్రవాహం తెల్లదనాన్ని వర్ణిస్తూ కవి అన్నమాట

**వివరణ :** కొబ్బరి నీళ్ల ప్రవాహమైనట్లు, వెయ్యి ఆవులు ఒక్కసారి పాలిచ్చినట్లు తెల్లగా కిన్నెరసాని ప్రవహిస్తున్నది.

ఇది సహృదయులకు చిత్తదీప్తిని కలిగించే మధురమైన ఊహాచిత్రం.

**19.** **తెలి తారకల వెంట వెలుగలా తోచింది**
**తలిరుపూవుల వెంట తావిలా తోచింది**
**తెనుగు పాటల వెంట తీపిలా తోచింది !**

**పరిచయం :** ఈ వాక్యాలు 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యం నుంచి గ్రహించబడ్డాయి.

**సందర్భం :** జలదేవతల వెంట సాగుతున్న కిన్నెరసాని ఎలా ఉందో కవి వర్ణించిన సందర్భంలోది.

**వివరణ :** జలదేవతల వెంట సాగిన కిన్నెరసాని తెల్లని నక్షత్రాల వెంట ఉండే వెలుగులాగా, లేత పూవుల వెంట ఉండే పరిమళంలాగా, తెనుగుపాటల వెంట ఉండే మాధుర్యంలాగా కనిపించింది.

దేవతలు గగనచారులు, తేజోరూపులు, శాశ్వతులు కనుక జలదేవతలను నక్షత్రాలతో పోల్చడం సముచితంగా ఉంది. తెలుగుపాటల వెంట తీపిలా అనడం విశ్వనాథవారి మాతృభాషాభిమానం వ్యక్తమౌతున్నది. ఆయన పేర్కొన్న తెలుగుపాటలు తన రచన అయిన ఈ కిన్నెరసాని పాటలేనేమో ! ఈ ఉపమానాలు నయన పర్వాలు, ముక్కుపుటాలకు విందులు, కర్ణ రసాయనాలు.

**20. తెలుగు పిట్టలు వొళ్ళు తెలియక పాడినై !**

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యం లోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** ఒయ్యారి నడకలతో ప్రవహిస్తున్న కిన్నెరసాని ప్రక్కల నిలిచి కోకిలలు గొంతులు విప్పిపాడాయి పికిలి పిట్టలు కూశాయి. అని చెప్పి విశ్వనాథ సారాంశ ప్రాయంగా చెప్పిన మాట ఈ వాక్యం.

**వివరణ :** తెలుగుగడ్డ మీద ఉన్న పక్షులన్నీ మైమరచిపాడాయి అని విశ్వనాథ వారన్నారు. విశ్వనాథ వారి మాతృదేశాభిమానం ఈ వాక్యంలో కనిపిస్తున్నది.

విశ్వనాథవారు పేర్కొన్న తెలుగు పిట్టలు తమ 'కిన్నెరసాని పాటలు' కావ్యాన్ని కూనరాగాలతో మైమరచి చదువుకునే సహృదయులేనేమో!

**21. నాతి కిన్నెర తిరిగి నాథు చూచుచునె పోయె !**

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెరసాని పోయినంత దూరం వెనక్కు తిరిగిచూస్తూ పోయిందని కవి ఒకటికి మూడు సార్లు చెప్పిన సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణ :** కిన్నెరసాని తన భర్తను తిరిగి తిరిగి చూస్తూ పోయిందని భావం. కవి ఈ గేయాన్ని వ్రాసేటప్పుడు"గచ్ఛతి పురశ్శరీరం, ధావతి పశ్చాదసంస్తుతం చేతః" అనే అభిజ్ఞాన శాకుంతల శ్లోకం మనస్సులో మెదలిందేమో !

ఇందులో కిన్నెర ప్రేమ అభివ్యక్తమవుతున్నది.

**22. భూమి తనంతగా తోరమై విరియుచూ త్రోవగా చేసింది.**

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయ కావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహింపబడింది.

**సందర్భం :** కిన్నెరసాని ప్రయాణంచేస్తూ ఉన్నప్పుడు జరిగిన విషయాన్ని కవి కథనం చేసిన సందర్భంలోది.

**వివరణ :** కిన్నెరసాని పోతూ ఉన్నప్పుడు భూమి తనంతతాను చీలి త్రోవ ఇచ్చింది.

ఈ సన్నివేశం మహాపతివ్రత సీతాదేవి భూప్రవేశాన్ని స్ఫురింపజేస్తున్నది. కిన్నెర సీతవంటి మహాసాధ్వి, శ్రీరామ పాదసేవాసక్త చిత్త అని ధ్వని.

**23. అంత ఒయ్యారమ్ము అడుగడుగు పోయింది**
**అంత యిల్లాలి నెమ్మది తనము చూపింది !**

**పరిచయం :** ఈ వాక్యం 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'కిన్నెరసాని పాటలు' గేయకావ్యంలోని 'కిన్నెర నడకలు' ఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కిన్నెర ఒయ్యారాన్ని, నిదానాన్ని కవి వర్ణించిన సందర్భంలోది.

వివరణ : కిన్నెరసాని బ్రతికి ఉన్నప్పుడు ఎంత ఒయ్యారం ఒలకబోసిందో ఇప్పుడూ పదే పదే అలా ఒయ్యారాలు చిందిస్తున్నది. ఆమె బ్రతికి ఉన్నప్పుడు ఇల్లాలుగా ఎంత నిదానంగా ఉండేదో ఇప్పుడూ అంత నిదానంగా ఉంది.

కిన్నెరకు మానవజన్మ లక్షణాలు నదీజన్మలోనూ కొనసాగాయి. పునర్జన్మ సిద్ధాంతం, అందునా పూర్వజన్మలోని వాసనలు అనుస్యూతంగా అనంతర జన్మలో కొనసాగడం భారతీయ మత సంప్రదాయంలోని ప్రధానాంశం. ఈ సనాతన సంప్రదాయ విశ్వాసాన్ని ఇక్కడే కాకుండా విశ్వనాథ ఆంధ్రప్రశస్తి' కావ్యంలోనూ "ఎన్ని జన్మమ్ములుగాగ ఈ తనువునం బ్రవహించునొ ఆంధ్రరక్తముల్" "ఇదెక్కడి పూర్వపు జన్మ వాసనో" అని ప్రకటించారు.

## 2.14. 6. పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు :

ప్రశ్న. 1. విశ్వనాథవారి కిన్నెరసాని నడకలను గురించి వర్ణించండి. **(లేదా)** కిన్నెరసాని ఒయ్యారాలను మీ పాఠ్యభాగం ఆధారంగా వివరించండి.

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి గేయకావ్యాల్లో మకుటాయమానమైనది 'కిన్నెరసాని పాటలు'. అందులోని ఖండికలలో పేర్కొనదగింది 'కిన్నెర నడకలు'.

కిన్నెరసాని తెలుగింటి కోడలు. అత్త పెట్టే ఆరళ్లను భరించలేక ఇల్లువదలి అరణ్యంలో ప్రవేశించింది. ఆమె భర్త అటు తల్లికీ, ఇటు భార్యకూ చెప్పలేకపోయాడు. అయినా భార్య అంటే ప్రేమగలవాడు. అతడు భార్య వెంట పరుగెత్తి కిన్నెరను ఆపాలని చూశాడు. ఆమె ఆగలేదు. చివరకు నది అయింది. ఆ దృశ్యాన్ని తనకళ్లముందే చూచిన భర్త స్తంభించి పర్వతమయ్యాడు. అతని విప్రలంభం తొలిఖండిక కిన్నెర పుట్టుకలో చక్కగా చిత్రితమైంది. తరువాతి ఖండిక కిన్నెరనడకలు.

కిన్నెరసాని మానవరూపం కరిగి కరిగి జలరూపమైంది. తరంగాలు, తద్వేగాలు, నురుగులు, సుడులు, పాయలు, వరదలు ఇలా వికాసాన్ని పొందింది. ఆమె రాళ్లమీద, పచ్చికల మీద ప్రవహించింది. ఇసుక నేలల మీద బుసబుస పొంగింది, బారులు తీరిన లేళ్లకదుపులా, పూలనదిలా, కనిపించింది. తెల్లత్రాచు పడగవదలినట్లు ఉంది.

భర్త పాషాణరూపుడై పడిన ప్రదేశంలో వదలలేక గలగలా తిరిగింది. బిగ్గరగా విలపించినట్లు ధ్వనించింది. తన వియోగాన్ని తన భర్త ఓర్చుకోలేడని గ్రహించింది. అటువంటి ప్రేమగలిగిన భర్త తోడి కాపురాన్ని ఇలా చేసుకున్నానని బాధపడింది భర్త రాయిగా పడిఉన్న గుట్టను తన కెరటాలతో కౌగలించుకొన్నది. పైన పడి ఏడ్చింది.

**నాకుమల్లే నీవు నదివోలె పారరా**
**జలముగా ఇద్దరము కలిసిపోదామురా**
**కెరటాలు కెరటాలు కౌగిలిద్దామురా !**

అని, ఇక తప్పు చెయ్యనని, నీ మాట జవదాటనని పరిపరి విధాల శోకించింది. ఎవరి దారి వారిదయిందని బాధపడింది. మండి ఆరిన నిప్పు మాదిరిగా కొంత ఉపశమించింది. తనకర్మ ఇంతే అనుకుంది. తనకిక భర్తతో సంబంధం లేదనుకుంది. ఇది తన స్వయంకృతాపరాధమని భావించింది. తన భర్త కౌగిలి, స్పర్శ పాదనమస్కారాదులు, ముద్దులు ముచ్చటలు అన్నీ దూరమైనందునకు సన్నని పావురాయి గొంతుతో ఏడ్చింది. తరువాత పల్లపునేలలో పడిపోయింది.

అప్పుడు జలదేవతలు కిన్నెరసానిని పదపదమని బలవంతపెట్టారు. ఆమె తన 'పతిగుట్ట'ను వదలిపోలేక చివరకు తల్లి దగ్గరనుంచి మెడకు పలుపు వేసి లాగబడ్డ లేగలా ముందుకు సాగింది. వనదేవతలు నీళ్లు కుమ్మరించినట్లు, తల్లి చల్లని ప్రేమ ప్రవహించినట్లు, లేత ఎండలు దిక్కులన్నింటినీ కమ్ముకున్నట్లు, పాలాత్రగడం వద్ద పాతర తీసినట్లు, ముగ్ధ కాంత మనస్సు పొంగినట్లు ప్రవహించింది. కిన్నెర ఆ సమయంలో పరికిణీ తొక్కుతూ ఆడుతున్న పదిసంవత్సరాల కన్యలాగా, చిన్న చిన్న గంతులువేస్తున్న తెల్లని ఆవుపెయ్యలాగా, పసిపాప బోసినవ్వులాగా ఉంది. కిన్నెరసాని వెయ్యావులు ఒకేసారి పిదికినట్లుగా, టెంకాయ నీళ్లు కాలువకట్టినట్లుగా ఉంది.

జలదేవతల వెంట సాగుతున్న కిన్నెరసాని తెల్లని నక్షత్రాల వెనుక సాగుతున్న వెలుగులాగా, తెలుగుపాటల వెంట తీపిలాగా ఉంది. అప్పుడు వనదేవతలు పూలను కుమ్మరించారు. బ్రాహ్మణులు ఎదురు వెళ్లి ఆశీర్వదించారు. అనిలదేవతలు ఆహ్వానగీతాలు ఆలపించారు. కిన్నెరసాని ప్రక్కన ఉన్న ప్రకృతి అంతా సంతోష తరంగితమైంది. కోకిలలు కుహూకుహూరావాలు కావించాయి. పికిలి పిట్టలు మనోహరంగా కూశాయి. అదీ ఇదీ అని చెప్పడమెందుకు ? తెలుగుపిట్టలన్నీ మైమరచి పాడాయి.

కిన్నెరసాని వెనక్కు వెనక్కు తిరిగి తనభర్తను చూస్తూ పోయింది. భూమి చీలి ఆమెకు దారి ఇచ్చింది. బ్రతికినప్పటిలాగా ఇప్పుడూ ఒయ్యారాలు ఒలకపోస్తున్నది, నెమ్మది తనాన్ని చూపిస్తున్నది. ఈ సన్నివేశం సీతాదేవి భూ ప్రవేశాన్ని స్ఫురింపజేస్తున్నది.

ఈ విధంగా కవి సమ్రాట్ విశ్వనాథ తమ కమనీయ వాణిలో కిన్నెరసాని నడకలను వర్ణించారు. ఆంధ్ర సహృదయులకు రసానందశ్రీని అందించారు.

ప్రశ్న . 2. 'కిన్నెర నడకలు' ఆధారంగా విశ్వనాథ వారి కవితారీతుల్ని వివరించండి.

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు ఆధునికాంధ్ర సాహిత్యంలో సువర్ణపర్వతం. ఆయన శతాధిక గ్రంథకర్త. మహాకావ్యం, కావ్యం, నవల, నాటకం, కథ, విమర్శ మొదలైన అన్ని ప్రక్రియలలో ఆయన తమ అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. మహాకావ్యం రామాయణ కల్పవృక్షం, గేయ కావ్య కిన్నెరసాని పాటలు, నవలలు వేయిపడగలు, ఏకవీర అందరి మన్ననలు పొందాయి.

కిన్నెరసాని పాటలను విశ్వనాథ వారు స్వయంగా గానం చేసి శ్రోతలను ఉర్రూతలూగించేవారు. "పాఠ్యే గేయేచ మధురం" అన్న మాట కిన్నెరసాని పాటలకు పరిపూర్ణంగా వర్తిస్తుంది. ఇందులో అందమైన ఖండిక కిన్నెర నడకలు.

కిన్నెరసాని పాటలు కావ్యాన్ని కవి కథ ఉత్తరార్థంలో ప్రారంభించాడు. భావాల ప్రస్తారం ఇందులో అధికంగా కనిపిస్తుంది. కిన్నెర అత్త ఆరళ్లు భరించలేక ఇల్లు వెడలి అరణ్యాల్లో ప్రవేశించి వాగు కావడం, ఆమె వెంట వచ్చిన భర్త పిలుస్తూ ఉండడం ఈ సన్నివేశంతో మధ్యకథతో కావ్యం ప్రారంభమైంది. ఆ తరువాత కిన్నెర నడకలు. కిన్నెర నడకలు ఖండికలో కిన్నెర భర్తను వదలలేక వదలడం జలదేవతలు బలవంతంగా ముందుగా సాగేటట్లు చేయడం, వారివెంట ఆమె తెనుగుపాటల వెంట తీపిలా ప్రవహించడం, పరిసరాలలోని తెలుగుపిట్టలు వొళ్లు తెలియక పాడడం, ఆమెకు భూమి చీలుతూ దారి ఇవ్వడం చక్కని కథా సన్నివేశాలు.

'కిన్నెర నడకలు' లోని పాత్రలు - కిన్నెర ఆమె స్మృతిలోని భర్త. కిన్నెర ఇక్కడ అందచందాలతో జీరతో కనిపిస్తుంది. తొడిమ ఊడిన పూవులాగా సిగ్గులమొగ్గ అయిన రాజకన్యలాగా, కాంతి పోయిన రత్నపేటికలాగా కనిపిస్తుంది. తన తొందరపాటును సరిజేసుకోవడానికి మళ్లీ మానవరూపాన్ని పొందాలనుకుంది. బ్రతికి ఉన్నప్పుడు తనమీద భర్తకు ఇంతప్రేమ ఉందని తెలిస్తే ఎంతబాగుండేదో అని భావించింది. చివరకు పశ్చాత్తాపానికి నిరాశకు లోనైంది. మండి ఆరిన నిప్పులాగా అయింది. తనకర్మ ఇంతేననుకుంది. తరువాత జలదేవతల వెంటసాగింది. బ్రతికి ఉన్నప్పుడున్న ఒయ్యారం, నిదానం నదిగా మారినప్పుడు నిలుపుకున్నది.

కిన్నెర భర్త గంభీరుడు. తనకు భార్య పైగల ప్రేమను ఎప్పుడూ బహిర్గతం చేయలేదు. చివరకు భార్య తనను వదలితే తట్టుకోలేక రాయి అయ్యాడు. మానవరూపంలో ఉన్నప్పుడు అతడు మంచి రసహృదయుడు. కుపితనాయికను స్వాధీనం చేసుకోవడంలోని 'నతి' మొదలైన నైపుణ్యాలు తెలిసినవాడు. అతని చుంబనాలను, ఆలింగనాలను కిన్నెర మరువలేక పోయింది. కిన్నెర ఒళ్లంతా అందపుకుప్ప అని ఆరాధించాడు.

వనదేవతలు కిన్నెర మీద పూలు కుమ్మరించారు. భూదేవతలు ఎదురుపోయి దీవించారు. వాయుదేవతలు ఆహ్వానగీతాలు ఆలపించారు.

ఇందులో శృంగారం అందులోనూ విప్రలంభం, కరుణం రసాభాసరూప రూపంలో ఉన్నాయి.

**"తలిరాకు వంటి మెత్తని ఎర్ర పెదవితో తార్చి**
**నామోము నద్దగరావు కాబోలు" మొదలైన తావులు**
**మురిపాలు మూటగట్టేవి. కిన్నెర "తన నీటుకాణ్ణి**
**చేతుల కౌగలిస్తుంది," "పలుకవా అని మ్రోతపడి**
**పల్కరిస్తుంది," "పతిగుట్టపై తాను వ్రాలి ఏడుస్తుంది."**

విశ్వనాథవారు 'కిన్నెర నడకలు'లో వర్ణనావైదగ్ధ్యాన్ని ప్రదర్శిస్తారు. ఇందులో చలద్వర్ణనలు, మనస్సంఘర్షణకు సంబంధించిన వర్ణనలు పాఠకులను ఆకర్షిస్తాయి. కిన్నెర కరిగి కరిగి వరదలై పారిందని, తరకలు కట్టిందని, పరుగులు పెట్టిందని, ఒదుగులు పోయిందని, సుళ్లు తిరిగిందని నురుగులు గ్రక్కిందని జడలు కట్టిందని, తరగల వరుసల మధ్య తళతళా మెరిసిందని, ఇసుకనేలల మీద బుసబుసా పొంగిందని వివిధ దశలను కవి చక్కగా వర్ణించాడు. కిన్నెర మళ్లీ మానవరూపాన్ని పొందాలనుకోవడం, అటువంటి భర్త తోడి కాపురాన్ని ఇలా చేసుకున్నానని పశ్చాత్తాపపడడం మొదలైన సన్నివేశాల్లో చక్కని మనస్తత్వ చిత్రణం కనిపిస్తుంది. ఇందులో విశ్వనాథవారి ప్రకృతి పరిశీలనం, గ్రామీణ జీవన చిత్రణం ప్రధానంగా కర్షక జీవన చిత్రణం కన్పిస్తుంది. "తల్లిదగ్గరనుండి తన మెడకు పలుపోసి లాగగాబడ్డట్టి లేగలా కదిలింది. "పాలాట్రగడము పాతర తీసికొన్నట్లు" వంటి పంక్తులు చక్కని ఉదాహరణలు.

"కిన్నెర నడకలు"లో విశ్వనాథవారి ఉపమాలంకార ప్రయోగ ప్రావీణ్యం ప్రస్ఫుటమౌతుంది. 'తెనుగుపాటల వెంట తీపిలా

తోచింది', 'ముక్త గీతిక వోలె మ్రోగింది మ్రోగింది' అన్నచోట సాహిత్యం, సంగీతోపమానాలు ప్రయుక్తాలు. 'వనదేవతలు నీళ్ల వొలకబోసినయట్లు' లాంటి అమూర్తోపమలు, 'లేతయెండలు దిశాళిని క్రమ్ము కొన్నట్లు' లాంటి మూర్తోపమలు ఉన్నాయి. దేవజాతులు మానవ జీవిత వివిధ దశలు, పశుపక్ష్యాదులు, భూనభోంతరాలు - అన్నీ ఇందులో ఉపమానాలయ్యాయి.

విశ్వనాథవారు ఆధునిక మర్యాదననుసరించి ఎన్నో ఊహాచిత్రాలను కుప్పబోశారు. ఇవి అన్నీ చిత్తదీప్తి ప్రదాలు.

**పదువు కట్టిన లేళ్లకదుపులా తోచింది**
**కదలు తెల్లని పూలనది వోలె కదిలింది**
**వదలు తెల్లని త్రాచు పడగలా విరిసింది.**

ఈ ఊహలన్నీ అందమైన బొమ్మను సాక్షాత్కరిస్తున్నాయి.

విశ్వనాథవారి సంస్కృత సమాస భూయిష్ఠ క్లిష్టరచనకు పేరు పడినవారు. కిన్నెరసాని పాటలలో అందునా కిన్నెరనడకలలో వారు జాను తెనుగును జాలువార్చారు. తెలుగుతీయదనానికి ఇందులోని ప్రతిపాదమూ, ప్రతిపదమూ సాక్ష్యమిస్తాయి. విశ్వనాథ సర్వమార్గేచ్ఛావిధాతృడు.

విశ్వనాథవారు సంప్రదాయాభినివేశం కలిగినవారు. కిన్నెర నడకలలో ఏకపత్నీవ్రతాన్ని, పాతివ్రత్యాన్ని, పూర్వజన్మ సిద్ధాంతాన్ని, కర్మసిద్ధాంతాన్ని, సందర్భోచితంగా నిక్షేపించారు. కిన్నెర వెన్కతిరిగి చూచుచుపోయె అన్నప్పుడు ఉత్తరరామాయణంలో సీత లక్ష్మణుడి రథాన్ని మళ్లీ మళ్లీ చూడడం స్ఫురిస్తుంది. ఉత్తర రామచరిత నాటకం, అభిజ్ఞాన శాకుంతలం మొదలైన నాటకాలలోని శిల్పాలు స్ఫురిస్తాయి. అలంకార శాస్త్రప్రోక్తమై, ముక్కుతిమ్మన పారిజాతాపహరణంలో ముద్దులొలికే పాదనమస్కారం ఇందులో రేఖామాత్రంగా సాక్షాత్కరిస్తుంది.

ఇలా విశ్వనాథవారి కిన్నెరసాని పాటలు కావ్యం - అందునా 'కిన్నెర నడకలు' ఖండిక - అందాలు చందాలుగా నడిచి గేయకావ్యాల రాణిగా వాసి కెక్కి వారి కవితారీతుల్ని చాటుతున్నది. 'ఏమి కిన్నెరసాని' ! అని మనం ఆశ్చర్యానందాలను అనుభవిద్దాం !

**డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి** ఎం.ఏ, పిహెచ్. డి
ప్రిన్స్‌పాల్
ఎన్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల

**ఖండం : 2** ఆధునిక పద్యభాగం

# గబ్బిలము - గుఱ్ఱం జాషువా

**పాఠం - 15**

2: 15: 0 పరిచయం
2: 15: 1 ఉద్దేశం
2: 15: 2 పాఠ్యభాగ సందర్భం
2: 15: 3 కఠిన పదాలకు అర్థాలు
2: 15: 4 పాఠ్య భాగ వివరణ
2: 15: 5 సందర్భ సహిత వ్యాఖ్యలు
2: 15: 6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

**2:15:0 పరిచయం :**

**కవిపరిచయం:-** ఆధునిక పద్య భాగానికి సంబంధించిన కొన్ని పాఠాల్ని గూర్చి ఇంతకు ముందు తెలుసుకొన్నారు. ఇప్పుడు ఈ పాఠంలో గుఱ్ఱం జాషువాగారు రచించిన 'గబ్బిలము' అనే కావ్యంలోని మొదటి 20 పద్యాల్ని గూర్చి తెలుసుకోబోతున్నారు. పాఠ్యభాగానికి సంబంధించిన విశేషాల్ని తెలుసుకోబోయే ముందు పాఠ్యభాగ రచయిత అయిన గుఱ్ఱం జాషువా గారిని గూర్చి తెలుసుకోవటం అవసరం.

" నివసించుటకు చిన్ని నిలయమొక్కటి దక్క
గడనసేయుట కాస పడను నేను
ఆలుబిడ్డలకునై యాస్తి పాస్తులు గూర్ప
పెడదారిలో పాదమిడను నేను
నేనాచరింపని నీతులు బోధించి
రాని రాగము తీయలేను నేను
సంసార యాత్రకు చాలినంతకు మించి
గ్రుడ్డి గవ్వయు కోరుకొనను నేను
కులమతాలు గీచుకొన్న గీతల జొచ్చి
పంజరాన గట్టు వడను నేను
నిఖిల లోక మెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు విశ్వ నరుడ నేను" -- అని తన నిర్ణయాన్ని ప్రకటించిన నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువా గారు. గుంటూరు జిల్లా వినుకొండలో వీరయ్య లింగమాంబ దంపతులకు **28-9-1895** న జన్మించిన జాషువాగారు ఆధునికాంధ్ర సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కొన్నారు. బాల్యంలో కొంటె పనులుచేస్తూ విద్యమీద ఆసక్తి చూపక పోయినా జాషువాగారు పద్యరచన మీద మక్కువ ప్రకటించి పద్యాలు రాస్తూ ఉండేవాడు. అయితే కొంతమంది గిట్టనివారు జాషువాను నిరుత్సాహ పరిచేవారు. కొంతమంది దయార్ద్ర హృదయులు ప్రోత్సహిస్తూ ఉండేవారు. ఈ విషయాన్ని జాషువాగారు -

"ఒకడు ప్రోత్సహింప, నొక్కడు నిరసింప
నొకడు చేరబిలువ, నొకడు తరుమ
మిట్ట పల్లములను మెట్టుచు నెట్టులో
పలుకులమ్మ సేవ సలిపి నాడ" -- అని తెలియజేశారు.

తిరుపతి వేంకటకవులు అవధానాలు, కొప్పరపు సోదరకవులు ఆశుకవితా విన్యాసాలు, ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగిస్తున్న సమయంలో పద్యరచనపట్ల ఆకర్షితుడైన జాషువగారు తనలోని అభ్యుదయ భావాల్ని ప్రచారం చెయ్యటానికి పద్యాన్ని సాధనంగా చేసుకొన్నారు. భావకవితోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో తనదైన మార్గంలో అస్పృశ్యతా నిరసనం, కులమతాలకు అతీతమైన దృక్పథం ప్రదర్శిస్తూ రచనలు సాగించారు.

"జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు - పేదరికం, కులమత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందే కాని బానిసగా ఏ మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని, కులభేదాన్ని కూడా చీల్చివేసి మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి గట్టాను. అయితే నా కత్తి కవిత. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానం పైన ద్వేషం". అని తన స్వభావాన్ని ప్రకటించాడు. సాంఘికంగా, ఆర్థికంగా ఎదురైన కష్టాల్ని లెక్కచెయ్యకుండా జాషువగారు రచనలు సాగించారు. జాషువాగారికి విస్తృతంగా పేరు ప్రఖ్యాతులు రావటానికి 'భారతి' పత్రిక ఎంతగానో తోడ్పడిందని చెప్పటంలో అతిశయోక్తిలేదు.

జాషువగారు స్వగ్రామమైన 'చాట్రగడ్డపాడు' లో ఉపాధ్యాయుడుగా కొంతకాలం పనిచేశాడు. హిందూ పురాణాన్ని పారాయణం చేస్తూ, హిందూ గ్రంథాల్ని రాస్తున్నాడనే భావంతో క్రైస్తవ మత బోధకులు, మిషనరీలు ఆయన్ని ఉపాధ్యాయ పదవి నుంచి తొలగించారు. తర్వాత మూకీ సినిమాలకు కథావాచకునిగా కొంతకాలం పనిచేశారు. రాజమండ్రిలోని కోటిలింగాల దగ్గర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా కొంతకాలం పనిచేసి ఆతర్వాత జన్మస్థలమైన వినుకొండలో తెలుగు పండితునిగా పనిచేశారు.

జాషువాగారు ప్రారంభదశలో ధ్రువ విజయం, హిమదమార్క పరిణయం అనే నాటకాలు రచించారు. ఆ తర్వాత ఫిరదౌసి, స్వప్నకథ, కాందిశీకుడు, ముంటాజిమహలు, గబ్బిలము (మొదటిభాగం), నేతాజి, బాపూజి, గబ్బిలము (రెండవభాగం), స్వయం వరం, రాష్ట్రపూజ, కొత్తలోకము, ముసాఫరులు. క్రీస్తు చరిత్ర, నాగార్జున సాగర్ మొదలైన లఘుకావ్యాలు రచించారు. లఘువాక్య ఖండకావ్య రచనకు ఒక ప్రత్యేకతను సంతరింప జేసిన కీర్తి జాషువాగారికే దక్కుతుంది. స్వీయ చరిత్రను జాషువాగారు 'నాకథ' రూపంలో పద్యాల్లో రచించారు. జాషువాగారు రచించిన కావ్యఖండికలు ఏడు సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. జాషువా 'క్రీస్తు చరిత్ర' కు కేంద్ర సాహిత్య అకాడమీ వారి బహుమతి లభించింది.

ఆధునిక సాహిత్య చరిత్రలో జాషువాగారికి జరిగిన సన్మానాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఆయనకు అనేక బిరుదులు లభించాయి. కవితా విశారద, కవికోకిల, కవిదిగ్గజ, మధురశ్రీనాథ, నవయుగకవి చక్రవర్తి, కళా ప్రపూర్ణ, విశ్వకవి సమ్రాట్ మొదలైన బిరుదులు ఆయన్ని వరించాయి. జాషువాగారికి భారత ప్రభుత్వం వారి పద్మభూషణ పురస్కారం 1970 లో లభించింది. జాషువ గండపెండేరం, గజారోహణం మొదలైన సన్మానాలనెన్నో పొందారు.

జాషువాగారి పద్యరచన విశిష్టమైంది. విలక్షణమైంది. భావం పొంగిపొర్లు సహృదయుల గుండెల్లోకి దూసుకుపోతుంది. "పదముల పొందిక గుబ్బపుఁ గదనున కెనవచ్చు" అని జాషువాగారి ఫిరదౌసి కవితా రీతిని చెప్పిన పలుకులు జాషువాగారికి వర్తిస్తాయి. జాషువాగారి పద్య గమనం, రసపుష్టి, పాత్రల చిత్రీకరణ మొదలైన అంశాలు సహృదయ పాఠకుల్ని రంజింపజేస్తాయి. జాషువాగారి ప్రత్యేకతను వివరిస్తూ దాశరథి "హిమాచల శిఖరాల కంటే ఉన్నతమై, సముద్రం కంటే గంభీరమైన హృదయం కవికోకిల జాషువా గారిది. ఆకాశంలోని చుక్కలను చూడలేదు వారు. అట్టడుగున పడిఉన్న ప్రజలను దర్శించారు. జాషుగారితో ఇరవయ్యో శతాబ్దంలోని తెలుగు సాహిత్యం ఒకకొత్త మలుపు తిరిగింది". అని తెలియజేసిన తీరును గమనించినప్పుడు జాషువగారి ప్రత్యేకత ప్రస్ఫుటమౌతుంది.

జాషువగారు తన కవితలో మత పిచ్చిగానీ, వర్ణోన్నతి గానీ, స్వార్థచింతనం గానీ ఉండదని చెప్పారు. విశ్వమానవ సౌభ్రాత్రం, నిర్మత, నిర్జాతి సంఘం తను ఆదర్శమని తెలిపారు. ఒక జాతికి, ఒక మతానికి చెందిన కవిత్వాలు మంచివి కావని అవి అసలు కవిత్వాలే కావని పలికారు. గహన సంచారం లేని కవిత్వం తన లక్ష్యంగా ప్రకటించారు.

"సుకవి జీవించు ప్రజలనాలుకలయందు" అని జాషువగారు పలికినట్లు ఆయన 24-7-1971 న మరిణించినా తన రచనలద్వారా నిరంతర జీవిగా వెలుగొందుతున్నారని చెప్పవచ్చు.

ఇంతవరకు జాషువాగారి జీవితం, రచనల్ని గూర్చి తెలుసుకొన్నారు. ఇప్పుడు 'గబ్బిలము' కావ్యాన్ని గూర్చి తెలుసుకొంటారు.

**కావ్య పరిచయం :**

మహాకవి గుర్రం జాషువాగారి కలం నుంచి జాలువారిన అనర్ఘ మణిరత్నం 'గబ్బిలము' కావ్యం. ఇది రెండు భాగాలుగా రచించబడింది. మొదటి భాగంలోని మొదటి 20 పద్యాలు ప్రస్తుత పాఠ్యభాగం. జాషువా రచించిన 'గబ్బిలము' కావ్యం ఒక కల్పిత కథతో కూడి ఉన్నది. ఇందులో అరుంధతీసుతుని అశ్రు సందేశం ఉన్నది. కాళిదాసుని మేఘసందేశాన్ని మనసులో ఉంచుకొని 'గబ్బిలము' కావ్యాన్ని రచించినట్లు జాషువ గబ్బిలము కావ్యానికి రచించిన 'విజ్ఞప్తిలో' ప్రకటించాడు. అరుంధతీసుతుడు క్షుధాగ్ని పీడితుడు కావడం వల్ల అతనికి ఉత్తమ వంశంలో పుట్టిన వారికి లాగా హంసలు, చిలుకలు మొదలైనవి దూతలుగా లభించటం అసంభవం. కాబట్టి జీర్ణకుటీరాలలో దర్శనమిచ్చే గబ్బిలాన్ని సందేశ సాధనంగా గ్రహించినట్లు ప్రకటించారు.

గబ్బిలము కావ్యంలోని విలక్షణమైన పద్యశైలి, సామాజిక అసమానతల నిరసనం, బడుగు జీవుల పట్ల ప్రకటించిన సానుభూతి, మానవతా దృక్పథం సహృదయుల్ని రంజింపజేస్తాయి. అందుకే ఈ సహస్రాబ్దిలో వెలువడ్డ ఉత్తమ కావ్యాల్లో ఒకటిగా 'గబ్బిలము' పరిగణింపబడింది.

దక్షిణ భారతం నుంచి కైలాసం వరకు సమస్త భారత దేశ వైభవ వర్ణనతో నిండి ఉన్న దేశభక్తి పూరిత లఘుకావ్యంగా 'గబ్బిలము' దర్శన మిస్తుంది. ప్రాచీన భారత వైభవ వర్ణనం పాఠకులకు గగుర్పాటు కలిగిస్తుందనటంలో సందేహంలేదు. జాషువగారి పద్యాలకున్న మహత్తర శక్తి వల్ల ఈ కావ్యం పలువురి ప్రశంసల్ని పొందగలిగింది.

**2:15:1 ఉద్దేశం :**

'గబ్బిలము' కావ్యంలోని మొదటి 20 పద్యాలు ప్రస్తుత పాఠ్యభాగంలో ఉన్నాయని ఇంతకు ముందే తెలుసు కొన్నాము. ఈ పాఠ్యభాగాన్ని చదివిన తర్వాత ఈక్రింది విషయాల్ని గమనించవచ్చు.

భారతభూమి మీద జన్మించిన కడగొట్టు వాడు అరుంధతీసుతుడు; ఇతడు అమాయకుడు. తనకు లభించిన దానితోనే తృప్తిపడతాడు. పుట్టుకతోనే పేదవాడు. తంజావూరుకు దక్షిణంగా ఉన్న భూ భాగంలో చెప్పులు కుట్టి జీవనం సాగించే యితడు బ్రహ్మచర్యం పాటిస్తున్నాడు. అరుంధతీసుతుడు నిద్రకుపక్రమింపబోయే సమయంలో అతని ఇంటిలోనికి ప్రవేశించిన గబ్బిలం ఆముదపు దీపాన్ని ఆర్పింది. గబ్బిలానికి అతడు తన బాధను తెలిపి, తన ఇంటిలో ఆనందం లేశమైనా దొరకదని చెప్పాడు. మానవత్వం లోపించిన ఈ లోకానికి హృదయం లేదని పలికాడు. స్వార్థ గురువులు కుయుక్తులతో బోధలు చేస్తూ సామాన్య మానవుల్ని మోసం చేస్తూ ఉంటారు.

**2:15:2 పాఠ్యభాగ సందర్భం :**

కాళిదాసుని మేఘసందేశాన్ని మనసులో ఉంచుకొని జాషువగారి 'గబ్బిలము' కావ్యాన్ని రచించినట్లు 'విజ్ఞప్తి'లో తెలియజేశారు. గ్రంథనామం 'గబ్బిలము' కాబట్టి కొంతమందికి 'కటువుగా తోచవచ్చు' అని కూడా పలికారు. కావ్యనాయకుడైన అరుంధతీసుతుడు తన "యింట ప్రవేశించి దీపమార్పిన గబ్బిలమును జూచి తన కన్నీటి కథనీశ్వరునితో చెప్పుమని ప్రార్థించెను గాని నిజమున కతని యుద్దేశ్యము దేశారాధన. కైలాసమునకు నాపన్నిన త్రోవ వక్రతకు గుఱియైనది. ఇది దోషము కాదనుకొందును. ఈ కృతిరసజ్ఞ లోకాదరణ నందిన నా శ్రమ ఫలోన్ముఖము కాగలదు." అని జాషువగారు తెలిపి అరుంధతీసుతుని వర్ణనతో కావ్యాన్ని ప్రారంభించారు.

**2:15:3 కఠిన పదాలకు అర్థాలు :**

ఇప్పుడు ఈ పాఠ్య భాగంలో వచ్చే కొన్ని కఠినమైన పదాలకు అర్థాల్ని తెలుసుకొందాం.

1. బొక్కెడు బువ్వ : నోటిలో పట్టినంత అన్నం; క్షుధ + అనల = ఆకలి అనే అగ్ని; దిక్కరి = దిక్కులేని; అరుంధతీసుతుండు = అస్పృశ్యుడు, ఉర్వర = భూమి.
2. పూప వయస్సు = చిన్న వయస్సు; ప్రాపకము = ఆశ్రయం.
3. ముప్పు = ఆపద; కలిమి = సంపద;
4. ఔక్కల కష్టం = శ్రమ; సస్యరమ = పంట అనే సంపద.
5. పంకిలము = బురద; మూడుమూర్తులు = త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు)
6. ప్రాక్తన = పురాతన; ఉలికిపడు = ఆకస్మికంగా వణకు

7. ఉద్ధరించు = మీదికెత్తు (బాగు చేయు)
8. ఇనుప గజ్జెల తల్లి = దరిద్ర దేవత; కసరి = చలించి, కోపించి.
9. అఖాతము = మనుజులు త్రవ్విన గొయ్యి.
10. ఇనుని = సూర్యుని; మేను = శరీరం
11. భూ నభములు = భూమి, ఆకాశం; క్రొత్త + చీకటులు = అప్పుడు వ్యాపించిన చీకట్లు; మహానటుడు = శివుడు; శివారవములు = నక్కల అరుపులు.
12. పక్ష + అనిలంబు = పక్షానిలంబు = రెక్కలగాలి.
13. తిల్లిక = దీపం; తబిసి పిట్ట = తపస్సు చేసే పిట్ట (గబ్బిలం); ఉల్లంబు = హృదయం.
14. ఉమ్మలికలన్ = దుఃఖంతో; నెఱ + మనంబున = నెమ్మనంబున = నిండైన మనసుతో; పులుగు = పక్షి; కవోష్ణ = నులివెచ్చని చక్ర + అంగనలన్ = చక్రాంగనలన్ = చక్రవాక పక్షులను
15. ప్రవిమల = మిక్కిలి స్వచ్ఛమైన; తనూభవులకు = సంతానానికి
16. క్ష్మాతలం = భూమండలం; లవము = కొంచెం
17. అవనీవలయంబు = భూమండలం; బేలవై = మూర్ఖురాలవై
18. మాపుల = సాయం సమయాలలో; సనాతన = శాశ్వతమైన; శ్రీగల = సంపదలున్న; అరవిందభవ = పద్మం నుంచి పుట్టిన బ్రహ్మ. అమృత + అంధసుల్ = అమృతాంధసుల్ = అమృతమే ఆహారంగా కలవారు (దేవతలు)
19. ప్రతిమ = రాయి మొదలైన వాటితో చెక్కిన బొమ్మ, (ఆకారం) ; పకీరులు = భిక్షకులు; మేదిని = భూమి.
20. లోభ = పిసినిగొట్టుతనం; స్వాంతం = మనస్సు ; కైవల్యము + తెరువుల్ = మోక్షమార్గాలు ; అపరాధి = తప్పుచేసిన వాడు; వేదాంతరథంబు = ఉపనిషత్తు అనే రథం.

**2:15:4 పాఠ్య భాగ వివరణ :**

'గబ్బిలము' అనే పాఠ్య భాగంలో కవి తెలియజేసిన అంశాల్ని గూర్చి ఇప్పుడు తెలుసుకొంటారు. 'గబ్బిలము' పాఠ్యభాగాన్ని కవి అరుంధతీసుతుని వర్ణనతో ప్రారంభించాడు. ఈ కావ్యంలో అరుంధతీసుతుని అంటే అస్పృశ్యుడు నాయకుడు. అస్పృశ్యుడు నాయకునిగా స్వీకరించి కావ్యాన్ని రచించటం ఒక విధంగా సాహసమేనని చెప్పవచ్చు. 'అరుంధతీసుతుడు' అని కవి చెప్పాడేకాని అతని పేరు చెప్పలేదు. అంటే ఇలాంటి వారు ఎంతోమంది సమాజంలో ఉన్నారని, అలాంటి వారికి ఇతడు ప్రతినిధి అని గ్రహించాలి. అరుంధతీసుతుని గుణాల్ని తెలుపుతూ అతడు 'చిక్కిన' కాసుతో తనివి చెందుతాడని వర్ణించారు. అంటే ఏదో ఒకవిధంగా తనకు లభించిన డబ్బుతో అతడు సంతృప్తి పడతాడని భావించవచ్చు. లోకంలో ఎంతధనం ఉన్నా తృప్తి లేకుండా, ప్రశాంతత లేకుండా జీవించేవారికి అరుంధతీసుతుడు ఆదర్శంగా భావించాలి. ఉన్నదానితో తృప్తి పడటం కంటే మించిన సుఖం వేరొకటి లేదని గ్రహించాలి. అతడు అమాయకుడు అంటే ఇతరుల్ని మోసగించే బుద్ధి లేనివాడు. అన్ని కష్టాల్ని బొక్కెడు బువ్వతో మరిచిపోతాడు. ఆకలి అనే అగ్ని చల్లారితే చాలు సంతోషిస్తాడు. ఆకలి అనే అగ్నితో నిరంతరం మండుతున్న అతనికి బొక్కెడు బువ్వకంటే తృప్తి నివ్వగలిగిన పదార్థం వేరొకటి లేదని గుర్తించాలి. ఈ లోకంలో నాలుగు దిక్కులున్నా అరుంధతీసుతుడు దిక్కులేనివాడు. అంటే అతనికి రక్షణగా ఎవరూలేరు. అతన్ని పోషించేవారు, ఆదరించే వారు లేరు. అతడు భారత భూమండలం మీద అంత్యజునిగా గుర్తించబడటం నిజంగా విచారించ దగిన అంశం.

అరుంధతీసుతుడు దక్షిణ భారతదేశంలోని తంజావూరు మండలానికి దక్షిణంగా ఉన్న ప్రాంతంలో నివసిస్తున్నాడు. రఘునాథుడు అపర శ్రీకృష్ణ దేవరాయలు. తెలుగు కవిత్వాన్ని పోషించటమేకాకుండా స్వయంగా కావ్యాల్ని సృష్టించిన పుంభావ సరస్వతి. ఆయన పాలనలో అపూర్వ వైభవాన్ని సంతరించుకొన్న భూభాగంలో అరుంధతీసుతుడు నివసిస్తున్నాడు. అతడు పుట్టుకతోనే పేదవాడు. అయితే నీతి మార్గాన్ని ఎప్పుడూ విడవలేదు. ఈ విధంగా మంచి లక్షణాలతో జీవిస్తున్న అతని కులాన్ని, సంపదను కబళించిన స్వార్థ పరులకు కూడా కష్టాన్ని కలిగించకుండా చెప్పులు కుట్టి జీవనం సాగిస్తున్నాడు. తనవృత్తిని ఎప్పుడూ వదలకుండా భారత వీరుల పాదాలు కందకుండా చెప్పులు కుట్టి జీవిస్తున్న అతని సేవకు భారతభూమి ఋణపడి ఉన్నది.

అరుంధతీసుతుడు రెక్కల కష్టంతో పంటలు పండిస్తున్నాడు. అతడు కష్టపడకపోతే పంటలు పండవు. ఈ లోకానికి ఆహారధాన్యాలు లభించవు. అతడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెడుతున్నాడు. ఎంత శ్రమపడినా ఆ కష్టజీవికి కడుపునిండే మార్గం కనిపించటం లేదు. అంటే లోకానికి ఆహారం సమకూర్చే ఆకష్టజీవికి తినటానికి తిండి కరువై పోయింది. ఈ లోకంలో కష్టం ఒకరిదైతే సుఖం మరొకరిదవుతున్నది. అరుంధతీసుతుని తలమీద కులం అనే బురదను ఈ లోకం పులిమింది. ఈ బురదను ఆకాశ గంగ కూడా తొలగించలేక పోయిందని కవి చెప్పటం ద్వారా కులపరంగా అతడు ఎంత హీనంగా చూడబడుతున్నాడో గుర్తించవచ్చు. అతనికి దేవతల్ని ఆరాధించే అవకాశం లేదు. అంటే అర్హత లేదు. ఒకవేళ అతడు దేవతలకు నైవేద్యం పెడితే ఆ దేవతల్ని కూడా ఈ లోకం అస్పృశ్యులుగా పరిగణిస్తుంది. అస్పృశ్యుని నైవేద్య సమర్పణం వల్ల దేవతల్ని కూడా అంటరానివారిగా పరిగణించే స్వార్థపరమైన లోకం ఇది. దీన్నిబట్టి ఆనాడు అంటరానితనం ఎంత తీవ్రంగా ఉన్నదో గుర్తించవచ్చు. దీన్ని సమూలంగా నాశనం చెయ్యాలనే సంకల్పం ప్రతి ఒక్కరిలో కలిగినప్పుడే లోకంలో సమతాభావం వెల్లివిరుస్తుంది.

భారత భూమి కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతుంది. అందుకే పాముకు పాలు, చీమకు పంచదార అందిస్తుంది. క్రూరజీవుల పట్ల కూడా ఆదర భావంతో మెలిగే పవిత్ర భారత భూమి యిది. చీమకు పంచదార పెట్టి జీవకారుణ్యాన్ని ప్రకటిస్తుంది. మనం చేసిన పనులను బట్టి ఫలితాలుంటాయని నమ్మే కర్మభూమి భరతభూమి. భూతదయను ప్రకటించటం, అంటే తోటి ప్రాణుల్ని కనికరంతో చూడటం, పరమోత్తమమైన ధర్మంగా భావించవచ్చు. ఇంతటి మహత్తరమైన ధర్మ సిద్ధాంతాలతో, కర్మ సిద్ధాంతంతో విరాజిల్లే భారత భూమిలోని ధర్మదేవత కూడా అస్పృశ్యుడు ఉన్నచోట ఉలికి పడుతుంది. అంటే అస్పృశ్యునికి న్యాయం జరగటం లేదని భావించవచ్చు. క్రూర ప్రాణుల్ని సైతం ఆదరించే ఈ భూమి సాటిమనిషిపై సానుభూతిని ప్రకటించలేక పోతున్నది. అంటే మానవతారహితంగా ఈలోకం సాగుతున్నదని గుర్తించవచ్చు.

అస్పృశ్యుని ఉద్ధరించగలిగిన భగవంతుడే లేడు. అంటే ముప్పై మూడు కోట్ల దేవతలున్న ఈ దేశంలో ఏ దేవుడూ అతని మీద కనికరం చూపటం లేదు. దేవుడే పట్టించుకోకపోతే ఇక మానవుడు అతన్ని ఎలా కనికరిస్తాడని కవి ప్రశ్నిస్తున్నాడు? అంటే సాటి మానవుడు అస్పృశ్యుని పట్ల కనికరం చూపలేకపోతున్నాడని గుర్తించవచ్చు. అతడు చేసుకొన్న పాపమేమిటో ఇంతవరకు ఎవరికీ తెలియటం లేదు.

దరిద్రదేవత అస్పృశ్యుని రక్తాన్ని హరించి అతని ఇంటిలో జీవిస్తున్నది. దరిద్రానికి తోడు సమాజం నిరాదరణకు అతడు గురి అవుతున్నాడు. చాతుర్వర్ణ్య వ్యవస్థలో అస్పృశ్యుని గాలిసోకితేనే సమాజం సహించలేక పోతున్నది. హిందూమతం నాలుగు పడగల నాగరాజని భావించటం ఇక్కడ ఎంతో సముచితంగా ఉన్నది. అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలని అర్థం. హైందవం అనే నాగరాజు అస్పృశ్యుని చూడగానే కసరి బుసగొడుతున్నాడని చెప్పటం ద్వారా అతడు ఎంత దారుణానికి గురి అవుతున్నాడో గుర్తించవచ్చు.

నాలుగు వర్ణాల్లో దేనికీ చెందనివాడుగా అస్పృశ్యుడు గుర్తించబడటంతో పెళ్ళిచేసుకొని కొడుకుల్ని పుట్టించి కులం అనే మానవ కల్పితమైన గొయ్యిలోనికి నెట్టడం ఎందుకని అతడు పెళ్ళిమానుకొని బ్రహ్మచర్య దీక్షను పాటిస్తున్నాడు. ఉదయం నుంచి రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమను సాగిస్తున్నాడు.

ఒకరోజు అరుంధతీసుతుడు పగలంతా కష్టించి పనిచేసి రాత్రికి ఇంటికి చేరి, ఉన్న గంజితాగి ప్రక్కమీద శరీరం వాల్చాడు. భూమ్యాకాశాలు నిండేటట్లు చీకట్లు వ్యాపించాయి. ఆ సమయంలో మహానటుడైన శివుడు సంధ్యా సమయపు తాండవం మానివేశాడు. అప్పుడు నక్కల అరుపులు వ్యాపించాయి. చీకటి ఎంత భయంకరంగా ఉన్నదో అరుంధతీసుతుని జీవితం కూడా అంతభయంకరంగా ఉన్నది. అలాంటి భయంకరమైన సన్నివేశంలో ముక్కు, ముఖం కలిగి చీకటి ముద్దలాగా ఉన్న గబ్బిలం ఒకటి అతని ఇంటిలో ప్రవేశించింది. దాని రెక్కల గాలికి అతని ఇంటిలోని ఆముదపు దీపం ఆరిపోయింది. అంటే మరింత భయంకరమైన వాతావరణం ఏర్పడింది. దీపం ఆర్పి దయ్యపు పిల్లలాగా తిరుగుతున్న గబ్బిలాన్ని చూడగానే అరుంధతీసుతుని మనసులో కొత్త ఊహలు అంకురించాయి.

గబ్బిలం అరుంధతీ సుతునికి మేలు కలిగించే ప్రాణిగా అతడు భావించాడు. తన వృత్తాంతాన్ని మైత్రీ పూర్వకంగా దానికి విన్నవించుకోవటం మొదలుపెట్టాడు. దరిద్రుడు కావటం వల్ల అతనికి సందేశ సాధనంగా హంసలు, చిలుకలు మొదలైన ప్రాణులు లభించటం కష్టం. అందుకే తన ఇంటిలో ప్రవేశించిన గబ్బిలాన్ని సందేశ సాధనంగా భావించి తన బాధల గాధల్ని తెలియజేశాడు.

పేదలకు 'పులుగుం బుట్రలే' ఆప్తులని పలికాడు. అతని దు:ఖాన్ని చక్రవాక పక్షులు కూడా వ్యాఖ్యానించాయి. అంటే ప్రకృతి కూడా అతనికి సానుభూతిని ప్రకటించిందని భావించవచ్చు. గబ్బిలంతో అరుంధతీ సుతుడు ఈ విధంగా మాట్లాడాడు.

"ఓ గబ్బిలమా! స్వచ్ఛమైన దేవాలయాల్లో నివసించే అవకాశం నీకు లభించింది. మా లాంటి మానవులకు లభించని అదృష్టం వరించింది. నీకు స్వాగతం. నీ పిల్లలకు సుఖమేకదా! నీ తపస్సులు సక్రమంగా సాగుతున్నాయా? నీవు నివసించే దేవాలయాలు క్షేమంగా ఉన్నాయా? సమస్త లోకమూ నిద్రా ముద్రితమైన వేళ నా ఇంటిలో దేని కోసం వెదుకుతున్నావు? ఇక్కడ ఆనందం కొంచెమైనా నీకు దొరకదు. ఓ సహోదరీ! అంటరాని వాడున్న నిషిద్ధ గృహమిది. నన్ను అసహ్యించుకొన్నట్లే ఈ లోకం నిన్ను కూడా నిరాదరిస్తుంది. అయితే సమస్త దేవతా సన్నిధిలో ప్రసాదాలను ఆరగించే పుణ్యాత్మురాలవు నీవు. అలాంటి దానివి పేదల గృహంలోనికి మూర్ఖంగా ఎలా ప్రవేశించావు?" అని ప్రశ్నించాడు. గబ్బిలం తన ఇంటిలోనికి ప్రవేశించటం వల్ల దానికి ప్రయోజనం లేదని అరుంధతీసుతుని భావం. అయినా తన ఇంటికి వచ్చింది కాబట్టి దాని యోగ క్షేమాల్ని అడిగాడు. తనలాంటి మానవులకు లభించని దేవాలయ ప్రవేశమనే అదృష్టం గబ్బిలానికి కలిగినందుకు సంతోషించి స్వాగతం పలకటం ద్వారా తోటి ప్రాణిపట్ల అరుంధతీసుతుడు ప్రకటించిన ఆప్యాయత స్పష్టమవుతున్నది. ఈ లోకంలో గబ్బిలం ఇంటిలోనికి ప్రవేశిస్తే అశుభంగా భావిస్తారు. దాన్ని తరిమి కొట్టడానికి ప్రయత్నిస్తారు. కాని అరుంధతీసుతుడు దానికి స్వాగతం పలకటం ద్వారా తన సంస్కారాన్ని ప్రదర్శించాడు.

ఈ లోకానికి హృదయం లేదని తన ఇష్టం వచ్చినట్లు తిరుగుతుందని పలికాడు. శాశ్వత ధర్మ ధేనువులు పిండిన పాలు పేదలకు లభించటం లేదని పలకటం ద్వారా ఈ లోకంలో పేదవానికి న్యాయం జరగటం లేదనే సత్యాన్ని గబ్బిలానికి తెలియజేశాడు. ధనవంతుని ఆజ్ఞ ప్రకారమే ఈ లోకంలోని దేవతలు ప్రవర్తిస్తారని చెప్పటం ద్వారా ధన ప్రభావం లోకం మీదనే కాకుండా దేవతలమీద కూడా ఉందనే సత్యాన్ని స్పష్టం చేశాడు. ధనవంతుడు దేవతల మీద కూడా అధికారం చెలాయిస్తారనే వాస్తవాన్ని గబ్బిలానికి తెలియజేశాడు.

లోకంలోని మానవుల వింత ప్రవర్తనను గబ్బిలానికి విన్నవించాడు. ఈ లోకంలో బొమ్మల పెళ్ళిళ్ల చెయ్యటానికి వందలు వేలు వెచ్చిస్తారు కానీ పేదలైన భిక్షకుల శూన్యములైన పాత్రల్లో మెతుకు విదల్చటానికి ఏమాత్రం ప్రయత్నించరు. ముప్పై మూడు కోట్ల దేవతలు ఎగబడ్డ ఈ దేశంలో భాగ్య హీనుల ఆకలి మంటలు చల్లారవని అరుంధతీసుతుని అభిప్రాయం. లోకంలో మానవతా రహితంగా ప్రవర్తించే వారికి చెంపదెబ్బల్లాంటివి ఈ మాటలు. దీన జనులకు సేవచేస్తే దైవానికి సేవ చేసినట్లేనని భావించకుండా ఈ లోకం కర్కశంగా ప్రవర్తిస్తున్నదని అతని భావం. మెతుకులు పెట్టడం కాకుండా కనీసం విదల్చటం కూడా ప్రజలు చెయ్యరని చెప్పటం ద్వారా మానవుల వింత ప్రవర్తనను తెలియజేశాడు.

స్వార్థ పరులు, పిసినారులు, కపట గురువులు పరమార్థాలు బోధిస్తూ ఉంటారు. కుయుక్తులతో మోక్ష మార్గాల్ని చూపిస్తూ అమాయకుడైన మానవుని 'పాపి'గా తీర్మానాలు చేస్తారు. సామాన్య మానవుడు లేకపోతే వీరి ఆటలు సాగవు. లోకంలో ప్రతి ఒక్కరూ అమాయకుడైన సామాన్య మానవుని దోచుకోవటానికి ప్రయత్నిస్తు ఉంటారు. కపట గురువులవల్ల లోకానికి హాని కలుగుతుందని, సామాన్య మానవునికి కష్టం కలుగుతుందని భావించవచ్చు కపట గురువుల విషయంలో ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలనే పరోక్ష ప్రబోధాన్ని కవి చేస్తున్నట్లు గుర్తించవచ్చు.

ఈ పాఠ్య భాగంలో అరుంధతీసుతుని స్వభావాన్ని, దరిద్రుడైన అతని యింటిలోనికి ప్రవేశించిన గబ్బిలానికి అతడు విన్నవించిన స్వీయ వృత్తాంతాన్ని, లోకం తీరును గుర్తించవచ్చు.

**2:15. 5 సందర్భ సహిత వ్యాఖ్యలు**

**1. జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డడై (పద్యం-1)**

**పరిచయం :** ఈ మాటలు గుఱ్ఱం జాషువాగారు రచించిన 'గబ్బిలము' కావ్యంలోని మొదటి భాగం నుంచి గ్రహించ బడిన 'గబ్బిలము' అనే పాఠ్య భాగం లోనివి.

(ఈ పాఠ్య భాగంలోని ప్రతి సందర్భ సహిత వ్యాఖ్యకు ముందు పై 'పరిచయం' రాయండి)

**సందర్భం :-** అరుంధతీ సుతుని తత్వాన్ని ప్రకటిస్తూ కవి, అతడు అమాయకుడని, అన్ని కష్టాల్ని బొక్కెడు బువ్వతో మరచిపోయే క్షుధానల దగ్ధమూర్తి అని, అతడు దిక్కులేని వాడని తెలియజేసిన సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** అరుంధతీ సుతుడు భరతమాతకు కడగొట్టు సంతానంగా జన్మించాడని అంటే అంత్యజునిగా పుట్టాడని కవి చెప్పటం ద్వారా, అతడు పంచముడని, అంటరాని వాడని గ్రహించవచ్చు. అరుంధతీ సుతుని కావ్య నాయకునిగా గ్రహించి కావ్యాన్ని రచించటంలో జాషువా సాహసాన్ని ప్రదర్శించాడని చెప్పవచ్చు.

**2. చెప్పులు గుట్టి జీవనము సేయును. (పద్యం-3)**

**3. అప్పు వడ్డది సుమీ భారతావని వీని సేవకున్ (పద్యం-3)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** ఈలోకం అరుంధతీ సుతునికి కీడు కలిగించి అతన్ని అన్ని విధాలా పీడించింది. పిప్పి చేసింది. అయినా అతడు తనకు కీడు కలిగించిన వారికి సైతం మేలు కలిగేటట్లు తన వృత్తిని తాను నిర్వహిస్తున్నాడని కవి తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** తనను పీడించేవారి పాదాలకు బాధ కలగకుండా అరుంధతీ సుతుడు తన వృత్తిని నిరాకరించకుండా చెప్పులు కుట్టి జీవనం సాగిస్తున్నాడు. అందుకే ఈ భారత భూమికి అతని సేవకు రుణపడి ఉన్నదని కవి తెలిపాడు.

**4. భోజనము బెట్టువానికి భుక్తిలేదు (పద్యం-4)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** అరుంధతీ సుతుడు శ్రమజీవి. శ్రమ జీవి రెక్కల కష్టం చేసినప్పుడే పంటలు పండుతాయని, అతడు తన చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెడుతున్నాడని కవి తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** శ్రమ జీవి కష్టపడితేనే పంటలు పండుతాయి. అతడు విశ్రమిస్తే లోకం అతలాకుతలం అవుతుంది. లోకానికి తినటానికి తిండే ఉండదు. తన చెమటను ధారపోసి పంటలు పండించే శ్రామికునికి మాత్రం తినటానికి తిండి దొరకని పరిస్థితి ఈ లోకంలో ఉన్నదని చెప్పటం ద్వారా శ్రామికుని దైన్యాన్ని, అతని పరోపకార పరాయణత్వాన్ని కవి ప్రకటించాడు.

**5. వానినుద్ధరించు భగవంతుడేలేడు (పద్యం 7)**

**6. మనుజుడెట్లు వాని కనికరించు (పద్యం 7)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** భరతభూమి కర్మభూమి. పాముకు పాలు, చీమకు పంచదార మేపుతున్న కర్మభూమిలోని ధర్మదేవత కూడా అరుంధతీసుతుని పట్ల పక్షపాతాన్ని ప్రకటిస్తున్నదని కవి తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** అరుంధతీ సుతుడు సమాజంలో అన్ని విధాలా దోపిడీకి గురి అవుతూ దయనీయమైన స్థితిలో ఉన్నాడు. దీనావస్థలో ఉన్న అతన్ని ఉద్ధరించటానికి భగవంతుడు కూడా ప్రయత్నించటం లేదు. ఇక మానవుడెలా కనికరిస్తాడు? అంటే దీన జనుల్ని ఉద్ధరించే భగవంతుడే దయచూపకపోతే సామాన్య మానవుడు అరుంధతీసుతుని దైన్యాన్ని తొలగించటానికి ఎలా దయచూపుతాడని కవి ప్రశ్నించాడు.

**7. ఇనుప గజ్జెల తల్లి జీవనము సేయు (పద్యం 8)**

**8. కసరి బుసగొట్టు నాతని గాలిసోక**
**నాల్గు పడగల హైందవ నాగరాజు (పద్యం-8)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** సమాజంలో అరుంధతీసుతుని హీన స్థితిని, అతడు వర్ణ విచక్షణకు గురియైన తీరును కవి వర్ణిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** అరుంధతీసుతుడు దురదృష్టవంతుడు. దరిద్రుడు. అందుకే దరిద్ర దేవత అతని యింటిలో కాపురముంటున్నది. దరిద్ర దేవత అని చెప్పటానికి జాషువాగారు ఇనుపగజ్జెల తల్లి అనే పదబంధాన్ని సృష్టించి తనదైన ప్రత్యేకతను ప్రదర్శించాడు. ఈ సమాజంలో

నాలుగు వర్ణాలున్నాయి. ఇది హైందవాన్ని పాటించే సమాజం. ఈ హైందవం అనే నాగరాజు అరుంధతీ సుతుని గాలి సోకితేనే బుసలు కొడుతున్నాడు. అంటే అతని ఉనికినే సహించలేకపోతున్నాడు. నాగ శబ్దానికి అనేక తలలుగల పాము అని అర్థం. ఈ శబ్దం ద్వారా కవినాలుగు వర్ణాలని హైందవ వర్ణ వ్యవస్థను సూచించాడని గ్రహించవచ్చు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనే నాలుగు వర్ణాలని అర్థం.

**9. జరుప సాగె బ్రహ్మ చర్య దీక్ష (పద్యం-9)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** హైందవ సమాజంలోని వర్ణ వ్యవస్థవల్ల అరుంధతీసుతుడు పలు కష్టాలను ఎదుర్కొనవలసి రావటం వల్ల, ఆ కష్టాలను తట్టుకోలేక పెళ్ళిమానుకొని జీవనం సాగిస్తున్న తీరును కవి వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** సమాజంలోని నాలుగు వర్ణాల్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల్లో ఏ వర్ణానికీ చెందనివాడు అరుంధతీ సుతుడు. అంటే అతడు ఏకులానికీ చెందనివాడు కాకపోవటంతో లోకం అతన్ని నీచంగా చూస్తున్నది. తన పరిస్థితి దయనీయంగా ఉన్నది కాబట్టి తాను పెళ్ళి చేసుకొని, సంతానాన్ని కని భయంకరమైన గొయ్యి అనే లోకంలోకి నెట్టడం ఎందుకని బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నాడని కవి అరుంధతీ సుతుని నిస్సహాయ స్థితిని వివరించాడు.

**10. ఆముదపు దీపమల్లన నాటిపోయె (పద్యం-12)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** ఒకరోజు పగలంతా కష్టపడి పని చేసిన అరుంధతీసుతుడు చీకటి పడిన తర్వాత తన ఇంటికి చేరుకొని ఇంటిలో ఉన్న గంజితాగి పక్కమీద శరీరం వాల్చినపుడు, గబ్బిలం ఒకటి అతని ఇంటిలో ప్రవేశించిన తీరును కవి వర్ణిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** ముక్కూ ముఖం కలిగి చీకటి ముద్దలాగ ఉన్న 'గబ్బిలం' ఒకటి అరుంధతీ సుతుని ఇంటిలో ప్రవేశించి విహరించటం మొదలు పెట్టింది. అది అటూ ఇటూ తిరుగుతూ ఉండటంతో దాని రెక్కలగాలికి అతని ఇంటిలోని ఆముదపు దీపం మెల్లగా ఆరిపోయింది. భూమ్యాకాశాలు నిండిపోయిన చీకటిలో గబ్బిలం తన ఇంటిలోని దీపాన్ని ఆర్పివేయటంతో అరుంధతీసుతుని ఇంటిలో గబ్బిలం దయ్యపు పిల్లలా ఉన్నది. అంధకార బంధురమైన వాతావరణంలో అతని మనసులో కొత్తకొత్త ఊహలు పొటమరించాయి.

**11. పులుగుం బుట్రలు గాక బేదలకు నాప్తుల్ జుట్ట పక్కంబులున్ గలరే (పద్యం 14)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** అరుంధతీసుతుడు తన ఇంటిలో ప్రవేశించిన గబ్బిలాన్ని చూడటంతో అతని మనసులో కలిగిన కొత్త కొత్త ఊహలతో తన వృత్తాంతాన్ని దానికి తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** గబ్బిలం అరుంధతీసుతునికి మేలు చేకూర్చేదిగా కనిపించటంతో అతడు మైత్రీ భావంతో తన వృత్తాంతాన్ని తెలియజేయటానికి పూనుకొని పేదలకు ఆప్తులు, బంధువులు ' పులుగుంబుట్రలే ' నని చెప్పాడు. పక్షులకు ప్రకృతికి మించిన ఆప్తులు పేదలకు లభించరని ఒక అర్థాంతరన్యాసాన్ని ప్రకటించాడు. తనకు గబ్బిలం ఆప్త బంధువుగా కనిపించిందని భావించటం ద్వారా అరుంధతీసుతుడు గబ్బిలాన్ని ఎంతగా అభిమానిస్తున్నాడో అర్థమవుతున్నది. లోకం తరిమి కొట్టే జీవి తనకు ఆప్తమైనదిగా భావించటంలో అతని ప్రత్యేకత స్పష్టమవుతున్నది.

**12. దొరకదిచ్చట నానంద కిరణలవము. (పద్యం-16)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** భయంకరమైన రాత్రి సమయంలో తన ఇంటిలోనికి ప్రవేశించిన గబ్బిలంతో అరుంధతీ సుతుడు" నాయింటిలో దేనికోసం వెదకుతున్నావని' ప్రశ్నిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**వివరణ :** రాత్రి భయంకరంగా ఉన్నది. ఈ లోకం గాఢనిద్రలో మునిగి వుంది. ఆగర్భ దరిద్రుడైన అరుంధతీ సుతునికి ఇంటిలో గబ్బిలానికి ఆనందం కొంచెం కూడా లభించదని చెప్పటం ద్వారా కవి, అతని జీవితం దుఃఖమయమని, అతని యిల్లు కష్టాలకు నిలయమని ప్రకటించాడు. 'ఆనందమనే కిరణలవం' అనే రూపకం ప్రయోగం ద్వారా కవి తన ప్రత్యేకతను ప్రదర్శించాడు.

**13. భాగ్య విహీనుల క్షుత్తు లాఱునే (పద్యం -19)**

**పరిచయం :** (మొదటి సందర్భానికి రాసినట్లే)

**సందర్భం :** ఈ లోకంలో పేదవానికి న్యాయం లభించటం లేదని, ధనవంతుని ఆజ్ఞకు అనుగుణంగా దేవతలు ప్రవర్తిస్తారని, ప్రజలు మానవత్వాన్ని మరచి, దేవతల బొమ్మల పెళ్ళిళ్లకు అనవసరమైన ఖర్చుల్ని పెడుతున్నారని, దీనివల్ల పేదల ఆకలి తీరటం లేదని వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు. గబ్బిలంతో అరుంధతీసుతుడు ఈ పలుకుల్ని పలికాడు.

**వివరణ :** ప్రజలు రాతి విగ్రహాల పెళ్ళిళ్లు చెయ్యటానికి వందలు వేలు ఖర్చు పెడతారుగాని బాధల్లో ఉన్న బిచ్చగాళ్ళ పాత్రల్లో మెతుకు కూడా విదల్చరు. ముప్పైమూడు కోట్ల దేవతలు ఎగబడ్డ మన దేశంలో దరిద్రుల ఆకలి తీరుతుందా ? అని గబ్బిలంతో అరుంధతిసుతుడు పలికాడు. దైవపూజకంటే మానవసేవ మహత్తరమైనదనే పుణ్యాన్ని జాషువా భంగ్యంతరంగా ప్రకటించారు. 'మానవసేవయే మాధవ సేవ' అని గదా సూక్తి?

**2: 15: 6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు**

**1. అరుంధతీసుతుని గుణగణాల్ని, సామాజిక పరిస్థితిని కవి తెల్పిన తీరును తెలియజేయండి.**

**జ :-** జాషువా గారి లేఖినినుంచి వెలువడ్డ అద్భుత సామాజిక కావ్యం గబ్బిలము. గబ్బిలము కావ్యంలోని కథానాయకుడు అరుంధతీసుతుడు. అతడు సమాజంలోని అట్టడుగు వర్గానికి చెందినవాడు. దొరికిన డబ్బుతోనే సంతృప్తిపడే అల్ప సంతోషి, అమాయకుడు. అంటే ఇతరుల మోసాలకు గురి అయ్యేవాడు. ఇతరుల్ని మోసం చెయ్యని స్వభావం కలిగినవాడు. ఆకలి అనే అగ్నితో దహించుకుపోయే అరుంధతిసుతుడు తనకు దొరికిన అన్నంతో అన్ని కష్టాల్ని మర్చిపోతాడు. అంటే అతని ఆకలి తీర్చే అన్నం దొరికితే చాలు. అంతకుమించి ఆశించడు. అతడు దిక్కులేనివాడు. అంటే అతన్ని ఆదరించే వారెవరూలేరు. అతనికి ఎవరి అండలేదు. అతనికి ఎవరి పోషణాలేదు.

దక్షిణ భారతదేశంలోని తంజావూరు మండలంలోని దక్షిణ భూభాగంలో అరుంధతిసుతుడు నివసిస్తున్నాడు. ఈ ప్రాంతాన్ని పూర్వం రఘునాథ రాయలు పరిపాలించాడు. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో ఆంధ్ర సరస్వతికి అపూర్వమైన ఆదరణ అభించింది. ఆ తర్వాతి కాలంలో రఘునాథ నాయకుడు ఆంధ్ర సాహిత్య సృష్టికర్తల్నే కాకుండా సంస్కృత సాహిత్యాన్ని సృష్టించినవారిని కూడా ఆదరించి అపర శ్రీకృష్ణదేవరాయలుగా కీర్తింపబడ్డాడు. అలాంటి రఘునాథ రాయలు పాలించిన భూ భాగానికి తెలుగు కవిత్వం వలస వెళ్ళిందని, ఆయన దాన్ని ఆదరించాడని కవిభావం. రఘునాథుడేలిన భూ భాగంలో జీవిస్తున్న అరుంధతిసుతుడు ఆగర్భ దరిద్రుడు. అంటే పుట్టుకతోనే పేదవాడు. ఆర్థికంగా పేదవాడైనా నైతికంగా ఉన్నతుడు. అతడు నీతి మార్గాన్ని విడువలేదు. అయినా అతని కులాన్ని బలాన్ని కొంతమంది హరించి కష్టాల్ని కలిగించారు. ఎన్ని బాధలకు గురి అయినా అతడు తనవృత్తి ధర్మాన్ని నిర్వర్తించాడు. చెప్పులు కుట్టి జీవనం సాగించాడు. తనను బాధించే వారి కాళ్లకు బాధ కలగకుండా చెప్పులు కుట్టి జీవనం సాగించాడు. అతని కృషికి భారతభూమి ఋణపడి ఉన్నది.

"వాని ఱెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మట లోడ్చి ప్రపంచమునకు
భోజనముఁ బెట్టు వానికి భుక్తి లేదు" -- ఏ కష్టజీవి శ్రమతో ఈ లోకానికి ఆహారం లభిస్తున్నదో ఆ శ్రమజీవికి తినటానికి తిండి లేకపోవడం దయనీయమైన విషయం. శ్రమజీవి తలమీద ఈ సమాజం కులం అనే బురదను చల్లింది. ఆకాశ గంగాజలం కూడా ఆ బురదను తొలగించలేక పోయిందనటంలో అతని దైన్యం స్పష్టమవుతున్నది. అతడు కుల హీనుడుగా గుర్తించబడటంతో దేవతల్ని ఆరాధించే అవకాశాన్ని కోల్పోయాడు. ఒకవేళ అతడు సాహసించి దేవతలకు నైవేద్యం పెడితే ఇక ఆ దేవతలకు ఎన్నటికీ తిండి లభించని పరిస్థితి సమాజంలో ఉన్నది. అంటే దేవతల విషయంలోనూ అంటరానితనం తాండవించిందని గ్రహించవచ్చు.

ప్రతి ప్రాణిలోనూ పరమాత్మను దర్శించే కర్మభూమి మనది. పాముకు పాలు, చీమకు పంచదార అందించే ఈ కర్మభూమిలోని ధర్మదేవత కూడా పేదవాడు ఉన్నచోట ఉలికిపడుతుంది. దేవుడే అతన్ని కనికరించలేకపోతున్నాడు. ఇక మానవుడేం ఉద్ధరిస్తాడు? వాడు చేసిన పాపం ఏమిటో ఇంతవరకు ఎవరికీ తెలియదు.

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరి బుసకొట్టు నాతని గాలి సోఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు" -- దరిద్రుడైన అరుంధతీసుతుని రక్తాన్ని పీల్చిన దరిద్ర దేవత అతని ఇంటిలోనే తాండవిస్తున్నది. చాతుర్వర్ణ్య వ్యవస్థలో అస్పృశ్యుని గాలి సోకితేనే హైందవ వర్ణ వ్యవస్థ అనే నాగరాజు బుసలు కొడుతున్నాడు. 'నాగ' శబ్దానికి అనేక తలలుగల పాము అని అర్థం. అలాగే అనేక వర్ణాలున్న ఈ సమాజంలో అస్పృశ్యుని ఉనికిని హైందవం సహించలేకపోతున్నది. నాల్గుపడగల నాగరాజు అంటే చతుర్వర్ణాలు గల హిందూమతమనే నాగరాజని భావం. దీన్ని బట్టి అరుంధతీసుతుడు ఎంతటి హైన్యస్థితిలో ఉన్నాడో స్పష్టమవుతున్నది.

హైందవ సమాజంలోని నాలుగు వర్ణాల్లో అరుంధతీసుతుడు ఏ వర్ణానికీ చెందినవాడుగా గుర్తించబడలేదు. కులహీనుడుగా సమాజం చేత పరిగణించబడిన తాను తన సంతానాన్ని ఈ లోకం అనే పెద్దగోతిలోనికి నెట్టటం ఎందుకని బ్రహ్మచర్య దీక్షను సాగించాడు. వర్ణ వ్యవస్థలో ఉన్న దారుణమైన స్థితి తరువాతి తరం ఏర్పడటానికి ఆటంకాన్ని కలిగిస్తున్నదని గుర్తించవచ్చు. రెక్కలు ముక్కలు చేసుకొన్నా గింజకూడా కరువైందని కవి అరుంధతీసుతుని దీనస్థితిని వర్ణించాడు.

అరుంధతీసుతుడు ఎన్ని మంచి లక్షణాలను కలిగి ఉన్నా, ఎంతశ్రమ చేసినా అతడు శ్రమకు తగిన ఫలాన్ని పొందలేక పోవడమే కాకుండా సామాజికంగా అణగదొక్కబడుతున్నాడని ప్రస్తుత పాఠ్యభాగం ద్వారా గుర్తించవచ్చు.

**2. అరుంధతీసుతుడు గబ్బిలానికి విన్నవించిన విషయాన్ని తెల్పండి.**

**లేదా**

**3. సామాజిక స్థితిని అరుంధతీసుతుడు గబ్బిలానికి తెలియజేసిన తీరును వివరించండి.**

**జ :-** అరుంధతీసుతుడు పగలంతా కష్టపడి ఇంటిలో ఉన్న గంజి తాగి నిద్రకుపక్రమించాడు. ఆ సమయంలో భూమ్యాకాశాలు నిండేటట్లు చీకట్లు వ్యాపించాయి. అప్పుడు ముక్కు మొగమున్న చీకటి ముద్దలాగా ఉన్న గబ్బిలం ఒకటి అతని యింటిలో ప్రవేశించి అటూ ఇటూ తిరగటం మొదలు పెట్టింది. దాని రెక్కల గాలికి అతని యింటిలోని ఆముదపు దీపం ఆరిపోయింది. చీకట్లు దట్టమయ్యాయి. ఆ చీకట్లలో దయ్యపు పిల్లలా గబ్బిలం తిరుగుతుండటాన్ని అరుంధతీసుతుడు గమనించాడు. దానిని చూడటంతోనే అతని మనసులో కొత్త కొత్త ఊహలు బయలుదేరాయి.

అరుంధతీసుతుడు కావ్యనాయకుడు కావటం వల్ల అతనికి సందేశసాధనంగా గబ్బిలాన్ని కవి నిర్ణయించాడు. గబ్బిలం ఎప్పుడూ శిథిలాలయాల్లో సంచరిస్తూ ఉంటుంది. అందుకే నివాస గృహాల్లో ప్రవేశిస్తే అశుభంగా భావిస్తారు. కానీ అరుంధతీసుతుడు తన యింటిలోనికి ప్రవేశించిన గబ్బిలాన్ని ఎంతో ఆదరించి స్వాగతం పలికాడు. దాని క్షేమాన్ని, సంతానపు క్షేమాన్ని, తపస్సుచేసే తీరును, గుడిగోపురాల క్షేమాన్ని గూర్చి ప్రశ్నించాడు. ఇంటిలో ప్రవేశించిన గబ్బిలం అతనికి ఆప్తబంధువుగా తోచింది. మదోన్మత్త ప్రపంచంలో 'పులుగుం బుట్రలే' పేదలకు ఆప్తులుగా కవి వ్యాఖ్యానించటం సమంజసంగా ఉన్నది.

గబ్బిలాన్ని కవి అరుంధతీసుతుని సందేశ సాధనంగా నిర్ణయించటంలో ఎంతో ప్రతిభను ప్రదర్శించాడు. సమాజంలోని నాలుగు వర్ణాల్లో ఏ వర్ణానికీ చెందనివాడుగా పంచమ వర్ణానికి చెందినవాడుగా పరిగణించబడ్డ నాయకుని సందేశ సాధనమైన గబ్బిలం అటు పక్షి వర్గానికి, ఇటు మృగ వర్గానికి చెందక ఒక విచిత్ర ధర్మాన్ని కలిగి ఉండటం గుర్తించదగిన విషయం. స్వాగతం పలికి, గబ్బిలంతో తన స్థితిని సామాజిక పరిస్థితిని వివరించాడు.

లోకం అంతా గాఢనిద్రలో ఉన్న సమయంలో తన యింటిలో తిరుగుతున్న గబ్బిలానికి ఆనందం లేశ మాత్రమైనా లభించదని అరుంధతీసుతడు పలికాడు. దీన్ని బట్టి అతని దారిద్ర్యం స్పష్టమవుతున్నది. నిరంతరం బాధలతో జీవితాన్ని గడుపుతున్న తన యింటిలో వెదకటం వల్ల గబ్బిలానికి ప్రయోజనం శూన్యమని తన మాటల ద్వారా తెలిపాడు. ఈ లోకంలోని దేవాలయాల్లో కొంతమంది

మానవులకు ప్రవేశం లేదుగాని, గబ్బిలం మాత్రం సమస్త దేవాలయాల్లో ప్రవేశిస్తుంది. అక్కడి దేవతలకు నివేదించబడిన ప్రసాదాలను ఆరగించి పుణ్యాత్ముురాలిగా ప్రశంసలు పొందింది. అలాంటి పుణ్యాన్ని సంపాదించుకొన్న గబ్బిలం మూర్ఖ స్వభావంతో పేదల గృహానికి అంటే తన ఇంటికే రావటం వల్ల ప్రయోజనం లేదని పలికాడు.

అరుంధతీ సుతుడు గబ్బిలంతో సామాజిక స్థితిని గూర్చి పలికాడు. సమాజంలోని అసమానతల్ని, అస్తవ్యస్థ స్థితిని పేదవానికి న్యాయం జరగని స్థితిని వివరిస్తూ-

"హృదయము లేని లోకము సుమీ యిది మాపుల పశ్చిమంబుగా
నుదయము తూర్పుగా నడచుచుండు సనాతన ధర్మ ధేనువుల్
పిదికిన పాలు పేదలకు లభింపవు శ్రీగలవాని యాజ్ఞలోఁ
బెదవిఁ గదల్ప జాలరరవిందభవ ప్రముఖామృతాంధసుల్" - అని పలికారు. హృదయంలేని ఈ లోకం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంది. దీనికి ఒక క్రమం లేదు. శాశ్వత ధర్మాలు అనే ధేనువులు పిదికిన పాలు పేదలకు లభించటం లేదు. ధనవంతుల ఆజ్ఞ ప్రకారమే దేవతలు కూడా ప్రవర్తించాల్సి ఉంటుంది. ధనవంతుడు ఆజ్ఞాపిస్తే బ్రహ్మాది దేవతలు కూడా నోరు తెరవటానికి భయపడతారని చెప్పటం ద్వారా ధనవంతుల పెత్తనం పేదవారిపై ఎంత దారుణంగా సాగుతున్నదో చివరకు దేవతలపై కూడా సాగుతుందో పై పద్యం ద్వారా గుర్తించవచ్చు.

లోకంలో మానవత్వం లోపించిందని దేవతా ప్రతిమల పెళ్ళిళ్లకు వందలు వేలు ఖర్చు పెట్టేలోకం, పేదల ఖాళీ పాత్రల్లో మెతుకు కూడా విదల్చదని తెలిపాడు. ఈ లోకం మీదకు ముప్పైమూడు కోట్ల దేవతలు ఎగబడటంవల్ల పేదల ఆకలి తీరుతుందా ? అనే సందేహాన్ని ప్రకటించాడు. జీవం ఉన్నవారి దీన స్థితిని గుర్తించకుండా జీవరహితమైన రాతి విగ్రహాల్ని పూజించటం వల్ల ఫలితం లేదని పరోక్షంగా తెలిపాడు.

అరుంధతీసుతుడు గబ్బిలానికి ఈ లోకంలోని స్వార్థ గురువుల నీచ మనస్తత్వాన్ని తెలిపాడు. లోభస్వాంతులై వారు పరమార్థాల్ని బోధిస్తారని అనేక ఉపాయాలు పన్ని మోక్ష మార్గాల్ని గూర్చి తెలుపుతూ భక్తుణ్ణి పాపిగా నిర్ధారిస్తారని పలికాడు. సామాన్య భక్తుడు లేకపోతే వేదాంత రథం సాగదేమోననే సందేహాన్ని ప్రకటించాడు.

ఈ పాఠ్య భాగంలో గబ్బిలానికి అరుంధతీసుతుడు తన దీనస్థితిని తెలపటమే కాకుండా లోకంలోని అసమానతల్ని, మానవతారాహిత్యాన్ని, స్వార్థాన్ని తెలియజేశాడు. ఇది జాషువాగారి అమృత కవితాతత్వం.

డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఎం.ఏ., పి హెచ్.డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర లొయోల కళాశాల

ఖండం 2 ఆధునిక పద్యభాగం

# పెన్నేటి పాట - విద్వాన్ విశ్వం

## పాఠం 16.

2.16. 0 పరిచయం
2.16. 1 ఉద్దేశం
2.16. 2 పాఠ్యభాగ సందర్భం
2.16. 3 కఠిన పదాలకు అర్థాలు
2.16. 4 పాఠ్యభాగ వివరణ
2.16. 5 సందర్భ సహిత వ్యాఖ్యలు
2.16. 6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు.

**2. 16. 0 పరిచయం :**

**కవిపరిచయం :** ఆధునిక పద్య భాగంలో ఇంతకు ముందు కొన్ని పాఠాలు చదివారు. 'పెన్నేటి పాట' ఆధునిక పద్యభాగంలో చివరి పాఠం. రాయలసీమ రత్నమైన విద్వాన్ విశ్వం గారి అమృత లేఖిని నుంచి వెలువడ్డ అద్భుతకావ్యం 'పెన్నేటి పాట'. ఈ పాఠాన్ని గూర్చి తెలుసుకోబోయేముందు విద్వాన్ విశ్వం గారిని గూర్చి తెలుసుకొందాం.

విద్వాన్ విశ్వం గారిని గూర్చి విశాలాంధ్ర పచురణ సంస్థ ముద్రించిన 'పెన్నేటిపాట' గ్రంథంలో తెలియజేయబడిన వివరాలీవిధంగా ఉన్నాయి. " రాయసీమలో వెలిసిన రత్నాల్లో విద్వాన్ విశ్వం ఒకరు. పత్రికా రచనలో తనదైన శైలిలో పాఠకుల్ని ప్రభావితం చేసిన ప్రతిభాశాలి విద్వాన్ విశ్వం. ఈయన క్రీ.శ 1915 వ సం॥ అక్టోబర్ 21 వ తేదీన అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో జన్మించారు. ఈయన అసలు పేరు విశ్వరూపశాస్త్రి. మద్రాసు విశ్వ విద్యాలయంలో విద్వాన్ పట్టం పొందిన తరువాత పత్రికా రంగంలో ప్రవేశించి, విద్వాన్ విశ్వంగా మారిపోయారు. "తరిమెలనాగిరెడ్డి, నీలం రాజశేఖర రెడ్డి వంటి వామపక్ష రాజకీయ వాదుల సాహచర్యంతో కమ్యూనిస్టుగా తన రాజకీయ జీవితం ఆరంభించిన స్వాతంత్ర్య సమరయోధుడు విశ్వం. సంస్కృతాంధ్రాంగ్ల భాషల్లో పండితుడు. ఉన్నత విద్యాభ్యాసం కోసం బెనారస్ వెళ్లిన విశ్వానికి మదనమోహన మాలవ్యా ప్రశంసలూ అతివాద రాజకీయాలే దక్కాయి గాని చదువు పైకెక్కలేదు. 'బళ్లారి' లో 'ఆకాశవాణి' అన్న రహస్య పత్రికను నడిపించినందుకు జైలుశిక్ష అనుభవించారు. మీజాన్, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. కమ్యూనిస్టు సాహిత్యాన్ని, అభ్యుదయ సాహిత్యాన్ని ప్రజలకందించే తలంపుతో అనేక అనువాదాలు ప్రచురించారు. ప్రాచీన సంస్కృత సాహిత్యాన్ని కూడా ఆధునికులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంతో పలుగ్రంథాలు తెలుగులోకి అనువదించారు. స్పష్టమైన రాజకీయ సామాజిక అవగాహన ఉన్న విశ్వం వివిధ పత్రికల్లో సంపాదకులుగా ఉంటూ 'అవి - ఇవి', 'తెలుపు - నలుపు' 'మాణిక్యవీణ' వంటి శీర్షికలను బహుకాలంగా ప్రశంసనీయంగా నిర్వహించారు. వీరి నిజాయితీ సామాజిక నిబద్ధత, సాహితీ పటిమ, రచనా కౌశలం, పత్రికానిర్వహణ సామర్థ్యం భిన్న భిన్న రాజకీయ వాదుల గౌరవాభిమానాలందుకున్నాయి. విశ్వవిద్యాలయాలు వీరిని 'కళా ప్రపూర్ణ', డి.లిట్. డిగ్రీలతో సత్కరించాయి."

విశాలాంధ్రవారు విద్వాన్ విశ్వంగారి సమగ్ర వ్యక్తిత్వాన్ని పత్రికారచయితగా ఆయన ప్రదర్శించిన బహుముఖ ప్రతిభా సంపత్తిని ప్రకటించి విశ్వంగారి మూర్తిని పాఠకులకు సాక్షాత్కరింప జేశారు. అభ్యుదయ భావాలు గలిగిన విద్వాన్ విశ్వంగారు 'ఒకనాడు, విరికన్నె, పాపం, రాతలూ - గీతలూ, పెన్నేటిపాట, నాహృదయం' వంటి లఘు కావ్యాలు రచించారు. 1938 ప్రాంతంలో ఫాసిజం, లెనిన్, స్టాలిన్ వంటి పుస్తకాలు రాశారు. కాదంబరి, కిరాతార్జునీయం, దశకుమారచరిత్ర, మేఘసందేశం మొదలైన రచనల్ని సంస్కృతం నుంచి తెలుగులోనికి అనువాదంచేసి తమ ఉభయభాషా వైదుష్యాన్ని ప్రకటించారు. గోర్కీ, చెహోవ్, తుర్గెనెవ్ లాంటి ప్రపంచ పసిద్ధి పొందిన రచయితల కథల్ని తెలుగులోనికి అనువదించారు.

కొంతకాలం తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణల సంపాదకులుగా పనిచేశారు. పత్రికారచయితగా, అభ్యుదయవాదిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా ఆంధ్రదేశానికి సేవలందించిన విశ్వంగారు 1987 అక్టోబర్ 19 వ తేదిన తుది శ్వాసవిడిచారు. అయినా రాయలసీమ రత్నాల్లో మేటి రత్నంగా ప్రకాశిస్తూ ఉన్నారు.

**కావ్యపరిచయం :** 1953 ప్రాంతంలో రాయలసీమ ప్రజాజీవనంపై కరాళ నృత్యం చేసిన కరువు రక్కసిని కళ్లకు గట్టినట్లు చూపిన కరుణారసాత్మక కావ్యం 'పెన్నేటి పాట'. పెన్నేటి గట్టున జీవించే గ్రామీణులు బాధామయ గాథలు ఈ కావ్యంలో కఠోర జీవిత వాస్తవాలు, 'పెన్నేటిపాట' దర్శనమిస్తాయి. పద్యగేయ రూపాల సమ్మిశ్రితమైన ప్రజాకావ్యం "పెన్నేటిపాట". అయిదు సర్గలుగా విభజించబడిన కరుణ రసాత్మకమైన దృశ్య సమాహారం పెన్నేటి పాట. 'పెన్నేటి పాట' కు రచించిన పీఠికలో కీ.శే. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు..... "నేటి రాయలసీమ కన్నీటి పాట స్వచ్ఛంద వృత్తముతో వెలువడినది. అందు ప్రతిఫలించినది పీనుగుల పెన్న, 'వట్టియేడారి' 'నక్కబావలు', 'నాగుబాములు' బొంత గడ్డలు' 'రేణుగంపలు' పల్లేరుగాయలు' 'తుమ్మ తోపులు' ఇత్యాది అసంఖ్య సామాగ్రితో విశ్వంగారి కవితా విరూపాక్షుడు తాండవించినాడు. భాష, అర్థము, భావము, ఛందస్సు అన్నియు ఆ తాండవమునకు ప్రక్క వాద్యాలు వాయించినవి. 'పిన్నాట' పాడినవి. ఒక మాటలో, ఒక చేయూపులో, ఒక తల యాడింపులో, ఒక తిరుపులో ఈ నటరాజు రాయలసీమలోని భూత భావజ్జీవము నందలి చిన్న పెద్ద ఖండికలెన్నో విసరివైచినాడు." అని వివరించించారు.

'పెన్నేటి పాట' ను గూర్చి ఆచార్య ఎస్. గంగప్పగారు "ఈ కావ్యంలో ఉన్నది ఏ ఒక్కరి కథాకాదు. రాయలసీమ వాసుల అందరి కథ ! రంగడు రంగమ్మల జీవచ్ఛాయలు రాయలసీమ వాసుల జీవితాల ప్రతీకలు. ఎక్కడైనా ఎప్పుడైనా ఉన్నవాళ్లు ఎలా భోగాలను అనుభవిస్తారో, లేనివాళ్లు ఎలా అతికఠోర జీవితాలను వెళ్లబుచ్చుతుంటారో తెలుపుతూ రాయలసీమ గ్రామీణ వాతావరణాన్ని చక్కగా చిత్రీకరించారు విశ్వంగారు". (సాహిత్య సుధ పుట 157) అని చెప్పటమే కాకుండా "ఆధునికాంధ్రకవితోద్యానవనంలో పుష్పించి దశదిశలా పరిమళాలు వెదజల్లిన వరపుష్పం 'పెన్నేటిపాట' (పుట 155) అనీ, విద్వాన్ విశ్వంగారి పెన్నేటిపాట 'రాయలసీమ కన్నీటి పాట, విశ్వంగారి 'నెమ్మదిలోని మాట' విశ్వంగారి కైత కమ్మని యూట' అని పలికిన పలుకులు ప్రత్యక్షర సత్యాలు.

పెన్నేటి పాటను గూర్చి రాళ్లపల్లివారు "నామిత్రులు విద్వాన్ విశ్వంగారి అట్టి (సీమదైన్యం వల్ల కలిగినట్టి) తీవ్ర నిర్వేదమే ఈ పెన్నేటి పాటగా పరిణమించినది. ....... విశ్వం గారిది మానవ హృదయము. ఊహకన్న, భావనకన్న, అనుభవమే మూలాధారముగా వెడలిన పరవశ రచన వీరి 'పాట'. నిర్వేదము తీవ్రమైనప్పుడు అన్ని నియములను చెల్లాచెదురు చేయునదిగా పనిచేయును. అది యీ పాటలో కవిగారిని ఎన్నో ఆటలాడించినది" (పీఠిక) అని రాసిన మాటలు ముత్యాల మూటలు.

రాయలసీమ ప్రజల దుర్భర జీవన ప్రతిబింబమే 'పెన్నేటి పాట' అనిచెప్పవచ్చు.

### 2.16. 1 ఉద్దేశం :

విద్వాన్ విశ్వం 'పెన్నేటిపాట' లోని మొదటి సర్గ ప్రస్తుత పాఠ్యభాగం. ఈ పాఠ్య భాగాన్ని చదివిన తర్వాత ఈ కింది విషయాల్ని గుర్తించవచ్చు. "పెన్నేటిపాట" రాయలసీమ ప్రజల జీవితాన్ని వర్ణించిన పద్యగేయ సమ్మిశ్రిత కరుణ రసాత్మక కావ్యం.

రాయలసీమ పూర్వకాలంలో పాడిపంటలతో సర్వకళలతో వైభవంగా ప్రకాశించింది. పెన్నానది పూర్తిగా ఎండిపోయి ఎడారిగా మారింది.

పెన్నకు ఇరువైపుల శ్మశానమే. ఆ ఇసుకలో మెండుగా పండేవి పుర్రెలు మాత్రమే. పెన్న ఒడ్డున ఉన్న ప్రాంతాలు పలు బాధామయ సంఘటనలకు నెలవులు.

రైతులు ఎంత కష్టపడినా ప్రభుత్వం ఏ సహాయము చెయ్యటంలేదు. కథానాయకుడైన రంగన్నకు కష్టించి పనిచెయ్యటమే 'యాగం, యోగం, భోగం, చివరికి రోగం కూడా..'

### 2.16. 2 పాఠ్యభాగ సందర్భం :

ఒకనాడు రాయలసీమ సర్వ సంపదలతో విరాజిల్లింది. సకల కళలతో ప్రకాశించింది. వీధుల్లో రత్నాలు రాసులు పోసి అమ్మిన వైభవ భూమి ఒకనాటి రాయలసీమ. అయితే అనావృష్టివల్ల రాయలసీమ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సంపదలు నశించాయి. కళలు 'కళదప్పాయి.' పైరు పచ్చలతో ప్రకాశించవలసిన పొలాలన్ని రాళ్లు రప్పలతో నిండిపోయాయి. కరువు రక్కసి నృత్యం చేసింది. ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. దయనీయంగా ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన మానవతా వాది విశ్వంగారి హృదయం ద్రవీభవించింది. అందుకే రాయలసీమ ప్రజలు నిజాయితీని, నిండు మనస్సునీ, దండితనాన్ని వర్ణించి, అక్కడి వాతావరణాన్ని, భాషనీ కావ్యరూపంలో సాక్షాత్కరింపజేశారు. ఒకనాటి రాయలసీమ వైభవాన్ని ప్రశంసిస్తూ 'పెన్నేటిపాట' కావ్యాన్ని ప్రారంభించారు. ప్రస్తుత పాఠ్య భాగమైన మొదటి సర్గ వరిపైరును కాపలా కాస్తున్న స్త్రీల పాటల ప్రస్తావనతో మొదలైంది.

## 2. 16. 3 కఠిన పదాలకు అర్థాలు

**1. కలమ పొలికల ....... వేయంచు విచ్చుకత్తి !**

| | | |
|---|---|---|
| కలమ పొలికలు | = | వరిపైరును కాపలా కాసే స్త్రీలు |
| యాలలు | = | శృంగారపు పాటలు |
| మించుల | = | ప్రకాశించే (మెరుపుల) |
| సితారు | = | తంత్రీ (తీగలతో కూడిన) వాద్యం. |
| తెనుగు పెద్దన్నల | = | తెలుగు సాహిత్యంలోని పెద్దన మొదలైన కవుల యొక్క |
| గొనబు | = | మనోహరమైన |
| గుడారు | = | గుడారం |
| జిలుగు జరీ బుటావలువ | = | సన్నని దారాలతో, చుక్కలతో కూడిన జరీ వస్త్రం |
| నిగ్గుల కొఠారు | = | అధిక కాంతికి నిలయం |
| తెల్వి + అంచుల కఠారు | = | తెలివి అనే పదునైన కత్తి |
| కడది | = | మిక్కిలి |
| ఎడద చిక్కన | = | గుండె ధైర్యం |
| జిలుగు తేరు | = | ప్రకాశించే రథం |
| పచ్చలు | = | పసుపు రంగుగల మణులు |
| చాలు | = | వరుస |
| జాలు | = | ప్రవాహం |
| భాష్యము ÷ లు | = | (వేదాలకు ) వివరణలు |
| జల్లు | = | చినుకులతో కురిసే వర్షం |
| విరిసెను | = | వికసించింది |
| వేయి + అంచుల | = | వెయ్యి అంచులుగల |
| విచ్చు కత్తి | = | ఒరనుంచి దూసిన కత్తి |

**2. ఇది గతించిన ................ నేలదిన్నె మీద !**

| | | |
|---|---|---|
| కిన్నెర | = | వీణలాంటి వాద్యం |
| కంజరి | = | డప్పు లాంటి వాద్యం |
| నిదానించి | = | మెల్లగా |
| విదారించున్ | = | చీల్చుతుంది |
| ఎదన్ | = | హృదయాన్ని |
| ఎడారి | = | చెట్టు చేమలు లేని ఇసుకతో కూడిన నిర్జల ప్రదేశం |
| పినాకిని | = | పెన్నానది |
| ఇసుక వాలు | = | ఇసుక దిబ్బ (కుప్ప) |
| పార | = | నేలను తవ్వటానికి వాడే ఇనుప సాధనం |
| చీరు | = | చీల్చటం |
| ఇసుక బొక్కసం | = | ఇసుకకు నిలయం |

**3. చిటపట........................పరువెత్తున్ !**

| | | |
|---|---|---|
| ఉత్కటమై | = | ఎక్కువై |

దరులు = ప్రక్కలు (గట్లు)
ఒఱసి = తాకి
రటత్ = తిరిగే
కటు ప్రవాహముల = వేగవంతమైన మిక్కిలి ప్రవాహమైన
నింగికై = ఆకాశానికి

**4. జఠర ......................................... విహారము కలదా ?**

జఠర = ఉదరానికి చెందిన
లుఠత్ = ఎగురుతున్న
ఝషము = మొసలి
కర్మఠులై = కర్మబద్ధులై
హఠము = మొండితనం
హఠాత్ కఠోర క్రియ = వెంటనే జరిగే కఠినమైన పని

**5. కాని ఈ ఏటి నీటిలో ..... ఎందు కెండిపోయెనో ?**

కమ్మదనము = తియ్యదనం
పుక్కిలించిన = నోటిలో పోసుకొని వదిలిన
రండతనము = వైధవ్యం (మోసం)
ఖండిత వాది = నికరమైన మాటమీద నిలబడేవాడు
బెండు + పారినా = తేలికైనా; బలంలేక వాడిపోయినా
తుండు = వస్త్రం
పండ + పారినా = పండిపోయినా (రాలిపోయినా)
కైదండల దండలు = నమస్కారాలనే దండలతో
నీరెండ = కొద్దిపాటి ఎండ (లేత ఎండ)
వంత = బాధ (ఏడ్పు)
చింత = వగపు (విచారం)
కంతలు = రంధ్రాలు (బెజ్జాలు)
సంతుకోసము = సంతానం కోసం

**6. ఈయేటి .... విచారము గొల్పున్. !**

పాయలు = చీలికలు
పారు = ప్రవహించు
చాయల = సమీప ప్రాంతాల, దగ్గర్లోని ప్రాంతాలు
నెత్తుటి చాయలు = నెత్తుటి గుర్తులు
సమ్మిళితమై = కలిసిపోయి
విచారము = దుఃఖం (దిగులు)

**7. ఈయేటి దరుల ........... నెప్పటి కపుడే. !**

దరులు = ఒడ్డులు (గట్లు)
తిన్నెల = వేదికల మీద
పాయక = విడువక

| | | |
|---|---|---|
| పీన్గులు | = | శవాలు |

**8. సురగరు డోరగ ........... తిరుగున్ !**

| | | |
|---|---|---|
| సుర | = | దేవతలు |
| గరుడ | = | గరుడజాతి (పక్షిజాతి) |
| ఉరగ | = | నాగజాతి |
| విద్యాధర | = | విద్యాధరజాతి |
| కిన్నర, సిద్ధ, సాధ్య దైవత తరుణీ | = | కిన్నర, సిద్ధ, సాధ్య, దేవతా సంబంధమైన జాతి స్త్రీల |
| చరణ+ అరుణ+పంకేరుహ | = | ఎర్రని పద్మాల లాంటి పాదాలు |
| వఱడులు | = | ముసలి నక్కలు. |

**9. నాగకన్యలిచట ...... బీడెగాని !**

| | | |
|---|---|---|
| కామినుల్ | = | స్త్రీలు |
| బొంత గద్దలు | = | పెద్ద (లావుగా ఉన్న) గద్దలు |
| ఏలా లతా జాల డోలికలు | = | ఏలికే తీగెల సమూహపు టుయ్యాలలు |
| తిప్ప తీగెల | = | తిప్ప (గుడూచీ) తీగెల |
| ప్రవాళ | = | చిగురు |
| లతా | = | తీగెలు |
| కుంజములు | = | పొదరిళ్లు |
| లలి | = | మనోజ్ఞమైన |
| లవంగ కుడుంగ | = | లవంగపు పొదరిళ్లు |
| రేణగంపలు | = | రేణ (రేగు) అనే ముళ్ల పొదల |
| తుమ్మతోపులు | = | తుమ్మ చెట్ల వనాలు |
| నారికేళ | = | కొబ్బరి |
| చిఱు + ఈత = చిట్టీత | = | చిన్న ఈత చెట్టు |
| డొంక | = | కాలిదారి |
| చేటు | = | కీడు |
| తంగెడుల్ | = | తంగేడు చెట్లు |
| బోదగడ్డి | = | కొండ గడ్డి |
| గాదము | = | పైరులోని కసవు |
| తృణ | = | గడ్డి |
| సమాచ్ఛాదము | = | కప్పు |
| బీడు | = | దున్నని భూమి |

**10. శుకపిక ............ మెండుగన్**

| | | |
|---|---|---|
| శుక | = | చిలుకలు |
| పిక | = | కోకిల |
| శారిక | = | గోరువంకలు |
| రవ | = | ధ్వని |
| గూబ మూల్గులు | = | గుడ్ల గూబల రొదలు |
| తీతువుల్ | = | తీతువు పిట్టలు |
| వృక | = | తోడేలు |

| | | |
|---|---|---|
| జంబుకము | = | నక్క |
| కుయ్యిడు | = | కూతలు పెడతాయి |
| వల్లకాడు | = | శ్మశానం |
| ఇరుగట్టులందు | = | రెండు వైపులా |
| పులిన స్థలి | = | ఇసుక ప్రదేశం |
| మెండుగన్ | = | అధికంగా |

**11. బల్లులు........... ఫణీంద్రుల కెల్లన్ !**

| | | |
|---|---|---|
| చెవులు పిల్లులు | = | కుందేళ్లు |
| కొల్లలు | = | ఎక్కువ |
| జెఱ్ఱి | = | పెక్కుకాళ్లున్న పురుగు |
| ఫణి + ఇంద్రులు | = | పెద్దపాములు |

**12. పుట్టలు ......... తమ్ముడా !**

| | | |
|---|---|---|
| పాపర కాయల్ | = | (కాకర కాయల్లా) దద్దుర్లతో ఉండే చిన్న కాయలు |
| పుట్టెడు | = | 320 ముంతల పరిమాణం |
| కట్టా | = | అయ్యో |
| ఇది+ఏటి | = | ఇదేమి |

**13. నిట్రాళ్లు ................................... నిలువుగా ఉన్న రాళ్లు**

| | | |
|---|---|---|
| నిట్రాలు | = | నిలువుగా ఉన్న రాళ్లు |
| చట్రాళ్లు | = | చదరంగా ఉన్న రాళ్లు |
| బీట్రాళ్లు | = | చీలిన రాళ్లు |
| కుట్రెల్లి వచ్చు | = | చీలి పోతుంది |
| పేట్రేగు | = | అధికంగా బాధ కలుగుతుంది |

**14. ఆ చింత చెట్టు .... గుండెలవిసిపోవు !**

| | | |
|---|---|---|
| ప్రాపు | = | నిలయం |
| దిమ్మ | = | అరుగు (వేదిక) |
| కాఱు | = | కారాగారం |
| జాలుగాయ | = | తుంటరి చేష్టలవాడు |
| పట్టు | = | ప్రదేశం |
| బోద పోచ రెమ్మ | = | (కొండ) గడ్డి పోచ రెమ్మ |
| చండాలు (చమడాలు) | = | చర్మం |
| ద్రుక్కిడి | = | క్షుద్ర (నీచమైన) |
| కసాయి | = | కటికవాడు (ప్రాణుల్ని చంపేవాడు) |
| అవిసిపోవు | = | పగిలిపోతాయి |

**15. విడుగు చుండె.........మనమింక లెక్కయా?**

| | | |
|---|---|---|
| విడుగుచుండె | = | తొలగి పోతున్నది |
| తిమిరము | = | చీకటి |
| తొడుగు చుండె | = | ధరిస్తున్నది |
| కల్లకంప | = | దట్టమైన (కఠినమైన) కంప |
| దీప్తులు | = | కాంతులు |

| | | |
|---|---|---|
| మహా+అధ్వము | = | పెద్ద బాట |
| మూడు మూళ్లు | = | మూడు మూరలు |
| కకావికలు | = | చిందరవందర |
| బిగి గిత్తలు | = | బలం (శక్తి) గల గిత్తలు |
| దగ | = | దాహంవేసిన అలసటతో |
| తల్లడిలున్ | = | బాధపడతాయి |

**16. ఈ డొంక ..... తపియించినవియో ?**

| | | |
|---|---|---|
| ఎన్ని తూరులు | = | ఎన్ని సారులు |
| ఇరుసు | = | బండికి ఆధారమైన ఇనుప కడ్డీ |
| మునిమాపు | = | ప్రదోష సమయం (సాయం సంధ్యా సమయం) |
| ఎండ ప్రొద్దుల | = | మధ్యాహ్న సమయాల్లో |

**17. ఇది విడిది ........ యెద్దడియయినన్ ?**

| | | |
|---|---|---|
| విడిది | = | విడిచి ఉండటం (విశ్రాంతి ప్రదేశం) |
| తావు | = | నిలయం (ప్రదేశం) |
| గదుముక | = | తరుముకొని |
| ఎద్దడి | = | కరువు |

**18 వంక యిదియె ........ రోజులుగడవన్ !**

| | | |
|---|---|---|
| వంక | = | కొండలనుంచి వర్షపు నీరు పారే చోటు, ఏరులాంటిది |
| వాగు | = | కొండనీటి ప్రవాహం |
| చెలమ | = | నీటి గుంట |
| పదిలంబు | = | జాగ్రత |
| కుప్పల్ గొట్టు కాలమ్ము దాక | = | పంటనూర్చేవరకు |
| ఉత్తుత్తవై = (ఉత్తవై+ ఉత్తవై) | = | వ్యర్థమై |
| యాగం | = | యజ్ఞం |
| యోగం | = | అపూర్వ వస్తు ప్రాప్తి |
| భోగం | = | సుఖం |
| రోగం | = | వ్యాధి |

## 2.16. 4 పాఠ్యభాగ వివరణ :

**పూర్వ వైభవం :** ఒకనాడు రాయలసీమ రతానల సీమ. ఆనాడు వరిచేల దగ్గర కాపలా కాసే స్త్రీల శృంగార గీతాలు మధుర మనోహరంగా మోగే సితార నాదంలా ధ్వనించేవి. అంటే జానపదుల అచ్చమైన శృంగార గీతాలు ఆనాటి పంట పొలాల్లో ప్రతిధ్వనిస్తూ ఉండేవని గుర్తించవచ్చు. అల్లసాని పెద్దన మొదలైన తెలుగు కవుల మనోజ్ఞమైన పలుకులు జాజి మల్లెల పరిమళాలను గుబాళింప జేసేవి. రాయల యుగాన్ని ఆంధ్ర సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా గుర్తించటానికి ఈ పలుకులు తార్కాణంగా నిలుస్తాయి. రంగు రంగుల జరీ వస్త్రాలు ధరించిన సింగారం అక్కడ కనిపించేది. అద్భుతమైన తెలివి తేటలు ఆ గడ్డమీద ఒకప్పుడు విలసిల్లాయి. మొక్కవోని ధైర్యసాహసాల వీరుల కది ఆట పట్టు. కటిక రాళ్లను సైతం కవ్వించే నాట్యాలకు ఆ ప్రాంతం నిలయం. అద్భుత కాంతులతో విరాజిల్లే రథం అక్కడ ఉన్నది. రాయలసీమ 'బజారు' 'పచ్చల' రాళ్లకు నిలయంగా ఉండేది. అంటే అక్కడ వీధుల్లో రత్నాలు రాసులు పోసి అమ్మేవారు.

ఒకనాడు అక్కడ ముత్యాలు చాలు పండింది. ఆ ప్రాంతం కావ్య ప్రవాహంతో పులకించింది. అక్కడ వేదాలకు వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. వేయంచుల విచ్చుకత్తి మెరుపులు మెరిపించింది. ఇదంతా గతించిన కథ. నేటి రాయలసీమ కన్నీటి పాటను కిన్నెర మీటుతూ, కంజరిని వాయిస్తూ కవి ఈ విధంగా వర్ణిస్తున్నాడు.

**పెన్నానది దుస్థితి :**

"అదిగో పెన్నా ! నిదానంగా నడువు. ఇప్పటి పెన్నను గమనిస్తే గుండెలవిసిపోతాయి. అంతా ఎడారిగా మారిపోయింది. ఒకనాటి పెన్న ఇప్పుడు కనిపించటం లేదు. గట్లను తాకి ప్రవహించే పెన్న హోరు, జోరు ఇప్పుడు లేవు. పారతో నేలను చీల్చితే తప్ప నీరు రావటం లేదు". అంటే పెన్నలోని నీరు పూర్తిగా ఎండిపోయింది. "నీరంతా ఇసుకలో ఇంకి పోయింది కుండపోతగా వానలు కురిసిన పట్టుమని పదిరోజులు కూడా పెన్నలో నీరు నిలవటం లేదు. ఇసుక మాత్రమే మిగులుతుంది. చిటపటమని కురిస్తే వానలకే నోరు తెరిసి నురుగు కక్కుకొంటూ పైకెగసి, గట్లను ఒరుసుకొంటూ నింగిని తాకే అలలతో సాగిపోతూ ఉంటుంది. తన గర్భంలోనుంచి పైకెగసిన మొసలిలా దరిజేరిన జీవరాసుల్ని మింగుతుంది. ఇది చెయ్యని కఠోర క్రియ లేదు".

**పెన్న ప్రాముఖ్యం :**

"పెన్ననీరు కమ్మగా ఉంటుంది. దోసిలితో నీరు తీసుకొని ఒక్కసారి పుక్కిలిస్తే చాలు జన్మ సార్థకమవుతుంది. జన్మకు స్వచ్ఛత చేకూరుతుంది. పెన్నానదిని గమనిస్తే గుండె జలదరిస్తుంది. అది మోసాన్ని తొలగింప జేస్తుంది. ఖండితవాదిని చేస్తుంది. కుండలేక ఎండిపోయి బెండు వారినా నిండుమనస్సు, నిజాయితీ, ధర్మదీక్షలను గుండెలలో పండిస్తుంది. చేతులెత్తి పెన్నకు నమస్కరించి ఆమెను సేవించి పొందని కవి ప్రబోధించాడు.

**పెన్నదుఃఖం :**

అందరినీ ఆదరించే పెన్నానది ఎందుకెండి పోయింది? ఎందుకలా మారిపోయిందో తెలియటం లేదు. వంతలతో, చింతలతో కంతలు పడిపోయిందో? తన సంతతి కోసం ఏడ్చి ఏడ్చి గొంతు తడి ఆరిపోయిందేమో? ఈయేటి కాలువ అనేక విధాలుగా విడిపోయి ప్రవహిస్తుంది. ప్రతి నీటి బొట్టులోను రైతుల నెత్తుటి గుర్తులు కనిపించి విచారాన్ని కలిగిస్తుంది. అంటే వాళ్లు ఎంత శ్రమ పడినా సరైన ఫలితం లభించక వారి జీవితాలు దుఃఖమయంగా ఉన్నాయనే విషయం స్పష్టమవుతుంది.

**వైభవం లేదు, దుస్థితి మిగిలింది :**

పెన్నానది గట్ల మీద నక్క బావలు తిరుగుతూ ఉంటాయి. అక్కడ శవాలకు అంత్యక్రియలెప్పుడూ జరుగుతుంటాయి. సుర, గరుడ, ఉరగ, కిన్నెర, సిద్ధ, సాధ్య దేవతా స్త్రీల పాద పద్మాల అరుణ కాంతులు లేవుగాని అక్కడ ముసలి నక్కలే తిరుగుతుంటాయి. నాగకన్యలు లేవుగాని నాగుపాములు సాగుతాయి. గరుడ గంధర్వ స్త్రీలు కనిపించరుగాని బొంత గద్దలు గుంపులు కడతాయి.

ఏలకీ తీగెల ఉయ్యాలలు లేవుగాని తిప్పతీగెలు ఉన్నాయి. చిగుళ్లతో ప్రకాశించే తీగెల పొదరిళ్లు లేవుగాని రేణకంపల పొదరిళ్లు ఉన్నాయి. లవంగ పొదల లాలిత్యాలు లేవుగాని తుమ్మతోపుల ముళ్లదారులు ఉన్నాయి. కొబ్బరి తోటలు లేవుగాని చిట్టీత డొంకలున్నాయి. ఇక్కడ గులాబీలు వికసించవు గాని, తంగేడు, పెద్దగడ్డి మాత్రమే పెరుగుతుంది. పచ్చిక తివాచీలు లేవుగాని కేవలం పల్లేరుగాయల బీడు కనిపిస్తుంది."

"ఇక్కడ చిలుకల, కోకిలల, గోరువంకల మధుర శ్రుతులు వినిపింపవుగాని గుడ్లగూబల మూలుగులు, తీతువు పిట్టల కూతలు వినిపిస్తాయి. తోడేళ్లు, నక్కల అరుపులు దిగులు పుట్టిస్తాయి. పెన్నకు ఇరువైపులా శ్మశానమే. ఇక్కడ ఉన్న ఇసుకలో పుర్రెల పంటలు మెండుగా పండుతాయి. బల్లులు, తొండలు, ఎలుకలు, పిల్లులు, కుక్కలు, కుందేళ్లు, తేళ్లూ, జెర్రులు, పాములు ఎక్కువగా ఉంటాయి. పుట్టలు ఎక్కువ. పాపరకాయలు, జులుకులు అధికం. పొడుగు రాళ్లు, చదరపు రాళ్లు, చీలిన రాళ్లు బాధను కలిగిస్తాయి".

"అదిగో ఆ కనిపించే చింతచెట్టు కొమ్మచిన్నిగాని ఊపిరి తీసిన చోటు. ఆ తుమ్మ చెట్టు దిమ్మ సీతిగాడిని చెరసాలకు పంపిన తావు. ఆ ఈత చెట్టున్న చోటే ఎంకి భర్త చావుకి సాక్ష్యం. ఆ కనిపించే కొండగడ్డి పోచ ఎరుకలసాని చర్మం ఊడదీసిన జాణ. ఆ ఇసుక దిబ్బ చలమన్న బండిని సాగనీయని కసాయి. ఇక్కడ అడుగుతీసి అడుగు వేస్తేనే గుండెలు బద్దలవుతాయి".

"చీకటి తొలగి పోతున్నది. అరుణకాంతి వ్యాపిస్తుంది. ఏదో కోడికూత వినిపిస్తుంది. వేగంగా నడు. అక్కడ ఒక పల్లె ఉన్నట్లు కనిపిస్తుంది. అటూ ఇటూ ముళ్ల కంప. సూర్యకిరణాలు కూడా ఇక్కడ ప్రసరించలేవు. ఇక్కడ కేవలం మూడు మూరల దారి మాత్రమే ఉన్నది. జాగ్రత్తగా నడు. ఇసుకలో కాళ్లు కూరుకు పోతాయి. పోటుగిత్తలే దప్పికతో అల్లాడి సాగలేవు మనమొక లెక్కా ! అంటే

పశువులు కూడా నడవలేని ఇసుక దిబ్బలు కూడా ఉన్నాయని, మానవులు దానిలో నడవటం కష్టమని కవి ప్రబోధిస్తూ మెల్లగా నడువుమని చెబుతున్నాడు.

"ఇక్కడ డొంకలో పెళ్లి బృందాలను దొంగలు ఎన్నిసార్లు దోచుకున్నారో లెక్క లేదు. ఈ డొంకలోనే నిండుబండ్ల ఇరుసులు పుటుక్కుమని విరిగి పోయాయి. ఎంతోమంది మొనగాళ్ల కాళ్ల, చేతుల ఎముకలు ఈ దారిలోనే ఎన్నోసార్లు విరిగిపోయాయి. మంచినీళ్లు తెచ్చే కొత్త కోడళ్లు ఈ దారిలో ఎంతో బాధపడ్డారు".

"ఇక్కడ సాయం సమయాల్లో విహరించే ప్రేమజంటల విహారాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఎండవేళల్లో ఇక్కడ పశువులు ఎంతో తపించి పోయాయి. ఆవుల మందలు ఇక్కడే విశ్రాంతి తీసుకొంటాయి. గొర్రెలకు, మేకలకు ఇదే నిలయం. నీటి కరువు ఏర్పడితే ఒక్కోసారి పులులు కూడా ఇక్కడకే వస్తాయి. ఈ వాగు కొండనుంచి వచ్చే ప్రవాహంతో ఏర్పడింది. వానవస్తే వాగు పొంగుతుంది. దాని పక్కనే వంక, మంచి నీటి గుంటలు ఉన్నాయి".

"అదిగో రైతులు పారలతో ఈ కాల్వను బాగు చెయ్యటానికి వస్తున్నారు. పంటను నూర్చే వరకు వాళ్లు అవిశ్రాంతంగా పనిచెయ్యవలసిందే ప్రభుత్వం వారు మాత్రం పన్ను వేస్తారు. రైతు ఒక్కరోజు విశ్రమిస్తే పొలాలు బీడులవుతాయి. ఆ రైతుల గుంపులో నుంచి రంగన్న శృంగార గీతం పాడుకొంటూ వస్తున్నాడు. శ్రమించటమే అతనికి యాగం, యోగం, భోగం. రోజులు గడిస్తే అదే రోగంగా మారుతుంది". అని కవి రాయలసీమ దుస్థితిని పాఠకులకు సాక్షాత్కరింపజేశాడు.

## 2. 16. 5 సందర్భ సహిత వ్యాఖ్యలు :

ఈ పాఠంలో ఇంతవరకు పాఠ్య భాగరచయిత, కావ్యం, కఠిన పదాలకు అర్థాలు, పాఠ్యభాగ వివరణ అనే అంశాలు తెలుసుకొన్నారు. ఇప్పుడు ఈ పాఠంలో వచ్చే ముఖ్యమైన సందర్భవాక్యాలకు వివరణలు తెలుసుకొంటారు.

**1. మాయ జిలుగుల తేరుగలదు.**

**2. రాయలసీయ పచ్చల బజారు.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం : ఒకనాటి రాయలసీమ రతనాలసీమ అని, రాయలసీమ అనేక కళలతో, పాడిపంటలతో, సాహితీ వైభవంతో ప్రకాశించిందని తెలియజేస్తూ అక్కడి రథాన్ని, పచ్చలబజారును గూర్చి వివరిస్తున్న సందర్భంలో కవి పలికిన పలుకులివి.

వివరణ: రాయలసీమ గుండెధైర్యం గలిగిన వీరులకు నెలవు. అక్కడ వింత కాంతులతో విరాజిల్లే రథం కటికరాళ్లను సైతం కవ్వించి గజ్జెకట్టి చిందులు తొక్కించగలదు. రాయలసీమలో 'పచ్చలు' అనే రత్నాలను వీధుల్లో కుప్పలు పోసి అమ్మేవారు. దీన్ని బట్టి రాయలసీమ శిల్పపరంగా, ఆర్థికంగా ఎంత ఉన్నత స్థితిలో ఉండేదో ఊహించుకోవచ్చు.

**3. విరిసెనట నాడు వేయంచు విచ్చుకత్తి.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:- ఒకనాటి రాయలసీమ వైభవాన్ని వర్ణిస్తూ కవి అక్కడ సంపదలు, సాహిత్యం, పరాక్రమం ప్రకాశించాయిని తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: రాయలసీమలో ముత్యాల పంటలు పండాయి. కావ్యాలు ప్రవహించాయి. భాష్యాల జల్లు కురిసింది. వేయంచుల విచ్చుకత్తి తళతళ లాడింది. అంటే సంపదకు, ప్రతిభా సంపదకు కొరతలేదని, పరాక్రమానికి రామలసీమ నిలయమని గుర్తించవచ్చు.

**4. పట్టి యెదారి తమ్ముడు నిదానించినడు, నిదారించునెదన్ !**

పరిచయం : ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం:- రాయలసీమ కన్నీటి పాటను కోటిగొంతుల కిన్నెర మీటుకొంటూ, కోటి గుండెల కంజరి కొట్టుకొంటూ వినిపిస్తానని కవి పెన్నానది ఎండిపోయిన దృశ్యాన్ని వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: ఒకప్పుడు పొంగి పొర్లిన పెన్నానదిలో ఇప్పుడు చుక్కనీళ్లు కూడా కనిపించటం లేదు. ఆ నదిలోని నీటి హోరు, జోరు అదృశ్యమయ్యాయి. అందుకే ఆ దృశ్యం గుండెను చీల్చుతుందని, నిదానంగా నడవాలని కవిహితవు పలికాడు. ఇప్పుడు పెన్న ఎడారిగా మారిపోయింది. అంటే ఇసుక దిబ్బలతో నిర్జలంగా ఉండి హృదయ విదారకంగా కనిపిస్తున్నదని భావం.

**5. దరిజేరు జీవరాసుల మ్రింగున్ !**

**6. ఇది చేయని హఠాత్ కఠోర క్రియా విహారము కలదా !**

పరిచయం : ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: చిన్న చినుకులు పడితేనే పెన్న నురగలు గక్కుతూ, గట్లను తాకుతూ ఆకాశాన్ని తాకే అలలతో ప్రవహిస్తూ ఉంటుందని కర్మఠులై తనను జేరిన వారిని మింగుతుందని కవి తెలియజేస్తున్న సందర్భం లోనివి ఈ పలుకులు.

వివరణ: ఆకాశాన్ని తాకే అలలతో ఎగసిపడే పెన్నానది తన ఆకల్ని తీర్చుకోవటానికి అన్నట్లు తన నీటి నుంచి పైకెగసిన మొసలిలా మారిపోయి తన దరికి చేరిన ప్రాణుల్ని మింగుతూ ఉంటుంది. ఇది చేసే కఠినమైన పనులకు లెక్కలేదు. అంటే హఠాత్తుగా ప్రాణుల్ని మింగే స్వభావం పెన్నకు ఉన్నట్లు గ్రహించవచ్చు.

**7. గుండెజలదరింప జేయు !**

**8. రండ తనము డుల్చి వేయు.**

**9. ఖండిత వాదిని జేయు**

**దండి తల్లి సుమీ నది.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: పెన్న ఒక్కోసారి కఠినంగా ప్రవర్తించినా దానినీటిలో కమ్మదనం ఉన్నది. ఆ నీటిని పుక్కిలిస్తేనే జన్మకు సార్థకత కలుగుతుందని కవి వివరిస్తున్న సందర్భం లోనివి ఈ పలుకులు.

వివరణ : పెన్ననీరు స్వచ్ఛతను ప్రసాదిస్తుంది. గుండెల్ని జలదరింపజేస్తుంది. అంటే గగుర్పాటును కలిగింపజేస్తుంది. మోసాల్ని తొలగింపజేస్తుంది. ఖండిత వాదిని చేసే దండితల్లి పెన్నానది. పెన్నానదికి ఎంతో శక్తి, మహిమ ఉన్నవనే విషయం ఈ పలుకుల ద్వారా స్పష్టమవుతున్నది.

**10. సంతుకోస మేడ్చి ఏడ్చి**

**గొంతు కారి పోయెనో.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: పెన్నానది ఎన్నో శుభ లక్షణాలు కలిగింది. ధర్మదీక్షను పండించే పెన్న ఎందుకు ఎండి పోయిందోనని ప్రశ్నించి కవి తానే సమాధానం చెబుతున్న సందర్భం లోనివి ఈ పలుకులు.

వివరణ: "నిండు మనసూ, నిజాయితీ దండిగా కలిగిన పెన్నానది ఎందుకు ఎండిపోయిందో, ఎందుకు ఎడారిగా మారిపోయిందో తెలియటం లేదు. వంతలతో, చింతలతో కంతలు పడిపోయిందో ! లేకపోతే తన సంతానం కోసం బాగా ఏడ్చి గొంతు ఆరిపోయిందో!" అని కవి అద్భుతమైన ఊహచేశాడు. బాగా ఏడ్చినప్పుడు గొంతు ఆరి పోవటం సహజం. ఈ విషయాన్ని కవి నదీ పరంగా అన్వయించి తన బిడ్డల కోసం పెన్నానది దుఃఖించటం వల్ల గొంతు ఆరిపోయిందని అంటే ప్రవాహం ఎండిపోయిందని ఊహించటంలో కవి ప్రత్యేకత ప్రస్ఫుటమవుతున్నది.

**11. వట్టి వఱడులె తిరుగున్.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: రాయలసీమలో ఒకనాడు ఉన్నత వైభవం దీప్తించిందని ప్రస్తుతం పురా వైభవం అదృశ్యమై తట్టుకోలేని అనేక హృదయ విదారకమైన దృశ్యాలు సాక్షాత్కరిస్తున్నాయని కవి తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: ఇంతకు ముందు రాయలసీయలో సుర, గరుడ, ఉరగ, కిన్నెర, విద్యాధర, సిద్ధ, సాధ్య, దైవత తరుణీమణులు తమ ఎర్రని పాద పద్మాలకాంతులతో సంచరిస్తూ ఉండేవారు. కాని ప్రస్తుతం కేవలం ముసలి నక్కలు మాత్రమే తిరుగుతున్నాయని చెప్పటం ద్వారా అక్కడి దయనీయ స్థితి స్పష్టమవుతున్నది.

**12. ఇట గులాబీలు తలసూప వెపుడు !**

**13. సరస సుకుమార తృణ సమాచ్ఛదము లేదు.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: రాయలసీయలో వైభవ చిహ్న ప్రదర్శితాలైన దృశ్యాలు కనిపించకుండా కష్టాలను కలిగింపజేసేవాతావరణం నెలకొంటున్నదని కవి తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు

వివరణ: రాయలసీమలోని పెన్నానది పక్కన తిప్పతీగెలు, రేణకంపలు, తుమ్మతోపులు, చిట్టీత డొంకలు మాత్రమే ఉన్నాయి గాని గులాబీలు పుష్పించలేదు. గడ్డిగాదం పెరుగుతున్నదేగాని పచ్చిక బయళ్లులేవు. అంటే హృదయ విదారకమైన వాతావరణమేగాని ఆహ్లాదకరమైన దృశ్యాలు లేవని తాత్పర్యం.

**14. నీ తల పేట్రేగును సుమ్ము ముందు వెనుకల్ గనుమా !**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: పెన్నానది ఒడ్డున గుట్టలు గుట్టలుగా పుట్టలున్నాయని పాపర కాయలు, జులుకులు విరివిగా ఉన్నాయని రకరకాల రాళ్లు అక్కడ ఉన్నాయి కాబట్టి జాగ్రత్తగా నడవ వలసిందని కవి ప్రబోధిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: నిలువుగా ఉన్న రాళ్లు, చదరంగా ఉన్న రాళ్లు, పగిలిన రాళ్లు అక్కడ ఎక్కువగా ఉన్నాయి. గబగబా నడిస్తే కాళ్లు చీలిపోతాయి. ముందూ వెనుకా గమనించకపోతే తల పగిలిపోతుంది. అందుకే జాగ్రత్తగా వెళ్ళాలని రాయలసీయలోని రాళ్ల స్థితిని కవి ప్రకటించాడు.

**15. అడుగు దీసి అడుగు బెట్టుటకే**
**గుండెలవిసి పోవు.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: పెన్నానది ఒడ్డున ఉన్న చింత చెట్టు కొమ్మ, తుమ్మచెట్టు దిమ్మ, ఈతచెట్టు పట్టు, బోదపోచరెమ్మ, ఇసుక దిబ్బలు హృదయ విదారక దృశ్యాలకు నిలయాలని కవి వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: పెన్నగట్టుకు సమీపంలో ఉన్న ప్రాంతంలోని చిన్నిగాని ఉరితీత, సీతిగాని కారాగార వాసం, ఎంకి వైధవ్యం, ఎరుకలసాని శారీరక బాధ, చలమన్న పాట్లు తలచుకొంటే, అక్కడ అడుగువేసి అడుగుతీస్తే అంటే అక్కడ నడుస్తుంటే ఆ దృశ్యాలు గుండెల్ని బద్దలు చేస్తాయని భావం.

**16. మనమింక లెక్కయా ?**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: పెన్నానది గట్టున ఉన్న దట్టమైన ముళ్లకంపలో సూర్యకాంతి కూడా దూరలేదు. ఆ కంపమధ్య ఉన్న దారి వెడల్పు మూడు మూరలు మాత్రమే. అక్కడి ఇసుక తిన్నెల్లో నడవటం ఎంతో కష్టమని కవి తెలియజేస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: ఇసుకలో అడుగులు వేస్తే చిందర వందరలవుతాయి. అంటే కాళ్లకు పట్టు దొరకదు. జారిపోతూ ఉంటాయి. నడక ముందుకు సాగదు. ఎంత బలంగలిగిన గిత్తలైనా ఈ ఇసుకలో నడవలేక బాధపడతాయి, అలిసిపోతాయి. ఇక మనలాంటి మానవులం ఒక లెక్కా! అంటే గిత్తలు నడవలేని ఇసుకలో నడవటం మానవులకు సాధ్యం కాదని భావం.

**17. ఇది పులులకు రేవునీటి యొద్దడి యయినన్.**

పరిచయం: ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: పెన్నానది గట్టున ఉన్న దుర్గమ ప్రాంతాల్ని వర్ణిస్తూ కవి ఒక డొంకలో జరిగే ప్రమాదాలను గూర్చి తెలిపాడు. అలాగే ఆ ప్రాంతంలో ఎండవేళల్లో పశువులు విశ్రాంతి కోసం ఒక చోట చేరతాయని, కొన్ని సందర్భాల్లో పులులు కూడా అక్కడకు చేరతాయని తెలుపుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: "ఈ డొంకలో ఆవుల మందలు విడిది చేస్తాయి. గొర్రెల్ని మేకల్ని ఇక్కడ తోలుకొస్తారు. నీటి కరువు ఏర్పడితే పులులుకూడా ఈ డొంకలోనికే వస్తాయి". దీన్నిబట్టి ఆ డొంక ఎంత ప్రమాదకరమైందో ఊహించవచ్చు.

**18. సర్కారూరకే పన్ను వేయుదురంతే.**

**19. ఒకనాడు మానిన పొలాలుత్తుత్త వైపోవున్.**

**20. రంగన్న కిదే యాగము, యోగము భోగము రోగమ్మును గూడ.**

పరిచయం:- ఈ వాక్యం విద్వాన్ విశ్వంగారు రచించిన 'పెన్నేటి పాట' అనే కావ్యంలోని మొదటి సర్గనుంచి స్వీకరించబడిన 'పెన్నేటిపాట' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం: కాల్వను బాగు చెయ్యటానికి వస్తున్న రైతుల శ్రమశక్తిని వివరిస్తూ, రైతులదంరూ తమ పంట నూర్పిడి కాలం వరకూ పనిచేస్తూనే ఉంటారని, ప్రభుత్వం సౌకర్యాల్ని కలిగించకుండా పన్నులు మాత్రం వేస్తుందని, రైతుల శ్రమ శక్తి విలువైందని వివరిస్తున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ: రైతుల బాధల్ని గుర్తించని ప్రభుత్వం ఊరకనే పన్నులు విధిస్తుంది. వారు ఒక్కరోజు పనిమానివేస్తే పొలాలు బీడులై పోతాయి. రంగన్న అనే రైతు, రైతుల గుంపులోనుంచి వస్తూ జానపద గీతాలు పాడుతున్నాడు. శ్రమిస్తూ, పాటలు పాడుకోవటమే అతనికి యాగం, యోగం, భోగం, అది వికటిస్తే రోగంగా కూడా మారుతుంది.

## 2. 16. 6 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు :

**1. 'పెన్నేటి పాట' రాయలసీయ కన్నీటి పాట వివరించండి.**

లేదా

**2. రాయలసీమ పూర్వ వైభవాన్ని, ప్రస్తుత స్థితిని విద్వాన్ విశ్వం ప్రకటించిన తీరును తెల్పండి.**

లేదా

**3. పెన్నానది ఎడారిగా మారిన దృశ్యాన్ని కవి వర్ణించిన రీతిని వివరించండి.**

జ. విద్వాన్ విశ్వం మానవతావాద దృక్పథం గలిగిన విశిష్టకవి అని చెప్పటానికి 'పెన్నేటి పాట' కావ్యం ప్రత్యక్ష సాక్ష్యం. రాయలసీమ గత వైభవాన్ని గుర్తించి ప్రస్తుత దీనస్థితిని గమనించి పద్య గేయ రూపాత్మకమైన కావ్యాన్ని వెలువరించారు. రైతులు పాలేర్లుగా మారిన

దృశ్యాల్ని చిత్రీకరించారు. ప్రస్తుత పాఠ్యభాగంలో రాయలసీమ పూర్వ వైభవం, ప్రస్తుత పెన్న దుస్థితిని హృదయం ద్రవీకరించే రీతిలో వినిపించారు. మొదటి సర్గలోని విశేషాలు ప్రస్తుత పాఠ్యభాగంలో ఉన్నాయి.

**రాయలసీమ పూర్వ వైభవం:**

రాయలసీమ రాయలేలిన సీమ. ఒకనాడు పంటపొలాలు కాపలా కాసే కాపు పడుచుల జానపద గీతాలతో ప్రతిధ్వనించేవి. అల్లసాని పెద్దన లాంటి అష్టదిగ్గజ కవీంద్రుల కమ్మని వాక్కుల భావ పరిమళాలు పరివ్యాప్తమయ్యాయి. జిలుగు జరీబుటా వస్త్రాలు సింగారింపబడేవి. మేధా సంపన్నులైన వారి ప్రతిభా ఖడ్గం ప్రకాశించేది. రాయలసీమ గుండెధైర్యం గలిగిన గొప్ప వీరులకు పురిటిగడ్డ. కటిక రాళ్లను సైతం గజ్జెకట్టి నర్తింపజేయగల మాయ జిలుగుల రథం రాయలసీమ శిల్ప కళావైభవాన్ని ప్రకటించేది. రాయలసీమ వీధుల్లో పచ్చల్ని రాసులు పోసి విక్రయించేవారు. అక్కడ ముత్యాల పంట పండింది. కావ్యాలు ప్రవహించాయి. వేద భాష్యాలు వెల్లి విరిశాయి. వేయంచుల విచ్చు కత్తుల ధగధగలు వ్యాపించాయి. ఇదంతా గతం.

**నేటి పెన్న పరిస్థితి:**

నేటి రాయలసీమ కన్నీటి పాటను కవి, కోటి గొంతుల కిన్నెర మీటుతూ, కోటి గుండెల కంజరి వాయిస్తూ వినిపించారు. పెన్న నీటి హోరూ, జోరూ తగ్గింది. ఇసుక మేటవేసింది. నిదానంగా నడిచి చూస్తుంటే హృదయం ద్రవించి పోతున్నది. చెమటలు కాలువ గట్టేటట్లు పారలతో తవ్వే వరకు నీటిచుక్క కనిపించని దుస్థితి ఏర్పడింది. కుండపోతగా వర్షం కురిసినా పదిరోజుల్లో ఆ నీరంతా ఇసుకలో ఇంకి పోతుంది. పెన్న నేలదిన్నె మీద పవ్వళిస్తుంది. అంటే ఇసుక తప్ప నీటి చుక్క లేదని అర్థం. కొద్దిపాటి చినుకుల నీటితో విజృంభించి ఒక్కోసారి ఆకాశాన్ని తాకే అలలతో ఎగిసిపడుతూ తన కడుపులోని మొసలిలా ఉవ్వెత్తుకు ఎగసి దరిజేరిన జీవరాసుల్ని మింగుతుంది. ఇది చేసే హఠాత్ కఠోర క్రియలకు అంతం లేదు.

**పెన్న నీటి మహిమ :**

ప్రాణుల్ని మింగినా పెన్ననీరు కమ్మగా ఉంటుంది. పెన్న నీటిని దోసిటిలో పట్టి ఒక్కసారి నోటిలో పోసుకొని పుక్కిలిస్తే చాలు జన్మకు సార్థకత ఏర్పడుతుంది. స్వచ్ఛత ప్రాప్తిస్తుంది. పెన్ననీరు గగుర్పాటు కలిగిస్తుంది. మోసాల్ని తొలగిస్తుంది. ఖండిత వాదిని చేస్తుంది. కండలేక ఎండిపోయి బెండుగా మారినా నిజాయితీ ధర్మదీక్షల్ని పండిస్తుంది.

ఇంత మంచి పెన్న ఎందుకో ఎండిపోయింది. ఇంత మందిని కన్నతల్లిలా కాపాడే పెన్న ఎండిపోయింది. వంతలతో చింతించి ఆరిపోయిందో, తన సంతతికోసం మిక్కిలి దుఃఖించటం వల్ల పెన్ననీరు ఇంకిపోయిందో అర్థం కావటంలేదు. పెన్నానది నుంచి ప్రవహించే కాలువల్లోని ప్రతినీటి బొట్టులోను రాయలసీమ రైతుల నెత్తుటి ఛాయలు ప్రతిబింబించి విషాదాన్ని కలిగిస్తాయి. అంటే రైతులు తమ రెక్కలు ముక్కలు చేసుకొన్నా తగిన ఫలితాన్ని పొందలేక పోతున్నారనే కఠోర సత్యాన్ని మనం విస్మరించకూడదు.

పెన్నానది గట్ల మీద నక్కలు ఎప్పుడూ తిరుగుతుంటాయి. అక్కడ ఎప్పుడూ శవాలకు అంత్యక్రియలు జరుగుతూనే ఉంటాయి. ఒకప్పుడు ఈ నదీ తీరంలో సుర, గరుడ, ఉరగ, నాగ, సిద్ధ, సాధ్య జాతులు తరుణీ మణులు విహరించేవారు. ఈనాడు ముసలినక్కలు తిరుగుతున్నాయి. అక్కడ ప్రస్తుతం నాగకన్యలు లేరుగాని నాగుపాములు తిరుగుతున్నాయి. గరుడ గంధర్వ స్త్రీలు కనిపించరుగాని బొంత గద్దల గుంపులున్నాయి. ఏలకీ తీగెల ఉయ్యాలలు, చిగురుతీగెల పొదరిళ్లు, లవంగపు పొదరిళ్లు, కొబ్బరితోటలు లేవు. తిప్పతీగెలు, రేణకంపలు, తుమ్మతోపులు, చిట్టీత డొంకలు మాత్రమే మిగిలాయి. గులాబీలు వికసించవుగాని గడ్డిగాదం పెరుగుతుంది. పచ్చికబయళ్లు లేవుగాని పల్లేరు కాయల బీళ్లున్నాయి.

పెన్నానదీ తీరంలో ఒకనాడు శుకపిక శారికారవాలు వినిపించేవి. ప్రస్తుతం గుడ్లగూబల అరుపులు, తీతువు పిట్టలరొదలు, తోడేళ్ల, నక్కల అరుపులు వినిపిస్తున్నాయి. ఆ నదికి రెండు వైపులా ఇసుకలో పుర్రెలు మెండుగా పండుతున్నాయి.

పెన్నానది గట్టున ఎక్కడ జూచినా బల్లులు, తొండలు, ఎలుకలు, పిల్లులు, కుక్కలు, కుందేళ్లు, తేళ్లు, జెర్రులు, పాములు తిరుగుతున్నాయి. పనికిరాని పాడు పల్లేరు కాయలు నిండి ఉన్నాయి. పుట్టల గుట్టలు మెండుగా ఉన్నాయి. రకరకాల రాళ్లు నడిచేవారి కాళ్లను బద్దలు చేస్తున్నాయి.

ఎండిన పెన్నానది పక్కన ఉన్న చింతచెట్టు కొమ్మకు చిన్నిగాడిని ఉరితీశారు. తుమ్మ చెట్టు దిమ్మదగ్గర సీతిగాడికి జైలు శిక్ష వేశారు. ఈత చెట్టు దగ్గర ఎంకి కడియాలు ఊడదీశారు. బోదపోచరెమ్మతో ఎరుకలసాని శరీరాన్ని బాధించారు. ఇసుకదిబ్బ

చలమన్నను మోసగించి, కసాయిలా ఉన్నది. అక్కడ అడుగుతీసి అడుగువేస్తే గుండెలు బద్దలవుతాయి. అంటే అక్కడి పరిస్థితి అత్యంత భయంకరంగా ఉన్నది.

**సీమ పల్లె స్థితి:**

పెన్నకు పక్కనే ఒక పల్లె కనిపిస్తుంది. అప్పుడే చీకట్లు తొలగి వెలుగులు వ్యాపించాయి. కోడికూత వినిపిస్తున్నది. పల్లెలోనికి వెళుతుంటే

"అటు నిటు కల్లకంప
తరుణారుణ దీప్తులు దూర నేర విచ్చుట !
నడుమన్ గలట్టిది విశాల మహాధ్వము
మూడుమూళ్లు" అని కవి వర్ణించాడు. ముళ్లకంప మధ్యలో మూడు మూ౯ల వెడల్పున్న బాట మాత్రమే ఉన్నది. అక్కడ ఇసుకలో కాలు కదపటం కష్టం. కాలు వేస్తే ఇసుకలో కూరుకు పోతుంది. బలవంతమైన గిత్తలైనా గింజుకోవాల్సిందే. ఇక సాధారణ మానవుల పరిస్థితి, అంటే వారు ఇసుకలో నడవటం ఎంత కష్టమో ఊహించుకోవచ్చు.

పెన్న ఒడ్డున ఉన్న డొంకలో దొంగలు పెళ్లి బృందాలను ఎన్నోసార్లు దోచుకొన్నారు. అక్కడే నిండు బండ్ల ఇరుసులు పుటుక్కున విరిగిపోయాయి. ఎంతో మంది మొనగాళ్ల ఎముకలు విరిగిపోయాయి. ఆ డొంకలో నీళ్లు మోసుకొచ్చే కొత్త కోడళ్ల బాధ వర్ణనాతీతం. మునిమాపుల్లో ఆ డొంకలో చేరిన జంటల శృంగా౯ క్రీడలకు అవరోధాలు ఎన్నోసార్లు కలిగాయి. ఎండవేళల్లో సేదదీర్చుకోవటానికి పశువులు అక్కడ గుంపులుగా చేరేవి. ఒక్కోసారి పులులు కూడా ఆ ప్రాంతానికి వచ్చేవి.

కొండ పై నుంచి వచ్చే నీటితో పారే వంక, దాని పక్క కాల్వ దారిపక్కనే మంచినీటి గుంట ఉన్నాయి. పారల్ని పట్టుకొని కాల్వకు, మరమ్మత్తులు చెయ్యటానికి రైతులు ఎప్పుడూ కంకణబద్ధులై ఉంటారు. పంటవేసిన దగ్గరనుంచి కుప్ప కొట్టే వరకూ వారు విశ్రమించరు. ప్రభుత్వం సౌకర్యాలు కలిగించక పోయినా పన్నులు మాత్రం వేస్తుంది. ఒక్కరోజు రైతు పనిచెయ్యటం మానితే పొలాలన్నీ బీడులవుతాయి.

రైతుల గుంపులోనుంచి రంగడు వస్తున్నాడు. అతడు తన శ్రమను మరిచిపోవటానికి జానపద శృంగార గీతాలు పాడుతున్నాడు. పనిచేస్తూ పాడుకోవటమే అతనికి యాగం, యోగం, భోగం మితిమీరితే రోగం అవుతాయి. అంటే రైతుకు విశ్రాంతి అవసరం అనే స్థితి స్పష్టమవుతుంది.

విద్వాన్ విశ్వం రాయలసీమ కరువు రక్కసి ప్రతాపానికి గురైన తీరును, పెన్నానది ఎండిపోయిన రీతిని 'పెన్నేటి పాట' ను కోటి గొంతుల కిన్నెర మీటుకొంటూ, కోటి గుండెల కంజరి కొట్టుకొంటూ హృదయాన్ని ద్రవింపజేసే రీతిలో వినిపించారు.

**డాక్టర్ గుమ్మా సాంబశివరావు** ఎం ఏ,. పిహెచ్. డి.,
రీడర్ & తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర లొయోల కళాశాల

ఖండం- 3

నవలా తాత్త్విక దృష్టి

# కాలాతీత వ్య క్తులు

## పాఠం 18

3.18. 0 కాలాతీతవ్యక్తులు నవల నామ సార్థకతను వివరించండి.

3.18. 1 నవలా లక్షణాలను తెల్పి కాలాతీతవ్యక్తులు నవలకు సమనవ్వయించండి.

3.18. 2 కాలాతీతవ్యక్తులు కాథాంశాన్ని తెల్పి అందలి తాత్త్వికదృష్టిని వివరించండి.

3.18. 3 కాలతీత వ్యక్తులు కథాకాలం నాటి కుటుంబ సంబధాలను, వైవాహిక సంబధాలను వాటి మంచి చెడులను, తెలుపండి.

3. 18. 4 ఇందిర పాత్రను వివరించి ఆపాత్ర ప్రత్యేకతను తెలపండి.

**3.18. 0 కాలాతీత వ్యక్తులు నవల నామ సార్థకతను వివరించండి.**

ఇంతవరకు కాలాతీత వ్యక్తులు అనే నవల రచయిత్రిని గూర్చి నవల పాత్రలను, కథా వివరణ తెలుసుకొన్నారు. ఇప్పుడు తదితర వివరాలను తెలుసుకొంటారు.

అనాది కాలంనుంచి కవులు. రచయితలు తమ రచనలకు పేరుపెట్టేటప్పుడు క్రింది అంశాల్లో ఒకదానిని దృష్టిలో పెట్టుకొని ఉంటారని అనుకోవచ్చు. అవి ఇవి.

1. నాయకుని పేరు రచనకు పెట్టడం.
2. నాయిక పేరు రచనకు పెట్టడం.
3. నాయికా నాయికల పేర్లు రచనకు పెట్టడం
4. కథలో ప్రధానమైన అంశాన్ని సూచించే పేర్లు పెట్టడం
5. కథలో చెప్పదలచిన భావాన్ని స్ఫురింపజేసే పేరు పెట్టడం.

కాలాతీతవ్యక్తులు నవలా రచయిత్రి శ్రీదేవి. ఆమె తాను నవలలో సృష్టి చేసిన పాత్రలు ఎలాంటివో స్ఫురింపజేసేలా ఆ నవలకు కాలాతీతవ్యక్తులు అనే పేరుపెట్టినట్లు అవగతమవుతున్నది.

సాధారణ వ్యక్తులయితే కాలప్రవాహంలో కలిసిపోతారు. అలాంటివారికి గొప్ప ఆశలుగాని, ఆశయాలుగాని ఉండవు. కాని కొంత మందివ్యక్తులు కాలగమనంలో ఒదిగిపోయి కొట్టుకు పోవడానికి అంగీకరించరు. వారు కాలాన్ని ఎదిరించడానికి, దానికి ఎదురీదడానికే ఇష్టపడతారు. ఆ ప్రయత్నంలో కష్టాలు, నష్టాలు, సమస్యలు ఎదురయినా లెక్కచేయరు. వాటికి తలవంచరు. కాలాన్ని ఎదిరించి విజయం సాధిస్తారు. తాము సుఖపడి, తనచుట్టు ఉన్నవారు సుఖపడేలా చేయాడానికి ప్రయత్నిస్తారు. అలాంటివారిని మనం వీరులని, ధీరులని, సాహస మూర్తులని పిలుస్తాం, కీర్తిస్తాం. అలాంటి వారినే కాలాతీతవ్యక్తులు అనాలి. అంటే కాలానికి లొంగకుండా, సమస్యలకు చలించకుండా, కష్ట నష్టాలకు కుంగి పోకుండా వాటి నన్నింటిని ఎదిరించి తనకు అనుకూలంగా మలచుకొని విజయం సాధించిన వాడు కాలాతీతవ్యక్తి. లోకమంతా ఒక విధంగా జీవిస్తుంటే వారిలా కాకుండా, వారికంటే భిన్నంగా, ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో బతికే వ్యక్తులు కాలాతీతవ్యక్తులు. కాలాతీతవ్యక్తులు నవలలో ప్రధానమైన పాత్రలు నాలుగు. అవి 1. ఇందిర 2. కృష్ణమూర్తి 3. కళ్యాణి 4. చక్రవర్తి. ఈ నాలుగు పాత్రలు కథలో కాలానికి ఎదురీదిన కాలాతీతవ్యక్తులే. ఎలాగో పరిశీలిద్దాం.

**ఇందిర :** ఇందిరను చిన్నప్పటినుంచి ఆదిరించేవారు లేరు. తన బాధ్యతను స్వీకరించేవారు లే~ని తెలిసిన అమ్మాయి కావడం చేత ఆమె స్వశక్తితో చదువుకుని ఉద్యోగం సంపాదించుకుంది. చాలీ చాలని జీతం, ఆదరించేవారు లేకపోవడం, తానే తన తండ్రిని పోషించవలసి రావడం మొదలయినవన్నీ ఆమెకు లోకంమీద కసిని కోపాన్ని కలిగించాయి. దాని పర్యవసానంగా ఆమె నీతి నియామాలను, లోకమర్యాదలను, సాంఘిక కట్టుబాట్లను ఎదిరించింది. హాయిగా జీవించడం నేర్చుకుంది. అలా జీవించడం కోసం మానావమానాలను

లెక్కచేయడం మానివేసింది. అవసరమయితే మోసం చేయడం తనదారికి అడ్డువస్తే తెలివిగా తప్పించడం నేర్చుకుంది. ఆమె జీవితంలో 'అతి'ని ఎప్పుడూ ఇష్టపడ లేదు. అతిగా ప్రేమ చూపిన, అతిగా గౌ~వించినా, అతిగా ప్రవర్తించినా ఆమె ఇష్టపడదు. ఆమె అలా ప్రవర్తించదు. తనకేది అవసరమో అది అడిగి తీసుకుంటుంది, గాని మొహమాట పడటం ఆమెకి తెలియదు. తనబ్రతుకు తన ఇష్టం వచ్చినట్లు బ్రతకాలని అలా బ్రతకడంవల్ల ఇతరులకు ఇబ్బంది కలిగినా పట్టించుకోకూడదని ఆమె నమ్మకం. మంచిపనైనా తప్పుపనయిన ఆమె తెలిసే చేస్తుంది. ఎలాంటి ఫలితమయినా ఆమె బాధపడదు. తన ప్రవర్తన తెలిసి కూడా కృష్ణమూర్తి తనను పెండ్లి చేసుకుంటానని చెప్పినప్పుడు కూడా ఇందిర తానతనికి లొంగి ఉండనని, వ్యక్తిత్వాన్ని చంపుకొని ఉండలేనని, బ్రతుకంతా నిర్భయంగా బ్రతుకుతానని చెప్పింది. ఆమె ఆలోచనా విధానాన్ని, ఆమె వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తే ఆమె సామాన్యమైన స్త్రీ కాదని కాలాతీతవ్యక్తి అని అనిపిస్తుంది.

**కృష్ణమూర్తి :** కృష్ణమూర్తి ధనంతుడైన విలాస పురుషుడు. జీవితానికి అర్థం, పరమార్థం లేకుండా విలాసంగా బ్రతకడమే పరమావధిగా భావించే ఆధునిక పురుషుడు. దేన్ని మనస్సులోకి ఎక్కించుకోనే తత్వం కాదతనిది. అలాంటి కృష్ణమూర్తి మనసులోనికి సున్నితమైన పొరలను కళ్యాణి, వసుంధరల పరిచయం చెరపి వేసింది. అతడు తన జీవితాన్ని మార్చుకోవాలనుకున్నాడు. వసుంధర తనకు దగ్గరవడం అతను గుర్తించాడు కాని తానామెకు తగిన వాడను కాడని గుర్తించాడు. తాను సంస్కరింబడాలని భావించాడు. జీవితంలో దేనినీ మనస్సుకు ఎక్కించుకోని కృష్ణమూర్తి ఇందిర ప్రభావానికి లోనయ్యాడు. ఆమె స్వార్థాన్ని అసహ్యించుకున్న అతడు, ఆమె జీవన విధానాన్ని, గత జీవితాన్ని తెలుసుకున్నాక ఆమెకు తోడుగా, నీడగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. విలాసంగా జీవించే కృష్ణమూర్తిని కళ్యాణి, వసుంధర, చక్రవర్తి స్నేహం మార్చివేసి అతనికి స్వచ్ఛతను కలిగించింది. అలా స్వచ్ఛతను పొందిన అతను తనవాళ్ళతో పోరాడి ఇందిరను సొంతం చేసుకున్నాడు. అలా ఇతురుల వలన తాను చక్కదిద్దబడి, తరువాత తాను ఇతరులను చక్కదిద్దడానికి ప్రయత్నించిన కృష్ణమూర్తి సామాన్యుడు కాడు. అతడు కాలాతీత వ్యక్తి.

**కళ్యాణి :** కళ్యాణి పదహారణాల తెలుగు పిల్ల. వినయ విధేయతలు మంచి మర్యాదలు, అణకువ, నెమ్మదితనం మూర్తీ భవించిన అమ్మాయి. తన ప్రవర్తనతో అందరి మనస్సులను ఆకట్టుకున్న స్త్రీ మూర్తి. కష్టాలు ఎదురైనా, సమస్యలు ముంచెత్తినా స్వాభిమానం కోల్పోకుండా స్వతంత్రమైన వ్యక్తిత్వంతోని తనకాళ్ళమీద తాను నిలబడాలని ప్రయత్నం చేయడం ఆమె వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణం. మోసం ద్వేషం, దగా ఆమెలో కనిపించవు భయంతో అందరికీ తలవంచి ఉండకుండా ఆర్థికంగా పుంజుకుంటే బలమైన వ్యక్తిగా నిలబడవచ్చని నిరూపించాలని అనుకున్నది. తన మీద జాలితో గాక తన వ్యక్తిత్వాన్ని అభిమానించే వ్యక్తినే పెండ్లాడతానని పెండ్లిఅయినా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని విడిచిపెట్టనని, తన సంపాదతోనే బ్రతుకుతానని నిక్కచ్చిగా తేల్చి చెప్పిన కళ్యాణి వ్యక్తిత్వం సామాన్యమైనది కాదు. కాలానికి అతీతమైనదే.

**చక్రవర్తి :** జీవితంలో ఎంత చేదు ఉంటుందో పెంపుడు తల్లిరూపంలో, భార్యరూపంలో దాన్నంత అనుభవించాడు. నరకాన్ని చవిచూచినా మొక్కవోని ధైర్యంతో కాలాన్ని జయించాడు. ఆడదాన్ని బానిసగా గాక మనిషిగా, ఆర్థిక స్వాతంత్ర్యం పొందవలసిన వ్యక్తిగా గుర్తించాడు. అందుకనే కళ్యాణి మాటలకు తలవంచి ఆమెకు మంచి భర్త అయ్యాడు. స్త్రీలకు వ్యక్తిత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం కావాలని ఆ కాలానికే నమ్మి దానిని ఆచరణలో చూపిన చక్రవర్తి సామాన్యుడు కాడు. అతడు కాలాతీతవ్యక్తి.

ఈ నవలలోని ప్రధానమైన నలుగురు వ్యక్తులు సామాన్యులుకారు కాలానికి, కాలానుగుణమైన పద్ధతులకు ఎదురు తిరిగి విజయం సాధించినవారు. అలాంటి వారు ప్రధాన పాత్రలుగా ఉండడం వల్ల ఈ నవలకు కాలాతీతవ్యక్తులు అనే పేరు సార్థకమౌతుంది.

### 3.18. 1. నవలా లక్షణాలను తెల్పి కాలాతీతవ్యక్తులు నవలకు సమన్వయించండి.

ఆంగ్ల భాషలోని NOVEL అనే పదం నుంచి నవల అనే తెలుగుమాట పుట్టింది. నావెల్ అంటే నూతనత్వం కలిగినది అనిఅర్థం. గద్యరూపంలో ఉన్న పెద్ద కథ నవల అనిచెప్పుకుంటే సంస్కృతంలో బాణుడు వ్రాసిన కాదంబరి ప్రాకృత్వంలో గుణాఢ్యుడు వ్రాసిన బృహత్కథ నవలలుగా చెప్పవలసి ఉంటుంది. కాని ప్రక్రియాలక్షణాలను బట్టి చూస్తే నవలలో ప్రాచీన సాహిత్య ఛాయలు ఏ మాత్రం లేవని ఇది ఇంగ్లీషులోని నావెల్ అన్న సాహిత్య రూపానికి సమానార్థకమని స్పష్టమౌతుంది.

తెలుగు భాషలో వచన రచన ప్రారంభం కావడం నవలా ప్రక్రియ అభివృద్ధి పొందడానికి ఉపయోగపడింది. కాలక్రమంలో వ్యావహారిక వచన రచన నవలలకు ఒరవడి అయింది. "రీవితాన్ని కథావస్తువుగా గ్రహించి, కల్పనలతో, "ఊహలతో నిర్మించుకుంటూ వెళ్ళిన పెద్ద కథను నవల అనవచ్చు". మానవ జీవితం కథావస్తున్న అయినప్పుడు ఏ కాలంలోని జీవితాన్ని కథలో తీసుకోవాలి అనే ప్రశ్న ఉదయిస్తుంది. సమకాలీన జీవితాన్ని కథగా తీసుకుని నవలగా వ్రాయడంవల్ల సామాజిక ప్రయోజనం సాధించే అవకాశం అధికంగా ఉంటుంది. కాని ఆ కథలో వాస్తవికత ప్రతిబింబించాలి. అంటే రచయిత సమకాలీన సమస్యలను నిశితంగా పరిశీలించాలి. లోతుగా దర్శించాలి. అవగాహన చేసుకోవాలి. ఆ తరువాతనే నవలా రచనకు పూనుకోవాలి. అలా రచింపబడిన నవల సమాజానికి ఏదో ఒక ప్రయోజనం కలిగించి తీరుతుంది.

ఆధునిక నవలా లక్షణాలను ఈ క్రింది విధంగా చెప్పుకోవచ్చు. అంటే ఆధునిక రచయిత నవల వ్రాసేటప్పుడు ఈ క్రింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి అని అర్థం.

1. ఇతివృత్తం లేక కథ వైవిధ్యంతో కూడిన కథ అయితే బాగుంటుంది.
2. పాత్ర చిత్రణ, పాత్రలు సజీవంగా ఉండాలి.
3 సహజ సుందరమైన భాష
4 రమ్యమైన శైలి. రచయిత ప్రజ్ఞ శైలిద్వారా వ్యక్తమవుతుంది. రచయిత ఆత్మ శైలిరూపంలో కనిపిస్తుంది.
5. సంఘటనాత్మకత. ముఖ్యమయిన సంఘటనలతో కథ అల్లబడి ఉండాలి.
6. సంవిధానం లేక కూర్పు. మంచి భాషలో చదివించే లక్షణం ఉన్న శైలిలో పాఠకుడు ఊహించని సంఘటనలతో కలుపుతూ, సజీవమైన పాత్రలద్వారా కథను ప్రారంభం నుంచి చివరివరకు ఒకే తూగులో ఒదిగేలా నడిపించే నేర్పును సంవిధానం అంటారు. అంటే రచనలో అన్నీ సమపాళ్ళలో ఉండాలి. ఏదీ ఎక్కువ కాకూడదు. పాఠకుడు కథలో లీనమయ్యేలా చేయగలగాలి. చైతన్యవంతం చేయాలి. ఇటువంటి సంవిధానం ఏ నవలలో ఉంటుందో ఆ నవల మంచి నవల అనిపించుకుంటుంది.

పైలక్షణాలను కాలాతీతవ్యక్తులు అనే నవలకు అన్వయించి చూస్తే ఆ లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్న కాలాతీతవ్యక్తులు మంచి నవల అనిపించుకుంటుంది. ఎలాగో పరిశీలిద్దాం.

కాలాతీతవ్యక్తులు నవల మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పదేళ్ళతరువాత వ్రాయబడింది. ఆనాటి తెలుగు ప్రజలు జీవితాల్లోని క్రొత్త పాతలు ఇందులో వర్ణింపబడ్డాయి. కొత్తజీవతం వైపు ఆకర్షితమవుతున్న మధ్యతరగతి యువతీయువకులు గురించి చెప్పిన నవల ఇది. ఇందులో పాత నమ్మకాలు, ఆనమ్మకాలు మీద యువతరం సాగించిన తిరుగుబాటు వర్ణింపబడింది. మధ్యతరగతి జీవితాల్లోని సమస్యలు, కష్టాలు, ఇబ్బందులు వర్ణింపబడ్డాయి. వీటివల్ల ప్రేమాభిమానాలు, మమతానురాగాలు ఎలా దెబ్బతింటున్నదీ పాతవిలువలు ఎలాపడిపోతున్నదీ, వాటి స్థానంలో కొత్త ఆశలు, నమ్మకాలు ఎలా పుట్టుకొస్తున్నదీ, పాశ్చాత్య నాగరికతా ప్రభావం చేత మధ్యతరగతి కుటుంబాలు ఎలా చితికిపోతున్నదీ ఈ నవలలో వర్ణించబడినాయి. అలాగే చదువుల కోసం, ఉద్యోగాలు కోసం ఇల్లు విడిచి బయటకి వస్తున్న యువతులు ఎదుర్కొనే సమస్యలు, చితికి పోయిన మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లల్లపై చూపించే ప్రభావం మొదలయిన ఎన్నో విషయాలు ఎన్నో కోణాలనుంచి దర్శించి ఈ నవల వ్రాయబడింది. అనేక సమస్యల వలయంలో చిక్కుకున్న యువత తమ జీవితాన్ని ఎలాదిద్దుకోవాలో తెలిజయజేసే నవల ఇది. ఈ రూపంగా విశ్లేషిస్తే ఈ నవలలోని ఇతివృత్తం వైవిధ్యంతో కూడుకున్నదని స్పష్టమవుతున్నది.

ఇక పాత్రచిత్రణ విషయానికివస్తే ఈ నవలలో నాలుగు ప్రధానమైన పాత్రలున్నాయి. ఈ నవలలోని పాత్రలన్నీ ఇందిర పాత్రచుట్టు తిరుగుతూ, ఆమెచేత ప్రభావితమవుతూ ఉంటాయి. అలాంటి పాత్రలు లోకంలో అరుదుగా కన్పిస్తుంటాయి. విలాసంగా బ్రతికే కృష్ణమూర్తి వంటివారు ఒకానొక సంఘటనతో ప్రభావితులై ఎలామారిపోతారో, ఎలా తన తప్పును సరిదిద్దుకుంటారో ఈ నవలలో వివరించబడింది. చేతకాని అసమర్థులు ఎలాజీవిస్తారో, వారి జీవితం ఎంత నిరుపయోగమో తెలియజేసే విధంగా ప్రకాశం

పాత్ర సృష్టించబడింది. ఇక కళ్యాణి పాత్ర అందరు మేచ్చే పాత్ర. కష్టాలు ఎన్ని ఎదురైనా, అభిమానం చంపుకోకుండా ఎలా బ్రతుకవచ్చో తెలియజేసే పాత్ర ఇది. మిగిలిన పాత్రలు కూడా సజీవంగా తీర్చిదిద్దబడినాయి.

కాలాతీతవ్యక్తులు నవలలో అందమైన భాష ఉంది. ఇది శిష్ట వ్యావహారికంలో అతి సరళమైన భాషలో వ్రాయబడింది. నవలలో కృతకమైన సంభాషణలు కనిపించవు. అలాగే వాస్తవికతను కళ్ళముందు నిలిపే అత్యద్భుతమైన శైలి. ఎక్కడా ఆపనీయకుండా చివరివరకు చదివింపజేసే సంఘటనల కూర్పు. ఆదినుంచి అంతంవరకు ఒకే బిగితో సాగిన శిల్పనిర్మాణం నవలలో కనిపిస్తాయి. అందుకే ఈ నవల మంచి నవలగా , గొప్పనవలగా పేరుపొందింది.

ఈ నవలలో ప్రబోధం కూడా ఉంది. స్త్రీలు విముక్తి పొందాలంటే వారే చైతన్యవంతులు కావాలని, అందుకు ఆర్థిక స్వావలంబన, స్వయం శిక్షణ అవసరమని ఈ నవలలో ప్రబోధం చేస్తుంది. స్త్రీ విముక్తి జరిగితేనే పురుషులు విముక్తులు అవుతారాని, స్త్రీ పురుషులిద్దరు విముక్తులైతేనే సమాజం అభివృద్ధిని సాధించగలదని ఈ నవల నిరూపించింది. సందర్భానుసారంగా ఆ నాటి వివాహవ్యవస్థల్లోని లోపాలు వివరించబడినాయి. మనుష్యులు మనుష్యుల్లాగా ఉండాలి తప్ప దేవతల్లాగా ఉండాలి అని అనుకోకూడదని, ప్రతి మనిషిలో సుగుణాలతో పాటు దోషాలు కూడా ఉంటాయని, తనలోని లోపాలను గుర్తించాలని, నిబ్బరంగా ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోవాలని ఈ నవల సందేశం ఇచ్చింది. మానవజీవితంలో ఉన్న వాస్తవికతను స్పష్టంగా చూపుతూ, సంపూర్ణంగా జీవించాలంటే స్త్రీ పురుషులు ఇద్దరూ సాధన చేయవలసి ఉందని రచయిత్రి శ్రీదేవి గొప్పఉపదేశాన్ని ఈ నవల ద్వారా అందించారు. అందుచేత సమస్త లక్షణాలు తనలో ఇముడ్చుకున్న గొప్ప నవల ఈ కాలాతీతవ్యక్తులు అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**3.18. 2. కాలాతీతవ్యక్తులు కథాంశాన్ని తెల్పి అందలి తాత్త్విక దృష్టిని వివరించండి.**

ఇందిర అనే యువతి విశాఖపట్నం రైల్వేలో పనిచేస్తూ ఉంటుంది. ఆమెతండ్రి ఆనందరావు. వారు నివసించే మేడమీద ప్రకాశం అనే విద్యార్థి ఎం.బి.బి.ఎస్. చదువుతుండేవాడు. అతని మిత్రుడు కృష్ణమూర్తి. అతడు ధనవంతుడైన విలాస పురుషుడు. ఇందిర ప్రకాశంతో, కృష్ణమూర్తితో చనువుగా ఉంటుంది. ఆనర్స్ చదివే కళ్యాణి ఇందిరకు పేయింగ్ గెస్ట్‌గా వచ్చి చేరుతుంది. తండ్రి అసమర్థత, చాలీ చాలని జీతం ఇందిర ఆశలకు, ఆశయాలకు సమాధికడితే, ఆమెజీవితాన్ని అర్థం చేసుకోడానికి, సమాజాన్ని ఎదిరించి సుఖంగా బ్రతకడానికి మార్గాలు అన్వేషింపసాగింది.

ప్రకాశం మేనమామ చాటుమనిషి. అతనికి పేదరికం ఒక సమస్య. అతనికి మేనమామ శేషావతారం అంటే చెప్పలేనంత భయం. ఆ కారణంగా అతడు పిరికివానిగా వ్యక్తిత్వం లేనివానిగా పెరిగాడు. ఆ మేడలోనే ఉంటున్న కళ్యాణి కూడా పేదకుటుంబం నుంచి వచ్చిందే. ఆమెకూ డబ్బుసమస్యే. ఒకరి కష్టాలు ఒకరు తెలుసుకున్న ప్రకాశం, కళ్యాణి చేరువయ్యారు. అనారోగ్యం పాలయిన కళ్యాణికి ప్రకాశం వైద్యం చేయించడంవలన వారిద్దరిమధ్య బంధం పెరిగింది. కళ్యాణి ప్రకాశానికి చేరువకావడం ఇందిర సహించలేకపోయింది. తండ్రికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కళ్యాణి స్వగ్రామానికి వెళ్ళిన సమయంలో ఇందిర ప్రకాశాన్ని లోబరచుకుంది. దానితో ప్రకాశం కళ్యాణికి దూరమయ్యాడు. ప్రకాశంలో వచ్చిన మార్పు, ఇందిర ప్రవర్తనా గుర్తించిన కళ్యాణి ఇల్లు విడిచి తన స్నేహితురాలు వసుంధర ఇంటికి వెళ్ళిపోయింది.

కళ్యాణి ఇందిర స్వార్థానికి బలి అయిందని తెలుసుకున్న కృష్ణమూర్తి కళ్యాణికి సహాయం చేయాలనుకుంటాడు. కళ్యాణి బంధువు రామినాయుడు ప్రాణాపాయ స్థితిలో ఉంటే కృష్ణమూర్తి డాక్టరు చక్రవర్తిని తీసుకువస్తాడు. కళ్యాణి మంచితనం, మృదు స్వభావం చక్రవర్తిని ఆకట్టుకుంటుంది. సంస్కారయుతులైన వసుంధర, కళ్యాణి పరిచయంతో కృష్ణమూర్తి కూడా విలాస జీవితం మరచి తనను తాను సంస్కరించుకునే ప్రయత్నంలో పడతాడు. కళ్యాణి తన కాళ్ళపై తాను నిలబడాలనే తాపత్రయంతో సొంతంగా ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ట్యూషన్లు ప్రారంభిస్తుంది. ఉద్యోగం కోసం వేట మొదలుపెడుతుంది. అంతకు పూర్వమే వివాహమయినా జీవితంలో నరకం చవిచూచి ఒంటరిగా బ్రతుకుతున్న చక్రవర్తి కళ్యాణికి అండగా ఉండాలనుకుంటాడు. ఆమెను గౌరవిస్తూ ఆమెను ఆకట్టుకుంటాడు.

వసుంధరపై ఇంట్లో కట్టుబాట్లు అధికమౌతాయి. వాటిని ఆమె సహించలేకపోతుంది. ఎదిరించాలని అనుకుంటుంది. ఆ ప్రయత్నంలో ఆమె కృష్ణమూర్తి స్నేహాన్ని కోరుకుంటుంది. వసుంధరను చేసుకునే సంస్కారం తనలో లేదనుకున్న కృష్ణమూర్తి, ఆమె వలన తాను సంస్కరింపబడాలనుకుంటాడు. ఇంతలో ఇందిర అతనికి తారసపడి అతనికి తన గతజీవితం గురించి చెబుతూ అతనిని వశపరచుకుంటుంది. దానితో ఇందిర వ్యక్తిత్వం అతనికి అర్థమవుతుంది. ఆమెకు ఆలంబనంగా ఉండాలనుకుంటాడు, తన కుటుంబాన్నంతా ఎదిరించి ఆమెను వివాహమాడడానికి సిద్ధపడతాడు. అలాగే చక్రవర్తి కూడా కళ్యాణిని పెండ్లికి ఒప్పిస్తాడు. కళ్యాణి చక్రవర్తి, ఇందిర, కృష్ణమూర్తి వివాహంతో కథ సుఖాంతమవుతుంది.

ఈ కథ పైకి ప్రేమ కథలా అనిపించినా ఇందులో తాత్వికధోరణి కనిపిస్తుంది. మనుషులు జీవితాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా జీవించాలి అనే అంశాలు ఈ నవలలో తాత్విక ధోరణిలో చెప్పబడ్డాయి. జీవితంలోని కష్టాలు ఆర్థిక సమస్యలు, ఇబ్బందులు అనుభవిస్తూ లోకంలోని దుర్మార్గాన్ని చూచి భయపడే వ్యక్తులు లోకంలో కొందరుంటారు. మరికొందరయితే ఆత్మాభిమానంతో భయంతో అపోహలతో న్యూనతాభావంతో, సానుభూతిని ఆశిస్తూ, కష్టాలు తప్ప లోకంలో సుఖాలు ఉండవని దిగులుపడుతూ దీనంగా బ్రతుకుతూ ఉంటారు. జన్మతః ధనవంతులైన కొందరు కష్టమంటే తెలియక, జీవితానికి ఒక లక్ష్యం లేక, హాయిగా విలాసంగా జీవిస్తూ ఉంటారు. కొంతమందయితే కుటుంబనీడలో సమస్యలు లేక, లోకం తెలియక అమాయకంగా బ్రతుకుతుంటారు. ధనం, విద్య, ఆశ్రయం లేకపోయినా ఆత్మవిశ్వాసంతో నిలబడి జీవితాన్ని ఆనందంగా గడిపేవారు కొందరుంటే, మరి కొందరు, తమ జీవితాన్ని ఇతరులకు ఆదర్శప్రాయంగా చేయగలిగిన వారయి ఉంటారు. ఇంతమంది వ్యక్తులు మనకు లోకంలో కనిపించినట్లే మనకు కాలాతీతవ్యక్తులు నవలలో కూడా కనిపిస్తారు. అంటే లోకంలోని ఇన్ని రకాల వ్యక్తులకు ప్రతీకలుగా నవలలోని పాత్రలు కల్పించబడ్డాయి.

మానవ జీవితంలోని కష్ట సుఖాలు, ఆర్థికసమస్యలు, ఇవి మానవుల మధ్య సంబంధాలను, మమతానురాగాలను ప్రభావితం చేసే విధానం, కూలిపోతున్న పాతనమ్మకాలు, అప్పుడే కొత్తగా నెలకొంటున్న పాశ్చాత్య సంప్రదాయం, దాని ప్రభావంతో ప్రారంభమవుతున్న ఆశలు, ఆశయాలు, దుర్వ్యసనాలు, వాటివల్ల నాశనమవుతున్న మధ్య తరగతి కుటుంబాలు - ఇన్ని రకాలైన సామాజిక విషయాలనుంచి ఈ నవల పుట్టుకొచ్చింది. చదువు కోసం, ఉద్యోగం కోసం ఇల్లు విడిచి బయటికి వచ్చిన ఆడపిల్లల పరిస్థితి, చితికిపోయిన కుటుంబాల్లో పిల్లల మీద తల్లిదండ్రుల ప్రభావం, మన పిల్లలు తమ జీవితాలను మలచుకోవలసిన విధానం, చుట్టూ ఉండే వ్యక్తులు మనమీద చూపించే ప్రభావం మొదలైన అనేక విషయాలను తీసుకొని, వాటికి సమాధానాలు ఊహించుకుంటూ వ్రాసిన నవల ఇది. అనేక సంఘర్షణల మధ్య జీవించే మనుషులు ఎలా జీవించాలో తెలియజేసే తాత్వికధోరణి ఈ కాలాతీతవ్యక్తులు నవలలో కనిపిస్తుంది.

జీవితంలో ఏ విషయంలో కూడా 'అతి' ఉండకూడదని, మనుషులు మనుషులుగా జీవించాలి తప్ప దేవతలుగా ఉండాలని అనుకోకూడదని, ప్రపంచంలోని ఇతరులలో ఉండే ఈర్ష్య, అసూయ వంటి భావాలు మనలో కూడా ఉన్నాయని ముందు గుర్తించాలని, అలా గుర్తిస్తే వివేకం కలుగుతుందని ఈ నవల వివరిస్తుంది. జీవితంలో ఉండే అనేక కోణాలను నిశితంగా పరిశీలించి, వాస్తవికధోరణిని స్పష్టంగా చూపుతూ వ్రాయబడిన నవల ఇది. మనిషి తృప్తిగా జీవించాలని, అలా జీవించాలంటే స్త్రీ పురుషులు ఏమిచేయాలో, ఎలా చేయాలో తెలియచెప్పిన నవల ఇది.

సాంఘిక, మానసిక, ఆర్థిక సమస్యలను తాత్వికధోరణిలో పాత్రల ద్వారా విశ్లేషించిన ఈ కాలాతీతవ్యక్తులు నవల గొప్ప నవల అంటే అతిశయోక్తి కాదు.

### 3.18. 3 కాలాతీత వ్యక్తులు కథాకాలం నాటి కుటుంబ సంబంధాలను, వైవాహిక సంబంధాలను, వాటి మంచి చెడులను తెలుపండి.

ప్రేమాను రాగాలు కుటుంబసంబంధాలను, వైవాహిక సంబంధాలను ఏ కాలంలో నయినా శాసిస్తూ ఉంటాయి. కాని ప్రేమానురాగాలతో పాటు ఆర్థికసమస్యలు, నాగరికత పట్ల వ్యామోహం, అనుమానాలు, అపార్థాలు, మానసిక, సామాజిక ఆర్థిక

సమస్యలు, ఆచారవ్యవహారాలు, సంఘంలోని కీర్తిప్రతిష్ఠలు, త్యాగం మొదలైన అనేక అంశాలు కుటుంబ సంబంధాలను, వైవాహిక సంబంధాలను ప్రభావితం చేస్తూ ఉంటాయి.

కాలాతీత వ్యక్తులు నవల మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత పదిసంవత్సరాల తరువాత వ్రాసిన నవల. ఆనాటి సమాజంలో తెలుగు ప్రజల జీవితాల్లోని కష్టం, సుఖం, ఆర్థికసమస్యలు, పడిపోయే పాతవిలువలు, కొత్తగా పుడుతున్న ఆశలు, ఆశయాలు, పాశ్చాత్యనాగరికత మోజులో అలవాటు అవుతున్న దుర్వ్యసనాలు, వాటివల్ల బలిఅయిపోతున్న కుటుంబాలు మొదలైన అనేక కారణాలతో కుటుంబ వైవాహిక సంబంధాలు తాత్వికదృష్టితో కల్పించబడినాయి. నవల్లో ప్రతిబింబితాలయిన సంబంధాలను పరిశీలిద్దాం.

**1. ఆనందరావు కుటుంబం :** ఆనందరావు తన భార్య అనాకారి కావడంవల్ల, దొరల్లాగా బ్రతకాలనే మోజువల్ల ఒకసానితో సంబంధం పెట్టుకున్నాడు. త్రాగుడు, జూదం అలవాటు చేసుకుని, ఉద్యోగం పోగొట్టుకున్నాడు. జైలుపాలయ్యాడు. అతనికి అనాకారి భార్యవల్ల ఇందిర పుట్టింది. ఉద్యోగం పోవడంవల్ల కూతురి సంపాదనపై ఆధారపడి బ్రతుకసాగాడు. ఆమె సంపాదనతో బ్రతకడంవల్ల ఆమెను ఏమీ అనలేపోయాడు. ఆనందరావు కుటుంబంలో పాశ్చాత్య నాగరికతా వ్యామోహం అతని కుటుంబ సంబధాలను నాశనం చేసింది. అతని నిర్వ్యాపారత్వం, బాధ్యతా రాహిత్యం ఇందిరకు అతనిపట్ల గౌరవం లేకుండా చేశాయి. అతని కుటుంబంలో ప్రేమానురాగాల పాత్రలేదని చెప్పవచ్చు.

**2. చక్రవర్తి కుటుంబం :** చక్రవర్తి కుటుంబంలో అనుమానాలు, అపోహలు పరస్పర సంబంధాలను నాశనం చేశాయి. పెంచుకున్న చక్రవర్తి దూరం అవుతాడని ఆ పెంపుడు తల్లికి అనుమానం. భర్త డాక్టర్లతో, నర్సులతో తిరుగుతాడని భార్యకు అనుమానం. తమకు తగిన విధంగా సాయం చేయడం లేదని తండ్రి అపోహ. అందుకే అతని సంసారం నాశనమయింది. చక్రవర్తి కళ్యాణి మంచితనం, వినయ విధేయతల వల్ల ఆకర్షింపబడి ఆమెను వివాహమాడాడు. ప్రేమించి, ఆమెను గౌరవించి తన దానిగా చేసుకున్నాడు - ఈ దాంపత్యంలో ప్రధాన పాత్ర వహించింది వారిద్దరి మధ్య నెలకొన్న ప్రేమ.

**3. ఇందిర సంబంధాలు:** ఇందిరకు తల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి పై ప్రేమలేదు. తండ్రి కనుక పోషించవలసిన బాధ్యత ఉంది అనుకుంది. ఇందిర ప్రకాశాన్ని కోరకున్నా అతడు తనకు భద్రత కలిగించేటంత సమర్థుడుకాడని అతడిని తిరస్కరించింది. ఈ విషయంలో సామాజిక భద్రత ప్రధాన పాత్ర వహించింది. ఇందిరకు తన ఆఫీసరుతో ఉన్న సంబంధంలో ధనం ప్రధాన పాత్ర వహించింది. ఇందిర - కృష్ణమూర్తి మధ్య మొదట లైంగిక వాంఛ ప్రధాన పాత్ర వహించింది. కాని తర్వాత పరస్పర విశ్వాసం ప్రధాన పాత్ర వహించి వారికి వివాహం జరిగింది.

**4. శేషావతారం కుటుంబం:** డబ్బుకోసం వితంతువు అయిన చెల్లెలిని ఇంటికి తెచ్చాడు. ఆమె ఆస్తిని కలిగించి తన ఆస్తి పెంచుకున్నాడు. తన అప్పులు తీర్చుకోడానికి ప్రకాశానికి తను చెప్పిన అమ్మాయితో పెండ్లి చేశాడు. శేషావతారం భార్యపట్ల ఎలా ప్రవర్తించాడో తెలియదు. కాని ఆమె కూడా డబ్బు మీద వ్యామోహం కలిగిందే. శేషావతారం కుటుంబంలో ప్రధాన పాత్ర వహించింది ఆర్థిక వ్యవహారాలు తప్ప ప్రేమానురాగాలు కాదు - కేవలం ధనం మాత్రమే వారి సంబంధాలను శాసించింది.

**5. వసుంధర కుటుంబం:** వసుంధరది ధనవంతుల కుటుంబం. ఆ కుటుంబంలో గౌరవమర్యాదలు, కీర్తిప్రతిష్ఠలు, ఆచారవ్యవహారాలు ప్రధాన పాత్ర వహించాయి. వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలు ఉన్నా అవి కీర్తిప్రతిష్ఠల కోసం, గౌ^వ మర్యాదల కోసం అప్రధానమయినాయి. వసుంధర ఎలా ఉండాలో, ఇతరులతో ఎలా ప్రవర్తించాలో కుటుంబంలో ఉన్న అన్నలు నిర్దేశించారు. ఆమె కృష్ణమూర్తితో చనువుగా ఉన్నప్పుడు ఆమెను కట్టడిలో ఉంచడానికి ప్రయత్నించారు. అందుచేత వసుంధర కుటుంబంలోని వ్యక్తుల మధ్య ప్రేమారాగాలను కీర్తి ప్రతిష్ఠలు, గౌ^వమర్యాదలు, ఆచారవ్యహారాలు తగ్గించాయని చెప్పవవచ్చు.

**6. వైదేహి కుటుంబం:** వైదేహి సోదరులు మంచి సంబధంతెచ్చి తమ చెల్లిలికి పెండ్లి చేయాలని, తాము తెచ్చిన వరుడినే ఆమె వివాహం చేసుకోవాలని అనుకునే మనుషులు. వైదైహి ఇల్లు విడిచి వెళ్ళిన విషయం పలువురికి తెలిస్తే కుటుంబగౌరవం మంటకలుస్తుందని, దాన్ని రహస్యంగా దాచి ఉంచుతారు. దీనినిబట్టి వైదేహికుటుంబంలో ప్రేమానురాగాలు ఉన్నా సామాజిక కట్టుబాట్లు కుటుంబగౌరవం, స్వార్థం వారి సంబంధాలపై ప్రభావాన్ని చూపాయని అర్థమౌతుంది.

**7. రామినాయుడు కుటుంబం :** కళ్యాణి తండ్రి అచ్యుత రామయ్యకు మంచి స్నేహితుడు రామినాయడు. మంచి, మర్యాద తెలిసినవాడు. అతని సంతానం అతడు బ్రతికి ఉన్నంతకాలం గౌరవించారు గాని చనిపోయిన తరువాత డబ్బు కోసం ఆయన శవాన్ని

తీసుకెళ్ళడానికి కూడా ఆలస్యం చేశారంటే వారి కుటుంబంలో బయటకు ప్రేమ కనిపించినా, అంతర్గతంగా వారి సంబంధాలను డబ్బే శాసించిందని అర్థమవుతుంది.

**8. అచ్యుత రామయ్యకుటుంబం:** అచ్యుత రామయ్యకు భార్యమీద ప్రేమ అధికం. ఆమెమరణించిన తరువాత ఆయన వైరాగ్యభావాన్ని అలవాటుచేసుకున్నాడు. మళ్ళీ వివాంచేసుకోలేదు. ఆయనకూతురు కళ్యాణి మీద అపారమైన ప్రేమ. ఆమెచదవు కోసం ఆస్తినంతా అమ్మివేశాడు. బ్రతికి ఉన్నంతకాలం తన కూతురు కోసం తపించాడు. ఈ కుటుంబంలో ప్రేమనురాగాలే ప్రధాన పాత్ర వహించాయని, మమతానుబంధాలే కుటుంబ సంబంధాలపై తమ ప్రభావాన్ని చూపాయని తెలుస్తుంది.

**9. ప్రకాశం కుటుంబం:** ప్రకాశానికి తల్లి అంటే ప్రేమ ఉంది. కాని అతడు తన మనస్సులో మాట చెప్పలేని పిరికివాడు. అందుచేతనే శేషావతారాన్ని ఎదిరించలేక ఆయన చెప్పిన అమ్మాయిని వివాహమాడాడు. ప్రకాశం భార్య భర్తల సంబధం గురించి నవలలో లేదుగాని, ఆ కుటుంబంలో లైంగిక సంబధమే ప్రాధాన్యం వహించి ఉంటుందిని భావించవచ్చు.

ఇంకా నవలలో డాక్టరు గోపాలరావు దంపతులు, కళ్యాణి బంధువులైన రిజిస్ట్రారు దంపతులు ఉన్నా వారి సంబంధాలపై ప్రత్యేకంగా నవలలో చెప్పడంలేదు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు ఉన్నప్పుడు ఆ కుటుంబంలలో సంతోషాలు ఉంటాయని మిగిలిన విషయాలు ప్రాధాన్యం వహిస్తే ఆ కుటుంబాలు ఏదోవిధంగా ఇబ్బందుల పాలవుతాయని ఈ నవల నిరూపించింది. సమాజం సక్రమంగా ఉండాలంటే సభ్యులమధ్య ప్రేమబంధమే ప్రధానమని ఈ నవల ప్రబోధమిచ్చింది.

### 3.18. 4 ఇందిర పాత్రను వివరించి, ఆ పాత్రప్రత్యేకతను తెలుపండి.

విదేశీ నాగరికత మోజులోపడి ఉద్యోగాన్ని పోగొట్టుకున్న ఆనందరావు కూతురు ఇందిర. విలాసంగా జీవించాలనే కోరిక, ఆ విధంగా జీవించడానికి దేనికైన దిగజారడానికి వెనుకాడని మనస్తత్వం ఆమెతత్వం. అవసరమైనప్పుడు నిస్సంకోచంగా అవసరాన్ని అడిగి తీర్చుకోవడం, అవసరం తీర్చుకున్న తరువాత ప్రయోజనం ఉండదనుకొంటే దూరంగా నెట్టి వేయడం ఇందిర అలవాటు. జీవితాన్ని అనుభవించాలనే తపన తప్ప నీతి నియామాలు న్యాయాన్యాయాల్ని సాంఘిక కట్టుబాట్లు పాటించే స్వభావం ఇందిరకులేదు. ఆమెకు జీవితం ఒకఛాలెంజ్. తను అనుకున్న విషయాన్ని నిర్భయంగా చెప్పడం, చెప్పిన విషయాన్ని నిస్సంకోచంగా, నిర్భయంగా చేయడం ఇందిర వ్యక్తిత్వంలోని ప్రత్యేకత.

ఇందిర పుట్టిన కొంత కాలానికి ఆమె తల్లి మరణించింది. ఆమెకు తల్లిపట్ల ఏ విధమైన అనుభూతులు లేవు. తండ్రి తాగుతూ, జూదమాడుతూ లంచాలకు అలవాటై ఉద్యోగం పోగోట్టుకున్నాడు. తల్లిదండ్రుల ప్రేమాను బంధం లేకపోయినా ఇందిర పెరిగి పెద్దదయింది. తండ్రి నుంచి వచ్చే మద్యం వాసన, ఆదరించేవారులేకపోవడం మొదలైన అనుభావాలు ఆమె మనస్సును రాయిగా చేశాయి. అలా పెరిగిన ఇందిర అడ్డంకులను అధిగమిస్తూ కాలేజి చదువు చదివింది. అదే సమయంలో ఆనందరావు జైలులో పడ్డాడు. ఇందిర చదువుమాని షార్ట్ హాండ్ నేర్చుకుంది. రైల్వేలో ఉద్యోగం సంపాదించింది. తనను తాను పోషించుకుంటూ, జైలునుంచి విడుదలై వచ్చిన తండ్రినికూడా పోషింపసాగింది.

తన గత అనుభవాల కారణంగా ఇందిర లోకంమీద కసి పెంచుకుంది. పద్ధతి ప్రకారం బ్రతక కూడదు అనుకుంది. పురుగులాగా వ్యక్తిత్వం లేకుండా బ్రతక కూడదు అనుకుంది. సుఖంగా బ్రతకాలి అనుకుంది. అలా బ్రతకడానికి ఆమెవద్ద సరిపోయినంత ధనంలేదు. తనచుట్టు ఉన్నమగవాళ్ళను కవ్విస్తూ, వారిద్వారా తన అవసరాలను తీర్చుకోవాలి అనుకుంది. అలాగే తన ఆఫీసరును, ప్రకాశాన్ని, కృష్ణమూర్తిని తన ఆర్థిక అవసరాలు తీర్చే యంత్రాలుగా మార్చుకుంది.

ఇందిర కలుపుగోలుతనంతో అందరినీ ఆకట్టుకుంటుంది. కొంచం పరిచయముంటేచాలు గంటలు తరబడి మాట్లడుతుంది. ఆమెమాటల్లో ఒక అందం ఉంది. ఆ అందానికి ఎంతటి మగవాడయినా లొంగి పోవలసిందే. ఆమె తన అందంతో ఆఫీసరును తనకు అనుకూలంగా మలచుకుంది. ప్రకాశాన్ని లోబరచుకుని కళ్యాణికి దూరం చేసింది. ఇందిర మీద మోజుతో ప్రకాశం ఎన్నో చేయాలనుకున్నాడు గాని శేషావతారం భయంతో అతను చెప్పినట్లు విన్నాడు. తాను అనుకున్నట్లు ఉండే ధైర్యం ప్రకాశానికి లేదని తెలుసుకున్న ఇందిర అతడిని తృణీకరించింది. వెన్నెముక లేనివాడిని తాను చేసుకోలేనని చెప్పి అతడిని పంపివేసింది. కృష్ణమూర్తి ఇందిర కోసం ఆశపడ్డాడు. ఆమె కోసం అనేక పాట్లుపడ్డాడు. ఆమె కోసం ఎంతో ఖర్చు చేశాడు. మధ్యలో కొంత కాలం ఆమెకు దూరంగా ఉన్నా, ఆమె పిలిచిన వెంటనే ఆమెతోపాటు వెళ్ళి, ఆమెతో సుఖించాడు. ఆమె పూర్వ కథ తెలుసుకొని ఆమెను అంగీకరింపజేసి వివాహమాడాడు. దీనిని బట్టి

ఇందిర ప్రభావం ఆమెకు పరిచయమైన మగవారిమీద ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇందిరలోని ఆకర్షణకులోనుకాని మగవాడు లేడు.

ఇందిర ఒక్కోసారి సామాన్యమైన స్త్రీ అనిపిస్తుంది. ఆమెలో కూడా స్త్రీ సహజమైన అసూయ ఉంది. తన ఇంట్లో ఉన్న ప్రకాశం తనతోపాటు ఉన్న కళ్యాణి పట్ల ఆకర్షితుడవుతున్నాడని గ్రహించిన ఇందిర అసూయపడింది. ప్రకాశాన్ని తన అందానికి బందీగా చేసుకుంది. కళ్యాణి పేరు కూడా తలవకుండా చేసింది. అంతేకాదు కళ్యాణి గురించి దుష్ప్రచారం చేసింది. తన ఇంటి నుంచి వెళ్ళగొట్టింది. అంతేకాదు దానిని బట్టి ఆమె ఏ పని చేయదలచుకున్నా, ఆ పని పూర్తి అయ్యేవరకు ఎంత తీవ్రంగా ఉంటుందో ఎంతటికయినా ఎంత తెగిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఇందిరకు ధైర్యం ఎక్కువ. ఆమె ఎవరినీ లెక్కచేయదు. తాను చేయదలచుకున్న పని చేయడం తప్ప లోకం గురించి ఆలోచించడు. మనస్సుకి నచ్చింది చేయడం, తను కావాలి అనుకున్నది పొందడం, సమస్యవస్తే ఎదిరించడం ఆమెకు తెలుసు. సమస్యలకు తలవంచడం, ఇతరులు ఏమన్నా అనుకుంటారని బిడియపడడం అనేవి ఆమెకు తెలియవు. వైదేహి ఇంటినుంచి పారిపోయి వచ్చినప్పుడు, ప్రకాశం పారిపోయి వచ్చినపుడు ఆమె ఆ ఇద్దరి ప్రయత్నాలను హర్షించలేకపోయింది. ఇంటిలోని అన్నదమ్ములను ఎదిరించి తనకు నచ్చినవాడిని వివాహం చేసుకోమని వైదేహికి, శేషావతారాన్ని ఎదిరించి తన ఆస్తిని, తల్లిని తీసుకుని రమ్మని ప్రకాశాన్ని హెచ్చరించింది. ఆమెకున్నంత ధైర్యం లేకపోవడంవల్ల వాళ్ళు ఆ పనిచేయలేక పోయారు.

ఇందిర ఆలోచనలు తీవ్రమయినవి. ఆమె తండ్రి అంటే గౌరవంకాని, ప్రేమకాని, అభిమానం కాని లేవు. అతడిని పోషించడం కూతురుగా తన బాధ్యత అనుకుంది. తన తండ్రి తనకు వివాహం చేయడని, తన డబ్బు వాడుకోడానికి అలవాటు పడ్డాడని తెలిసినా అతడిని ఏమీ అనలేదు. ఆనందరావు జైల్లో పడినా నిర్లిప్తంగా ఉందంటే ఆమెకు తండ్రి మీద ఎలాంటి అభిప్రాయం ఉందో తెలుసుకోవచ్చు. ఇందిరకు డబ్బంటే వ్యామోహం. బహుశా చిన్నప్పటి నుంచి డబ్బుకి ఇబ్బంది పడడం వల్ల ఆమెకు వ్యామోహం ఏర్పడి ఉండవచ్చు. ప్రకాశాన్ని రెచ్చగొట్టి అతని ఆస్తిని పొందాలని అనుకున్నది. ఆమెకు చేతిలో డబ్బులేకపోతే పిచ్చి పట్టినట్లుండేది. చిటపటలాడేది. తండ్రిని విసుక్కునేది. ఆఫీసులో పని చేసేది కాదు. తన సరదాలు తీర్చుకోవడం కోసం ఎవరితోనయినా ఎక్కడికయినా వెళ్ళేది. వాళ్ళడబ్బుతో తన కోరికలు తీర్చుకునేది.

కాలాతీతవ్యక్తులు నవలలో ఇందిర పాత్ర ప్రధానమయినది. ఒక విధంగా చెప్పాలంటే ఆమె ఈ నవలలో నాయిక. ఒక మనిషి ఎలా జీవిస్తే విజయాన్ని సాధించవచ్చో రచయిత్రి ఇందిర పాత్ర ద్వారా సూచించింది. ఆమెగత జీవితం ఆమెకు జీవితం మీద, లోకంమీద కసి కలిగించాయి. ఆ కసి ఆమెను నీతినియమాల నుంచి, సాంఘిక కట్టు బాట్ల నుంచి, లోకమర్యాదల నుంచి దూరం చేసింది. హాయిగా బ్రతకడానికి ఇతరులను ఎలా తప్పించవచ్చో తెలుసుకుంది. ఆమెకు నిశ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. “నా బాధ్యత తీసుకుని నా మీద ఆధారపడకుండా ఉండే బలవంతుడయిన మగవాడు - నీ సమస్యలు, బరువులు అన్నీ నామీద పడేయ్ అనగలిగే మగవాడు - అవసరమయితే అన్నీ నా కోసం వదులుకునే మగవాడు దొరికితేనే పెళ్ళి” అనే ఇందిరకు తన ఆశయాలకు తగిన కృష్ణమూర్తి లభించిన వెంటనే వివాహమాడింది.

ఇందిర “ఏ పని చేసినా నేను తెలుసుకొనే చేస్తాను. ఏడుస్తూ ఏదీ చేయను. ఏమి జరిగినా ఏడవను” అనేతత్వం గల గొప్పవ్యక్తి. జీవితంలో ఏదీ ‘అతి’ అనేది ఉండకూడదని ఆమె విశ్వాసం. జీవితమంతా నిర్భయంగా, సుఖ సంతోషాలతో బ్రతకాలనేది ఆమె సిద్ధాంతం. ఆమెలో చెడు ఏదయినా ఉంటే దానిని తొలగించిన మగవాడు కృష్ణమూర్తి, అందుకే ఆమె తన అభిప్రాయాలను కొంత మార్చుకుని అతనికి తలవంచింది. అతను కట్టే తాళిబొట్టుకు తలదించింది. నిజానికి ఇందిరలా ఆలోచించే పాత్రలు లోకంలో చాలా తక్కువగా ఉంటాయి. ఈ పాత్ర లేకపోతే ఈ నవలే లేదు.

డాక్టర్ ఎన్. ఆదినారాయణ ఎం.ఏ., పి హెచ్‌డి.,

రీడర్ & ప్రిన్సిపాల్

బి. ఎస్. ఎస్. బి. డిగ్రీ కళాశాల

ఖండ - 3 పాత్రల గుణశీలాలు

# కాలాతీతవ్యక్తులు

## పాఠం - 19

3. 19. 0 కళ్యాణి పాత్ర ఔచిత్యాన్ని వివరించండి.
3. 19. 1 కృష్ణమూర్తి పాత్ర క్రమ పరిణామాన్ని తెలుపండి.
3. 19. 2 ప్రకాశం పాత్రలోని బలహీనతలు, బలాలను పరిశీలించండి.
3. 19. 3 తెలుగు నవల పరిణామ వికాసాలు తెల్పి, కాలాతీతవ్యక్తులు నవల స్థానం నిర్ణయించండి.
3. 19. 4 వ్యక్తుల ప్రవర్తనకు వారి బాల్యజీవితప్రభావాలు చాల వరకూ కారణమనే అంశాన్ని కాలాతీతవ్యక్తులు నవల ద్వారా నిరూపించండి.

**3 -19 - 0 కళ్యాణి పాత్ర ఔచిత్యాన్ని వివరించండి.**

తునికి పన్నెండు మైళ్ళదూరంలో ఉండే నందూరులో అచ్యుతరామయ్య అనే మంచి మనిషి కూతురు కళ్యాణి. అచ్యుతరామయ్య తన మంచితనం వల్ల ఆస్తినంతా పోగొట్టుకున్నాడు. కళ్యాణిని ప్రసవించి ఆమె తల్లి కన్నుమూసింది. పక్కింటి పుణ్యాత్మురాలు పురిటికందును చేరదీసి కళ్యాణి అని పేరు పెట్టింది. సంవత్సరం తర్వాత అచ్యుత రామయ్య తన పిన్నిని తెచ్చి కళ్యాణిని అప్పగించాడు. ఆమె చేతుల మీదుగా కళ్యాణి పెరిగి పెద్దదయింది. తన కూతురును ఝాన్సీ లక్ష్మీబాయిని చేయాలని, సరోజినినాయుడు గా తీర్చిదిద్దాలని అచ్యుతరామయ్య అనుకునే వాడు. భార్య మరణంతో విరాగిగామారిన ఆయన తన కూతురుతో గడిపిన క్షణాలు అతితక్కువ. కళ్యాణి పిన్ని సంరక్షణలో పెరుగుతూ ఐదు సంవత్సరాల వయస్సులో బడిలో చేరింది. పదకొండేళ్ళ వయస్సు వచ్చేసరికి పిన్ని కళ్యాణికి పెండ్లి చేయమంటూ పోరుపెట్టింది. గాని అచ్యుతరామయ్య అంగీకరించలేదు. తునిలో కాపురం పెట్టి బడిలో చేర్పించి స్కూల్ ఫైనల్ వరకు చదివించాడు. తర్వాత పెండ్లి చేయాలని అనుకున్నాడు గాని వరకట్నం ఇవ్వలేక పెండ్లి ప్రయత్నం విరమించుకొని కళ్యాణిని ఇంటరులో చేర్చాడు. ఇంటరు పూర్తి చేసిన కళ్యాణి తండ్రి డబ్బు సమకూర్చ లేకపోవడం వల్ల, తండ్రి అనారోగ్యం పాలయినందువల్ల, పిన్ని మరణించడం వల్ల ఒక సంవత్సరం చదువు మానివేసింది. ఇంటరు తర్వాత యం.బి.బి.యస్. చదవాలని కళ్యాణి ఆశపడింది గాని తగిన ఆర్థిక స్తోమతు లేక విశాఖలో ఆనర్సు కోర్సులో చేరింది. తన ఇంటి ఆర్థిక పరిస్థితి సంపూర్ణంగా తెలిసిన కళ్యాణి హాస్టలులో ఉంటే ఖర్చు ఎక్కువని, అంత సొమ్ము తన తండ్రి భరించలేడని గ్రహించి ఇందిర ఉండే మేడలో పేయింగ్ గెస్ట్‌గా చేరింది.

ఇందిర ఇంట్లో చేరిన కళ్యాణి జ్వరంతో మంచం పడితే ఆ ఇంట్లో ఉండి యం.బి.బి.యస్. చదివే ప్రకాశం ఆమెను ఆసుపత్రిలో చేర్చి వైద్యం చేయించాడు. అతడు మంచివాడని నమ్మి కళ్యాణి అతనితో చనువు పెంచుకుంది. అతనితో షికారుకు వెళ్ళింది. అతని మాటలు నమ్మి అతడు తనకు తోడుగా ఉంటాడని విశ్వసించింది. అంతలో తన తండ్రికి ఆరోగ్యం బాగా లేదని కబురు రావడంతో స్వగ్రామానికి బయలు దేరింది. తనతో వస్తాడని తనకు సహాయం చేస్తాడని భావించిన ప్రకాశం ఇందిర వలలో చిక్కుకుని కళ్యాణికి ఉత్తరాలు కూడా రాయలేదు. ప్రకాశం నుంచి సమాధానం రాలేదని కలతపడుతున్న కళ్యాణిని తండ్రి ఒంటరి దానిని చేసి పరమపదించాడు. ఆయన చేసిన అప్పులకు ఆస్తి హరించుకుపోగా కట్టు బట్టలతో కళ్యాణి విశాఖపట్టణం బయలు దేరింది. రామినాయుడు సాయం చేస్తానన్నా ఆమె అంగీకరించలేదు.

కళ్యాణి స్వగ్రామంలో ఉన్నసమయంలో ఇందిర కళ్యాణి గురించి దుష్ప్రచారం చేసింది. ఆ విషయాలు తన సహాధ్యాయి వసుంధర ద్వారా విన్న కళ్యాణి ఆశ్చర్యపోయింది. ఇందిర, ప్రకాశం తనను మోసగించారని తెలుసుకున్న కళ్యాణి ఆమేడలో ఉండలేక వసుంధర ఇంట్లోకి మారింది. ఎక్కువ రోజులు కాలేజీకి రాక పోవడం వల్ల ఆమెను పరీక్షకు పంపడానికి ప్రిన్సిపాల్ అంగీకరించలేదు. రామినాయుడు కళ్యాణి ఆస్తినంతా అమ్మి, అప్పులు తీర్చి వేయి రూపాయలు తెచ్చి ఆమెకు ఈయబోయాడు. కాని ఆమె తీసుకోలేదు. ఆరోజే రామినాయుడు గుండె జబ్బుతో పడిపోతే కృష్ణమూర్తి, చక్రవర్తి సాయంతో ఆమె అతనిని ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించింది.

డాక్టర్లు ఎంత ప్రయత్నించినా రామినాయుడును కాపాడలేకపోయారు. తండ్రి దగ్గరున్న డబ్బుకోసం ఆయనకు చంపారని, ఆసొమ్ము హరించారని రామినాయుడు కొడుకులు గొడవ చేశారు. కళ్యాణి రామినాయుడు ఇచ్చిన వేయి రూపాయలు అతని కొడుకులకు పంపించింది.

కళ్యాణి స్నేహం వల్ల కృష్ణమూర్తితో, చక్రవర్తితో వసుంధర మాట్లాడడం చూసి సహించలేని వసుంధర పిన్ని, ఆ విషయం వసుంధర అన్నయ్యకు చెప్పింది. ఆయన వసుంధరను సున్నితంగా మందిలించాడు. వసుంధర ఇంట్లో తనకు గౌరవం తగ్గిందని భావించిన కళ్యాణి తన బంధువుల ఇంట్లో అద్దెకు చేరి స్వశక్తితో జీవించాలనే ఉద్దేశంతో ట్యూషన్లు చెప్పడం ఆరభించింది. ఒకానొక రాత్రి వసుంధర పిన్ని కళ్యాణిని అవమానించింది. ఆ అవమాన భారంతో తన ఇంటికి వచ్చిన కళ్యాణిని చక్రవర్తి ఓదార్చాడు. తన ప్రేమను వెళ్ళడించి, ఆమె అభిప్రాయాలను గౌరవిస్తానంటూ ఆమెను పెళ్ళికి ఒప్పించాడు. కళ్యాణి, చక్రవర్తి కారుతో తిరుపతి వెళ్ళి స్వామి సన్నిధిలో ఒకింటి వారయ్యారు.

కళ్యాణి మంచితనం, సత్ప్రవర్తన అందరి మనస్సులను ఆకట్టుకున్నాయి. అందు చేతనే కృష్ణమూర్తి ఆమెకు సాయం చేయాలనుకున్నాడు. వసుంధర ఆమెకు అందుచేతనే ఆశ్రయం ఇచ్చింది. చక్రవర్తి అందుచేతనే ఆమెను ఇష్టపడి వివాహం చేసుకున్నాడు. ఇతరుల సహాయాన్ని ఉచితంగా తీసుకునే తత్వం కళ్యాణికి లేదు. కృష్ణమూర్తి సహాయం చేస్తానన్నా, చక్రవర్తి బహుమతులు ఇస్తానన్నా, రామినాయుడు ఆర్థిక సహాయం చేస్తానన్నా ఆమె ఆంగీకరించలేదు. తాను స్వతంత్రంగా తన కాళ్ళపై నిలబడాలని, తనకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని భావించి ట్యూషన్లు చెబుతూ జీవించాలని అనుకున్నది.

కళ్యాణి అభిమయానవతి. గుణవతి తన గురించి ఎవరైనా తప్పుగా మాట్లాడితే బాధపడే స్వభావం ఆమెది. ఇందిర తన గురించి దుష్ప్రచారం చేసినప్పుడు, వసుంధర పిన్ని ఆసహ్యంగా దెప్పిపొడిచినప్పుడు ఆమె తీవ్రంగా బాధపడింది. ఇతరుల మాటలకు బాధపడిన మొక్కవోని ధైర్యం సడలని విశ్వాసం ఆమె సొంతం. అందుచేతనే ఎన్ని కష్టాలు ఎవరైనా, ఎన్ని సమస్యలు చుట్టిముట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, చక్రవర్తి సాంగత్యంతో జీవితాన్ని సుఖమయం చేసుకుంది.

కళ్యాణి సంస్కారవతి ఈర్ష్యాద్వేషాలకు అతీతురాలు. తనకు మోసం చేసిన ప్రకాశాన్ని, తన గురించి దుష్ప్రచారం చేసిన ఇందిరను మన్నించింది. తాను అదృష్టవంతురాలు కాదని, తనకు ఆపదలు వస్తాయని ఆమెకు భయం. చక్రవర్తి తనను వివాహమాడతానని చెప్పినా, అతనితో తన వివాహం జరగదేమో అని ఆమెకు భయం. తన వలన చక్రవర్తికి ఆపదకులుగుతుందేమో అని అనుమానం. చక్రవర్తి కారు యాక్సిడెంట్‌కు గురి అయిప్పుడు తన దురదృష్టం అతనిని యాక్సిడెంట్‌కు గురి చేసిందని బాధపడిన సున్నిత హృదయ కళ్యాణి.

కాలాతీతవ్యక్తులు నవలలో ఎంతో ఔచిత్యం ఉన్న పాత్ర కళ్యాణి పాత్ర. అణకువ, నెమ్మదితనం, మృదు స్వభావం కలబోసిన కళ్యాణి ఆత్మాభిమానం కాపాడుకుంటూ, ఆత్మవిశ్వాసాన్ని ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటూ పట్టుదలతో జీవితాన్ని మలచుకున్న సౌశీల్యవతి. మొదట పరిస్థితుల వల్ల ప్రతివిషయానికి భయపడినా క్రమక్రమంగా ఆత్మాభిమానం ఎలా కాపాడుకోవచ్చో ఆర్థికంగా ఎలా స్వాతంత్ర్యం సాధించవచ్చో తెలుసుకుంది. ఇందిర కారణంగా ఆమెలో ఉన్న మనోదౌర్బల్యం, భయం, ఆందోళన అంతరించాయి. పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో కళ్యాణి కాల ప్రవాహానికి ఎదురీది గొప్పవ్యక్తిగా పరిణతి సాధించింది. తెలుగు యువతి ఎలా ఉండాలని పాఠకుడు ఆశిస్తాడో అలా కళ్యాణి పాత్రను రచయిత్రి తీర్చిదిద్దింది.

**3 - 19 - 1 - కృష్ణమూర్తి పాత్ర క్రమ పరిణామాన్ని తెలుపండి.**

కృష్ణమూర్తి పుట్టుకతో ధనవంతుడు. పుట్టినప్పటి నుంచి తల్లిదండ్రులు అతడిని గౌ~వంగా పెంచారు. ఆరుగురు ఆడపిల్లల తరువాత కలిగిన వంశోద్ధారకుడు కావడంవల్ల అతనిని నేలపైననడవనీయక, చేతుల మీద నడిపించి పెంచారు. అతడు తప్పు చేసినా కొట్టలేదు - తిట్టలేదు. వారిగ్రామంలో కనుచూపు మేర కనిపించే పొలాలన్నీ వారివే. కృష్ణమూర్తి తండ్రికి వ్యవసాయం చేయడం తప్ప మరొక విషయం తెలియదు. అసలు ఆఊరిలో పలక, బలపం తెలిసిన వాళ్ళు తక్కువ. ఈనేపథ్యంలో పెరిగిన కృష్ణమూర్తి విశాఖ పట్టణంలో చదువుతున్నాడంటే, ఆ ఊర్లో జనమంతా అతడు ఎంతో గొప్ప చదువు చదువుతున్నాడని భావించేవారు.

విశాఖపట్నంలో చదువుకుంటున్న కృష్ణమూర్తి విలాసంగా బ్రతికేవాడు. డబ్బుధారాళంగా ఖర్చు చేసేవాడు. అతని స్నేహితుల్లో కొందరు కృష్ణమూర్తి డబ్బుతో తమ అవసరాలు గడుపుకునేవారు. అందు కోసం అతని చుట్టూ చేరేవారు. ధనవంతుల కుటుంబంనుంచి రావడం వల్ల అతనికి ఏనాడూ డబ్బు ఇబ్బంది కలుగలేదు. విలాసంగా బ్రతుకుతూ, విలాసంగా తిరగడం వల్ల చదువుమాత్రం అబ్బలేదు. పరీక్షల్లో తప్పడం, ఆపరీక్ష వ్రాయడానికి మరల విశాఖపట్నం రావడం అతనికి అనవాయితీ అయింది.

బి.ఏ. పరీక్ష తప్పిన కృష్ణమూర్తి విశాఖపట్నం వచ్చి, ప్రకాశం ఇంటికి వెళ్ళాడు. అక్కడ అతనికి ఇందిర కనిపించింది. అతనిమనస్సు ఇందిరను ఆకర్షించింది. ప్రకాశం సహాయంతో ఇందిరతో పరిచయంపెంచుకున్నాడు. ఆమెతో షికార్లు చేశాడు. ఆమె అనుగ్రహం కోసం డబ్బు ఖర్చు చేశాడు. ఆమెకు బహుమతులు ఇచ్చాడు. ఆమె తండ్రి ఆనందరావుకు అప్పులు ఇచ్చాడు. వాళ్ళ ఇంటి అద్దె తానే చెల్లించాడు. కాని ఇందిర కళ్యాణిని ఇంటినుంచి సాగనంపిందని తెలుసుకొని బాధపడ్డాడు. ఇందిర స్వార్థపరురాలని గ్రహించి ఆమె ఇంటికి వెళ్ళకూడదని అనుకున్నాడు. ఇంతలో ప్రకాశం మేనమామ శేషారతారం కృష్ణమూర్తి గదికి వచ్చి అతనిని కళ్యాణి విషయంలో నానాదుర్భాషలాడాడు. దానికి కారణం ఇందిర, ఆనందరావు అని తెలుసుకున్న కృష్ణమూర్తి వారిద్దరినీ తిట్టాడు. వాళ్ళ దుర్మార్గాన్ని, వాళ్ళ స్వార్థపరత్వాన్ని నిరసించాడు. వాళ్ళముఖం చూడకూడదని నిర్ణయించుకున్నాడు.

కళ్యాణి గుణగణాలు, వినయ విధేయతలు తెలిసిన కృష్ణమూర్తి ఆమెకు సహాయం చేయాలనుకున్నాడు. విలాస జీవితంనుంచి మొదటి సారిగా కృష్ణమూర్తి మనస్సును మరలించిన మనిషి కళ్యాణి. ఆమెను పరీక్షకు పంపడం కోసం ప్రయత్నించడంలోను రామినాయుడికి వైద్యం చేయించే విషయంలోను, రామినాయుడు మరణించిన తరువాత నందూరు వెళ్ళి అతని పుత్రులను తీసుకొని వచ్చే విషయంలోను కృష్ణమూర్తి చూపిన శ్రద్ధ అతనికి కళ్యాణి మీదగల అభిమానాన్ని తెలియ చేస్తాయి. మనస్సుకు ఏదీ అంటకుండా తిరిగే కృష్ణమూర్తి ఈ విషయాల్లో ఇంత శ్రద్ధ కనబరచాడంటే అతనిలో కళ్యాణి ప్రవర్తన ఎంత మార్పు తెచ్చిందో ఊహించుకోవచ్చు. కళ్యాణి కోసం కృష్ణమూర్తి చేస్తున్న సహాయం చూసిన కొంతమంది అతడామెను ప్రేమిస్తున్నాడనుకున్నారు. కాని అతనిలో ఆమెకు సహాయం చేయాలనే ఆలోచన తప్ప దుష్ట చింతన గాని, మరో భావనగాని లేడు.

కృష్ణమూర్తికి కళ్యాణి వలన వసుంధర పరిచయమయింది. కృష్ణమూర్తి కళ్యాణికి చేస్తున్న సహాయం, ఆసహాయం చేయడంలో అతనిలో కనిపించే నిస్వార్థత్వం, నిష్కల్మషంగా మాట్లాడే తీరు, సంస్కార యుతంగా ఉన్నప్రవర్తన ఆమెకు నచ్చాయి. అలాంటి మంచి మనిషి తనకు భర్త అయితే మంచిది అని భావించి, అతనికి చేరువ కావాలని ఆశించింది. తన కోరికను వెల్లడించింది. వసుంధర వంటి యోగ్యురాలికి, సంస్కారికి తాను తగనని కృష్ణమూర్తి భావించాడు. ఆమె తనను పరీక్ష చేస్తున్నదని, తాను ఆప్రలోభాలకులోను కాకూడదాని నిశ్చయించుకుంటాడు. స్త్రీ సాంగత్యం కోసం అర్రులు చాస్తూ, ఆడవాళ్ళ చుట్టూ తిరిగే కృష్ణమూర్తిలో సంస్కారాన్ని మేల్కొలిపి అతడిని మనిషిగా తీర్చిదిద్దిన రెండవ వ్యక్తి వసుంధర.

ఒకరోజు ఇందిరకు దారిలో కృష్ణమూర్తి తారసపడ్డాడు, ఆమె బలవంతం చేయడంతో తనకి ఇష్టం లేకపోయినా ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆమె తన గతాన్ని తన తండ్రి పూర్వజీవితాన్ని గురించి వివరిస్తే విన్నాడు. ఊహించని విధంగా ఆమె ఆకర్షణకి లోనై ఆమెతో సంగమించాడు. ఇందిర ఎందుకు స్వేచ్ఛగా తిరుగుతుందో, ఎందుకు సమాజాన్ని ఎదిరించి బ్రతుకుతుందో ఆర్థమయిన తర్వాత అతనికి ఇందిర మీద సాను భూతి పెరిగింది. ఆమెతో కలసి తాను చేసిన చీకటి తప్పును సవరించుకోవాలి అనుకున్నాడు. అందుకు ఆమెను వివాహం చేసుకోవడమే మార్గం అని భావించాడు. తన ఆలోచనను ఇందిరకు చెప్పాడు. ఆమె అంగీకరించలేదు. ఆమెను ఒప్పించాడు. తన ఇంట్లో వాళ్ళకు చెప్పాడు. వాళ్ళు అంగీకరించలేదు. వాళ్ళను ఎదిరించాడు, తిరుపతి వెళ్ళి ఆమెను తన దానినిగా చేసుకున్నాడు. కృష్ణమూర్తిని పూర్తిగా మార్చి అతనికి తప్పులను దిద్దుకోవాలనే జిజ్ఞాస కలిగించింది ఇందిర. ఈ విధంగా కృష్ణమూర్తి మీద విపరీతమైన ప్రభావాన్ని చూపిన ముడో వ్యక్తి ఇందిర.

కృష్ణమూర్తికి ఒక స్నేహితుడున్నాడు. అతనిపేరు చక్రవర్తి. వృత్తిరీత్యా డాక్టరు. ఇద్దరిది ఒక ఊరుకాకపోయినా, ఒక వయస్సువారు కాకపోయినా ఒకే వృత్తికి చెందిన వారు కాకపోయినా పరస్పరం అభిమానంగా ఉండేవారు. కృష్ణమూర్తి కోసం చక్రవర్తి ఏమయినా చేస్తాడు. అతనికోసం రామినాయుడుకు వైద్యం చేశాడు. అతని కోసం రామినాయుడిని ఆసుపత్రిలో చేర్పించాడు. కృష్ణమూర్తికి సరయిన సలహాలిచ్చి అతనికి సన్మార్గాన్ని చూపించేవాడు చక్రవర్తి. కృష్ణమూర్తి ఇందిరను వివాహం చేసుకుంటానంటూ దానికి గల బలమైన కారణాలను వివరించినపుడు చక్రవర్తి అతని నిర్ణయాన్ని మెచ్చుకున్నాడు, ప్రోత్సహించాడు. కృష్ణమూర్తి సరయిన నిర్ణయమే తీసుకున్నాడని వసుంధరతో చెప్పి ఆమెను ఆనునయించాడు. కృష్ణమూర్తిలో పరివర్తన రావడానికి చక్రవర్తి స్నేహం కూడా కారణమని చెప్పవచ్చు.

కృష్ణమూర్తికి అబద్ధాలాడే వారంటే తగని చిరాకు. అతనికి మోసాలు తెలియవు. భయపడుతూ బ్రతకడం అతనికి తెలియదు. సమస్యలు రానివ్వడు. వాటికి దూరంగా ఉంచడానికి ప్రయత్నం చేస్తుంటాడు. అతడు సిగిరెట్లు త్రాగుతాడు. అయినా దుర్మార్గుడు కాడు. పేకాట ఆడుతాడు. అయిన జూదగాడు కాదు. నిర్లక్ష్యంగా, ఏ విలువలను లెక్కచేయకుండా, అవినీతికి దూరంగా బ్రతికే స్వభావం అతనిది. మధ్యతరగతి సంస్కారంలోని కుళ్ళుకు, మూర్ఖత్వానికి అతని ప్రవర్తన ఒక దివ్యమైన ఔషధం లాంటిది.

కృష్ణమూర్తి పాత్రను క్రమపరిణామం పొందిన పాత్రగా రచయిత్రి తీర్చిదిద్దారు. విలాసంగా బ్రతికే స్థితినుంచి ఒక స్త్రీకి ఆధారంగా నిలిచేస్థాయికి ఎదిగిన కృష్ణమూర్తి వంటి పాత్రలు అరుదుగా ఉంటాయి. అతని క్రమ పరిణామానికి నారు పోసింది కళ్యాణి అయితే నీరు పోసింది వసుంధర. ఎరువు వేసి పెంచింది చక్రవర్తి అయితే ఆఫలాలు అందుకుంది మాత్రం ఇందిర. మానవత్వం, స్నేహతత్వం నిండిన కృష్ణమూర్తి ఈ నవలలో 'నాయకుడు' అంటే అందులో అతిశయోక్తి లేదు.

**3 - 19 - 2 - ప్రకాశం పాత్రలోని బలహీనతలు, బలాలను పరిశీలించండి.**

ప్రకాశం విశాఖపట్నంలో యం.బి.బి.యస్. చదివే విద్యార్థి. అతని చిన్నతనంలో తండ్రి మరణించాడు. పదెకరాల పొలం ఉన్న ఆతని తల్లిని మేనమామ శేషావతారం తన ఇంటికి తీసుకువెళ్ళాడు. శేషావతారం ప్రకాశం ఆస్తికి యాజమాన్యం వహించాడు. ప్రకాశం తల్లి వెంకాయమ్మ అమాయకురాలు. ఆమెకు శేషావతారం డబ్బు కోసమే తనను చేరదీశాడని తెలియదు. శేషావతారం, అతని భార్య వెంకాయమ్మ చేత ఇంటి పనినంతా చేయించేవారు. వారు ప్రకాశాన్ని ఎప్పుడూ ప్రేమతో ఆదరించలేదు. స్వేచ్ఛ ఇస్తే మేనల్లుడు తనను ఎదిరిస్తాడని, ఆస్తి లెక్కలు అడుగుతాడని శేషావతారం ప్రకాశాన్ని చిన్నతనం నుంచి అదుపాజ్ఞలతో పెంచాడు. చిన్న తప్పులకే చితక తన్నేవాడు. పెరిగి పెద్ద వాడయిన తర్వాత కూడా శేషావతారం కనిపిస్తే ప్రకాశం భయపడే వాడంటే, అతని చిన్నతనంలో శేషావతారం అతడిని ఎంత దండించేవాడో ఊహించుకోవచ్చు.

ప్రకాశాన్ని యం.బి.బి.ఎస్. చదివించి డాక్టరును చేయాలని వెంకాయమ్మ అనుకునేది. ఆమె కోరిక కాదనలేక శేషావతారం ప్రకాశాన్ని మెడికల్ కాలేజీలో చేర్పించాడు. ప్రకాశం బుద్ధిమంతుడులాగా చదువు తప్ప వేరేధ్యాస లేని మంచి విద్యార్థిగా చదువుకునేవాడు. ప్రశాశం ఉండే మేడ క్రింద భాగంలో విద్యార్థులంతా జల్సాలు చేస్తున్నా ప్రకశం వాళ్ళతో కలసేవాడు కాదు. వేసవిలో విద్యార్థులు ఖాళీ చేసన క్రింది వాటలోకి ఇందిర తన తండ్రి ఆనందరావుతో అద్దెకు చేరింది. ఇందిర కలుపుగోలుతనం ఇందిరకు ప్రకాశాన్ని దగ్గర చేసింది. అతడామెతో బీచ్‌లకు వెళ్ళడం, సినిమాలకు, షికార్లకు తిరగడం మెదలయ్యింది. ఇంతలో ఆ ఇంట్లోకి కళ్యాణి పేయింగ్ గెస్ట్‌గా వచ్చింది. ఆమె మంచితనం ప్రకాశాన్ని వశపరచుకుంది. ఆమెకు జ్వరంవస్తే ప్రకాశం అసుపత్రిలో చేర్పించి ఆమెకు వైద్యం చేయించాడు. తన పట్ల ప్రకాశం చూపిస్తున్న అభిమానాన్ని కళ్యాణి ప్రేమగా భ్రమపడింది. అతని ఆహ్వానంలో వ్యాలీగార్డెన్సు కృషికారుకు వెళ్ళింది. పరస్పరం కష్టసుఖాల గురించి మాట్లాడుకున్న కళ్యాణి, ప్రకాశం జీవితమంతా కలసి ఉండాలని ఊసులాడుకున్నారు. వారిద్దరి చనువు ఇందిరలో అసూయను రగిల్చింది. తండ్రి అనారోగ్యం కారణంగా కళ్యాణి స్వగ్రామానికి వెళితే, ఇందిర ప్రకాశాన్ని తన వాడిగా చేసుకుని కళ్యాణికి దూరం చేసింది. ఇందిర స్నేహంతో కళ్యాణి ఊరువచ్చి సహాయం చేస్తానన్న ప్రకాశం కనీసం ఆమెకు ఉత్తరాలు కూడా రాయలేదు. తండ్రి మరణానంతరం అనాథగా వచ్చి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతున్న కళ్యాణిని ఉండమంటూ అడగలేని బలహీనుడు ప్రకాశం.

మొదట ఇందిర అంటే భయపడిన ప్రకాశానికి ఆమెతో లైంగిక సంబంధం ఏర్పడిన తరువాత ఆమె తోడిదే ప్రపంచం అయింది. ఆమె లేనిదే బ్రతుక లేను అనుకున్నాడు. ఆమె కోసం కళ్యాణిని దూరం చేసుకున్నాడు. ప్రకాశం ఇందిరతో తిరుగుతున్నాడని తెలుసుకొని శేషావతారం విశాఖపట్నం వచ్చాడు. ప్రకాశాన్ని బెదిరించి తన ఊరు తీసుకొని వెళ్ళాడు. తను చూపించిన రాజమండ్రి అమ్మాయిని వివాహం చేసుకోమని బెదిరించాడు. అప్పటకీ ఇందిర ప్రకాశాన్ని శేషావతారం మీదికి రెచ్చగొట్టింది. తన ఆస్తిని తీసుకొని రమ్మని, విశాఖపట్నంలో ఉండవచ్చని చెప్పింది. ఇందిర సన్నిధిలో అంగీకరించిన ప్రకాశం శేషావతారం ముందు మాట్లాడ లేకపోయాడు. రాజమండ్రి వెళ్ళి మామయ్య చూపిన అమ్మాయిని చూశాడు. అవకాశం చూసుకొని శేషావతారానికి తెలియకుండా విశాఖపట్నం పారిపోయి వచ్చాడు. ఇందిర అతడి పిరికితనాన్ని తిట్టి పోసింది. అసమర్థుడయిన అతనిని వివాహం చేసుకోనని తేల్చి చెప్పింది. ఇందిర మాటలు విని ప్రకాశం నిశ్చేష్టుడయ్యాడు. తాను రావడాన్ని పరమానందంగా భావిస్తుందనుకున్న ఇందిర, తనను తృణీకరించినందుకు బాధపడ్డాడు. ఆబాధలో ఇందిర అతనికి వగలాడి అనిపించింది. స్వార్థపూరితురాలు అనిపించింది. ఆమెతో వివాహమయితే ఆ జీవితం కష్టాల సుడిగుండం అయ్యేది అనిపించింది. ఆమెతో జీవితం పంచు కోకపోవడం అతని అదృష్టం అనుకున్నాడు. ఇప్పుడతనికి రాజమండ్రిలో తాను చూసిన అమ్మాయి అందంగా అనిపించింది. ఆ అమ్మాయిని వివాహం చేసుకుని మామయ్య కనుసన్నల్లో మెలుగుతూ హాయిగా జీవించవచ్చు అనుకున్నాడు. ఇందిర ఇంటి నుంచి తన ఊరు వెళ్ళి వివాహం అయిన తరువాత విశాఖపట్నంలో కాపురం పెట్టాడు. ఆ తరువాత ఇందిర గురించి ఆలోచించ లేదు.

ప్రకాశం ఆర్థిక విషయాల్లో నిక్కచ్చిగా ఉండేవాడు ఇతరుల డబ్బులు వాడుకునే వాడుకాదు. మామయ్య పంపిన డబ్బును కూడా ప్రణాళిక ప్రకారం ఖర్చుచేసేవాడు అతనికి ప్రేమకు, ఆకర్షణకి మధ్య ఉండే భేదం తెలియదు. తాను కళ్యాణిని ప్రేమించాను అనుకున్నాడు. ఇందిర మీద వ్యామోహంతో కళ్యాణిని మరచిపోయాడు. మామయ్య భయంతో ఇందిరకు దూరమయ్యాడు. ఇందిర తనను నిరాకరించడంతో అతనికి మామయ్య చూపిన అమ్మాయి అందంగా కనిపపించింది. అతనికి స్త్రీ పురుష సంబంధాలపై ప్రత్యేకమైన అభిప్రాయం లేదని దీనిని బట్టి అర్థమౌతుంది. ప్రకాశానికి తన తల్లి అంటే ప్రేమ ఉంది కాని ఆమె కోసం ఏమీ చేయలేక పోయాడు.

ప్రకాశానికి నరనరాల్లో భయం ఉంది. జీవితం అన్నా సమస్యలు అన్నా మేనమామ మాట అన్నా, డబ్బు లేకుండా బ్రతకడం అన్నా అతనికి విపరీతమైన భయం. ఆడపిల్లలతో తిరిగితే ఎవరైనా చూస్తారని ప్రొఫెసర్లు మార్కులు వేయరని భయపడే ప్రకాశం అనేక భయాల మధ్య ఆలోచన పెంచు కోలేక పోయాడు. అవగాహన కలిగించుకోలేక పోయాడు. తలవంచడం తప్ప ఎదిరించడాన్ని, తలదించడం తప్ప వ్యక్తిగా నిరూపించుకోవడాన్ని నేర్చుకోలేకపోయాడు. అతనిది పలాయన వాదం. సమస్యలకు దూరంగా పారిపోవాలనే ఆలోచన తప్ప పోరాడే తత్త్వం అతనిలో మచ్చుకు కూడా కనిపించదు. అతనికి వ్యక్తిత్వం గాని, విచక్షణగాని, బాధ్యతగాని ఉన్నట్లు అనిపించవు. అయినా అతనిలో అప్పుడప్పుడు మంచిగుణాలు కొన్ని కనిపిస్తాయి. కళ్యాణిని, ఆనందరావును ఆసుపత్రిలో చేర్చి వైద్యం చేయించినప్పుడు అతనిది దయార్ద్ర హృదయమని, కళ్యాణికి క్షమాపణలు చెప్పినప్పుడు సంస్కార వంతుడని అనిపిస్తుంది.

ప్రకాశం గురించి అతనికి తెలసిన వాళ్ళు పలురకాలుగా అనుకునేవాళ్ళు. అతని స్నేహితులు అతనిని చవట, అసమర్థుడు, మెత్తనివాడు అని అంటే, చేవలేనివాడని తల్లి అనేది. చెవల వాజమ్మ అని శేషావతారం అంటే తమాషా మనిషి అని ఇందిర అంటుండేది. ఎవరెన్ని విధాలుగా అన్నా ప్రకాశానిది వ్యక్తిత్వం ఎరుగని పిరికి గుండె. ఇతరుల నీడలో తప్ప స్వతంత్రంగా వ్యవహరించలేని అయోగ్యుడు అతడు.

ప్రకాశం బలాలను, బలహీనతలను గురించి చెప్పాలంటే అతనిలో బలాల కన్న బలహీనతలు ఎక్కువ. అతనిలో ఉన్న బలం మంచివాడుగా కనిపించడం, స్త్రీలను ఆకర్షించే విధంగా ప్రవర్తించ గలగడం తప్ప ఇంకేమీ లేవు. అతనిలో కనిపించే బలహీనతల్లో భయం, పిరికితనం, మాట నిలబెట్టుకోలేని అసమర్థత, సమస్యలనుంచి దూరంగా పారిపోయే తత్వం ముఖ్యమయినవి. అతనిలో కాలానికి ఎదురీదే సామర్థ్యం లేదు. అతడు కాలాతీత వ్యక్తి కాడు. కాలప్రవాహంలో కలిసిపోయిన అతిసామాన్యుడు.

**3. 19. 3. వ్యక్తుల ప్రవర్తనకు వారి బాల్య జీవిత ప్రభావాలు చాలవరకూ కారణమనే అంశాన్ని కాలాతీతవ్యక్తులు నవల ద్వారా నిరూపించండి.**

మనుషులు పెరిగి పెద్దవారై వ్యక్తిత్వాన్ని పెంపొందించు కోవడంలో వారి బాల్యజీవితం ప్రధానమైన పాత్ర వహిస్తుంది. బాల్యంలో ఒకవ్యక్తి పొందే అనుభూతులు, అనుభవాలు అతని జీవితాంతం అతని మనస్సులో నిలిచి ఉంటాయి. అవే ఆవ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తాయి. బాల్యంలో అతని అనుభవాలతో పాటు అతని చుట్టూ ఉండే సమాజం అతడిని చూసే విధానం, ఆకుటుంబం ఆర్థిక పరిస్థితులు, అతని కుటుంబ సభ్యుల నైతిక ప్రవర్తన, అలవాట్లు ప్రధానంగా ప్రభావం చూపుతుంటాయి. కాలాతీతవ్యక్తులు నవలలో వ్యక్తుల మీద బాల్య జీవిత ప్రభావం తప్పకుండా ఉంటుందని చెప్పడానికి తగిన సాక్ష్యాలు కనిపిస్తున్నాయి. నవలలోని పాత్రల్లో ఏయే పాత్రల మీద బాల్య జీవితప్రభావం ఉందో తెలుసుకుందాం.

**1. ఇందిర:** ఇందిర తండ్రి ఆనందరావు వ్యసనాలకు బానిస. ఆమె తల్లి మరణించింది. తండ్రి ఉద్యోగం పోగొట్టుకొని జైలు పాలయ్యాడు. ఆదుకునేవారు లేని ఒంటరి జీవితం. ఇది సంక్షిప్తంగా ఇందిర బాల్యం. తాను లోకంలోని మిగతా యువతుల్లా హాయిగా ఉండలేకపోడానికి తన కుటుంబమే కారణమని ఆమె గ్రహించింది. ఆమెది తృప్తి లేని జీవితం. ఆమె జీవితం ఆమెను సమాజం మీద కసిని, కోపాన్ని ఏర్పరచింది. లోకమర్యాదలను, కట్టుబాట్లను పాటించడం మానివేసింది. అవసరమయితే ఇతరులను మోసగించడం, మరొకరి చేతిలో మోసపోకుండా ఉండడం అలవాటు చేసుకుంది. జీవితంలో సహజంగా వచ్చే కష్ట సుఖాలు, మానావమానాలను అతి తేలిగ్గా, మనస్సుకు తాకకుండా తీసుకుంటూ, హాయిగా జీవించడం అలవాటు చేసుకుంది. తనకు తెలిసిన వారంతా తన చుట్టూ తిరగాలని అనుకునే ఇందిర ప్రకాశాన్ని కృష్ణమూర్తిని, తన ఆఫీసరును తన చుట్టూ పరిభ్రమించేలా చేసుకుంది. తను కాదని కళ్యాణి పట్ల ప్రకాశం ఆకర్షితుడవుతున్నాడని అనిపించినంతనే, ప్రకాశాన్ని కళ్యాణి నుంచి దూరం చేసింది. తన వ్యక్తిత్వం ముందు నిలబడలేని పిరికి వాడయిన ప్రకాశాన్ని, అతని కోరికను తిరస్కరించింది. తనకు అవసరమయిన దానిని నిస్సంకోచంగా అడిగి తీసుకోవడం, తన దగ్గరున్నదానిని అడక్కపోయినా ఇవ్వడం నేర్చుకుంది. తన చుట్టూ ఉండే వ్యక్తులను, సమస్యలను ఎదిరించి తన దారికి తెచ్చుకునే తెగువ ఆమెకు బాల్య జీవిత ప్రభావం వలననే వచ్చింది. అణకువగా అణిగిమణిగి ఉంటే లోకం తన మీద నుంచి నడిచి వెళ్ళుతుందని ఆమెకు బాల్యంలోనే అవగతమయింది. తనను ఆదుకునేవారు లేని అభద్రతాభావన బాల్యంలో ఏర్పడ బట్టే ఆమె ప్రతి ఘటించే

యువతిగా మారింది. ఆనందరావు సక్రమంగా ఉండి ఉద్యోగం చేసుకుంటూ, ఇందిరను చదివించి యోగ్యుడయిన వరుడిని చూచి వివాహం చేసి ఉంటే ఆమె అలా తయారయ్యేది కాదు.

**2. కళ్యాణి:** కళ్యాణి పుట్టినంతనే తల్లిని పోగొట్టుకుంది. పొరుగింటి ధర్మాత్మురాలి పోషణలో, తండ్రి తెచ్చిన పిన్ని పెంపకంలో పెరిగింది. భార్యా వియోగంతో విరాగిగా మారిన తండ్రి, వైధవ్యం, పేదరికం తప్పలోకం తెలియని పిన్ని పెంపకంలో పెరిగిన కళ్యాణిలో ఒంటరితనం తప్ప కలివిడితనం ఏర్పడలేదు. బట్టలు కుట్టించడం, కాగితం పడవలు చేసి ఇవ్వడం, అవసరమయితే అప్పులు చేసి డబ్బు పంపడం తప్ప కూతురుతో పదినిమిషాలు మాట్లాడాలని తండ్రికి తెలియదు. గోవిందనామాలు నేర్పడం కథలు చెప్పడం తప్ప లోకం గురించి చెప్పే జ్ఞానం పిన్నికి లేదు. ఆ ఇద్దరి పెంపకంలో పెరిగిన కళ్యాణికి లోకజ్ఞానం అలవడలేదంటే ఆశ్చర్యం లేదు.

ఆమెకు బాల్యంలో కనిపించిన మగాళ్ళంతా ఆడవారిని హీనంగా చూసేవాళ్ళు, హింసించే వాళ్ళు కావడం వలన, పిన్ని చిన్నప్పటి నుంచి దుష్టులకు దూరంగా ఉండమంటు చెప్పడంవలన కళ్యాణికి మొదటి నుంచి మగాళ్ళంతా విచిత్రంగా కనిపించేవారు. అందుచేతనే మర్యాదగా మాట్లాడిన ప్రకాశాన్ని మంచి వాడిగా భావించింది. కళ్యాణికి లోకజ్ఞానం అలవడవలసిన వయస్సులో తండ్రి మరణించాడు. ఆస్తి అప్పులకు సరిపోయింది. ఇందిర పగబట్టింది. ప్రకాశం మోసం చేశాడు. ఆమెకు ఈ కష్టాలన్నీ జీవితం పట్ల ఒక అపనమ్మకాన్ని, భయపడే తత్వాన్ని సంకోచస్వభావాన్ని కలిగించాయి.

చిన్న తనం నుంచి ఎక్కడికి వెళ్ళకపోవడం వలన ఆమెకు ఒంటరితనం అలవాటయితే, బాల్యంలో తండ్రి సర్వస్వాన్ని పోగొట్టు కోవడం వల్ల ఆమెకు భయపడడం అలవాటయింది. తన తండ్రి ఎలా ఇతరులతో కలవక ఒంటరిగా ఉండే వాడో తానూ అలాగే ఉండడం నేర్చుకుంది. ఇందిరకు, ప్రకాశానికి దూరంగా వెళ్ళడానికి చిన్న తనంలో పిన్ని చెప్పిన దుష్టులకు దూరంగా ఉండమని చెప్పినమాటే కారణం ఆమెకు బాల్య జీవితం అణకువ మంచితనం, సంస్కారం మొదలయిన సుగుణాలతో పాటు భయం, అనుమానం, బిడియం మొదలయిన వాటిని కూడా నేర్పింది.

**3. ప్రకాశం:** ప్రకాశానికి మూడేళ్ళ వయస్సులో తండ్రి మరణించాడు. తల్లితో సహా మేనమామ శేషావతారం చిన్న తప్పుకే ప్రకాశాన్ని చితకబాది వాడు అత్త ఏనాడూ ఆప్యాయంగా అన్నం వడ్డించలేదు ప్రకాశం వ్యక్తిత్వం లేని చవటగా ఉన్నంతకాలం అతని ఆస్తిని తన ఆస్తిగా మార్చుకోవచ్చని గ్రహించిన శేషావతారం అతనిని పిరికివాడిగా, వ్యక్తిత్వం లేని వాడిగా పెంచాడు. అందుచేతనే అతడు తన ఆస్తి మేనమామ ఆస్తిలో కలిసిపోతున్నా కిక్కురుమనలేదు. రాజమండ్రి అమ్మాయిని పెండ్లి చేసుకోమంటే నోరెత్తలేదు. శేషావతారం ఆధిపత్యం, తిట్లు, దండించే విధానం ప్రకాశం మనస్సును, వ్యక్తిత్వాన్ని ఎదగనీయక అణగిద్రొక్కాయి. చిన్ననాటి అనుభవాల వల్ల ఏర్పడిన పిరికితనాన్ని వదిలించడానికి ఇందిర ప్రయత్నించింది గాని శేషావతారం ప్రభావం ఇందిర ప్రయత్నాన్ని మింగివేసింది. అతని పిరికితనాన్ని, భయాన్ని గుర్తించి ఇందిర అతనిని తిరస్కరించింది. ప్రకాశం బాల్య జీవిత ప్రభావాలవల్ల మేనమామ మాటను కాదనలేని వ్యక్తిగా పెరిగాడు అందుచేతనే అతడు కళ్యాణికి దూరమయ్యాడు. ఇందిర చేత తృణీకరించ బడ్డాడు.

**4. చక్రవర్తి:** చక్రవర్తి తండ్రి డబ్బుకు ఆశపడి అతనిని చిన్నతనంలోనే దత్తతచేశాడు. ఆకారణంచేత చక్రవర్తి సంతానం లేని ఒక పెంపుడు తల్లికి బిడ్డగా ఎదిగాడు. ఆ తల్లిది రాక్షస ప్రేమ. అతనికి ఆప్రేమ వెగటు కలిగించింది. అందుకే ఇంటి నుంచి పారిపోయాడు. పెంపుడు తల్లి చక్రవర్తికి పెండ్లి చేసి భార్యద్వారా అతడిని సాధించడం మొదలు పెట్టింది. భార్య నర్సులతో, లేడీ డాక్టర్లతో తనకు సంబంధం అంటగట్టి సాధించేది. ఆమె బాధను భరించలేక ఒంటరితనం, వృత్తిపట్ల అంకిత భావం అలవాటు చేసుకున్నాడు. పెంపుడు తల్లి రాక్షస ప్రేమ, భార్య అనుమానం అతనికి పలాయన తత్వం ఏర్పరచాయి. తండ్రికి, పెంపుడు తల్లికి దూరంగా ఒంటరిగా గడపడం నేర్పాయి. జీవితంపట్ల ఒక నైరాశ్యభావాన్ని ఏర్పరచాయి.

ఈ విధంగా కాలాతీతవ్యక్తులు నవలలో ప్రధాన పాత్రలు నాలుగింటిని పరిశీలిస్తే బాల్యజీవిత ప్రభావాల వల్లనే వారు ఆ విధంగా తయారయ్యారని స్పష్టమవుతుంది.

**3.19.4. తెలుగు నవల పరిణామ వికాసాలు తెల్పి కాలాతీతవ్యక్తులు నవలస్థానం నిర్ణయించండి.**

గద్యరూపంలో ఉన్న పెద్దకథను నవల అని అంటే సంస్కృత భాషలో బాణుడు రచించిన 'కాదంబరి', ప్రాకృత భాషలో గుణాఢ్యుడు రచించిన 'బృహత్కథ' అనేవి కూడా నవలలే అవుతాయి. కాని నవల అనే పదం ఆంగ్లభాషలోని 'నావెల్' అనేపదంనుంచి వచ్చింది. పదాన్ని బట్టి విశ్లేషించినా, లక్షణాలనుబట్టి, విశ్లేషించినా నవలలోని ప్రాచీన సాహిత్య లక్షణాలు కనిపించవనీ, ఇది పాశ్చాత్య సాహిత్య ప్రక్రియకు అనుకరణ అనీ విస్పష్టంగా అర్థమౌతుంది.

తెలుగులో నరహరి గోపాలకృష్ణమసెట్టి గారు రచించిన 'శ్రీరంగ రాజ చరిత్ర' అనేది మొట్టమొదటి నవల అని చెప్పవచ్చు. ఈ నవల బెంగాల్‌లో వెలువడిన ఒక ప్రకటనకు స్పందించి 1872లో వ్రాయబడింది. తెలుగుప్రజల ఆచారాలు తెలిపే విధంగా ఒక రచన చేస్తే అది తెలుగువారికి ఉపయోగపడుతుందనే అభిప్రాయంతో ఆయన ఈ రచన చేశాడు. ఆయన దీన్ని 'నవీన ప్రబంధం' అన్నారు. 1978లో వీరేశలింగంగారు 'రాజశేఖర చరిత్ర' అనే నవలను రచించి దానిని 'వచన ప్రబంధం' అన్నారు. తరువాత చింతామణి పత్రిక సంపాదకులైన న్యాపతి సుబ్బారావుగారు 1893లో నవలల పోటీపెట్టారు. ఆయన నవలను 'పాశ్యాత్య పద్ధతి అఖ్యాయిక' అని వ్యవహరించారు. అప్పటికి భారతీయ భాషల్లో నవలకు సరియైన పర్యాయపదం లేక పోవడంవల్ల ఉపన్యాస్, కాదంబరి వంటి పేర్లతో పిలుస్తూ ఉండేవారు. రాజశేఖర చరిత్రను సమీక్షించిన కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి గారు వచన ప్రబంధాన్ని 'నవల' అనేపేరుతో వ్యవహరించవచ్చుని, 'నవాన్ లాతి ఇతి నవల' అంటూ నవల పదానికి వ్యుత్పత్తి కూడా చెప్పారు. ఇది 1896లో జరిగింది. 1922లో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు మాలపల్లి అనే నవలను రచించిన తర్వాత తెలుగులో నవలల రచన ఊపందు కున్నది. విశ్వనాథ సత్యనారాయణ, గుడిపాటి వెంకటచలం మొదలగు రచయితలు నవలారచనలో చేసిన కృషి ఫలితంగా తెలుగునవలకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం లభించింది.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత తెలుగులో నవలా రచన మరింత పురోగమించింది. పత్రికలు విరివిగా రావడం దీనికి ప్రబలమైన కారణం అని చెప్పుకోవచ్చు. కొడవటిగంటి, బలివాడ కాంతారావు, గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి, వంటి ఎందరో రచయితలు, లత, ముప్పాళ్ళ రంగనాయకమ్మ వంటి రచయిత్రులు నవలలను వ్రాయడంలో తమ ప్రతిభలను ప్రదర్శించారు. స్వాతంత్ర్యానంతరం రచింపబడిన నవలల్లో మధ్యతరగతి ప్రజల కుటుంబ జీవన విధానం వస్తువు అయింది. తెలుగులో వచన రచన వ్యావహారిక భాషలో సాగడం వలన కూడా నవలల అభివృద్ధి పురోగమించింది. "జీవితాన్ని కథావస్తువుగా తీసుకుని కల్పనలతో, ఊహలతో నిర్మించుకుంటూ వెళ్ళిన పెద్దకథ" నవల అనుకోవచ్చు. ఆ నవలలో కథా వస్తువు సమకాలీన జీవితం గురించి అయితే అందులో వాస్తవికత ఉండే అవకాశం ఎక్కువ. సమకాలీన సమస్యలను గ్రహించి, ఆ సమస్యలను లోతుగా దర్శించి, అవగాహనకు తెచ్చుకొని వ్రాయడం అనే రచనా పరిణామం ఉత్తమ నవలా రచనకు దోహదపడుతుంది.

ఇతివృత్తం, పాత్రపోషణ, సరళ సుందరమైన భాష కీలకమైన సంఘటలను, మంచి శైలి, సంవిధాన నైపుణ్యం, అనే ఆరు లక్షణాలతో కూడి ఉన్న నవల ఉత్తమ నవల లేదా మంచి నవల అనిపించుకుంటుంది. మధ్యతరగతి జీవితాల్లోని కష్టాలు, ఆర్థిక పరమైన ఇబ్బందులు, అవి మనుషుల మమతానురాగాలను దెబ్బతీసే విధానం, పడిపోతున్న నైతిక విలువలు, కొత్తగా ఏర్పడుతున్న ఆశలు, ఆశయాలు పాశ్చాత్య సంపర్కం వల్ల ఏర్పడుతున్న వ్యసనాలకు కుటుంబాలు బలికావడం మొదలైన అనేక సమస్యలకు సమాధానంగా కాలాతీతవ్యక్తులు నవల రచించబడింది. ఇందులో సమకాలీన మధ్యతరగతి ప్రజల జీవితాన్ని ఇతి వృత్తంగా స్వీకరించి రచింపబడింది. ఇందులోని పాత్రలు బలమైన వ్యక్తిత్వాలతో కాలానికి అతీతంగా, సమస్యలలో కొట్టుకు పోకుండా ధైర్యంగా నిలిచే పాత్రలు, ఈనవల శిష్ట వ్యావహారిక భాషలో అతి సరళ సుందరమైన భాషలో వ్రాయబడింది. వాస్తవికతను కళ్ళముందు నిలిపే శైలి, ఆపకుండా చదివింప గల సంఘటనల కూర్పుతో కూడిన సంవిధాన నైపుణ్యం, ఒకే జిగితో సాగే శిల్ప నిర్మాణం ఇవన్నీ కలిపి కాలాతీతవ్యక్తులు నవలను ఉత్తమోత్తమ నవలల్లో ఒకటిగా కీర్తిని సంపాదించి పెట్టాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రచింపబడిన నవలల్లో ఐదునవలలను పంచకావ్యాల వంటి వని సాహితీ వేత్తలు స్తుతించారు. అవి 1.చివరకు మిగి లేది 2. అసమర్థుని జీవిత యాత్ర 3. అల్పజీవి 4. అతడు - ఆమె 5. కాలాతీతవ్యక్తులు. పంచకావ్యాలవంటి నవలల్లో స్థానం సంపాదించిన ఈ నవలలోని విశేషాలెంత గొప్పవో అర్థం చేసుకోవచ్చు. తెలుగు నవలల్లో ఈనవలకు సమున్నతమైన స్థానం ఉందని అనవచ్చు.

**డాక్టర్ . ఎన్, ఆదినారాయణ** ఎం.ఏ, పిహెచ్. డి

రీడర్ & ప్రిన్సిపాల్

బి.ఎస్.ఎస్.బి డిగ్రీ కళాశాల

ఖండం 3 నవలలోని పాత్రలమనస్తత్త్వాలు

# కాలాతీత వ్యక్తులు

## పాఠం - 20

3.20. 0. చక్రవర్తి గుణగణాలను వర్ణించండి.

3.20. 1. వసుంధర సంస్కారాన్ని విశదీకరించండి.

3.20. 2. రామినాయుడు పాత్రను రచయిత్రి తీర్చిదిద్దిన విధం తెలుపండి.

3.20. 3. శేషావతారం పాత్రలోని దుష్టత్వాన్ని చిత్రీకరించండి.

3.20. 4. ఆనందరావు పాత్రలోని లోపాలను వివరించిండి.

**3. 20. 0. చక్రవర్తి గుణగణాలను వర్ణించండి.**

చక్రవర్తి వృత్తిరీత్యా డాక్టరు. మొదటినుంచీ తన కుటుంబానికి దూరంగానే బ్రతికాడు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంవల్ల అతని తల్లిదండ్రులు డబ్బుకు ఆశపడి చిన్నతనంలోనే అతనిని దత్తత ఇచ్చారు. అతని పెంపుడు తల్లిది జలగప్రేమ. పెంపుడు కొడుకు చక్రవర్తి తన కళ్ళఎదుటే ఉండాలని, ఎక్కడకూ కదల కూడదని ఆంక్షలు విధించేది. అలా కుమారుడిని కళ్ళముందు నుంచి కదలనీయక పోవడమే ప్రేమ అని ఆమె నమ్మకం. ఆ ప్రేమను భరిస్తూ చక్రవర్తి స్కూల్ ఫైనల్ పాసయ్యాడు. పై చదువులు చదవడానికి పొరుగూరు వెళ్ళాలని అనుకున్నాడు. ఆమె అంగీకరించలేదు. ఊర్లోనే ఉండమని పట్టుబట్టింది. చదువుకోవాలనే పట్టుదల కలిగిన చక్రవర్తి ఇంటినుంచి పారిపోయాడు. మద్రాసు చేరుకుని అక్కడినుంచి ఉత్తరం రాశాడు. ఆమె కొంత లొంగింది. చదువుకోడానికి అనుమతినిచ్చింది. అయితే పెండ్లి చేసుకోవాలని పట్టుబట్టి పన్నెండేళ్ళ పిల్లతో పెళ్ళి చేసింది. పెంపుడు తల్లి కనుసన్నలలో పెరిగిన ఆ అమ్మాయి అతని మీద అపనమ్మకాన్ని అభివృద్ధి చేసుకుంది. తన భర్త నర్సులతోను, లేడీ డాక్టర్లతోను తిరుగుతాడని ఆమె అభిప్రాయం. చక్రవర్తి పరస్త్రీలతో మాట్లాడితే సహించేది కాదు. నానాయాగీ చేసేది. అతని గృహజీవితం నరకంగా మారింది. అతడు ముభావంగా ఉండడం అలవాటు చేసుకున్నాడు. ఆమె భర్త తనను ఆదరించడం లేదనుకుంది. ఆ ఆలోచనతో ఆరోగ్యం చెడగొట్టుకొని మంచం ఎక్కింది. క్రమంగా అది క్షయగా మారి కన్నుమూసింది. కోడలి మరణం, తద్వారా కొడుక్కి కలిగిన అసౌకర్యం ఆ పెంపుడుతల్లికి ఆనందం కలిగించాయి. కొడుకు కారణంగానే కోడలు మరణించిందంటూ, ఆమె కొడుకుని విడిచి స్వగ్రామం వెళ్లిపోయింది. ఐదేళ్ళ వైవాహిక జీవితం చక్రవర్తికి జీవితం మీద విరక్తి, వెగటు మిగిల్చింది. వైజాగ్‌లో ప్రాక్టీసు పెట్టుకున్నాడు. దెప్పిపొడిచే బంధువర్గం దూరమయ్యారు. డబ్బు కావాలంటూ వేధించే తండ్రి దూరమయ్యాడు. అతనికి ఆసుపత్రి, రోగులు ఆత్మీయులయ్యారు. ఒక మళయాళీ కుర్రాడిని వంటకు కుదుర్చుకొని, ఒక డిస్పెన్సరీ నిర్వహించుకుంటూ జీవితం గడపటం నేర్చుకున్నాడు.

చక్రవర్తికి కృష్ణమూర్తి అంటే అభిమానం. కలిసి చదువుకోకపోయినా, ఒక ఊరికి చెందినవారు కాకపోయినా, వృత్తి వేరయినా ఇద్దరూ పరస్పరం అభిమానంగా ఉండేవారు. కృష్ణమూర్తి గుణగణాలు అభిమానించే చక్రవర్తి అతడేమి చెప్పినా చేసేవాడు. రామినాయుడికి వసుంధర ఇంట్లో హార్ట్‌ఎటాక్ వచ్చినప్పుడు కృష్ణమూర్తి పిలుపుతో అక్కడికి వెళ్ళి రోగిని చూశాడు. సీరియస్‌గా ఉండడంవల్ల ఆసుపత్రిలో చేర్చి, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి వైద్యసదుపాయాలు కల్పించాడు. కళ్యాణి కోరికపై ఆరాత్రి తెల్లవారినదాకా ఆసుపత్రిలోనే ఉండిపోయాడు. నిజానికి అతనికి వసుంధరగాని, కళ్యాణిగాని పరిచయమున్న వారు కాదు. అయినా కృష్ణమూర్తి కోసం ఇంత శ్రమపడ్డాడు. ఈ పని వృత్తిపట్ల అతనికి ఉన్న నిబద్ధతను, రోగుల పట్ల అతడు చూపే మానవతను వ్యక్తం చేస్తాయి. అలాగే ఎన్ని పనులున్నా, ఎంత తీరిక లేకపోయినా చక్రవర్తి ప్రతిరోజు రోగులను చూచి వచ్చేవాడు.

రామినాయుడికి వైద్యం చేయడానికి వసుంధర ఇంటికి వెళ్ళిన చక్రవర్తి అక్కడ కళ్యాణిని చూశాడు. మొదటి చూపులోనే ఆమెమీద అతనికి ఏదోతెలియని అభిమానం ఏర్పడింది. ఆమె తనకు ఎన్నో జన్మలనుంచి తెలిసి ఉన్నట్లు అనిపించింది. రామినాయుడి మంచం

ప్రక్కన కూర్చుని నిర్వికారంగా సేవలు చేసే కళ్యాణిని చూస్తే అతనికి ఆశ్చర్యం కలిగింది. ఆమెలో ఆ సమయంలో కనిపించే నిబ్బరం, గుండెధైర్యం, ఏమయినా మనం నిమిత్తమాత్రులమనే భావన అతనికి ఆమెపట్ల గౌరవాన్ని కలిగించాయి. అందుచేతనే ఆమె సంతోషంగా ఉండడం కోసం చక్రవర్తి పలువిధాలుగా ప్రయత్నించాడు. కృష్ణమూర్తి చేస్తానన్న సహాయం కళ్యాణి నిరాకరించినప్పుడు ఆమెను అంగీకరింపజేయడానికి ప్రయత్నించాడు. రామినాయుడు చనిపోయినప్పుడు కళ్యాణిని బాధనుంచి మరల్చడానికి యత్నించాడు. కళ్యాణి వసుంధర పిన్ని చేసిన అవమానంతో ఖిన్నురాలయి అప్రయత్నంగా చక్రవర్తి ఇంటికి వచ్చింది. చక్రవర్తి ఆమెను ఓదార్చాడు. ఆమెలో ఉన్న పిరికితనాన్ని పోగొట్టాడు. మనుషులపట్ల ఆమెకు పోయిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించాడు. తన ప్రేమను వెల్లడించాడు. ఆమె అభిప్రాయాలను తెలుసుకున్నాడు. వాటిని గౌరవించడానికి అంగీకరించాడు. ఆమెను తనతో వివాహానికి ఒప్పించాడు. పరస్పరం అర్థం చేసుకోడానికి అవకాశం కలుగుతుందనే ఉద్దేశంతో విశాఖపట్టణం నుంచి కారులో తిరుపతికి వెళ్ళి పెళ్ళి చేసుకుందామని ఆమెను అంగీకరింపజేశాడు.

చక్రవర్తి సమస్యలను సులువుగా పరిష్కరిస్తాడు. సమస్యలకు మంచి పరిష్కారాలు చూపిస్తాడు. రామినాయుడు కొడుకులు శవాన్ని తీసుకెళ్ళడానికి గందరగోళం సృష్టిస్తే వారిని బెదిరించినవాడు చక్రవర్తే. వసుంధర అడిగిన వెంటనే కృష్ణమూర్తిని పట్టుకోవడం కోసం తిరిగింది చక్రవర్తే. అలాగే కృష్ణమూర్తి ఇందిరను వివాహం చేసుకుంటానని చెప్పినప్పుడు, అతని నిశ్చయాన్ని విని తగిన సలహాలిచ్చినవాడు చక్రవర్తే. వ్యక్తులు ఏయే పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తారో అర్థం చేసుకోగల విచక్షణా జ్ఞానం అతనికి ఉంది. చక్రవర్తి తన మిత్రులు ఇబ్బందుల్లో ఉంటే చూచి సహించలేడు. ఆ సమస్యలు, కష్టాలు తనవిగా భావించి సహాయం చేస్తాడు. అందుచేతనే అతనికి మంచి స్నేహితులు లభించారు. అతని క్షేమం కోసం తపించే స్నేహితులు దొరికారు. చక్రవర్తి, కళ్యాణి రావడం కొంచెం ఆలస్యమయితే కృష్ణమూర్తి కంగారుపడ్డాడు. డాక్టరు గోపాలరావు దంపతులు చక్రవర్తి, కళ్యాణి వివాహం అయ్యేవరకు అన్ని పనులు తామే నిర్వహించారు.

చక్రవర్తి వృత్తిరీత్యా డాక్టరయినా అతని మనస్సు అమృతం. కష్టాల్లో ఉన్నవారిని డాక్టరుగా చూడక మనస్సున్న మనిషిగా చూడడం చక్రవర్తి గొప్పతనానికి నిదర్శనం. వైద్య వృత్తి ధనార్జనకు కాదని మానవసేవ కోసమని నమ్మినవాడు. మనుషులను అర్థం చేసుకోవడం. బాధల్లో ఉండే మనసులను సేద తీర్చడం అతనికి తెలుసు. జీవితంలో తల్లి, తండ్రి, భార్య వలన అనేక కష్టాలు అనుభవించినవాడు కావడం చేత అతనికి మనుషుల మనసులను అంచనా వేయగలిగిన శక్తి వచ్చింది. జీవితంలో విలువలకు, స్నేహానికి, ప్రేమకు ప్రాధాన్యం ఇవ్వడం తప్ప అతనికి కల్ల, కపటం తెలియవు. ఒక నమ్మకం, ఒక విశ్వాసం లేకపోతే బ్రతుకలేరని అతని నమ్మకం. ఒక విశ్వాసం సడలి పోతే మరో విశ్వాసాన్ని వెతుక్కోవాలని, దాని ఆసరాతో బ్రతకాలని అతని నమ్మకం. కష్టాలెదురయినా మొక్కవోని ధైర్యం, సడలని ఆత్మవిశ్వాసం అతని సొంతం. కాలాతీత వ్యక్తులు నవలలో చక్రవర్తి పాత్ర ఒక్కటే పురుష పాత్రలలో లోపాలు లేనిది. మిగిలిన పురుషపాత్రలన్నీ ఏవో లోపాలతో కూడి ఉన్నవే. కళ్యాణి వంటి ఉత్తమురాలికి చక్రవర్తి వంటి ఉత్తముడు లభించడం మంచిదయింది.

**3.20. 1. వసుంధర సంస్కారాన్ని విశదీకరించండి.**

వసుంధర కళ్యాణితోపాటు ఆనర్సు చదివే అమ్మాయి. ధనవంతుల ఇంట్లో పుట్టి గారాబంగా పెరిగింది. ఆమె తండ్రి ప్లీడరీ చేసి రెండు చేతులా సంపాదించాడు. వసుంధర చిన్నపిల్లగా ఉన్నప్పుడే తండ్రి మరణించాడు. వసుంధరకు నలుగురు సోదరులు. నలుగురికి ఒక్కతే సోదరి కావడంవల్ల వారామెను అల్లారుముద్దుగా పెంచారు. ఆమె అన్నల్లో ముగ్గురు మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. చివరి అన్నయ్య ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఆమె వదినలకు కూడా వసుంధర అంటే అపరిమితమైన అభిమానం. పొరపొచ్చాలు లేని కుటుంబంలో అందరి మమతానురాగాల మధ్య పెరుగుతున్న వసుంధర చదువుకోసం విశాఖపట్నం వచ్చింది. ఆమెకోసం ఆమె అన్నయ్యలు ప్రత్యేకంగా ఒక ఇల్లు తీసుకున్నారు. ఆమెకు తోడుగా ఉండడానికి ఒక పిన్నిని పంపించారు. వంటపని, ఇంటిపని పిన్ని చూసుకుంటూ ఉంటే వసుంధర కాలేజికి వెళ్ళి చదువుకుంటూ ఉండేది.

వసుంధరకు కళ్యాణి క్లాస్‌మేట్ అయినా వారిద్దరి మధ్య పరిచయం తప్ప స్నేహంలేదు. కళ్యాణి తండ్రికి ఆరోగ్యం సరిగా లేక ఆమె స్వగ్రామం వెళితే కళ్యాణి చదువుమాని ఇంటికి వెళ్ళిందంటూ ఇందిర ప్రచారం చేసింది. తన గ్రామం వెళ్ళి వస్తున్న వసుంధరకు రైలులో కళ్యాణి కనిపించింది. తండ్రిపోయిన దుఃఖంలో ఉన్న కళ్యాణితో మాట్లాడితే వసుంధరకు కళ్యాణి తండ్రి పోయిన విషయం, ఆదరించే వారు లేకపోవడం మొదలయిన విషయాలు తెలిశాయి. వసుంధర కళ్యాణి స్థితికి ద్రవించి పోయింది. తన ఇంట్లో తనతోపాటు ఉండి చదువుకోమని కోరింది. ఇందిర, ప్రకాశం ప్రవర్తనతో కళ్యాణి ఇందిర ఇంటినుంచి వసుంధర ఇంటికి వచ్చేసింది. ఆనాటి నుంచి

వసుంధర కళ్యాణికి అంతులేని సహాయం చేసింది. కళ్యాణి అటెండెన్స్ విషయంలో ప్రిన్సిపాల్‌ను కలిసింది. కృష్ణమూర్తితో చెప్పి కళ్యాణి పరీక్షరాయడానికి తగిన విధంగా చేయమని అడిగింది. కళ్యాణి కోసం రామినాయుడు వస్తే అతనికి ఆతిధ్యమిచ్చి గౌరవించింది. రామినాయుడు గుండెనొప్పితో ఆసుపత్రిలో చేరితే కళ్యాణితో పాటు తానుకూడా ఆ రాత్రంతా ఆసుపత్రిలో ఉండిపోయింది.

కళ్యాణికి సహాయం చేయాలనే ఉద్దేశంతో కృష్ణమూర్తి వసుంధర ఇంటికి వచ్చాడు. అప్పటినుంచి అతడు తమపట్ల చూపుతున్న శ్రద్ధ, సంస్కారం ఉట్టిపడే ప్రవర్తన, సమస్యలకు స్పందించే తీరు, అవసరమేర్పడినప్పుడు సహాయపడే స్వభావం వసుంధర మనస్సుకు నచ్చాయి. ఆమె కృష్ణమూర్తితో, చక్రవర్తితో మాట్లాడడం, కలిసితిరగడం ఆమె పిన్ని సహించలేకపోయింది. వసుంధర అన్నయ్య వచ్చినప్పుడు అతనితో చెప్పింది. ఆయన సూటిగా చెప్పకుండా సూచన ప్రాయంగా వసుంధరను మందలించాడు. గొప్ప కుటుంబంలో పుట్టిన స్త్రీ ఎలా నడచుకోవాలో తెలియజెప్పాడు. వసుంధర మౌనంగా విన్నది. నాటినుంచి ఇంట్లో పిన్ని రుసరుసలు అధికమయ్యాయి. తనవల్లనే ఆ ఇంటి వాతావరణం మారిపోతున్నదని గ్రహించిన కళ్యాణి మరొక ఇల్లు తీసుకొని వెళ్ళడానికి సిద్ధపడింది. ఆమె నిర్ణయాన్ని కాదు అనలేని తన నిస్సహాయతకు వసుంధర మౌనంగానే బాధపడింది. ఎక్కడున్నా కళ్యాణి సుఖంగా ఉంటేచాలు అనుకుంది. కళ్యాణి పుట్టినరోజున ఆమెను తన ఇంటికి భోజనానికి ఆహ్వానించింది.

కృష్ణమూర్తి ప్రవర్తన నచ్చడంవల్ల వసుంధర అతనికి చేరువకావాలనుకుంది. వారిద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు హద్దులు దాటి ఎరుగని వసుంధర, కృష్ణమూర్తి చేతిని పట్టుకొని తన ప్రేమను వ్యక్తం చేసింది. ఇంట్లో వాళ్ళు దీనిని వ్యతిరేకిస్తారని తెలిసినా ఆమె అతడినే వివాహమాడాలని తలచింది. కృష్ణమూర్తి ఆమె తనను పరీక్షిస్తున్నదని అనుకున్నాడు. తాను ఆమెకు తగ్గవాడను కానని నిర్ణయించుకున్నాడు. అప్పుడే అతడు ఇందిరతో తప్పుచేశాడు. ఆనాటి నుంచి కృష్ణమూర్తి వసుంధరను కలుసుకోడానికి ఇష్టపడలేదు. వసుంధర వ్యక్తిత్వం, గాంభీర్యం అతనిని భయపెట్టాయి. కృష్ణమూర్తితో మాట్లాడాలని వసుంధర ప్రయత్నించింది. అతడామెకు ఆ అవకాశం ఇవ్వలేదు. చక్రవర్తి ద్వారా ఇందిర, కృష్ణమూర్తి వివాహం గురించి విన్నది. తిరుపతిలో వారి వివాహం అని తెలుసుకొని మనస్ఫూర్తిగా ఆ వివాహానికి హాజరయింది. ఆమె కృష్ణమూర్తిపై కోపాన్ని ప్రదర్శించలేదు. ఇందిర పట్ల అసూయను చూపలేదు. దీనిని బట్టి ఆమె వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైందో, ఆమె సంస్కారం ఎంత గొప్పదో తెలుస్తుంది.

ఇతరుల కష్టాలను చూస్తే వసుంధర కరిగిపోతుంది. రైలులో వృద్ధురాలు నిలబడి ఉంటే లేచి ఆమెకు సీటు ఇచ్చింది. ఆమెది జాలిగుండె అయిన కోపం వస్తే నిప్పులు కురిపిస్తుంది. తన ఇంటికి వచ్చిన కళ్యాణిని పిన్ని తన సూటిపోటి మాటలతో అవమానం చేసిందని గ్రహించినప్పుడు వసుంధర కోపంతో ఊగిపోయింది. రౌద్రమూర్తి అయింది. ఆమెను కేకలు వేసింది. ఆమె కూడా వెళ్ళిపోతాను అంటూ బెదిరించింది. దానితో వసుంధర కోపం కట్టలు తెంచుకుంది. నోర్మూయ్ అంటూ గద్దించింది. ఎన్నడూ వసుంధరలో కోపాన్ని చూడని పిన్ని హడలిపోయింది. పిల్లిలా ఒక చాపపరచుకొని ఒకమూలన పడుకున్నది.

కళ్యాణి తన ఇంట్లో చేరిన తర్వాత వరుసగా జరిగిన సంఘటనలు ఆమె చదువుకు ఆటంకం కలిగించాయి. చదువు మీద ఆసక్తి అధికంగా ఉన్న వసుంధర చదువు సాగటంలేదని గుర్తించింది. నాటినుంచి పరీక్షల్లో తప్పకుండా ఉండడానికి కష్టపడి చదవడం ప్రారంభించింది.

వసుంధరకు కళ్యాణితో మాట్లాడేవరకు జీవితంలో కష్టాలుంటాయని తెలియదు. జీవితమంటే సుఖాలపూలపాన్పు అని ఆమె ఉద్దేశం. వసుంధర సౌమ్యురాలు, సంస్కారవతి., స్నేహశీలి, ఆమె యోగ్యురాలు, బుద్ధిమంతురాలు, దయార్ద్రహృదయ. ఒక స్త్రీలో ఏయే మంచిగుణాలుంటే సమాజం హర్షిస్తుందో, ఆ లక్షణాలన్నీ కలబోసిన రూపవతి వసుంధర.

**3.20. 2. రామినాయుడు పాత్రను రచయిత్రి తీర్చిదిద్దిన విధం తెలుపండి.**

కళ్యాణి స్వగ్రామమయిన నందూరు గ్రామానికి రామినాయుడు మున్సబు. కళ్యాణి తండ్రి అచ్యుతరామయ్యకు స్నేహితుడు. అచ్యుతరామయ్యకు అప్పుఇచ్చిన వాళ్ళలో రామినాయుడు కూడా ఒకడు. అంతేకాదు. అతనికి స్నేహితుడు కూడా. అచ్యుతరామయ్య అనంతవాయువుల్లో కలిసిపోయాక కళ్యాణి ఒంటరిదైపోయింది. ఆస్తి అప్పులకు పోగా ఒట్టి చేతులతో వైజాగ్ బయలుదేరింది. తన కళ్ళముందు పెట్టిపెరిగిన పిల్ల తనను బాబయ్యా అంటూ చనువుగా పిలిచే పిల్ల ఎక్కడికో దూరంగా వెళ్లతానంటే ఆయనకు బాధకలిగింది. నిజంగా కళ్యాణి పట్ల తనకంత ప్రేమ ఉందనే విషయం ఆయనకే తెలియదు. అవసాన దశలో తండ్రికి సేవలు చేయడం, తండ్రి

మరణించినప్పుడు పుట్టెడు దుఃఖంతో కళ్ళనీళ్ళు లేకుండా నిశ్చేష్టురాలిలా అలా నిలబడి పోవడం రామినాయుడికి ఆశ్చర్యం కలిగించాయి. ఆమెను కొంతకాలం తమ ఇంట్లో ఉండమని రామినాయుడు కోరినా ఆమె అంగీకరించలేదు. తన తండ్రి కోరిక తీరాలంటే తాను చదువుకోవలసిందేనని పట్టుపట్టింది. రామినాయుడు ఆమెకు ఆర్థికంగా సాయం చేయాలనుకున్నాడు. సెలవులు వస్తే తమ ఇంటికి వచ్చి ఉండమని చెప్పి, కొంతడబ్బు ఆమెచేతిలో పెట్టి ఆమెను విశాఖపట్టణం పంపించాడు. కొంతకాలం తరువాత రామినాయుడు కళ్యాణి వాళ్ళ ఇల్లు అమ్మివేశాడు. అందులో పద్నాలుగువందలు, చిల్లరబాకీలు రెండువందలు తీర్చివేశాడు. ఇంకా వేయి రూపాయలు మిగిలి ఉన్నాయి. ఆ డబ్బు కళ్యాణికి ఇవ్వాలనే ఉద్దేశంతో విశాఖపట్నం వచ్చి అడ్రసు తెలుసుకొని వసుంధర ఇంటికివచ్చాడు.

రామినాయుడు కళ్యాణికి డబ్బు ఇచ్చి ప్లీడరుతో మాట్లాడడానికి వెళ్ళాలి అనుకున్నాడు. కాని వసుంధర, కళ్యాణి బలవంతం చేయడంతో భోజనానికి రావడానికి అంగీకరించాడు. తాను తెచ్చిన వేయిరూపాయలు ఆమెకు ఈయబోయాడు. ఆమె ఆ సొమ్మును బాకీ కింద ఉంచుకోమని చెప్పింది. తాను, తన కుమారులు ఆ సొమ్ము లేకపోయినా హాయిగా బ్రతికే స్థితిలో ఉన్నామని, అవసరాలకు వాడుకోమని ఇవ్వబోయాడు. ఆమె తీసుకోలేదు. ఆయన వసుంధర చేతికి ఇచ్చాడు. బయటకు వెళ్ళి పనులు చూసుకుని మధ్యాహ్నం వసుంధర ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. అతనికి ఆయాసంతో ఊపిరాడలేదు. తానక్కడ ఉండే కళ్యాణికి ఇబ్బంది అని అంత అనారోగ్యంలో కూడా అక్కడనుంచి వెళ్ళిపోవాలనుకున్నాడు. కళ్యాణి, వసుంధర అంగీకరించలేదు. కృష్ణమూర్తి ద్వారా డాక్టరు చక్రవర్తి వచ్చి పరీక్ష చేశాడు. గుండెనొప్పి అని గ్రహించాడు. ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రిలో చేర్పించాడు. రామినాయుడు ఊరికి వెళ్ళాలనే అనుకున్నాడు. కాని డాక్టరు ఆస్థితిలో ప్రయాణం మంచిది కాదని చెప్పాడు. ఆయనను బ్రతికించడానికి డాక్టర్లు శతవిధాలా ప్రయత్నించారు. ఆక్సిజను పెట్టారు. ఇంజక్షన్లు చేశారు. అయినా ప్రయోజనం కలుగలేదు. అతనికి అంత్యదశ సమీపించిందని అర్థమయింది. అతడు తన అవసానదశలో కళ్యాణికి ఏదో చెప్పాలని తాపత్రయపడ్డాడు. ఆమెకేమి చెప్పదలచుకున్నాడో తెలియదు కాని ఏమీచెప్పకుండానే చెప్పలేని లోకాలకు వెళ్ళిపోయాడు. రామినాయుడిని ఆసుపత్రిలో చేర్పించిన దగ్గరనుంచి కళ్యాణి ఆయన మంచం ప్రక్కనే ఉండి సేవలు చేసింది.

రామినాయుడు శరీరాన్ని మార్చురీలో ఉంచి, మరణవార్త చెప్పడానికి కృష్ణమూర్తి వాళ్ళ ఊరు వెళ్ళాడు. ఆ కబురు విని ఆయన సంతానం ముందు ఏడ్చినా డబ్బుకోసం తన తండ్రిని చంపారని అభాండాలు వేశారు. రామినాయుడు వసుంధరకు ఇచ్చిన వేయిరూపాయలు కృష్ణమూర్తి వారికి ఇచ్చివేశాడు. తర్వాత విశాఖపట్నం వచ్చిన రామినాయుడు కొడుకులు ఆసుపత్రిలో నానాగొడవ చేయడానికి ప్రయత్నించారు. డాక్టర్ చక్రవర్తి దబాయించేసరికి వారు తండ్రి శవాన్ని తీసుకొని వెళ్ళిపోయారు.

రామినాయుడు వృద్ధుడైనా ధైర్యం ఎక్కువే. తన కళ్ళముందు అన్యాయం జరుగుతుంటే చూచి సహించే తత్వం కాదాయనిది. ఒకసారి కృష్ణమూర్తి, అతని స్నేహితులు ఒక అమ్మాయిని గొడవచేస్తుంటే చూసిన రామినాయుడు కృష్ణమూర్తిని జుట్టుపట్టుకొని ముందుకులాగి చెంపమీద చాచి కొట్టాడు. కృష్ణమూర్తి, నీవు ఎవరివంటూ ఎదిరించబోయాడు. కొండమీద ఎవరైనా ఆడపిల్లలను గొడవచేస్తే రక్తం కళ్ళజూస్తానంటూ బెదిరించాడు. అది ఆయన పెద్దరికానికి, గొప్పతనానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. సంవత్సరానికి రెండుసార్లు చొప్పున నలభై సంవత్సరాలపాటు క్రమం తప్పకుండా సింహాచలం వెళ్ళేవాడంటే రామినాయుడి దైవభక్తిని మెచ్చుకోవచ్చు.

రామినాయుడు పరోపకారం తెలిసినవాడు. పదిమందికి మంచి జరగాలని కోరుకునేవాడు. అనురాగం, ఆత్మీయత మూర్తీభవించినవాడు. తనవలన ఇతరులు ఇబ్బంది పడకూడదని తలచే మంచి మనసు ఆయనది. దురదృష్టవశాత్తు అలాంటి మంచిమనిషికి ధనాన్ని ప్రాణంగా భావించే మనుషులు సంతానంగా పుట్టారు. తనకు సహాయం చేయాలని తపించిన రామినాయుడికి సేవచేసే అదృష్టం కళ్యాణికి లభించింది. రామినాయుడులాగా సమాజంలో అందరు ఆనందంగా ఉండాలని ఆశించేవారు అరుదుగా ఉంటారు.

**3.20. 3. శేషావతారం పాత్రలోని దుష్టత్వాన్ని చిత్రీకరించండి.**

శేషావతారం ప్రకాశానికి మేనమామ. నిడదవోలుకి నాలుగుమైళ్ళ దూరంలో ఉన్న వేలవెన్ను అతని స్వగ్రామం. ఆ గ్రామంలో వారి తాతతండ్రులు సంపాదించిపెట్టిన మండువాలోగిలిలో శేషావతారం, ప్రకాశం తల్లి పుట్టారు. శేషావతారం ఆరడుగుల ఎత్తుతో నల్లగా

ఉంటాడు. అతడు బడికి వెళ్ళి చదువుకోలేదుగాని, జీవితమనే బడిలో సమస్త జ్ఞానం సంపాదించాడు. అతనికి ధనం తప్ప, ధనార్జన చేయడానికి మార్గాలు అన్వేషించడం తప్ప వే అలోచనలు ఉండవు. తప్పుడు సాక్ష్యాలు చెప్పడం, దొంగదస్తావేజులు తయారుచేయడం, వితంతువుల ఆస్తులు కాజేయడం అతనికి తెలిసినట్టు మరెవ్వరికీ తెలియదు. అతని దృష్టిలో డబ్బు సంపాదించిన వాడు నీతిమంతుడు. ఎలా సంపాదించాడనే దాని కన్నా ఎంత సంపాదించాడన్న దానిమీదనే అతని దృష్టి ఉంటుంది. ధనం సంపాదించలేనివాడు అతని దృష్టిలో నీతిలేనివాడు. పక్షికి ఎగరడం, చేపకు ఈదడం ఎలా సహజగుణాలో, మనిషికి డబ్బుసంపాదించడం అలాగే సహజగుణమని అతని నమ్మకం. డబ్బు కోసం ఏపని అయినా చేయవచ్చని, ధనార్జనకు మీనమేషాలు లెక్కించడం తెలివితక్కువని అతని ప్రగాఢ విశ్వాసం.

ప్రకాశం తల్లిపేరు వెంకాయమ్మ. ఆమె శేషావతారం చెల్లెలు. ప్రకాశం చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. భర్త వియోగంతో ఉన్న వెంకాయమ్మను శేషావతారం తన ఇంటికి తీసుకువచ్చాడు. భర్త మరణించేనాటికి వెంకాయమ్మకు పదెకరాల పొలం ఉండేది. శేషావతారం చెల్లెలి కుటుంబం మీద అజమాయిషీతో పాటు ఆమె ఆస్తి మీద అధికారం సంపాదించాడు. చెల్లెలి మీద ప్రేమ నటించే శేషావతారం క్రమశిక్షణ పేరుతో చిన్నతప్పుకే ప్రకాశాన్ని కొట్టేవాడు. ప్రకాశం పెరిగిపెద్దవాడయినా తనను చూచి భయపడాలని, తనను ఎదిరించకూడదని, ఆస్తి విషయాలు తనను అడగకూడదని, తన మాట ప్రకారం నడుచుకోవాలని శేషావతారం అభిప్రాయం. శేషావతారం చెల్లెలి మాటప్రకారం ప్రకాశాన్ని మెడిసిన్‌లో చేర్పించాడు. చెల్లెలి పొలాలను అమ్మి ప్రకాశాన్ని చదివిస్తానని ఆమెతో చెప్పి, అ తరువాతనే ప్రకాశాన్ని చదివించడానికి అంగీకరించాడు. చదువు నెపంతో చెల్లెలి ఆస్తిని అమ్ముతూ, కొంత ప్రకాశం చదువుకు ఖర్చుచేస్తూ , కొంత తాను రాజమండ్రిలో కట్టే ఇంటికోసం వినియోగించుకున్నాడు. సొమ్ము చెల్లెలిదయినా ఆ సొమ్ము మేనల్లుడికి పంపడం అతనికి బాధగా ఉండేది. ప్రకాశం చదువు పూర్తయ్యేనాటికి అతని ఆస్తి మొత్తం అయిపోయిందని నిరూపించడానికి తగిన లెక్కలన్నీ సిద్ధం చేసుకున్నాడు. వెంకాయమ్మ అమాయకురాలు కావడం చేత తన కొడుకు చదువుకోసం శేషావతారం ఎంతో కష్టపడుతున్నాడని అనుకునేది. అతని సహాయం లేకపోతే తాను, తన కొడుకు ఏమయిపొయ్యేవాళ్ళమో అని బాధపడేది. మేనల్లుడి చదువుకోసం తాను అప్పులు చేయవలసివస్తుందని, తను చేసిన అప్పులపై వడ్డీలు కట్టడానికి తలప్రాణం తోకకు వస్తుందని ప్రచారం చేసేవాడు.

శేషావతారం రాజమండ్రిలో కట్టే ఇల్లు పూర్తయ్యేనాటికి ఐదువేల రూపాయలు అప్పుచేయవలసివచ్చింది. ప్రకాశానికి పెండ్లిచేసి, కట్నంగా వచ్చిన సొమ్ముతో అప్పుతీర్చాలని భావించిన శేషావతారం గొప్ప కట్నం ఇచ్చే సంబంధాల కోసం వెతకటం ప్రారంభించాడు. ప్రకాశం మీద కోపంతో జగన్నాథం ప్రకాశం ఆడపిల్లలతో తిరుగుతున్నాడని ఆ రోజుల్లోనే ఉత్తరం వ్రాశాడు. ఆలస్యం చేస్తే ప్రకాశం చేతికి అందడని, అతడు ఆడపిల్లల వలలో చిక్కుకోకముందే వివాహం చేసి కట్నం చేజిక్కించుకోవాలని అనుకున్న శేషావతారం విశాఖపట్నం బయలుదేరాడు. ఈలోపునే రాజమండ్రిలో బాగా డబ్బున్న సంబంధం ఒకటి చూశాడు. నల్లని నలుపు, ఎత్తు పళ్ళు, వాళ్ళిచ్చే కట్నం ముందు శేషావతారానికి కనిపించలేదు. ఆ సంబంధం ప్రకాశానికి నిశ్చయించి, వెంకాయమ్మకు చెప్పి విశాఖపట్నం వచ్చాడు.

శేషావతారం విశాఖపట్నంలో వాకబు చేసి ప్రకాశాన్ని పట్టుకున్నాడు. ఆడపిల్లలతో తిరుగుతున్నావంటూ చిందులు త్రొక్కాడు. ప్రకాశం ఇంటికి వచ్చి అంతుచూస్తానంటూ బెదిరించాడు. మరునాడు ఇంటికి వచ్చి ఇందిరను, ఆనందరావును బూతులతో హడలుగొట్టాడు. ఉద్యోగం పీకిస్తానని హెచ్చరించాడు. పరువు తీస్తానంటూ ఆనందరావు మీద నిప్పులు కక్కాడు. దీనికంతకు కారణం కళ్యాణి అని ఆ కళ్యాణిని కృష్ణమూర్తి తెచ్చాడని ఆనందరావు అబద్ధం చెప్పడంతో కృష్ణమూర్తి గదికి వెళ్ళి నానామాటలూ అన్నాడు. ఇలా మూడు రోజులపాటు హడావుడి చేసిన శేషావతారం వాళ్ళందరిని లొంగదీసుకోవడం కష్టంకాదని గ్రహించాడు. తన మేనల్లుడు తన చేయి దాటిపోలేదని, తన పని సాధించుకోవచ్చునని అనుకున్నాడు.

శేషావతారం ప్రకాశాన్ని తీసుకొని స్వగ్రామం బయలు దేరాడు. రైల్లోనే ప్రయోజకత్వం అంటే ఆడపిల్లలతో కులకడం కాదని, కులికినా డబ్బున్న వారితో ప్రేమతో కులకాలని ప్రకాశానికి ఉపన్యాసం ఇచ్చాడు. పెళ్ళి విషయంలో కూడా నా అభిప్రాయం అక్కరలేదా? అంటూ ప్రశ్నించిన ప్రకాశానికి తాను చూసిన పిల్లను చేసుకోవలసిందే అంటూ తెగేసి చెప్పాడు. పెండ్లి అయ్యేదాకా ఇల్లు దాటకూడదని, మంచి ముహూర్తం చూసుకొని రాజమండ్రి వెళ్ళి పిల్లను చూద్దామని ఆంక్షలు విధించాడు. పిరికివాడయిన ప్రకాశం శేషావతారం మాటని

కాదనే ధైర్యం లేక ఆ పిల్లనే వివాహమాడి వాల్తేరులో కాపురం పెట్టాడు. తాను అనుకున్న పని అనుకున్నట్లు సాధించడంలో శేషావతారం దిట్ట అని ఋజువుచేసుకున్నాడు.

శేషావతారం డబ్బు కోసం మనుషులతో కూడా వ్యాపారం చేసేవాడు. అవసరాన్ని బట్టి డబ్బు గుంజేతత్వం అతని సొంతం. కుంటిది అయిన రామప్ప కూతురికి అమలాపురంలో ఒక సంబంధం చూశాడు. దాన్ని ఖాయం చేశాడు. రామప్ప ఇల్లు తాకట్టు పెట్టించి రెండువేలు అప్పు ఇప్పించాడు. అప్పు ఇప్పించినందుకు ఐదువందలు, సంబంధం కుదిర్చినందుకు రెండువందలు తీసుకున్నాడు. సంబంధం కుదిర్చానంటూ అమలాపురం వారి నుంచి నూటపదహార్లు లాక్కున్నాడు. ఇది అతని అమానుషత్వానికి ఒక్క ఉదాహరణ మాత్రమే.

శేషావతారం తన పనులను క్రమపద్ధతిలో చేసుకుంటాడు. ప్రకాశాన్ని బెదిరించడానికి విశాఖపట్నం వచ్చిన శేషావతారం అరకులోయకు వెళ్ళి అక్కడ స్థలాలు బేరం చేశాడు. అలాగే రాజమండ్రి వెళ్ళినప్పుడు అక్కడినుంచి మరో ఊరికి వెళ్ళి సొంతవ్యవహారం చూసుకున్నాడు. అసలు చిన్నతనం నుంచి పెంచే తీరులో అతను చూపిన దూరదృష్టి అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది.

శేషావతారం ఒకపులి. అతనికి ఆహారం డబ్బు. అతని సమయస్ఫూర్తి, ఇతరులను తనకు అనుకూలంగా మలచుకునే విధానం, పని సాధించుకునే పద్ధతి, వ్యూహాలు పన్నడంలో ఉన్న నేర్పరితనం చూస్తే ఆశ్చర్యం కలుగుతాయి. సమయానుకూలంగా మాట్లాడే లౌకికత్వం, తన వాక్చాతుర్యంతో ఇతరులను పడగొట్టే నేర్పు, అంతులేని లోభితనం అతనిలోని గుణాలు. అతనికి నీతినియమాలు, సంప్రదాయాలు, ధర్మాధర్మాలు, న్యాయాన్యాయాలు, మంచి చెడ్డలు అనేవిలేవు. అలా విశ్లేషిస్తే శేషావతారం దుష్టుడు. దుర్మార్గుడు అని చెప్పుకోవచ్చు.

**3.20. 4. ఆనందరావు పాత్రలోని లోపాలను వివరించండి.**

ఆనందరావు ఇందిరకు తండ్రి, అతని తండ్రి ఠాణేదారు. అతనికి ఆ రోజుల్లో నెలకు ఎనిమిది రూపాయల జీతం వచ్చేది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే కాలానికి ఆనందరావు మెట్రిక్ పాసయ్యాడు. తండ్రి మరణించడంతో ఇద్దరు వితంతు మేనత్తలు, తల్లితో సంసార బాధ్యత నెత్తిమీద పడింది. ఎవరినో ఆశ్రయించి ఆనందరావు తాలుకా ఆఫీసులో గుమస్తాగా చేరాడు. ఆ తర్వాత ఒక అనాకారి అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. సంతానం కలిగింది, కాని పుట్టినవాళ్ళు పురిటిలోనే చనిపోయారు. పిల్లలు బతకాలని మేనత్తలు పూజలు చేసేవారు. భార్యకు అనారోగ్యం. జీతం సరిపోయేది కాదు. తనతో చదువుకున్న కొంతమంది లాయర్లుగా, డాక్టర్లుగా దర్జాగా ఉండడం చూచి, తానూ హోదా ప్రదర్శించడం అలవాటు చేసుకున్నాడు. తాలుకాఫీసునుంచి కలెక్టరు ఆఫీసుకి మారాడు. అక్కడ దొరల దర్జా, వారిభోగం చూశాడు. మొదట దొరలకు కావలసిన అవసరాలు చూస్తుండేవాడు. భార్యవలన సుఖం అనిపించలేదు. అదే సమయంలో ఒక భోగం స్త్రీ తోడయింది. ఇంట్లో దొరకని సుఖం ఆమె దగ్గర దొరికింది. అతనికి ఆమె లోకమయింది. అతనికి భోగాలు పెరగడంతో డబ్బు అవసరాలు పెరిగాయి డబ్బుకోసం తప్పుదారి తొక్కక తప్పనిసరి అయింది. అతడు చేసిన తప్పుడు పనులు బయటపడి ఉద్యోగం ఊడింది. ఒక సంవత్సరం నానాకష్టాలుపడిన తర్వాత రైల్వేలో ఉద్యోగం సంపాదించాడు. ఆరోజుల్లో అతని ఇద్దరు మేనత్తలు మరణించారు. భార్య ఇందిరను ప్రసవించి మంచాన పడింది. జూదం, తాగుడు అలవాటయ్యాయి. ఉద్యోగంలో చేసిన పొరపాటు అతనికి శాపమై జైలుపాలయ్యాడు. జైలునుంచి వచ్చే లోపు భార్య పోయింది. కూతురు చదువుకొని రైల్వేలో ఓ ఉద్యోగం సంపాందించింది. కూతురి సంపాదనతో ఆనందరావు కులాసాగా గడపటం నేర్చుకున్నాడు. ఇందిర తండ్రిని పోషించడం తన బాధ్యత అని అతనిని ఆదరించింది. ఆమె సంపాదించిన డబ్బుతో ఆనందరావు మంచి బట్టలు కొనుక్కునేవాడు. చుట్టలు తాగేవాడు. అప్పుడప్పుడు మిత్రులతో మందు సేవించేవాడు. ఏదన్నాపని చేయాలని అతడేనాడూ అనుకోలేదు. ఏమీతోచకపోతే ఒక్కడే పేకాట ఆడుకునేవాడు.

ఆనందరావు ఏ విషయాన్ని మనస్సుకు పట్టించుకోడు. అంటీఅంటనట్టు, ముట్టీ ముట్టనట్టు తామరాకు మీద నీటిబొట్టులా ఉండేవాడు. తన కూతురు ఇందిర ఆదివారం ఆఫీసరుతో పిక్నిక్‌కి వెళ్ళినా, ప్రకాశంతో బీచ్‌కి వెళ్ళినా, కృష్ణమూర్తితో పిక్చర్‌కి వెళ్ళినా తనకు తెలియనట్లు, తన విషయం కాదన్నట్లు ఉండేవాడు. ఆమె అలా పరపురుషులతో వెళ్ళకూడదని కాని, ఆమెకు వివాహం

చేయాలనే ఆలోచనగాని, వివాహం చేయాలంటే ఇలాంటి తిరుగుళ్ళు అవరోధం అవుతాయని గాని అతడెప్పుడు అనుకోలేదు. ఏదో నిర్లిప్తత, ఉదాసీనవైఖరి అతనితో ఉండడం, తాను ఏమీ చేయలేనప్పుడు, తాను కల్పించుకోవడం అనవసరమనే ఆలోచన అతనికి కలిగి ఉండవచ్చు. తన గురించి తప్ప ఇతరుల గురించి ఆలోచించడం ప్రారంభిస్తే తనకు సుఖం లేకుండాపోతుందనే భావన అతనికి ఉండడం చేతనే ఏమీ తెలియని వాడిగా నటిస్తున్నాడని భావించవచ్చు.

అప్పులు చేయడం, అయినకాడికి అందుబాటులో ఉన్న వారిని అవసరాలకు వాడుకోవడం ఆనందరావుకు బాగా తెలుసు. కృష్ణమూర్తి దగ్గర అప్పుచేయడమేకాక, అతనిచేత ఇంటి అద్దె కూడా కట్టించిన నేర్పరితనం అతనిది. ఆనందరావుకు అబద్దాలు చెప్పడం ఆవగింజతో సమానం.అవసరం వస్తే ఇతరులమీద అభాండాలు వేయడానికి కూడా వెనుకాడడు. కళ్యాణి ఇంట్లోంచి వెళ్ళినప్పుడు కృష్ణమూర్తితో ఎవరినో ఆశ్రయించి ఉంటుందని ఎంత దారుణంగా అభాండం వేశాడో, శేషావతారంతో కళ్యాణి ప్రకాశంతో సంబంధం పెట్టుకుందని అంత దారుణంగా అబద్ధం చెప్పాడు. తాను అబద్ధాలు చెప్పినట్లు తెలిసి కృష్ణమూర్తివంటి వారు నిలదీసినా పట్టించుకోడు. దులుపుకుపోతాడు.

ఆనందరావు మాటకారి. ఎవరినైనా తన మాటలతో సులభంగా ఆకట్టుకునే గుణం అతనిది. తన అనుభవాలు వర్ణించి చెప్పడం అతనికి ఇష్టం. మిన్ను విరిగి మీద పడినా చలించనివాడు ఆనందరావు. శేషావతారం తనమీద, తనకూతురిమీద బూతులతో ఎగబడినా చలించలేదతను. శేషావతారాన్ని బయటకు తీసుకుపోయి, కాఫీ ఇప్పించి, ఏవోకల్పించి చెప్పి, అతని కోపాన్ని తగ్గించిన లౌక్యుడు ఆనందరావు. అతనికి తాగుడువల్ల ఆరోగ్యం చెడిపోయింది. రక్తపోటుతో పాటు అప్పుడప్పుడు ఆయాసం. అయినా అతడా అలవాట్లను మానుకోలేదు. స్నేహితులువస్తే బ్రాందీ తాగడం అతనికి ఇష్టం. ఒకసారి ప్రొహిబిషన్ అని తెలిసి తన స్నేహితులతో తాగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. మూడు నెలల జైలు శిక్షకు యోగ్యుడయ్యాడు. కూతురు సంపాదిస్తుంటే, ఆ సంపాదనలో కొంత భాగాన్ని అతడు తాగుడికి ఖర్చు చేసే ఆనందరావు ఎలాంటి వాడో ఊహించుకోవచ్చు.

ఆనందరావుపై సదభిప్రాయం వ్యక్తం చేసినపాత్రలు కాలాతీత వ్యక్తులు నవలలో లేవు. ఆనందరావు జైలులో పడినప్పుడు ఎక్కడికి వెళ్ళాడని ఇందిరను కృష్ణమూర్తి అడిగితే తనకు పెండ్లి సంబంధం చూడడానికి వెళ్ళాడని ఆమె బదులిచ్చింది. అంతమంచి ఆలోచన చేయడని గట్టి నమ్మకం ఉన్న కృష్ణమూర్తి నమ్మలేదు. తాను నమ్మనని ఆమెను నిజం చెప్పమని రెట్టించి అడిగాడు. ప్రకాశానికి అతనంటే సదభిప్రాయం లేదు. కళ్యాణికి కాని, శేషావతారానికి గాని అతనిమీద మంచి అభిప్రాయం లేదు. అసలు ఇందిరకే తన తండ్రిమీద గౌరవం, అభిమానం లేవంటే ఆ పాత్ర ఎంతటి దుర్మార్గంతో కూడి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అతని స్నేహితులందరూ అతనిలాంటివారే. ఉద్యోగాలు పోగొట్టుకున్నవారు, జైలుకి వెళ్ళివచ్చినవారు, తాగుబోతులు, యౌవనమంతా విలాసంగా తిరిగినవారు తప్ప, అతనికి సంస్కారవంతుడైన ఒక్క స్నేహితుడు లేడు. దీనిని బట్టి ఆనందరావు ఎలాంటివాడో ఊహించుకోవచ్చు.

ఆనందరావుకు విచారించడం తెలియదు. ఉద్యోగం ఊడినా, పోలీసులు జైల్లో పెట్టినా, భార్య మరణించినా అతను నిబ్బరంగానే ఉన్నాడు. ఈడువచ్చిన పిల్ల వివాహం కాకుండా తన కళ్ళముందు పరపురుషులతో తిరుగుతున్నా అతను ధైర్యంగానే ఉన్నాడు. అతనికి దూరదృష్టి లేదు. ఆపద వస్తుందని తెలిసినా, ఆపద తలమీద పిడుగులా పడేవరకూ చలించడు. తలమీద పడే సమయం వస్తే కంటికి కనిపించిన వాడిని ఆస్థానంలో నిలబెట్టి తాను తప్పించుకు పోతాడు. తాను నిలబెట్టిన వాడు నిలువుగా నాశనమయినా అతనికి చీమకుట్టినట్టు కూడా అనిపించదు.

ఆనందరావు అవలక్షణాల పుట్ట. బాధ్యతలు ఎరుగనివాడు. వ్యసనాలకు బానిస. అప్రయోజకుడు. జీవితం గురించి ఆలోచన, అవగాహన లేనివాడు. విలాసాల మీద ఆశ చావనివాడు. స్వార్థబుద్ధి. తగాదాలు పెట్టడంలో నేర్పరి. జిత్తులమారి నక్క. సిగ్గు, అభిమానం లేనివాడు. ఇలాంటి వారివలన సమాజం నాశనమౌతుంది. జీవితాలు కూలిపోతాయి. సంసారాలు కాలిపోతాయి.

డాక్టర్. ఎస్. ఆదినారాయణ ఎం.ఏ., పి హెచ్.డి

రీడర్ & ప్రిన్సిపాల్

బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల

తాడికొండ

గుంటూరు జిల్లా - 522 236

## ఖండం - 4

# వ్యాకరణం

## పాఠం - 21

4.21. 0. పరిచయం
4.21. 1. ఉద్దేశం
4.21. 2. పాఠ్యభాగ సందర్భం
4.21. 3 సంధులు
4.21. 4 సమాసాలు.

**4.21. 0 పరిచయం:** ఇంతవరకు మీరు ఆయా పాఠ్యాంశాల గూర్చి తెలుసుకొన్నారు. ప్రస్తుతం ఆయా పాఠాల్లోని వ్యాకరణవిశేషాలను తెలుసుకొంటారు.

**4.21. 1. ఉద్దేశం:** భాషాభ్యసనానికి, భాషాభివృద్ధి చేసుకోవడానికి, వ్యాకరణం అవసరం. భాషను వివరించి, విశ్లేషించడానికి, వ్యాకరణం ఉపకరిస్తుంది.

**4.21. 2. పాఠ్యభాగ సందర్భం:** ఇందులో వ్యాకరణం ప్రత్యేకించి ఆయాపాఠాలలోని వ్యాకరణ విశేషాలు అంటే భాషలోని సంధులు, సమాసాలను గూర్చి తెలుసుకొంటారు.

### 4.21. 3. సంధులు

**(అ) సంస్కృత సంధులు :** సంస్కృత పదాలమధ్య జరిగే సంధులను సంస్కృత సంధులు అంటారు. మీ పాఠ్యభాగం ప్రకారం క్రింది సంస్కృత సంధులు నేర్చుకొంటారు, సంస్కృతసంధులు నాలుగు రకాలు.

1. సవర్ణదీర్ఘసంధి 2. గుణసంధి 3. యణాదేశసంధి 4. వృద్ధిసంధి.

**1 సవర్ణదీర్ఘసంధి:** అ, ఇ, ఉ, ఋలకు సవర్ణములైన అచ్చులు పరములైనచో వాని దీర్ఘములు ఏకాదేశమగును.

వివరణ : రెండు పదాలు కలిస్తే సంధి జరుగుతుంది. అందులో మొదటి పదాన్ని పూర్వపదమని, రెండవ పదాన్ని పరపదమనీ అంటారు. పూర్వపదం చివర అ, ఇ, ఉ, ఋ, లలో ఏ అచ్చు ఉంటుందో పరపదం మొదట ఆ అచ్చే ఉంటే రెండు అచ్చులు బదులుగా వాటి దీర్ఘం వస్తుంది.

అ+ అ = ఆ., ఇ+ఇ = ఈ, ఉ+ఉ = ఊ: ఋ+ఋ = ౠ

| | | |
|---|---|---|
| అంబురుహ + ఆనన | = | అంబురుహానన |
| కణ్వ + ఆశ్రమము | = | కణ్వాశ్రమము |
| ధరా + అధినాథులు | = | ధరాధినాథులు |
| గుణ + ఆలయుడు | = | గుణాలయుడు |
| మహా + ఆనందము | = | మహానందము |
| పుణ్య + ఆచారుడు | = | పుణ్యాచారుడు |
| లోక + అపవాదము | = | లోకాపవాదము |
| మహా + అనురాగుము | = | మహానురాగము |
| ఉప + ఆఖ్యానము | = | ఉపాఖ్యానము |
| కమల + అంతరంగ | = | కమలాంతరంగ |
| ముఖ + అరవిందుడు | = | ముఖారవిందుడు |
| కుల + అంగన | = | కులాంగన |

| | | |
|---|---|---|
| వనజ + అక్షుడు | = | వనజాక్షుడు |
| క్షీర + అంభోధి | = | క్షీరాంభోధి |
| హస్త + అబ్జములు | = | హస్తాబ్జములు |
| దుర్గ + ఆవళి | = | దుర్గావళి |
| శరణ + అర్థులు | = | శరణార్థులు |
| ఉత్పల + అక్షి | = | ఉత్పలాక్షి |
| విద్యా + అభ్యాసము | = | విద్యాభ్యాసము |
| మాంస + ఆహారము | = | మాంసాహారము |
| శివ + అర్థము | = | శివార్థము |
| దేవతా + అర్చన | = | దేవాతార్చన |
| యోగి + ఈశ్వరుడు | = | యోగీశ్వరుడు |
| విరూప + అక్షుడు | = | విరూపాక్షుడు |
| మహా + ఆత్ముడు | = | మహాత్ముడు |
| ఉత్తమ + అంగము | = | ఉత్తమాంగము |
| దేశ + అభిమనము | = | దేశాభిమానము |
| విద్యా + ఆలయము | = | విద్యాలయము |
| మహా + ఆవేశము | = | మహావేశము |
| కష్ట + ఆర్జితము | = | కష్టార్జితము |
| రస + ఆస్వాదము | = | రసాస్వాదము |
| కవి + ఈశ | = | కవీశ |
| దిశ + ఆళి | = | దిశాళి |
| పక్ష + అనిలము | = | పక్షానిలము |
| చక్ర + అంగనలు | = | చక్రాంగనలు |
| మహా + అపరాధి | = | మహాపరాధి |
| పరమ + అర్థము | = | పరమార్థము |
| ఫణి + ఇంద్రులు | = | ఫణీంద్రులు |

**గుణసంధి:** అకారమునకు ఇ, ఉ, ఋ లు పరములైనచో క్రమముగా ఏ, ఓ, అర్ లు ఏకాదేశమగును.

వివరణ: పూర్వపదం చివర అకారం ఉండి ఉత్తరపదం మొదట ఇ,ఉ,ఋ లలో ఒకటి ఉన్నా వాటికిబదులుగా క్రమంగా ఏ,ఓ, అర్ లు ఏకాదేశం అవుతాయి.

అ+ఇ =ఏ అ+ఉ= ఓ, అ+ఋ = అర్

| | | |
|---|---|---|
| భరత+ఉత్పత్తి | = | భరతోత్పత్తి |
| శంకుతల+ఉపాఖ్యానము | = | శకుంతలోపాఖ్యానము |
| పరమ+ ఈశుడు | = | పరమేశుడు |
| బాల్య+ ఉపచారములు | = | బాల్యోపచారములు |
| వృక+ ఉదరుడు | = | వృకోదరుడు |
| శైశవ +ఉత్సవములు | = | శైశవోత్సవములు |
| తరళ+ఈక్షణ | = | తరళేక్షణ |
| పురుష+ఉత్తముడు | = | పురుషోత్తముడు |

| | | |
|---|---|---|
| ధవళ+ఈక్షణ | = | ధవళేక్షణ |
| కపట+ఉపాయము | = | కపటోపాయము |
| కంఠీరవ+ఇంద్రము | = | కంఠీరవేంద్రము |
| విమల + ఉదకములు | = | విమలోదకములు |
| మహా + ఈశ్వరుడు | = | మహేశ్వరుడు |
| మహా + ఉజ్వలము | = | మహోజ్వలము |
| భోగ + ఉపలబ్ధి | = | భోగోపలబ్ధి |
| కష్ట + ఉత్కటము | = | కష్టోత్కటము |
| సహ + ఉదరి | = | సహోదరి |
| భరత + ఉర్వర | = | భరతోర్వర |

**3. యణాదేశసంధి:** ఇ, ఉ, ఋ లకు సవర్ణముకాని అచ్చు పరమైతే క్రమంగా య్, వ్, ర్, ఆదేశముగా వస్తాయి.

వివరణ : ఇ, ఉ, ఋ లలో ఒక అచ్చు పూర్వపదం చివర ఉన్నా దానికి మరొక అచ్చు పరంగావస్తే క్రమంగా య్, వ్, ర్ లు ఆదేశంగా వస్తాయి.

ఇ + అ, ఉ, = య్; ఉ + అ,ఇ = వ్; ఋ + అ,ఇ,ఉ = ర్;

| | | |
|---|---|---|
| అతి + అంతము | = | అత్యంతము |
| అభి +అంజనము | = | అభ్యంజనము |
| ప్రతి + అక్షము | = | ప్రత్యక్షము |
| తను + అంగి | = | తన్వంగి |
| గంధి + అవయవములు | = | గంధ్యవయవములు |
| అతి + ఉచ్చైశ్రృతి | = | అత్యుచ్చైశ్రృతి |
| సు + ఆగతము | = | స్వాగతము |

**4. వృద్ధిసంధి :** అకారానికి ఎ, ఐ లు పరమైన ఐకారము, ఒ, ఓ లు పరమైన ఔకారము ఏకాదేశమగును.

వివరణ : పూర్వపదం చివర అకారం ఉండి దానికి ఎ, ఏ, ఐ లు పరమైతే ఐకారం ఒ, ఓ, ఔ లు పరమైతే ఔకారం ఏకాదేశంగా వస్తాయి.

అ+ఎ, ఏ,ఐ=ఐ; అ+ఒ,ఓ,ఔ=ఔ

ఘన + ఔదార్యము = ఘనౌదార్యము.

## (ఆ) తెలుగు సంధులు

తెలుగు పదాల మధ్య జరిగే సంధులను తెలుగు సంధులు అంటారు. మీ పాఠ్యభాగంలో ఉన్న తెలుగు సంధుల్ని ఇప్పుడు తెలుసుకొంటారు. 1. అకార సంధి 2. త్రికసంధి 3. గసడదవాదేశసంధి. 4. రుగాగమసంధి 5 టుగాగమ సంధి 6. ఆమ్రేడిత సంధి మొదలైనవి.

**1. అకారసంధి :-** అత్తునకు సంధి బహుళముగానగు.

వివరణ : తెలుగులో పూర్వపరస్వరాలకు పరస్వరం ఏకాదేశం కావాడాన్ని సంధి అంటారు. అ+ఇ=ఇ. అకారనికి ఇ పరమైతే ఆ రెండు అక్షరాల బదులుగా ఇ వస్తే దాన్ని సంధి అంటారు.

హ్రస్వమైన అకారం పూర్వపదం చివర ఉంటే దానికి మరేదైన అచ్చు పరంగావస్తే సంధి జరుగుతుంది. ఈసంధి బహుళంగా జరుగుతుంది. అంటే కొన్నిసార్లు నిత్యంగాజరుగుతుంది, కొన్ని సార్లు వైకల్పికముగా జరుగుతుంది. మరికొన్ని సార్లు వేరే విధంగా జరుగుతుంది.

అ + అ = అ, అ + ఇ = ఇ, అ + ఉ = ఉ; అ + ఎ = ఎ; అ + ఒ = ఒ;

| | | |
|---|---|---|
| ఇంక + ఏల | = | ఇంకేల |
| కాక + ఏమి | = | కాకేమి |
| లేక + ఉండుట | = | లేకుండుట |
| మిన్నక + ఉనికి | = | మిన్నకునికి |
| ముత్త + అవ్వ | = | ముత్తవ్వ |
| అమ్మ + అవ్వ | = | అమ్మవ్వ |
| సైపక + ఉన్నె | = | సైపకున్నె |
| ఎల్ల + ఎడలు | = | ఎల్లెడలు |
| దేవర + ఆన | = | దేవరాన |
| గింజ + అంత | = | గింజంత |
| కాయ + అంత | = | కాయంత |
| ఒక + ఇంత | = | ఒకింత |
| కరక + అంచు | = | కరకంచు |
| ఇంచుక + ఏని | = | ఇంచుకేని |
| పెద్ద + అన్న | = | పెద్దన్న |
| ఒక + అప్పుడు | = | ఒకప్పుడు |

**2. త్రికసంధి:** 1. ఆ,ఈ ,ఏ లు త్రికము అనబడును. త్రికముమీద అసంయుక్తహల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు.
2. ద్విరుక్తంబగుహల్లు పరంబగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘమునకు హ్రస్వంబగు.

వివరణ: ఆ, ఈ, ఏ అనే సర్వనామాలను 'త్రికము' అంటారు. వీనికి సంయుక్తం కానిహల్లు పరమైతే ఆ హల్లు బహుళంగా ద్విత్వమవుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| ఆ + కన్య | Õ | ఆ + క్కన్య | Õ | అక్కన్య |
| ఆ + కుమారుడు | Õ | ఆ + క్కుమారుడు | Õ | అక్కుమారుడు |
| ఈ + తన్వి | Õ | ఈ + త్తన్వి | Õ | ఇత్తన్వి |
| ఆ + నాతి | Õ | ఆ + న్నాతి | Õ | అన్నాతి |
| ఆ + దేవుడు | Õ | ఆ + ద్దేవుడు | Õ | అద్దేవుడు |
| ఆ + చోట | Õ | ఆ + చ్చోట | Õ | అ+చ్చోట |
| ఆ + మహాపురుషుడు | Õ | ఆ + మ్మహాపురుషుడు | Õ | అమ్మహాపురుషుడు |
| ఆ + మానిని | Õ | ఆ + మ్మానిని | Õ | అమ్మానిని |
| ఈ + విధము | Õ | ఈ + వ్విధము | Õ | ఎవ్వానికి |
| ఏ + వానికి | Õ | ఏ + వ్వానికి | Õ | ఎవ్వానికి |
| ఆ + చేడియ | Õ | ఆ + చ్చేడియ | Õ | అచ్చేడియ |
| ఆ + ముదిత | Õ | ఆ + మ్ముదిత | Õ | అమ్ముదిత |
| ఆ + దానవరిపుడు | Õ | ఆ + ద్దానవరిపుడు | Õ | అద్దానవరిపుడు |
| ఆ + వనజాక్షుడు | Õ | ఆ + వ్వనజాక్షుడు | Õ | అవ్వనజాక్షుడు |
| ఈ + ధర | Õ | ఈ + ద్ధర | Õ | ఇద్ధర |
| ఆ + తరి | Õ | ఆ + త్తరి | Õ | అత్తరి |
| ఏ + కాలము | Õ | ఏ + క్కాలము | Õ | ఎక్కాలము |
| ఆ + మధురత్వము | Õ | ఆ + మ్మధురత్వము | Õ | అమ్మధురత్వము |

**3. గసడదవాదేశసంధి :** ప్రథమ మీద పరుషములకు గ,స,డ,ద,వలు బహుళంగావస్తాయి.

వివరణ: ప్రథమా విభక్తి చివర ఉన్నపదాలకు క,చ,ట,త,ప అనేపరుషాలు పరంగావస్తే వాటి స్థానంలో క్రమంగా గ,స,డ,ద,వ,లు బహుళంగా ఆదేశంగా వస్తాయి.

క-గ, చ-స, ట-డ, త-ద, ప-వ

| | | |
|---|---|---|
| ఏడు + కడ | = | ఏడుగడ |
| అవజ్ఞ + చేయు | = | అవజ్ఞసేయు |
| సత్యము + పల్కె | = | సత్యమువల్కె |
| సుఖంబు + చేకొను | = | సుఖంబుసేకొను |
| ములు + చూపు | = | ములుసూపు |
| పోడిమి + చేము | = | పోడిమిసేయు |
| వదనంబు + చొచ్చు | = | వదనంబుసొచ్చు |
| విందు + చేసి | = | విందుసేసి |
| ఉగ్గులు + పోసి | = | ఉగ్గులు వోసి |
| అడ్డంబు + పట్టు | = | అడ్డంబువట్టు |
| జో + చరచు | = | జోసరచు |
| అంతలు + చేసి | = | అంతలుసేసి |
| ప్రాపు + కాంచు | = | ప్రాపుగాంచు |
| వేణి + పట్టి | = | వేణివట్టి |
| సగము + త్రెవ్వి | = | సగముద్రెవ్వి |
| బన్నముల్ + పడిన | = | బన్నముల్వడిన |
| వెన్న + పెట్టు | = | వెన్నవెట్టి |
| రుచి + కొలుపు | = | రుచిగొలుపు |
| తరి + త్రాడు | = | తరిద్రాడు |
| వెలి + తమ్మి | = | వెలిదమ్మి |
| చిచ్చు + పెట్టి | = | చిచ్చువెట్టి |
| అంతర్ధానము + చేయు | = | అంతర్ధానముసేయు |
| పెండ్లి + చేయు | = | పెండ్లిసేయు |
| పాలు + పోయింపుడు | = | పాలువోయింపుడు |
| ప్రొద్దు + పొడిచి | = | ప్రొద్దువొడిచి |
| నది + పోలె | = | నదివోలె |
| చెప్పులు + కుట్టి | = | చెప్పులుగుట్టి |
| అప్పు + పడ్డది | = | అప్పువడ్డది |
| కంతలు + పడి | = | కంతలువడి |
| తల + చూపు | = | తలసూపు |

**గసడదవాదేశసంధి (2) :** ద్వంద్వంబున పదంబు మీది పరుషములకు గసడదవలు నిత్యముగానగు.

వివరణః ద్వంద్వసమాసమునందు పదము తరువాతవచ్చే క,చ,ట,త,ప లకు గ,స,డ,ద, వలు నిత్యంగా వస్తాయి.

| | | |
|---|---|---|
| అన్న+తమ్ముడు | = | అన్నదమ్ములు |
| కాలు+చేయి | = | కాలుసేతులు |

**4. రుగాగమసంధి (1) :** కర్మధారయంబున పేదాదిశబ్దములకు ఆలు శబ్దము పరమైతే రుగాగమము వచ్చును.

**వివరణ:** కర్మధారయ సమాసములో పేద, బీద, బాలెంత, మనుమ మొదలైన శబ్దాలకు ఆలుశబ్దము పరంగావస్తే 'రు' ఆగమంగా నిత్యంగా వస్తుంది.

బాలెంత+ఆలు = బాలెంతరాలు

ముద్ద+ఆలు = ముద్దరాలు

**రుగాగమసంధి (2) :** కర్మధారయంబున తత్సమ శబ్దములకు ఆలుశబ్దముపరమైనచో అత్వమునకు ఉత్వము, రుగాగమంబును అగు.

వివరణ : కర్మధారయ సమాసాల్లో తత్సమ శబ్దాలకు ఆలుశబ్దం పరమయితే, ఆ తత్సమ శబ్దం చివరనున్న అత్వం ఉత్వంగా, మారుతుంది. 'రు' నిత్యంగా ఆగమంగా వస్తుంది.

అంధ+ఆలు = అంధురాలు

పుణ్య+ఆలు = పుణ్యురాలు

**5. టుగాగమసంధి :** కర్మాధాయమునందు ఉత్తునకు అచ్చు పరమైనచో టుగాగమంబగు.

వివరణ :- కర్మధారయ సమాసంలో హ్రస్వమయిన ఉకారానికి అచ్చు పరంగావస్తే 'టు' నిత్యంగా ఆగమంగా వస్తుంది.

చెక్కు+అద్దము = చెక్కుటద్దము

మూల్గు+ఎమ్ములు = మూల్గుటెమ్ములు

**6. ఆమ్రేడితసంధి (1) :** అచ్చునకు ఆమ్రేడితము పరమగునపుడు సంధి తరచుగానగు.

వివరణ :- ఒకేపదం రెండుసార్లు వరుసగా వస్తే వాటిలో రెండవ పదాన్ని ఆమ్రేడితం అంటారు. అచ్చునకు ఆమ్రేడితం పరంగావస్తే తరచుగా పూర్వపరస్వరాలకు పరస్వరం ఆదేశమవుతుంది.

ఇంట+ఇంట = ఇంటింట

**ఆమ్రేడితసంధి (2) :** అందదుకు ప్రభృతులు యథా ప్రయోగముగా గ్రాహ్యములు.

వివరణః అందదుకు, మిఱుమిట్లు, చెల్లాచెదరు మొదలయిన రూపాలు కావ్యప్రయోగాలననుసరించి గ్రహించాలి.

చెఱ+చెఱ = చెచ్చెర

### 4.21. 4 సమాసములు :

ఇంతవరకు మీరు సంస్కృతసంధులను, తెలుగు సంధులను గురించి తెలుసుకొన్నారు. ఇప్పుడు సమాసాలనుగూర్చి తెలుసుకొంటారు.

**సమాసం:** అర్థవంతమైన పదాలు ఒక పదంగా ఏర్పడితే దానిని సమాసం అంటారు.

**విగ్రహ వాక్యం :** రెండుపదాలు చేర్చి సమాసం చేసినప్పుడు, ఆ సమాసంలోని రెండు పదాల మధ్య లోపించిన విభక్తి ప్రత్యయాలను కూర్చి, ఆ సమాసంయొక్కఅర్థాన్ని వివరించడాన్ని విగ్రహవాక్యం అంటారు.

**పూర్వపదం:** సమాసంలో ఉండే రెండు పదాలలో మొదటి పదాన్ని పూర్వపదం అంటారు.

**ఉత్తరపదం:** సమాసంలో ఉండే రెండు పదాలలో రెండవపదాన్ని ఉత్తరపదం అంటారు.

సమాసాలు ఆరు విధాలుగా ఉన్నాయి.

1. తత్పురుషసమాసం 2. కర్మధారయసమాసం
3. ద్విగుసమాసం 4. ద్వంద్వసమాసం
5. బహువ్రీహిసమాసం. 6. అవ్యయీభావసమాసం

**1. తత్పురుషసమాసం:** ద్వితీయాది విభక్తులకు మీది పదంతో సమాసం ఏర్పడితే దాన్ని తత్పురుష సమాసం అంటారు. సమాసంలో ఉత్తర పదం యొక్క అర్థం ప్రధానంగా ఉండే సమాసం తత్పురుష సమాసం.

**(అ) ద్వితీయాతత్పురుష సమాసం:** ని, ను, ల, గూర్చి, గురించి - అనేవి ద్వితీయా విభక్తి ప్రత్యయాలు.

| | | |
|---|---|---|
| గంగాధరుడు | - | గంగను ధరించినవాడు |
| శరణార్థులు | - | శరణును అర్థించువారు |

**(ఆ) తృతీయా తత్పురుష సమాసం:** చేతన్, చేన్, తోడన్, తోన్ అనేవి తృతీయా విభక్తి ప్రత్యయాలు.

| | | |
|---|---|---|
| కోపారుణితము | - | కోపము చేత అరుణితము |
| లోకస్తుతుడు | - | లోకము చేత స్తుతుడు |
| కృపావిహీనము | - | కృప చేత విహీనము |
| లక్ష్మీసమేతులు | - | లక్ష్మితో సమేతులు |
| నిందావాక్యములు | - | నిందతోడివాక్యములు |
| కష్టార్జితము | - | కష్టము చేత ఆర్జితము |
| పుట్టుబానిస | - | పుట్టుకతో బానిస |
| కన్నీటిపాట | - | కన్నీటితో పాడినపాట |

**(ఇ) చతుర్థీతత్పురుష సమాసం :** కొఱకు,కయి (కై) అనేవి చతుర్థీ విభక్తిప్రత్యయాలు.

| | | |
|---|---|---|
| తపోవనము | - | తపస్సు కొరకు వనము |
| పెండ్లిపందిళ్ళు | - | పెండ్లి కొరకు పందిళ్ళు |

**(ఈ) పంచమీ తత్పురుష సమాసం:** వలనన్, కంటెన్, పట్టి, నుండి, నుంచి అనేవి పంచమీ విభక్తి ప్రత్యయాలు.

| | | |
|---|---|---|
| రాజ్యసుఖము | - | రాజ్యము వలన సుఖము |
| హర్షపులకలు | - | హర్షము వలన పులకలు |

**(ఉ) షష్ఠీ తత్పురుష సమాసం:** కి, కు, యొక్క, లోన్, లోపలన్ - అనేవి షష్ఠీ విభక్తిప్రత్యయాలు.

| | | |
|---|---|---|
| జననాథుడు | - | జనులకు నాథుడు |
| బాష్పకణములు | - | బాష్పము యొక్క కణములు |
| యశోనిధి | - | యశస్సుకునిధి |
| ధర్మవిరోధము | - | ధర్మమునకు విరోధము |
| చంద్రజ్యోత్స్న | - | చంద్రుని యొక్క జ్యోత్స్న |
| క్రతు శతము | - | క్రతువుల యొక్క శతము |
| కణ్వాశ్రమము | - | కణ్వుని యొక్క ఆశ్రమము |
| పాణిగ్రహణము | - | పాణియొక్క గ్రహణము |
| శకుంతలోపాఖ్యానము | - | శకుంతల యొక్క ఉపాఖ్యానము |
| రాజ్యభారము | - | రాజ్యము యొక్క భారము |
| భక్తమండలి | - | భక్తుల యొక్కమండలి |
| దేవదేవుడు | - | దేవతలకు దేవుడు |
| ధర్మనందనుడు | - | ధర్మరాజు యొక్కనందనుడు |
| బాహుబలము | - | బాహువుల యొక్క బలము |
| రాజరాజు | - | రాజులకు రాజు |
| యమమహిషము | - | యముని యొక్క మహిషము |
| పాండు కుమారులు | - | పాండు రాజు యొక్క కుమారులు |
| కుంజరకలభము | - | కుంజరము యొక్క కలభము |

| | | |
|---|---|---|
| దానవరిపుడు | - | దానవులకు రిపుడు |
| సుధాశీకరములు | - | సుధయొక్క శీకరములు |
| లక్ష్మీపతి | - | లక్ష్మికి పతి |
| గీర్వాణకోటి | - | గీర్వాణులయొక్కకోటి |
| కమ్మదోయి | - | కమ్మలయొక్క దోయి |
| శివాధీనము | - | శివునకు అధీనము |
| కేలుదోయి | - | కేలు యొక్క దోయి |
| విద్యాభ్యాసము | - | విద్య యొక్క అభ్యాసము |
| భక్తచింతామణి | - | భక్తులకు చింతామణి |
| జటాకోటి | - | జట యొక్క కోటి |
| కాలగర్భము | - | కాలము యొక్క గర్భము |
| ఆంధ్రసామ్రాజ్యము | - | ఆంధ్రుల యొక్క సామ్రాజ్యము |
| ఆంధ్రపౌరుషము | - | ఆంధ్రుల యొక్క పౌరుషము |
| ముత్యాలచాలు | - | ముత్యాల యొక్క చాలు |
| ఫణీంద్రులు | - | ఫణులకు ఇంద్రులు |
| ఆలమంద | - | ఆవుల యొక్క మంద |

**(ఊ) సప్తమీ తత్పురష సమాసము :** అందు, న- అనేవి సప్తమీ విభక్తి ప్రత్యయాలు.

| | | |
|---|---|---|
| హృదయ సంతాపము | - | హృదయమందలి సంతాపము |
| వేదవచనములు | - | వేదమందలివచనములు |
| యుధిష్ఠిరుడు | - | యుద్ధమందు స్థిరుడు |
| శైశవోత్సవములు | - | శైశవమందలి ఉత్సవములు |
| క్రీడారతి | - | క్రీడలయందు రతి |
| చేతికవ్వము | - | చేతియందలి కవ్వము |
| మొలగంటలు | - | మొలయందలి గంటలు |
| పంజరనిబద్ధము | - | పంజరమునందునిబద్ధము |
| గగనగంగ | - | గగనమందలిగంగ |
| ధర్మదీక్ష | - | ధర్మమునందు దీక్ష |

**(ఎ) నఞ్తత్పురుష సమాసము :** వ్యతిరేకమైన అర్థాన్ని తెలుపుతుంది.

| | | |
|---|---|---|
| అసత్యము | - | సత్యముకానిది |
| అనుచితము | - | ఉచితము కానిది |
| అయుక్తము | - | యుక్తము కానిది |

**2. కర్మధారయసమాసం :** విశేషణానికి విశేష్యంతోగాని ఉపమానానికి ఉపమేయంతోగాని ఏర్పడే సమాసాలను కర్మధారయమంటారు. దీనినే సమానాధి కరణమని కూడా అంటారు. కర్మధారయంలోని భేదాలను తెలుసుకుందాం.

**(అ) విశేషణపూర్వపద కర్మధారయం :** విశేణం పూర్వపదంగా, విశేష్యం ఉత్తరపదంగా ఉండేసమాసం

| | | |
|---|---|---|
| సూనృతవాక్యము | - | సూనృతమైనవాక్యము |
| దివ్యవాణి | - | దివ్యమైనవాణి |

| | | |
|---|---|---|
| అఖిలభువనములు | - | అఖిలమైనభువనములు |
| పూర్వ వృత్తాంతము | - | పూర్వమైన వృత్తాంతము |
| పుణ్యతనువు | - | పుణ్యమైనతనువు |
| మగబిడ్డ | - | మగవాడైనబిడ్డ |
| ముక్కన్ను | - | మూడవదైన కన్ను |
| మందస్మితము | - | మందమైనస్మితము |
| శాంత వచనములు | - | శాంతమైనవచములు |
| ఉజ్వల లక్ష్మి | - | ఉజ్వలమైనలక్ష్మి |
| తప్పటడుగులు | - | తప్పు అయిన అడుగులు |
| ఉదారచేష్టలు | - | ఉదారమైన చేష్టలు |
| ప్రియతనయుడు | - | ప్రియమైన తనయుడు |
| పసిబిడ్డ | - | పసివాడైన బిడ్డ |
| భైరవ యోగి | - | భైరవుడైన యోగి |
| సమస్తదిక్కులు | - | సమస్తమైన దిక్కులు |
| ముసలి అవ్వ | - | ముసలిదైనఅవ్వ |
| చిరుతనవ్వు | - | చిరుతదైన నవ్వు |
| దొడ్డవృక్షము | - | దొడ్డ అయిన వృక్షము |
| దివ్యదీక్ష | - | దివ్యమైన దీక్ష |
| నూత్నపథము | - | నూత్నమైన పథము |
| దుర్భరావస్థ | - | దుర్భరమైన అవస్థ |
| మేలిపాటలు | - | మేలుఅయినపాటలు |
| జిలుగుతేరు | - | జిలుగు అయినతేరు |
| గాఢ నిద్ర | - | గాఢమైన నిద్ర |

**(ఆ) విశేషణ ఉత్తరపదకర్మధారయం :** విశేష్యం పూర్వపదంలోను, విశేషణం ఉత్తరపదంలోను ఉండేసమాసం.

| | | |
|---|---|---|
| కపోతవృద్ధము | - | వృద్ధమైన కపోతము |

**(ఇ) విశేషణ ఉభయపదకర్మధారయం:** పూర్వపదంలోను, ఉత్తరపదంలోను విశేణం ఉండేసమాసం.

| | | |
|---|---|---|
| శీతోష్ణము | - | శీతము,ఉష్ణము అయినది |
| మృదుమధురము | - | మృదువు, మధురము అయినది |

**(ఈ) ఉపమాన పూర్వపద కర్మధారయం :** ఉపమానం పూర్వపదంగా ఉపమేయం ఉత్తరపదంగా ఉండేసమాసం.

| | | |
|---|---|---|
| అమృతాహారము | - | అమృతము వంటి ఆహారము |

**(ఉ) ఉపమాన ఉత్తరపద కర్మధారయం:** ఉపమానం ఉత్తరపదంగా ఉపమేయం పూర్వపదంగా ఉండే సమాసం.

| | | |
|---|---|---|
| ముఖారవిందము | - | అరవిందము వంటి ముఖము |
| పాదకమలములు | - | కమలములవంటి పాదములు |
| హస్తాబ్జములు | - | అబ్జములు వంటి హస్తములు |
| వక్త్ర చంద్రుడు | - | చంద్రుని వంటి వక్త్రము |

**(ఊ) రూపకసమాసం (అవధారణాపూర్వపద కర్మధారయం):** ఉపమేయమునందు ఉపమానధర్మాన్ని ఆరోపించడాన్ని అవధారణం అంటారు. అవధారణపూర్వపదంలోఉండేసమాసం.

| | | |
|---|---|---|
| శోకజడధి | - | శోకము అనెడి జడధి |
| కవితకోయిల | - | కవిత అనెడి కోయిల |
| సాహిత్యదీపము | - | సాహిత్యము అనెడి దీపము |
| హృదయకళిక | - | హృదము అనెడి కళిక |
| కాంక్షోడుపము | - | కాంక్ష అనెడి ఉడుపము |
| పూవుపడతి | - | పూవు అనెడి పడతి |
| ఇసుకబొక్కసము | - | ఇసుక అనెడి బొక్కసము |

**(ఎ) సంభానాపూర్వపద కర్మధారయం:** సంభావన అంటే పేరు పూర్వపదంలో ఉండేసమాసం

| | | |
|---|---|---|
| కణ్వమహాముని | - | కణ్వుడు అనుపేరుగల మహాముని |
| మామిడిపండు | - | మామిడిఅనుపేరుగల పండు |
| గుమ్మడికాయ | - | గుమ్మడిఅనుపేరుగల కాయ |
| అమరావతీపట్టణము | - | అమరావతి అనుపేరుగల పట్టణము |
| చింతచెట్టు | - | చింత అనుపేరుగల చెట్టు |

**(ఏ) ద్విగుసమాసం :** సంఖ్యను తెలిపే పదం పూర్వపదంలో ఉండేసమాసం.

| | | |
|---|---|---|
| ఏడుగడ | - | ఏడు అనసుసంఖ్యగల కడలు |
| పంచభూతములు | - | పంచ(ఐదు) అనుసంఖ్యగల భూతములు |
| మూడుకన్నులు | - | మూడుఅనుసంఖ్యగల కన్నులు |
| ముల్లోకములు | - | మూడుఅనుసంఖ్యగల లోకములు |
| నాలుగుమూలలు | - | నాలుగుఅనుసంఖ్యగల మూలలు |
| పదికడవలు | - | పదిఅనుసంఖ్యగల కడవలు |
| వేయిగోత్రములు | - | వేయిఅను సంఖ్యగల గోత్రములు |
| నవసిద్ధులు | - | నవ (తొమ్మిది) అను సంఖ్యగల సిద్ధులు |
| వెయ్యావులు | - | వెయ్యిఅనుసంఖ్యగల ఆవులు |
| మూడుకోట్లు | - | మూడుఅనుసంఖ్యగల కోట్లు |
| నాల్గుపడగలు | - | నాల్గు అనుసంఖ్యగల పడగలు |

**4. ద్వంద్వ సమాసం :** సమాసంలో ఉండే రెండు పదాల అర్థమా సమాన ప్రధానంగా ఉండే సమాసం.

| | | |
|---|---|---|
| అన్న దమ్ములు | - | అన్న మరియు తమ్ముడు |
| విషాదరోషములు | - | విషాదము మరియు రోషము |
| జననీజనకులు | - | జనని మరియు జనకుడు |
| భాగ్యసంపదలు | - | భాగ్యము మరియు సంపద |
| అర్థప్రాణములు | - | అర్థము మరియు ప్రాణములు |
| పాడిపంటలు | - | పాడి మరియు పంటలు |
| కీర్తిసంపదలు | - | కీర్తి మరియు సంపద |
| పుత్రీపుత్రులు | - | పుత్రి మరియు పుత్రుడు |
| కష్టసుఖములు | - | కష్టము మరియు సుఖము |
| భూనభములు | - | భూమి మరియు నభము |
| కాలుసేతులు | - | కాళ్ళు మరియు చేతులు |

**15. 1. బహుౖవ్రీహి సమాసం :** సమాసంలో ఉండే రెండుపదాలు తమ అర్థాలను కోల్పోయి వేరే అర్థాన్ని ఇచ్చేసమాసం.

| | | |
|---|---|---|
| కమలగర్భుడు | - | కమలము గర్భముగా కలవాడు |
| అంబురహానన | - | అంబురుహము వంటి ఆననము కలది |
| పతివ్రత | - | పతియే వ్రతముగా కలది |
| కరకంఠుడు | - | కర్రమైన (నల్లని) కంఠముకలవాడు |
| పంకజనాభుడు | - | పంకజము నాభియందు కలవాడు |
| సరసిజనాభుడు | - | సరసిజము నాభియందుకలవాడు |
| వృకోదరుడు | - | వృకము ఉదరము వంటి ఉదరము కలవాడు |
| వనజాక్షుడు | - | వనజముల వంటి అక్షులు కలవాడు |
| తరళాక్షుడు | - | తరళమయిన అక్షులు కలవాడు |
| ఉత్పలాక్షి | - | ఉత్పలములవంటి అక్షులు కలది |
| చంద్రశేఖరుడు | - | చంద్రుని శేఖరము నందు కలవాడు |
| నీలకంధరుడు | - | నీలమైన కంధరము కలవాడు |
| రాజీవ వదన | - | రాజీవము వంటి వదనము కలది |
| విరూపాక్షుడు | - | విరూపమైన అక్షులు కలవాడు |
| తపోధనుడు | - | తపస్సునే ధనముగా కలవాడు |

**6. అవ్యయీభావ సమాసం :** అవ్యయం పూర్వపదంలో ఉండే సమాసం.

| | | |
|---|---|---|
| అనుదినము | - | దినము ననుసరించి |

**డాక్టర్ ఎన్. ఆదినారాయణ** ఎం. ఏ., పిహెచ్.డి.,
రీడర్ & ప్రిన్సిపాల్
బి.ఎస్. ఎస్. బి. డిగ్రీ కళాశాల